
ఆరు యుగాల ఆంధ్ర కవిత

(ఆరు ఋతువులుగా భావించి వింగడించిన ఆంధ్ర కవితా సమీక్ష)

రచయిత

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి



ప్రకాశకులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడు, హైద్రాబాదు

సర్వస్వామ్య సంకలనము
ప్రథమ ముద్రణ 1986
ప్రతులు 1000

వెల రూ. 36-00

ముద్రణ
చార్ మినార్ ఆర్టు ప్రింటర్సు
4-4-57 గంజ్ బజార్,
సికింద్రాబాదు

ముందు మాట

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు సంస్కృతాంధ్రభాషా, సాహిత్యాలలో పండితులు, రచయితలు, విమర్శకులు, 1980 వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖవారు ఇచ్చిన సీనియర్ ఫెలోషిప్ సహకారంతో, 'ఆంధ్ర ప్రాచీన సాహిత్యం ప్రతిభా కళాస్థాయి,' అన్న అంశంపైన శాస్త్రిగారు సమీక్షా రచన చేసినారు ఆ నాలుగు సంవత్సరాల అవిరళకృషి ఫలితమైన ఈ రచనను ప్రస్తుతం ఆంధ్ర సారస్వత పరిషత్తు, 'ఆరు యుగాల ఆంధ్ర కవిత' పేరుతో ప్రకటిస్తున్నది సుమారు నలభై మందికి పైగా ప్రముఖాంధ్ర కవుల రచనలను తీసుకొని, వాటిని స్వయంగా కూలంకషంగా పఠించి, సమన్వయించి ఆ కవుల మనోధర్మాన్ని, కవితా వ్యక్తిత్వాన్ని గురించి స్వతంత్రమైన అభిప్రాయాలను హనుమచ్ఛాస్త్రిగారు ఈ గ్రంథంలో క్రోడీకరించినారు ఇతర సాహిత్య చరిత్ర గ్రంథాలవలె కాక ప్రాచీన కవుల ప్రతిభా, సామర్థ్యాలను, రచనల కళాత్మక విలువలను నవతరానికి అందించటమే ఈ రచన ధ్యేయం ఈ ధ్యేయాన్ని హనుమచ్ఛాస్త్రిగారు సర్వసమగ్రంగా నిర్వహించినారని అభిప్రాయపడు తున్నాము

తమ ఈ రచనను సారస్వత పరిషత్తు ముద్రించటానికి అవకాశం ఇచ్చిన శ్రీ హనుమచ్ఛాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాము ఈ గ్రంథ ముద్రణకు, ఆర్థిక సహాయం అందించిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి

ప్రత్యేక కృతజ్ఞతలు. తెలుగు ముద్రణలో పరిపాటి అయిన ముద్రణ దోషాలు ఈ గ్రంథంలో దొర్లినవి ప్రధానమైన తప్పొప్పుల పట్టికను శాస్త్రిగారు స్వయంగా తయారుచేసినారు. ఈ గ్రంధాన్ని శ్రద్ధతో ముద్రించిన చార్మినార్ ఆర్టు ప్రింటర్సు వారికి కూడా మా కృతజ్ఞతలు.

ఈ గ్రంథం సాహిత్యాభిమానులైన పాఠక లోకానికి ఆదరపాత్రం అవుతుందని ఆశిస్తు —

భవదీయుడు

హైదరాబాదు
25-8-1986

కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

వి ష య సూ చి క

ఆరు యుగాల ఆంధ్ర కవిత

పూర్వరంగం

1980 సంవత్సరంలో కేంద్రప్రభుత్వ సాంస్కృతిక శాఖవారు, సీనియర్ 'ఫెలోషిప్' ఇస్తూనన్ను, పదకొండో శతాబ్దంనుంచి పదిహేడో శతాబ్దివరకు 'ప్రాచీనాంధ్ర కవితాప్రతిభ కళాకౌశలం' అనే విషయంమీద ఒక విపుల సమీక్ష వ్రాయమన్నారు. పరిమితమైన నాశక్తితో ఈ బృహత్కార్యాన్ని నిర్వహించగలనా? అని సందేహించి 'ఇక్షుభక్షణే వేతనలాభః' అన్నట్టు నాకెంతో ప్రీతిపాత్రమైన ఈ పని అయాచితంగా తటస్థించినందుకు మిక్కిలి సంతోషించి అంగీకరించాను

అయితే - ఈ అంశంమీద ఇదివరకే పలువురు కృతహస్తులూ, ధృతహస్తులూ, ఎంతో వ్రాసి గ్రంథాలు పెంచారు ప్రచారంపొందారు కాగా అదే నకలుపని (Duplicate work) చేసి సాధించగలిగిన ప్రయోజనం ఏమిటి?

చేవ ఉంటే కొత్తబాటతొక్కాలి లేకపోతే నా పనికాదని విసర్జించాలి అంతేగాని వారి అడుగుల్లో అడుగు వెయ్యగూడదని నిశ్చయించుకున్నాను అయితే - ఏంచెయ్యాలి

ఆంధ్రకవితా ప్రవృత్తినే కొత్తచూపుతో విభాగించాలి ఇది కవుల చరిత్రకాదు గనక అందులో ఎంటబడ్డ ప్రతికవివెంటా పడగూడదు ఆ యుగంలో కణకణవెలిగే వ్యక్తిత్వంగల ముఖ్యమైన కవులను తీసుకుంటే చాలు వారిని గురించి 'పాడినదేపాట' కాకుండా ఆ కావ్యం ఆమూలాగ్రం నీదృష్టితో చదువు, నీవు ప్రతిస్పందించిన విధంగా - కచ్చితంగా రాయి నిష్పక్షపాతంగా - సరియైన అంచనా (Estimate) వెయ్యి! ఎవరి ప్రవేశికలూ, పీఠికలూ, నిన్ను నడపగూడదు తోచినది తప్పో ఒప్పో వాగ్దేవి ముఖంచూచి వ్రాయాలి మూలుగులు, మొగమాటాలు పనికిరావు అని నన్ను నేను నియమించుకుని రచనకు ఉపక్రమించాను

ఇక్కడ ఒకమాట —

కవుల కాలనిర్ణయంలో వంశవృక్షాలు, వాదచక్రాలు, పోలికపోక,

ఉద్ధారాలతో ఊపిరితియ్యక, దర్శనంమీద అనేకులు అంగీకరించినకాలం స్వీకరించాను ఏదైన చిన్న తఖరరు ఉంటే మునిగిపోయేదేమీలేదు దానివల్ల కవితాస్వాదం తరిగిపోదు కవి కవితామూర్తి దర్శనం ముఖ్యంగాని కాలం కాదు

కొన్నిచోట్ల నా దర్శనమూ వేరొకరి దర్శనమూ కలియవచ్చు అంత మాత్రంచేత నాకు ప్రేరకం అనుకోనక్కరలేదు అదియదృచ్ఛాసంభవం, అంతే.

నా ప్రాచీన కవితాదర్శనాన్ని ఆరు ఋతుధర్మాలుగా వింగడించాను తదభిముఖంగా రచన సాగించాను ఈ యుగవిభజనం పూర్వులతో కొంత విభేదించవచ్చు దానివల్ల స్థిరపడిన విలువల్లో పెద్దమార్పేమీ ఉండదు

సారస్వతసమీక్ష బరువనిపించకుండా ప్రతివిభాగాన్ని ఒక గోష్ఠిగా నడిపించాలని ప్రయత్నించాను

ఈ రచన ఏదైనా కొత్తచూపునిస్తే స్వతంత్రాలోచనలను ప్రేరేచితే చరితార్థమని భావిస్తాను

ఈ గ్రంథప్రచురణ తమపనికాదని సాంస్కృతికశాఖ తెలిపితే - ఆ భారాన్ని తనమీద వేసుకుని నాకు బాసటగా నిలిచిన సాహసి, ఆంధ్రసారస్వత పరిషదధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ఆయన సాహిత్య సముద్ధరణప్రీతి అట్టిది దానికి నాకృతజ్ఞత అనేమాట చాల చిన్నది ఆ ఋణం తీర్చరానిది అనడం తగినమాట

ఈ యావత్ప్రయత్నానికి వెన్నుబలం పరిషత్కార్యదర్శి డా కె రంగనాథాచార్యులుగారు

నా ఊహాలకు ఊపిరిపోసి చివరికంటూ నాతో నడచిన సహయాత్రికులు, పరమమిత్రులు శ్రీయశస్వీ భుజంగరాయ శర్మగారు

ఈ గ్రంథపు వ్రాతపుటలకు విసువు విరామం లేకుండా శుద్ధప్రతి తయారుచేసి తోడ్పడిన స్నేహితులు శ్రీ పచ్చిపులుసు వేంకటేశ్వర్లుగారు

వారందరికీ నా అభివందన, అభినందన చందనాలు

ఇట్లు
రచయిత
ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

కావలి - 1
28-6-85

ఇతిహాస వాసంతి

ఉపక్రమణిక

తెనుగు సంవత్సరాది రోజున - వేరు వేరు ఉద్యోగాల వృత్తుల, మిత్రులంతా -ఒకి ఒకచోట సంవత్సరం ఫలితాలు, పంచాంగశ్రవణం మాత్రమే కా, సంగీత సాహిత్య కాలక్షేపాలతో, సరస గోష్ఠులతో, వినోదిస్తూ ఉంటారు

ఆ ఉగాదికి సంగీత, వినోద కాలక్షేపాలు మానివేసి ప్రాచీనాంధ్ర కవిత్వం, దానిపుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకోదలుచుకొని సంభాషణలు, చర్చలు విడిచి సర్వసాధారణంగా తొలి తెలుగు కవిత్వపు తియ్యదనంగురించి చెప్పమని నన్ను కోరారు

వారి అభిరుచికి సంతోషించి వారి కోరికను మన్నించి ఆ సమావేశానికి వెళ్లి, నాకు తోచిన నాలుగు మాటలు చెప్పాను

దాని లిఖిత విస్తృతరూపం ఇది

తొలి మాటలు

ఈ రోజు ఉగాది

ఈ తెలుగు తొలి శుభదినాన ఇందరు నావాళ్లను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది ఇంతవరకు నిరాశ నిస్పృహాలతో స్తబ్దమైన నా మనస్సు చిగిరించి నట్టయింది

పరసీమల నుంచి పుంఖాను పుంఖంగా మనమీద పడే ఉద్యమ ప్రభా వాలు సాహిత్య విజృంభణలు, మన ఆలోచనలను, అభిరుచిని సంప్రదాయ ధారను తారుమారు చేశాయి సాహిత్యపు పునాదులను మూలమట్టంగా కదిలించి వేశాయి కొత్తను అందుకోడానికి పట్టరాని తహ తహ ! పాతదాని మీద తరగని జుగుప్స-నిరసన-సంస్కృత శబ్దాలు బండలు ! ఛందస్సు సర్ప పరిష్వంగం నిఘంటువులు శ్మశానాలు, సంస్కృతి మీద ధిక్కృతి -

ఇంక మనకు మనదిగా ఏమి మిగిలింది ?

మన ఊహాలు మనవికావు, ఇంతకుముందే ఎవరో ఊహించినవి -
మన భావాలు మనవికావు, ఎవరో మనమీద వద్దన్నా రుద్దివేసినవి -
మన గమ్యం మనం నిర్ణయించుకున్నదికాదు, ఎవరో నిర్దేశించినది -
రాజకుమారుల వేటలు రాణుల విహారాలు కోటలఎత్తు అగడ్తలలోతు
విసుగెత్తించిన మాట నిజమే -

వేలబారు శృంగారం పాలిపోయిన వర్ణనలు విచక్షణులను విముఖులను చేసిందీ నిజమే-కాని-మనలక్ష్యం ఏమిటి ? మన గమ్యం ఎక్కడికి ? అన్నదే తేలని సమస్య -

సంకీర్ణ భావాలతో గంతవ్యం ఎరగని పరుగులతో నేటి తెలుగు సాహిత్యం ఉల్లోల కల్లోలంగా ఉంది

ఎక్కడికి మన గమనం ?

ఇట్టి సాహిత్యద్వాపరంలో మిత్రులు నన్ను మన పూర్వసాహిత్యం గురించి ప్రతిభాప్రకర్షల గురించి చెప్పమనడం ఆశ్చర్యకరం అయితే ఈనాడు

గూడా మన కాణాచి అయిన సంప్రదాయ సాహిత్యం గురించి వినడానికి మీరంతా కుతూహలపడడం హర్షదాయకం

అన్నింటిలోను చిత్రమయిన దేమిటంటే అభ్యుదయ నినాదం! ఇది వినడానికి మహాసంప్రీతికరంగా ఉంటుంది కొత్తలోకమేదో ఇంద్ర జాలంలా ఎదుటికివచ్చి కూర్చున్నట్టుంటుంది

ఇది దేవతావస్త్రంలాంటిది!

నిర్వచనం దగ్గరే తగాదా -

పూర్వులూ "అభ్యుదయ పరంపరాభివృద్ధి" కోసమే గ్రంథాలు వ్రాశా మన్నారు

అతి నవ్యులూ అభ్యుదయమే మా సాహిత్యానికి పరమలక్ష్య మంటు న్నారు

అయితే-వడ్లగింజలో బియ్యపుగింజ ఎక్కడుంది, ఈ భేదం?
పరమలక్ష్యమైన మన ఆలోచనాసరణిలో ఉంది
యథార్థ చింతనకు మనమిచ్చే విలువల్లో ఉంది
పూర్వం పురుషార్థ సాఫల్యం అభ్యుదయం!
నేడు ఇహలోకసుఖం అభ్యుదయం!

ఇహలోకసుఖం అనేక భౌతికావసరాలమీద ఆధారపడి ఉంటుంది భౌతికావసరాలు సామాజిక, రాజకీయ పరిస్థితుల మీద ఎప్పటికప్పుడు మారడం సహజం ఒకనాడు రాచరికం, వేరొకనాడు ప్రజాస్వామ్యం ఇంకొకనాడు కమ్యూనిజం-ఏది సుఖం తెస్తే అది అభ్యుదయం ఏది తేలేకపోతే అది అనర్థకం కనుక ఆధునికుల అభ్యుదయానికి స్థిరరూపం లేదు పరిస్థితులనుబట్టి మారుతూ ఉంటుంది

పూర్వుల అభ్యుదయం సత్యధర్మాలమీద నిలదొక్కుకుని ఉంది అంటే మానవుణ్ణి స్థిరమైన ధర్మసాధన మీద నిలిపి ఉంచి మేలు కూర్చడమే అభ్యుదయం దీనికి సంకుచితమైన మతంతో ప్రసక్తిలేదు అన్నింటికన్నా మానవత్వపు విలువ దొడ్డది. మానవుడు సాటి మానవుణ్ణి దోచుకోవడం అధర్మం, హింసించడం అమానుషం, వంచించడం నీచం

ఈ మాటలకు మూల స్రోతస్సులివి -

"తేన త్యక్తేన భుంజీథాః" (త్యాగంచేసి అనుభవించు)

1 మాగృధ కస్యస్విద్ధనమ్ - (ఎవరి ధనం అపహరించకు) బ్రాహ్మణే గవి హస్తిని

2 శునిచైవ శ్వపాకేచ పండితాస్సమదర్శిన " (విజ్ఞులు, బ్రాహ్మణుని యందు గోవునందు, కుక్కయందు, అంటరాని వానియందును సమబుద్ధి కలిగి ఉంటారు

3 న కశ్చి ద్దుఃఖమాప్నుయాత్, (ఎవనికీ దుఃఖం కలుగరాదు

4 త్యాగేనైకేన అమృతత్వమానశుః (త్యాగం ఒక్కదానితోనే అమృతత్వం పొందుతారు)

5 లోకా స్సమస్తా స్సుఖినో భవంతు (లోకులందరూ సుఖవంతులు కావాలి

ఈ సూత్రాలనుండి విచ్యుతులైనవారు ధర్మభ్రష్టులు ఎంతటి ధార్మిక వేషం వేసినా పతితులు జాతిద్రోహులు !

ఈ ధర్మచింతన నాదేశం స్వంతం -

నా మహాపురుషుల తత్త్వపరిచింతననుంచి పుట్టి భారతీయ హృదయ క్షేత్రాలలోకి ప్రవహించింది ఉత్తమ జాతీయభావనతో సంభావిత మైంది

నా మేధ శంకర రామానుజులు నా బోధ వివేకానంద మహాత్ములు నాగాధ కాళిదాస రవీంద్రులు నా బాధ హంస గిరంస

ఈ అవగాహన నా సప్తధాతువులలోను జీర్ణించింది నేను అంటే నాజాతి ఈ భావన పొదుకొన్నప్పుడు నాజాతి హిమశిఖరంలా తలయెత్తుకు తిరుగుతుంది

తాను తానుగా నిలబడుతుంది

ఈ సులోచనాలతోటే నేను నా వాఙ్మయాన్ని చూస్తాను లోపాలు, ప్రతీపాలు, కనబడినప్పుడు నిష్కరుణంగా విమర్శిస్తాను, సాధుమార్గంలోకి మళ్లమంటాను

[1]ఆంగ్లవిద్యాధికుడైనా, ఒక సహృదయ విమర్శకుడన్నట్టు పాశ్చాత్య కర్మాగారాలలో నిర్మితమైన కళ్ళద్దాలతో మన సాహిత్యాన్ని చూచి గేలి చేయ వద్దంటాను

ఏ దేశ కాలాల్లో, ఏ సాంఘిక వ్యవస్థలో, ఏ ప్రేరణలతో ఆ సాహిత్యం పుట్టిందో చూడకుండా 'యద్దేవా' చేయడం అవివేక మంటాను

ఇప్పుడు నీవు మన్నించే సాంఘికపు విలువలవంటివే ఆనాడు వారికీ ఉన్నాయి అవి నీకు సరిపడకపోవచ్చు అంతమాత్రంచేత అవి పనికిమాలినవి కావు

వాటికి అపారమైన చారిత్రకపు విలువ ఉంది కళాత్మక విస్ఫురణ ఉంది

వాటి ఆత్మీయతమీద అవగాహనమీద ఎంతైనా ముందుకు వెళ్లు ప్రతిభా ప్రకర్షలు చూపించు, కళాకాంతులు వెదజల్లు, అప్పుడే మన కర్తవ్యా నికి కృతార్థత !

అప్పుడే మన అభిరుచికి సాఫల్యం—

ఈ ప్రారంభ వచనాలతో మిమ్ములను అభిముఖులనుచేసి, నా ప్రసంగా నికి ఉపక్రమిస్తాను

శ్రద్ధగా విని వివేచన చెయ్యండి

సత్యం గ్రహించండి

అభిప్రాయభేదా లుంటే అ మరలేకుండా ఇచ్చిపుచ్చుకుందాం నిజం తేల్చుకుందాం

మిత్రులారా ! ఇంకొక్క మాట

మీరంతా విద్యావంతులు ఆంగ్లవిద్యాలయాల్లో చదివి పట్టభద్రులైన వారు ఆంగ్లభాషతోకూడా మాతృభాష ఎరనీయంగా చదివినవారు అయినా యెందుకు మీరు చిక్కని తెలుగుపద్యం చదివితే పరాయిభాషవిన్నట్టు ఉదాసీను లవుతున్నారు ?

• నేలటూరి వేంకటరమణయ్యగారు తమ వ్యాస సంపుటిలో

వినుగు తెందుతున్నారు ?

అక్కడే కీలకం ఉంది—

ఇంతవరకు మీరు చదివిన విద్యాలయాల్లో తెలుగు బోధించడం తెలుగు భాషలో గాఢప్రవేశం కలగడానికిగాని, తెలుగుభాష తియ్యదనం తెలియడానికిగాని కాదు అది ప్రభుత్వంవారి ఆజ్ఞాపత్రాలను, వ్యవహారకాండను తెలుగులోకి తర్జుమా చెయ్యడానికే ఉపయోగించింది

పాఠ్యప్రణాళిక ప్రకారం – బోధించినవారుకూడా మీకు తెలుగు అందచందాలు చెప్పడానికి పూనుకోలేదు. వారిబోధన అంతా ఒక చట్రంలో బిగించారు తెలుగుపద్యం చదవగానే దాని చక్కనిభావం తెలుగుపిల్లవాడి మనస్సుకు వొత్తించడం వారి పనికాదు

విగ్రహం, సమాసం వ్యుత్పత్తులు, ప్రకృతి వికృతులు అనే ఆయుధాలతో పద్యంమీద దాడిచేయడం నేర్పారు ప్రశ్నపత్రాలుకూడా ఆ చట్రం మీదనే నిర్మించారు ఆ పేపరులో పాస్ కావడమే దాని పరమావధి –దానితో మీ రుచి విరిగిపోయింది తెనుగంటే – నీరసం, నిరసన ఏర్పడింది స్వపరిపాలన వచ్చినా ఈ చట్రం మారవలసినంతగా మారలేదు అందుకే మీకు కలుగవలసినంత తెలుగుమీద అభిమానం కలుగలేదు దానికి వగచి ప్రయోజనం లేదు ఇప్పటికైనా మించిపోలేదు

తెనుగు పద్యంలో ఉన్న లయ, నడకసొగసు, ఇతరభాషల్లో కనపడదు ఆదికవినుంచీ మనకవులు పద్యాన్ని భావ వాహకంగా మాత్రమే ఉపయోగించలేదు దానికి గొప్ప గమన సౌందర్యం నేర్పారు చదవగలిగినంత ఇంపుగా తెలుగుపద్యం చదివితే అర్థం తెలియకుండానే అది మనల్ని ఆకర్షిస్తుంది అదిపాదంనుంచి వేరొక పాదానికి వెళుతూ మలుపు తీసుకున్నప్పుడు, పదమధ్యంలో యతిని బిగించి నడిపించినపుడు, పొడిపొడిమాటలతో పద్యం ప్రారంభమై అది క్రమంగా భావపుచిక్కదనంవల్ల మూడు నాలుగు పాదాల్లో సంస్కృత సమాసంతో విమానవేగంతో పైకి లేచినప్పుడు సీసపద్యం నాలుగు పాదాల్లో ఎన్ని ఒయ్యారాలైనా పోయి ఎత్తుగీతిలో రవ్వలు రాల్చినప్పుడు, కందం చదరంగంలో గుఱ్ఱంలా నడిచి నాల్గవ పాదాదిని జగణంతో దూకినప్పుడు, తెలుగుపద్యం ఎన్ని విద్యలునేర్చింది! అనిపిస్తుంది సంస్కృతంలో లేని నడకసొంపులు తెనుగుపద్యం నేర్చుకుంది సంస్కృతంలో, తెలుగు

ప్రతిభకు అద్దంపట్టే సీసపద్యం వంటిది లేదు ఏదైనా మారుమూల 'అశ్వధాటి' వంటి పద్యం ఉన్నా సీసపద్యపు ధారాళత దానికి లేదు దానిని వినోదానికి వాడారుగాని ఏ మహా కవీ కావ్యంలో దానికి ప్రధానస్థాన మిచ్చి పోషించలేదు కనుకనే సంస్కృత శ్లోకంకంటే తెనుగుపద్యం ముందు మనకు మోజు పుట్టిస్తుంది అర్థం తెలియకపోయినా నన్నయగారి చంపకం, శ్రీనాథుడి సీసం, తిక్కన కందం, పోతనార్యుని 'మందారమకరందం' మనల్ని వ్టేవడవు (అనుప్రాస)

కనుకనే నన్నయ తిక్కనల కవితలకు మనం వారసుల మని గర్విస్తాం శ్రీనాథ పోతనల కైతల తీపి నాజాతి సొత్తని మనశరీరం గరిపొడుస్తుంది రక్తం తలవరకూ పొంగుతుంది ఈ విషయం అంతా ముమ్ముందు సోదాహార ణంగా వివరిస్తాను

నే నిప్పుడు మీకు క్రీస్తుశకం పదకొండో శతాబ్ది మొదలుకొని పది హేడో శతాబ్ది వరకూ పుట్టి, పెరిగి, శాఖోపశాఖలుగా విజృంభిచి తన విల క్షణ ప్రతిభతో కళా విస్ఫూర్తితో విలసిల్లిన ఆంధ్రకవితా మహోదయం గురించి క్లుప్తంగా ముచ్చటించ దలచాను

ఇది కవుల చరిత్రకాదు, ఆంధ్రవాఙ్మయ ఆనుపూర్వి అంతకన్నా కాదు ఆ చరిత్రలతో వాఙ్మయ కథా విస్తారంతో ఇప్పటికే గ్రంథ సంచయం బరువెక్కి ఉంది శాసనాలతో పీఠాసనాలతో పోషకరాజు వంశవృక్షాలతో కాలనిర్ణయ కల్లోలాలతో–ఇప్పటికే మీకు కావలసినంత తలనొప్పి సిద్ధంగా ఉంది సాహిత్య సౌందర్య సమీక్ష క్రమంగా పరిశోధన పేరుతో శాస్త్రపు ఖత్తులోకి దిగి హృదయధర్మాన్ని చంపివేసి, బుద్ధి వ్యాయామం పెంచుతోంది చర్విత చర్వణంగా దాన్నే పెంచి మీ అభిముఖ్యాన్ని దూరం చేసుకోను - వాటి అన్నింటిమీద తెరవేసి మీ అభిరుచికి మెరుగుపెట్ట గలిగితే - మీ రసజ్ఞతను ఎత్తులకు తీసుకుపోగలిగితే, అప్పుడు నా ప్రసంగాలకు కృతార్థత !

ఆంధ్రకవితా ప్రవృత్తి అంతా, నాకు ఆరు ఋతు శోభల్లా కనిపిస్తుంది, స్తబ్ధంగా రాతి పలకలమీద, రాగి పట్టాల మీద పొనుగువడి ఉన్న దృశ్యా దృశ్యకవితా ప్రకృతికి–చివురు తొడిగించి పూలు పూయించి దానిని వసంత

సౌభాగ్యంతో ఫలవంతం చేసినవాడు నన్నయభట్టారకుడు ఆయన కవితా ప్రస్థానమంతా ఇతిహాసంతో ప్రారంభమైనది కనుక అది ఇతిహాస వాసంతి

తర్వాత 12 శతాబ్దంలో శైవకవుల ప్రచండ కవితా ప్రభంజనం వీచింది నన్నయగారు స్థిరపరచిన కవిత్వపు విలువలు ఆల్లకల్లోలమయ్యాయి ఆయన వృత్తవైవిధ్యం వైదికధర్మప్రచోదనం మార్గకవిత తిరస్కృతమయింది

పౌరాణిక ఇతిహాస కథలు పరాస్తాలు అయ్యాయి దేశి కవితకు, తెలుగు కతలకు పెద్దపీట లభించింది వాక్కులలో తీక్షణత భక్తిలో వీరం శివమెత్తి వరవళ్లు తొక్కాయి

ఆంధ్ర కవితారీతిలో అది గ్రీష్మం

13 శతాబ్దిలో ఆవ్యగ్రతను, ఉగ్రతను, శాంతపరచు ఒక సత్పథం ఏర్పరచిన ఉభయకవి మిత్రుడు తిక్కనార్యుని యుగం హరిహర వార్షుకంగా కనబడుతుంది ఆవర్షాశోభలోనే 14-15 శతాబ్దులలో ఆంధ్ర కవితాకాశాన అపూర్వ సౌందర్యంతో వెలిగినవారు ఎర్రన, శ్రీనాథుడు, పోతన వగైరాలు పలువురు కనుక అది కావ్యేంద్ర ధనువు

ఆంధ్రీకరణపు జల్లులు ఇంద్ర ధనుశ్చారుతోరణాలు వెనుకబట్టిన తర్వాత 16 శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయలప్రోదిలో ప్రబంధ శరత్తు ఉదయించింది

ఆశరద్రాత్రులలో కవులు ఆడినదే ఆట, పాడినదేపాట పిదుపరి వెన్నెల పొంగు తగ్గింది పుంచుజల్లు మొదలయింది వెన్నెలలో నిండారిన తెల్లగలువల వెల్లు వెనుకబట్టింది అయినా ఆంధ్రకవితా సరసిలో అక్కడక్కడా కవితా కల్హారాల పరిమళలహరి విసరుతూనే ఉంది అది కవిత్వహేమంతం

పిదప వచ్చింది రచనాశైశిరం ప్రతిభ సన్నగిల్లింది పైపై మెరుగు లది పైచేయి అయింది శృంగారం తన హద్దులు మరచిపోయింది అయినా అందులోనూ శిఖరాయమాణు లున్నారు

క్రమంగా విస్తరిస్తాను

ఇతిహాస వాసంతి

ప్రథమ ప్రసంగం

పూర్వరంగం

ఘనదురితానుబంధ కలి
　　కాలజ దోష తుషార సంహతిన్
దన యుదయ ప్రభావమున
　　దవ్వుగ జోపి జగజ్జనానురం
జనమగు రాజ్య సంతత వ
　　సంత నితాంత విభూతి నెంతయున్
దనరుచుఁ జళుక్య మన్మథుఁడు
　　ధర్మ దయార్ద్రనిబద్ధ బుద్ధియై

ఇది నన్నయగారి భారతావతారికలోని పద్యం

ఆది ౧, 24

దీని ప్రకృతార్థం ఇది —

తన ప్రభువు చళుక్యమన్మదుడు ఉదయించి పాపపంకిలమైన కలికాల దోషం అనే మంచును దూరంగా తరిమి-ధర్మపరతంత్రుడై తన పరిపాలన మనే వసంతవైభవంలో ప్రజలను రంజింపజేస్తున్నాడు

అణిముత్యంలో సూక్ష్మంగా ఎదుటి ప్రపంచమంతా ప్రతిఫలించినట్టు ఈపద్యంలో రాజరాజునాటి దేశీయ పరిస్థితులు నన్నయగారి మనఃప్రపంచం భారతాంధ్రీకరణ ప్రయోజనం సమస్తం ప్రతిఫలించి వ్యంగ[illegible] గోచరిసాయి

'దురితానుబంధ కలికాలజదోష తుషార సంహతి' అనే సమాసం సాభి ప్రాయమైనది 'దురితం' అంటే పాపమే కాక ఆపద కష్టం అనే అర్థాలున్నట్టే కలి అంటే నాల్గవయుగమే కాక విరోధం, వివాదం అనే అర్థాలు కూడా ఉన్నాయి రాజరాజునాడు దేశం వివాదగ్రస్తములైన జైన బౌద్ధమతాల ప్రాబల్యంలో ఉంది బౌద్ధంకంటెకూడా జైనం పొగమంచులా వ్యాపించి వైదికమతాన్ని కప్పివేసింది వేదచోదితములైన కర్మ బ్రహ్మ జిజ్ఞాసలు మోడు వారి ఉన్నాయి వాటి కది శిశిరం శిశిరపదముద్రలను పోగొట్టగా వసంతం రావడం సహజం "శిశిర వసంతౌ పున రాయాతః" అని శంకరు లన్నట్లు "If winter comes can spring be far behind ? " అని ఆంగ్ల కవి అన్నట్టు శిశిరాన్ని పారద్రోలి వసంతం వెల్లివిరియడం తప్పదు ఆ వసంతానికి మన్మథుడు ప్రభువు ఆతని ప్రభుత్వం అనే వసంతస్పర్శతో - ఆకు రాలి మోడువారిన చెట్లు పూచి ఫలిస్తాయి అలాగే ఇక్కడ చాళుక్య మన్మథుని ఉదయంతో అవైదిక మతాలు దూరమైనాయి, మళ్లా వైదికధర్మా లకు వసంతవైభవం సిద్ధించింది 'సంహితాభ్యాసులు అవిరళ జపహోమ తత్పరులు' తలయెత్తారు జనానురంజనం జరిగింది

రాజకీయంగా కూడా - రాజరాజు పశ్చిమ చాళుక్యులతోడ్పాటుతో దండెత్తిన విమ్మడు విక్రమాదిత్యుని అలజడులకుగురై, శత్రువులను పారద్రోలి మరల అభ్యుదయం సాధించి వేంగీసింహాసనంమీద స్థిరపడ్డాడు తనకు ప్రియ మైన అయిదు అంశాలను సాధించడానికి పూనుకున్నాడు అందులో ముఖ్య మైనది- భారతశ్రవణాసక్తి వ్యాసభారతం పంచమవేదం అని ప్రసిద్ధి అంటే శ్రుతిరూపమైన వేదధర్మాలన్నీ స్మృతి రూపమైన భారతంలో నిక్షేపింపబడి ఉన్నాయి ఆ భారతాన్ని తెలుగువారికి అధీనం చేస్తే వైదికధర్మం సర్వజన విదితమై దేశంలో పాదుకొంటుంది ఆ భారతాంధ్రీకరణానికి ప్రోత్సహించి కూడా ఆయన తన పాలనలో వసంతవిభూతిని వెలయించాడు

సాహిత్యపరంగానూ దీన్ని సమన్వయించవచ్చు నన్నయ భట్టారకునకు ముందు పెట్టుదిట్టమైన సారస్వత రచనలు లేవు ఉబుసుపోకకు దేశీయులు పాడుకునే పాటలు సాధారణంగా దానధర్మవివరాల శాసనపద్యాలు, కనపడ తాయి అప్పటివారు గాసటబీసటగా చదివి ఏవో గాథలు తవ్వుకొనేవారు అదంతా ఆంధ్రసాహిత్యానికి శిశిరావస్థగా ఎంచవచ్చు

రాజనరేంద్రుని ఉదయంతో ఆ శిశిరావస్థ తొలగి నన్నయభారతాంధ్రీకరణంతో మధుమాస ప్రాదుర్భావం అయింది అనుకోవచ్చు ఈవిధంగా ఆంధ్ర భారతావతరణకు ముందు దేశంలోని మత రాజకీయ సాహిత్యనేద్యాలను నన్నయ భట్టారకుడు తన కృత్యాదిలో ధ్వనింపజేశాడను కోవడం అత్యాశకాదు

అయితే రమ్యమైన రూపకాలంకారంతో, లోతుకు వెళ్ళి అక్షరరమ్యతతో పులిగడిగిన ముత్యంలా తళతళలాడే పద్యవిద్యలో, విలసిల్లే ఈపద్యమూ ఇట్టి పద్యాలతోనే ఉపబృంహితమైన భారత రచనా, నన్నయ భట్టారకుడు గంట మెత్తగానే ఊడి పడిందా ? అని ప్రశ్న, నిజమే ఒక సాహిత్యానికి ప్రారంభ దశలోనే ఇంత సర్వాంగ సుందరమైన రూపురావడం అసంభవం-దాని వెనుక ఎందరు పరిశ్రమిస్తే ఎందరి అభిరుచులు పనిచేస్తే ఎంతటి కళాతృష్ణ ప్రవర్తిల్లితే ఎందరు బాటలు తీర్చితే-ఇంతటి మహారచన రావడం సంభవమో నిశితంగా ఆలోచించవలసి ఉంది

నన్నయ రచనకుముందు - ఆంధ్రసారస్వత పు మూలమట్టంలో జాతి మూలధనంవంటి జానపదగీతాలు పనిచేశాయి ఆలోచనా స్రవంతి జాలు వారింది తెలుగువారి రక్తగతమైన శృంగారం, కరుణం, హాస్యం వక్రోక్తి ప్రేరణ ఇచ్చాయి

అక్షరాలా ఇప్పుడు చెప్పబోయేవే కాకపోయినా - వీటికి మాతృస్థానం వంటి గేయసంచయం ఏదో దిక్సూచిగా త్రోవ చూపిఉంటుంది

పనిజేసి జయలక్ష్మి పవ్వళింపంగ
పరమేళు డన్నయ్య పలుకుతూ లేపు,
పువ్వుల్లు బుక్కాయి చల్లుతూ లేపు
తన పట్టుశాలువా విసరుతూలేపు
చీకటియిల్లయిన దీపాల గోరు;
శ్రీపట్టిమంచాలు అల్లుళ్ళ గోరు
అనేలాంటి గార్హస్థ్య శృంగారం

వెన్నెలకాలాన రాకోయి దొంగ!
వేదవంతుడు అన్న వీధి నున్నాడు,
అనే ప్రియాభిరతీ—
సానమీద గంధమ్ము చల్లారిపోయె
సానివాడలబోయి అన్నెలరాడు?
అనే రసికజీవనం —

'కొన్నది సీతమ్మ బంగారుతొట్టె
కట్టెను సీతమ్మ పొన్నమాకులకు,
ఇటునుంచి ఊచితే ఇంద్రునిచాయ
అటునుంచి ఊచితే చంద్రుని చాయ
కొండ వంతులోన కోనేటి నడుమ
పాపన్న! మిముగంటి బండమరుగులను,
ఏడవకు లవకుమార! రాము కుమార!
ఏడిస్తె నిన్నెవ్వ రెత్తుకుంటారు?
పుత్తడందెల బూని పులిగోళ్లు బూని
భూదేవి మీ అవ్వ వచ్చె నేడవరు,
అనే సీతమ్మ జాలిపాటలోని కరుణం ఇల్లాలి కుటుంబప్రీతి —
తెలుగు కవితకు ముడిసరుకు తొలిప్రేరణం అనుకుంటే తప్పులేదు
అంతేకాదు —

సత్తెమ్మ రుక్మిణికి జగడమ్ము పెట్టె
సరసుడు కిష్టమ్మ చిరునవ్వునవ్వ
చూపులకు చక్కంది రుక్మిణీదేవి
మాటలకు చక్కంది మరి సత్యభామ!
వంటి పురాణ పరిమళమూ ఉంది పాతపాటలలో
అన్నయ్య పంచెకు తొగరు,
వదినకు పట్టింది పొగరు
వంటి ప్రాచీన సరసోక్తులూ —
దేవుడా నీకన్ను మెల్లకన్నైతే
ఊరివారందరూ ఉడికించగలరు -

సృష్టికర్తా నీకు చూడ కళ్ళుంటె
నామగడి ఒళ్ళింల నలువేమి చెప్పు!
అనేలాంటి హాస్యపు విసురులూ —

ఆటకూటపబొమ్మలో ఆడేటి నెమలీ
వేగంగా వొచ్చాడు ఆట చాలించు
బంగారుమేడలో పవ్వావు తల్లీ!
నా అల్లు డొచ్చాడు నవ్వు చాలించు —
వంటి వక్రోక్తి చమత్కారమూ నీతిబోధా,
సీతమ్మ చిత్రకథ చెప్పేటివేళా
అడవిలో వచ్చారు లగ్నులై మండు -
అనేటంతటి తీవ్రభావాభివ్యక్తీ —

తెలుగువారి అంతరంగ పరిచాలనానికి చెరగని తొలి గుర్తులు
ఈ తొలి తెలుగుగీతాల ఉక్తిచాతుర్యం సహజ మాధుర్యం ఎంత ప్రీతి పాత్రమైనా-వీటిబలం భాషాబంధం ఒక ఉద్గ్రంథ రచనకు చాలదు ఇంతకన్న విశాలమైన భాషాబంధం కావాలి ఛందస్సౌందర్యం కావాలి వృత్తవైవిధ్యం కావాలి బహుముఖ గ్రంథావలోకనం నెలకొని ఉండాలి

అన్ని లక్షణాలుంటి సుసంపన్నమైన సంస్కృత సాహిత్యం మేరుపర్వతంలా మనవెనుక నిలిచి ఉంది! అందులో ప్రవేశమూ పాండిత్యమూ నన్నయ భట్టారకునకు ఏమీ తక్కువకాదు అందులో ధారాళమైన కవిత్వం చెప్పడం కూడా నన్నయగారికి కొట్టిన పిండి

నందంపూడి శాసనంలోని సంస్కృతకవిత చూస్తే భారతాదిని వ్రాసిన శ్లోకం పరికిస్తే - భట్టారకుడు సంస్కృతంలో ఎంతటి ప్రౌఢ కవిత వెలయించగలడో విశద మౌతుంది భట్టారకుడేకాక ఏలిక రాజరాజుకూడా ఉదాత్త రసాన్విత కావ్యనాటక క్రమములు పెక్కు చూచినవాడు ఆ సంస్కృత కవితా సంస్కారమంతా తెలుగుకు ధారపొయ్యాలి తెలుగు సారస్వతాన్ని సంస్కృత స్థాయికి లేవనెత్తాలి ఇంతకు ముందు ఇంత ప్రయత్నం చేసిన వారెవ్వరూ లేరు

ఈ సత్యాన్ని ఈ నన్నెచోడుని పద్యం చాటి చెబుతుంది —

మును మార్గకవిత లోకం
బున వెలయ, దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్ర విషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్॥

కుమా ౧ 23

మునుముందు ఈ దేశంలో ఉన్నది మార్గకవిత్వమే తర్వాత దేశీయ కవితాభిమానంతో దేశి కవితను పుట్టించి తెనుగు కవిత కొక నిర్దిష్ట రూపం తెచ్చినవారు చాళుక్యరాజు మొదలైనవారు

మార్గ కవిత్వమంటే స్థూలంగా సంస్కృత కవిత్వం అనుకోవచ్చు తర్వాత సంస్కృత లాక్షణికులు చెప్పినరీతిలో సంస్కృత మర్యాదలతో ప్రవర్తిల్లిన తెలుగు కవిత్వానికీ ఈ మాట వర్తించింది

అంటే - కేవల సంస్కృత కవిత్వం మొదటి మార్గకవిత - దాని పథ నిర్దేశంలోనే పుట్టి పెరిగిన తెనుగు కవిత్వం రెండవ మార్గకవిత అన్న మాట మొదటి తరగతికి వాల్మీకి కాళిదాసాదులూ, రెండవ తరగతికి నన్నయాదులు ఉదాహరణం నన్నయాదులు పుట్టుకతో ... వారు నోరు విప్పితే ముందు వచ్చేది సంస్కృతశ్లోకమే శాసనాల్లోనూ సంస్కృత శ్లోకాలే వ్రాశారు నన్నయను దేశిమార్గం పట్టించినవాడు చాళుక్యరాజరాజు కాని దేశికవితను పుట్టించిన చాళుక్యరాజు మున్నగువారు వేరే ఉన్నారు

జానపద స్థాయినిదాటి మరినాలుగు మెట్లెక్కినవి శాసన పద్యాలు 9 వ శతాబ్దిలో చాళుక్యరాజు గుణగవిజయాదిత్యుని పట్టాభిషేకంతో తెలుగు కవితకు శుభసమయం ప్రాప్తించినట్టు చెప్పుకోవచ్చు

అంతకుముందు తెలుగుపద్యం శైశవదశ ఎట్టిదో నిరూపించే ఆధారాలు లేవు కాని క్రీ శ 848 ప్రాంతంనుంచీ అచ్చుపు దేశీయవృత్తాలతో తెలుగు పద్యం 'నే నున్నాను' అని తనఉనికిని స్ఫుటంగా నిరూపించుకుంది

తెనుగును నిలిపిన చాళుక్యరాజు ఇప్పటికి తెలిసినంతవరకు గుణగవిజయా

దిత్యుడు ఈ౦ని పల్బడిలో సేనానాయకుడు పండరంగని అద్దంకి శిలాశాసనం మొదటిది ఇది తరువోజలో ఉంది తరువోజ అంటే రెండు ద్విపదలు జోడించికట్టిన అచ్చపు తెలుగుపద్యం తరువోజ కుదించగా ద్విపద ఏర్పడి ఉంటుందని ఒక అభిప్రాయం

అద్దంకి శిలాశాసనంలో పద్యాలు గద్యమూకూడా ఉండడం విశేషం కందుకూరు శాసనంలో కొంత శిథిలమైన సీసపద్యం ఉంది ధర్మవరం శాసనంలో పూర్తిసీసం ఉంది గుణగవిజయాదిత్యుని తమ్ముడు యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో మధ్యాక్కర ఉంది

గుణగవిజయుని సాతలూరు శాసనంలో వృత్తం చంపకమాల, భాష సంస్కృతం పద్యసంప్రదాయం తెలుగుది అంటే నాలుగుపాదాలకు తెలుగు పద్యంలా ప్రాస ఉండడం మొదటి రెండు పాదాలలోనూ తెలుగుయతివలె సజాతి వర్ణావృత్తిచేయడం గమనించదగ్గది

కన్నడ రత్నత్రయం అని పేరుపడిన వారిలో ఒకడయినా పొన్నకవికి సర్వదేవుడని బిరుదు ఈయన రచించిన తెలుగు జైనగ్రంథం ఆదిపురాణం ఆ గ్రంథమంతా ఇప్పుడు దొరకకపోయినా ఆ గ్రంథంలోని కొన్ని పద్యాలు ఇప్పుడు కంటపడతాయి అందులోని మత్తేభంలో పాదం తెగిపోక తర్వాతి పాదంలోకి కొనసాగడం కనపడుతుంది తెలుగుపద్యం ఏ పాదాని కాపాదం తెగిపోక కొరడాకొసలా రెండవపాదంలోకి చొచ్చుకు రావడం, ఒక ప్రౌఢప్రసంగా పరిగణించడం, అప్పటికే ఉందన్నమాట కరీంనగర్ జిల్లాలో దొరకిన పంపకవి తమ్ముడు జినవల్లభుని శాసనంలో కన్నడ పద్యాలతోపాటు కొన్ని తెలుగుపద్యాలుకూడా ఉన్నాయట అంటే 941 ప్రాంతానికే తెలుగు పద్యరచన తలయెత్తి కొనసాగుతూన్నట్టు కనబడుతుంది

అంతేకాగు క్రీ శ 1000 ప్రాంతంలో విరియాల కామసాని వేయించిన శాసనంలో మూడు చంపకమాలలు రెండు ఉత్పలమాలలు కనబడతాయి [1]

చాళుక్యభీముని కొరవిశాసనంలో తెలుగు గద్యరచనకూడా కనపడడం చెప్పదగ్గ విశేషం మొత్తంమీద పై శాసనాల వృత్తాంతం పరిశీలించగా -

1 'సుజాత' ప్రత్యేక సంచిక

నన్నయకు సుమారు నూరుసంవత్సరాల ముందు నుంచి తెలుగుపద్యం పుట్టి పెరుగుతూ వచ్చింది క్రమంగా తత్సమభాషకూడా తెలుగులో చోటుచేసు కున్నట్టు అర్థమవుతుంది ముందు దేశీయవృత్తాలు తరువోజ, రగడ, అక్కర, సీసం, గీతి మొదలైనవే వ్యాప్తిలో ఉన్నాయి తర్వాత బహుశః కన్నడ సాహిత్య, సాహచర్యంవల్లగాని, సంస్కృత ప్రాబల్యంవల్లగాని ఉత్పల చంపకాదులూ, శార్దూల, మత్తేభాదులు తెలుగుపద్య రచనలో ప్రవేశించాయి నన్నెచోడు డన్నట్టు తెనుగును (కవితను) నిలిపిన వారిలో ప్రముఖులు చాళుక్యులే అయినా అక్కడివారి ప్రమేయం లేకపోలేదు తెనుగుదేశంతో సంబంధమున్న కొందరు కన్నడకవులు, కాకతిరాజ్య నిర్మాతలలోని ముందు వారూ తెలుగుపద్య రచనకు దోహదం చేశారు అయితే - అందులో కావ్య ధర్మంగాని, రచనా చమత్కృతిగాని అట్టే కనిపించదు విషయనిరూపణం మాత్రమే దాని ప్రధాన కర్తవ్యం అనుషంగికంగా ఎక్కడైనా ఒకటి రెండు కవితారేఖ లుండవచ్చు

ఏతావతా – మనకు తెలిసేదేమిటంటే నన్నయ భట్టారకుని భారతాంధ్రీ కరణానికి పూర్వం తెలుగుపద్యరచనేకాదు గద్యరచనకూడా స్థిరపడి ఉంది కాని ఏకవస్తుకమై కళారూపం తీసుకున్న కావ్యరచన ఏదీ బయటపడలేదు కనుక పరినిష్ఠితమైన ఆంధ్ర కావ్యరూపం భట్టారకుని ప్రతిభావ్యుత్పత్తులతోనే ఉద్భవించి ఆంధ్ర సారస్వత మహోదయానికి మార్గదర్శి అయిందని చెప్ప డానికి ఏమీ విప్రతిపత్తి ఉండకూడదు

భారతావతరణం

ఆదికావ్యం రామాయణం, కవితా సౌందర్యంలో, పాత్రసృష్టిలో కథా సాధనంలో, ఉత్తమలక్షణాలు సంతరించుకున్న ఆదిమహాకావ్యాన్ని విడిచి తర్వాత వచ్చిన వ్యాసభారతాన్ని తెనుగుచేయుమని ప్రోత్సహించిన రాజ రాజు ఆంతర్యంగాని, దానినే ఇష్టార్తిగా స్వీకరించి, ఆంధ్రీకరించిన నన్నయ భట్టారకుని ఆంతర్యంగాని ఏమిటి ? అని ఆలోచించి చూస్తే ఇట్లా తోస్తుంది

రాజరాజు లక్ష్యం ఆంధ్రసారస్వతంలో అద్భుత కవితాప్రదర్శనం చేయించడంకాదు ఆయన ఉదాత్తగసాన్విత కావ్యధర్మం చవిచూడనివాడు కాడు కాని తన పొరుగు సాహిత్యంలో - ఆర్యధర్మ సంప్రదాయాలకు ఆటపట్టయిన వ్యాసభారతం వలుపోకలుపోయి, కవిహృదయానికి భిన్నంగా జైన మతానుయాయిగా అపసిద్ధాంతాల పాలయింది వేంగి మండలంలో పుట్టి పశ్చిమ చాళుక్యుల రాజ్యంలో స్థిరపడ్డ తెలుగువాడు పంపన్న పశ్చిమ చాళుక్య రాజు అరికేసరితో అభేదం కల్పించి "విక్రమార్జున విజయా" అనే పేరిట అర్జున నాయకంగా భారతాన్ని తలకిందులు చేశాడు ఉపనిషదర్థానికి ఆలవాలమై, వైదికధర్మసారమైన గీతాప్రవచనం చేసిన కృష్ణునకు అందులో నామరూపాలు లేవు

ఇంకొక కన్నడకవి రన్నడు భారతాన్ని "సాహసభీమవిజయం" అనే నామాంతరంగల గదాయుద్ధ కావ్యంగా వ్రాశాడు ఇందులో తనకు ఆశ్రయదాత కల్యాణి చాళుక్యుడు తైలపుని కుమారుడు అయిన సత్యాశ్రయునితో భీమునకు అభేదాధ్యవసాయంచేసి భీమనాయకంగా కథను నిర్వహించాడు సాహసంలో సత్యాశ్రయుడు భీమునకు ఉద్దీ అని స్ఫురింపజేస్తాడు భీమసేనుడు కేంద్రబిందువుగా ఈ కథ నడుస్తుంది దుర్యోధనుని ఊరుభంగ, కిరీటభంగాలు భీముని ప్రతిజ్ఞలో భాగాలే అని సమర్థింపజూస్తాడు ఇతడున్ను జైనధర్మానికే కట్టుబడి అజితపురాణం వ్రాసిన కన్నడ రచయిత

తమిళంలో భారతరచన చేసిన పెరిందేవనార్ వివరాలు అంతగా తెలియవు[1] ఒక దేశీయవృత్తంలో వ్రాసిన తమిళభారతంకూడా రాజరాజుకు తృప్తి నిచ్చినట్టు కనబడదు అది కన్నడ భారతంవలె పూర్తిగాను దొరకదు

తన తండ్రి జైనాభిమాని అయినా రాజరాజుకు చోళులైన తాత, మేనమామల వైదికాభిమానం వచ్చింది వ్యాసమహర్షి హృదయాన్ని వ్యాఖ్యానించే తెలుగుభారతాన్ని సృష్టింపజేయ్యాలని దీక్ష వహించాడు తనయందు అనురక్తుడు, సంహితాభ్యాసుడు, ఉభయభాషా కావ్యరచనాభిశోభితుడు అయిన నన్నపార్యుడు మూర్తీభవించిన వైదికధర్మం, ఆయన

1 ఈ భారతం ఇప్పుడు దొరకదు లక్షణగ్రంథములలో దీనినుంచి కొన్ని ఉదాహరణము లిచ్చిరట: చూ తమిళాంధ్ర (వి ఎస్ రాఘవన్) భారతములు, పుట 30

చేతిలో ఆర్షధర్మం సురక్షిత మవుతుందనీ తెనుగులో భారతం శోభిస్తుందనీ గట్టిగా నమ్మాడు తనకు విరోధులైన ఎడమటి చాళుక్యుల జైనానికి విరుగుడుగా తన భారతం ప్రచలితం కావాలనే కాంక్షకూడా గాఢంగానే ఉండవచ్చు ఇన్నిటికి ఫలితంగా ఆతని నోటివెంట ఈ ముత్యాలు రాలాయి

"జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభి[illegible] మహాభార[illegible]బ
ద్ధ నిరూపితార్థ మేర్పడ
తెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్"

అంతేకాదు బహుభాషల్లో బహుజనులవల్లి శ్రద్ధగా భారతం వింటే అనేక యజ్ఞాలు చేసిన సుకృతం లభిస్తుందనికూడా నమ్మాడు అంటే భారతాన్ని కేవలం సాహిత్యపోషణంకోసం కాదు ధర్మరక్షణంకోసం తెనిగించమన్నాడు సంస్కృతంలో వింటే ఆయనకోరిన ఫలితాలన్నీ సిద్ధించేమాట నిజమే కాని అన్యభాషల భారతాలవల్ల ఆ సుకృతం లభిస్తున్నదా ? లేదు ముఖ్యంగా కన్నడభారతాలవల్ల విరుద్ధఫలం ప్రాప్తించింది తమిళభారతంవల్ల ఎంత తృప్తి కలిగిందో తెలియదుకాని, తాను కోరిన సంతృప్తిమాత్రం కలిగినట్లు కనిపించదు కాబట్టి తెనుగు భారతంలో తనకోరిక సర్వాంగీణంగా ఫలించవలెనని ఆయన తాత్పర్యం కావచ్చు కనుక దానికోసమై తన కులబ్రాహ్మణుణ్ణి ప్రోత్సహించాడు అభ్యర్థించాడు కాని పలిక కోరినంత తేలిక కాదు 'భారతబద్ధ నిరూపితార్థ మేర్పడ' తెనుగున మహాభారతం రచించడం భారతం అంటే భరత వంశీయుల చరిత్రే కాదు భారతానికి ఇంకో సంప్రదాయార్థం ఉంది 'గురుత్వా ద్భారవత్త్వా చ్చ మహాభారత ముచ్యతే గురుతర భారంవల్లకూడా అది భారతం అయిందట'

ప్రభువు రాజరాజు మాట విని భట్టారకు డంతవాడు ఉలికిపడి ఉంటాడు 'దుర్గమార్థజల గౌరవ భారతభారతీ సముద్రము దరియంగ నీదను విధాతృనకైనను, నేరబోలునే' అని ఆశ్చర్యచకితుడైనా - ధీరుడు కనుక సర్దుకొని అయినను 'దేవా, నీ యనుమతంబున ఉపిద్వజ్జనుల యనుగ్రహంబునం జేసి నా నేర్చువిధంబున నిక్కావ్యంబు రచించెద' అని అది వన్నిదమ్ముగా స్వీకరించాడు

ఈ అంగీకారములో 3 అంశాలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి

1. నీవు ప్రభువవు ! నీ మాట అపరిహార్యం, నీ కాంక్షితం నెరవేర్చి తీరాలి

2 వ్యాస భారతం 'భారతః పంచమో వేదః' అనే ప్రసిద్ధి కలది దానిని భాషాంతరీకరించకూడదని సంప్రదాయవాదుల నిగమనం

"దేశభాషాపురాణాని రచితాని చ మానవైః
శ్రుత్వా కావ్యేతిహాసాం శ్చ భయ మాప్నోతి పూరుషః"

అనేది ఒక అభియుక్తోక్తి—

'ఆంధ్రభాషా మయం కావ్యం
అయోమయ విభూషణం'

అని గీర్వాణుల ఈసడింపు

దీనికి విద్వాంసుల అనుగ్రహం కావాలి

మహారాజు అండ ఎంతఉన్నా, ఆనాడు పలుకుబడిగల విద్వాంసుల ప్రతిఘటనంవల్ల ఈ భారతం ప్రశస్తికి రాకపోవచ్చు అందువల్ల చేసిన శ్రమంతా విఫల మవుతుంది వారి ఆనుకూల్యం సంపాదించడం విధాయకం అయితే వారి అభిమతానికి భంగం లేకుండా నడిపించాలి భారతమాతా - అయినప్పుడు ఆంధ్రీకరణంలో భారతం ఎంత ఉంటుంది ? ఎంత పోతుంది ? ఆ మిగిలిన భాగం రసజ్ఞులకు తృప్తినిచ్చేనా ? లేక వంశచరిత్ర, నీతిధర్మాలు, ప్రవచించే ఇతిహాసంగానే మిగిలేనా ? అది తనవంటి రసపరతంత్రునకు, కవితాశిల్ప ప్రవణునకు అర్హ్యరచన అవుతుందా ?

ముందు ఆనాటి విద్వత్పరిషత్తును కూడగట్టాలి తన భారతరచనా పథకం చెప్పి ఒప్పించాలి అప్పుడు తన భారతం ఉద్దిష్ట ఫలప్రదం అవుతుంది ఏతాదృశమైన భావనా పరంపరతో తన భారత రచనోద్యమ పీఠికగా రెండు పద్యాలు రచించాడు ఆ రెండిటిలోను ఆయన హృదయాన్ని చదవవచ్చు అందులో మొదటిది

పరమ వివేక సౌరభ వి
భాసిత సద్గుణపుంజ వారిజో
త్కర రుచిరంబులై సకల
గమ్య సుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావన ప
యః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ము
దం బొనరన్ గొనియాడి వేడుకన్

ఆది ౧ 24

ఇక్కడ నన్నయగారిభావం కొంచెం లోతుకువెళ్లి ఆలోచించవలసిఉంది

ఆనాటి పండిత సభలను ఆయన వినిర్మల సరస్సులతో పోల్చాడు ఏమి? ఫలపుష్పభరితమై హరితసుందరమైన ఉద్యానంతో పోల్చవచ్చునే - లేక నక్షత్ర చంద్ర సుశోభితమైన గగనతలంతో పోల్చవచ్చునే-ఇక్కడ సరస్సులనే ఎంచుకోవడంలో విశేషం ఏమిటి?

విశేషం ఉంది—

వాల్మీకి రామాయణం పుట్టుకకు ముందు భరద్వాజుడనే శిష్యునితో స్నానానికి వెళ్లి అంటాడు

“అకర్దమ మిదం తీర్థం
భరద్వాజ! నిశామయ
రమణీయం ప్రసన్నాంబు
సన్మనుష్య మనోయథా”

బాల ద్వి ౫

‘నాయనా భరద్వాజా! బురద అన్నది లేకుండా సజ్జనుడి మనసులా తేటనీటితో ఈ రేవు ఎంత అందంగా ఉందో చూడు’—

సజ్జనుల మనస్సులు బురదలేని తేటనీటి సరస్సుల్లా ఉంటాయన్న ప్రచేతస పుత్రుని భావం ఇక్కడ నన్నయ్యగారి మనస్సును పట్టి ఉండాలి కనుకనే ఇక్కడ సభాంతరాలకు సరోవరోపమానం పరమౌచిత్య భాసురంగా ఉంది

నన్నయగారి ఎదురుగా ఉన్న పండితసభలు వినిర్మల సరస్సులు, అందులోని పద్మాలకు ఉత్తమ వివేకం పరిమళం, సద్గుణాలు కేసరాలు వాటి రేవులు సుఖగమ్యములు మంచి చరిత్ర అనే నిర్మల జలంతో నిండి ఉన్నవి

అంటే ఈ రూప(క) కల్పనలో భట్టారకులు ఆ సభలలోని విద్వాంసుల సౌజన్యాన్ని ఎంతగా ఊహించి కొనియాడారో తెలుస్తున్నది గదా '

అట్టి సరసులతే, సహృదయులతే, తన భారతాంధ్రీకరణ పరమార్థాన్ని గ్రహించడానికి అర్హులనీ అట్టివారి ఔదార్యమే తనకు అండ అనీ కవి హృదయం, అది లేని పరసులూ శుష్కతార్కికులూ, వైతండికులూ తనకు ల ది ్య అంతేకాదు భారతంలో ఒక్క అక్షరం విడవకూడదనే వారూ, అసలు తెనిగించనే కూడదనేవారూ, తనకు అకించిత్కరులు తానెంత వారి సౌమనస్యాన్ని, ఆభిముఖ్యాన్ని అర్థించినా ఎదురుతిరిగి వివాదం పెంచేవారిని ఎదుర్కొనే పాండిత్యబలమూ మనోబలమూ తనకుంది ఐనా ఉక్తి చాతుర్యంతో యుక్తిదార్ఢ్యంతో, తనకు బాసటగా నిలవడానికి ఇష్టుడున్ సహాధ్యాయుడు ఆయిన నారాయణభట్టు పాకశాసనికి వాసుదేవునిలా తన పక్క నిలచి ఉండనే ఉన్నాడు ఇంక రచనోపక్రమానికి సందేహించ నక్కర లేదు ఇక్కడి అర్జున, కృష్ణ సహాయోపమానం ఆలోచించదగినది అర్జునునకు కృష్ణుడు యిద్ధంలోనే కాదు, తత్పూర్వం అనేక విధాల తోడ్పడ్డాడు ఖాండవ దహనంలో, రాజసూయ నిర్వహణంలో, సుభద్రా పరిణయంలో, ద్రౌపదీ మాన సంరక్షణంలో, రాయబారఘట్టంలో, ఆయన సాహాయ్యం సమృద్ధిగా ఉంది అట్టి సందర్భంలో భారతఘోర రణంబునందు అని ప్రత్యేకించి పేర్కొనడం తలవని తలంపు కాదు

నారాయణభట్టు "సంస్కృత, కర్ణాట పైశాచి, కాంధ్రభాషాసు, కవిరాజ ఇది ప్రథితః" అన్న నందంపూడి శాసన ప్రకారం ముఖ్యంగా కర్ణాటాంధ్రభాషల్లో నిష్ణాతుడు కవిత్వం చెప్పగలవాడు అతడు పండితుడై భాషారహస్యాలు తెలిసినవాడు కవియై రసరామణీయకాలు నిర్దేశించ గలవాడు అవసరమైతే ఆయన తోడ్పాటుతో వైతండికుల ఎదిరించగలడు వసమార్గం నిష్కంటకం చేసుకోగలడు బాగుంది—

అయితే - మహాకావ్య రచనానుకూలమైన ఆంధ్రభాష సిద్ధంగా ఉందా ? ఛందస్సులు నిర్దిష్టంగా ఉన్నాయా ? సంస్కృతం పాలు ఎంత ? దేశిప్రవేశం ఎం౦ ? కారకం, కాకువు జాతీయం ఎట్లా ఉపయోగించాలి ?

అంతకుముందు శాసనాల్లో కనిపించే పద్యవిధానం, దేశంలో చాటువులుగా చలామణీ అయే ముక్తకరచనలూ ఎంతవరకు తోడ్పడతాయి ? వాటిని వదలగూడదు వాటిపై అభివృద్ధిగా అంతకన్న ఉదాత్తసుందరంగా భారతరచన నిర్వహించాలి - అనేది బెదిరిస్తూ ఎదుట నిలిచిన కృత్యాద్యవస్థ ! కొన్ని శతాబ్దులు గడచిన తర్వాత ఆంధ్రకావ్యకళారచన స్థిరపడిన తర్వాత వచ్చిన కవులకు తప్పనిసరి సామెత అయిపోయిన కృత్యాది సమస్యను నాడు ఆయనెలా పరిష్కరించుకున్నాడా ? అని ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది

నన్నయభట్టారకుడికి వాగనుశాసనుడు అనే బిరుదు ఎలా వచ్చింది ? ఆంధ్రశబ్దచింతామణి ఆయనరచనేనా ? వివాదంలోకి మన మిప్పుడు దిగదలుచుకోకపోయినా కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పక తప్పదు

ఆయన భారతాంధ్రీకరణం చేయదలచిన నాటికి పద్యరచనానుకూలమైన భాష కొంత ఉందని శాసనాద్యాదులవల్ల తెలుస్తున్నది అది యావదాంధ్ర భారత రచనకు చాలునా ? వాటిలో ఉన్నది, తాత్కాలిక విషయానుకూలమైన పరిమిత భాష అదికూడా చెప్పదగినంత నిర్దుష్టం కాదు సంస్కృతంనుంచి ధారాళంగా సబ్దజాలాన్ని దోసిళ్లకొద్దీ తెచ్చుకోవాలి వాటికి తెలుగురూపం ఇచ్చితీరాలి ప్రకృతి ప్రత్యయవిభాగం నిర్దేశించాలి కారకం నిర్ణయించాలి అది తెలుగునుడికారానికి విరుద్ధంగా, ఎబ్బెట్టుగా ఉండకూడదు తప్పనిసరిగా కొంత సంస్కృతవాసన వచ్చినా పట్టివ్వకుండా తెలుగులో కలిసిపోవాలి ఇంత భాషాభారం తలమీద ఉండగా ఆయన నిశ్చింతగా భారతం ప్రారంభించా డనుకోలేం

ఆయన చింతామణిరూపంలోగాని ఇంకేరూపంలోగాని ఆంధ్రవాక్కును అనుశాసించి తీరాలి, అంతేకాదు, ఆయనపని —

మహారాజుతో 'నానేర్చు విధంబున నిక్కావ్యంబు రచించెద' అన్నాడు ఆయన 'ఉభయ భాషాకావ్యరచనాభిశోభితుడ'ని ఇదివరకే తెలుసుకున్నాము

అయినప్పుడు ఆయన, పూర్వచరిత్రమాత్రసారమైన ఇతిహాసాన్ని కావ్య మార్గంపట్టించి నీతిధర్మ బోధతో రసరమ్యం చేయదలచుకొన్నాడనేది స్పష్టం

ఇతిహాస, కావ్యవిభేదం పాటించక ఆయన అన్న 'కావ్యం అనేమాట గ్రంథసామాన్యార్థమే అనుకోవడం నన్నయహృదయం తెలియని అవివేక మవుతుంది

ఇక్కడ గమనించవలసినది ఇది —

నన్నయ ఆంధ్రవాక్కును కొంతవరకయినా అనుశాసించడం ఎంత అవసరమో—కావ్యధర్మం చెప్పడం గూడా అంత అవసరం తన వరకూ ఉన్న ఆలంకారిక మూర్ధన్యులు చేసిన అలంకార, గుణ, రీత్యాదివాదాలు అన్నీ తరచి చూచినవాడు కావ్యానికి రసం తప్ప ఇంకో ప్రాణవస్తువు లేదు అని గట్టిగా నమ్మినవాడు కనుకనే భారతాదిలో 'రసభావ భాసుర నవార్థ వచన రచనా విశారదులైన ముఖ్యకవు' అని మహాకవులైన, వారికి రసభావాలు ఎంత ముఖ్యమో పరోక్షంగా ఉగ్గడించాడు "ఉదాత్త రసాన్విత కావ్యనాటక క్రమములు" అని రాజుచేత అనిపించి నప్పుడు కూడా 'రసాన్విత' అన్న మాట నొక్కి చెప్పాడు కనుక ఆయనదృష్టిలో కావ్యానికి రసం పరమ లక్ష్యం ఆ లక్ష్యాన్నిగూడా ఎదుట ఉంచుకొని తన రచన సాగించ దలచు కొన్నాడు ఈ భావాలే, ఈ లక్ష్యమే చింతామణిలో సూత్రప్రాయంగా చెప్పా డనుకొన్నా మనం తగాదా పడనక్కరలేదు, నేడు ఆంధ్ర వైయాకరణ మూర్ధన్యులైన కొందరు పూర్వపరగ్రంథ సమాలోడనం చేసి —[1]

> విశ్వశ్రేయః కావ్యం
> తదదోషౌ పరిష్కృతౌచ వాగర్థౌ
> సా వాగ్యా రసవృత్తిః
> సాధ్యో హి రసో యథాతథం కవిభిః

అనే ప్రవచనం అది కవిదే అని నిర్ణయించడం త్రోసివేయదగ్గది కాదు నన్నయభట్టారకుని ఈనేపథ్యరచన అంతటిలోను నారాయణభట్టు హస్తనిక్షేపం విధిగా ఉందని మనం ఎంచవచ్చు

1 చూ చింతామణీ విషయ పరిశోధనం - వ సీ శాస్త్రిగారు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం - ఆంధ్ర వ్యాకరణ ప్రవక్తి

ఇక్కడ ఇంకొక చిత్రమైన ఊహ- ఇంతవరకు ఆంధ్రవిద్యల్లోకపు చింతనలోకి రానిదీ ఇంచుక ఆలోచించవలసినదీను —

అసలు వాల్మీకిరామాయణం బాలకాండ 5వ సర్గనుంచే ప్రారంభమనీ అంతకుముందున్న నాలుగు సర్గలూ వాల్మీకి ప్రస్తుతి పరములు కావడంచేత ఆ సర్గలు ఆయన శిష్యులుగాని మిత్రులుగాని ఎవరో వ్రాసి ఉంటారని ఆధునిక విమర్శకుల భావన

ఇది ఆధునిక విమర్శకుల ఆలోచనే కాదు, రామాయణ వ్యాఖ్యాత గోవిందరాజుకూడ-ముందు వాల్మీకిరచనే అని సమర్థింపజూచి తనకే తృప్తిలేక కాబోలు - 'సర్గత్రయ మిదం కేనచిత్ వాల్మీకి శిష్యేణ రామాయణ నివృత్త్యనంతరం నిర్మాయ వైభవ ప్రకటనాయ సంగమితం' అనడం జరిగింది ఈయన మూడుసర్గలు కావంటే- తక్కినవారు నాల్గవ సర్గకూడా కాదన్నారు

ఆ విధంగానే నన్నయగారి భారతాదిమభాగంలో 'రన కులబ్రాహ్మణు' అనేపద్యం మొదలు సుమారు 17 వరకు నారాయణభట్టు వ్రాసిఉంటాడని కొందరు అభిప్రాయపడ్డారు [1] ఎందుచేతనంటే 'నిత్య సత్యవచను' మత్యము రాధిపాచార్యు, 'కవి వరుండు,' 'నానారుచిరార్థసూక్తినిధి ఇత్యాది అనేక ఆత్మప్రశంసా వచనాలను నిరాడంబరుడు, లోకజ్ఞుడు అయిన నన్నయ తన ముఖతః పలికి ఉంటాడా అని వారి సందేహం -

నిజానికి - పురాణేతిహాసాల్లో కవులు స్వవిషయం ఉత్తమపురుషలో కాక ప్రథమ పురుషలో చెప్పడం మామూలు ఆ పద్ధతిలోనే నన్నయగారు వ్రాశారనుకున్నా ఆ స్వోత్కర్షావచనాలు ఎబ్బెట్టుగా ఉండక మానవు

కాబట్టి ఇష్టుడు సహాధ్యాయుడు అయిన నారాయణభట్టు ఆత్మీయతతో కలిగించుకుని వ్రాశాడన్నా పెద్ద అభ్యంతరం కనపడదు అయితే నన్నయ శైలితో అంతగా కలిసిపోతుందా ? అంటే ఇద్దరి సాహచర్యం అంత గాఢమైనది అంతేకాక అతడు నన్నయి అంతటి కవిరాజు నన్నయకే మార్గదర్శకుడు ఎర్రన కవితయే నన్నయపోలిక అంలగా సంతరించుకున్నపుడు ఈ ఊహ ఆకాశహర్మ్యం అనుకోనక్కరలేదు కనుక ఇది ఆలోచించదగ్గ విషయం ఒక్క కవిత్వంగిణికర్త మాత్రమే ఈ ఊహను వ్యక్తం చేశారు

1 చూ ఆంధ్రకవిత తరంగిణి - నన్నయ ప్రసక్తిలో -

దీనివల్ల లాభం ఏమిటంటే - ఆనాటి పరమవివేక భాషితసభలముందు రాజసభలోను నన్నయగారిని ఆత్మస్తుతినుంచి తప్పించడానికే- అనుకోవచ్చు

ఇంక ఉపోద్ఘాతంలోని రెండుపద్యాల్నీ వ్యాఖ్యానిస్తే చాలా సత్యాలు బయట పడతాయి

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కవితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యెఁ జగద్ధితంబుగన్"

ఈ పద్యం నారాయణభట్టు వ్రాశాడనుకున్నా నన్నయగారే వ్రాశారని విశ్వసించినా - ఇందులో తెనిగించదలచిన భారత రచనా ప్రణాళిక రేఖారూపంగా ఉన్నట్టు స్పష్టపడుతుంది

"నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్" అనేది ఈ పద్యంలో ప్రధాన వాక్యం

ఆంధ్రలోక హితం కోసం నన్నయభట్టు తెలుగు భారతాన్ని తీర్పుగా కూర్చడానికి ఆసక్తుడు అయినాడు వేదంవంటి పవిత్ర భారతాన్ని తెనుగులో తీర్చిదిద్ద దలచినాడనికూడా అర్థం వస్తుంది అయితే ఈ కూర్పు ఎలాంటిది ? వ్యాసుడు ప్రపంచానికి ఏ ప్రబోధం చేయదలచుకొన్నాడో దానికి భంగం కలగకుండా - భారతం తెలుగువారి సొత్తు ఆయేలా రచించడానికి బద్ధకంకణుడు అయాడు ఈ మహోద్యమంలో మూడు లక్ష్యాలు నెరవేరాలి 1 విచక్షణులయిన కవీంద్రులు తాను నిర్మింపదలచుకొన్న ప్రసన్నకథా కవితార్థయుక్తులను బుద్ధిలో బాగా విచారించి మేలు అనాలి 2 అంత లోతులకు వెళ్ళి పద పదార్థ రహస్యాలను అందుకోలేకపోయినా సామాన్యులు పద్యంనడకలోని హాయిని నాదసౌందర్యాన్ని ఆస్వాదించాలి 3 అంతేకాదు- వాటితోపాటు రుచిరార్థములు సూక్తులు సమృద్ధిగా ఉంచగలిగినవాడు

ఈ లక్ష్యాలలో అతిముఖ్యమయినది మొదటిది ప్రసన్నకథా, కవితార్థ యుక్తి అన్నమాట - మూలభారతంలో అతి గహనంగా ఉండేకథ ఇందులో ప్రసన్నంగా ఉంటుంది - అంటే అక్రమబోధకం అన్నమాట-ఈ ప్రయత్నంలో

సూటిగా నడిచే కథాసూత్రానికి అడ్డుతగిలే గ్రంథం పరిహరింప బడుతుంది ఇక రెండవది కవితా ప్రసన్నత భారత మహాప్రవాహంలో కవితకు ప్రాధాన్యం లేదు అది ఇతిహాస నిర్వహణ పరమైనది ఇందులో అట్లాకాదు - రస రామణీయకానికు పట్టయినచోట కవితాకళ చిరునవ్వుతో ప్రత్యక్ష మవుతుంది అది రచన చాతుర్యంలో, పాత్రపుష్టిలో, వర్ణన నైపుణ్యంలో రూపక కల్పనతో సాక్షాత్కరించవచ్చు దీనివల్ల ఇతిహాస వాసన మాటుపడి కళావిస్ఫూర్తి విరబారుతుంది దానితో మహారచన చదివేటప్పుడుండే విసుగు వేసటలు దూరమై రసాభిరతులు చేరువవుతారు పఠనాసక్తి పెరుగుతుంది 'కవీంద్రులులో నారసి మే లనడ మంటే ఇదే - తర్వాతిది అక్షరరమ్యత - అంటే శబ్దాలంకార గుంఫనం కాదు రచనలోని శబ్ద సంగీతం ఇది శ్రవణ మాత్ర మనోహర మైనది దీనివల్ల పాఠకులను ముందు లోబరచుకుంటే తర్వాత వారే అర్థపరిశీలనాపరులు కావచ్చు ఇది పద్యం వ్రాసినంత మాత్రంచేత పట్టుబడదు పద్యవిద్యవల్ల సాధ్యమవుతుంది దాన్ని పద్యవిద్యకు ఆద్యుడైన ప్రచేతసపుత్రునివల్ల తాను సుసంపన్నంగా సంపాదించి ఉంచాడు ఆ పైని రుచిరార్థాలూ, సూక్తులూ ఉండనే ఉంటాయి రుచిరార్థం అంటే - భావ చమత్కారం కావచ్చు అర్థ చమత్కారంకావచ్చు సూక్తికల్పన లోకానుభవసారంగా చెప్పేలోకోక్తులలో, నిక్షిప్తమై అడుగడుగునా పాఠకు లకు ఇంపు గొల్పుతుంది ఈ ప్రణాళికతో రచనా సామగ్రితో ఆయన భారతాంధ్రీ రణకు పూనుకున్నాడని - ఆలోచిస్తే తెలుస్తుంది

ఇక్కడ ఒకమాట - 'ప్రసన్న కథా కలితార్థ' అన్నపాఠంతో ఎంతో గ్రంథం పెరిగి సిద్ధంగా ఉన్నమాట నిజం కాని ఉస్మానియావారి బహుపాఠ దర్శనంతో 'కలిత' కాదు 'కవిత' అని నిర్ధారణ అయింది [1] బహుపాఠ బలమే కాకుండా అర్థసౌ ష్ఠ్యంకూడా ఉండడంవల్ల కవితాపాఠమే అంగీకార్య మైంది పరిశీలించి చూడగా - "లలితపదం 'ప్రసన్నకవితా' గుణమిల్లదె" అన్న పంపన్న పద్యపాదంలోని "ప్రసన్న కవితా" అన్నమాట నన్నయగారి సొప్పరకం అయినా కావచ్చు

---

1 చూ ఉస్మానియా భారతం పుట 8 1911 లో అచ్చుపడిన మణన రంజని ముద్రాలయ గ్రంథపాఠమూ ఇదే -

అనువాదం కాదు

మన దేశంలో ఇంగ్లీషు స్కూళ్లు వెలసిన నాటినుంచీ అందులో చదివే విద్యార్థులకు Translation ఒక ముఖ్య విషయ మయింది ఇది దొరతనం వారు తమ పరిపాలన సౌలభ్యంకోసం ఏర్పరిచిన ప్రక్రియ దీన్ని బోధించే వారు బహుళంగా ఆంగ్లోపాధ్యాయులు వారు దీనికి అనువాదం అని పేరు పెట్టి వ్యాప్తిలోకి తెచ్చారు దాన్ని పండితులూ, అపండితులూ నిశ్చింతగా వాడడం ప్రారంభించారు వారి పరిధిలో ఆ మాట తప్పుకాదు అనువాదం అంటే అనుసరించి చెప్పడం, అది వారు చేస్తూన్నదనే - కాని సంస్కృత గ్రంథాలను తెనుగులోకి పరివర్తించిన పనికికూడా ఆ పేరు పెట్టడం అనుచితం

ప్రముఖ తెలుగుకవీ ఏ సంస్కృతగ్రంథాన్నీ అనువదించలేదు తెనిగించారు, లేక ఆంధ్రీకరించారు తెనిగించడం అనువదించడం ఒకటి కాదు ఈ ఎరుక వారికి సమగ్రంగా ఉంది కనకనే నన్నయ మొదలు శ్రీనాథుని వరకు ఎవ్వరూ ఈ అనువాదమనే మాటను ఎక్కడా వాడలేదు

రాజరాజు 'భారతబద్ధ నిరూపితార్థమును తెనుగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్' అన్నాడు సంస్కృతం బాగా వచ్చినవాడు ఆ అర్థాన్ని తెలుగులో అక్రమంగా కళ్ళుమూసుకు చెబుతాడు దానికి 'అధిక ధీయుక్తి' అక్కరలేదు ఈ మాట ఏదో సాభిప్రాయంగా అన్నట్టు ధ్వనిస్తుంది దీనికి నన్నయ 'నానేర్చు విధంబున రచియించెద' నన్నాడు 'సారమతి' పద్యంలో కూడా నన్నయభట్టు 'రచన బంధురుడు' అయాడనే అన్నాడు అనువాదమే అయితే రచన అనేమాట అర్థవంత మవుతుందా ?

పోనీ - తిక్కనగా రేమన్నారో చూద్దాం విరాట పర్వాదిలో 'నన్నయభట్టు దక్షతన్ మూడు కృతులు ఒనర్చెను' అన్నారు తాను హరిహర దేవునిమాటగా 'భారత మను పేర బరగు పంచమవేదంబు తెనుగుబాస వినిర్మింప దివురుట' అని పేర్కొన్నారు

శ్రీనాథుడుకూడా 'కాశికాఖండ మను మహాగ్రంథ మేను తెనుగు జేసెద' అన్నాడు శృంగార నైషధ పీఠికలో కృతిపతి 'నైషధ సత్కావ్య మాంధ్రభాష నవఘ! యొనరింపు నాపేర నంకితముగ' అంటే ఈయన

'అమ్మహాప్రధానునిం గృతి నాయకుం జేసి నైషధకావ్యము చెప్పందొణంగితి' అనే 'దగ్జాగా' స్వీయకృతి గా చెప్పుకున్నాడు

వీరికి అనువాదమనే మాటరాదా? వస్తే అర్థం తెలియదా? ఎందుకిట్లా ఏదో సంస్కృత రచనను పట్టుకుని స్వంతరచనలా మాట్లాడుతారు? అంటే - దాని అర్థం పూర్తిగా తెలుసును గనకనే వారామాటను ఉపయోగించలేదు

'అనుసృత్య వదతి అనువాదః అని దాని వ్యుత్పత్తి' వారే గ్రంథాన్నీ చేతులు కట్టుకుని అనువదిస్తూ వ్రాయలేదు మూలంలోని హృదయాన్ని గ్రహించి దానికి చిలవలూ పలవలూ తొడిగారు, మెరుగులు పెట్టారు అవసరమైన చోట్లల్లా నిర్భయంగా మార్చివేశారు జీబుగా ఉన్నదాన్ని సరికివేశారు ఒక్క మాటలో చెప్పవలసి ఉంటే - సంస్కృతం మాటను తెనుగమ్మ ఒడిలోకి చేర్చారు ఆమె స్వంతం చేశారు ఇది చేతగాని ఆధునికులు తెనుగు బంగారాన్ని సంస్కృతంలో కూరేశారు

అనువాద మనే మాటను సరిగ్గా వాడవలసిఉంటే ఇలా వాడాలి 'అనువదతి శుక స్తే మంజువాక్ పంజరస్థః' చిలకపలుకును కాళిదాసు అనువాద మంటాడు

"శ్రాయ స్వేత్యనువాద ఏవ భువనః శ్రాన్తైః బద్ధప్రవర్తే" 'అనువాదః ఏవ పునరుక్త మే వేప్యర్థః' -

ప్రతాపరుద్రీయంలో అనువాదమంటే - అన్నదాన్ని తిరిగి చెప్పడమే అని వ్యాఖ్యాత వ్రాస్తాడు

ఫలితార్థ మేమంటే - నకలుగా వ్రాసినదాన్నే అనువాద మనాలి నన్నయాదులవి నకళ్ళుకావు కాబట్టి వాటిని అనువాదం అనడం అంధ పరంపరాన్యాయం

శ్రద్ధగా చదివి చూస్తే నన్నయిగారు అనువాదం చెయ్యలేదు తెలుగులో మొలిచినట్టు భారతం వ్రాసి 'ఓహో' అనిపించుకున్నారు

తిక్కన్న పోతనార్యులుకూడా విజృంభించి భారత భాగవతాలను తెలుగువాళ్ల సొమ్ము చేశారు సంస్కృత గ్రంథాలను ముంచిపోయేటంతగా తెలుగులో చవులూరించి చదివించారు

మొలక మళ్ళా గింజలోనుంచే రావాలి అప్పుడే అది చివురు లెత్తి ననలు తొడుగుతుంది పరిమళాలు చిమ్ముతుంది

నన్నయాదుల తెలుగురచనలు మళ్ళా గింజలోనుంచి పునర్జన్మ ఎత్తాయి విరిసి విరులై గుప్పున పరిమళించాయి ఈ యదార్థాన్ని గ్రహించిన మనం ఈవైపెని నన్నయగారు నిర్మించిన భారతోద్యానంలోకి అడుగుపెట్టి ఆ సువాసనా సంపదను చూరగొందాము

నన్నయగారి మహారచనకు ప్రాణభూతములై నిలిచిన ప్రబలశక్తులు రెండు

ఒకటి – తనవరకు శాఖోపశాఖలుగా సర్వాంగీణ సౌందర్యంతో పెరిగి పటిష్ఠమైన సంస్కృత సాహిత్యం

రెండు – తనకు ముందే సుమారు ఒక శతాబ్దినుంచి అన్ని హంగుల తోనూ స్థిరరూపం సాధించిన కన్నడ సాహిత్యం

నందంపూడి శాసనాన్నిబట్టి ఆయన అసలు పేరు నన్నియ - నారాయణ భట్టు పేరుకూడ నన్నినారాయణ అనే అందులో ఉంది నన్ని అంటే కన్నడంలో 'సుందర' అని అర్థమట - కనుక వీరు కన్నడదేశంనుంచి వచ్చి తెలుగుదేశంలో స్థిరపడ్డ కవులని స్పష్టపడుతుంది [1]

తెలుగునేలనుంచి కన్నడానికి వెళ్ళి పంపన్న కన్నడభారతం వ్రాస్తే కన్నడం నుంచి తెనుగు భూమికి వచ్చి నన్నియ తెలుగు భారతం వ్రాయడం ఒక విధి విలసినంతగా కనబడుతుంది

నన్నియ, నన్నినారాయణులు తమ కన్నడ కవితా సుపరిచితిని, ప్రౌఢ దర్శనాన్ని - సంస్కృత కవితాబలంతో జోడించి తెలుగు కవితలో ఒక నవాభ్యుదయాన్ని విజయవంతంగా సాధించారు తదనుగుణంగా మూలభారతం వ్యాసునిదైనా తెలుగుభారతంలో వాల్మీకి, కాళిదాస, భారవి, మాఘు, బాణాదుల భావచ్ఛాయలూ, పంపాదుల కవిత్వపు నీడలూ దోబూచులాడుతూ కనిపిస్తాయి 'కెలసం' వంటి మాటలు అప్రయత్నంగా ప్రవేశించాయి ఉత్పల, చంపక, కందాదులూ, కన్నడస్నేహ ఫలితమే అనిపిస్తుంది

---

1 వీరు మైసూరు ప్రాంతం నుంచి వచ్చినవారవి కొందరు పరిశోధకులు –

కవితా సుగంధం

లోకోత్తర వర్ణనానైపుణ్యం గలవాడే కవి అని అలంకారశాస్త్రం అనడమే కాదు మనకూ అట్లాగే అనిపిస్తుంది "దర్శనా ద్వర్ణనా చ్చాథ రూఢా లోకే కవిశ్రుతిః" ముందు లోకాన్ని ప్రకృతినీ మామూలు రెండు కళ్ళతో కాదు మూడోకన్ను తెరచి చూడాలి అంటే అణువునుంచి అంతరంగ రహస్యాల దాకా గాలించి చూడాలి చూచినదాన్ని మననం చేసి చేసి ఎదుటి మనస్సుకు సాక్షాత్కరించేలాగు, గుండెకు తగిలేలాగు, తల ఊచేలాగు చెప్పాలి ఈ శక్తినే ప్రతిభ అన్నారు ఎంత వ్యుత్పత్తి ఉన్నా ప్రతిభ లేనిదే కవిత్వం రాణించదు చప్పబడి జారిపోతుంది

నన్నయగారికి వాగ్దేవతా కటాక్షంవల్ల ఈ రెండూ సమృద్ధిగా ఉన్నాయని ఆయన భారత భాగం చదివితే తెలుస్తుంది

ఆయన భారతాంధ్రీకరణం వేదవ్యాస జన్మంతో ప్రధానంగా ప్రారంభమై - శంతనుకథ, భీష్మజననం, వ్యాస ప్రసాదంగా ధృతరాష్ట్ర పాండురాజుల పుట్టుక, కర్ణజననం మృగయావినోదంలో శాపోపహతుడైన పాండురాజుకు కుంతి దేవతావరాలవల్ల పంచపాండవుల సంప్రాప్తి కౌరవుల పుట్టుక, పాండురాజు మరణం, కుంతి పుత్రులతో హస్తినాప్రవేశం, కురు పాండవుల రవరవలు, లక్కయింటికథ ద్రౌపదీ స్వయంవరం సుభద్రా పరిణయం, పాండవుల ఇంద్రప్రస్థ నివాసం ధర్మరాజు రాజసూయంతో, దుర్యోధనుని అసూయా పరమావధి, జూదపుకథ, పాండవుల ఓటమి, ద్రౌపదీ వస్త్రాపహరణం పునర్ద్యూతం, వనవాసప్రాప్తి, ఇత్యాదులతో నడచి అరణ్యావాసంలో పాండవులు హిమవంతం మీద ఉండగా భీముడు కొండచిలువ రూపంలో ఉన్న నహుషునకు పట్టుబడి ధర్మరాజుచేత విడిపించబడడం దాకా సాగి - తర్వాత వర్షాశరద్వర్ణనాలతో ఆగిపోయింది మధ్య మధ్య ఉదంక, యయాతి దుష్యంత, నల తపతీ సంవరణోపాఖ్యానాదులు ఉపకథలుగా వస్తాయి ప్రధానకథలోగాని, ఉపకథలలోగాని, నన్నయభట్టారకుడు మక్కీకి మక్కీగా ఎక్కడా మూలభారతాన్ని అనుసరించడం జరగలేదు

అద్భుతమైన అజంతాచిత్రాలకు గుహాకుడ్యాలు ఆధారమైనట్టు నన్నయ లోకోత్తర కవితాపరిచాలనానికి వ్యాసభారతం ఆధారం మాత్రమే

...తెగొప్పో గొప్ప అయినా కుడ్యం ఆధారం లేనిదే తన కుంచెనుగాని, రంగునుగాని కదిలించలేడు ఆ ఆధారం అతనికి ప్రేరణ యిస్తుంది ఉత్సాహ మిస్తుంది భావుకతను పరుగు లెత్తిస్తుంది అను ఆ కుడ్యం మీద అతనికి ఎనలేని గౌరవం పూజ్యభావం

అట్టి పూజ్యభావమే ఆయనకు వ్యాసభగవానునిమీద ఉంది ఆయన వలెనే మనకూ ఉంది అయితే ఆ వ్యాసభారతానికి నమస్కరిస్తాము తెలుగు భారతాన్ని గుండెల హద్దుకుంటాము వ్యాసుడు సంస్కృతంలో చెప్పిన కథనుగాని, కవితనుగాని, అట్లాగే అచ్చుకొట్టినట్టు వ్రాస్తే ఆయన హృదయం తెలుగులో ఖంగున పలకదు దాన్ని గ్రహించి జీర్ణించుకొని తెలుగులో పలికించే కళ వేరుగా ఉంటుంది అది నన్నయకు వెన్నతో పెట్టిన విద్య ఈ భారతాన్నే ఆధునిక కవి సార్వభౌము లొకరు ఒక్క చేతిమీదుగా తెనిగించారు యథామాత్రృకం అనికూడా అనిపించారు కవిత్రయ భారతంమీద ఎక్కలేదు ఎవరికీ నయించలేదు గాబోలు దాన్ని తిరిగి అచ్చు వేసేవారుగాని, స్మరించే వారుగాని లేకపోయారు ముమ్మొందు నన్నయ పద్యాలకు సరియైన వారి పద్యాలను ఒకటి రెండు చూడబోతున్నాము

చమత్కార మేమిటంటే—

మనమంతా ఉత్సాహంగా ఉల్లాసంగా నన్నయ భారతభాగంలోనుంచి చదువుకునే ఏ సుప్రసిద్ధ పద్యానికీ భారతంలో మూలం ఉండదు ఉంటే రేఖా మాత్రమైన సంస్కృతభావం - లేదా స్వతంత్ర భావస్ఫూర్తి - నన్నయ రచనలో గజ్జెలుగట్టుకొని నృత్యం చేస్తుంది

భట్టారకులు మొట్టమొదట భారతంలో అద్భుతమైన వసంతాన్ని దర్శించారు గ్రీష్మాన్ని అవలోకించారు వర్షాన్ని తిలకించారు శరత్తును పర్యాలోకించారు ఈ ఆయన హేమంతాన్ని చూడలేదు శిశిరాన్ని కను గొననేలేదు

'సుధాంశు వికీర్యమాణ కర్పూర పరాగ పాండురుచి పూరితమైన' అనంతాంబరంలో లీనమై పోయారు ఆయన ఆంధ్రకవితా మహోదయాని కిచ్చిన అమోఘ ఆశాస్యం ఇదా ?

తెనుగు కవితా మహోత్సవం శరత్ప్రకాశంతో మలుపు తిరుగుతుందా ? త్రోవ మార్చుకుంటుందా ? ఎంత శిశిరపాతంలోనైనా మూగిన పొగమంచును చీల్చుకొని బంగారుకణికలవంటి నాలుగు సుభగసూర్యకిరణాలు రాక పోతాయా ? వస్తాయి, తప్పదు !

పాండురాజు మృగయా వినోదంలో శాపగ్రస్తుడైన తర్వాత దైవత ప్రసాదంవల్ల పంచపాండవులూ (ముగ్గురు కౌంతేయులూ, ఇద్దరు మాద్రే యులూ) పుట్టారు

ఋతువులు

అప్పుడు వసంతం వచ్చింది ఊపిరి సలపని ఉత్పాతంలా - యౌవనం లోని మోహ పారవశ్యంలా -

మూల భారతంలో కవి 'సుపుష్పితవనే కాలే కదాచి న్మధుమాధవే భూత సంమోహనే రాజా సభార్యో వ్యచర ద్వనమ్' అని ప్రారంభించి - "సమీక్షమాణ స్స తు తాం వయస్థాం తను వాససమ్ తస్య కామః ప్రవవృధే గగ నేఽగ్ని రివోత్థితః "అనే మాటలతో ఒక వార్తలా చెబుతాడు కాలక్రమంలో ఒక ఋతువు వచ్చింది అంతే—

ఈ వసంతానికి కథలో అమోఘమైన ప్రయోజనం ఉంది పాండురాజు వసంత ప్రోద్బలంతో మాద్రిని ముట్టకపోతే అతడు నిరంతర తపశ్చర్యలో అక్కడే ఉండిపోయేవాడు పాండుపుత్రు లేమవుతారు ? పత్ని లేమవుతారు ? వారు మునికుమారులుగా, వీరు మునిపత్నులుగా మిగిలిపోతారు

అట్లా అయితే ఇంక భారత మేముంది ?

అప్పుడు వసంతం పాండురాజును అమరసీమలకుపంపి పాండవులను తల్లితో హస్తినకు సాగనంపింది ఈ కథా పరివర్తనాన్ని - అనూహ్య పరిణా మాన్ని కనులు మిరుమిట్లుగొల్పేలా రూపుకట్టించాలి

నన్నయ చురుకైన గంటం పచ్చని తాటాకు మీద ఇట్లా కదిలింది —

కమ్మని లతాంతములకు మ్రొనసివచ్చు మధు
పమ్ముల సుగీతనినదమ్ము లెసగం జూ

తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి వకు
ళమ్ములను నానుచు ముదమ్మొనర వాచా
లమ్ములగు కోకిల కులమ్ముల రవమ్ము మధు
రమ్మగుచు వీచె ననిళమ్ము సుమనో భా
రమ్మున నశోకనికరమ్ములును జంపక చ
యమ్ములును గింశుక వనమ్ములును నొప్పెన్
ఆది పంచ 138

చందన తమాలతరులందు నగరుద్రుమము
లందు గదళీవనములందు లవలీ మా
కంద తరుషండములయందు ననిమీల దర
వింద సరసీవనములందు వనరాజీ
కందళిత పుష్పమకరంద రసముం దగులు
చుం దనువు సౌరభమునొంద జనచిత్తా
నందముగఁ బ్రోషితుల డెందము లలందురగ
మందమలయానిల మమందగతి వీచెన్॥ ౫ 139

మొదటి పద్యంలో మధుకర సంగీతం కోకిలా లాపాలు పుష్పభారాలు వచ్చాయి రెండవ పద్యంలో శైత్య మాంద్య సౌరభ్యాలతోకూడిన మంద మలయానిలప్రచారం ఉద్దీపించింది వసంతం అంతా విరబోసుకుని ప్రత్యక్షమయినట్టుంది ఊపిరాడని ఈ ఉద్దీపనంలో 'పాపం పాండురాజు ఏంచేస్తాడు ?'

ఈ స్ఫూర్తి, అనుభూతి, చిక్కదనం ఎక్కడుంది ? అంటే - ఎన్నుకున్న లయగ్రాహివృత్తంలో ఉంది తీసుకున్న ప్రాసల దూకులో సుకుమారంగా కూర్చిన పదబంధ సాంద్రతలో, ఈ ఇంద్రజాలమంతాఉంది గొప్పకవి-

మాటలతో బంతులాడే అపూర్వ ఐంద్రజాలికుడు అంటే తప్పుందా ?

అప్పుడు రాజు ఎదుట ఉన్న మాద్రిరూపు నన్నయగారు స్వయంగా తీర్చిదిద్దినది ——

"చారు సువర్ణహాసి నవచంపకభూషయు సింధువార ము
క్తా రమణీయయున్ వకుళదామ వతంసయునై యపూర్వ శృం

గార పిలాంఁలీల యెసఁగం దనముండటఁ నున్నమాద్రి నం
భోరుహనేత్రఁ జూచి కురుపుంగవుఁ డంగజరాగ మత్తుడై '

ఆది పంచ 141

ఈ మాద్రి రూపకల్పనలో కాళిదాసు కుమారసంభవంలోని పార్వతి పుష్పాలంకార వైభవం సుప్పష్టంగా తన్న భూషణాలుగా తొంగిచూస్తుంది అక్కడ మదనాంతకుడు ఇక్కడ మదనోపహతుడు! అంతే తేడా - సందర్భానికి తగిన ఛట్టాంకుని సురుచిర వ్యాఖ్యానమా? ఇది —

గ్రీష్మం

ఖాండవవన దహన సందర్భంలో గ్రీష్మం ప్రసక్తం అయింది అర్జునుడు కృష్ణునితో 'కృష్ణా! వేడి రోజులు వచ్చాయి యమునా నదికిపోయి హాయిగా క్రీడిద్దాం' అంటాడు ఇక్కడ సంస్కృతం మూడు ముక్కల్లో ఉంది

'కృష్ణ! ఉష్ణాని (దినాని) వర్తంతే యమునాం ప్రతి గచ్ఛావః' ఇక్కడ ఏ పురాణకవికీ పద్యం అక్కరలేదు వచనంలో రెండు ముక్కలని దాటిపోవచ్చును

ఎన్నయ కవి ఆ గ్రీష్మం వేడినీ, యమునా క్రీడనూ చెప్పకుండా ముందుకు పోలేదు

ఉరుతర దావపావక శిఖోత్కలిత ప్రభలుఁ బుష్పసితే
తరగతి తీవ్రతిగ్మకరధామ సహస్రములున్ బహు ప్రవా
హరహిత నిమ్నగా తతులునై కడుదీర్ఘములై నిదాఘ వా
సరములు సర్వజీవుల కసహ్యము లయ్యెను దారుణంబులై "

ఆది అష్ట 230

'కార్చిచ్చుతో కూడిన గాడుపులు ఎర్రని ఎండలు వట్టిపోయిన నదులు పొడవైన పగళ్లు దుర్భరములుగా ఉన్నాయి' ఇది చక్కని స్వభావోక్తి అయితే - ఈ పద్యంలోని మొదటి రెండవ పాదాలలోని ద్విత్వ మహాప్రాణ వర్ణాల కూర్పు, గ్రీష్మ తీవ్రతకు వ్యంజకమై ఆ ఋతువును ప్రత్యక్షం చేస్తున్నది ఇక యమునా విహారం—

అర్జునుడే అంటాడు—

"జలరుహనాభ ! రమ్యగిరిసానువనంబుల వేటలాడుచున్
సలుపుద మీ నిదాఘ దివసంబులు నీవును నేను - ఉన్మిష
న్నలిన రజస్సుగంధి యమునాప్రవాద తుంగితరంగ సంగతా
నిల శిశిర స్థలాంతర వినిర్మిత నిర్మల హర్మ్యరేఖలన్"-232

'కృష్ణా ! ఈ వేసవిలో కొండచరియలమీద వేటలాడుతూ విచ్చి పుప్పొళ్లతో పరిమళిస్తూ యమునా తరంగాలు చల్లబరచిన ప్రాసాదాల్లో గడుపుదాము'

పద్యం చంపకం రెండు పాదాలు పొడి పొడిగా వేసవిలో వేటగురించి చెబుతాయి అందులో విశేషం లేదు అక్కడినుంచి వెళ్లి ప్రాసాదాల్లో విహరించడంలోనే ఉంది విశేషమంతా

మూడవ పాదంనుంచి ఎత్తిన సమాసం భూమినుంచి పై అంతస్తులకు ఎగిరిపోయే విమానస్ఫూర్తి కలిగిస్తుంది ఆ యమునా తరంగాల సుగంధ మారుతాలు తగిలి చల్లనైన భవనాల్లో తిరిగే అనుభవం ఆ సుకుమారమైన శబ్దాలకూర్పువల్ల కలుగుతుంది ఈ అనుభూతి సృష్టియే ప్రసన్నకథా కవితార్థయుక్తి దీన్ని కవీంద్రులు లోనారసి మేలు అంటారు ఇతరులు, తుంగ తరంగ సంగతానిలాలకూ వినిర్మిత నిర్మల హర్మ్యరేఖల అక్షరరమ్యతలకూ, మురిసి పోతారు

ఇక్కడ వర్ణనచాతుర్యమే కాదు చక్కగా కథలో కలిసిపోయే ఔచిత్యం ఉంది వేసవిలో అడవులు ఎండి ఉంటాయి వాటిని చూడగానే అగ్నికి నోరూరుతుంది అట్లా ఖాండవ దహనం జరిగింది అరణ్యపర్వం నాలుగో ఆశ్వాసంలో వర్షాశరత్తులు జంటగావస్తాయి

వర్షాశరత్తులు

ప్రకరణం ఇది ధర్మరాజు, అజగరవేష్టితుడైన భీముణ్ణి, అజగర రూపంలో ఉన్న నహుషుని ప్రశ్నలకు సరియైన సమాధానాలుచెప్పి సంతోష పెట్టి విడిపించి తెచ్చాడు అప్పుడు గ్రీష్మతప్తుడైన ప్రాణికి వర్షం కురిసి నట్టుంది - సరిగా వర్షర్తువు అప్పుడే వచ్చింది 'శోషితములైన వనాంతర తరుతతి కాప్యాయనకరమై వర్షాగమంబు ఒప్పె బెడగరయ్యెన్'

"నాలుగు వలకుల నవఘన
జాలంబులు వ్రాలి కురిసె - ఝంఝానిల వే
గా లోలములై బహుళ
స్థూల పయోధారలోలి తుములంబులుగన్"
ఆం ణ్యా చతు 134

ఒకటిన్నర చరణాలలో ప్రధానవాక్యం ఉంది తర్వాతి రెండున్నర పాదాలలో నన్నయగారి తుములమైన కవిత ఉంది బహుళ స్థూల పయోధారలు ఝంఝానిల వేగాలోలములై మనల్ని వణకిస్తాయి ఎంత స్థిరంగా ఉంచుదామన్నా మలను ఊపిస్తాయి,

ఆయన శిల్పానికి పరాకాష్ఠ ఈ పద్యం—

"దళిత నవీన కందల కదంబ కదంబక కేతకీ రజో
మిళిత సుగంధ బంధుర సమీరణుడన్ సఖుఁ డూచుచుండఁగా
నులియుచు మొల్లగుత్తులను నుయ్యెల లొప్పుగ నెక్కియూగె ను
ల్లల దళినీకులంబు మృదుల ధ్వని గీతము విస్తరించుచున్"
ఆం 137

కవి రంటముతో గీచిన గొప్ప వర్ణచిత్రం! వర్ణ మనే మాటను అక్షరం, రంగు అనే రెండర్థాలలోను ఉపయోగిస్తున్నాను

ఈ బొమ్మ చూడండి—

వర్ణధారలచే పచ్చగిల్లిన అరణ్యసీమ, తెల్లని మొల్లగుత్తులు విరబూచి వ్రేలాడుతున్నాయి నల్లిగా నిగనిగలాడే ఆడుతుమ్మెదలు ఆ తావికి మనసుపడి వాటిమీద కూర్చున్నాయి

విచ్చుకొన్న నేలఅరటి మొలకల, కడిమిపూల, మొగలివిరుల, రంగు పుప్పొళ్లు దండిగా మీద పూసుకొని గడుసు గాలిపిల్లడు ఉయ్యాలవలె ఆ మొల్లగుత్తులను ఊచుతున్నాడు ఆ సంతోషంలో తోటిమగువలు సన్న సన్నని పాటతో ఊగుతున్నారు

పొడుగాటి చింతచెట్లకు ఊయలలు కట్టుకొని అడవిలో (కొండజాతి) గదబపిల్లలు వాటిమీద కూర్చుంటే - హుషారుగా మగపిల్లలు వారిని

ఊచుతారు వారు పట్టరాని తమకంతో పాటలు పాడుతారు ఆ దృశ్యం కళ్లకుకట్టినట్లుంది

ఈ దృశ్యకల్పన ఎన్నయగారి మధురభావనకు పరసీమ అదొక్కటే కాదు - అక్షర రమ్యతా రూపమైన ఆయన శబ్ద సంగీతానికి పరాకాష్ఠ సాధారణంగా ఈ నాద సౌందర్యం లేని ఆయన పద్యం ఎక్కడా కనపడదు

మొదటి పాదంలోని దళిత, దళ, కదంబ కదంబకాలు రెండవ పాదం లోని సుగంధ బంధురాలు మూడవ నాల్గవ పాదాలలోని లకార అసకృదా వృత్తి శబ్దాలంకార ప్రియుని చాపల్యంలా తేలక భావ సౌందర్యంతో విడదీయరానంతగా పెనవేసుకుపోయి ఆ స్వాదసఖానికి మరింతగా తోడ్పడు తుంది ఆయన వేరొకచోట అన్న 'రసగీతరవం' అన్నమాట అక్షరాలా జ్ఞాపకం వస్తుంది

దీన్ని అనుకరించబోయి తక్కిన కవులు చాలామంది భంగపడ్డారు ఆయన 'వచః శ్రీ' కే అది పెట్టని నగ !

వర్షం వెంటనే శరత్తు వచ్చింది !

ఆ శరత్తు ఎట్లా వచ్చింది ?

"భూపతికిం దివంబునకుఁ బొల్పెసగంగ శరత్సమాగమం
బాసకల ప్రమోదకరమై విలసిల్లె మహర్షి మండలో
పాసిత రాజహంసగతిభాసి ప్రసన్న సరస్వతీక మ
జ్జాసనశోభితంబగుచు నబ్జజుయానముతో సమానమై"

ఆర చతు 140

'భూపతికిం దివంబునకు పొల్పెసగగా' దర్శన మిచ్చింది నిజానికి రెండిటికీ రెండు పద్యాలు వ్రాయాలి కాని - భట్టారకునకు ఇక్కడ ఒక చమత్కారం చెయ్యాలని తోచింది శబ్దశక్తివల్ల రెండింటి శరచ్ఛోభను ఒక్క పద్యంలో సాధిస్తే చమత్కారాతిశయం రాదా అనిపించి ఉండాలి

సాధారణంగా భట్టారకులు శ్లేషను వాడరు ద్వితీయాశ్వాసం సముద్ర వర్ణన సందర్భంలో బాణకవి ఫక్కిలో మూడు ఉపమాశ్లేషలు వాడారు

ఇట్లాంటివి ఇంకొకటి రెండుచోట్ల ఉండవచ్చు కాని దానిమీద ఆయనకు మోజు లేదు

ఈ శరద్వర్ణనంలో భూదివములకు వచ్చిన శోభను శ్లేషబలంతో నిర్వహించారు

"రెండంశాలను" శ్లేషశక్తితో జోడించి ఒకే ధోరణిలో నడపడానికి ఈయనపద్యం త్రోవచూపించా? అనే అనుమానం కలుగుతూ ఉంటుంది

తర్వాత రాఘవపాండవీయాలు హరిశ్చంద్రనలో పాఖ్యానాలు తెలుగు సారస్వతంలో వదులమీద ఉప్పతిల్లాయి

ఇక ప్రకృతం —

ద్యావాపృథువులు భర్త, భార్య అని సంప్రదాయం ఇక్కడ ఇద్దరికీ శరత్తువల్ల పొలుపు వచ్చింది

1) భూమిలో అది సర్వులకూ ప్రమోదకరం అయింది మహర్షి మండలం శ్రద్ధగా ఉపాసించే శుద్ధబ్రహ్మతత్త్వంలా ఉంది నదులన్నీ స్వచ్ఛంగా ఉన్నాయి వాటిలో తామరపూలు చక్కగా వికసించి ఒప్పులొలుకుతున్నాయి బ్రహ్మవాహనమైన హంసలా శుభ్రశోభను వెదజల్లుతూ ఉంది

2) ఆకాశంలో - (నక్షత్ర) చంద్రులకు ప్రమోదకరంగా ఉంది సప్తర్షి మండలానికి ఎగిరివచ్చే రాజ హంసలతో (వర్షాకాలంలో మానసానికి పోయిన హంసలు ఉత్తరదిక్కుగా మళ్ళీ దేశమధ్యానికి వస్తాయి) ప్రకాశిస్తున్నది ప్రసన్న సరస్వతీ నక్షత్రంతోను శోభాయమాన బ్రహ్మనక్షత్రంతోనూ వెలుగొందుతూ బ్రహ్మదేవుని గమనంలా ఉంది అంటే హంసల రథంమీద వేళ్లే బ్రహ్మదేవుని సంచారంలా ఉంది అన్నమాట

బ్రహ్మదేవుని సంచారాన్ని ఉపమానంగా తీసుకుని ఉపమేయమైన శరత్తులో సమన్వయించడంకూడా కద్దు. అయితే కవి హృదయం సూచనా ప్రాయంగా చెప్పడం ప్రకృతవిషయం గనక అట్టి శాఖాచంక్రమణానికి ఇప్పుడు వెళ్ళదలుచుకోలేదు.

పొంపొచ్చాలు లేకుండా భూదివములనే భార్యాభర్తల ఐకమత్యంతో ఈ శరదుత్సవాన్ని అనుభవిస్తున్నారని సారాంశం

భట్టారకుని పంచలో తుట్టతుదిదీ చివరి మెరుపుగా నిలిచినదీ ఈ రెండవ పద్యం —

"శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం
జారు తరంబు లయ్యె, వికసన్నవ కైరవగంధ బంధురో
దార సమీర సౌరభము దాల్చె, సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండు రుచి పూరములం బరిపూరితంబులై"

ఆ. చతు 141

ఇదికూడ భట్టారకుని మేధలో వికసించిన శరత్పూర్ణిమా శోభగాని మూలంనుంచి దిగుమతి అయినది కాదు ఇందలి రాత్రిశబ్ద స్త్రీలింగస్వారస్యం చేత కవి, శరద్రాత్రులను తారహారాలను వేసుకుని కైరవ గంధం పూసుకుని కర్పూర ధూళివంటి వస్త్రాలు ధరించి ప్రియునికోసం ఎదురుచూచే వాసక సజ్జికలుగానో, వెన్నెలలో కలిసిపోయే ఉజ్జ్వల వేషంతో ప్రియునివద్దకు వెళ్లే జ్యోత్స్నాభిసారికలుగానో ఊహించడం పరమ రమణీయంగా ఉంది

వర్ణనలో వాల్మీకి మహర్షి తర్వాత చెప్పదగ్గ దిట్ట నన్నయ ఆయన ఏ వర్ణనతీసినా ఏదో భావచమత్కారం, లలిత శబ్దాలతో చేసినగారిడీ కూర్పు నేర్పు ప్రత్యక్ష మవుతుంది

ఆయన చేయించిన సర్పరాజ ప్రార్థనం కద్రువ వినతలు చూచిన సముద్రగాంభీర్యం అష్టమాశ్వాసంలోని ఇంద్రప్రస్థ వైభవం ఇత్యాదు లెన్నో మరువరాని వర్ణనలు

సముద్రవర్ణనంలో మూలాన్ని అతిక్రమించి చూపిన వర్ణనా ప్రాగల్భ్యం దర్శనీయ మైనది

అలఘు ఫణీంద్రలోక కుహరాంతర దీప్త మణి స్ఫురత్ప్రభా
వళి గలదాని శశ్వదుదవాస, మహావ్రత, శీత పీడితా
చల ముని సౌఖ్యహేతు విలసద్బడబాగ్ని శిఖాచయంబులన్
వెలిగెడుదాని గాంచి రరవింద నిభానన లమ్మహోదధిన్

ఆది ద్వి 28

కద్రూవినతలు సముద్రాన్ని చూచారు

అది నాగలోకపు లోతునుంచి ఫణీంద్రుల రత్నకాంతులను ఎగజిమ్ము తున్నది చిరకాల జలనివాసంవల్ల బాధపడే అచలముని మైనాకునకు సుఖ మిచ్చే బడబాగ్ని జ్వాలలతో వెలుగుతున్నది

ఇక్కడ మూలంలోని 'బ్రహ్మర్షి ణా వ్రతవతా। వర్షాణాం శత మత్రిణా అనాసాదిత గాధం చ పాతాళతల మవ్యయమ్' అనే శ్లోకం చూచి కొందరు మహావ్రత శీతపీడితా చలముని అన్నచోట అత్రిమహామునికి సౌఖ్య మిచ్చే బడబాగ్ని శిఖలు అని వ్యాఖ్యానంచేసి, ఇదే సువ్యాఖ్య అనుకున్నారు కాని అది సరికాదనడానికి ముఖ్యంగా మూడు హేతువులు చూపించవచ్చు

1 అత్రిమహాముని మహామహిమోపేతుడు ఆయనకు శీతబాధ ఏమిటి? దానిని బడబానలం పోగొట్టడమేమిటి? ఇది ఆయన మహిమను కించపరచడం అవుతుంది

2. 'మైనాక స్యాభయప్రదం' అనేమాటకింద ఉన్న బడబానలశిఖలవల్ల సౌఖ్యపడ్డవాడు మైనాకు డంటేనే సొగసు, ఔచిత్యం మైనాకుడు ఇంద్ర భీతుడు సామాన్యుడు మునివలె పట్టుదలగా - కదలకుండా సముద్రంలో దాక్కుని ఉన్నాడు అతనికి బడబాశిఖలు సౌఖ్యమిచ్చాయంటేనే ఒప్పు[1]

3 నన్నయగారికి చేతులుకట్టుకుని మూలాన్ని 'అనువదించాలి' అనే అభినివేశం లేదు తనకు అందమనిపించినదీ, ఉచిత మనిపించినది ఎంతమంది శ్రోత్రియపుత్రులు కాదన్నా లెక్కచెయ్యకుండా వ్రాస్తారు ఈ నిజం పల్లవ గ్రాహి పాండిత్యం కాకుండా తెనుగుభారతం చదివినవారికి తెలుస్తుంది ప్రథమాశ్వాసంలోని సరస్వస్తుతికీ మూలరచనకూ ఏమీ సంబంధం లేదు మూలంలో సముద్రం నృత్యం చేస్తున్నదని ఉంటే సముద్రతీర లతాలాస్యం వర్ణించా రాయన!

అష్టమాశ్వాసంలోని ఇంద్రప్రస్థవర్ణనం ఆంధ్ర సాహిత్యంలో వర్ధిల్లిన పట్టణవర్ణనానికి మార్గదర్శకం అయింది మూలంలోని ఒకొక్కరేకకు ఆయన ఇచ్చిన కవితా స్వరూపం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది "విరోచమానం బహుభిః పాండురై ర్భవనోత్తమైః" అని మాత్రమే మూలంలో ఉంది

---

1 ఇక్కడ 'నన్నయ ప్రసన్న కథా విపంచి' గరుడోపాఖ్యాన వ్యాఖ్యాతకూడా పర్వతార్థాన్నే గ్రహించడం గమనించదగ్గది

దానికి నన్నయగారి కవితా విజృంభణం ఇది—

"అలఘు తరంబులై తుహినహారి సుధారుచి నిందురోచి రా
కుల శశికాంత వేది పృథుకుంజ గళజ్జల నిర్ఝరంబులన్
వీఁ సిత జాహ్నవీ విమలవీచి విలోలలసత్ పతాకలం
బొలుపగు దత్పురీ భవనముల్ హిమశైలము బోలి యున్నతిన్"
ఆది అష్ట 72

మూల పాండుర భవనములు రూపకోపమలతో అలంకృతములై హిమ వంతములై పోయాయి

కథా కథనం

పురాణాల్లో కథ ఉపసర్జనం - అంటే అప్రధానం వారు ప్రవచించ దలచిన, ప్రపంచింపదలచిన విషయాలకు కథ వారికొక ఉపకరణం మాత్రమే, కావ్యంలో కథ ప్రధానం ఉపదేశం దాని చాటున ఉండాలి. కథాగమనానికి సుదీర్ఘ ఉపాఖ్యానాలు ఉపన్యాసాలు అడ్డురాకూడదు క్లుప్తత ఉంటూ స్పష్టత ఉండాలి ఈ విషయంలో నన్నయగారు చాల జాగ్రత్తపడ్డారు

భారతంలో కథ వక్తృశ్రోతల సంవాదరూపంలో ఉంటే - అది కావ్య కళాధర్మం కాదని ఏకసూత్ర గుంఫితమైన పుష్పమాలలా ఒకరే కథ చెబు తున్నటు భట్టారకులు మార్చి రామాయణ కావ్యరూపాన్ని అవలంబించారు. ఇది ఆయన చేసిన మొదటిమార్పు. ప్రధానకథతో అనగిపెనగి ఉండేలా మధ్య వచ్చే ఉపకథలను దిద్ది తీర్చడం రెండవ మార్పు

మూడవది - యథార్థ కథనంలో దొర్లిన అనౌచిత్యాలను అనన్వితా లను తొలగించి కథకు దీప్తిచేవడం.

తెనుగు భారతం తియ్యగానే 'ఉదంకుడు కుండలాల' కథ కనబడు తుంది ఉదంకుని గురువు వేదుడు ఆయన గురువు అయోదధౌమ్యుడు ఆయనకు ముగ్గురు శిష్యులు; అందులో వేదు డొకడు, ఈ గురుశిష్యుల కథ భారతంలో విస్తరించి ఉంది నన్నయగారు అక్కరలేని శిష్యులకథను తీసివేసి వేదుని కథనుంచి సూటిగా కథకు నడిపించారు దానితో కథకు క్లుప్తత,

స్పష్టత వచ్చాయి అందులోని ఒక పెద్ద అనౌచిత్యాన్ని పరిహరించారు (ఋతుమతి అయిన గురుపత్నీ సంయోగాన్ని ఉదంకుడు తిరస్కరించడం

వినతా కద్రువల కథలోని అనవసర ప్రసంగాలను అధిక దైర్ఘ్యాన్ని కత్తిరించి చక్కగా కుదించారు

సముద్ర వర్ణనంలోని పునరుక్తిని వినగును పరిహరించి రుచికరమైన కవితారూపం ఇచ్చారు

శాకుంతల కథలోని అనుచిత ప్రసంగాలనేకారి, జుగుప్స భావాలను రద్దుచేసి అభిజ్ఞానశాకుంతలపు భాగమసబలంతో ఒకచక్కని ఖండకావ్యంలాగు శకుంతలా దుష్యంత పరిణయగాథను మలచినారు

కచదేవయాని కథలో, నలదమయంతుల వృత్తాంతంలో, నన్నయగారి పాదపరిశీలనం పొందిక స్పష్టంగా కనపడతాయి

ఈ తీర్పునే ఆయన సారమతి పద్యంలో ప్రసన్నకద లన్నారు ఈ కథా ప్రసన్నతను అంగు రచనఅంటూ చూడవచ్చు

ఇతిహాసంలోగాని, పురాణంలోగాని పాత్రలు నీడ బొమ్మల్లా (Silhouette) దృశ్యాదృశ్యంగా కదుల్తూ ఉంటారు కథ నడవడానికి ఉప కరణాలుగా మాత్రమే ఒకొక్కచోట కనబడుతూంటాగు

నన్నయగారు వారికి రక్తమాంసాలు ఓజస్తేజస్సులూ ఇచ్చి చైతన్యం ఉట్టిపడేలా ప్రత్యక్షం చేస్తారు

భారతంలోని ప్రధాన పాత్రలు భీష్మ పాండు, ధృతరాష్ట్ర పాండవ దుర్యోధనాదులూ, ప్రాసంగిక పాత్రలు శ్రీకృష్ణ కర్ణ, శకుని ద్రోణ శిశు పాలాదులూ స్త్రీలలో కుంతీ ద్రౌపదులు, గాంధార్యాదులు, దేవయాని, శర్మిష్ఠలు శకుంతలా దమయంతులు తమతమ సుగుణ దుర్గుణాలతో, బహిరంగ అంతరంగ స్ఫుటరూపాలతో దర్శనమిస్తారు

నాటకీయత

భట్టారకుడు మంచికథ చెప్పడంతోపాటు సజీవ పాత్రలు నిర్మించడంతో పాటు ఒక కథాసన్నివేశాన్ని ఆలపించలంపుగా నాటకరంగింగా మార్చి చక్కని రూపకంగా మలచగలడు

'రూపారోపాత్తు రూపకమ్' అన్నట్టు ఒక కథకు దాని సన్నివేశ చాతురిమ చేత వాక్యోవాక్యపటిమచేత రసస్ఫూర్తిచేత ప్రత్యక్షరూపం ఇస్తే దాన్ని రూపకం అనవచ్చు రూపకాల్లో అంతర్భాగమైన నాటకం అనే పేరినే సర్వసామాన్యంగా వాడుతూ ఉండడం వ్యవహారబలంవల్ల

నన్నయరచనాభాగంలో ఎక్కువ నాటకస్ఫూర్తిగల కథలు చాలా ఉన్నాయి అందులో కచదేవయానం శర్మిష్ఠాప్రణయం ఒకే కథలో రెండు ఏకాంక నాటికలు

> "ఘను గచుండను వాఁడ మ
> హానియమ సమన్వితుఁడ బృహస్పతి సుతుఁడన్
> మానుగ వచ్చితి నీకును
> భానునిభా! శిష్యవృత్తిఁ బనిసేయంగన్"
>
> ఆది తృ 108

అని కచుడు రంగంలో ప్రవేశిస్తాడు నమ్మకమైన శిష్యుడుగా ప్రవర్తిస్తాడు 'దాని చిత్తంబు వడసి శుక్రు నారాధించిన నీకిష్టసిద్ధియగు' నన్న దేవతల మాటలు జ్ఞాపకం ఉంచుకుంటాడు

దేవయానికి కచుడి మీది ఇష్టం 'వానిని జూచికాని కుడువనొల్ల' నని 'యేడ్చే' దాక వెళ్లింది

రాక్షసులు కచుణ్ణి చంపితేగాని తీరసంతకని పెంచుకుని అతణ్ణి చంపి, కాల్చి బూడిదచేసి సురలో కలిపి శుక్రాచార్యులకిచ్చారు

రాక్షసుల పగే శుక్రాచార్యులను కచుడికి సంజీవనీ విద్య ఇవ్వడానికి తొందర చేసింది వారు ఏ సంజీవని కచుడికి దక్కకుండా చెయ్యాలనుకున్నారో ఆ సంజీవని వారివల్లనే త్వరగా దక్కింది అనుకోని మలుపు

కచుడు సంజీవనిని స్వీకరించి వెళ్లిపోతున్నాడు దేవయాని దానితో నన్నూ స్వీకరించమంటుంది జాలిగా—

> "నీవును బ్రహ్మచారివి వినీతుఁడ వేనును కన్యకన్ మహా
> దేవకులావతంస రవితేజ! వివాహము నీకు నాకు మున్
> భావజశక్తి నైనయది పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు" తృ 129

అంటే అతడు ధర్మం కాదని తిరస్కరిస్తాడు దేవయాని మండిపడి నీకు సంజీవని పనిచేయదని శపిస్తుంది

కచుడు దేనికోసం ఇంతశ్రమ పడ్డాడో అది విఫలమయింది ఇది మరో మలుపు అతని ప్రతిశాపంవల్ల దేవయానికి బ్రాహ్మణభర్త దొరకలేదు యయాతి నూతిలోనుంచి వెలువరించడం పెండ్లాడడం విచిత్ర సంఘటన - అక్కడ తెర

వనంలో దేవయానితో చూచిన శర్మిష్ఠమీద పడింది యయాతికన్ను దేవయానికి రాజు మీద మరులు, అయితే రాజుకు శర్మిష్ఠమీద వలపు దానికి శుక్రాచార్యుని 'శయనంబునం దక్క' అన్నమాట అడ్డకట్ట అయి దేవయాని పరిచారికగా ఉన్న శర్మిష్ఠ ఎంత అందుబాటులో ఉన్నా దూరంగానే ఉండ వలసి వచ్చింది

అనుకోని సమావేశంలో ఇద్దరూ కలుసుకున్నారు శర్మిష్ఠ పలుకు ప్రౌఢతనానికి, వాదబలానికి తియ్యగా లొంగిపోయాడు యయాతి దేవయానికి తెలిసి మళ్లా కోపం శుక్రుని ఊరడింపు ఫలితం యయాతికి ముసలి తనం ఈ నాటకాన్ని నన్నయగారి రచనలో ఎంతో రుచిగా చదువుకుంటాం

తర్వాత శకుంతల కథ రెండో నాటకం కాళిదాసు నాటకం ఒళుకులో మరీ రాణించింది ఆయన మాట ఒడుపే రూపాంతరంలో నన్నయలో కనిపిస్తుంది

మూడవది సభాపర్వంలో 'శిశుపాల కథ - 60 పద్యాలలో పరచిన పెద్ద నాటకం ఇది - ఇందులో సన్నివేశబలంకంటే సంవాదచాతురి భీష్మ, శకుని, భీమ, నకుల, ధర్మజులు ప్రధాన పాత్రలుగా శ్రీకృష్ణుడు నాయకుడుగా అద్భుతంగా రక్తికట్టింది అందుకనే సభాపర్వం అనగనే ముందిది జ్ఞాపకం వస్తుంది

నాలుగోది - అరణ్యపర్వంలో భీమహనుమంతుల సమావేశం భీముడికి తనదారికి అడ్డంగా పండుకొన్నవాడు హనుమ అని తెలియదు పూర్వం హనుమంతుడు సముద్రందాటి వెళ్ళినట్టు నిన్ను దాటిపోతానంటాడు తుదకు అతని తోకకూడ కదపలేకపోతాడు అప్పుడు హనుమ తా నెవరో చెప్పి

ఆదరిస్తాడు. ఈ సంఘటన చూస్తే షోరాబ్ రుస్తుం కథ భాసుని మధ్యమ వ్యాయోగం జ్ఞాపకం వస్తాయి. ఈ చమత్కృతి భాసుడిలో ఎక్కువ కని పిస్తుంది. భీమ ఘటోత్కచుల్లో ఒకరికి తెలిసీ వేరొకరికి తెలియకా కలుసుకున్న చమత్కారం చూడదగ్గది.

సంస్కృత భారతాన్ని కళాభరితంగా శ్రవ్యోన్ముఖంగా తెనిగించడం అనుకున్నంత తేలిక కాదు.

ఆధునిక కవి సార్వభౌములు శ్రీపాదవారు మహోద్ధతివేగంతో మూలాను సారంగా ఆంధ్రీకరిద్దామని పట్టుబట్టి సర్వం ఒక్కచేతిమీద తెనిగించారు. మూలానుసరణం కాదని తెలిసినా నన్నయ రచన మీద మోజుపడి పద్యాలు వ్రాశాయి. అవి నన్నయకాంతిసముద్రంలో మునిగిపోయాయి.

కౌరవపాండుకుమారుల విద్యాప్రదర్శన ఘట్టం ఒక అపూర్వ నాటకీయ సన్నివేశం —

అక్కడ హఠాత్తుగా కర్ణుడు ప్రవేశించి అర్జునుణ్ణి ఆక్షేపిస్తూ అంటాడు:

'నీవు కడు నేర్పుకాడవు
కావలవదు వీనిగొన్ని గఱచితి మేమున్
నీ విద్యలెల్ల చూపుదు
మే ? వీరులు సూచి మేలుమేలని పొగడన్'

ఇక్కడి వాకోవాక్యచాతురి (Skilful dailogue) ఒక్క భట్టారకునికే సాధ్యం. నన్నయగారికి ఎక్కడ తెలుగుప్రాయాలో ఎక్కడ ఎలా కాకువుపయోగించాలో వెన్నతోపెట్టిన విద్య. 'నన్నయసంస్కృతం' అని ఘోషించే వారికి ఈకిటుకు తెలియదు.

శ్రీపాదవారు ఇక్కడ ఒక పెద్దపద్యం వ్రాశారు. అది పల్చబడి పోయింది. ఆక్షిప్త భాషణంలోని వెటకారం కాకువు పోయాయి.

'ఓనాకేశ్వరజాత! ఇప్పుడిట నేమో చేసితిం బెద్ద పా
టే నే బల్విలుకాడ నిందఱును నన్నే మెచ్చిరం చెన్న కో
కి నీ చేసిన యంతయున్ మఱియు బై నెంతేనియున్ జేయువా
రీ నేలంగల రింతమాత్ర గరువం బెక్కింపుమో నేటికిన్ ?

మరోసందర్భం అర్జునుడు ద్రుపదుణ్ణి కట్టితెచ్చి ద్రోణునిముందు పడవేశాడు

నన్నయగారి ద్రోణుడు సాధిక్షేపంగా ఇట్లా అంటాడు

"వీరెవ్వరయ్యా? ద్రుపద మ
హా రాజులె? యిట్లు కృపణులై పట్టువడన్
వీరికివలసెనె? ఇపుడు మ
హా రాజ్య మదాంధకార మది వాసె నొకో!

అన్నాడు —

దీనికి మూలం లేదు అయినా శ్రీపాదవారు మోజుపడి ఇట్లా వ్రాశారు

ఓహోహో? ఎవరయ్యా వీరు? ద్రుపదాఖ్యుల్ భూమిభృ ద్వర్యులే?
మీహుంకారము మీప్రభుత్వమదమున్ మీరాజ్య గర్వంబును
స్వాహాకారము నొందెనే? అటకటా బంధంబె! మీబోంట్ల కీ
రూహింపన్ బికిరంపు బాపని తెఱం గుల్లంబునన్ దోచెనే?

పద్యభావాన్ని అనుసరించినా ఎన్ని కారాలుకలిపినా నన్నయగారి వెటకారం రాలేదు

ఇట్లే ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో కూడా భట్టారకుని ప్రసిద్ధ పద్యాలకు ప్రతులు వ్రాశారు కాని ఆ చేవ రాలేదు

ఇట్లా - పదకొండో శతాబ్ది పూర్వార్ధంలో రాజరాజు ప్రేరణలో, తన నిత్యశయ ఆర్షమతాభిమానంతో ప్రారంభించిన నన్నయ భట్టారకుని రచన అరణ్యపర్వంలో చతుర్థాశ్వాసంలో శరద్వర్ణనంతో ఆగిపోయింది

నన్నయగారు మహాశ్రమకోర్చి ఏర్పరచిన సుప్రతిష్ఠిత ఆంధ్రకవితా సంప్రదాయాన్ని అందుకుని కొనసాగించే ప్రతిభావంతులు లేకపోయారు ఆయన తర్వాత ఆ యుగంలో కవులని చెప్పబడే వారెవ్వరూ అంతవారు లేరు పావులూరి మల్లన గణితశాస్త్రం విషయ ప్రధానం అథర్వణుని భారతం అనుమానగ్రస్తం అందులోనివని కొందరు లక్షణకర్తలు కొన్ని పద్యాలుదాహరించారు అవి ఏ విరాటపర్వంనుంచో రచించిన కొన్ని

పర్వాల విప్రకీర్ణపద్యాలు కాని సమగ్ర భారత రచన కాదని విమర్శకులు పెదవి విరిచారు

ఆ కాలపువాడే అని చెప్పబడే వేములవాడ భీమకవి ఉద్దండ కవి అని శ్రీనాథాదులచే కీర్తింపబడ్డా - ఆయన పేరితో కవి జనాశ్రయం అనే ఛందోగ్రంథం కనబడుతుంటే గాని - ఇతర రచన ఏదీ కనబడదు ఆయన కథలు ప్రచారంలో ఉన్నంతగా కవిత ప్రచారంలో లేదు

'ఘనుడన్ వేములవాడ వంశజుడ' అనేదీ
'గరళపు ముద్ద లోహ మవగాఢ' అనేదీ

ఆయన చాటువులుగా లోకంలో వ్యాప్తి పొందాయి

పింగళి సూరన భీమన రాఘవపాండవీయం గురించి ఇలా అన్నాడు—

'భీమన తొల్లి చెప్పెనను పెద్దల మాటయెగాని యందు నొండేమియు నేయెడ న్నిలుచు టెవ్వరెఱుంగరు' అంటూ ఆ నాటికే ఆయనచెప్పదగ్గ రచనలేవీ లేవని నిర్ణయించాడు

కాగా పదకొండవ శతాబ్దిలో నిలిచిన ఏకైక ఆంధ్రకవితా నాయకుడు నన్నయతప్ప - వేరొకరు లేరని దొరికిన ఆధారాలను బట్టి నిర్ధరించవచ్చు

చిల్లరచాటు రచనలు చేసినవారు ఎందరో ఉండవచ్చు కాని వారిలో గణనీయు లెవ్వరూ లేరని అవగతం అవుతుంది

"నక్షత్ర తారాగ్రహ సంకులాపి
జ్యోతిష్మతీ చంద్ర మసైవ రాత్రిః"

ఆకాశంలో నక్షత్రాలు, గ్రహాలు ఎన్ని ఉన్నా ప్రకాశించే చంద్రుని చేతనే రాత్రి జ్యోతిష్మతి అనిపించుకుంటుంది అట్లాగే పదకొండో శతాబ్దం నన్నయ చంద్రునితో వెలిగింది

స్థాణుష లు వీణలై పలికాయి

నన్నయ కోకిల కవితాశాఖ నెక్కి తిరుగులేని మాధుర్యంతో కూసి తిరోహితం అయింది

కాలచక్రం ఆగదు

అదిగో గ్రీష్మం గలచూపుతున్నది!

శైవ గ్రీష్మం

ద్వితీయ ప్రసంగం

నిన్నటి ప్రసంగంలో మీరు పదకొండో శతాబ్దపు తెనుగుకవిత ప్రారంభ, వికాస దశల గురించీ విపులంగా విన్నారు ఆయన 'ఆంధ్రకవితాది మార్గ మహాపథికుడు' కనక ఆంధ్రకవిత యొక్క చారిత్రిక, సారస్వతిక, నేపథ్యం గూర్చి కొంచెం విస్తరించి ప్రసంగించవలసి వచ్చింది

నన్నయరచనా కాలాన్ని వసంతం అన్నాం

ఇప్పుడు మతప్రకోప భూయిష్ఠమూ తీవ్ర వాగ్విలాసమూ అయిన శైవ గ్రీష్మాన్ని దర్శించబోతున్నాం ప్రకృతికి సహజములైన అన్ని ఋతువులూ అవసరమే దేని ప్రాముఖ్యం దానికుంది దేని ప్రయోజనాన్ని అది నెరవేర్చింది

దేనినీ పొగడటంగాని తెగడడంగాని మన పనికాదు ఒక ఉద్యమ ప్రభావాన్ని - సాధ్యమైనంత తటస్థంగా అంచనావేసి - దాని స్వరూప స్వభావాలను దొరికిన ప్రమాణాలతో నిరూపించడం మనకర్తవ్యం

"శివమెత్తి ఆడాడు"

"శివమెత్తి పాడాడు"

"ఎందుకామె శివాలాడుతుంది ?"

అనేమాటలు తరచు మనదేశంలో వింటుంటాం అయితే - ఈ మాటలు ప్రశంసా పరములు గాక ఆక్షేపణ గర్భితంగా ఉపయోగిస్తారు పట్టరాని ఉద్రేకం, అణపరాని ఆవేశం, నిగ్రహంలేనినింద - కనపడ్డప్పుడు అప్రయత్నంగా ఈ మాటలంటారు శైవమతస్థుల ప్రవర్తన, ప్రబోధాలవల్లే ఉద్వేజితులైన ప్రజలు ఈ మాటలు వాడుకలోకి తెచ్చి ఉంటారనేది నిశ్చయం

శైవమతంయొక్క యోగ్యతల గురించి చర్చించడం మా ప్రధానాంశం కాదు. అది ఆంధ్ర విజ్ఞానానికి చేకూర్చిన మేలు కీళ్ళు, భాషకు చేసిన ఉపకారాపకారాలు పర్యాలోచించటం మన గోష్ఠిలోని ముఖ్యాంశాలు

చిత్ర మేమిటంటే - మనదేశం పేరులోనే శైవం ఉంది తెలుగు అనే మాటకు ప్రకృతి 'త్రిలింగ' అని చాలామంది విచక్షణులు ఒప్పుకున్నారు మూడు విభాగాలుగా, ప్రస్తుతం ఎంచబడే తెలుగుదేశానికి మూడు శివలింగాలు ప్రతినిధులుగా నబడితాయి రాయలసీమలోని శ్రీశైలం, తెలంగాణాలోని కాళేశ్వరం, తీరాంధ్రంలోని ద్రాక్షారామం సుప్రసిద్ధ శివక్షేత్రాలు

క్రీ శ 10 శతాబ్దినుంచి 14 శతాబ్దివరకు భక్తిప్రధానమై శైవం ఉచ్చదశలో ఉంది

నిజానికి అంతకుముందునుంచీ అంటే శా నుంచీ శైవధర్మం ఉన్నజాడలు కనిపిస్తాయి

శాతవాహనులు శాలంకాయనులు, విష్ణుకుండినులు పూర్వచాళుక్యులు రెడ్డిరాజులు, పూర్వపూర్వ విజయనగర ప్రభువులు, శైవారాధకులో, శైవాభిమానులో అయి ఉన్నారు విజయనగరరాజ్యం విద్యారణ్యుల దయా, ధనప్రోద్బలాలతో ఉదయించిందని అందరికీ తెలిసిన సంగతే

ఆద్యుల మత సామరస్యం

ఆర్షమత ప్రాతిపదికలో శైవవైష్ణవాలకు విభేదంలేక సమాన ప్రతిపత్తే ఉంది వైష్ణవపోషణంగాని, శైవదూషణంగాని లేదు

"శివాయ విష్ణురూపాయ శివ రూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః"

అని ఉపదేశం

అధ్యాత్మ రామాయణంలో విష్ణ్వవతారమైన రాముని మహిమ శివుడు పార్వతికి చెప్పడం రూపంలో ఆ గ్రంథం ప్రవర్తిల్లింది

అద్వైత ప్రవర్తకులైన శంకరాచార్యులు శివ విష్ణు స్తోత్రాలు సమానంగ చేశారనడానికి బహుళవ్యాప్తిలో ఉన్న భజగోవింద శ్లోకాలు, శివానందలహరి మొదలైనవి ఉదాహరణాలు

కాళిదాసు మహాకవి తన నాటకత్రయ నాందీ శ్లోకాలవల్ల రఘు, కుమార, కావ్యాలవల్ల శివాభిమాని అని తెలుస్తుంది కాని రఘువులో దేవతలు చేసిన విష్ణుస్తోత్రంవల్ల ఆయన అద్వైత బుద్ధి విశద మవుతుంది కుమారకావ్యంలో శివకల్యాణ సందర్భంలోని ఈ శ్లోకం ఆయన తాత్త్వికదృష్టికి నిదర్శనం

"ఏకైవ మూర్తిః బిభిదే త్రిధా సా
సామాన్య మేషాం ప్రథ మా వరత్వం
విష్ణో ర్హరః తస్య హరిః కదాచిత్
వేధా స్తయో స్తా వపి ధాతు రాద్యౌ" ౭ సర్గ

ఒకేమూర్తి మూడురూపములు పొందింది వారిలో ఎక్కువ తక్కువలు ఎన్నడం అజ్ఞానం ఒకరికంటె ఒకరు ఆద్యులు - ఎవరు ముందు ఎవరు తర్వాత అనే వివేచనం ఎప్పటికీ తేల్చరానిది

ఆంధ్రసాహిత్యంలో శ్రీనాథుని కావ్యాలన్నీ ఇంచుమించు శివకథామయాలు ఆయన అభిమానం శివునివైపే అనిపించినా - ఎక్కడా విష్ణువిరోధం చూపలేదు శృంగారనైషధంలో ఇష్టదేవతాస్తుతిలో ముందుకనపడే వాడు 'పద్మాక్షుడే' భీమేశ్వర పురాణంలో 'ధూర్తగోపాలుడు' చనువుగా దర్శన మిస్తాడు కాశీఖండంలో 'వేదాద్రి నరసింహ విపులవక్షస్థలీ కల్హార మాలికా గంధ లహరి' ఆయన కవితకు ప్రేరకములలో, ఉద్బోధకములలో ఒకటి

కొంచెం వెనక్కు వెళ్ళి నన్నయ, తిక్కనాదులను చూచినా మొట్టమొదట 'పురుషోత్తముడు' 'హరిహరంబగు పరతత్త్వమూ' దర్శన మిస్తాయి

మత దురహంకారాలకూ అన్యదేవతా తిరస్కారాలకు అతీతంగాఉండి తమ దర్శనాన్ని తాత్త్వికదృష్టితో కవిత్వాన్ని కళావిస్ఫూర్తితో నిర్వహించవలసిన కవులు, ఒకమతానికి తూర్యరవాలుగా మారి, అన్యమతస్థులను పరదేవతలను అసహనంతో దుయ్యబట్టడం సంయమనం కోల్పోయి కవితను ప్రచారస్థాయికి దిగజార్చడం ఆశ్చర్యం గొలుపుతుంది! ఈ విలక్షణ ప్రస్థానం వల్ల శైవకవులు సమానాంధ్ర కవి శ్రేణిలో నిలవక ఒక ప్రత్యేక ప్రపంచం

సృష్టించుకుని తమ రచనలకు ఒక అపూర్వ స్వీయముద్రను కల్పించారు కనుకనే ఆంధ్రకవి పరంపరలో పూర్వకవి ప్రస్తుతిలో వీరికి చోటులేకుండా పోయింది

వీరికి తర్వాత వచ్చిన ఆంధ్రకవులు వీరి రచనలను బహిష్కరించి చదవని వారుకారు పరోక్షంగా వీరి చక్కని వర్ణనలు, పదచిత్రాలు, పలుకుచురుకులు తర్వాతి ప్రముఖకావ్యాల్లో కనబడుతూనే ఉంటాయి అయితే - వీరి తీక్షణ ధోరణిపట్ల వారి విముఖతయే వీరిపేరెత్తకుండాచేసి ఉండాలి దీనిని మతదురభి మానంతో తక్కిన కవులు చేసిన అపచారంగా కొందరు విమర్శకులు భావించారు అది నిజంకాదు ఏమంటే - తమ కనిష్టమైనా వైష్ణవగ్రంథాలను శైవాభిమానులు చదవడం, వ్యాఖ్యానించడం ఉంది వేదాంతదేశికులు వైష్ణవులైన వారి గ్రంథాలకు అప్పయదీక్షితులవంటి శివాభిమానులు వ్యాఖ్యలు వ్రాసినట్టు వింటాం అద్వైతప్రతిపాదకమైనా శంకరులు శారీరక భాష్యం వైష్ణవులు శ్రద్ధతో చదివి ప్రశంసించినట్టు దాఖలాలున్నాయి

"మహేశ్వరే వా జగతా మధీశ్వరే
జనార్దనే వా జగదంతరాత్మని
న వస్తుభేద ప్రతిపత్తి రస్తి మే
తథాపి భక్తిః తరుణేందు శేఖరే"

అని తాత్త్విక సుందరంగా వినయ మధురంగా పలికిన అప్పయ దీక్షితులవంటి వారి ఉదారవాక్కులు వినిపిస్తూఉంటాయి

తెలుగులోని శివకవులకు ఈ దూరదృష్టి, ఆత్త్వచింతనం లేదు వారు శివేతరదైవతాలను సహించరు దూషిస్తారు నిందు వారి ఆయుధం ఘర్షణ వారిదర్శనం, హింస వారికి నిట్టూర్చినంత తేలిక ఒక్క నన్నెచోడునిలో తప్ప తక్కిన కవులలో ఈ లక్షణాలు అగ్రగణ్యంగా దర్శన మిస్తాయి

భక్తితత్పరమైన పాశుపతమతం చిరంతనంగా తప మార్గంతో తాను నడచి ఎవరినీ ఉద్వేజితులను చెయ్యలేదు 12వ శతాబ్దిలో ఉద్భవించిన వీరశైవ కవితలో కవితాధర్మంపైన్న ప్రచారవాసన వాదకోలాహలం ఎక్కువ శైవకవులు అనేకులున్నా వీరిలో ముఖ్యంగా చెప్పదగ్గవారు ముగ్గురు

1 మల్లికార్జున పండితారాధ్యుడు 2 పాల్కురికి సోమనాథుడు 3 నన్నెచోడుడు

నన్నెచోడుడు మొదటి ఇద్దరికంటె-పూర్వుడైనా వీరశైవ విజృంభణంలో తొలి ఇద్దరే అగ్రగణ్యులైనారు వారిలో పండితారాధ్యుని రచన కవిత్వాభిముఖంగా కంటె - కఠోరశైవ దీక్షాపరంగా నడుస్తుంది దానినొక కావ్యంగా కంటె వీరశైవస్మృతిగా భావించడం యుక్తమన్నారు విమర్శకులు

పండితారాధ్యుడు

మల్లికార్జున పండితారాధ్యుడు శివక్షేత్రమైన దక్షారామంలో ఒక పూజారి కుమారుడు సమీపంలో కోటిఫలిలోని ఒక శివాచార్యునివద్ద శైవదీక్ష పొంది తమ అనూచాన సంప్రదాయ విరుద్ధంగా శివారాధకుల పాదోదక ప్రసాదాలు స్వీకరించడం, విభూతి రుద్రాక్షల మహిమలను చాటడం తన ముఖ్య కర్తవ్యంగా పెట్టుకున్నాడు శ్రుతి, స్మృతి, పురాణ వాఙ్మయాన్ని క్షుణ్ణంగా చదివి దానికి శైవపరంగా వ్యాఖ్యానంచేసి సమన్వయించి మహా పండితు డనిపించుకున్నాడు ఈయన బసవేశ్వరుని సమకాలికుడు

కన్నడదేశంలో బసవేశ్వరుని శైవ జృంభణానికి దీటుగా ఇతడు తెలుగుదేశంలో శైవమత ప్రచారానికి ఆచార్యపీఠంగా నిలబడ్డాడు అయితే బసవని మతానికి ఈయన ప్రబోధానికి కొంతభేదం ఉంది బసవన్న కర్మ మార్గాన్ని నిరసించి వర్ణాశ్రమాచారాలను ప్రతిఘటించాడు

కర్మవాదు లెల్ల ఒకజాతి,

భక్తులంతా ఒకజాతి - అని అతని సిద్ధాంతం

మల్లికార్జును కు బసవన్నమీద ఎంత ఆరాధన ఉన్నా - వైదికమార్గం పూర్తిగా విడవని శైవం ఈయనిది

"భక్తికి సంకవలపు బ్రాహ్మ్యంబుతో పొత్తు

వదలలేను నేను బసవలింగ" అనేది ఈయనగారి ద్వైవిధీభావం అయితే ఈయన శైవేతర మతాలమీద దాడిచేయడంలో ఏమీ తక్కువతినలేదు

తన పాండిత్యబలంతో అనుయాయివర్గంతో బయలుదేరి అప్పటికే తేజో హీనాలుగా ఉన్న జైనవసతులమీద, బౌద్ధారామాలమీద దండెత్తి వాటి ధ్వంసానికి శక్తికొలదీ తోడ్పడ్డాడు

ఒకసారి చందవోలును రాజధానిగా చేసుకుని పరిపాలించే వెలనాటి చోళుని సభకు వెళ్ళి ఆ రాజు అభిమానించే గురువైన బౌద్ధాచార్యుని వాదంలో ఓడించి శైవమత స్థాపన చేశాడు అయినా ఆ రాజు శిష్యులు తృప్తిపడక ఆ బౌద్ధాచార్యుని వెదకి పట్టుకొని రహస్యంగా చంపివేస్తే ఆ నేరం తనమీద వేసుకున్నాడు రాజుకు కోపం వచ్చి కండ్లుపొడిపించగా ఈ రాజ్యనాశనం తప్పదని శపించి గురుస్థానీయుడైన బసవేశ్వరుణ్ణి దర్శించుటకు పోతూఉండగా బసవన్న కూడలి సంగమంలో లింగైక్యము పొందినాడనివిని తిలపించి శ్రీశైల మల్లికార్జునుని దర్శించ దలచి సమీపానికి వెళ్లి వృద్ధత్వం వల్ల తాను శైల మెక్కలేక శిష్యులను పంపి తన మొక్కు చెల్లించుకున్నాడని తెలుస్తున్నది

పర్వతమంతా శివస్వరూపంగా భావించి పాదాలతో తాకడం ఇష్టంలేక వెళ్లలేదంటారు కొందరు

ఎంతైనా జైన బౌద్ధాలను ఖండించడంలో ఈయన చేసిన పాప మేమి లేదు అన్యమతఖండనం స్వమత స్థాపనం ఆ రోజుల్లో సదాచారమే కవుల్లో నన్నయ తిక్కనాదులు విమతాలమీద దండెత్తినవారే అయితే అది స్వమత స్థాపనంతోనే తృప్తిపడడం జరిగింది గాని పరమత హింసనంలోకి, దూషణం లోకి దిగలేదు వీరశైవులకు అది నచ్చలేదు

విమతస్థులను వారి ఉనికిని చూస్తూ ఊరుకోవడం వారికి అసమర్థతగా కనబడింది పూర్తిగా వాటిని రూపుమాపితే గాని సాఫల్యం లేదనుకున్నారు

దీనికి ద్రావిడాగమ శైవభక్తి బ్రాహ్మణేతర - ప్రచోదిత శైవాభిరతి ఎక్కువ దోహదం చేశాయి బ్రాహ్మణులకు యజ్ఞయాగాదులు, వ్రతా చారాలు ఉంటే తమ ఆధ్యాత్మిక పురోగతికి ఈ శైవం పట్టుగొమ్మ అని తక్కిన వర్ణాలవారు భావించారు ఈ శైవానికి పండితారాధ్యునివంటి విద్వాంసులు వేదవిహిత ఆగమసంప్రదాయరూపం ఇచ్చి సమర్థించడంవల్ల ఆంధ్రదేశంలో వీరి బలుకుబడి హెచ్చి, అధిక అనుయాయివర్గమూ ఏర్పడింది అంతేకాక ఈ మతానికి ప్రచారసాధనంగా ఏర్పడిన కవితారచన సాధ్యమై

నం ప్రసన్నశైలిలో, దేశిరూపంలో ప్రజలను దగ్గరకు తీసుకుంది పూర్వ మీమాంసా విహితమైన కర్మ మార్గంగాని - ఉత్తర మీమాంసా సారమైన జ్ఞానమార్గంగాని - పండితైక వేద్యములై సామాన్య ప్రజలకు దూరంగా ఉండి పోవడం, వీరి మత ప్రచారానికి మరింత బలమిచ్చింది స్వమతానుకూలంగా ఆ శ్రుతి స్మృతి వాక్యాలకు అర్థంచెప్పి ఆ రెండింటి ఉనికినీ నిరసించారు తమ మేధా బలంచేత శ్రుతి స్మృతులను తమ తమ మార్గాలకు మళ్లించడం, తమ బోధయే వేదసమ్మతమని వ్యాఖ్యానించడం కొత్తకాదు ద్వైత, విశిష్టాద్వైత, అద్వైత సిద్ధాంతాలు ఆ విధంగా ఏర్పడ్డవే అయితే శ్రుతి ద్రష్టల మనస్సుల్లో ఇన్ని అర్థాలు ఉంటే - ఏది స్వీకార్యం? ఏది పరిహార్యం?

అవ్యవస్థిత వాగ్విన్యాసంవల్ల ప్రజలకు ఏమి చెప్పినట్టయింది? ప్రజా క్షేమానికి, పరమార్థ దర్శనానికి ఏమి దోహదం చేసినట్టు? శ్రుతి స్మృతులు సమాజ సువ్యవస్థకు, శాంతి సౌభాగ్యాలకు, లోక కల్యాణానికి ఏర్పడ్డవి కాని పండితుల బలప్రదర్శనానికి సాము గరిడీలకు రంగస్థలాలు కావని స్పష్ట మవుతుంది

ఇహలోకయాత్ర సౌఖ్యప్రదం కావడానికి పరమార్థచింతన ఫలవంతం కావడానికి మతం అన్నది ఉపయోగించాలి పురుషులను పుణ్యపురుషులను చేసేదిగా ఉండాలి సంక్షోభానికి, విద్వేషానికి ఆలవాలం కాకూడదు ఈ లక్షణాలు గలది ఏ మతమైనా సంసేవ్యమే లేనిది ఎన్ని ప్రమాణాలు చూపించినా ఎన్ని ప్రలోభాలను కల్పించినా - నిరాకరించదగినదే

కాకపోతే శైవ [illegible] - ర్మకాండతో, అనర్థాచార పరంపరతో ఘనీభవించిన శ్రోత్రియుల చాదస్తం కొంత వెనకపట్టింది అంధానుయాయు లైన జనసమూహంలో కొత్త ఆలోచన నవీనచైతన్యం ప్రబలింది

పండితుని కవిత

మల్లికార్జున పండితారాధ్యుడు సంస్కృతాంధ్ర కర్ణాటభాషల్లో అనేక గ్రంథాలు వ్రాసినట్టు చెబుతారు ప్రస్తుతం అవేవీ దొరకకపోయినా "శివ తత్త్వసారం" లభ్య మవుతున్నది దానిలో పండితునీ శైలీ సారళ్యం రచనా సౌలభ్యంతోపాటు అన్యమత ఖండనం కూడా అవిరళంగానే దొరుకుతుంది

శివతత్త్వసారం శతకమన్నారు కొందరు కాని శతకలక్షణమైన మకుటంగాని పద్యసంఖ్యా నిర్ణయంగాని లేదు

శైవంపులలో ఇతరులవలె ఇతనికి దేశీ అభినివేశంగాని, జానుదెనుగు పట్టుదలగాని ఉన్నట్టు కనబడదు. ఎయవలెనే సంస్కృతాంధ్రాలను సమంగా ఆదరిస్తూ రచన సాగించాడు

అచ్ఛమైన భక్తునకుండే ఆర్తి, ఆర్ద్రహృదయం ఇతని రచనలో కనబడి శతకంలోని ఆత్మాశ్రయ మనోవేగం దర్శనమిస్తుంది

"పూజింపుడు పూజింపుడు
పూజింపుడు శివుని భక్తి బూజింపుడు మి
రోజ సెడి నడవకుండ డు
రాజులు రట్టళ్లు నగుట కు వెల్లిటికిన్"

"ఒండేమి? మల్లికార్జు
పండితుడ ననుండుకంటె బ్రమథులలో నె
వ్వండో కో నీ యాజ్ఞోన్నతి
నుండగ గాంతునని కోరుచుండుదు నభవా!"

"నేనొక నికృష్ట మనుజుడ
మానసవచనాతిదూర! మహనీయ మహా
త్మానంద! నిన్ను బొగడగ
నే నెంతటివాడ సురమునీంద్రవరేణ్యా!"

ఈ ఆర్తి ప్రపత్తి చదువరుల హృదయావర్జకమే కాని సమరస బహుళం జ్ఞానబంధురం అయిన అద్వైతాన్ని గూడా ఈయన దుయ్యబట్టడం దుస్సహమవుతుంది

"ఆరాధ్యుం డారాధకు
డారాధక మనగ లేని అద్వైతదురా
చార కృప సర్వభూనా
కారసిఠి నేమి సేయగావలె శివా!"

"ప్రాజ్ఞులు వేదజ్ఞులు లో
కజ్ఞులు చేకొంద్రె ! గలశిఖాగాయత్రీ[1]
యజ్ఞోపవీత నాస్తికు
లజ్ఞులు చేకొంద్రుడుగాక అద్వైతమజా !

వ్యక్త ఉపాసనంకంటె అవ్యక్త ఉపాసనం కష్టతరమని వ్యాసప్రోక్తమే 'క్లేశోఽధికతర స్తేషాం అవ్యక్తాసక్త చేతసాం' అని గీతాప్రవచనం

ఆరాధకుని అధికారాన్ని బట్టి సగుణమునూ, నిర్గుణమునూ సేవించవచ్చు సన్న్యాసాశ్రమం స్వీకరించి నిర్గుణోపాసనలో నిమగ్నమైనవారిని నిందించడం ఈతని అన్యమత అసహనాన్ని చెబుతుంది, గాని పారమార్థిక పరతను చెప్పదు

ఈయన వాదం ఒకప్పుడు ఎంత పేలవంగా ఉంటుందంటే – పురాణకథల నాశ్రయించి బ్రహ్మ విష్ణువులను గేలిచేయడందాకా వెడుతుంది

తన తెగిన తలయు మడిసిన
తనయుని బుట్టింపఁ గావ దారోపని యా
వనజాసన కేశవులకు,
జనన, స్థితి కర్తృకత్వ శక్తులు గలవే ?

అని వారి అశక్తిమీద ఈయన విదళింపు !

కాని – ఈ పండితుడు అమృతోద్భవ సందర్భంలో మోహినీరూపంలోని కేశవుని వెంటపడిన పరమేశ్వరుని వ్యామోహం మరచిపోయి ఉంటాడు అర్థవాదైక ప్రయోజకములు – తత్త్వచింతనదూరములూ అయిన కథలు పరమార్థనిర్ణాయకాలు కావు ఈయన బహుగ్రంథ పరిశీలనం, సమయస్ఫూర్తీ, ఈ పండితుని పాండిత్య శౌండీర్యాన్ని తెలుపుతుందిగాని అంతర్మథనాన్ని ప్రతిపాదించదు

పాల్కురికి సోమనాథుడు

సోమనాథుడు మూర్తీభవించిన వీరశైవం అచ్చపుతెలుగువాడు ఈతని అభిజనం తెలుగు కన్నడదేశాల సరిహద్దు తుంకూరుజిల్లా 'హాలకురికి' అని కొందరంటే, మరికొందరు వరంగల్లుజిల్లా 'పాలకుర్తి' అన్నారు రెండోదే

1 భారతీయ పరివ్రాజకులు

సమంజస మనిపిస్తుంది. తండ్రి రామిదేవుడు, తల్లి శ్రియాదేవి. శైవకవులు పలువురున్నా ఈతడు వీరశైవ కవులకు విజయ స్తంభంగా నిలిచి కనబడతాడు. ఈయన సంస్కృతాంధ్ర కర్ణాటాది భాషల్లో గొప్పపండితుడు. తాను నేర్చిన అన్ని భాషల్లోను రచన కొనసాగించినవాడు. ఈయన రచించిన గ్రంథాలు 20 దాక ఉంటాయి.

అనుభవసారం, చతుర్వేదసారం, సోమనాథభాష్యం ఇత్యాదులు మత గ్రంథాలైతే - వృషాధిప శతకం, బసవపురాణం, పండితారాధ్య చరిత్ర కవితారచనలు. పాండిత్యప్రకర్షలో శ్రీనాథకవికి సమానస్కంధుడైనా - కవితాపారమ్యంలో - కళాదృష్టిలో రెండవశ్రేణిలో నిలుస్తాడు. ఆయనకు కవితముందు - మతం ముఖ్యాంశ అయితే, ఈయనకు మతం ప్రధానం కవిత ఉపసర్జనం.

ఆంధ్రకవితా ప్రస్థానంలో ఈయన ఒక విప్లవవాది. భాషలో, భావంలో, ఛందస్సులో ఈయనది తృతీయపంథ - నన్నయ వేసిన తెలుగు కవిత్వపుబాటకు ఎదురుతిరిగి తానొక కొత్త పథం సృష్టించాడు.

మతం విషయంలో ఈయనవాక్కు ఎంతనిదాఘసదృశమో భాషా అంత కఠోరభణితి.

వృషాధిపశతకం చూస్తే మార్గకవితలో ఈయన ఎంతచేయితిరిగినవాడో సంస్కృతంపైద ఎంతమోజో తెలుస్తుంది. పద్యం ప్రౌఢంగా భావబంధురంగా వ్రాయగలదిట్ట.

"చూర్ణిత మన్మథాయ పరి
శోభిత భస్మవిలేపనాయ సం
పూర్ణ మనోరథాయ గత
పూర్వ భవాశ్రితవస్త్రనాయ తే
వర్ణనిరాసకాయ సశివాయ
నమో" అని సంతతంబు నిన్
వర్ణన సేయువాడ బస
వా! బసవా! బసవా! వృషాధిపా

ఇట్లే అనేక భాషలు తెలుగుపద్యంలో ఇమిడ్చి నిశితంగా వ్రాయగలవాడు

శైలీసౌకుమార్యంగల బసవోదాహరణంలోని ఈ పద్యం చూడదగినది

"నీవు దయాపయోనిధి!
నిన్ను నుతించిన గల్గు భక్తి నీ
చే పరవీరశైవరతి సేకుఱు
నీ కయి యిత్తుఁ గబ్బముల్
నీ వలనం గృతార్థుఁడ జ
నించును నీకు నమస్కరింతు నీ
భావమునందు నుండి నను
బాయకుమీ బసవయ్య వేడెదన్"

ఉదాహరణ పద్ధతిలో ఈయన సర్వవిభక్తులు కూర్చడం ఇందులో గమనించదగ్గది

చతుర్వేదసారంలోని ఈ సీసం ఎంత వద్దనుకున్నా నన్నయగారిని జ్ఞాపకం చేస్తుంది

"వైదికులిది శుద్ధవైదికంబని యన
శాస్త్రజ్ఞులిది ధర్మశాస్త్ర మనగ
అని ప్రారంభించి ఎత్తుగీతిలో —
కవులు భువిని నిదియె కావ్యంబనంగ స
జ్జనులకెల్ల మిగుల సంతసమున
నిర్వికల్పరతి చతుర్వేద సారమన్
పద్యముల్ రచింతు బసవలింగ!

అంటే - ఈయన నన్నయ భారత రచనను బాగా చదివినవాడేగాని వదలిన వాడు కాడని తెలుస్తుంది లేకపోతే - 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని' అనే భారతపద్యంవంటి పద్యం రచించడం సంభవించదు

బసవపురాణ రచననాటికి సోమనాథుడు నన్నయ మార్గకవితలో రచన చెయ్యకూడదనీ, ప్రజామధ్యంలోకి వెళ్ళాలంటే ఇంతకన్న సన్నిహితమైన దేశిరచన అవలంబించాలని కొత్త సిద్ధాంతం ప్రతిపాదించి దానికి నాయకుడై శివకవితకు కొత్తదారి తెరిచాడు

నాటితో భాష మారిపోయింది
ఛంగన్న కొత్తమార్గం తీసుకుంది
జాను తెనుగు నినాదానికి పునరుజ్జీవనం వచ్చింది
తనవరకు అవలంబించిన [illegible] తారీతి
ఎందుకు నచ్చలేదో ఇట్లా సూత్రబద్ధం చేశాడు

"ఉరుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జానుఁదెనుంగు
చర్చింపగా సర్వసామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు కోర్కె దైవారఁ -
తెలుగుమాటలనంగ వలదు వేదముల
కొలఁదియగాఁ జూడుఁడు ——
అల్పాక్షరముల ననల్పార్థరచన కావించుటయె గాదె కవివివేకంబు"

పై ఒ వపు[illegible]క్తి కంటె - బలంగా ద్విపదను, తెలుగురచనను పండితారాధ్య చరిత్రలో సమర్థించాడు

"తప్పకుండగ ద్విపదలు రచియింతు
నొప్పదు, ద్విపదకావ్యోక్తి నా వలవ
దారూఢగద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృతభూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబు గామి
జానుఁదెనుఁగు విశేషము ప్రసన్నతకు

ఉపమింప గద్యపద్యోదాత్త కృతులు
ద్విపదయు సమము భావింప

సంస్కృత ప్రచురమైన రచనలను తిరస్కరించేవారికి - ఈయన కవిత్వం మీద ఎంతవరకూ గౌరవ ముందో తెలియదుగాని—పై ద్విపద పంక్తులు మాత్రం వేదవాక్యాల్లా ఉద్ధరించడానికి పనికివచ్చాయి చమత్కార మేమిటంటే - సోమనాథుడు ఇంతగా 'ఆరూఢ గద్య పద్యాది ప్రబంధరచనను విదళించినా తానుగూడా పదులమీద సంస్కృత సమాసాలు తన రచనల్లో గుప్పించిన

చోట్లున్నాయి ఎంత నిరసించి తప్పించుకుందా మన్నా - క్లిష్టత, శక్తి మంతంగా చెప్పడానికి సంస్కృతం తప్ప గత్యంలేదు నాలుగైదు తెలుగు మాటల్లో చెప్పవలసిన భావాన్ని ఒకసమాసంతో ఒక కృత్తద్ధి ప్రయోగంతో చెప్పవచ్చు సోమనాథుడు ఇవి తెలియనివాడు కాదు వాటి అవసరం వచ్చినప్పుడు వాటిని ఉపయోగించుకోగలవాడు

బసవ పురాణంలోను పండి చరిత్రలోను ఆయన ద్విపదలలో, మెడలు, కాళ్లువిరిచి ఉపయోగించిన శ్రుతిస్మృతి వచనాలు, 'గద్యపద్యాది ప్రబంధపూరిత సంస్కృతభూయిష్ఠ రచనల' కంటె దురవగాహమైనవి అయినా తన వాదబలంకోసం 'సర్వసామాన్యం కాకపోయినా వాటిని బళ్లకొద్దీ ఉపయోగించడం జరిగింది పై ప్రతిజ్ఞలు ఎంతవరకు పనిచేశా యంటే - సామాన్యంగా కథచెప్పేటప్పుడు జాతీయమైన ఉపమానాలు చెప్పేటప్పుడు ఒడుపైన నుడికారం వాడేటప్పుడు శుద్ధమైన దేశికవిత్వ స్వరూపం తెచ్చాయి

ఈయన ఆంధ్రసాహిత్యానికి చేసిన మహోపకారం ఏమంటే తన నాడు ప్రచలితంగా ఉన్న తెలుగుభాషను రస కవితలో సమృద్ధిగా వాడాడు ఆ తెలుగు ప్రాఖ్యాతి వారికి అర్థం గాకపోవచ్చు అది తెలుగు నిఘంటువులకు చాల వరకు ఎక్కకపోవడం నిఘంటుకారుల పరిశీలనా లోపం కాని కవితప్పు కాదు అయితే - శివకవుల రచనాభోగం ఒకప్పుడు ఎంతవ్యాప్తిలో ఉన్నా తర్వాత సరియైన ప్రచురణలోకి రాలేదు అందువల్ల ఆ వాఙ్మయం ఆంధ్రభాషాధ్యయనానికి, వర్గీకరణకు దూరంగానే నిలిచిపోయింది శ్రీ నాగేశ్వరరావు పంతులు గారు శ్రద్ధచేసి బసవపురాణ పండితారాధ్య చరిత్రలను పుల పీఠికలతో ప్రచురించేదాక - సారస్వతాభిమానులకు అవి దుర్లభంగానే ఉండిపోయాయి తర్వాతనైనా శివకవులువాడిన అన్ని శబ్దాలకు అర్థం తెలియదు సందర్భోచితంగా భావించి తృప్తిపడవలసిందే ఈయన వాడిన తెలుగు తిక్కనకు కూడా ప్రాచీనమనుకోడానికి వీలుంది

ఈయన తెచ్చిన రెండవసంచలనం నవపూర్వ లు చుగా వాడని ద్విపదను అగ్రపీఠ మెక్కించడం సంస్కృతకవులు అనుష్టుప్పను మహాకావ్య రచన కుపయోగించినట్లు తాను ద్విపదతో మహాకావ్య రచనను నిర్వహించ డానికి కంకణం కట్టుకున్నాడు దానికి తగిన వాదం సిద్ధం చేశాడు

సంస్కృత పురాణేతిహాసాలకు ప్రతిద్వంద్విగా తానొక ఆంధ్ర శివభక్తపురాణం తయారు చెయ్యాలనుకొన్నాడు అది పూర్వాంధ్ర కవితారచనలా ఉండగూడదు విలక్షణంగా ఉండాలి ... కవుల మార్గాలను జ్ఞప్తికి తేగూడదు 'ద్విపద కవిత దిడ్డికంత' అనే అపఖ్యాతి పోగొట్టాలి

మూడవ సంచలనం ఉద్ధత వీరశైవప్రచారం వీరశైవము తప్ప తక్కిన దర్శనాలు, మతాలు క్షుద్రములు అని ఎలుగెత్తిచాటడం దాని ఉపబలకంగా శ్రుతిస్మృతులనే కొండలను పిండికొట్టడం వీటివలన సోమనాథుడు ఉద్దండ శివకవిగా మిగిలిపోయాడు

ముఖ్యవిశేషమేమంటే - శివ భాషరితములైన సంస్కృత పురాణాలను తెనిగించదలచుకోలేదు తాను పురాణ, నవీన శివభక్తుల అద్భుతకథలను దేశిచ్ఛందస్సులో తెనుగులో మొలిచినట్లు వ్రాయదలుచుకున్నాడు పూర్వ శివపురాణాలలోని శివమహిమకంటె శివభక్తులమహిమ గొప్పదని నిరూపింపదలచి ద్రావిడ కర్ణాటాంధ్ర శివభక్త శిఖామణుల కథలు చేర్చి బసవపురాణమను పేట వెలయించాడు

శైవ సమయాన్నిబట్టి గురు, లింగ, జంగమములలో లింగముకంటె జంగముడు గొప్ప అంటే భక్తుడని అర్థమవుతుంది, ఈ వీరశైవానికి మూలస్థానం బసవనభక్తి, వీర అంటే వారి అర్థం ఇదియట - వి = విద్యయందు, ర = రమించువాడు విద్యలో రమిస్తూ హేయమైన మాయను విడిచిపెట్టడం వారిసిద్ధాంతం ఈ శబ్దాన్ని ఇలా విరిచి అర్థం చెప్పడానికి ఏ సూత్రాలు ఉపయోగించారో చెప్పలేం

వీరశైవానికి పట్టుగొమ్మ ఆధారపీఠం బండారి బసవన్న ఇతడు కర్ణాటదేశంలో మండెగ మాదరాజు, మాదాంబ అనే దంపతులకు నందీశ్వరుని అవతారంగా జన్మించాడు

పుట్టుకతోనే మహాశివభక్తుడై కర్మమార్గాన్ని తదనుయాయులైన శ్రోత్రియ బ్రాహ్మణులను నిరసించి భక్తిమార్గంఒక్కటే పరమార్థం అని బోధించాడు యుక్తవయస్సులో తండ్రి ఉపనయనంచేస్తానంటే కర్మమార్గాన్ని గాయత్రిని దుయ్యబట్టాడు

"పడుగని యిదిమేమి గడియించెదీవు ?
జడుడ వెట్లయితి ? నశ్వరుని గొల్చిమును
. .. .
వితత ద్విజత్వంబు పతితంబుగాదె
నిర్మల గురుకృపాన్విత జన్మనకు
కర్మ జన్మంబు దుష్కర్మంబుగాదె
అగ్గురు పాదంబు లర్చించునతని
కగ్గిలో హావివేల్చుటది తప్పుగాదె ?
మల హారాత్మక మగు మంత్రంబు గఱచి
పలు మంత్రములుగొన పాపంబుగాదె
శూలిభక్తుల కెత్తుకేలది త్రాటి
మాలల కెత్తుట మఱి తప్పుగాదె
కర్మపాశంబు లొక్కట తెగ నీల్గి
కర్మంబు త్రాళ్ళు దాఁ గట్టుకోఁదగునె ?
రుద్రాక్ష భసితాది ముద్రలు దాల్చి
క్షుద్రముద్రలు దాల్పఁ గూడునే చెపుమ—"

శివునకు నమస్కరించే చేతితో త్రాటిమాలలకు నమస్కరించడం కంటె తప్పు ఇ కేమిటి ? అన్నమాటలో ఇతనికి బ్రాహ్మణ్యంమీద ఉండే అసహ్యం బయట పడుతుంది. త్రాటిమాలలంటె జందెం ధరించిన బ్రాహ్మణులని ఈయన అర్థం గురుపాదాలు అర్చిస్తేచాలు అగ్నిలో వేలిమి వ్యర్థం శివమంత్రం చేకొన్న వాడికి తక్కిన మంత్రాలు పనికిమాలినవి

రుద్రాక్ష విభూతులే గొప్పముద్రలు, తక్కిన సంధ్యావందనముద్రలు క్షుద్రమైనవి

నిశ్చల శివభక్తి కులసతివంటిది, బహుదేవతా సేవచేసే బ్రాహ్మణమార్గం వేశ్యలాంటిది
బస ౧౫

శివభక్తుడు అన్యదేవతాస్మరణంచేస్తే 28 కోట్ల నరకాలు ప్రాప్తిస్తాయి
బస ౧౫

బ్రాహ్మణుడైతే భక్తుడెలా అవుతాడు?
భక్తుడైతే బ్రాహ్మణుడెలా అవుతాడు?

అని ఈయన తిరుగులేని ప్రశ్న — ఈ బోధ ద్విజేతరులకు బాగా నచ్చి ఉండాలి

సప్తాపరమైన కర్మమార్గం నిరసించడం వర్ణరాహిత్యాన్ని ప్రచారం చేయడంవల్ల ఈయనకు అనుయాయివర్గం అధికాధికంగా ఏర్పడి ఉంటుంది దానికితోడు ఈతని మహిమల ప్రదర్శనంకూడా ప్రజలను దిగ్భ్రాంతుల్ని చేసి ఈతడే మహేశ్వర స్వరూపం అనే నమ్మకాన్ని కలిగించింది

ఈయన మహిమలకు, బోధలకు ఆకృష్టులై ఆంధ్రదేశంలోని పండిత సోమనాథాదులు కూడా పరవశులై ఈయన చరిత్రగానంలో నిమగ్నులయే వంతు వచ్చింది

"బసవపురాణ ప్రబంధమున్ జేసి
బసవ గోత్రుండను బసవని గరుణ
బసవేశు శ్రీపాదపద్మ సేవకుడ,
బసవన్నఁ బొగడఁ జాల్పు కవీంద్రుఁడను
బసవన్నఁ బొగడఁ జాల్పడు పారకుండ
బసవన్న దూత నే బసవన్న బంట
బసవన్న లెంక నే బసవన్న లెంగి,
బసవన్న ఇలు పుట్టు బాలిన కొడుకి"

ఇంత వీరావేశంతో బసవన్నను ఆరాధించే సోమన్న నియమ నిష్ఠ లివి —

"భవికృతారంభ సంభవ ధాన్య నిచయ
భవినిరీక్షణ రసపాక వితాన
భవిహస్తగత ఫలపత్ర శాకాది
భవిగృహ క్షేత్రాంఘ్రిపథ వర్జితుండ
భవిజన దర్శన స్పర్శనాలాప
వివిధ దానా దాన విషయ దూరగుడ"

భవులంటే శైవేతరులు భవం అంటే పుట్టుక, మాయ, అవి కలవారు భవులు వారు పండించిన ధాన్యఫలశాకాదులు ముట్టడు, తినడు అట్టివారిని చూడడు

"వడుగని యిదిమేమి గడియించెదీవు ?
జడుడ వెట్లయితి ? నశ్వరుని గొల్చిమును
. .. .
వితత ద్విజత్వంబు పతితంబుగాదె
నిర్మల గురుకృపాన్వీత జన్మనకు
కర్మ జన్మంబు దుష్కర్మంబుగాదె
అగ్గురు పాదంబు లర్చించునతని
కగ్గిలో హావివేల్చు టది తప్పుగాదె?
మల హారాత్మక మగు మంత్రంబు గఱచి
పలు మంత్రములుగొన పాపంబుగాదె
శూలిభక్తుల కెత్తుకేలది త్రాటి
మాలల కెత్తుట మఱి తప్పుగాదె
కర్మపాశంబు లొక్కట తెగ నీల్గి
కర్మంబు త్రాళ్ళు దాఁ గట్టుకోఁదగునె ?
రుద్రాక్ష భసితాది ముద్రలు దాల్చి
క్షుద్రముద్రలు దాల్పఁ గూడునే చెపుమ—"

శివునకు నమస్కరించే చేతితో త్రాటిమాలలకు నమస్కరించడం కంటె తప్పు ఇ కేమిటి ? అన్నమాటలో ఇతనికి బ్రాహ్మణ్యంమీద ఉండే అసహ్యం బయట పడుతుంది. త్రాటిమాలలంటె జందెం ధరించిన బ్రాహ్మణులని ఈయన అర్థం గురుపాదాలు అర్చిస్తేచాలు అగ్నిలో వేలిమి వ్యర్థం శివమంత్రం చేకొన్న వాడికి తక్కిన మంత్రాలు పనికిమాలినవి

రుద్రాక్ష విభూతులే గొప్పముద్రలు, తక్కిన సంధ్యావందనముద్రలు క్షుద్రమైనవి

నిశ్చల శివభక్తి కులసతివంటిది, బహుదేవతా సేవచేసే బ్రాహ్మణమార్గం వేశ్యలాంటిది
బస ౧౮

శివభక్తుడు అన్యదేవతాస్మరణంచేస్తే 28 కోట్ల నరకాలు ప్రాప్తిస్తాయి
బస ౧౯

అని ప్రారంభించి బసవనామంతో ద్విపదపంక్తులు ఎసుగు విరామం లేకుండా వ్రాసి —

'వడిఁబాఱు జలముల కొండలెల్లఁ గాళ్ళు
వడిఁగాఱుచిచ్చున కొండలెల్ల నోళ్ళు
వడివీచుగాడ్పున కొండలెల్లఁ దలలు
వడిఁజేయు బసవ ! నీ కొండలెల్ల భక్తి"

అని తనపారవశ్యానికి తగ్గ దృష్టాంతాలతో అలంకరించాడు

క్రీ శ 1162 ప్రాంతంలో కల్యాణినగరాన్ని పాలించే కలచురిబిజ్జలుని వద్ద కోశాధ్యక్షుడుగా ఉన్న బసవన్న మేనమామ బలదేవ దండనాయకుడు తన కుమార్తెను గంగాంబను బసవన్న కిచ్చి వైభవోపేతంగా పెండ్లిచేశాడు ఆనాటి నగరా లంకరణం పెండ్లివేడుక బసవన్నమూర్తిని సోమనాథుడు అమోఘంగా వర్ణించాడు ఆ పెండ్లిలోని గాన విశేషాలు వింటే సోమనాథుని సంగీతపరిచయం ఏతన్మాత్రం గాదని తెలుస్తుది

బసవన్న సంగమదేవుని దర్శనానికి వెళ్లాడు ఆయన సాక్షాత్కరించి అన్నమాటలు వీరశైవానికి దిక్సూచికలు —

"శూలి భక్తాళి దుశ్శీలముల్ గన్న
మేలకా గైకొనుమీ బసవన్న !
శత్రులైనను లింగసపిత్రులై యున్న
మిత్రులుగా జూడుమీ బసవన్న !

. . .

చిత్తజాంతకు భక్తిఁ జెడనాడు ఖలుల
మిత్తివై త్రుంపు మీ బసవన్న !
తిట్టిన భక్తులు కొట్టినఁ గాల
మెట్టిన శరణను మీ బసవన్న !"

బసవన్న అనే మకుటంతో ఈ ఉపదేశం 30 పంక్తులు సాగింది ఆశ్వాసాంతంలో 10 సంస్కృత సమాసాల బసవన సంబోధన 8 పంక్తుల ఏక సంస్కృత సమాసం - ఎంత దులవరించినా సంస్కృతం పట్టు సోమన్నమీద

ఎంత గాఢంగా ఉందో బోధపడుతుంది. పై పంక్తులలో అంతరంగంలో శివేతరుల హింస, శివభక్తుల ప్రశంస ధారాళంగా ఉబుకుతూనే ఉన్నది.

ఈ సూత్రాలకు లక్ష్యంగా మడివేలు మాచరయ్య కథను ఎంచుకోవచ్చు.

మాచరయ్య పరమ మాహేశ్వరుడైన ఒక రజకుడు. శరణుల (శైవుల) బట్టలే ఉదుకుతాడు. ఉదికి శుభ్రపరచి వీపుమీద మోపుగా పెట్టుకొని తెస్తూ గంట వాయిస్తాడు. భవులు (శివేతరులు) వాటిని తాకరాదు. తాకితే చేతిలోని ఆయుధంతో వాణ్ని నిశ్చింతగా పొడిచివేస్తాడు.

ఒకనాడు ఇది తెలియని పొరుగూరి వాడొకడు సంతకుపోతూ తగిలితే వాణ్ణి చంపి ఆకాశాని కెగరేశాడు. బట్టల మూటనూ పైకి విసిరాడు. రెండూ పైనే ఉండిపోయాయి. ప్రజలు ఈ ఉదంతానికి భయభ్రాంతులై రాజు బిజ్జలునితో చెప్పగా అతడు కోపించి మంత్రి బసవన్నను దీనికి తగిన ప్రతీకారం చెయ్యవలెనన్నాడు. బసవడు ఆ మహాభక్తుని మహిమను వేనోళ్ళ పొగడుతూ మీరు వెళ్ళి పరాభవం పొందవద్దన్నాడు.

రాజు బసవన మాటలు లక్ష్యపెట్టక కొందరు మావటీంద్రను పిలిచి ఒక మదపుటేనుగుతో మాచయ్యను తొక్కి చంపించమన్నాడు. మాచయ్య అంతా చూచి సంక్రుద్ధుడై మావటీంద్రను చంపి ఏనుగును పొడిచి పైకెగరేశాడు. రాజు పశ్చాత్తప్తుడై ఏనతోరాగా, బసవన్న వచ్చి మాచయ్య పాదాలమీదపడి ప్రార్థించాడు. మాచయ్య అనుగ్రహించి చంపిన అందరినీ విభూతిజల్లి బ్రతికించాడు. ఆకాశాని కెగిరిన బట్టల మూట మళ్లా మాచయ్య వీపుమీదకు వచ్చింది.

ఇంతకన్న వీరశైవుల కఠోర దీక్షకు, మహిమలకు వేరే ఉదాహరణం అక్కరలేదు.

ఇట్టి వీరత్వం, మహిమ ప్రదర్శనమే కాకుండా, ఎన్నో శివభక్తుల అత్యంత చమత్కారములు, ఆర్ద్రములు అయిన కథలు బసవ పురాణంలో ఉన్నాయి.

(1) ముగ్ధ సంగయ్య తానూ పక్కన జంగములవలెనే లంజెరికానికి వెళ్ళి - ఒక వేశ్య ఇంటినంతా శివమయంగా చూస్తాడు. సంగయ్య 'నీవు

కూడా ఏల విభూతి రుద్రాక్షలు ధరించలేదు' అని అడిగితే ఆ వేశ్య చెప్పిన జవాబులు బహు చమత్కారంగా ఉంటాయి ఇతని అమాయికత చూస్తే ఋష్యశృంగుడు జ్ఞాపకం వస్తాడు

(2) బెజ్జ మహాదేవి శివుని బిడ్డగా చూచి లికిన ఎలుకులూ, బాల్యోప చారాలు, సోమన్న మాతృహృదయ [illegible] గొప్ప ఉదాహరణలు

(3) గొడగూచి అనే బాల భక్తురాలు భయంతో శివలింగంలో దూ[illegible] పోగా ఆమె జుట్టుమాత్రం పైకుంటుంది 6 నెలల [illegible] కత్తిరిస్తారట

(4) నాట్యమిత్తండి అనే భక్తుడు శివుని నాట్య భంగిమలో ఎత్తి[illegible] కాలికి వాతదోషమని బాధపడి వైద్యం చేయిస్తాడు

(5) దీపకళియారు అను జుట్టును జడగా అల్లి అంటించి శివునకు కాగడా పడతాడు

(6) కన్నప్పకథ కాళహస్తి కథకు భిన్నంగా చమత్కారంగా కనబడు తుంది కన్నప్ప శివునకు రెండు కన్ను లివ్వగా నాలుగైనవట — ఇందులో ఏనుగును చంపినది చెలదిగాని పాముగాదు శివుడు దిన్న కఅకుట్లు రాక్షసుడు మృగరూపము లెత్తగా వారి మాంసములు

7 కాట కోటయ్య మేక పెంటికను శివలింగంగా భావించి పాలతో అభిషేకం చేస్తే తండ్రి కోపించాడు కోటయ్య తండ్రి తల తెగనరికాడు

(8) మొఱవట వెంకయ్య మోడులో పత్రి సంపాదించాడు గొడ్డు నుంచి పాలు పిదికాడు

(9) ఒక మిండ జంగము వేశ్యకై చీర లడగగా బసవన్న తన భార్య చీరలొలిచి ఇచ్చాడు ఒలిచినకొద్దీ ఒక చీర శరీరాన్ని విడవలేదు మోపుగా వడ్డ చీరలన్నీ మోసుకుపోయి మిండ జంగము వేశ్యకిచ్చాడు బసవన్న భార్య గంగాంబతో 'పుట్టమిస్తే మరి మనం పుట్టము' అని చీరలన్నీ చూరలిచ్చిన కథ అతని జంగమ భక్తికి పరమావధి - ఆ చీరల ప్రసక్తిలో సోమనాథుడు వర్ణిం చిన వలువన్నెల చీరలు చూస్తే ఆనాటి తెలుగు దేశపు వస్త్ర సౌభాగ్యం అమోఘం అపూర్వం అనిపిస్తుంది వేయేల ఆ వీర శివభక్తివల్ల జొన్నలు ముత్యాలయాయి నక్కలు గుఱ్ఱాలయాయి

మొత్తంమీద తెలుగు దేశపు, పొరుగుదేశపు, అచ్చపు దేశీయ కథలతో తెలుగు కవిత్వానికే కొత్తరూపు తెచ్చాడు సోమనాథుడు అంతేకాదు తన మనస్సులోని భావానికి ఉజ్జ్వలమైన బొమ్మకట్టి చూపగల నేర్పు గలవాడు వస్తు వర్ణనలో, అలంకార విన్యాసంలో పద గుంఫనలో ఏ గొప్ప కవికీ తీసి పోని చాతుర్యం గలవాడు

ఈశ్వరుడు నాట్య మిత్త్రండికి వర్ణించి చెప్పిన తాండవ వర్ణనం అతని కవితా శక్తికి ఎరుగులేని నిదర్శనం —

ఇది తాండవాకార మెట్టులంటేని — అని ప్రారంభించి—

'స్ఫుట ఫాలనేత్రాగ్ని భుగులన వెసయ
వడి నెగసెడ నేత్ర వహ్ని రోచులకు
జడలపై చంద్రుడా సగమును గరఁగఁ
గలయ సుధానూతి గరఁగిన కతన
బలువిడి నమృతంబు తల డిగి పడవ
తలడిగి పరతెంచు తత్సుధాపూర
మలరి ముంచుడు జీవములు వచ్చినంత

పరగ సురాసుర బ్రహ్మాచ్యుతాది
వం కపాళావళుల్ శరణు వేడుచును
బొబ్బలు వొడువంగఁ బొంగి యార్వంగ -
నుబ్బి యాళతి సేయ నొగి తాళగింప
క్రీడ వత్రిల జతి గీతముల్ వాడ
నావుడు ప్రమథులు సూడ తాండవము ''

ఫాలాగ్నికి చంద్రుడు కరిగి అమృతం జాలువారితే కపాలాలు జీవం వచ్చి పలకడం అపూర్వ కల్పన

ఒకనాడు మంత్రులు బిజ్జలరాజుతో బసవడు జంగాలకు కోశం కొల్ల గొట్టి యిస్తున్నాడని ఫిర్యాదు చేస్తే బసవన్న అన్న మాటలు —

"పరమేశు భక్తియన్ సురతరువుండ
హారభక్తియన్ కనకాచలంబుండ

మృగీతతి యెద్దెస మేయునే పుల్లు ?
క్షీరాబ్ధిలో వలఁ గ్రీడించు హంస
గోరునే పడియల నిరు ద్రావంగఁ
జూలి ఫలంబులఁ జుంబించు చిలుక
ప్రాలి బూరుగుమ్రాను పండ్లను గొనునె ?
రాకాలయజ్యోత్స్న ద్రావు చకోరి
మాకాంక్ష సేయునే సీకటి ద్రావ
పుడమీశ మీ ధనంబునకుఁ జే సాప"

ఈ పంక్తులలోని సొగసుకు మెచ్చి ఈ భావాన్నే భాస్కరుడు, పోతన వగైరాలు స్వీకరించారు

ఒకసారి బసవన్న బిజ్జలుని సభలో కూర్చుని హఠాత్తుగా "భయంలేదు భయంలేదు -" అని రెండు చేతులూ చాచి పట్టుకోబోగా – రాజు నవ్వుతూ–

"ఇసుమంత బూడిద నొసల బూసినను
మసలక కొండంత మరులెత్తె నన, –" అంటాడు

ఈ ఆక్షేపణ రాజు నోటినుంచి హాస్యంగానే వచ్చినా ఒకవైపు ప్రజలలో ఈ భావం ఉందన్నమాట –

దీనినే శ్రీనాథుడు హర విలాసంలో చమత్కరిస్తాడు

ఆవగింజంత బూది మైనలదె నేని
వెలది ! గుమ్మడి కాయంత వెఱ్ఱిపుట్టు –

ఈ మాట ఎంత హాస్యానికన్నా - ఇందులో ఒక వెటకారం గర్భితంగా ఉండి ఆనాటి వీరశైవానికి వ్యాఖ్యగా పనిచేస్తుంది సోమన్న ఎంత కవియైనా వైదుష్యఖని అయినా – అతన్నీ గుమ్మడికాయంత వెఱ్ఱి ఆవహించి ఈ దురుసు లాడించింది

'పురహారార్చితులకు మున్నెత్తుకేలు
ధర నెత్తఁగూడునే త్రాటిమాలలకు ?

శ్రీమహాదేవు నర్చించు చేతులను
ఆ మాల సెంకల నర్చింపఁ దగునె?
వేద భరాక్రాంతులనగ
బడిన బ్రాహ్మణ గార్దభంబులతోడ !'

ఈ శైవ తీవ్రతవల్ల విరసధోరణివల్ల చాలమంది సమరసవాదుల అభిమానాన్ని వీరు దూరం చేసుకున్నారు

బసవన్న తర్వాత ఈయన ఆరాధనకు పాత్రమైనవాడు మల్లికార్జున పండితారాధ్యుడు

పండితుని చరిత్రను ఈయన గర పండిన పాండిత్య ప్రతిభతో, బహు భాషావేత్తృతతో దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వత అనే అయిదు ప్రకరణాలతో మహాగ్రంథంగా వెలయించాడు ఈ పుస్తకం ఆ మూలాగ్రం చదివితే ఆలంకారిక వేద పురాణ శాస్త్రాలలో సంగీతాది కళారహస్యాలలో ఈయనకు తెలియని మర్మం ఏదైనా ఉన్నదా ? అనిపిస్తుంది

దీక్షా ప్రకరణంలో విభూతి, పాదోదక, లింగధారణాది మహిమ, పురాతనంలో విశిష్ట శివభక్త కథలు, వాదంలో జైన, బౌద్ధ, వేదాంత, సాంఖ్య, యోగమత ఖండనం, మహిమలో సెయనశిఖ నయన లాభాది బహు విషయాలు వర్ణింపబడ్డాయి

సోమనాథుడు ఆంధ్ర, కర్ణాట, తమిళ మహారాష్ట్ర, సంస్కృత భాషలలో తనకున్న అవిరళ ప్రవేశాన్ని భక్తబృందం శ్రీశైలానికి నడిచే వరుసలో చమత్కరించి చూపాడు ఒక్కమాటలో చెప్పవలసివస్తే పండితారాధ్య చరిత్ర వీరశైవ విశ్వరూప ప్రదర్శనం అని చెప్పవచ్చు వీరశైవం, జైన బౌద్ధాలను అడ్డువచ్చిన ప్రతిమతాన్ని నేలమట్టంచేసి - కళ్లు పెరుక్కుని గండకత్తెరలు వేసుకుని, జుట్టు అంటించుకుని, నీళ్లను నూనెగా వెలిగించి, కాదన్నవారి తలలు ఖండించి, తన మాహాత్మ్యం చూపి తన భైరవశక్తి ప్రదర్శనంతో తెలుగుదేశాన్ని హడలు గొట్టిందని చెప్పవచ్చు

వీరశైవం ఉత్కట శివభక్తితో భవబంధాలను తెగగొట్టడమే కాక స్థిరపడ్డ భావబంధాలనుకూడా తెగగొట్టింది అంతటితో ఆగక తన కవితా నూతనాధ్యాయంలో - అంతకు ముందు మార్గకవులేర్పరిచిన భాషా బంధాలను కూడా విచ్ఛిన్నంచేసి తాను ప్రాకులోంగక భాషనే తనకు లొంగ దీసుకుంది

జాను దెనుగు అనే నినాదంతో తన నాటి తెనుగును నిర్భయంగా కావ్యభాష చేసింది

జాను దెనుగు అనే మాట చాలా వివాదాలకు దారితీసింది ఈ జాను దెనుగు నినాదం లేవదీసినవాడు ముందు నన్నెచోడుడు ఆయన దాన్ని నిర్వచించలేదు కన్నడంలోని జాణ్ణుడి నుంచి ఇది వచ్చిందన్నారు జాణతనంతో కూడిన తెనుగును జానుదెనుగు అనవచ్చు నన్నారు సోమన్న వృషాధిప శతకంలో ఇది జానుగెనుగు అని వ్రాసిన పద్యంలో ఉన్నదంతా అచ్చతెనుగు జానుతెనుగు అంటే అచ్చతెనుగా? అనే సందేహం మళ్లా వచ్చింది 'జాను దెనుగు విశేషము ప్రసన్నలకు అనేమాట విరోధిస్తుంది అచ్చతెనుగు ప్రసన్నం కాదు ఒకచోట ప్రతికం, ఒకచోట దురవగాహం - కనుక జానుదెనుగు అంటే అచ్చతెనుగు అనుకోకూడదు తెనుగు భాషతో కలిసిపోయి అర్థావగాహనంలో శ్రమ కలిగించని తత్సమ పదాలతో కూడి ఇంపుగా ప్రజలకు సన్నిహితమైన భాషను జానుదెనుగు అనవచ్చు చదునుతెనుగే జానుదెనుగు అని పరిష్కరించారు

సోమన్న అవసరమైతే సంస్కృత వ్యాకరణాన్ని తృణీకరించి విసంధులు, దుస్సంధులు వాడడానికి జంకడు

1) 'రుద్రాయి నమోస్తు' అనడానికి బదులు 'రుద్రాయ నమో అస్తు' అంటాడు

2) 'ఆ సురాణేయ ఆహ్వాయ' వంటి విసంధులు
దుర్వాసస్ + ముఖ్యులు = దుర్వాసోముఖ్యులు
అనవలసి యుండగా 'దుర్వాసముఖ్యులు' అనీ

స్వాదు + ఏక = స్వాద్వేక అనడానికి బదులు స్వాదైక అనీ నిశ్చితంగా వ్రాస్తాడు

3) కర్తృ + అనుసారి = కర్త్రనుసారి అనడానికి బదులు కర్త్రానుసారి అంటాడు

4) తెలుగు నియమాలను కూడా పాటించడం ఉండదు

i అరిది × అర్ది లంజెరికము × లంజెరికము కురియ × కుర్య అని పదమధ్య ఇకారలోపం చేస్తాడు

ii. వెల్లివిరియన్ × వెల్విరియన్ అనడానికి అభ్యంతరం లేదు

iii వైరి సమాసాలకు సోమన్న కవిత గని –

1 భక్తబండారం 2 శివమరులు 3 నిత్యపడి 4 పుడమీశ 5 షోడశ పండువు 6 బ్రహ్మపురులు 7 దీపకంబములు 8 పంచవన్నియలు (శ్రీనాథుడున్నూ వాడెను) 9 ముల్లోకవంద్య

iv మహద్వాచకాలకు స్త్రీలింగరూపాలు –

1 శంకరదాసి 2 భక్తసమూహి 3 దాసి 4 ముక్కంటి భక్తులు ముగ్ధలు

v ప్రాచీనాంధ్ర శబ్దాలు

1 బొప్ప 2 తూపొడుచు (ఉమ్మి) 3 ప్రడ్డలు 4 కనుమరి (కమ్మరి) 5 ఆళతి 6 బిలిబిలి సంసారం 7 దుద్దెక్కి 8 అరుకువ 9 అనుగులా 10 కున్నలు (కూనలు) ఇట్లాంటివి ఎన్నో ! శ్రద్ధగా అర్థవిచారణచేసి ఒక నిఘంటువు రూపొందించవలసినవన్ని – ఉన్నాయి మావిడి అని ప్రాసలో వాడాడు మామిడికి పర్యాయంగా – ఇప్పటికి వాడుకలోనూ ఆ మాటే ఉంది

సోమనాథుని వీరశైవం సామాజికంగా ఎంత సంచలనం కలిగించినా – దేశీయభాషా ఛందస్సుల పరంగా ఆంధ్రభాషకు ఎనలేని సేవచేసింది ఆనాటి అతని అతివాదం అందరికీ నచ్చినా నచ్చకపోయినా అతని మార్గంలో అతని అంత నేత మరొకడు లేడు

కవిరాజ శిఖామణి

కుమార సంభవం

"ముదమున సత్కవి కావ్యము
నెదురున విలుకాని పట్టినమ్మును పరివ్యా
ద్భిదమై తలయూపింపని
యది కావ్యమె? మఱియు పట్టియేయుం గరమే?"

కుమా. ౧ 41

ఉలికిపడి ఎవరీ మొనగాడని తేరిపారి చూడాలనిపిస్తుంది ఆంధ్రకవి పరంపరలో ఇలా అన్నవాడు వేరొకడు లేడు

"గొప్పకవి వ్రాసిన కవిత్వం ఎన్నికైన విలుకాడు విడిచిన బాణం ఎదుటివాడి గుండెకు తగిలి తల ఊపించాలి అలా చెయ్యలేని కవిత్వం ఒక కవిత్వమా, అలా కొట్టలేని ఆ చెయ్యి ఒక చెయ్యా?"

ఏమి ధీమా? ఏమి ఆత్మ విశ్వాసం?

"తన జనకుఁడురు స్థాణువు
జనని యపర్ణాఖ్య దా విశాఖుం డనఁగాఁ
దనరియు నభిమత ఫలముల
జనులకు దయ నొసఁగుచున్న షణ్ముఖుఁ గొలుతున్"

ఈ పద్యం చదివి నిజంగా తల ఊపకుండా ఉండలేము ఇందులోని విరోధాభాసాలంకారానికి కాదు అద్భుతమైన ఈ ఊహా శాలితకు

ఇందులోని చమత్కారం ఇది

ఆ చెట్టు వట్టిమోడు! దానికి ఆకులు లేవు ఆకులేమిటి? కొమ్మలే లేవు ఇంక అది ఏమి పూస్తుంది? ఏమి కాస్తుంది?

అయినా దానికి - ఆరుమొగాల ఒక కొడుకు ఉన్నాడు అతడు కోరిన కోరినవారికి అన్ని ఫలాలు ఇస్తాడు ఎంత విచిత్రం!

స్థాణు, అపర్ణ, విశాఖ, శబ్దాలను ఇతడు తన కవితా చమత్కారానికి ఉపయోగించిన తీరు పరమ రమణీయం

ఇతడు ఇంత దిట్టతనంతోనూ, ధీరత్వంతోను 12 ఆశ్వాసాల మహా ప్రబంధం రచించాడు

అంతవరకు వినపడని ప్రబంధమనే మాట - ఇతనివద్ద తొలిగా వినడం ఎంతైనా ఆశ్చర్యం కలిగిస్తుంది కాని - ఇది నిజం

అప్పుడే - ఒక మహాప్రబంధం పుట్టింది

దాని పేరు కుమార సంభవం -

దాని రచయిత నన్నెచోడుడు -

నిజానికి ఇతడు శివకవియుగంలో మొదటివాడు కాలక్రమాన్ని బట్టి కాక కవితాధర్మాన్నిబట్టి, పండితారాధ్య సోమనాథులకు తర్వాత ఇతన్ని గురించి ప్రస్తావించడం ఇతని విశిష్టతను పట్టి చూపడానికి

మొదటి ఇద్దరూ శివదీక్షాపరులై గ్రంథాలు వ్రాస్తే - ఈయన కవిదీక్షా పరుడై శివకావ్యం వెలయించాడు

1 ఈయన వీరశైవుడు కాకపోయినా అపారమైన శివభక్తి కలవాడు

2 అందరు దేవతలకంటె శివుడొక్కడే మహాదేవుడని నమ్మేవాడు

3 తన గురువైన జంగమ మల్లికార్జునుణ్ణి మహేశ్వరమూర్తితో అభేదంగా చూచేవాడు

4 తానెన్నుకొన్నది శివకథ ఆ కథలో మహేశ్వర మాహాత్మ్యం ప్రతిపాదించడం తన కర్తవ్యంగా ఎంచుకున్నాడు

5 శివకవుల లక్షణమైన దేశికవితాభిమానం జానుతెనుగుమీది ప్రీతి, వారిలాంటిదే కన్నడ కవితాభిరతి తత్ప్రభావం పుష్కలంగా ఉన్నాయి

ఈ కారణాలచేత ఈయన శివకవుల్లో చేరినా - ఆంధ్ర సాహిత్యానికి మేలుబంతి అనదగిన మహాప్రబంధం రచించి - నన్నయ భట్టారకుని తర్వాత

అగ్రగణ్యు డనిపించుకున్నాడు కాని - దురదృష్టమేమిటంటే - ఈయన ప్రకృష్ట కవితాబంధం చాలరోజులవరకు ఆంధ్రకవితా రసజ్ఞుల కందలేదు 1909-14 సంవత్సరాల్లో మానవల్లి రామకృష్ణ కవిగారు ఎక్కడో అట్టడుగుల నుంచి వెల్లగించి ప్రకటించేదాకా దీనిజాడే తెలియలేదు ఈయన కవిత నన్నయగారి రచనకు విలక్షణంగాను, విరవగాహంగానూ ఉండడంచేత ఆదరంగా ఎవరిదృష్టీ దీనిమీద పడలేదు

కవిగారు దీన్ని ప్రకటిస్తూ, దీని వైలక్షణ్యంవల్ల ఇది నన్నయ్యకు పూర్వరచన అన్నారు దానితో తర్జన భర్జనలు మిన్నుముట్టాయి ఆ కోలాహలంలో ఈయన కాలం క్రీ శ 940 నుంచి - 13 శతాబ్దివరకు ఊగులాడింది కొందరు నన్నయకు పూర్వుడంటే మరికొందరు తిక్కన్నకు తరువాతి వాడన్నారు తుదకు నన్నయ తిక్కనలకు నడిమికాలం పదకొండో శతాబ్దికి తుది పన్రెండుకు మొదలు అని పరిష్కారమయింది

ఆంధ్ర కవితాకాశపు వైచిత్రి ఏమిటంటే - అందులో ముగ్గురు రాజ కవులున్నారు వారు రాజకవులేకాక రాజులు కూడా వారు ఆకాశంలో ఎక్కడో మినుకు మినుకుమనే నక్షత్రాల్లాకాక శరచ్చంద్ర కాంతితో విరాజిల్లడం గర్వకారణ మనిపిస్తుంది అందులో మొదటి కవి ఈ కవిరాజ శిఖామణి నన్నెచోడుడు, రెండవవాడు కృష్ణదేవరాయలు, మూడవవాడు రఘునాథనాయకుడు ముగ్గురికి ముగ్గురూ తమ రాజకీయ భారాలు నిర్వహిస్తూనే - అద్భుత కావ్యాలు వ్రాశారు తక్కిన ఇద్దరి ప్రతిభా ప్రకర్షలు వారి వారి ప్రకరణాల్లో చూస్తాం

నన్నె చోడుని తండ్రి చోడబల్లి! తల్లి శ్రీసతి ఈయన బిరుదు టెంకణాదిత్యుడు - అంటే దక్షిణ సూర్యు డన్నమాట కావేరీతీరంలో ఒరయూరికి అధిపతిననీ, తన తండ్రి పాకనాటి సీమలో 21 వేయి గ్రామాలకు అధీశుడనీ చెప్పుకున్నాడు సూర్యవంశ క్షత్రియుడనని తన ఆభిజాత్యం వెల్లడించాడు కాని - పై బిరుదులన్నీ వంశానుగతంగా పెట్టుకొన్నవనీ, తండ్రితో ఈయన కూడా పాకనాడులోనే ఉండి ఉంటాడనే చరిత్రజ్ఞులమాట -

ఏది ఏమైనప్పటికీ అభిజాత్యదర్పం, రాజఠీవి ఆయన రచనలో తళుక్కున మెరిసి, ఆయన ఒక విలక్షణ పురుషుడనిపిస్తుంది

చిత్ర మేమిటంటే - తనకు ముందు మహాభారత రచనను తెనుగులో అమోఘంగా సాగించిన నన్నయను స్మరించడు నన్నయచేత భారతం వ్రాయించిన చాళుక్యరాజును తెనుగును నిలిపిన ఘనుడుగా ప్రస్తావిస్తాడు కారణం ఇట్లా తోస్తుంది

సంస్కృత రచనలో నగి నన్నయ చేత చాళుక్యరాజు భారతం వ్రాయించాడు కాని నన్నయ తానుగకోరి తెనుగు భారతం వ్రాయలేదు

నన్నయ చేసింది ఆంధ్రీకరణం గాని స్వతంత్ర రచనకాదు

భట్టారకుని ఆర్షమతాభిమానం, అద్వైతదృష్టి, జైన బౌద్ధాల వైముఖ్యం, సంస్కృత సంప్రదాయ నిమగ్నత, నన్నెచోడుని ఆదరణకు పాత్రములు కాలేకపోయి ఉండవచ్చు

తనకు అవ్యవహిత పూర్వుడయిన నన్నయతో తాను సమాన స్కంధుడ ననే 'అహం' కూడా పనిచేసి ఉండవచ్చు

కనుక నన్నయను పేరుపెట్టి పేర్కొ పోయినా పీఠిక 24 పద్యంలో 'ఉత్తమమార్గ సత్కవీశ్వరులను దేశి సత్కవుల సంస్తుతిఁజేసి మనోముదంబునన్' అనడంచేత - తనకు ముందు తెలుగులో ఏరూపంలో కవిత్వం వ్రాసినా వారి నందరినీ మూక ఉమ్మడిగా సంభావించినట్లే భావించి తన రచనకు ఉపక్రమించాడు

"సరళముగాఁగ భావములు
జాను తెనుంగున నింపుసొంపుతోఁ
బిరిగొన వర్ణనల్ ఫణితిఁ బేర్కొన
నర్థము లొత్తగిల్ల బం
ధురముగఁ బ్రాణముల్ మధుమృ
దుత్వ రసంబునఁ గందళింప న
క్షరములు సూక్తు లార్యులకుఁ
గర్ణరసాయన లీలఁ గ్రాలగన్"

అనే పద్యం చూచినప్పుడు నన్నయగారి 'ఇతరు లక్షరరమ్యత నాదరింప నానారుచిరార్థ సూక్తినిధి' అనే మాటలు స్ఫురించకుండా ఉండవు పరోక్షంగానైనా నన్నయపద్యం నన్నెచోడునికి రుచికల్పించి ఉండాలి

తనకుముందు ఎట్టి రచనలు వచ్చినా - వాటినన్నిటినీ పక్కకు పెట్టి - తెలుగులో తొలిప్రబంధ రచన చేసిన ఘనత నన్నెచోడునకు దక్కింది ఆయన పూర్వుల వలె ఏ సంస్కృత పురాణాన్నీ తెనిగించలేదు తన కావ్యపీఠికలో ఉద్భటుడు కవిత్వము మెఱయ 'కుమార సంభవం' వ్రాశాడని చెప్పాడుగాని దానికిది తెనుగుసేత అని వక్కాణించ లేదు ఉద్భటుని కుమార సంభవం మనకు దొరకలేదు కనక దాని స్వరూప స్వభావాలను గురించి చెప్పే అధికారం లేదు కాని ఇతని స్వతంత్ర భావాల్ని బట్టిచూస్తే ఇతని గ్రంథం స్వీయ రచనే అనితోస్తుంది ఉద్భటుడు ఆలంకారికుడుగా ప్రసిద్ధుడుగాని కవిగా కాదు సుప్రసిద్ధ కాళిదాస కావ్యాన్నే ఈయన తెనిగించ దలచనప్పుడు ఉద్భటుని మాట ఇకచెప్పే దేమిటి?

ఈయనకు కాళిదాసుమీద అపారగౌరవమని - "వర కవితా సింహాసన మెక్కి కవీంద్రుల దాసులుగా నేలె" అన్న కాళిదాస ప్రశంసా వచనం వల్ల తెలుస్తుంది

కాళిదాస కవితా సౌందర్యం చూచి అట్టిభావాలతో తామూ రచన చెయ్యాలనుకోవడం సహజం శ్రీనాథుడు పేరు చెప్పక పోయినా హరవిలాస గౌరీ కల్యాణకథలో కొన్ని శ్లోకాలను యథాతథంగా తెనిగించడం చూస్తాం కొందరు ఆధునికులు ఆమూలాగ్రం కాళిదాస కుమార సంభవాన్ని అనువదించిన వారున్నారు శ్రీనాథుని ప్రతిభలో కాళిదాస శ్లోకాలు పునర్జీవనం పొంది, స్వతంత్ర ప్రతిపత్తితో రాణించినా - ఆధునికుల రచనల్లో అవి ప్రాణం లేని నకళ్లుగా మిగిలి పోయాయి

నన్నె చోడుడు కాళిదాస కుమారసంభవానికి నకలు తియ్యకుండా - 'ఎదురు నిలిచి' తెలుగులో కొత్త కుమార సంభవం రచించాడు అభిమానం కొద్దీ కాళిదాస చ్ఛాయలు కొన్ని ఎక్కడైనా స్వీకరించినా అతని ప్రతిభా సముద్రంముందు అవి లెక్కలోకి రావు కొన్ని ఘట్టాలు అతికాళిదాసములు అనిపిస్తాయి వాల్మీకి మహర్షి ముందు కాళిదాసు 'మందః కవియశః ప్రార్థీ' అని వణకిపోయినట్టు, కాళిదాసు ముందు ఏ కవీ తల ఎత్తుకు నిలబడలేదు కానీ నన్నెచోడుడు మాత్రం ఛాతీవిప్పి నిలబడ్డాడు 12 ఆశ్వాసాల ప్రబంధం నిర్మించాడు

నన్నెచోడుడు కావ్యపరంగా - కృతి కావ్యం ప్రబంధం అనే మాటలు వాడాడు సంస్కృతంలో రచనా సామాన్యానికే ప్రబంధశబ్దం వాడడం ఉంది కాళిదాసు మాళవికా నాటకంలో 'ప్రథిత యశసాం భాససౌమిల్ల, కవిపుత్రాదీనాం ప్రబంధా తిక్రమ్య వర్తమాన కవేః కాళిదాసస్య క్రియాయాం కథం బహుమానః" అని పారిపార్శ్వకునిచేత అనిపిస్తాడు ఇక్కడ ప్రబంధ శబ్దానికి నాటకం అని అర్థం, కాని శ్రవ్యకావ్యం కాదు సంస్కృత కావ్యానికి తెనుగు ప్రబంధ లక్షణాలు లేవు "ఆశీర్నమస్క్రియా, వస్తునిర్దేశో వాఽపి తన్ముఖమ్' అని లాక్షణికుల నిర్దేశం ఆశీర్వచనంతో గాని, ఇష్టదేవతా నమస్కారంతోగాని, కథా ప్రతిపాదనంతోగాని కావ్యం ప్రారంభించాలి - అని మాత్రమే వారు కావ్యప్రారంభానికి చేసిన సూచన కాని తెలుగు వారి చేతిలో మాత్రం కావ్యం ప్రబంధమై దానికొక యాథార్థ్యం స్థిరపడింది దానికొక చట్రం ఏర్పడింది ఒకటి రెండు మినహాయింపులున్నా ఆగాడిలోనే తెలుగు ప్రబంధం పరుగెత్తింది ఏం ఏమిటంటే తలవని తలంపుగానే నన్నెచోడుడు ప్రబంధమార్గంలో పడ్డాడు

> " కేసముతే కనురత్నమై భా
> షాంగు దక్కనేలిన మ
> హత్త్వములో మునం బ్రవృద్ధిగా
> భంగిగ విస్తరించెదం బ్ర
> బంధము సద్రసబంధురమ్ముగా" 1-48

తలచి అన్నా - తలవకుండా అన్నా ఈ ప్రబంధశబ్దం అతని రచనలో కొత్తరూపు తీసుకుంది

1 ఇష్టదేవతాస్తుతి 2 సుకవిస్తుతి 3 కుకవినింద 4 కృతిసమర్పణం 5 వంశానువర్ణనం 6 షష్ఠ్యంతములు,

ఈ విధానం ఎక్కడినుంచి తెచ్చాడో సరిగ్గా చెప్పలేంగాని - ఊహించ డానికి వీలుంది

మొదటిది సంస్కృతం నుంచే రావచ్చు 2, 3, 4 అంశాలు కన్నడ కవిత్వం నుంచి తెచ్చి ఉండవచ్చు ఎందుచేతనంటె పంపకవి అరికేసరికి అంకిత

మిస్తూ ఉత్తమ కవిత్వ లక్షణాలు చెప్పి భంగ్యంతరంగా 'లలితపదం ప్రసన్న కవితాగుణ మిల్లదె–' అన్న పద్యంలో కుకవులను నిందించాడు

షష్ఠ్యంతాలకు మాత్రం సరియైన మూలం కనపడలేదు వెదకితే అది కూడా తమిళ కన్నడ సంప్రదాయాల నుంచి పసికట్టవచ్చునేమో అనిపిస్తుంది రఘువంశంలోని 'రఘూణా మన్వయం వక్ష్యే' అనేచోట ముందున్న షష్ఠీ విశేషణాలన్నీ దీనికి మార్గదర్శకాలేమో' అని ఒ. . న్నారు గాని అది కృతి ప్రధాన సందర్భం కాకపోవడంచేత ఆ ఊహకు అం . బలం కనిపించదు

కృతిపతి ప్రశంసాపరమైన ఈ 'షష్ఠ' ఊహా గడుసైన ఏ కవికైనా రావచ్చునేమో – ఈ స్ఫురణ నన్నెచోడుని గురుభక్తి నుంచేపుట్టి ఉండవచ్చు ననుకొన్నా పెద్దగా ఆశ్చర్యపడనక్కర లేదు

కృత్యాది

నన్నెచోడుడు మహా శివభక్తుడు బ్రహ్మ, విష్ణులు కూడా శివునే సేవించి సృష్టి, స్థితి, రూపశక్తులను సంపాదించినవారని ఈయన ప్రతిపాదనం ఈ భావం తొలిదొల్తటి మహాదేవస్తుతి నుంచీ కనపడుతుంది ఈయన నన్నయ్య యుగధర్మమైన సంస్కృత శ్లోకంతో కావ్యం మొదలుపెట్టలేదు కాని 'శ్రీవాణీంద్రామరేంద్ర' అన్న సమాసం నన్నయ్యను జ్ఞాపకం చేస్తుంది

శివకవులలో ఈయన సుగుణం ఏమిటంటే – బ్రహ్మ విష్ణువులను దూషించడంగాని, తిరస్కరించడంగాని ఉండదు విష్ణువు మహాదేవుని ఎడమభాగం నుంచీ, బ్రహ్మదేవుడు కుడిభాగం నుంచీ పుట్టి, సత్వ రజో గుణ ప్రధానులై లోకరక్షణం, విశ్వసృష్టి చేస్తున్నారని ప్రతిపాదించి "అఖిల లోకములందగఁ గాచుచున్న వేడాంగు ననంతు విష్ణుఁ గమలాధిపు సంస్తుతిఁ జేల్తు సమ్మతిన్" ౧ 4 అని విష్ణువును "విశ్వము సృజియించి పొల్చునజు వాగ్విభు సంస్తుతి జేతు సన్మతిన్" ౧-5 అని బ్రహ్మను స్తుతిస్తాడు

దీనినిబట్టి ఇతడు కాలాముఖ శైవశాఖకు చెందిన వాడుగాని వీరశైవుడు కాడని తెలుస్తుంది

కాలాముఖుల శక్తిపూజ భిమానం 'ఈశు నాల్మ సుభగ స్థితిమైమయి నర్థనారిఁజే' సిన నగజాత మత్కృతిని జేకొని తప్ప . . . వ పిపున్' ౧-10 అనే పద్యంలో ధ్వనిస్తుంది

ఇంకొక విశేషమేమిటంటే - ఇతని దేవతాస్తుతిలో మన్మథుడు కూడా చేరడం సాభిప్రాయంగాను సమంజసంగాను ఉంది

హరుడేమిటి? సకల చరాచరాలను కమురతంత్రులను చేసి ఆటలాడించే మన్మథుణ్ణి అందరూ నాకావ్యానికి వశులయేలా చేయమంటాడు మన్మథ ప్రభువు ఈయన కోరికను మన్నించి నట్లున్నాడు

మరో ముఖ్యవిషయం, ఈయన అపారగురుభక్తి తనగురువు జంగమ మల్లికార్జునునికి, శ్రీశైలమల్లికార్జున దేవునికి భేదమే లేదంటాడు 'పరమ శ్రీనగోత్తుంగ మణిశ్రీ సంగత మల్లికార్జున దేవతాకంబై, జగంబులం బ్రత్యక్షంబై ప్రవర్తిల్లుట జంగమ మల్లికార్జున దేవుండై "ఈ భావన కావ్యంలో కూడా ప్రవేశించడం చూడదగిన వింత

పార్వతి, ఆశ్రమ సీమలో శైవాగమ దీక్షతో పాటు మంత్రధ్యాన వ్రతాచారాలు కూడా "విప్రముని పుంగవుడు జంగమ మల్లికార్జునుని" వద్దనుంచే స్వీకరించిందట

అంతేకాదు - శివుడు ఓషధిప్రస్థనగరంలో పెండ్లికి తరలివస్తుంటే - పురస్త్రీలు ఆశివునిలో జంగమ మల్లికార్జునున్నే తగిలి చూచారట!

నన్నెచోడుని కుమారసంభవానికి కృతిపతి గురువు జంగమ మల్లయ కృతిపతితో కావ్యనాయకుడికి అభేదం చెప్పడం[1] కన్నడ కావ్యసంప్రదాయం నుంచి ఇందులో ప్రవేశించిందనవచ్చు

ఇతడు మొట్టమొదటి సారిగా తన కావ్యపీఠికలో జానుతెనుగు వస్తు కవిత అనే రెండు అంశాలను ఉటంకించి ఆంధ్ర సాహిత్యపరుల ఆలోచనలలో కొత్త సంచలనం లేవదీశాడు ఈయన మతంలో జానుతెనుగు అంటే సంస్కృత స్పర్శలేని తెనుగు కాదు మార్గకవితకు దేశిరూపమిచ్చే భావన, పదబంధం, ఈయన దృష్టిలో జానుతెనుగు అని భావించాలి లేకపోతే ఈతని కవిత్వంలోనే జానుతెనుగు లేదని చెప్పవలసి వస్తుంది

---

1 పంపకవి తన విక్రమార్జున విజయంలో కృతినాయకుడు అరికేసరికి అర్జునునకు అభేదం నిర్వహించాడు

వస్తు కవిత్వం అనే విభాగం సాహిత్య శాస్త్రంలో ఎక్కడా కనబడదు. నాటక ప్రకరణంలో వస్తువనే మాట ఇతివృత్తం అనే అర్థంలో కనబడుతుంది ఇతడు కూడా ఈ మాటను కథార్థంలోనే వాడినా దేనినుంచి వ్యావర్తకంగా (వేరు చేసేది) ఉపయోగించాడు ? అనే ప్రశ్న సహజంగా వస్తుంది

కన్నడ సంప్రదాయాన్ని ఎక్కువగా అనుసరించేవాడు గనక - ఇక్కడ గూడ కన్నడరీతి ననుసరించి కవితను వర్ణకం (వర్ణన ప్రధానం) వస్తుకం (కథాప్రధానం) అని భావించి కథా ప్రధానములైన మహాకావ్యాలనన్నిటినీ వస్తుకవిత అన్నాడని ఊహించవలసి ఉంది సంస్కృత సాహిత్యంలో కూడా ఖండకావ్యం అవస్తుకంగాను, మహాకావ్యం వస్తుప్రధానంగాను కనబడతాయి ఖండ కావ్యేతరాన్ని ఈయన ___ వ్యవహరించాడనుకొన్నా సమన్వయం కుదురుతుంది

అన్యకవులకు లేని రాజసం ఈతని కావ్యంలో కొట్టవచ్చినట్టు కనపడుతుంది ఇది ఈ కావ్యంలో రెండు రూపాలు తీసుకుంది ఒకటి - తన కవిత్వం మీద తనకున్న తిరుగులేని విశ్వాసం రెండు - తనకు నచ్చని కవులను నిస్సంశయంగా దుయ్యబట్టడం

ఇది ఆత్మ విశ్వాసానికి మచ్చు—

"ఇట్లు విశిష్ట గుణగణాలంకృతుండనై నెగడ - నస్మదీయామాన ప్రతిభార్ణవోదీర్ణ రుచిరవస్తు విస్తారి తోత్తమ కావ్యరత్నవిభూషితంబు . "

"రవికుల శేఖరుండు కవి
రాజశిఖామణి కావ్యకర్త స
త్కవి భువి నన్నెచోడు ధరజె,
కావ్యము దివ్యకథన్ కుమార సం
భవము జె, సత్కథాధిపతి
భవ్యుడు జంగమ మల్లికార్జునుం
డవి చలితార్థ యోగధరు
డట్టె - వినం గొనియాడఁ జెల్లదే !"

ఇది కుకవి నింద

"మార్గకు మార్గము దేశియ
మార్గము వదలంగఁ దమకు మది వొదలక దు
ర్మార్గ పదవర్తు లనదగు
మార్గవులం దలఁప నలఁతి మహి సుకవులకున్"

'మార్గరీతి వదలలేక, దేశిమార్గమూ వదలలేక పుళిమి పుచ్చుతూ చెడుత్రోవలో పడ్డ కవుఁను సుకవులు, తలచడమే నీచకృత్యం' అంటాడు

'కుకవి మంచి కావ్యంలోని గుణాన్ని దోషంగా చెయ్యగలడు గాని, దోషాన్ని గుణంగా చెయ్యలేడు 'కుక్క దొంతులు పడదోయగలదుగాని పేర్చలేదు గదా' (1 29 అంటేగాని ఆయనకు తృప్తి లేదు

ఈతని దేశికవితాభిమానం ఎట్టిదంటే - దేశంలో వాడుకలో ఉండి శిష్టుల గ్రంథాల్లో చొరని చాల దేశీయ శబ్దాలు వాడుతాడు సంస్కృతాంధ్ర వ్యాకరణ మర్యాదలను - అవసరమైతే తిరస్కరించి తానొక కొత్త బాటను నిర్మిస్తాడు

దక్ష కథలో, పార్వతి ఆటల్లో పెండ్లి పద్ధతిలో, యుద్ధవిధానంలో దేశీయ రీతులను చొప్పిస్తాడు ఇతని కావ్యం ఎంత తత్సమశబ్ద భూయిష్ఠమైనా - తమిళ, కన్నడ శబ్దాలను స్వేచ్ఛగా వాడడం, కథా నిర్వహణంలో దేశిరీతుల మీద మొగ్గుచూపడం అతిలోకమైన శివపారమ్యం తక్కిన తెలుగు కవితనుంచి ఇతని కవితను వేరుచేస్తాయి అందువల్లనే గాబోలు - చాలరోజులు ఇతని రచన శైవమఠాల్లోనే ఉండిపోయి వ్యాప్తికి రాలేదని విమర్శకు లన్నారు

కథా విన్యాసం

ఇతడు తన కావ్యంలోని కథను సంగ్రహంగా ఈ పద్యంలో విశదీకరించాడు

మహాస్రగ్ధర

"సతి జన్మంబున్ గణాధీశ్వరు జననము, ద
క్షుక్రతు ధ్వంసమున్ బా
ర్వతి జన్మంబున్ భవోగ్రవ్రత చరితయు దే
వద్విషత్ క్షోభమున్ శ్రీ

సుం సంహారమ్ము, భూభృత్సుశి తపము, సుమా
 సుందరోద్వాహమున్, ద
ద్రతి భోగంబున్, గుమారోదయము, సత(డనిం
 దారకుం బోర గెల్పున్"

అనే పండ్రెండు అంశాలతో 12 ఆశ్వాసాల ప్రబంధం పుట్టింది

నన్నెచోడుడు కాళిదాస కుమార సంభవం క్షుణ్ణంగా చదివి అతనిమీద అపారమైన గౌరవం పెంచుకున్నాడు కాని కాళిదాసు అద్వైత ధోరణిని విడిచి తన కావ్యానికి శైవకావ్యరూపాన్ని సంతరించి కథను బాగా సాగదీశాడు 'కుమార సంభవం'లో కాళిదాసు రచన 8 సర్గలే అనీ తక్కిన సర్గలు ఎవరో కథాపూర్తికి వ్రాశారనీ పండితుల విశ్వాసం మల్లినాథుడు తక్కిన వాటికి వ్యాఖ్య చేయకపోవడం వీరి విశ్వాసానికి బలం తారకాసుర సంహారానికి ఉద్దేశించిన కుమార జననం – దాన్ని నెరవేర్చక పోవడం కావ్యానికి లోటు – అని కొందరు భావించినట్లే ఇతడు కూడా తలచి అసుర సంహారం దాకా వ్రాసి కావ్యాన్ని పూరించాడు అయితే, కాళిదాసు క్లుప్తత, వ్యంగ్య మర్యాద ఔచిత్య పాలనం, ఈయన పట్టించుకున్నట్టు కనబడదు సాధారణంగా తెలుగు కావ్యాలకుండే మితిమీరిన పెంపు, వర్ణన ప్రలోభం అలంకారాతిశయం, శృంగార లౌల్యం, ఇందులో సమృద్ధిగా కనపడతాయి

కాళిదాసు స్పృశించని దక్షాధ్వరధ్వంసం, గణేశ జన్మ వృత్తాంతం ఇతని పెంపులోని విశేషం ఇవి లేకపోయినా కుమారసంభవ కథకు లోపం లేదు ఈ గణేశ జన్మకథ తమిళ తేవారాలనుంచి వచ్చిందిగాని – ప్రసిద్ధ పురాణాలలోని కాదు అని పరిశోధకుల ఊహ—

పార్వతి విరహం, ఆమె అరణ్య ఆశ్రమ దర్శనాలు, అక్కడ జంగమ మల్లికార్జునుని ఉపదేశం, ఓషధి ప్రస్థంలో కిటవిటీ దర్శనం, శివుడే జంగమ మల్లికార్జునుడై ఊరేగింపులో కనపడడం, వివాహ విశేషాలు, పానగోష్ఠి, విపుల యుద్ధ సంవిధానం నన్నెచోడ కుమార సంభవ కథలో చూడదగిన విశేషాంశాలు

పార్వతి యౌవన వర్ణనంలోని 'స్మర మందిరమ్ము' వంటి పద్యాలు, ఆది దంపతుల రతివర్ణనం, ఓషధి ప్రస్థంలోని అప్రస్తుత జారాది ప్రసంగం,

ఔచిత్య దూరము లనిపిస్తాయి కాళిదాస కుమార సంభవంలోని అష్టమసర్గ శృంగారం గురించే విద్వాంసులు తప్పుపట్టారు, ఆ శృంగారం వ్యంగ్య సుంద రంగా ఉన్నా అనుచితం అనీ ఇక ఈ కవి ఆ తెరచాటు గూడ తొలగించడం తెలుగు రసికత అని సరిపెట్టుకోవాలి

ఇట్టి కొన్ని దోషాలు విడిచిపెడితే – నన్నెచోడునివంటి మహాభావుకుడు, వాగ్విశారదుడు, ఉదాత్త ప్రబంధ నిర్మాత, తెలుగు సాహిత్యం తొలి రోజుల లోనే ఉదయించడం ఆంధ్ర వాఙ్మయం అదృష్టం అని చెప్పవచ్చు

కవితా ప్రతిభ

ఒకరు ఊహించినట్టు ఊహించడు ఇతని ప్రతిభ పాము పడగవిప్పినట్టు చెట్టు నిలువునా పూచినట్టు, ఆకాశంలో హఠాత్తుగా హరివిల్లు విరిచినట్టు, ఆకాశగంగ వెల్లివొడిచి మీది కురికినట్టు, ఎక్కడ చదువు, దిగ్భ్రాంతి గొలుపుతుంది !

వర్ణనంలో, రసోత్పత్తిలో, పాత్రల మూర్తి కల్పనలో మాటకారి తనంలో అనిరత సాధ్యమైన ఊహాశాలిత కలవాడు

సత్కావ్యమంటే జగత్పూజ్యమై, తనకు సరిలేనిదై ధగధగ మెఱవాలని ఇతని ప్రతిజ్ఞ ౧-40

ఈ ప్రతిజ్ఞను ఇతడు చాలవరకు విజయవంతంగా నెరవేర్చుకున్నాడని చెప్పవచ్చు

నన్నెచోడుని కవిత అనగానే కొన్ని మూర్తులు, కొన్ని వర్ణనలు, కొన్ని మాటకారి తనాలు చట్టున జ్ఞాపకం వస్తాయి

శివుని ఎదుట నిలిచిన పార్వతి—

"మరు నభివృద్ధి పుష్పశర
మండన అంగజరాజ్య లీల శం
బరరిపు శక్తి చిత్తభవు
పట్టము మారు మదేభ మిందిరా

వరసుతు నాజ్ఞ కాము కర
వా లసమాయుధు దర్ప మా రతీ
శ్వరు జయలక్ష్మి నాఁ బొలిచి
శైలజ నిల్చె మహేశు ముందటన్"

వానజల్లు వంటి ఈ నిదర్శన పరంపర పార్వతీ సౌందర్యానికి రుచిర వ్యాఖ్య కదా!

వసంత వేళలో నిలువునా పులకించిన మామిడిచెట్టను చూచి మన్మథుడు శివస్వరూపమని జడుసుకొన్న తీరు—

"పలకెడు కారాకు లలితాస్థి చయముగా
సోలు కొమ్మలు పలు కేలుగాఁగ
బాల పల్లవములు వ్రేలు కెంజడలుగా
పెనఁగు తీఁగలు దొడ్డ ఫణులు గాఁగఁ
గల కంఠ నికరంబు గళమునఁ గప్పుగాఁ
బుప్పొడి మేన విభూతి గాఁగఁ
ఫలములు వరదాన ఫలములుగా నళి
మాలికల్ రుద్రాక్ష మాలికలుగ
శంభుమూర్తిఁదాల్చి సహకార భూరుహ
చక్రవర్తి నవవసంత వేళ
నలిశయిల్లుచుండె నక్కడ గని మది
ముదిరిపడి మనోజుఁ డోసరింప—"

అంతా శివమయంగా చూచే ఈతని పరమ శివభక్తి దిగ్భ్రమ కలిగిస్తుంది!

ఇతడు, అప్రస్తుతమైనా దక్షాధ్వర కథను స్వీకరించడం - శివునికంటె తక్కిన హరిబ్రహ్మాదుల అవరత్వం తృప్తితీరా వర్ణించడానికే అనిపిస్తుంది

ప్రమథుల విజృంభణంతో బ్రహ్మ పరుగెత్తివచ్చి తన వాహనం హంస నెక్కి పారిపోదామనుకుని భయంతో కిందపడ్డాడు హంస అతణ్ణి ఎర్రతామర పువ్వులా నోటగరచుకొని వెళ్ళిపోయింది ౨-68

నల్లని విష్ణువు ఎర్రని గరుత్మంతుని మీదపడి ఆకాశంమీద పోతుంటే భయంచేత ఒడలంతా చెమటపట్టింది అప్పు డాయన హరివిల్లుతో కూడిన వర్షామేఘంలా ఉన్నాడు ౨-69

త్రిమూర్తులలో మొదటి ఇద్దరిగతే ఇట్లా అయితే తక్కినవారిమాట చెప్పే దేమిటి ?

అందులో కుబేరుని స్థితి చూస్తే నవ్వొస్తుంది

"తన యెక్కిన మానిసిఁ దా
ననయము నెక్కంగ మఱచి యాతని దన మూ
పున నిడికొని పఱచె భయం
బున ధనపతి తన్నుఁ బిఱుద భూతము లార్వన్" ౨-73

మొత్తంమీద దక్షయజ్ఞానికి వచ్చిన దేవతల నందరినీ తన హాస్యప్రియతకు పాత్రుల్నిచేసి విడిచిపెట్టాడు

రతి అపశకునాలు తలచుకొని, భయపడి, భర్తనుచూచి స్తిమితపడి, అసలు విషయం తెలిసికొని, నివ్వె పోయి అంటుంది ఈ ఘట్టంలో నన్నెచోడుడు అతి కాళిదాసంగా ఊహించాడు చతురాతి చతురంగా వ్రాశాడు ఆ మాటలు రతి అనలేదు రతిలో ప్రవేశించి నన్నెచోడుని శివభక్తి అరచింది

"అతని శరాసనంబు కన
కాచల మితడు శరాసనంబు నీ
కతనికి నమ్ము పాశుపత
మంటినఁ గందెడు పూవులమ్ము నీ
కితడు పురాపహారి విర
హాతుర పాంథ జనాపహారి నీ
వతనికి నీకు హస్తి మశ
కాంతర మెమ్మెయి నెన్ని చూచినన్ " ౮-72.

కాళిదాస కుమార సంభవంలోని ఇంద్రమన్మథ సంవాదం అనుసరించినా, శివ తపోవనంలో వసంతావిర్భావంలోని కొన్ని దృశ్యాలు స్వీకరించినా ఈ రతి సంవాదం ఇతని స్వంతం ఒక ఇల్లాలు తన భర్తమీద చూపే చనవు — కనరు, ఇత డద్భుతంగా చిత్రించాడు

'కొని బాలురైన నను దిని పిప్పి యుమిసెడు
చెఱకు, విల్లని నమ్మి చేతఁబట్టి ' ౮-75

వంటి పద్యాలు చదవదగ్గవి

ఎట్టకేలకు మన్మథుడు రతిని ఒప్పించి బయలుదేరాడు

అక్కడ నన్నెచోడుడు మన్మథునికి కట్టిన పూలరథం కాళిదాసుకుకూడ కనువేదురు కలిగించేదిగా ఉంది—

"పంకరుహాంబులు బండి కన్నులు చంప
కంబుల నొగ, ఉత్పలంబు లిరుసు
•
కురువకానీక మాలంపుఁగోల కైర
వములు మునుకోల, కోకముల్ వాహనములు
గా వసంతుడు సూతుడై పూవుఁదేర
నెరయఁ గుసుమాయుధంబులు నినిపి తెచ్చి" ౪-83

ఇతని ఋతువర్ణనంలోని ఉపజ్ఞ చూస్తే కృష్ణరాయల ఋతుదర్శనం ఒక్కటే దీనికి దీటు అనిపిస్తుంది

"పొన్నలు పూచెఁ జొన్న లొగిఁ
బూవక మూదఱఁ బూచె గోగులు" ౪-91

అనే పద్యం అందరు ఎరిగించే మాటలు కూర్పు నేర్పులో పద్యం తళతళ లాడింది వెనుక నుంచి ముందుకొస్తే ఏది ముందు పూచిందో తెలిసే సొగసుంది అంతే—

కాని చంపకం పూచిన సోయగం చూడదగ్గది

"నలిమొగ్గలు విరిపువ్వులు
నలలిత మయి చూడనొప్పె చనుపక మత్యు
జ్జ్వల రుచి రేవగ లాఱక
వెలిగెడు నుద్దీప దీపవృక్షము వోలెన్ ౪-93

దీపాలు పగలుండవు, చనుపకం (చంపకం) రాత్రింబవళ్ళు దీప వృక్షంగా వెలుగుతున్నది ఈ దీప వృక్షాలు రామాయణం అయోధ్యాకాండంలో అచ్చంగా దర్శనమిస్తే, ఇందులో ఔపమ్యంలో వెలిగాయి

వసంతం ఎంత అద్భుతమైన దంటే—

> "సుదతిఁ గైసేసి ప్రీతితోఁ జూచుచుండె
> భావ జన్ముండు వచ్చిన పనియు మఱచి-"

ఇక్కడ ఉంది, కవిరాజ శిఖామణి గడుసుదనం !

కాళిదాసు గ్రీష్మంతోనే ఋతు సంహారం ప్రారంభించాడు కాని అది మెత్త మెత్తగానే నడిచిపోయింది కాని నన్నెచోడుని గ్రీష్మం హడలగొడుతూ వచ్చింది,

'నిదాఘము పర్వె భయంకరాకృతిన్' అంటాడు ఆ భయంకరత్వం ఎట్టిది ?

> "తలచిన డెందము కందును
> బలికిన నోరెల్లఁ బొక్కుఁ, బ్రభసూచిన రె
> ప్పలు గమరు, ననఁగఁ బటుతర
> విలయానిల భాతి నెండ వేసవి గాచెన్"

"ఆతపభీతి నీడలు రయంబున మ్రాకుల క్రింద దూఱెనో ఆ తరులుం దృషాళి హతులై తమ నీడలు దారు త్రాగెనో - అతిలోకమైన ఉత్ప్రేక్ష అతడికే చెల్లింది— ౬-141

శరదృతువులో వాల్మీకి, కాళిదాసుల కన్న భారవిచ్ఛాయలు కనపడతాయి

సంగీతం తియ్యగా ఉండవచ్చు కాన ఆ తీపిని చెప్పడం అందరికీ చేతగాదు

శివ కల్యాణంలో తుంబురు నారదులు పాడారు—

> "తేనియ ముసురో ? అమృతపు
> వానయొ, పుండ్రేక్షురసము వఱ్ఱోడిన పె
> ల్లో . . . ౯-36 అనడం అనన్యాదృశం !"

గిరిజ శివసేవలో, మన్మథదాహంలో, పార్వతి తపస్సులో, కుమార తారక యుద్ధంలో - ఇతడు చూపిన భావనాశక్తి, పదచిత్రణం దర్శనీయము లైనవి

ఇతడు రాజపుత్రుడు ! స్వయంగా యుద్ధాలు చేసినవాడో, చూసిన వాడో కాకపోతే ఇంత ఒడుపుగా చెప్పలేడు

"పలకలు నొడ్డనములు గ
త్తలములు నసి శక్తి కుంత తతియుంగొని భూ
తల మెల్లఁ గప్పికొని కా
ల్బలములు సనుదెంచె - కాలు బలముం బోలెన్" ౧౧-70

కాల్బలముల విరుపులో 'కాలు బలములు' సాధించిన చతురుడు

"అలిగి వరుణుపై మహాబలు డేసిన
అమ్ములెల్లఁ దప్పి వమ్ములయ్యె!
అట్టి పసిడియమ్ము లని నీరవేసిన
వాని తప్పుగాక - వాని తప్పె? ౧౨ 37

శబ్దశక్తి తెలిసిన ఇతడు దీనితో తన కావ్యాన్ని మోపించడమేకాక ఎందరో భావికవులకు కూడ త్రోవ చూపినట్టు కనబడుతుంది

శ్లేషాద్యలంకారాలు అప్రయత్నం సుందరంగా వాడగల దిట్ట అని, ఎక్కడ చదివినా తెలుస్తుంది

పద్య విద్య పూర్తిగా ఎరిగినవాడు శ్రీనాథునికే సీసపద్యపు సొగసులు నేర్పగలవాడు

వృత్తౌచిత్యం శ్రద్ధగా పాటిస్తాడు స్వాగతం, వనమయూరం, మానిని వంటి వృత్తాలు సార్థక నామాలుగా ఆయా సందర్భాలలో ప్రయోగించాడు అంతేకాదు గర్భబంధ కవితలకు కూడా అంకురార్పణ చేసినవాడు

మార్గకవితా శరీరంలో దేశీహృదయం సమర్థంగా చొప్పించిన తిక్కనాదులకే మార్గదర్శి అయినాడా! అనిపిస్తుంది కాని ఈయన స్వేచ్ఛగా వాడిన కన్నడ, తమిళ శబ్దాలు కెడ్డెరసు, కేనము బేటము, నాయి, వంటివీ కల్చు, మేలిల్లు, మరులు వంటి తెలుగు శబ్దాలు వ్యాకరణం లెక్కచేయక కుర్యు తర్గు, తళ్య అని వాడిన తెలుగుచ్యుత సంస్కృతులు, కలుహారగంధి, హారుపాత్రుధారలు, వనే చరియలు, త్రిణమువంటి సంస్కృత అపశబ్దాలు పాఠకుణ్ణి తికమక పెడతాయి అయినా ఈతని కావ్యగుణ సమూహంలో అవి మునిగిపోతాయి

కావ్యానికి భరత వ్యాఖ్యంగా వ్రాసిన ఈ పద్యం చదివి ఆతని ఆశాస్యా
నికి సంతోషిద్దాం

'వెలయ మత్కృతి సదువుఁడు వినుఁడు వ్రాయుఁ
డీశ్వ రాంబికా గుహులిత్తు రీప్సితములు
వారి నెమ్మెయి గొనియాడు వారి కోర్కె
లొనర జంగమ మల్లికార్జునుఁడు నొసఁగు' ౧-౨ 225

హరిహర వార్షుకం

తృతీయ ప్రసంగం

గ్రీష్మం వెనుబట్టింది

గ్రీష్మం అనగానే నన్నిచోడుని మాటల్లో

"మండు టెండలను తలుచుకుంటే మనుష్యుల దేహం కందుతుంది, నోరు పొక్కుతుంది చూస్తే కనురెప్పలు కమరిపోతాయి"

ఆలంకారికంగా శివకవితాయుగాన్ని గ్రీష్మం అన్నాం దాని వేడిలో ప్రజలు ఎట్లా ఉద్విగ్నులు అయినారో చూచాం

సామాజికంగా శివభాగవతుల ప్రచండ ప్రవర్తనా, భక్తి పేరిట వారి విశృంఖల విహారమూ దర్శించాం

సాహిత్యపరంగా వారి స్వచ్ఛంద సంచారం, మతానికి లొంగిన కవిత్వం, మనకు పూర్వ ప్రసంగంలో అనుభూత మయింది

అయినా - వారు తెచ్చిన భావవిప్లవాన్ని, శబ్దసంగతిని గుర్తించాం కవిత్వపు మెరుపుల్ని అభిమానించాం అయితే - ఎంతోకాలం వారి విజృంభణ సాగలేదు పండితారాధ్యుల, బసవేశ్వరుల, చరమదశలు విషాదాంతంగానే ముగిశాయి వారి వీరభక్తి, పరమమాహేశ్వరులు రావణాదులను జ్ఞాపకం చేస్తుంది!

చివర కది పన్నెండవ శతాబ్దిలోని పల్నాటి యుద్ధానికి ప్రాతిపదిక కూడా అయినట్టు కనబడుతుంది

ప్రజలు వేయికళ్ళతో చల్లని మబ్బుతునక కోసం ఎదురుచూస్తున్నారు అంటే - విద్వేషంలేని సమరస భావానికి, ఉద్వేగంలేని ఉదార మతబోధకు, ఆతురతతో ప్రతీక్షిస్తున్నా రన్నమాట

నన్నయ శివభక్తికి విరోధికాదు. వేదత్రయమూర్తులైన పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరులను ఆ గ్రంథాదిని సభక్తికంగా స్మరించాడు. తన ఏలిక 'పార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజా మహోత్సవం' వాక్రొకనాడు. ఈ మూర్తిత్రయ గౌరవం తర్వాత వచ్చిన శివకవులకు నచ్చలేదు. ఒక శతాబ్ది పాటు వారు వైదిక ప్రమాణాలు చూపుతూనే శివేతర దైవతాలను దూషించారు. కర్మ మార్గాన్ని దుయ్యబట్టారు. శైవేతర హింసను శరణుల ప్రశంసను మిన్ను ముట్టించారు. అవినీతిని భక్తిరంగుతో అలంకరించారు. దేశం అట్టుడికినట్టు ఉడికిపోయింది.

అప్పుడు తెలుగుభూమి చల్లనిమాట చెప్పే ఒక మహాపురుషు కోసం నిరీక్షిస్తున్నది.

ఆ తరుణంలో ఆంధ్ర సాహిత్యం అదృష్టంవల్ల తిక్కనార్యుడు అవతరించాడు.

'ఆయనా మొదట మహేశ్వరాంఘ్రికమల ధ్యానైక శీలుడే.' అయితే ఆయన శివాభిరతి నన్నయ జాతికి చెందింది. వీరశైవానికి అనుబంధంకాదు. నన్నయ తర్వాత విచ్ఛిన్నమైన మార్గకవితారీతికి అద్వైత భావనకు ఆయన నవ్య ప్రవర్తకుడుగా నిబద్ధుడు. నన్నయ కవితాదర్శానికి, తన కవితాదర్శానికి - మధ్య ఏర్పడ్డ అఖాతాన్ని కడిది గడుసుతనంతో పూరించాడు.

నన్నయ మార్గకవితారక్తి శివకవుల దేశికవితాభక్తి ఏకమైన పాకంలో ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శైవ వైష్ణవాలను ఒక మూసలో కరిగి హరిహర దేవుణ్ణి సృష్టించాడు. అద్వైతాన్ని ప్రతిష్ఠించాడు.

తిక్కన కవితా మూలం

తిక్కనార్యుని పేరు తలపెట్టగానే మనకు ప్రత్యక్షమయ్యేది అక్షయ వటంవంటి ఆయన మహాభారత రచన, నిర్వచనోత్తర రామాయణం జ్ఞాపకం రాదు. కాని ఆ అక్షయ వటానికి అసలువేళ్లు ఉత్తర రామాయణంలో ఉన్నాయి. ఆయన రచనోపక్రమాన్ని అర్థం చేసుకోవాలంటే - ఉత్తర రామాయణ ప్రవేశ ద్వారంలోనుంచే బయలుదేరాలి. నన్నయ భట్టారకుని తర్వాత తెగిపోయిన ఆంధ్రకవితా సాధు సంప్రదాయాన్ని రెండుచేతులా లేవనెత్తడానికి ఆయన చూపిన ఉత్సాహ వ్యగ్రత గమనించాలి.

నన్నయ అడుగులో అడుగు వేసి ఆతని కవితా గ్రంథాన్ని, పదబంధాన్ని, గురుపదంగా భావిస్తూనే ఎట్లా క్రొత్తతోవలు తీయడానికి ప్రయత్నించాడో అందులోనే కనబడుతుంది

విజయసేనమనే ఆయన అజ్ఞాతరచన ఎట్లా ప్రవర్తించిందో మనకు తెలియదు గనుక మనకు, ప్రకృతం ఉత్తర రామాయణమే

తిక్కనార్యుని ఉత్తర రామాయణం, నన్నయ కృత్యాదిలాగానే సంస్కృత శ్లోకంతో ప్రారంభమయింది

నన్నెచోడునివలె కుకవినింద చేయ బోయినా భట్టారకునికి ఎనిమిది నూర, కడచిన శతాబ్దిలో తెనుగుకవిత ఎట్టి విపరీతాల పాలయిందో పరోక్షంగా విమర్శించాడు

ఆతని ఆక్షేపణలు

ఆ విమర్శ సారాంశం ఇదీ——

1 పలుకుల పొందిక లేకపోతే - రసభంగం అవుతుంది పాతబడ్డ మాటలు మనస్సును అలరించలేవు

2 తెలుగు కవిత్వం చెప్పదలచినవాడు అర్థానికి తగిన మాటలు వాడాలి యతి ప్రాసలు పులిమిపుచ్చకూడదు

3 సంస్కృత విశేషణ విశేష్యాలకు లింగవచన వ్యత్యాసం పండితులకు రుచించదు

4 సంస్కృతం ఎంత ఒప్పిదమైనదైనా జాతీయం కాదుగనక ఆ స్థానంలో చొప్పించగూడదు, చెవికి ఇంపుగా ఉందని ప్రాస సాంకర్యం చెయ్యగూడదు

ఈ ఆక్షేపణాస్త్రాలకు గురిఅయిన వారెవరు? అంటే మొదట శివ కవులు తర్వాత సమకాలీనులైన అనామకు లెవరైనా ఉంటే ఉండవచ్చు వారి ప్రసక్తి ఇక్కడరాదు

శివకవుల్లో పలుకుల ఒప్పిదం లేకపోవడం అంటే తిక్కనార్యుని మతంలో ఇవి——

(1) లంజెఱ్ఱకము, కుర్యా ఇస్మి గుర్వా, వంటి మాటల్లో పదమధ్య వర్ణలోపాలు ఇంపు కాకపోవడం

(2) 'చౌదళాబ్జము', 'శివమరులు', 'ఒద్ధ మిండెత', వంటి వైరి సమాసాలు శ్రుతిహితంగా ఉండక పోవడం

(3) హద్దుమెఱుగని బ్రాహ్మణనింద మతాంతరులమీది పరుషోక్తులు

ఇట్టి అనుచిత ప్రసంగాలవల్ల రచనమీద మనస్సు విముఖమై రసానుభవం దాకా వెళ్ళ పోవచ్చు

మరికొంచెం లోతుకు వెడితే – వీరశైవుల వికృత వర్తనలు, పరమేశ్వరుని విపరీత కథలు పాఠకులను రసాభిముఖులను చేయలేవనిగూడా తిక్కన తలంపు కావచ్చు

కావ్య ప్రయోగానికి ఒప్పని పాతమాటలు 'ప్రడ్డలు', 'లెంగులు', 'తూపొడుచు', 'దుద్దెక్కి' వంటిమాటలు సహృదయులను అలరించవు

తెలుగు కవిత్వం చెప్పదలచినవారు కడ్యెరసు కేనము, గంటబేటము - వంటి కన్నడపదాలు

నాయి కట్టాయం, కుళిరుగొను వంటి తమిళ పదాలు, హరుషాశ్రు ధారలు, వనేచరియలు, త్రిశానీకం వంటి సంస్కృతాపశబ్దాలు వాడడం అర్థవ్యక్తికి అపచారం చెయ్యడమే—

యతుల్లో ర, ల యతి, ప్రాసల్లో ప ణ స, శ, ష, స, లు దీర్ఘము మీద నిండు సున్నలు సంయుక్తాక్షరాలలో ఒక్కటక్షరమే తీసుకునే సమీప ప్రాస తిక్కనకు రుచించినట్టు కనపడదు

విశేషణ విశేష్యాలకు సలింగత్వం, సమాన వచనత్వం లేకుండా - ముక్కంటి భక్తులు ముగ్ధలుగారే ? చిలుకపిండు పాయకుండును - తద్వచన శ్రవణాభిలాషులై వంటివి గూడా తిక్కనకు అరుచి కల్పించి ఉంటాయి

రచనా ప్రణాళిక

తిక్కన 'ఒప్పయిసను - సంస్కృత మెయ్యెడ జొన్ప' అంటే అసలు సంస్కృతమే వాడననిగాని - వాడకూడదనిగాని శపథం చేసుకుని కూర్చు

న్నాడనుకో కూడదు ఉత్తర రామాయణంలోగాని భారతంలోగాని అవసర మైనప్పుడు నన్నయకంటె గూడా చిక్కని సంస్కృతం ఆయన స్వేచ్ఛగా వాడడం కనబడుతుంది శివకవులవలె వేదాల నుంచీ శాస్త్రాల నుంచీ, వాక్యాలు వాక్యాలు తెచ్చి 'ధరను మాతా పితా రుద్ర' యనగ, సను 'విమృజ్యాంగాని సంస్పృశేత్త' నగ అంటూ తెలుగులో నింపడం వికృతంగా కనపడుతుందని ఆయన భావన

నిర్వచనం ఎందుకు ?

'గద్యం తోడుగా తీసుకో' నని అనుసంధాన వాక్యలక్షణంగా పద్యమే ఉపయోగిస్తానని అనడం ప్రారంభదశలోని ప్రౌఢోక్తిగాని గద్య ద్వేషం కాదు సంస్కృత చంపూ గ్రంథాలలో వాక్య సాంగత్యం చేస్తూ గద్యం ఉంటుంది నన్నయ ఆ మార్గం అనుసరించినవాడు

పేలవమైన భావానికి పద్యం అనవసరం సంస్కృత కావ్యాలలో గద్యం ఉండకుండానే పద్యాలతో కథ నడుస్తుంది కథనం దగ్గర పేలవంగా ఉన్నా అది వారి సంప్రదాయం వాల్మీకినుంచికూడా ఇదే పద్ధతి సంస్కృత భారతంలో గద్యం అక్కడక్కడ ఉన్నా అది నామమాత్రం తర్వాత కవులు శ్రవ్య కావ్యాల్లో గద్యను చోటనివ్వలేదు

తిక్కన ఆ సంస్కృత కావ్యపద్ధతిని అనుసరిస్తే ఎట్లా ఉంటుందో అని చూచి (తనది రామాయణం కనుక) నచ్చక భారత రచనలో నన్నయ మార్గాన్నే అనుసరించి గద్యను విరివిగా వ్రాశాడు

ఏతావతా – తిక్కనార్యుడు తనకు ముందున్న రచనలమీద చూపిన ఆ రుచి అంతా శివకవులకు సంబంధించినదే అనుకోవడానికి ఎక్కువ వీలుంది

మతపరంగా ఉత్తర రామాయణంలో వాచ్యంగా ఏమీ లేకపోయినా – 'హరి హర పద్మగర్భులను – భక్తిఁగొల్చి' ప్రారంభించడం, వారికి సరిపడని విష్ణు పారమ్యం తెలిపే రామాయణ రచనకు పూనుకోవడం, వ్యంగ్యంగా వారిని వ్యతిరేకించడమే అనిపిస్తుంది

ప్రజల్లో వీరశైవ వైముఖ్యాన్ని చూచాడు సాహిత్యరీత్యా – నన్నె చోడునివంటి సమర్థుల రుచిర భావనలను గుర్తించినా – వారి విపరీత ధోరణు

లను ప్రతిఘటించ దలచాడు తనకు మంచి ప్రభువు అండ ఉంది చేతిలో పటిష్ఠమైన రచనాశక్తి ఉంది ఆ తోవ మళ్ళించాలనుకున్నాడు ఉత్తర రామాయణ రచనకు ఉపక్రమించాడు

ఉత్తర రామాయణ రచన

ఉత్తర రామాయణంలో రెండు కథలున్నాయి ఒకటి రావణుని పూర్వ కథలు, రెండు రాముని ప్రస్థాన కథ సంస్కృత కావ్య మర్యాద ననుసరించి క్లిష్టంగా 10 ఆశ్వాసాలలో ఈ ఉత్తర రామాయణం విరచిత మయింది 6½ ఆశ్వాసాలలో రావణ కథ ఉంటే 4½ ఆశ్వాసాలలో రామకథ విస్తరిల్లింది ఉత్తర రామాయణం వాల్మీకి విరచితమేనా ? కాదా ? అనే వివాదం ఉంది పూర్వ రామాయణ కవితా పటుత్వం ఉత్తరకాండలో కనబడకపోవడమే దీనికి కారణం అయినా - సీతా వివాసాది కథలు సుప్రసిద్ధములై కాళిదాస, భవభూతి దిఙ్నాగాదుల రచనలు ప్రేరకములు అవడం చేత ఈ ఉత్తర రామాయణకథ రసజ్ఞులకు లపరిహార్య మయింది

ఈ రచన వాల్మీకి రచన అనబడే ఉత్తరకాండకు అనువాదం కాదు అట్టివారి రచనలలో అనువాదం అనే మాటకు ప్రసక్తిలేదు మూల సంస్కృతుల ప్రధానాంశాలను రేఖామాత్రంగా స్వీకరించి తమ ప్రతిభా ప్రకర్షలతో కావ్యంగా రూపుదిద్దడమే వారి ఏకైక లక్ష్యం ఆ లక్ష్యం ఈ ఉత్తర రామాయణంలో ప్రముఖంగా కనబడతుంది

ఆత్మస్తుతి కాదు

"అమలోదాత్త మనీష నే నుభయకావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడన్ గళావిదుఁడ" అని ఈయన కావ్యం ప్రారంభించడం ప్రాజ్ఞులకు ముందు అవష్టంభంగా కనిపించడం సహజం

నన్నయ రచనావతారికలోను ఇట్టి ఆత్మ ప్రశంసా వచనాలున్నా - అవి మహాభారత రచనావిర్భావానికి ఉన్న ఆర్టే పట్టిష్టవు కాని ఈ చిన్న రచనకు ముందు ఇట్టి వాక్యాలు ఎబ్బెట్టుగా ఉన్నట్టనిపిస్తుంది రచనా నైపుణ్యంలో అన ఉదాత్తమనీష, ఉభయకావ్య ప్రౌఢి, కళావేత్తృత చూపించి ఊరుకుంటే ఇంకా ఆయన గొప్పతనం ఇనుమడించి ఉండేదిగదా అనిపించనూ

వచ్చును కాని సమర్థుడైన కవి తన ప్రారంభదశలో ఈ మాత్రం ఆత్మ ప్రత్యయం చూపడం ఆక్షేపణీయం కాదు చిత్రమేమిటంటే - ఉత్తర రామాయణం చివరకంటూ చదువుతూ వెడితే అతని శక్తి అంతటిదే అని తోస్తుంది భారత రచనలో పరిపక్వ హృదయుడు, జ్ఞాని అయిన తిక్కనార్యుని రచనలో ఈ ఆత్మస్తుతి కనిపించదు, ఇందులో కనిపిస్తుంది అంతే తేడా

ఉత్తర రామాయణ రచనా నైపుణ్యం

తిక్కన్న కవి తన మూడవ కంటి వంటి ప్రతిభా నేత్రం తెరచి వర్ణ్యమైన తన కావ్యవస్తువు నంతా లేశలేశాల గాలించి చూస్తాడు — ఆయన చూపుడు వేలు - అరుగో పాత్రలు - అవి వారి మాటలు అవీ వారి కదలికలు అంటుంది ఆయన గంటం కదులుతుంది అప్పుడు మనకు కవి కనబడడు ఆ పాత్రల మూర్తులే మన ఎదుట కదులుతాయి వారి మాటలే వినిపిస్తాయి అప్పుడు శ్రవ్యకావ్యంగా బయలుదేరిన రచన దృశ్యకావ్యమై పోతూ ఉంటుంది

ఈ అనుభూతి ఏదో సంస్కృత గ్రంథానికి ఆంధ్రీకరణం అనుకుంటే రాదు స్వయంగా కవి హృదయ భూమిలో పుట్టి ఎదిగిన పుష్పకుంజంలా పరిమళాలు వెదజల్లితేనే వస్తుంది అప్పుడే ఆ కావ్యం ఎవరి మాటలకో ప్రతిధ్వనిలా కాక స్వంత ధ్వనిలా నిలిచి సుస్వరం వినిపిస్తుంది

భారతంలోని జీవం తొణకే పాత్ర నిర్మాణానికి, సంభాషణ చాతురికి సన్నివేశ కల్పనకు - మూల పదార్థం ఉత్తర రామాయణం నుంచే వెళ్ళింది

తృతీయాశ్వాసంలోని విష్ణురాక్షస యుద్ధ సందర్భం భారత మహాయుద్ధ వర్ణనకు చేయి అందిచ్చినట్టుంటుంది అందులోని 15, 16 17 పద్యాల్లో తిక్కన ముద్ర కనబడుతుంది

నంది శాపం

రావణుడు ఉద్ధతుడు పుష్పకంతో కైలాస ప్రాంతంలో తిరుగుతూండగా హఠాత్తుగా విమానం ఆగిపోయింది 'ఇది ఈశ్వరభూమి తొలగి పొమ్మ'న్నాడు నందీశ్వరుడు

"అడి వీఁగముడిగి రాక్షస !
చెడక, మరలి పొమ్ము నీ చేయలంతియె ఈ

యెడ నింక నివు నిలిచిన
పడ నడతురు కన్న నిన్నుఁ బ్రమథ గణంబుల్" చతు 84

అంటే రావణుడికి కోపం వచ్చింది

"ఈశ్వరుఁడనగ నెవఁడు, అతనికిచ్చోటు దక్కిన కతము చెప్పు" మన్నాడు అంతవరకు ఫరవా లేదు కాని రావణుడు నందికేశ్వరుని రెచ్చ గొట్టిన తీరు అతని సర్వనాశనానికి కారణమయింది

"కడు పెల్చనవ్వి 'అగు నీ
వడువునఁ జెలువంబు గలుగు వారల చేతం
జెడఁడే ఈతఁడు నుడువక
యుడుగు' మనుచుఁ బంక్తి వదనుఁ డుల్లసమాడెన్" 86

ఉల్లసమంటే ఎత్తిపొడుపు దానికి కారణం ఈ పద్యంలో లేదు 'వానర వదనంబు సట్టులున్న నంది మొగము' అని పైన ఉన్నది దానితో రావణుని ఔద్ధత్యం చెలరేగి 'ఈ సొగసు మొగాల వారేనా మమ్మేల్ని చెరచేది' అనే మాటల్లోని ఆ దెప్పు నందీశ్వరుణ్ణి మండించింది

"ఇవ్విధము నాననముల్ గలవార యేపునన్
మిగిలిన రాక్షసాన్వయము నిన్ను బురంబును
సాగరంబు గాసిగ మసిగాగఁ జిక్కువడఁ
జేడ్పడఁ జేయుట యట్లు దప్పునే" చతు 87

అని నంది శపించి—

"నిన్ను బట్టి యిపుడ నీటుగఁ దలలు దు
న్మాడ నాకు శక్యమగున దైన
జగము చేత నిందఁ జచ్చిన వాఁడవు
మున్న కాన - శవము ముట్ట ననిన—" చతు 88

ఒక ధృష్టుడు, ఒక ధీరుడు వారి సమావేశంలోని స్వభావ చిత్రణం మాటలలోని ధ్వని చారుత తిక్కనగారి పలుకు చేవకు నిదర్శనాలు ఈ మాట పై మాటలు తెలుగువారి నెత్తురుతో పుట్టినవి వాని నేగినవాడు కవి!

రంభా రావణులు

ఉత్తర రామాయణం అనగానే జ్ఞాపకం వచ్చే మరోఘట్టం రంభా రావణ సంవాదం, దీనిని పాపరాజు విస్తరించి వ్రాయడంచేత మరింత ప్రాధాన్యం వచ్చింది కాని ఈ ఘట్టంలో తిక్కన క్లుప్తత, ఉపజ్ఞ, పొందిక ముఖ్యంగా చూడదగ్గవి తిక్కన ముందటి రచనయే పాపరాజుకు ప్రావకం అయిందనడానికి ఏమీ అభ్యంతరం ఉండకూడదు

నలకలకు, నలుగుళ్ళకు తెలుగువారిలో - 'రంభా రావుళ్ళు' అని పేరు ఇది రంభా రావణ సంఘర్షణకు వికృతి యేమో అనిపిస్తుంది

దిట్టతనం, గడుసుతనం, రావణుడికి వెన్నతో బెట్టినవిద్య రంభ అమర వేశ్యలలో జాణ ఈ సన్నివేశాన్ని చూచినట్టు చెప్పడం తిక్కన నేర్పు

రావణు డంటాడు-"నాకు నప్సరో వనితలు వింతయైరె? అని వారణ నెట్లయినన్ జరించు నీవును గుల భామవోలెఁ దగవున్ ఘటియించెదు వైశికంబునన్ పద్య 69

విచ్చల విడియై యున్నెడ
మెచ్చక నను ద్రోచి పోవమేలే? తమకం
బచ్చు పడునట్లుగా సిరి
వచ్చిన మోకాలు సూపువారుం గలరే? ఉ-70

అప్పుడు రంభ—

"నావుడు నమ్మృగేక్షణ మనంబున రోయుచు నేను లంజియం
గావుడు వానితోడి తమకంబది లంజియ కాదు ప్రేమ స
ద్భావ మెఱుంగవైతి గుణభాగివిపో - నినుగోర్కి సెందునే
నీ వచనంబు తప్పకట! నీళ్ళుల పట్టున నేయి మందొకో!" 72

రంభ లంజికయే కావచ్చును కాని ప్రేమకు లంజెతన మున్నదా? రంభ ముఖం నుండి వెలువడిన ఈ మాటకు విలువ అక్షరలక్షలు నీ కున్నది పొగరు గాని గుణగ్రహణం కాదు, నువ్వు అజ్ఞానివి దప్పికకు నెయ్యి మందు కాదు. మరింత గొంతార్చుకు పోతుంది' అని రంభ విదళించడం - నరకుని

ముందు ఊర్వశి నిలిచి నట్లుంది నరకుడు ఊర్వశి వలలో పడ్డాడు రంభ తప్పించుకోలేక పోయింది

"అంగనఁ బోదివి నగాధా
లింగనముగ తామ్రచూడ లీలా చతురా
నంగ క్రీడా సంగతి
నెంగిలి గావించె మదము నేడ్తెఱ మిగులన్" -74

రావణుని అకార్య కరణాన్ని 'ఎంగిలి గావించె' అనడం ఒక్క తిక్కన నోటినుంచే రాలిన ముత్యం. తర్వాత అతడు గాఢంగా చిత్రించినది సీతా రాముల ప్రణయ ఘట్టం—

దీని గురించి ముందొక మాట

సీతా రాముల దాంపత్యం

మహర్షి దృష్టిలో సీతారాములది నీలీరాగం అంటే వారి ప్రేమ ఎంత గాఢమైనా ఉద్దీపాదులవల్ల వెల్లివిరియదు అది భావ బంధురం కాని అనుభవ తుందిలం కాదు నల దమయంతులవలె, శకుంతలా దుష్యంతులవలె, రాధా కృష్ణులవలె శృంగార లీలా ప్రధానం కాదు ధర్మైక మధురం బాలకాండంలో సీతా కల్యాణం తర్వాత ఉయోధ్యాంతఃపుర వాసంలో వర్ణించిన వారి దాంపత్య ప్రసక్తి ధ్వని ప్రధానమై దివ్య భూమికలను తాకింది గాని శారీరక స్పృహలకు లోనైనది కాదు అక్కడ వారి శృంగారం 5 శ్లోకాలలో స్ఫూర్తి మంతంగా వర్ణితమయింది వారి అనుభవ సారం యిది-

"తయాచ రాజర్షి సుతోఽభిరామయా
సమేయివా నుత్తమ రాజ కన్యయా
అతీవ రామః శుశుభేఽతి కామయా
విభుః శ్రియా విష్ణు రివా మరేశ్వరః" రామా బాల

ఇందులోని నాలుగవ పాదంలో వారి అనురాగం దివ్యశ్రేణికి చెందిందని సూచిత మయింది 'అతి కామయా' అన్న మాటను అపార్థం చేసుకోకుండా తని శ్లోక వ్యాఖ్యాత 'అతిక్రాంత మన్మథయా' అని అర్థం వ్రాసి 'తేన ఉప్రాకృత విగ్రహవత్తయా దివ్య దంపతి భోగఏవ అత్రాభివ్యజ్యతే' అని

వివరించాడు కనుక సీతారాముల ప్రేమానుభూతిని లౌకిక దంపతుల ప్రమాణానికి దింపకూడదు వాల్మీకి ఉత్కట శృంగార వర్ణనం చేత కానివాడు కాదు

శరద్వర్ణనంలో రావణాంతఃపుర సందర్శనంలో ఆయన చిత్రించిన శృంగార రీతి మనలను చకితం చేస్తుంది రావణాంతఃపుర, అయోధ్యాంతః పురాల అంతరం చూపించడంలోని ఆయన ప్రజ్ఞ అసన్య సాధారణం ఒకటి తమోగుణ భరితమైతే, రెండవది సత్త్వగుణ సాధువు వాల్మీకి ఉత్తరకాండ లోని సీతారాముల శృంగారానుభవంకూడా భావ సమున్నతంగా నడిచిందిగాని భౌతిక స్థాయికి ది లేదు

ఉత్తరకాండ 42 సర్గలో 6 శ్లోకాలలో వారి అనురాగానుభూతి వర్ణితమయింది

దాని సంగ్రహరూపం ఇది—

ఏవం రామో ముదా యుక్తః । సీతాం సురసుతోపమాం
రమయామాస వైదేహీం । అహన్యహని దేవవత్ ॥

ఇక్కడ 'దేవవత్' అనేమాట ఈ సందర్భానికి కరదీపిక

తిక్కన శృంగారం

తిక్కనార్యుడు మహర్షి చూపిన ఈ బాట విడిచి తనదైన ఒక శృంగార రీతిని, ప్రీతిని ప్రవేశపెట్టి ఈ ఘట్టాన్ని రసవంతం చెయ్యడానికి ప్రయత్నించాడు అయితే అది వాల్మీకి హృదయానికి భిన్నమైనా తెలుగువారి శృంగార రుచి అనుకోవాలి కనక అది ఎవరికీ ఎబ్బెట్టుగా కనపడలేదు అంతేకాక ఇక్కడ ఒక గుణంకూడా కొందరు చూచారు

ఏమంటే - భావి సీతారామ వియోగ కరుణరస ప్రతిపాదనకు ఈ శృంగార రంగం దీప్తి కలిగిస్తుందని వారభిప్రాయపడ్డారు ఏది ఏమైనా తిక్కనార్యుని సీతారామ విహారఘట్టం ఆయన భావనా బలానికి, కవితా నైపుణ్యానికి నిదర్శన మనడానికి సందేహం లేదు

అష్టమాశ్వాసంలోని సీతారాముల శృంగారం, ఉద్యాన విహార, జలకేళీ విలాసాలతో ఉద్దీప్తమై పరస్పర దర్శన స్పర్శనాలాపాదులవల్ల అనుభావితమై రసీభవించింది

ఇందులో రామచంద్రుడు సరసోక్తులతో, చతుర వర్తనంతో ఆరితేరిన శృంగారి అనిపిస్తాడు

'కలపంపు లభినవ గంధంబులుగ గూర్చి తనువల్లి గలయంగ దాన యలదు ఇత్యాదిగా స్వయంగా సీత నలంకరించి "జనకరాజ తనయ మనము దలిర్పంగ, వివిధ నిపుణలీల వెలయనిట్లు చతురముగ నొనర్చు సౌభాగ్య సారాబ్ధి రామమూర్తి యగుచు రామవిభుడు" ౮-22

రమణీయ స్థలముల హృ
ద్యములైన పదార్థములఁ బ్రియాసహిత విహా
రము సలుపు నుచిత పరివా
రము నాగరికంబు నను సరస మధురము గాగన్ ॥ ౮-20

ఒక వనపాలిక తుమ్మెదలు ముట్టని పూలగుత్తి తెచ్చి రామునకు సమర్పించబోతే అతడు పుచ్చుకోడానికి వెరచినట్టు నటించి కానుకలు పుచ్చుకో దగిన వారుండగా మేమెవరం స్వీకరించడానికి? అన్నాడు సీత చిరునవ్వుతో స్వీకరించింది ఈ మెలపు తెలుగువారిది దానితో తెనుగువారిని పిడికిటపట్టిన వాడు తిక్కన

చొత్తెంచిన వనపాలిక
మత్త మధుపములకుఁ దప్పి మధుభరితంబై
క్రొత్తావి గ్రమ్ము నరవిరి
గుత్తి విభునకిచ్చె వినయ కుంచిత తనువై ॥ ౫-25

జనపతి యందగావెఱచు చాడ్పున - జానకి జూపి కానుకల్
గొనఁ దగువార లుండ మనకుం జనునే? యని చేయి వాయఁ బె
ట్టిన వనపాలికా కరపుటీ కలిత స్తబకంబు పుచ్చె మె
ల్పున సతి లేఁతనవ్వున గపోలతలంబులఁ గాంతి వింతగాన్ ॥ ౫-26

తొలి తెనుగు మాటలతో పూర్వార్ధాన్ని నింపి తరువాతి సంస్కృత సమాసంలో సీత రీవిని స్ఫురింప జేయడంతో ఆ సన్నివేశం ఎదుటికి వచ్చి నిలిచినట్టుంది

రాముని చతుర వర్తనానికి తిక్కన ఊహా మాధుర్యానికి ఈ పద్యం పరమావధి—

అల్లవె లెస్సపువ్వులని యందని గుత్తుల దిక్కుసూపి తా
నల్లన చేరి నేను నెగయన్నిను నెత్తెదఁ గోయుమంచు భూ
వల్లభుఁ డాదటం బొదివి వామవిలోచన నెత్తెఁ దత్తనూ
వల్లికతోన మైఁబులకవర్గము కాముఁడు నారువోయగన్ ॥ ఉ-౩౧

తెలుగు రాముడు సీతకు అందని పువ్వులు చూపి కోయ్యమంటాడు ఆమె మాటాడదు అతడు నవ్వుతూ నిన్ను నేను పైకెత్తుతాను, నువ్వు కోయ్యమంటాడు ఆ యెత్తు ఆమెకు తెలుసు అతడు నిలువునా కౌగిలించుకొని పైకెత్తుతాడు నారుపోసినట్టు రెండు శరీరాలూ పులకరిస్తాయి పాఠకుల హృదయాలతో సహా ఈ పున్నమిని మింగివేసే అమావాస్య వెంటనే పొంచిఉందని వారికేం తెలుసు ?

సీతా వివాసం

ఈ వెన్నెల తెలుపు, ఆ అమావాస్య నలుపును మరీ దట్టం చేసిందేమో అనిపించడం సహజం

తపోవన దర్శనం సాకుతో సీతా వివాసం నిశ్చయమయింది తక్కిన ఉత్తర రామాయణాలలో- ఇట్టి సీతకు అట్టి రాముడు మొగం కనపర్చలేడు

తిక్కనరాముడు గుండెలో అగ్నిపర్వతం దాచుకుని అది పగిలిపోకుండా నవ్వగలవాడు సీతను స్వయంగా సాగనంపుతూ లక్ష్మణుని మూకీభావాన్ని అతనికి సీతను ఆశ్రమాలకు పంపడం ఇష్టం లేనట్టూ, తాను పట్టుబట్టి ముద్దు తీర్చడానికి పంపుతూన్నట్టు, వెడ వెడగా సమర్థిస్తాడు

సీతకు విషయం తెలిసింది, తల తిరిగింది అయినా ఆమెకూడా తిక్కన చేతిలో రామునికి మించిన గాంభీర్యం వహించింది లోలో కార్చిచ్చు పైకి రెండు మాటలు—

" పతి జనించిన కోలెను బంహిహైక
లోలమతి యొడల్ సిదిమినఁ బాయువచ్చు
నాత డిది కార్యమని నిశ్చయంబు చేత
నా యభాగ్యంబ యొండొక వేయునేల ?"

ఎత్తుగీతి ౯-22

ఈ ఘట్టంలో పాపరాజు భవభూతివలె కరుణ రసాన్ని క్రుమ్మరించాడు గాంభీర్యం కంటె వావిడిచిన రసోల్బణానికి తెనుగు రసప్రియులు అభిముఖులైనారు

భారత నవనీతం

సంస్కృత మహాభారత సముద్రం ఎదుట నిలిచిన నన్నయ భట్టారకుడు 'భారత భారతీ సముద్రము చొయంగ నీదను విధాతృనికైనను నేరబోలునే ? అని ఆశ్చర్యచకితుడైనాడు

సాహసించి దిగాడు తోవ చేశాడు కాని పూర్తికాలేదు తొక్కుకొని పోవలసిన అపారపారావారం ఇంకా ముందే ఉంది

తిక్కన జెబ్బ చరిచి ఒక్క ఉదుటున ఆ సముద్రంలో దూకివేశాడు ఒకటూ ? రెండూ ? 15 పర్వాలు——

"ఒక చేతన్ పదునైదు పర్వముల నో
హో యన్నటుల్ తెల్గు వ
ల్లికిపై పంచమ వేదగానమును నా
లాపించి పీయూష వే
ణిక లాంధ్రావళి పీనుదోయి తనియన్
నిండించి విజ్ఞాన దీ
పిక లింటింటను దిద్దితీర్చు కవితా
విశ్వంభరున్ గాంచనా" (కీర్తి తోరణం)

అని అనుకుంటూ నిర్వైరపోతాను

తిక్కన్నగారికి హరిహరనాథుడు కలలో కనిపించి 'నీ భారత రచనను నాకు అంకితం చేయవలసింది' అన్నట్టనిపించింది

నా మనో నేత్రానికి ఇంకొకటి కనిపిస్తుంది నిలువెత్తు వ్యాసమహర్షి తన పండు గెడ్డం ~ ~ ~ తిక్కనకు భావంలో ప్రత్యక్షమై—

"ఊర్ధ్వ బాహు ర్వి రౌ మ్యేష
న చ కశ్చి చ్ఛృణోతి మే
ధర్మా దర్థ శ్చ కామ శ్చ
స కి మర్థం న సేవ్యతే"

"చేతులెత్తి ఘోషిస్తున్నాను ఎవ్వడూ వినడు, ధర్మం కంటే అర్థకామాలు అధికమయ్యాయి ధర్మాన్ని ఎందుకు చేపట్టరు?"

'నాయనా! మా మతాంతరాల్లో ఏ ఏండ్లు నిరంతరం కవితా తపస్సుచేసి వ్రాసిన ఈ మహాభారత సంహితను తెనుగువారం దించు' అని కోరితే – తిక్కనార్యుడు మహర్షికి నమస్కరించి 'మీ వేదన, మీ బోధన, నాకు అర్థమయింది కాని మీ మాటల్లో, సూత్రాల్లో చెబితే వీరి తలకెక్కదు మీరుండండి వీరి కెట్లా చెప్పాలో నాకు తెలుసు పదార్థం మీది వస్తు నిర్మాణం నాది - ఇద్దరి గమ్యమూ ఒకటే - ఈ తెలుగుజాతిని నీతి ధర్మ ప్రబోధితులను చెయ్యాలి కవితా కళలు పట్టుకోవాలి భారతం తెలుగులోనే పుట్టిందని పిస్తాను దానికి తొలి మహాకావ్య గౌరవం కల్పిస్తాను ఒకటి పాలైతే-ఒకటి వెన్న - పాలు లేనిదే వెన్నలేదు కానీ పాలూ వెన్నా ఒకటికాదు మహర్షి పరితృప్తుడై తిరోహితుడైనాడు తిక్కన - సోమయాజియై గంటం పట్టాడు

తిక్కన భారత రచనా లక్ష్యం ఏమిటి ?

అపది అమలోదాత్త మనీష - తాను 'ఉభయ కావ్య ప్రౌఢుడు', 'శిల్పమున పారగుడు' 'కళావిదుడు' అనుకొని తన ప్రజ్ఞ అంతా ఒడిచి మహాభారత రచనచేసి కవి బ్రహ్మ అనిపించుకుందామనా? అతడు అంతవాడే కావచ్చు కాని ఆ ఆకాంక్ష ముఖ్యంకాదు దానికి యజ్ఞంచేసి సోమయాజి కానక్కరలేదు నన్నయ పట్టి విడిచిన భారతాన్నే స్వీకరించి మహాకవి అనిపించుకోనక్కరలేదు విష్ణు, భాగవతాది పురాణాలున్నాయి దేన్ని చేత బట్టినా తన ప్రతిభతో మహాకవి అనిపించుకోగలవాడే తన పారమార్థిక చింతకూ అవి పాత్రములు కాకపోవు కాబట్టి ఆ ఊహకు ప్రాధాన్యం లేదు

మరో ఊహ

స్వాతిశయ పూరితమైన కవి యశః ప్రార్థనంకంటె వేరొక మహోత్కృష్టం తన ఎదుట నిలిచిఉంది. అది అన్యమత విచ్ఛిన్నమైన హైందవమత పున రుద్ధరణం! ముందు అవైదిక జైన బౌద్ధాలూ, తర్వాత హింసాత్మక వీర శైవం దేశాన్ని కల్లోలితం చేశాయి. హరి-ని కొందరూ హరుడని కొందరూ ప్రజల్ని చీల్చి తమవైపు తిప్పుకుని పరస్పర ద్వేషాన్ని రెచ్చగొట్టారు. జ్ఞానంలేని మూఢభక్తిని ప్రతిష్ఠించారు. జ్ఞాన మార్గాలను గేలిచేశారు. వారి ఉద్ధతిని ప్రతిఘటించి సాధువర్తనాన్ని, జ్ఞానసాధనను ప్రబోధించాలి. అందుకు ప్రాతిపదికగా ముందు కర్మప్రధానమైన యజ్ఞంచేసి సోమయాజి అయినాడు. కర్మ సాధనవల్ల జీవితం క్రమబద్ధమై జ్ఞానాభిముఖ మవుతుంది. ఆ రెంటిని భక్తి వెలిగిస్తుంది. మాధుర్యంతో నింపుతుంది. సోపాన బద్ధమైన ఈత్రయం జీవుని సుఖశాంతులకు తోడ్పడి ముక్తికి త్రోవచూపుతుంది.

వీని కన్నిటికీ పట్టుగొమ్మ వేదం. దాన్ని మథించగా వచ్చిన నవనీతమే ఉపనిషత్తు. ఉపనిషత్పరమార్థంతోకూడా వేదధర్మ విస్తరణమే భారత పరమ ప్రయోజనం.

> 'యదిహాస్తి తదన్యత్ర
> యన్నేహాస్తి నతత్ క్వచిత్'

ఎక్కడ ఏమి ఉన్నా ఇందులో ఉన్నదే - ఇందులో లేనిది ఎందులోనూ లేదు. దాన్ని లన ప్రజలకు రెండు చేతులా అందించడమే తిక్కన భారతాంధ్రీకర ణానికి పరమలక్ష్యం. ఈ లక్ష్యం వ్యాసప్రోక్తాన్ని యథాతథంగా వివ స్తూ తెనుగులో టీకా తాత్పర్యాలు వ్రాస్తే సిద్ధిస్తుందా? లాభంలేదు. ఎవరూ రుచిగా చదవరు. గ్రంథ శరీరం పెరుగుతుందిగాని అందులో ఆత్మ ఉండదు. ఎవరినీ కదిలించదు, అలరించదు. చప్పరిస్తూ చదివించాలంటే - 'వింటే భారతమే, తింటే గారెలే' అని రసికులు అనుకోవాలంటే - ఒక ఉభయ కావ్య ప్రౌఢుడు కావాలి, శిల్పపారగుడు రావాలి, కళావిదుడు చేపట్టాలి. ఇన్ని ప్రయోజనాలను భావించి తిక్కన భారత రచనకు ఉపక్రమించాడు.

అయితే - వ్యాస భారతమంతా ఉన్నదున్నట్టుగా తెలుగులోకి రాలేదని కొందరు శ్రోత్రియ పుత్రుల సణుగుళ్లు వినిపిస్తూ ఉంటాయి. మంచిదే - అయితే

భారత పరమార్థం నవనీత ప్రాయంగా తెలుగువారికి అందించం ప్రధానమా? తు చ తప్పకుండా భారత కళేబరం తెలుగులోకి అవతరించడం ముఖ్యమా? అన్నదే ప్రశ్న ఒక అఖండ శిలోచ్చయమూర్తిని అనల్ప శిల్పరూపంగా మలచడం ఘనవిజయం కాదా? ఎల్లోరా పర్వతశ్రేణిని కైలాసాలయంచేసి పూజ్యరూప మిచ్చిన మహనీయ శిల్పికి ఎన్ని వందనాలర్పిస్తే ఋణం తీసు తుంది? అట్లాగునే - మహాతత్వపూర్ణమూ, భావభూయిష్ఠమూ, అయిన వ్యాస భారతానికి తిరుగులేని శిల్పరూపమిచ్చిన కళావిదుడు శ్రీ కొట్టరువు తిక్కన సోమయాజి ఆంధ్రజాతికి ప్రాతఃస్మరణీయుడు

వాల్మీకి రామాయణంలో కొన్ని అనన్వితాలూ అసందర్భాలూ ఉన్నా యని కొందరంటే - 'వాటి అన్నింటితోను రామాయణం గొప్పది' అని అరవిందయోగి అన్నట్లు - భారతాంధ్రీకరణంలో కవిత్రయం చేసిన లోపా లున్నాయని కొందరు ఎత్తిచూపితే అవి నిజమే అయితే - వాటి అన్నింటి తోనూ మా తెలుగు భారతం దొడ్డది అని నిశ్చింతగా అంటాం ఆ రామా యణం ఇంకొకరు వ్రాయలేరు ఈ భారతం ఇట్లా - వెయ్యేళ్ళు తపస్సు చేసినా తిరిగి పుట్టదు యథాతథంగా ఉండాలని చేసిన ఇంకో తెలుగు భారతం పుస్తక భాండాగారాల్లో నిద్రపోతున్నది

ఒక గ్రంథ ప్రయోజనం దాని పరిమాణంమీద ఆధారపడి ఉండదు అది కలిగించిన ఉత్తేజంమీద, ఉల్లాసంమీద స్థిరపడి ఉంటుంది వాటిని రెండిం టినీ వ్యంగ్యభూతమైన ఉపదేశం పరివర్తిస్తూ ఉంటుంది మొదటి రెండూ అకళావిదుని చేతిలో నీరసపడితే - ఆ ఉపదేశం అప్రయోజకం అవుతుంది

'అహో భారో మహాన్ కవేః' అన్నట్లు తిక్కనార్యునిమీద రెండు భారాలు పడ్డాయి

భవ్యకవితావేశుడైన కృష్ణ ద్వైపాయనుడు, లోకహిత నిష్ఠతో భారత మనే వేదాన్ని ధర్మాద్వైత స్థితి నిండారగా విరచించాడు

అది అఖిలస్మృతి వాదములకు, బహు పురాణ వర్గాలకూ, ధర్మార్థ కామమోక్షాలకు మూదల, అంటే పరిష్కారం

దాన్ని మొదట 'సాత్యవతేయ సంస్మృతి శ్రీవిభవాస్పదం'బయిన చిత్తముతో అవగతం చేసుకోవాలి

రెండవది - ఆ భాగవతామృతాన్ని తృప్తితీరా గ్రోలి ఆంధ్ర జాతి అంతా సమ్మోహిత భూతం కావాలి అంటే దాన్ని కవితాశోభాభరితం చెయ్యాలి దానికి అలవోకగా గంటం విదిలిస్తే చాలదు మహాకవిత్వదీక్ష వహించాలి అంటే ఆరితేరిన పద్యాల్లో చెప్పాలి నిర్వచన నియమాన్ని పూర్వపక్షం చేసి హృద్యమైన గద్యంతో సమాలంకృతం చెయ్యాలి ఆ రెండింటిని నిర్వహించేది ఏది?

వైదికమార్గ నిష్ఠముగు వర్తనం, భేదములేని భక్తి!

'భేదములేని భక్తి' అంటే ఏమిటి?

భక్తి అంటే చాలదా?

చాలదు తన హృదయాన్ని పూర్తిగా ప్రతిబింబించే మాట 'భేదములేని' అనేది

ఈ మాటలోనే తిక్కన వ్యక్తిత్వం, చరితార్థత గూడుకట్టుకొని ఉన్నాయి అంతవరకు హరిహర భేదబుద్ధితో ఉడుకు లెత్తించిన గ్రీష్మంమీద ఈ మాట తొలకరి వానజల్లు అంతేకాదు తిక్కన ఉద్యమించిన ఉద్యమ ప్రభావమంతా ఈ మాటలో ఇమిడి ఉంది

చిత్రమేమిటంటే - హరికి నిర్దిష్టరూపం ఉంది హరుడికీ విశిష్ట రూపం ఉంది రెంటినీ కలిపి ఒకే మూర్తిగా - తెలిసినంతవరకు - ఏ తత్త్వవేత్తలూ వర్ణించలేదు ఆ పని తిక్కనార్యుడు చేశాడు ఈ పని సాహిత్య పరిభాషలో లక్షణావృత్తిలా ఉంది లక్షణ అంటే వాక్యంలో అనుపపత్తి అంటే వాక్యార్థం అసంగతంగా కనపడడం, వివేచనచేస్తే విశేషార్థం ధ్వనించడం—

"కరుణారసము పొంగి తొరగెడు చాడ్పున
శశిరేఖ నమ్ముంబు జాలువార
హరి నీల పాత్రిక సురభి చందనమును
గరి నాభి ధవళ పంకజము మెఱయ

సురనదియు, కాళిందియు బెరసినట్టి కాంతిపూరంబు శోభిల్లు మూర్తిగా ఏ దేవుడూ సన్నిధి చేయుడు ఈ మూర్తి కల్పన అనుపపన్నం - ఈ అనుపపత్తితో తిక్కనార్యుడు సాధించ దలచిన పరమార్థం ఏమిటి?

అదే - రెండు చల్లని నదులు కలసిపోయినట్టు కనబడే శాంతమూర్తి ! ఆ మూర్తియే ఆనాటి జనుల మనస్సులను ఆనందమగ్నం చెయ్యగలదు హరి వేరు, హరుడు వేరు కాదు ఇద్దరూ ఒకటే - ఔపాధికమైన ఆ భిన్న రూపాలు చూచి ఘర్షణపడడం అవివేకం ఈ భేదము లేని భక్తి అలవరచుకొని సుఖ పడండి 'విష్ణు రూపాయ నమశ్శివాయ' అనే భక్తుల వైదిక ధ్యానానికి పరతత్త్వం హర్షిస్తుంది అని చెప్పడమే తిక్కన హరిహరమూర్తి కల్పనలోని ధ్వని సారం !

ఆ నోటితోనే తిక్కనార్యుడు 'ధర్మాద్వైత' అనే మాటను వ్యాస మహర్షి లక్ష్యంగా అన్నాడు ఇది గూడా పర్యాలోచించవలసిన పదబంధం

ప్రహతంగా జీవేశ్వరుల ఐక్యాన్నే అద్వైతం అంటారు ఇక్కడ ధర్మాద్వైతం అంటే అర్థం ఏమిటి ? ఈ మాటనే నిర్వచనోత్తర రామాయణం లోనూ మనుమసిద్ధి రాజుకు విశేషణంగా 'ధర్మాద్వైత మూర్తి వరయోషి ద్వర్గస్మరుడు ఉ రా ౧ 29 అని ఉపయోగించారు అద్వైతం అంటే ఏకత్వం అనే అర్థంలో ధర్మముతో ఐక్యము పొందినవాడు - అనగా ధర్మమూర్తి అని రాజుపరంగా అర్థం చెప్పవలసి ఉంటుంది అంతేగాని కర్మ జ్ఞానార్థాలు ఇక్కడ పొసగవు రెండో విశేషణం శృంగార ప్రవృత్తి పరమై మొదటి అర్థాన్ని సంకోచపరుస్తుంది ఇక భారతంలోని ధర్మాద్వైతాన్ని కర్మ, జ్ఞానపరంగా విమర్శకులు అన్వయించారు ఆ అర్థం శాస్త్రీయమే కావచ్చు కాని తిక్కన్న హృదయం అదేనా అని సందేహం కలుగుతుంది

ఆయన తొలుత సాధారణార్థంలో వాడిన అదే శబ్దాన్ని ఇక్కడ ఈ విశేషార్థంలో వాడవలసిన అవసరమేమిటి ? విశేషార్థమే ఉద్దిష్టమైతే స్పష్ట ప్రతిపత్తికి వేరొక శబ్దం వాడవచ్చుగదా !

దానిమీద అదనపు అర్థభారాన్ని మోపకుండానే సమన్వయించవచ్చును

ధర్మమంటే న్యాయమనే అర్థం ఉంది 'ధర్మాః పుణ్య, యమ న్యాయ, స్వభా, వాచార, సోమపాః' అని అమరం న్యాయమైన అద్వైత స్థితి అంటే సర్వ సమ్మతమైన శివకేశవాభేద భావన

(న్యాయ విశేషణం ఎందుకు ? అంటే - శైవుల కది న్యాయం కాదు' ను

విష్ణు, ఈశాన శబ్దాలతో ఒకే పరమ పురుషుణ్ణి ప్రతిపాదించే అనేక వచనాలను వేదోపనిషత్తులలో చూడవచ్చు. పురాణేతిహాసాల నాటికి మాయోపాధికములైన శివ కేశవ ప్రత్యేక రూపాలు సుదృఢంగా ఏర్పడ్డాయి. దానితో రుచి భేదాన్నిబట్టి సగుణ శివ కేశవారాధనలు ప్రబలమైనాయి. వాటి వైషమ్యాలను తొలగిస్తూ వ్యాసభారతం ఎన్నో విధాల హరిహరాద్వైతాన్ని ప్రబోధించింది.

'భగవాన్ వాసుదేవశ్చ కీర్త్యతేఽత్ర సనాతనః' అని ఆదిపర్వంలో చెప్పినా - అరణ్యపర్వంలో అర్జునుడు చేసిన శివస్తుతీ దేవతలుచేసిన విష్ణుస్తుతీ, సభాపర్వంలో భీష్ముడు అర్ఘ్యసందర్భంలో ప్రతిపాదించిన విష్ణుపారమ్యమూ, అనుశాసనికంలోని విష్ణు శివ ప్రశంస, సౌప్తికంలోని శివవిష్ణు సంప్రీతి కథనం భారతంలోని అద్వైత భావనకు ప్రబల తార్కాణాలు.

ఈ హరిహరాద్వైతం భీష్మపర్వంలోని భగవద్గీతా ప్రవచనంతో ఉపనిషత్సారమైన ఏకేశ్వరోపాసనగా పర్యవసన్నమై శ్రుతిమహితమైంది. ఇదీ వ్యాస భగవానుడు ఆశించిన లోకహితనిష్ఠ. ఆయన అర్థవాద రూపంలో ప్రతిపాదించిన హరిహరాద్వైతమే తిక్కనగారి ధర్మాద్వైతం అని అక్రమంగా చెప్పవచ్చు. ఈ అద్వైత ప్రబోధం అప్పటి దేశకాలాలకు అనుగుణమైంది. నాటి శైవ వైష్ణవ వైషమ్యాలకు విరుగుడుగా పనిచేయవలసింది.

అట్టి వ్యాస భారతాన్ని 'తెనుగు బాస వినిర్మింప దివురుట, భవ్య పురుషార్థ పాదపక్వ ఫలము'గా ఆయన భావించాడు. ఇక్కడ 'వినిర్మించుట' అనేమాట యథాలాపంగా వచ్చినదికాదు. వ్యాస భారతాన్ని మక్కికి మక్కిగా తెలుగు భాషలోకి దించడం తన అభిమతంకాదని ఆ మాట నొక్కి చెబుతుంది.

భావ గమ్యమైన తిక్కయజ్వ భారత 'వినిర్మాణం' ఇట్లా కనపడుతుంది.

అది సింహపురి మహారాజు మనుమసిద్ధి ఆమాత్యమంత్రి నివసించే విశాల భవనం!

ప్రాతరాహ్నికం ముగించుకుని సోమయాజులు పవిత్రమైన దర్భాసనం మీద పరచిన చిత్రాసనంపైన సుఖోపవిష్టులై యున్నారు. పక్కన విభూతి

రేఖాంకిత ఫాలభాగుడు, వినీతుడు, అయిన గురునాథుడు, వ్యాసభాంత తాళ పత్ర బృహత్ గ్రంథంలో మూడు పర్వాలు వేరుచేసి, వ్యాసపీఠంమీద నాలుగవ పర్వం దగ్గర పట్టుకొని ఉన్నాడు

గురుదేవులు తిక్కన్నగారు నిమీలిత నేత్రులై ధ్యానమగ్నులై ఉన్నారు

ఆయన ఇప్పుడు లౌకిక వాసనా వాసితుడైన అమాత్యుడు కాదు వైదికమార్గ నిష్ఠమగు వర్తనంలో నిమగ్నమైనవాడు హరిహరదేవ నిరంతర స్మరణ తత్పరుడు భగవంతుని 'జన్మాంతర దుఃఖముల్ తొలచి సుఖాత్ముని చేయు' మని కోరే పక్వహృదయుడు

ఆయన కవిత ఇప్పుడు నిర్వచనోత్తర రామాయణంలా గట్లు ఒరసిపారే వరదనీరు కాదు, స్వచ్ఛమైన శరన్నది అహంకార మమకారాలకు అతీతమైన నిసర్గ సుభగవాణి - ఆయన ముఖ వినిర్గతం కాబోతున్నది

ఆయన అంతరంగంలో లేచిపడుతున్న ఊహోత్తుంగా లివి - తనకు ఉభయ కవి మిత్రుడనేది చాలా ఇష్టమైన మాట - అటు సంస్కృతంలో నిరర్గళంగా కవిత్వం చెప్పగలడు ఇటు తెలుగులోనూ అంత ప్రౌఢంగా కవిత పలికించగలడు కనుక ఉభయకవులకు మిత్రుడు, అయితే ఈ మాట మంచి "బిరుదం కావచ్చు కాని భారత రచనలో ఈ మాట విలువ ఏమిటి ? దీన్ని ఇంకో విధంగా భావించవచ్చు సంస్కృత కవితారీతిలో వ్రాసే నన్నయాది మార్గకవులున్నారు దేశి కవిత్వపు పోకడలతో తెలుగు ఛందస్సుకు తెలుగు పలుకుబడికి ప్రాధాన్యమిచ్చే దేశి కవులున్నారు వారివల్ల తెలుగు రచనకు ఎనలేని ఆభిముఖ్యం వచ్చినమాట నిజం కాబట్టి ఆ ఉభయ కవులకు రచనా విధానంలో మిత్రుడనై గంటం నడిపిస్తే ఎట్లా ఉంటుంది ?

మార్గ కవితలో ఛందో వైవిధ్యం విశేషం - కాని దానిలోని సంస్కృత ప్రాబల్యం తగ్గించాలి దేశి కవితలో తెలుగు సొగసు ప్రత్యేకం అయితే - దీనిలోని ద్విపద విసుగు మతమౌఢ్యం పరిహరించాలి ఏతావతా - మార్గకవిత లోని పద్య వైవిధ్యం - దేశి కవితలోని తెనుగు సొగసును స్వీకరించి ఒక కొత్త రసాయనం తయారు చెయ్యాలి

సూత్ర ప్రాయంగా ఉన్న సంస్కృతం వాక్కును తెనుగు ఊపిరితో తెనిగించాలి అంటే అక్షరాల కంటే అంతరంగానికి ప్రాముఖ్యం ఇవ్వాలి సంస్కృత కథా ప్రపంచంలోని అస్పష్ట మూర్తులను తెలుగులో యదార్థ పాత్రలుగా ప్రత్యక్షం చెయ్యాలి

ఇక్కడ రామాయణ బాలకాండ శ్లోకాలు రెండు జ్ఞాపకం వస్తున్నాయి

హసితం భాషితం చైవ గతి ర్యా యచ్చ చేష్టితం
తత్సర్వం ధర్మవీర్యేణ యథావ త్సం ప్రపశ్యతి
తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగ మాస్థితః
పురా య త్తత్ర నిర్వృత్తం పాణా వామలకం యథా
బాల త్రృ 8 ౬

"పురా నిర్వృత్తం పాణౌ ఆమలకం యథా పశ్యతి" ఎంత గొప్పమాట !

పూర్వ మెప్పుడో జరిగిపోయిన దానిని అరచేతిలోని ఉసిరెక (కరతలామలకం) వలె విస్పష్టంగా చూచి వ్రాసినాడట - ఆ మహాకవి

ఆ భారత మూర్తులను నేనట్లా చూడాలి వారు నా పాఠకుల యెదుట అట్లా నవ్వాలి నడవాలి, మాట్లాడాలి అదీ కవితాయోగం అంటే - మార్గం నిశ్చయమయింది

మనస్సు స్థిరపడింది—

అంతకుముందే కృత్యాది, అంకితం దివ్యంగా నడిచాయి కళ్ళు తెరిచి చిరునవ్వుతో గురునాథుణ్ణి చూచి చేయివీచారు శిష్యుడు విరాటపర్వంతీసి 'నారాయణం నమస్కృత్య' అని ప్రారంభించి ఆరు శ్లోకాలు చదివాడు అక్కడ 'కథయిత్వాతు తత్సర్వం' అన్నచోట ఏసర్వం ? అన్న సందేహం కలిగింది అరణ్యపర్వంలోని తుది రెండు - అధ్యాయాలూ అవసర మనిపించింది ఆ రెండూ పూర్తిగా చదవమన్నారు శిష్యుడు రెండధ్యాయాలలోని 60 శ్లోకాలూ స్ఫుటంగా చదివి సంపుటం అక్కడ పెట్టాడు

తిక్కనగారు శ్లోకాలు శ్రద్ధగా విని తలపంకించి 'ఓమ్' అని - పద్యం ఎత్తుకున్నారు కొత్తగా సిద్ధంచేసిన తాళపత్ర సంపుటంలో శిష్యుడు వ్రాయడం ప్రారంభించాడు అతని గంటం పచ్చని కొత్త తాటాకులమీద కరకరా చరచరా నడచిపోతున్నది

తర్వాత—

పద్యంవెంట పద్యంగా—

ఆరణ్యపర్వం చివరనుంచి విరాట పర్వంలోకి కవిత ప్రవహిస్తున్నది

"ఏమిగతి నా పదుమూఁడగు నేడు మత్పితామహులు చరించి రంతయుఁ గ్రమంబున నా కెఱుఁగంగఁ జెప్పుమా?" అని జనమేజయుడు వైశంపాయనుణ్ణి ప్రశ్నించాడు

దీనికి జవాబు ఆరణ్య పర్వం తుదిభాగంనుంచి రావాలి

ఆరణ్యపు 313 అధ్యాయసారం 'ధర్మదేవతా వరంబు పడసి' అనే ఒక్కమాటతో ముగించారు

పదునాలుగో అధ్యాయం, పాండవులు తమ వెంట వచ్చిన బ్రాహ్మణులతో 'మా అజ్ఞాతవాసానికి అనుజ్ఞ ఇచ్చి అనుగ్రహించండి' అని చెప్పడంతో ప్రారంభమౌతుంది

ఒకనాఁడేమును నాపద
లకు విడుమర గాంచి విప్రులం జుట్టల బె
ట్టుకొని సుఖముండ బడయుదు
మొకొ? ఇప్పాటెందుఁ గలదె ఒరు లెవ్వరికిన్?

విరాట ౧ 49

ఈ తెనుగు కందపద్యంలోని ఆర్తి సంస్కృతంలో లేదు ఈ ఆర్తికి దీప్తి తెచ్చినది ఆ అలతి అలతి తెలుగు పదాల పోహళింపు ఆ రసవాదవిద్య ఆయన సొమ్ము ఈ పద్యంలో ఇంకొక గడుసుదనం ఉంది

"ఇప్పాటెందుఁ గలదె యొరు లెవ్వరికిన్"

సంస్కృతంలో లేని ఈ మాట తరువాతి ధౌమ్యుని ఓదార్పునకు త్రోవచూపి ముందుకు నడుపుతుంది అప్పుడు వారికి ధైర్య స్థైర్యాలు ఉపదేశింప వలసిన వాడు ఆప్త పురోహితుడు ధౌమ్యుడు

ధౌమ్యుడు మహాపురుషులు 'తమ సద్భావము లడచికొని అడగబడి యుండుటను' ఎంచి నాలుగింటిని మాత్రం వివరించి ధర్మజుని మనసు కలక దేర్చాడు

ఇది అంతా ఒక యెత్తు భీమసేనుడు అన్నతో అన్నమాట ఒక యెత్తు

'అనిల సుతుం డిట్టులనియె నాతని తోడన్' వి ౧ 55

"భవదాజ్ఞా దృఢబద్ధ సంయమిత శుంభద్వేగమైకాక నా
డవలీలన్ మన యర్జున ద్విపము క్రోధావేశ దుర్దాంత ద
ర్పోద్ధామోద్భట భంగి నేపడరి కౌరవ్యాంబుజశ్రేణి చి
క్కువడం జేయదె? ఒక్క ద్రేల్మిడిన నీకున్ వేడ్క సంధిల్లగన్"
విరాట ౧ 56

గురునాథుడు "ధర్మానుగతయా బుద్ధ్యా గాండీవ ధన్వినా న కించిత్ సాహసం కృతం" అని మాత్రం చదివాడు అంతే - సోమయాజుల కన్నులు జ్వలించాయి ఆ భావం మత్తేభం మీద కూర్చుని ఘీంకరించాలి గాండీవ ధన్వి ధనుష్టంకారం వినిపించాలి అర్జున ద్విపం కౌరవ్యాంబుజశ్రేణిని పెరికి పెల్లగించి విసరి వేయడం కనిపించాలి

మత్తేభం తన శుండా దండం విసురుకుంటూ కనబడాలి.

దీన్ని అనువాదం అందామా?

ఆంధ్రీకరణం అందామా?

భారత క్షీరాంబుధిని మథించి అమృతం పంచి పెట్టడం అందామా?

తెలుగు భారతం తెలుగు మహాకవుల హృదయభూమిలో కొత్తపుట్టుక సంతరించుకొన్న పారిజాతం దాని పరిమళాలు దానివి దాన్ని స్వతంత్ర మహాకావ్యంగా చూచి ఆస్వాదించడం తెలుగు రసజ్ఞతకు త్రోవ

ఒక వంద శ్లోకాలు ఆయన కర్ణ శంఖంలో పడితే అవి మధురతీర్థమై ఏ రూపంలో వెలువడుతాయో తెలియదు

వంద నీరసభాగాలు హరించి పోవచ్చు పది పరస సన్నివేశాలు సహస్రఫణాలు విప్పవచ్చు

ద్రౌపది పుట్టు సుకుమారి విరాటనగర మార్గంలో నడచి నడచి బడలిపోయి 'బలవాన్ మే పరిశ్రమః' అన్నది - అంతే - ఈ మాటలో 'బలం' ఉన్నది కాని మన అనుభూతికి చాలలేదు అక్కడ తిక్కనార్యుడు విజృంభించి అంటాడు

"డప్పి జనించె వ్రేళులపుటంబులు పొక్కదొడంగె గోళ్లలోఁ
జిప్పిల జొచ్చె నెత్తురులు చిత్తము నాకు గడున్ వశంబుగా
దప్పుర మిచ్చటచ్చటను నాసల వచ్చితి మెంత దవ్వొకో
యిప్పటి భంగి నొక్కడుగు నేగెడు దానికి నోర్వ నెమ్మెయిన్"
విరాట ౧ 148

ఒక పాకనాటి తెలుగు ఇల్లాలు తన బాధను చనవుగా భర్తతో చెప్పినట్టుంది!

శ్రీనాథ మహాకవి తిక్కనార్యుని రచనా సర్వస్వాన్ని తరచి ఒక్క మాటలో 'రసాభ్యుచిత బంధము' అన్నాడు భారతంలో ఎక్కడ బట్టినా ఆ మాట తథ్యం అనిపిస్తుంది

తిక్కనార్యుడు విరాటపర్వం ప్రారంభిస్తూ, మనస్సును అలరించేది, గొప్పకథ గలది అనేక రసాలకు ఆలవాలం అయిన విరాటం ఆదిగా పదిహేను పర్వాలు రచిస్తానన్నాడు

విరాట పర్వం గురించి ఆయన అన్న తుదిమాట 'రసాభ్యుదయోల్లాసి' అన్నది గణించదగిన గొప్పమాట - ఇతిహాసంలో కథా [illegible] ప్రాధాన్యం కవిత కుండదు కవిత ఆకర్షించనిదే జనప్రీతి కుదరదు కనక - కవితను ప్రధాన స్థానంలో ఉంచి బుధ సంతోషం సాధించాలి ఆ కవితకు రసం, ప్రాణం 'సాధ్వో, హి, రసో, యథాతథం కవిభిః' అని ఆంధ్ర కవితా విశారదుని ఆప్తవాక్యం [illegible]హానంగా పునరుక్తులతో సాగిపోయే ఇతిహాస

కథలకు నిండు రూపం ఇచ్చి ఏ కథ కాకథను దిద్ది తీర్చుతూ వాటిని రసభరితం చెయ్యాలి రెండింటిలోను ఒకదానినొకటి మింగివేయకుండా సరితూకంలో ఉంచి రెండూ కలిసి ఒకే శిల్పమూర్తిగా భాసింప చేయ్యాలి ఈ కళను ఒక్క విరాట పర్వంలోనే కాక భారతమంతటా సమగ్ర సుందరంగా నిర్వహించిన వాడు తిక్కన మహాకవి ఈ పని ఏతన్మాత్రులకు సాధ్యం కానిది కనుకనే 'తన కావించిన సృష్టి తక్కొరుల చేతం గాదునా' తిక్కన భారతం రచించి కవి బ్రహ్మ అయినాడని ఎఱ్ఱనగారి ప్రశంస

విరాటపర్వం పాండవులకు పరీక్షా స్థానం అయినట్లే తిక్కన కవితా శక్తిని గూడా ఒరపెట్టి చూచింది ప్రధానకథ తీసుకున్న మళుపులు, అందులోని సన్నివేశ బాహుళ్యం, బహురసాల సమ్మేళనం, అపూర్వము లైనవి

సరళంగా సాగిపోయే కథలో సింహబలుడు ప్రవేశించి సంక్షోభం రేపాడు ఆ క్షోభ కురురాజు సభలో మించిపోయింది దాన్ని తెలివిమీరి పరిహరించాలి దానికి తగినవాడు వలలుడే పైకి పొక్కినా సర్వనాశనం అట్టి కీచకఘట్టం, ఉత్తర గోగ్రహణం, బృహన్నలా సారథ్యం, అర్జున విజృంభణం, అరివీర పలాయనం, ఉత్తరాభిమన్యుల వివాహ సముల్లాసం అనే బహురూత్మక సన్నివేశాలతో ఆ పర్వం ఊర్జిత కథోపేతమూ, హృదయాహ్లాదీ, అయి నడిచింది

సంస్కృత మూలంలో భావంఉంది, కథఉంది, కొంతవరకు కవిత్వమూ ఉంది అది తెలుగువారి అనుభూతికి రావాలి ఆ శ్లోకాలకు తాత్పర్యం చెబితే సరిపడదు ఆ మూలం ఉత్తేజం ఇవ్వగా తెలుగులో ఒక రసాయన చర్య జరగాలి (Alchemy) అప్పు డది కళగా రూపొందుతుంది

"చనుఁ జన దని చూడక యం
దని మ్రాకుల పండ్లు గోయఁదలఁచుట హితమే ?
మును చెడిన రావణాదుల
విని యెఱుఁగవె యెన్నఁడును వివేక విహీనా !" విరాట ౨ 58

సరిగా-సీత రావణునితో అన్నంత దిటవుగానూ అంది ద్రౌపది రావణుడు సీతను తాకలేదు, తాకడు ఇక్కడి సంగతి వేరు కీచకుడు పాంచాలిని చెరపట్టినా అడిగే దిక్కు లేదు అంత పరాభవమూ జరిగింది

ఒకవంక చెప్పరాని దాస్యవృత్తి వేరొకవంక అభిమాన భంగ దుఃఖం అట్టి ద్రౌపది దైన్యకరుణ రూపానికి తెలుగు నిలువుట్టద్దం ఇది

"ఎలదీగ గప్పిన లలిత పరాగంబు
క్రియ మేన మేదినీ రేణువొప్పఁ
జంపకంబున నవ సౌరభం బెసెగెడు
కరణి నాసిక వేడిగాడ్పు నిగుడఁ
దోయజ దళములఁ దుది మంచు
దొరగెడు గతిఁ గన్నుఁగవ యశ్రుకణము లురుల
నిందు బింబము మీది కందు చందంబునఁ
గురులు నెమ్మొగమునఁ నెరసియుండ

సర్వజన వంద్యయైన పాంచాలి సింహ
బలునిచే నివ్విధంబున భంగపాటు
దనకు వచ్చిన నెంతయు దైన్యమొంది
యవ్విరాటుని సభఁ జేరనరిగి - నిలిచి-" వి ౨-138

సభలో న్యాయం జరగలేదు

మనసులోని పరాభవాగ్ని ఆరలేదు

ఈ వంత తీర్చదగ్గ బలవంతుడు వలలుడే

అ౽ని కోపకీలిని కీలుకొల్పడం ద్రౌపదికి తెలుసు

'నీ వలమూపులావు మును
నేలవహించిన నాగకూర్మ గో
త్రావని భృద్దిశాకరుల
కావల నూరట పట్టుగాదె సం
భావన భూజనంబులకుఁ
బందువుగాదె ? మహోగ్రకోప రే
ఖా విభవంబు వైరులకుఁ
గాలము చేరువకాదె పావనీ!' వి ౨-193

అక్కట మోసపోయి అడి
యాసలఁ జూపక యున్న దాన - ము
న్నొక్కెడ నే దురంత దురి
తోత్కట బాధలఁ బెట్టియున్న నా
కెక్కడి దుఃఖశాంతి ? గడ
యీదుట యెమ్మెయిఁ గల్గనేర్చు ? మీ
ముక్కున నూర్పుగల్గ నొక
మూర్ఖునిచేఁ బడితిన్ సభాస్థలిన్   విరాట ౨-22 6

భీముని సామర్థ్యం సంస్కృత శబ్ద గాంభీర్యంలో ధ్వనించగా - ఆమె అవమాన ఖేదం, ఎత్తిపొడుపు ఒక్క తుది తెలుగు వాక్యంలో చురుక్కున తగులుతుంది

భీమ కోప సంధుక్షణం జరిగింది
అవనీ చక్రము సంచలింపగ, దివం
బల్లాడ, నాశాచయం
బవధూతంబుగ గోత్రశైల నికరం
బా కంపముం బొంద న
ర్ణవముల్ ఘూర్ణన మొందఁ గ్రోధము కృతా
ర్థత్వంబు నొందించి చి
త్ర వధ ప్రౌఢి వహించి సూతునకు రౌ
ద్రం బేర్పడం జూపుదున్ -   విరాట ౨-284

ద్రౌపది కరుణం, భీముని రౌద్రం తిక్కనగారి చేతిలో కృతార్థము లైనాయి

తరువాత చూడదగ్గది ఉత్తర గోగ్రహణం తెలుగు ప్రబంధ రచనలో హాస్యానికి అంతగా చోటులేదు నన్నయగారు ద్రుపద పరాభవ ఘట్టంలో, బకాసుర కథలో ఒక నుడికారపు సొగసులో, ఒక కాకువులో దీన్ని సాధించి చూటవేశారు తిక్కనార్యుడు ఉత్తర కుమార ప్రజ్ఞలలో దీనిని మరింత ఒడుపుతో నిర్వహించి తెలుగునాట ఉత్తరుడిద్వారా మరల హాస్యం పంచి పెట్టాడు

'తగు సారథి దొరకొనినన్
పగతుర భంజించు టెంతపని?' అన్నవాడు వి ఆ-10

'కౌరవ సేనజూచి వడకం దొడగెన్ మదితోడ మేను,
తేరు మరల్పు ప్రాణములు తీపనమున్ వినవే బృహన్నలా!'
వి ఆ-55

పసుల దయ్యామెఱుగు పడతుల సంతోష
మేలనాకు ననికిఁ జాల నేను' అని చదికిలబడి ఆ 59

'ఆననంబు పల్లటిల్ల మానసంబు తల్లడిల్ల'
దవ్వుల విఱిగిన పౌరులు
నవ్వుదురటె మేలు మేలు' నను నాగికు నీ
క్రొవ్వఱుగదేనిఁ దలపడు
మెవ్విధిఁజనితేమి యనుచు నెత్తిన భీతిన్ ఆ 71

అంటాడు - ఈ తెలుగు మాటల కాకువు సాధించిన హాస్యంలో మనం ఎంత నవ్వినా పాపం ఉత్తరుడంటే - 'బాలుడు, అకృతాస్త్రుడు' అని జాలి పడతాము

పదమూడేడులు అడగిమడగిన అర్జునవీరం ఒక్కసారి విశ్వరూప మెత్తింది

"వచ్చినవాడు ఫల్గుణుఁడ
వశ్యము గెల్తు మనంగరాదు"

అని భీష్మునకే వెఱపు కల్గించిన మహత్తర సన్నివేశం అది 'సంప్రాప్తో హి ధనంజయః' అని ఉంటే 'వచ్చినవాడు - ఫల్గుణుడు' అని ఎత్తుకుని కవిబ్రహ్మ అక్కడ ఇచ్చిన ఊనిక అచ్చటి వస్తుధ్వనికి కాంతిరేఖ!

చవులూరించే శృంగారరుచి ఉత్తరాభిమన్యుల కల్యాణ ఘట్టంలో చూస్తాం సంస్కృత విరాటం తుదిని ఆ వధూవరుల వివాహం ఇతిహాసంలో ఒక వార్తగా కడచి ముగుస్తుంది అక్కడ ఇతిహాస ధర్మంకంటె కవితా వాసన ఏమీ లేదు

తిక్కనగారి చేతిలో అది చక్కని ఒక తెలుగుపెండ్లి ముచ్చట అయింది

ఇద్దరి మధ్యా తెరపట్టారు
సుముహూర్తంలో తెరతీశారు

వినడమే కాని ఇంతవరకూ ఒకరి నొకరు చూచుకోలేదు ఆ కొత్త చూపుల అందం కవి చూచాడు

వరుడు ఆమె ముఖ లావణ్యాన్ని తనివితీర ఆస్వాదించాడు

వధువుకు సిగ్గు ఆమె చూపు ముందు అతని పాదాలమీదపడి ఎగ ప్రాకడం ప్రారంభించింది వరుని చూపు పెండ్లికూతురు శరీర సౌందర్యం మీద పడింది వధువు అప్పుడు క్రమంగా తలయెత్తి వరుని ముఖం చూచీ చూడనట్టు చూచి ఒదిగిపోయింది ఇద్దరి చిరు చెమటలకు తడిసి నెమ్మదిగా బరువెక్కినట్టుగా వారి ఇద్దరి చూపులు కలిసి పరవశములైనాయి (౫-396)

తర్వాత తలంబ్రాలు—
కల్పవృక్షం, దానితీగ, ఒకరిమీద ఒకరు పువ్వులు జల్లుకున్నట్టుంది
విరాట ౫ 397

అభిమన్యుడు ఉత్తరాకుమారి పాణిగ్రహణం చేశాడు

చిత్తమున గాఢరాగంబు చేత
జూపు తెఅగు దోపఁ గెంపారెడు తీగబోడి
మృదుల పాణి కుమారుండు మెలపుమైగ్ర
హించెఁ బల్లవాలంబి మత్తేభలీల— వి ౫ 399

తన అనురాగాన్ని చేతిలో చూపిసట్టున్న ఆమె ఎర్రని చేతిని వరుడు, మదగజం సవిలాసంగా తనతుండంతో చిగురుగుత్తిని పట్టుకున్నట్టు పరిగ్రహించాడు

పెండ్లిలో తెర, తలంబ్రాలు తెలుగువారివి అవికాక - కాళిదాసు రఘుకావ్యంలో అజేందుమతులకు చేయించిన కల్యాణంమీద మోజుపడి అట్లాగే తిక్కనార్యుడు చేయించిన పెండ్లిలో శృంగారం ముద్దులొలికింది

తిక్కన కవితా సువర్ణానికి ఒరగల్లుల వంటి విరాట ఉద్యోగ పర్వాలు చదివితే ఆయన పని 'వాడి' తనాన్ని పసిగట్టినట్టే - తక్కిన పర్వాలన్నీ ఆ పునాదుల మీద లేచిన కనకసౌధాలే—

ఉద్యోగం అనగానే మూడు రాయబారాలు జ్ఞాపకం వస్తాయి ఇక్కడ చూడవలసింది ఆయన శిల్పశక్తిని కాదు ఒక మంత్రిగారి రాజనీతిలోని మెరుపులను—

తిక్కనార్యుడు ఇప్పుడు కవితా తపస్వీగాని 'పూర్వాశ్రమం' లో ఆరితేరిన మంత్రి తన పలిక మనుమసద్ధి సరిగ్గా – పాండవుల లాగనే ఇద్దరు దాయలచే పరాభూతుడై కందుకూరు సీమలో అజ్ఞాతవాసం చేయవలసి వచ్చింది అప్పుడు తాను పూనుకొని తన అసాధారణ బుద్ధిబలంతో కాకతీయ చక్రవర్తి గణపతి ప్రభువును మెప్పించి కవిగా మన్ననలు పొంది తిరిగి తన రాజును సింహపురి పదస్థుణ్ణి చేశాడు

ఆ రాయబారపు మాటకారితనం మంచి మాటలతో ఎదిరిని లోగొనే నేర్పు ఎంతో ఆత్మీయంగా ఈ రాయబారాల్లో దర్శన మిస్తాయి

మొదటిది ద్రుపద పురోహితుడు చేసిన దూత్యం రెండవది సంజయు రాయబారం మూడవది శ్రీకృష్ణ దౌత్యం

ఉత్తరోత్తర కౌశలంగా నడిపిన వీటిలో బ్రాహ్మణ దూత్యం 'విప్ర స్వాభావికమై' నిజం చేసైద చెవికింపుగా లేదు

రెండవ రాయబారం సంజయుడిది అతడు ఆరితేరిన రాజనీతిపరుడు కర్ర విరగనీయడు, పాము చావనీయడు ధర్మరాజు అతణ్ణి మించిన రాజకీయ చతురుడు చక్కని 'ముసిడిక పండు' చేతిలో పెట్టి పంపాడు అతతు తిరిగి వచ్చి అంధరాజుతో అంటాడు

'అనయము పుట్టె జూదమున
యప్పుడ నెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చిన యది నీ యుపేక్షయ, వ
శీకృత చిత్తుడు ధర్మసూతి మె
త్తని పులి, యెల్లవారలు న
ధర్మము నీపయి బెట్టు నంతకున్
వినఁడును, గానడున్ – విదప
నీకును నాకు మరల్ప వచ్చునే ? ఉద్యోగ ౨-14

అంతకుముందు పాండవ సభలో స్వభావాన్ని బలపరచి సమర్థించిన సంజయుడు ధృతరాష్ట్రునిమీద విరుచుకు పడ్డాడు

ధర్మరాజు స్వభావాన్ని అంతగా ఆచిచూచినవాడు ఇంకొకడు లేడు పాణినీయ సూత్రంలా ఒక్క మాటతో చెప్పాడు 'దర్మసూతి మెత్తని పులి' ఆ తెనుగుమాట వెనుక అంటెటి 'కసి' నిలవగలిగినవాడు ముందు తిక్కన, తర్వాత సంజయుడు మన మనస్సు గిరుక్కున వెనక్కు తిరుగుతుంది ధర్మరాజంటున్నాడు——

నెయ్యముదప్ప నొండొకటి నీ చెవి సోకెనె నాదుపల్కులం
దియ్యెడ సంజయా? యనికి నిమ్మొయి నల్కెదునీవు, మాకుఁ దాఁ
గ నప్రముగక్కి మన్కి దగు కార్యము గాదొకొ? పోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధి వెడగైనను నొల్లక యొందు సేయునే?

ఉ ౧ 304

భేష్ - ఏమి మాట తీపు! ఏమి సాభిప్రాయ వాక్ చతురత!

'యుద్ధం లేకుండా వచ్చే కార్యసిద్ధిని వెర్రివాడైనా వదులుకుంటాడయ్యా?'

సంజయుని శాంతి వచనాలకు తగిన జవాబు

ముందు రాజ్యం ఇప్పించు, తర్వాత యుద్ధం తప్పించు సంజయుని గొంతులో పచ్చి వెలక్కాయ గుక్క తిరగలేదు తిరిగి వచ్చాడు

తర్వాత కృష్ణుడే రాయబారానికి పూనుకున్నాడు

ఈ రాయబారపు ఘట్టం భారతానికే మకుటాయమానం కృష్ణుని భవనం రంగస్థలం ఒక వంక ఐదుగురు తమ్ములతో, భార్య ద్రౌపదితో ధర్మజుడు గంభీరంగా నిలిచిఉన్నాడు రెండవవంక సాత్యకి, కృష్ణుడు చిరునవ్వులతో సంభాషణ క్రమం పరికిస్తున్నారు అనతి దూరంలో కొందరు రథికవరులు – చెవులు రిక్కించి వింటున్నారు ధర్మజుడు కృష్ణుని రాయబారానికి ఒప్పించి తన మనసంతా విప్పిచెప్పి తుదకు——

'ఒడబాటు గావింపు మెల్లభంగి'

మమ్మెఱుఁగు దెదిరి నెఱుఁగుదు
నెమ్మి యెఱుఁగు దర్థసిద్ధి నెఱియెఱుఁగుదు వా
క్యమ్ముల పద్ధతి యెఱుఁగుదు,
పొమ్మెవ్వఁడ - నీకు నేను బుద్ధులు సెప్పన్ ! ఉ ౩ 34

అని చనవు నిలిపి వాసుదేవుని పెద్దఱికం ఉటంకించి ఊరుకున్నాడు

ఒక సన్నివేశాన్ని గుప్పిటబట్టి పలకడంలో, పలికించడంలో నెఱజాణ శ్రీకృష్ణుడా ? తిక్కనామాత్యుడా ? అన్నట్టుంది

ధర్మజుని మాట మెత్తదనంలోని గడసరితనం గుర్తించాడు భీమన్నను కదిపి కుదిపి నవ్వులాటగా తేల్చాడు సవ్యసాచి మాటల సారం గ్రహించాడు నకులుని పలుకులకు ఊకొన్నాడు కడసారి వాని చురుకుపాలుకు సాత్యకితో తానూ తలపంకించాడు—

అంతా అయింది

తుదిని చెల్లెలి ద్రౌపది హృదయ జ్వాల – ఉల్లం పెల్లగిలి పోయింది

'ఇవి దుస్ససేను వ్రేళ్ళం
దవిలి సగము త్రెవ్విపోయి తక్కినయవి కౌ
రవుల కడఁ దీఱు మాటల
యవసరమునఁ దలఁప వలయు నచ్యుత పీనిన్ ' ఉ ౩-116

ఇవి జమ్మిచెట్టులో అణగిన నిప్పురవ్వలు ! వగు మాటలతో ద్రౌపదిని ఊరార్చి బయలుదేరాడు

శ్రీకృష్ణుని సందేశసారం ఇది ఇది కౌరవులకే కాదు సర్వమానవ జాతికీ పురుషోత్తము డిచ్చిన మహోపదేశం—

'సారపు ధర్మమున్, విమల
సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడ
బాఱినదైన యవస్థ దకు లె

> వ్వార లుపేక్ష చేసి రది
> వారల చేటగుగాని ధర్మ ని
> స్తారకమయ్యె సత్య శుభ
> దాయక మయ్యెను దైవ ముండెడున్ ఉ ౩-273

ఆలంకారిక లక్షణాల జంజాటం లేకు అచ్చపు మానవ స్వభావాలు తరచి ఆడించిన అద్భుత రూపకం ఇది ఇన్ని పాత్రలతో మనోవైవిధ్యాలతో ఊపిరి సలుపని ఈ సన్నివేశభారాన్ని వహించడం ఒక కృష్ణునితో పాటు తిక్కనకు చెల్లింది

సంధి ఫలించలేదు

అపరిహార్యంగా జరిగిన మహాయుద్ధం నాల్గుపర్వాలాక్రమించింది

అతిరథ మహారథులు నేలకొరిగారు రక్తపు మడుగులు శోణిత వాహినులు ప్రవహించాయి

> 'నెత్తుటఁ దోఁగియు నిగిడి పోరెడివీరు
> లలరిన నడమోదుగుల విధంబు
> గ్రక్కునఁ దెగిపడి కదలెడు బాహు దం
> డములు మహాభుజంగముల భంగి
> యవని రక్తాక్తంబులై యున్నయట్టి బల్
> దలలు కెందామర కొలని పగిదిఁ
> దఱచుగా నెఱిదప్ప నొఱగిన గజములు
> కులిశ భగ్నాచల కులమునట్లు
>
> తునిసి తొఱఁగిన జోదుల తొడలు సామ
> జముల కరములు నొండొంటి చందములుగ
> నుంగొనఁగ వింతలగుటను సంగరాంగ
> ణంబు రమణీయమును భీషణంబు నయ్యె శల్య 129

ఆ యుద్ధ రంగం కళ్లముందు కదలుతున్నట్టుంది

తిక్కన మంత్రి యుద్ధం చేసినవాడో, చూసినవాడో అయిఉండాలి ఆయన కది అసంభవం కాదు ఎన్నెచోడని యుద్ధవర్ణనం ఎంత సహజ

సుందరంగా నడిచిందో తిక్కన రణరంగ దృశ్యం కూడా అంత భీషణ రమణీయంగా దర్శన మిచ్చింది

నిజానికి భీషణం రమణీయం కాదు, రమణీయం భయంకరం కాదు రెండూ కలిసిన ఆ చమత్కారానికే భీభత్స రసమని పేరు ఆ రస నిర్వహణంలో తిక్కన చేవ నిరుపమాన మనిపిస్తుంది

ఈ బీభత్సానికి స్త్రీపర్వపు ఉత్తరభాగం పరాకాష్ఠ ఆ దృశ్యాలను భావించిన వారికి కంపర మెత్తుతుంది ఆ అనంత విలయం యుద్ధ దుర్గంధం ఒకంతట నిద్రపోనివ్వవు

అంతా ముగిసిన తర్వాత స్త్రీపర్వాదిని దురపిల్లే ధృతరాష్ట్రునితో సంజయు డంటాడు

'జున్ను డెప్పరంపుఁ జోనైన చటి నున్నఁ
జూచి విఱుగఁ బడుటఁ జూడఁ డాల్మిఁ
దీపుఁగోరి యుఱుకు తిండికాడునువోలె
నయితి, వగచు టింక ననుచితంబు స్త్రీ ౧ 19

ధృతరాష్ట్రుని దురాశను వెన్ను చరచినట్లు చెప్పాడు విదురుడు దుఃఖోపశమనంగా సంసార గహనంలో పడిన ప్రాణి దురవస్థను సోదాహరణంగా చూపి తత్త్వోపదేశంచేసి తేర్చినాడు అయినా అంధరాజు అంతరంగం నిష్కలంకం కాలేదు ఉక్కు కౌగిలిలో నిజజీవుణ్ణి నలిచి చంపుదామనుకుంటే - నిజపరిష్వంగంలో ఉక్కు భీముడు ముక్కలైనాడు ఒకొక్క జీవుణ్ణి ఏతత్త్వోపదేశమూ మేలుకొలుపలేదు గాబోలు !

భారత మహేతిహాసం జనావళికి ఏమి నేర్పింది ?

కామదాహంతో రావణుడు దగ్ధుడైనట్లే అవధిలేని అర్థోన్మాదంతో అంధరాజు, అతని కొడుకు హరించి పోయారు

కాబట్టి - ఎప్పుడూ ధర్మబద్ధంకాని అర్థ కామాలు వినాశకరాలు జాగ్రత్త అని బోధించింది

ఈ మహోపదేశాన్ని కమనీయ కావ్యకథ లంతో తెలుగువారికి వ్యాఖ్యానించిన ప్రతిభాశాలి తిక్కనార్యుడు

తిక్కన శైలి

శీలమే శైలి ఇంగ్లీషులోని Style అనే మాటకు ఇది అనుకరణంకాదు

“ప్రాయేణాచార్యాణామియం శైలీ యద్ స్వాభిప్రాయమపి పరోప దేశ మివ వర్ణయతి” అని మనుస్మృతి వ్యాఖ్యాత కుల్లూక భట్టు వాక్యం

తిక్కన శీలమే తిక్కన శైలి వైదిక పరమార్థ దర్శనంలో పక్వమైన ఆయన శీలం ఆ పరమ సత్యాన్నే భారతమంటూ వ్యాఖ్యానించింది అది వర్గ పరాజయం కన్న అరిషడ్వర్గ విజయం గొప్పదన్నది కనకనే భారతం శాంతరస ప్రధాన మయింది

భారతార్థ భారాన్ని పేద తెలుగు మోయగలదా? అని ఆయన భావించలేదు ఆయన తననాటి సజీవవాణి తెలుగుబలం తెలుసుకున్నాడు ఎంతటి క్లిష్ట భావాన్నయినా అవలీలగా తన తెలుగులో చెప్పగలిగాడు

ఋషులు, ఋషి కల్పులు అలంకార వైభవంకన్న అర్థగాంభీర్యానికే ప్రాముఖ్యం ఇస్తారు భూషణ లావణ్యం కంటె బుద్ధి సౌందర్యాన్ని మెచ్చుకుంటారు నిరలంకృతమైన శైలిలో వాల్మీకి, వ్యాసమహర్షుల ప్రవచనం ఆ సౌందర్యానికి నిదర్శనం

భారత కవిత్రయానికి అదే ఆదర్శమయింది తిక్కనకు ముందు సర్వ లక్షణాలతోను ప్రబంధం పుట్టిందనుకున్నా దాన్ని అతడు అంగీకరించలేదు అనవసరమైన సాము గరడీలకు పోలేదు అయితే - ఆయనలోని శిల్పగరిమ, కళావేత్తృత తెలియకుండానే భారతాన్ని మహాకావ్యం చేసింది ఆయనతీసిన త్రోవలు, చూపిన మెలకువలు, వాడినభాష తర్వాతి ఆంధ్రకవితా సర్వస్వానికి మార్గ దర్శకాలైనాయి

వ్యాసుని ఒక్కొక్క మాటకు ఆయన కూర్చిన కవితా విస్తరణం భావికవుల వర్ణనలకు బాటలయాయి విరాటంలో సైన్యధూళికి ‘అభినవ జలధర’ అనీ, ద్రౌపది చేసిన ధర్మజ ప్రశంసకు ‘ఎవ్వాని వాకిట’ అనీ ఆయన వ్రాసిన సీసాలు బంగారమయి తర్వాతి వారికి ఎంతో సొమ్ముచేసి పెట్టాయి

తిక్కనార్యుని పలుకు సొగసంతా తెనుగు నుడికారంలో గూడు కట్టుకొని ఉంది ఈ కీలు తెలియనివారు భాషాంతరీకరిద్దామనుకొంటే భంగ పడడమే మిగులుతుంది

ఒక మహాకవి రచన అనుకార్యం అన్యభాషా దురాసదం తిక్కనను వేరొక భాషలోకి భాషాంతరీకరించడం నేలవిడిచిన సాము తిక్కనార్యుని రచనలో నన్నయ, నన్నెచోడ, కాళిదాసాదుల రచనా ప్రభావం ఉండవచ్చు అయితే అది వారి కౌశలాన్ని మెచ్చుకొన్న తీరుగాని వేలవమైన నకలు పనికాదు

తిక్కనార్యుడు ఆంధ్ర కవితలో ఒక పీఠానికి అధిపతి ఆ మార్గాభిరతి కలవారందరూ ఆయనలా వ్రాయడానికి ప్రయత్నించారు కొంతవరకూ ఆ తెలుగును పట్టుకున్నారుగాని ఆ వెలుగును పట్టలేక పోయారు

"లజ్జా మనోహర లావణ్య మూర్తి
తేజోరుణాక్షి సందీప్త పాంచాలి
కనుల క్రొమ్మెఱుపులు
కనుబొమ విలువులు
కలవు తిక్కన పల్కు
తెలుగు పల్కులకు" అబ్బూరి

తుద కొక్కమాట - తెలుగువాడై పుట్టినందుకు తిక్కన భారతం చదవడం ఒక అపూర్వానుభూతి అన్యులకు లేని అదృష్టం!

దశకుమార చరిత్ర

కేతన

సంస్కృత దశకుమార చరిత్ర (క్రీ శ 7వ శ॥) తెరిస్తే 13 వందల ఏళ్లనాటి దాక్షిణాత్య నాగరికత ప్రత్యక్షం అవుతుంది దశకుమార చరిత్ర సంస్కృత గద్యగా వ్రాసిన దండి దాక్షిణాత్యుడు ఇట్లాగే దాన్ని పద్య కావ్యంగా తెనిగించిన ఏడువందలేళ్ల క్రిందటి కేతననాటి తెలుగు ప్రజాజీవనం, పట్టణాలు, ప్రభువులు జనపదాలు జానపదులు, వాళ్ల అవసరాలు, ఆనందాలు, ఆచారాలు దశకుమార చరిత్రలో అనగి పెనగి కనబడతాయి

రాజులు, యుద్ధాలు గెలుపులు, ఓటములు, అరణ్యవాసాలు, మునులు, ఆశీర్వాదాలు ఆశ్వాసనాలు, సాహసాలు, విజయాలు ఒకవైపు కనపడుతూ ఉంటే రెండోవైపు కులభ్రష్టులు, మంత్రసాధకులు, ఆత్మ హోమాలు, అనుకోని అద్భుత లాభాలు వేశ్యావృత్తి సొగసులు, విటవ్యామోహంలో సర్వభ్రష్టులైన జైన సన్యాసులు దర్శనమిస్తూంటారు

ఈ తెలుగు దశకుమార రచయిత కేతన కేతన వేగిదేశంలోని వెంటిరాల అనే గ్రామానికి పెద్ద వెలనాటి రాజుల ఆశ్రితుడు అప్పటికే వెలనాటి మీద నెల్లూరు తెలుగు చోళుల పెత్తనం ఉంది ఏ రాచకార్యం మీదనో కేతన నెల్లూరువచ్చి, తిక్కనామాత్యునితో చెలిమిచేసి తన తెలుగు దశకుమార చరిత్రను ఆయనకు అంకితంచేసి ఉంటాడు

అప్పటికే మనుమసిద్ధి సంస్థానంలో తిక్కనగారి ప్రాభవం తిరుగు లేకుండా ఉంది అతడు అమాత్యుడే కాదు, ఉభయ కవి మిత్రుడు సంస్కృతాంధ్ర కవులిద్దరూ ఆయన మైత్రికి పాత్రమైనవారు కవి మిత్రుడే కాదు స్వయంగా గొప్పకవి

> "అగునన కొమ్మయ తిక్కండు
> జగతి నపూర్వార్థ శబ్దచారుకవితమై

నెగడిన 'బాణోచ్ఛిష్టం
జగత్రయం' బనిన పలుకు సఫలం బయ్యెన్"

కవిత్వంలో కూడా ఆయన పలుకుబడి అంత గొప్పగా ఉండేదన్న మాట- అయితే ఆనాటి - అంత శ్లాఘా పాత్రములైన తిక్కన రచనలేవో మనకు తెలియదు అప్పటికి నిర్వచన రామాయణ భారతాలు రాలేదు

కేతన తన దశకుమార చరిత్రలో చాలాచోట్ల తిక్కన్నను కవితా విశారదుడుగా ప్రశంసించడం చూస్తే - ఆయన తన పదవి చేతనేకాక కవిత్వంతో గూడా పలువురిని మెప్పించి ఉండాలి

క ప్ర తెలుగు దశకుమార చరిత్రకు విశేష ప్రాధాన్యం లేక పోయినా చారిత్రకంగా చాలా ముఖ్యపాత్ర ఉంది

తెలుగులో - రాజ కవులను తప్పిస్తే ఒక కవి ఇంకో కవికి తన కావ్యాన్ని కృతి ఇవ్వడం అపూర్వం ఆ విధంగా ఈ పుస్తకానికి ఇదో విశిష్టత రెండవ అంశం తెలుగు కవిత్వానికి బ్రహ్మగా ప్రసిద్ధుడైన తిక్కనార్యుని బాహ్యాభ్యంతర మూర్తిని ఇంత స్ఫుటంగా ముద్రించినవాడు వేరొకడు లేడు మూడవ అంశం ఆంధ్ర మార్గకవిత పురాణాంధ్రీకరణా లతో ప్రవర్తిల్లుతూ ఉంటే ఒక కథా కావ్యాన్ని తెలుగులోకి మొట్టమొదట తెచ్చిన గౌరవం కేతనది

మంత్రి తిక్కన 'ఒక్క కావ్యంబు రచించి నన్నుం గృతిపతిం జేయ వలయు నని' సగౌరవంగా ప్రార్థింప తాను దశకుమార చరిత్రను ఆయనకు అంకిత మిచ్చానని కేతన కథనం

'కొమ్మయ శౌరి సూనున క
　　కుంఠిత కీర్తివిలాస మొంద గ
ద్యమ్మున దండి చెప్పిన క
　　థాక్రమమొప్పఁ దెనుంగు బాస గ
ద్యమ్మును బద్యముం బెరయ
　　నంచిత భావ రసోదయాఢి రా
మమ్మగు నట్లుగా దశకు
　　మార చరిత్రము సెప్పఁబూనితిన్ , ౧ 25

వేదోపనిషత్తుల నుంచీ సంస్కృతంలో గద్యరచన ఉంది తర్వాత క్వాచిత్కంగా భారతంలో ఉంది కాని గద్యంలో కథ చెబుతూ రచన అంతా గద్యలోనే నడిపించడం పంచతంత్ర హితోపదేశాలతో ప్రారంభ మయింది గద్యకూ కథారచనకు అవినాభావసంబంధంగా తర్వాత కథా కావ్యాలు చాలా పుట్టాయి

పంచ తంత్రంవంటి ప్రారంభ రచనలకూ కాదంబరివంటి ప్రౌఢ రచనలకూ మధ్య - నాతి ప్రౌఢంగా, నాతి సులభంగా పుట్టిన గద్య కథా గ్రంథం దశకుమార చరిత్ర సంస్కృతంలో పుట్టిన కథా గ్రంథాల కన్నింటికీ మూల స్రోతస్సు కథా సరిత్సాగరం దానికి మూలం పైశాచీ భాషలోని బృహత్కథ అయినా దాని స్వరూప స్వభావాలు తెలుసుకునే అవకాశం మనకులేదు కనుక దాని ప్రతిబింబమైన కథా సరిత్సాగరమే మనకు శరణ్యం కథా సరిత్సాగరంలోని మృగాంకదత్త చరిత్ర దశకుమార చరిత్రకు ఎక్కువ ఆధారమని ప్రతీతి

దండి అనేది అసలు పేరు కాదనీ అతడు దశకుమార ప్రారంభ శ్లోకంలో 'బ్రహ్మాండ చ్ఛత్రదండః' ఇత్యాదిగా ఎనిమిది దండ శబ్దాలను ప్రయోగించి, చమత్కరించడంవల్ల అతనికి 'దండి' అనేది బిరుదనామంగా ఏర్పడినదని పురావిదుల వచనం ఘంటామాఘుడు ఇత్యాది నామాలవల్ల ఇది సంభవమే అనిపిస్తుంది అసలు పేరు పోయి అదే రూఢమయి ఉంటుంది ఇతడు కళింగాంధ్ర దేశాలను పేర్కొడం చేతను కథల్లో దాక్షిణాత్య నాగరికత కనబడడంవల్లనూ ఇతడు దాక్షిణాత్యుడనీ క్రీ శ పడవ శతాబ్దివాడనీ చరిత్రకారుల మాట - కొందరు ఇంకా నవీను డన్నారు

కావ్యాదర్శం అనే ఆలంకారిక గ్రంథం ఆచార్యదండి కృతం, మల్లికా మారుతం అనే నాటకం కూడా దండి విరచితమే

అయితే అనేక వైరుధ్యాలవల్ల మూడింటి రచయిత ఒకడు కాడనే విమర్శ ఉంది ఆ చర్చతో మనకిప్పుడు పనిలేదు ఎవరో ఒక దండి ఈ దశకుమార చరిత్ర రచించడం నిజం ఆ దశకుమార చరిత్రనే కేతన గద్య గ్రంథంగా కాక గద్య పద్యాత్మకమైన చంపూ గ్రంథంగా తెలుగు చేశాడు భావదీప్తికి, ధారణకు, పద్యం ఎక్కువ అనువు కావడంవల్లను, అప్పటికి పద్య

కవిత్వం మీద ఉన్న మోజువల్లను కేవలం గద్యం వ్రాయడం ఆయనకు రుచించి ఉండదు మూల గ్రంథం పూర్వపీఠిక అని కొంత, ఉత్తర పీఠిక అని కొంత, మొత్తం 13 ఉచ్ఛ్వాసాల రచనగా ఉండగా ఈయన 12 ఆశ్వాసాల కావ్యంగా వెలయించాడు

"దండినః పదలాలిత్యం" అని దండి కవిని పండితులు ప్రశంసించారు ఈ లాలిత్యం దశకుమార చరిత్రదే అనడం తథ్యం

ఉచిత శబ్దాలంకారాలతో, నాతి దీర్ఘ సమాస, వర్ణనలతో, ప్రౌఢ క్రియారూపాలతో సంస్కృత దశకుమార చరిత్ర గట్టులొరసి పారే నిండు నదిలా ఉంటుంది ఏ కథ తీసుకున్నా ఉత్కంఠను పెంచుతూ తుదికంటా చదివిస్తుంది అతని సంవిధాన కల్పనం ప్రకృతి చిత్రణం, మానవ స్వభావ పరిశీలనం, తన నాటి సమాజ దర్శనం, అమోఘంగా కనిపిస్తాయి

కేతన రచనాశైలి తనకు ముందున్న దేశికవుల దేశ్య శబ్దాల పోహళిం పుతో అనతి సంస్కృత ప్రయోగంతో ఎక్కువ తెనుగుతనం ఉట్టిపడుతూ ఉంటుంది

దండి పదలాలిత్యం అనే మాట మనసుకు పట్టి కండగల తెలుగుపదాల కూర్పుతో లాలిత్యం సాధించి అభినవ దండి అనే బిరుదంతో అలంకృతు డయ్యాడు

తెలుగు కవులు ఏ మూల సంస్కృత గ్రంథాన్నీ తెలుగులో మక్కీకి మక్కీగా వ్రాయడం పెట్టుకోలేదు తమ గ్రంథానికి తెనుగు వాసన రావాలి తెనుగు కూర్పు నేర్పువల్ల తమ గ్రంథం స్వతంత్రంగా భాసించాలి ఆ మేరకు వారు సంస్కృత వర్ణనలను తగ్గించి, పదబంధాలు మార్చి వాతావరణం సృష్టించి తమ రచనలకు కొత్తరూపం తెస్తారు ఇది తెలుగు పూర్వకవుల ప్రత్యేకత ఆ లక్షణాలన్నీ దశకుమార చరిత్రలో కనిపిస్తాయి ఆయన మూల రచనలోని వర్ణనలు తగ్గించి, కథకు అడ్డుతగిలే విషయ ప్రాచుర్యాన్ని కుదించి ప్రధానకథ రాచబాటలో పరుగెత్తేలా చేశాడు.

సంస్కృతంలో ముక్తసరిగా ఉన్నవాటిని తెలుగు ధోరణితో విస్తరిస్తాడు. అద్భుత కథలు చదువుతున్నామనే తృప్తి కలిగిస్తాడు అంతాబాగానే

ఉంది కాని - ఒకొక్కచోట కథకు నిండుతనాన్ని కూర్చి కవి భావ సౌందర్యాన్ని తెలిపే దృశ్యాలను పుష్టిచెందకుండానే కుదించి, దండికథలో కల్పనాచమత్కృతిని అనుభవించినవారికి ఆశాభంగం కలిగించడంకూడా ఉంది మచ్చుకు - అపహారవర్మ కథలోని నిద్రాసుందరి అందం తెలుగులో రాలేదు

దశకుమార చరిత్ర సూక్ష్మరూపం ఇది

రాజహంసుడనే మగధ దేశపురాజు శత్రురాజుకు ఓడి భార్యాసమేతంగా వింధ్యారణ్యసీమలో ఉండవలసి వస్తుంది రాజవాహనుడు అతని పుత్రుడు తక్కిన మంత్రి పుత్రులూ అంతాకలిసి పదిమంది అందరూ యుక్తవయస్కులై విజయోత్సాహంతో బయలు దేరుతారు

అరణ్య మధ్యంలో అందరూ నిద్రిస్తుండగా రాజవాహనుడు మాతంగుడనే సాధకునితో ఎక్కడికో వెళ్లిపోతాడు తక్కినవారు ఆయన్ను వెదుక్కుంటూ బయలు దేరి అనేక సాహసకృత్యాలుచేసి, అనేక అనుభవాలు పొంది ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా మళ్లా రాజవాహనునుణ్ణి కలుసుకొని తమ అద్భుత కథలు చెబుతారు రాజవాహనుడు మిత్రులతో కలసివచ్చి తండ్రిచేత మగధరాజ్య పట్టాభిషిక్తుడై సుఖిఉంగా రాజ్య పరిపాలన చేస్తాడు ఆ పదిమంది అద్భుత కథలే దశకుమార చరిత్రగా రూపొందినవి

'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అంటే అసలు కావ్యాలే చదవరాదు అనే అనుశాసనం ఉంది దానికి వ్యాఖ్యాతలు అసత్కావ్యాలు చదువరాదు, గాని సత్కావ్యాలు చదువవచ్చు అని సవరణ ఇస్తూ, అసత్కావ్యం అంటే కాదంబర్యాదులు అన్నారు

కాదంబరి ఎందుచేత అసత్కావ్యం ?

కల్పనా మహిమచేత, పాండిత్య ప్రకర్షచేత అది ఎంత గొప్పరచన అయినా - ఆదర్శ మహాపురుషుల ధార్మిక వర్తనం చేత అది మహత్తరం కాలేదు లోకాతీత కథలచేత, అతిలోక కల్పనలచేత వినోదమాత్ర పర్యవసాయిగా నిలిచింది ఎడనెడ శుకనాసోపదేశం వంటివి ఉన్నా అవి ఆ కథా గహనంలో మునిగిపోయి కనిపించవు

దశకుమార చరిత్ర ప్రయోజనం కూడా అంతే మనసుకు ఆశ్చర్యమగ్నం చేసే పదిమంది కథలచేత పాఠకులను ఉత్సుకులనుచేసి చదివిస్తుంది గాని భారత రామాయణాదులవలె ఉత్తమ నాయికానాయక ప్రదీప్తం కాదు

దశకుమార చరిత్రలో సప్తవ్యసనాలు, కథా గమనంలో విహరిస్తూం టాయి జూదం దొంగతనం, దోపిడి, ఘాతుకలు మారువేషాలు, పరకాంతా పరాయణత్వం విటవేశ్యాలాపాలు విచ్చలవిడగా కథా వస్తువులుగా ఉంటాయి అవినీతి వర్తనానికి అట్టే పట్టింపు ఉండదు ఇట్టివి సమాజనైతిక వర్తనానికి, ధార్మిక ప్రవృత్తికి దోహదం చెయ్యవు

ఇందులో అవంతీసుందరీ పరిణయం అపహారవర్మ, ఉపహారవర్మ, మిత్రగుప్త చరిత్రలు పాఠకులను ఎక్కువ ఆకర్షించి చదివించే కథలు ఈ అన్నింటిలోను అతిశయ కల్పనలతోపాటు అవినీతి విహారం సర్వసాధారణం అపహారవర్మ కథలో దొంగతనం ఒక శిల్పంగా కనబడితే, ఉపహారవర్మ కథలో పరదారగమనం, స్వేచ్ఛాసంచారం ఒక కళగా రూపొందాయి

విఘ్నేశ్వరుడు, గంగానది పరస్పరం శపించుకుని ఉపహారవర్మగా, కల్పసుందరిగా పుట్టినారట కనుక కల్పసుందరి పరభార్య అయినా నీభార్యగా స్వీకరించవచ్చునని గజాననుని ఉపదేశం దానికి పితృబంధవిముక్తి ప్రయోజనం కనక ధర్మమే అని సమర్థనం — ఇట్టి కథలు అపరిణతబుద్ధులను పెడదోవకు తిప్పే అవకాశం ఉంది కళకు ఉపదేశం ప్రధాన ప్రయోజనం కాకపోయినా— అవినీతి చిత్రణం మాత్రంలోక శ్రేయస్సుకు భంగకరం సాధారణంగా సంస్కృతగద్య కథాగ్రంథాలలో కల్పనాతిశయానికీ, శృంగారాభినివేశనానికీ ఉన్నప్రాముఖ్యం ధార్మిక ప్రచోదనానికి కనపడదు అయినా సాహిత్య రసికుల అభిరుచికి ఇవి పాత్రములు అవుతూనే ఉన్నాయి

తెలుగు దశకుమార చరిత్ర ఆనాటి సమాజ వ్యవస్థకు, ప్రజాజీవనానికీ, దర్పణం ఒక కొత్తలోకం కన్నులకు కట్టినట్టుంటుంది

తెలుగు జాతీయ జీవనంలో కోడిపందాలు ఒకతప్పని సరదా బొబ్బిలి యుద్ధకథలో, పల్నాటిగాథలో ఈపందాలు ఎట్టిపాత్ర వహించాయో మనకు తెలుసు—

దశకుమార చరిత్రలో ఈ కోళ్ల పందెం అచ్చంగా తెలుగు గడ్డమీద నిలిచి చూస్తూన్నట్టుంటుంది

ఎదిరిన కోడి మున్నెగసి ఆ రెలు మెడ
వెసగాడ నురువడి వ్రేసివ్రేసి
అదివ్రేయ మదికిన్కనడరి బల్విఁ బట్టి
కబళించి యందంద కదిమి కదిమి
విశిఖ ముఖంబులు వెనువెంటఁ దగులుచు
నంతంతఁ బోనీక యాగియాగి
వాగాటులకు వచ్చి వసుమతి నిలువక
యొంటి తన్నునఁ గొసరుడిపి యుడిపి
గెలిచె నామాటఁ దగనారికేళజాతి
యగ్గలిక నంతఁ బ్రజయెల్ల నార్చుచుండెఁ
జెలఁగి యొక జాతి మాత్రోపజీవియైన
బ్రాహ్మణుండు నన్నెంతయుఁ బ్రస్తుతించి ౯-33

కోళ్లలో ఒకజాతి, నారికేళజాతి అని రెండు తెగలు వాటి బలాబలాలు బొమ్మగీచినట్టు ఆ తెలుగు మాటల్లో దర్శనమివ్వడమే కాకుండా జాతిపేరు చెప్పుకుని పతితులై తిరిగే బ్రాహ్మణులు అందులో పాల్గోవడం కూడా ఎన్న దగిన విషయం

చోరత్వం కూడా ఒకకళ అయితే దానికి ఈ తెలుగు సాధనాలు చూడదగ్గవి—

"పొయితల, నీలిదిం డొలికి బూడిద, ముండుల బంతి గాలచీ
రయు సెలగోల, కత్తి, భ్రమరమ్ముల క్రోలును, మైలమందుఁ గొ
య్యాయు, నురిగ్రొంకి, నారసము, నాదిగ గల్గిన సాధనంబుల
న్నియు సమకూరఁ జేసికొని నేర్పున నేఁగితి ముచ్చు ప్రొద్దునన్"
R-72

ఇవి ఆనాటి అచ్చపు దేశ్యపదాలు, వీటిలో చాలావరకు నిఘంటువులో కనబడవు

కేతన పద్యాన్నయినా వర్ణించదలుచుకుంటే సంస్కృత ప్రమేయం లేకుండానే బొమ్మకట్టినట్టు వ్రాయగలడన డానికి మతంగుడు చూచిన నరక దర్శనం గొప్ప దాఖలా 3 16

పద్యవిద్య ఎరిగినవాడనడానికి ఏపద్యమైనా ఉదాహరణంగా తీసుకో వచ్చు

ఈ వసంతం దర్శించండి –

వేఁకువ వఁ గమ్మ తెమ్మెరలు వీవగ
మావుల నెల్లి దంపుఁగా
రాకుల పాటు డెందముల
నాకుల పాటొనరింపఁ జొచ్చె శో
భాకర పల్లవ ప్రచయ
మంగజ వహ్నిశిఖా సరూపతం
గైకొని నంతఁ జేసెఁ బధి
కప్రకరంబునకున్ వనంబునన్

ఈతని గద్యరచనలో ఒక విశేషముంది

తెలుగులో గద్యకు స్వయం వ్యక్తిత్వం లేదు శాసనాల్లోని గద్యలు కావ్యరచనకు పనికిరానివి తర్వాత మార్గకవితలో మధ్యవచ్చే గద్యలు పద్యభాషలోనే ఉంటాయి లేకపోతే తూకం కుదరదు అట్టి తెలుగుగద్యకు సరళరూపం ఇచ్చి వ్యవహార సరళికి సన్నిహితం చేశాడు

తిక్కనయుగంలో కేతననాటికే వీరశైవ తీవ్రత తగ్గి చల్లబడినట్టు కనిపిస్తుంది సరళశివభక్తి గురించి అక్కడక్కడ సూచనలు అగపడతాయి

బౌద్ధజైన వాసనలున్నాయి అపహారవర్మ కథలో వేశ్యాసంపర్కం వల్ల సర్వభ్రష్టుడై కౌపీనంకూడా వదలుకున్న ఒక క్షపణకుని దీనగాథ కనపడు తుంది ధర్మమార్గమనుకొని ఈ అధర్మవృత్తిని చేపట్టి మాపెద్దలవలంబించిన అనూచాన మార్గం నుంచి భ్రష్టుడనైనానని విలపిస్తాడు దీనివల్ల కవి హైందవాభిమానం వ్యక్తమవుతుంది

కేతన నుండి అంకితం పొందే నాటికి తిక్కన శివభక్తుడే అయినా విష్ణుద్వేషం లేదు తర్వాత తిక్కన హరిహరాద్వైత ఉద్యమ నాయకుడై ఆయుగానికి తాను ప్రవక్త కావడం మనకు తెలిసిందే

తిక్కన పేరు స్మరించగానే వెంటనే జ్ఞాపకం వచ్చేవాడు కేతనే అయి తన ప్రత్యేకతను తాను సురక్షితం చేసుకున్నాడు

మార్కండేయ పురాణం

మారన

మార్కండేయ పురాణం అనగానే మనుచరిత్ర జ్ఞాపకం వస్తుంది ఆంధ్రకవితాపితామహ అల్లసాని పెద్దన్నగారి తొలిమహాప్రబంధానికి ఇతివృత్తం అందించిన ఘనత ఈ గ్రంథానిది అంతేకాదు - తర్వాత వచ్చిన అనేక రచనలకు మూలపదార్థం ఈ గ్రంథంనుండి వెళ్లిన సంగతి ఆయా ప్రసక్తుల్లో చూస్తాం

పురాణం అనగానే కొందరు బొమలు ముడవడం మామూలు ఎందు చేతనంటే - అందులో రామాయణ భారతాల్లా ఏకవస్తువుండదు అనేక విషయాల, విషయపరిజ్ఞానాల సంకలనగ్రంథం అది కావ్యధర్మం, శైలీ చమత్కృతిగాని దాని లక్ష్యంగాదు అది బహుళ పరమార్థ వివరణ గ్రంథం గాని, రసరాజధాని గాదు కనుక సాహిత్య రసికులు ఎక్కువగా దాని జోలికి పోరు

అయితే - ఈ లక్షణాలు సంస్కృత పురాణాల్లో నిబిడంగా ఉండే మాట నిజం కాని తెలుగు కవులు తెనిగించిన పురాణాలు ఈ గుణాలకు అపవాదాలు అవి అచ్చంగా మూల సంస్కృత పురాణాలనే మాతృకలుగా తీసుకున్నా కవులు వాటి రూపం మార్చివేసి కావ్యప్రియులను ఆకర్షించేటంతటి కావ్యధర్మం వాటిలో ఉంచి పఠన పాఠన యోగ్యాలు చేశారు

అట్టి స్పృహణీయమైన వాటిలో మార్కండేయ పురాణం ఒకటి

నన్నయ, తిక్కనలు ఇతిహాసాన్ని సమర్థంగా తెలిగిస్తే, కేతన నూతన మార్గం తొక్కి తొలి తెలుగు కథా కావ్యాన్ని వెలయించాడు అట్లాగే తెలుగులోకి తొలి పురాణం తెచ్చిన విశిష్టత మారన కవిది

క్రి శ 1323 వరకు కాకతీయ చక్రవర్తిగా పేరుమోసిన రెండవ ప్రతాపరుద్రుని కటక పాలకుడు, సేనాపతి, అయిన గన్నయకు అంకితంగా ఈ

గ్రంథం పుట్టింది. ఆనాటి మహారాజులే కాక వారి మంత్రులు, సేనాపతులు కూడా సాహిత్య రసికులై కవుల రచనలను కృతిగా స్వీకరించడం పరిపాటి.

"తన కళాచతురత్వ
మున కద్భుతంబందు

బుధులు భోజుని నేర్పుఁ బొల్లు సేయ నెగడి జగమున నెంతయుఁ బొగడు వడసె కాకతి క్ష్మాతలాధీశ ఘటకపాలుఁ డమల సితకీర్తి, గన్నసైన్య విభుడు" అని కవిచే ప్రశంస గన్నవాడు గన్నయ. ఆయన "నూతన కథా విస్తారమై, యోగ్యమై, పరమ విజ్ఞానాశ్రయంబై మార్కండేయాఖ్య మహాపురాణము విన౦ గౌతూహలం బయ్యెడిన్" అని కోరగా మారన మార్కండేయం తెనిగించాడు. పురాణంలో కొంత మాత్రమే తెనిగించినా మారన చేయితిరిగిన తెలుగుకవి అనిపించుకున్నాడు.

ఈ మారన రన కృత్యాదిని వ్యాసవాల్మీకుల తర్వాత నన్నయ తిక్కన లను ఎలుగెత్తి ప్రశంసించాడు. తాను తిక్కనార్యునకు శిష్యుడనని 'తిక్కన సోమయాజి ప్రసాదలబ్ధ సంస్వతీ పాత్ర' అని చెప్పి తృప్తిపడ్డాడు. ఆ నాటి తిక్కనగారి గురుత్వాకర్షణశక్తి చాల గొప్పది. కేతన దశకుమార చరిత్రలో చెప్పక పోయినా 'ఆంధ్ర భాషా భూషణంలో' ఈ సూచన క పడుతుంది.

చమత్కార మేమిటంటే - ఈయన తిక్కనకు ఎంత శిష్యుడైనా రచనా సర్వస్వంలో నన్నయ్యకు ప్రియాంతేవాసి. పద్యం ఎత్తుగడలో, పదబంధంలో, సంస్కృత సమాస నిర్వహణలో నన్నయ అంతరధ్వని వినపడు తుంది. ఒకప్పుడు పరాకుగా నన్నయ పద్యమే చదువుతున్నామా అనిపిస్తుంది. ఆయన చేసిన నన్నయ ప్రశంసలో ఈ ఆరాధన ధ్వనిస్తుంది. తర్వాత కొద్దిగా తిక్కన పోకడలు కనపడతాయి.

మారన రచించినది పురాణమే అయినా - పురాణ నీరసధోరణి కాక చమత్కరిస్తూ, పురాణ సన్నివేశాలకు రసస్పర్శనిస్తూ, రచనకు కావ్యలాలిత్యం సమకూర్చుతూ రచనను అవశ్య పఠనీయంగా నిర్వహించాడు.

"అఖిల విబుధ సభాపర్వమై జగజ్జ
నావళికిఁ గర్ణపర్వమై యధిక పుణ్య

యోగి హృచ్ఛాంతి పర్వమై యొప్పుదాని
హరి గుణోజ్జ్వల మణినిధియైనదాని
ఇమ్మార్కండేయ పురా
ణ మ్మఖిల హితముగాగ నానేర్పుగతిన్
నెమ్మి విరచించెదన్ "

అని అంటూ - తన హృదయం 'సరస సాహిత్య సౌరభ సంవాసితం' అపూర్వ కావ్యరచనా కుతూహల మధులిహం అని శబ్దశిల్ప మహితంగా చెబుతాడు

ఈయన 'తిక్కనామాత్య పుత్ర' అనడం చట్టున సందేహానికి దారి తీసినా - ఈయన తండ్రి పేరూ తిక్కనయే అని తప్పక స్ఫురిస్తుంది

దీన్నిబట్టీ, తిక్కనకు శిష్యుడవడంవల్లనూ, ఇతడు పాకనాటిసీమవాడయి ఉండవచ్చుననీ, నెల్లూరు సీమవారు తరుచు కాళహస్తి తిగకంటి దేవర పేరు పెట్టుకుంటారనీ "తిగకక్కన్" అన్నమాటకు తిక్కన వికృతి అనీ కొందరూహించగా - మరికొందరు నాలుగో ఆశ్వాసం 179 పద్యంలో గోదావరిని ప్రశంసించడంవల్లనూ ఓరుగంటి కటకపాలకునకు అంకితం ఇవ్వడంవల్లను ఇతడు తెలంగాణారు చెందినవాడేమో - ఆలోచించాలన్నారు

ఈ ప్రాంత విభాగాలు మరచిపోతే ఇతడు అచ్చపు తెలుగుకవి అందరికీ 'మావాడే'

కృతిపతి గన్నయ 'నూతన కథా విస్తారం' వినాలన్నాడు మారన నాది 'సరస సాహిత్యం' 'అపూర్వ కావ్య రచన' అన్నాడు

ఆ లక్షణాలు ఎంతవరకూ సఫలమైనాయో మార్కండేయంలోకి తొంగి చూస్తే తెలుస్తాయి

పురాణానికి 5 లక్షణా లుండాలి 1 సర్గం 2 ప్రతిసర్గం 3 రాజ వంశం 4 మన్వంతరం 5 వంశాను చరితం అనేవి ఆ అయిదును

పురాణ జీవనాడులు - సృష్టి క్రమవర్ణనం, రాజ వంశాల చరిత్ర, మన్వంతరాలు, ఉపవంశాల వివరణం వంటివే అయినప్పుడు అందులో ఒకే వస్తువు, ఉపచయాపచయాలు, రసరామణీయకాలు ఉండడానికి వీలులేదు

అప్పుడది విజ్ఞాన సర్వస్వం అయితే కావచ్చు కాని - కావ్యం మాత్రం కాదు

ఇట్టి సందర్భంలో ఉపస్థిత విషయాలనే పట్టుకుని కావ్య ధర్మాన్ని చూపించాలి తెలుగు కవుల ముఖ్యమైన చూపు పురాణ పరిజ్ఞానాన్ని తెలుగు భాషలో నింపడం కాదు అది ఎంత శుచిమంతమైనా రుచిమంతంగూడా చెయ్యాలని వారికాంక్ష మార్కండేయంలో ఆ స్పృహ కవి మాటల్లో స్పష్టంగా కనబడుతుంది

కృతిపతి గన్నయ్య 'నూతన కథా విస్తారం' వినడానికి కుతూహల పడుతున్నా నన్నాడు అంటే - సుప్రసిద్ధములైన రామ భారత కథలుకాక కొత్తవి అని అర్థం

మార్కండేయం చిత్రమైన నాలుగు ప్రశ్నలతో ప్రారంభమౌతుంది ఆ ప్రశ్నలు ఎవరికైనా కుతూహలం పుట్టించేవే

(1) విష్ణువునకు మనుష్యత్వం ఎట్లా వచ్చింది ?
(2) పాండవులకు ద్రౌపది ఒక్కతయే భార్య ఎట్లా అయింది
(3) బలరామునకు బ్రహ్మహత్యా పాతకం ఎట్లా వచ్చింది ? ఎట్లా పోయింది ?
(4) ద్రౌపదేయులు పెండ్లీ పేరంటం లేకుండా అనాథల్లా ఎందుకు మృతి చెందారు ?

ఈ ప్రశ్నలకు సమాధానాలేమిటో విందామని జైమిని మహర్షి మార్కండేయుణ్ణి అడిగాడు ఆయన తనకు తీరిక లేదనీ వింధ్య పర్వతం మీద ఉన్న ధర్మ పక్షులు చెప్పగిలవు, అక్కడికి వెళ్ళమనీ అన్నాడు

ఇక్కడ మనకు జైమినినే ఇంకో ప్రశ్న వెయ్యాలనిపిస్తుంది 'అయ్యా, తమరు సాక్షాత్తు వ్యాస శిష్యులేగదా ! ఈ భారత ప్రశ్నలను గురువుగారినే అడిగి సంశయం తీర్చుకోవచ్చుగదా ! మార్కండేయులుదాకా ఎందుకు వచ్చారు' అని దానికి ఆయన సూటిగా సమాధానం చెప్పక చిరునవ్వుతో 'మార్కండేయ మహర్షినే అడగాలని తోచింది - ఆయన్నే అడిగాను ఎవరయితే ఏం - విషయం తెలియాలి - అంతే' అని ప్రత్యుత్తర మిస్తారు.

అట్లాగే మనం కూడా విషయమే గ్రహించడం కర్తవ్యం ఇట్టి క్లిష్ట ప్రశ్నలకు పక్షులు జవాబు చెప్పడం ఏమిటి? వాటికంత మహాజ్ఞానం ఎట్లా వచ్చింది? అనేది మరో కుతూహలకరమైన ప్రశ్న – ఆ పక్షుల చిత్రకథ యిది—

కందరుడనే పక్షిరాజు విద్యుద్రూపుడనే రాక్షసుణ్ణి చంపి అతని భార్యను పత్నిగా స్వీకరించాడు ఆమె కూడా పక్షిరూపం ధరించి అతనితో కాపురం చేసింది దుర్వాసుని శాపంచేత పక్షిగా పుట్టవలసిన వపువు అనే అచ్చర వారికి కూతురై పుట్టింది దాని పేరు తార్క్షి ద్రోణుడనే ముని దానిని భార్యగా స్వీకరించాడు ఆమె గర్భవతియై కురుక్షేత్ర యుద్ధంలో తిరగుతూ గర్భపాతమై నాలుగు గుడ్లను భూమి మీద పడవేసింది అవి చితకలేదు వాటిమీద ఏనుగు ప్రక్కలను వేలాడే ఒక గంట పడి వాటిని రక్షించింది ఆ గుడ్లు అందులో పిల్లలయాయి వాటిని శమీకుడనే మహర్షి పెంచి పెద్ద చేశాడు

అవి పూర్వ జన్మలో సుకృశుడనె మునికి పుత్రులు తండ్రి శాపంవల్ల వారికి పక్షి జన్మ వచ్చినా వారు మనుష్య వాక్కుతో జ్ఞానవంతులై విద్యావంతులైనారు

ఆ ధర్మపక్షులే జైమిని ప్రశ్నలకు ఇట్లా సమాధానాలు చెప్పాయి

1 విష్ణువునకు వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, నారాయణుడు అను నాలుగు మూర్తులు అందులో పరమ సాత్త్వికమూర్తియైన ప్రద్యుమ్నుడు జగద్రక్షణ కోసం భూభారహరణార్థం మనుష్యత్వం వహించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేశాడు

2 భూమి దుష్ట శక్తులతో బరువెక్కి తన భారం తీర్చండని దేవతలను ప్రార్థించింది ఆ మొరవిని ఇంద్రుడు ఐదు రూపాలు ధరించి భూ వాయు జల అగ్ని ఆకాశాది శక్తుల సహాయంతో కుంతీ మాద్రులందు ఐదు రూపాలతో పుట్టి ద్రౌపదిని భార్యగా స్వీకరించాడు మూర్తులు వేరైనా వ్యక్తి ఒక్కడే కనుక ద్రౌపది పంచ భర్తృకత్వం మిథ్య

3 బలరాముడు సురాపాన మత్తుడై సూతమహర్షి తల పగలగొట్టి చంపి బ్రహ్మహత్యా పాతకానికి గురియైనాడు పశ్చాత్తప్తుడై సరస్వతి పుణ్యతీర్థంవల్ల పునీతుడైనాడు

4 విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని రాజ్యం సర్వం హరించి తన రాజ్యం నుంచి పొమ్మని హరిశ్చంద్రుణ్ణి ఆజ్ఞాపించాడు హరిశ్చంద్రుడు భార్యా పుత్రులతో పురం విడిచిపోతూ ప్రజల దుఃఖం చూడలేక ఒకింత నిలువగా - ముని కోపించి తన చేతి దండంతో సుకుమారి యైన రాజు భార్యను మోదాడు ఆ దారుణకృత్యం చూడలేక విశ్వేదేవులు పరితపించి ఈ మునికి ణ్యాలోకం లుంటాయా? అని ఆక్షేపించాడు దానికి ముని ఉగ్రుడై మీరు మనుష్య పక్షపాతం వహించారు గనక మనుష్యులై పుట్టండని శపించి మళ్ళా కరుణించి మీరు చిరకాలం మనుష్యులుగా ఉండరు బ్రహ్మచారులై వివాహాదులులేక అచిరకాలంలో మళ్ళా దేవత లవుతారని అనుగ్రహించాడు

జైమిని అడిగిన 4 ప్రశ్నలకు ప్రథమాశ్వాసంలోనే సమాధానాలు దొరికి ఆ ఆశ్వాసం ముగిసింది

తర్వాత నరక విశేషాలు భారతాది వర్ష వివేకం, వర్ణాశ్రమాచార ధర్మాలు, స్వారోచిషాది మనుచరిత్రలతో, ప్రసక్తాను ప్రసక్తములైన రాజ వంశ కథలతో గ్రంథం 8 ఆశ్వాసాల కావ్యంగా విస్తరిల్లింది

కృతిపతి అడిగినట్లుగానే ఇందులో అనేకమైన విచిత్రకథ లున్నాయి ఒక కథ ప్రారంభమై, దానిలో ఇంకో అవాంతర కథ అవతరించి తుదకు ప్రధాన కథ చమత్కారంగా ముగుస్తుంది దానికి ముందు పేర్కొన్న పక్షుల కథనే ఉదాహరణంగా తీసుకోవచ్చు

ఇందులో ఎన్నదగిన కథలు ఎన్ని ఉన్నా హరిశ్చంద్ర, కువలయాశ్వ, స్వారోచిషమను, మరుత్తరాట్ వగైరా కథలు ఎంతో ఆసక్తి గొలిపేవి అంతతోనే ఆగకుండా అవి తర్వాతి తెలుగు కవులకు ఇతివృత్తా లందించిన ఘనత కూడ సంతరించుకొన్నవి ఇందలి హరిశ్చంద్రోపాఖ్యానం గౌరన శంకర కవుల హరిశ్చంద్ర కావ్యాలకు ప్రేరణ ఇచ్చింది కువలయాశ్వ కథ నవరం చిననారాయణ కువలయాశ్వ చరిత్రకు ఆధారమయింది అన్నింటికంటె ముఖ్యంగా - పెద్దనార్యుని స్వారోచిష మను సంభవ ప్రబంధ రచనకు పునాది అయింది శ్రీనాథ రచనగా ప్రసిద్ధమై ఇప్పుడు ఉపలబ్ధంకాని మరుత్తరాట్చరిత్రకున్ను ఇదే ఆధారం కావచ్చు

గౌరన, శంకర కవుల హరిశ్చంద్ర రచనలకు ఇందులోని హరిశ్చంద్ర కథకు ప్రధానాంశాలు సమానమే అయినా కొన్ని విషయాలలో భేదం ఉంది దీనిలో మాతంగ కన్యలు, నక్షత్రకుడు చంద్రమతి చోరత్వం, రాజాజ్ఞచే హరిశ్చంద్రుడు చంపబోవడం వంటి సన్నివేశాలు లేవు

మను చరిత్రకు ఈ పురాణం గొప్ప స్ఫూర్తి నిచ్చిందని చెప్పవచ్చు అష్టాదశ వర్ణనల ఆసక్తితో ఆయన గ్రంథం పెంచినా ముఖ్యార్థంలో భేదం లేదు ఇంకో విశేషం మను చరిత్రలోని కుతపకాల ప్రశంస సిద్ధునికి ఆతిథ్యం ఇచ్చిన తర్వాతి తీర్థయాత్రాభిలాష మొదలైన అంశాలు కొన్ని వివాదాలకు దారితీశాయి మార్కండేయంలో ప్రవరుడు సిద్ధుణ్ణి వందన పూజల హృష్ట చిత్తుగా చేసి, తీర్థయాత్రాభిలాష తెలిపి, పాదలేపనం పూయించుకున్నాడు హిమగిరికి వెళ్లాడు ఉదయ భాగంలోనే వెళ్ళి మధ్యాహ్నానికి గిరిమీద ఉన్నాడనుకోవచ్చు

మనువులో 'ఇష్టమృష్టాన్న భోజనసంతుష్టుచేసి' తర్వాత 17 పద్యాల ప్రసంగం జరిగాక పాదలేపనం పూయించుకున్నాడు సిద్ధుని రాకయే కుతప కాలం అనడంవల్ల ప్రవర ప్రయాణం తర్వాత జరిగి ఉండాలి అప్పుడు హిమగిరి మధ్యాహ్న వర్ణనం విరోధించి అనేక చర్చలకు చోటిస్తుంది ఆ బాధ మార్కండేయంలో లేదు

పైని పేర్కొన్న కథలలో కువలయాశ్వకథలో కొన్ని అభూత కల్పనలున్నా, చమత్కార సన్నివేశాలు కథాసక్తికి తోడ్పడతాయి

కువలయాశ్వుడు వరాహరూపం ధరించిన పాతాళకేతువనే రాక్షసుణ్ణి తరిమి చంపి మదాలసను పరిణయమాడతాడు వారి దాంపత్య సుఖజీవనా నికి ఓర్వని పాతాళుని తమ్ముడు తాళకేతువు కువలయాశ్వుని మోసగించి, మదాలస మరణానికి కారణమై పగతీర్చుకుంటాడు కువలయాశ్వుడు ఏక పత్నీవ్రతుడు మరోస్త్రీని పరిగ్రహించడు ఆతనియందు సద్భావంకల అశ్వతరుడనే నాగరాజు మదాలసను పుత్రిగా గ్రహించి, కువలయాశ్వుని పాతాళానికి రప్పించి మదాలసను ప్రతిమగా చూపి, చమత్కరించి తర్వాత ఇచ్చి పెండ్లి చేస్తాడు

మరుత్తుడు ధీరోత్తరుడైన రాజు మునులను సంహరించిన నాగులను వధింపుమని అతని పితామహి, మనుమనికి కబురు చేసింది, మరుత్తుడు నాగలోకం మీద దారుణాస్త్రాల్ని ప్రయోగించాడు మరుత్తుని తల్లి వైశాలిని ఒకప్పుడు నాగులకు ఎట్టి అపకారం జరగనీయనని ప్రతిజ్ఞ చేసింది నాగులను రక్షించ వలసిందని భర్త అవేక్షితుణ్ణి ప్రార్థించింది అవేక్షితుడు తనకొడుకు మరుత్తుని నాగులను వధించవద్దని బోధించాడు ఇది దుష్టశిక్షణం, క్షత్రియులకు విహిత కృత్యం దీనిని విడువలే నన్నాడు మరుత్తుడు అవేక్షితుడు శరణాగత రక్షణం రాజధర్మం నేను నిన్ను ప్రతిఘటిస్తున్నానన్నాడు ఇద్దరూ యుద్ధానికి తలపడ్డారు ఈ ఘోరదృశ్యం చూడలేక ఔర్వ్యాదిమునులు వచ్చారు నాగులు అమచే హతులైన మునీశ్వరులను ఉజ్జీవితులను చేస్తారు అప్పుడు హతులూలేరు, శరణాగతలూ వేరు కనుక మీరు మీ ప్రతిజ్ఞ సాధించినట్లే యుద్ధం ఆపండ న్నారు తండ్రి కొడుకులు యుద్ధం మానివేశారు నాయనమ్మ వీరాదేవి, కొడుకును మనుమణ్ణి అభినందించింది కథ సుఖాంత మయింది

మరుత్తుని తల్లి తండ్రులు వైశాలినీ, అవేక్షితుల వివాహ కథ కూడా విచిత్ర సంఘటనలతోనే నడిచింది ఇట్టి సన్నివేశ బంధురమైన కథను తీసుకుని శ్రీనాథుడు తన మరుత్తరాట్చరిత్రను రసరంజితంచేసి ఉంటాడు ఇట్టి అపూర్వ కథ లెన్నింటికో మార్కండేయం నిలయమై ఉంది

తెలుగులో ప్రబంధ రచన చాల ఎత్తుకు పెరిగిన తర్వాత చూస్తే మార్కండేయరచన కావ్యప్రియులకు ఆపోవక పోవచ్చుగాని — నిజానికి దాని క్లిష్టత, శైలీ సారళ్యం, రసాభి ముఖ్యం, పరిమిత వర్ణనలు, సహృదయులను తప్పక అలరిస్తాయి ఆ కథన శిల్పం ఇంపు గొలుపుతుంది నన్నయ నుంచి క్రమంగా తలయెత్తుతూ పెరిగివస్తున్న పద్యవిద్య, శిల్పప్రీతి, వాక్చమత్కృతి, మార్కండేయంలో కూడా తీసిపోకుండా కనిపిస్తాయి.

హరిశ్చంద్ర కథ కరుణరస పూరితం అని అందరికీ, తెలుసు అందులో పుత్ర మరణ దుఃఖంతోకూడిన రాజుభార్య (శైబ్య) రూపం ఇది

"బోరన బొంగి శోకరసపూరము నిర్భర బాష్పపూరముల్
పారక కన్గవందొరుగ వాతెఱ లాలఱ గ్రమ్ముదేర వా

హారవముల్ సెలంగ ధరియంబడి వేనలిధూళిఁ బ్రుంగ న
క్కూరిమి పట్టి బేర్కొనుచు కోమలి మేదినిఁ జేతులూదుచున్"

శైబ్య హరిశ్చంద్రుని దుఃస్థితి చూచి అన్న ఈమాటలు ఎందరో ప్రబంధకవు కు డా చూపినవి

చేసెనే దైవ మానవ క్షితిప శేఖ
ర ప్రభాజాల సతత విరాజమాన
చరణకమల హరిశ్చంద్ర! సకల
బుధ మనః కైరవాకర పూర్ణచంద్ర!

మను సంభవంలోని 'కాముని దక్క నేలుదున్' 'ఈ సుకుమారుడెవ్వడొకో?' వంటి పద్యపాదాలు యథాతథంగా మార్కండేయం నుంచే వచ్చినట్టు చూస్తాము

మార్కండేయంలో మహిషాసురవధలోని దేవీమూర్తి ఈయన రౌద్రరస వర్ణనకు మంచి ఉదాహరణం

అతిరభసాంఘ్రి విన్యాస నిర్భర భరంబున నేలపాతాళమునకు డించ,
ప్రత్యగ్ర బహురత్న బహుళదీప్తిచ్ఛటా రంగత్కిరీటంబు నింగి మెఱయ
శస్త్రాస్త్ర జాల ప్రసారణ పటు దోస్సహస్రంబు దిక్కుల నవల ద్రోవ
నుజ్జ్వల దుర్నిక్షోగ్ర దేహద్యుతి పుంజంబు బ్రహ్మాండ పూరితముగ

అతుల హుంకార సింహనాదాట్టహాసములు
సెలంగగ దన రౌద్రమూర్తి మెఱయ
వచ్చు నద్దేవి, తీవ్ర దుర్వార శౌర్య
ఘనుడు మహిషాసురేంద్రుండు గనియె నంత"

వరూధినీ కపట ప్రవరుల, వైశాలినీ అపేక్షితుల శృంగార విలాసము ఈయన శృంగార చిత్రణములకు చక్కని నిదర్శనములు-

కువలయాశ్వ చరిత్రలోని ఈపద్యంచూస్తే ఈయన పద్యవిద్య నన్నయకు ఎంత దగ్గరో తెలుస్తుంది

దైతేయ ప్రవిముక్త దారుణ గదాదండాసి నానాయుధ
వ్రాతంబుల్ విలసత్తదాభరణ వర్మ శ్రేణియుం జూర్ణమై

పాతాళైక నికేతనాంతరమునన్ బర్వంగ జేసెన్ వెసన్
జాతామర్ష త నక్కుమారుడు రణోత్సాహంబు దీపింపగన్ – 3.36

ఈతని సూక్తిసుధ అప్రయత్న సుందరం –

సమర మొనరించినంతనే చావురాదు,
పారిపోయిన యంతనే బ్రతుకురాదు,
జీవితంబును, మరణంబు దైవకల్పి
తములు వానికి ముద మందc దలక వలదు

'వినుము రాజ' సూదికి రెండు మొనలు గలవె ?''నీ పెంపు బూడ్దబొట్ట య్యేనే' వంటి జాతీయాలు చూడదగ్గవి

ఇట్లా మారన పురాణాంధ్ర కవుంలో గణనీయమైన స్థానం గలవాడు

ఇందలి ఈ ప్రయోగాలు పరిశీలింపదగ్గవి

1 బూడ్ద 2 అడజడి 3 నీచీభావం 4 పరితాపం 5 హత్య వంటివి

కేయూర బాహు చరిత్ర

మంచన

కేయూరబాహు చరిత్ర నాలుగాశ్వాసాల చిన్న కావ్యం కావడానికి చిన్న కావ్యమేగాని - చారిత్రకంగా దీనికొక ప్రాధాన్యం ఉంది

క్రీ శ 13 శతాబ్ది వరకు తెలుగు కవులు సంస్కృత నాటకాల జోలికి పోలేదు అంత వరకు ఇతిహాసం, పూరాణం, కథ తెలుగులోకి విజయవంతంగా తెచ్చారు ఇంచుమించు సమకాలికుడైన మంచనకవి దృష్టి సంస్కృత నాటకాల మీదకు వెళ్లింది సుప్రసిద్ధమైన శాకుంతల, ఉత్తరచరితాది నాటకాలను విడిచి ఈయన చూపు సంస్కృతంలో రాజశేఖరుని విద్ధసాలభంజిక అనే నాటిక మీద ఎందుకు పడిందో ఆలోచించ వలసిందే - ఒకటి తోస్తుంది

శాకుంతలాదులు కవితలోను, రచనలోను చాల బిగువైనవి అంత రసవంతంగాను, ప్రౌఢంగాను తెలుగులోకి తేవడం అనుకొన్నంత తేలికకాదు వాటిమీద చేయివేసి పండితుల మెప్పు పొందడం దుష్కరం అంతేకాక గద్యపద్య మిశ్రితమైన నాటక ప్రక్రియ చంపువు వంటిది కాదు విలువ తక్కువ పాత్రలకు ప్రాకృత సంభాషణ లుంటాయి వాటిని పాత్రోచితంగా తెలుగులోకి తేవడానికి మార్గమింకా ఏర్పడలేదు కనుక పెద్ద నాటకాల జోలికి పోదలుచుకోలేదు అంతగా ప్రసిద్ధిలేని ఒక చిన్న నాటిక తీసుకుని కావ్యంగా వ్రాస్తే ఎట్లా ఉంటుందా ? అని మంచన ప్రయోగం చేసి ఉంటాడని తోస్తుంది

ఇంతకూ, విద్ధసాలభంజికకు దీనికి సర్వాత్మనా పోలికలేదు అందులో నాయకుడు కేరళదేశపు రాజు విద్యాధర మల్లదేవుడయితే, ఇందులో కళింగ రాజు కేయూరబాహువు నాయిక రెండిటిలోను మృగాంకావళియే కాని ఈమె తండ్రి నాటకంలో చంద్రవర్మ అయితే ఇందులో చండవర్మ, తక్కిన పోలికలు అక్షరాల విద్ధసాల భంజికనుంచే వచ్చిన వనుకోనక్కరలేదు ఆ

వస్తు విధానం మాళవికాగ్ని మిత్రం రత్నావళి ప్రియదర్శిక నుంచి కూడా రావచ్చు అంతేకాక దీనికి స్వప్నవాసవదత్త వాసన కూడా ఉంది

కథానాయకుడైన రాజుకు కారణాంతరాలవల్ల తన అంతిపురంలో చేరిన ప్రచ్ఛన్న రాజకుమారితో తలవని తలంపుగా పరిచయ మవుతుంది రాజు ఆ పిల్లమీద మరులుకొంటే పట్టపురాణి అడ్డుతగులు తుంది రాజు విదూషకాదుల ప్రోత్సాహంతో ప్రోదితో ఎన్నో ఎత్తులు వేస ఎట్టకేలకు ఆరాజ పుత్రికను స్వీకరిస్తాడు రాణిముందు వ్యతిరేకించినా తుదకు ఆరాచకూతురు తనకు చెల్లెలి వరుసలోని దని తెలుసుకుని సర్దుకుని ఆమెను సవతిగా అంగీకరిస్తుంది

చిన్న చిన్న మార్పులతో ఇదే పై నాటకాల ఇతివృత్తం

సిద్ధోపదేశంవల్ల ఆరాజకుమారిని పెండ్లాడిన వాడు సార్వభౌము డౌతాడని మంత్రికి తెలియడం, ఆ మంత్రి ఆమెను ఎట్లాగైనా సంపాదించి తన రాజును సార్వభౌముణ్ణి చెయ్యాలను కోవడం, దానికి రాణిని ఒప్పించడం, ఆమె ఇష్టంమీదనే రాజు ద్వితీయ పత్నిని అంగీకరించడం వగైరా స్వప్నవాసవ కథజాడ –

రేఖామాత్రంగా కేయూర కథ ఇది -

కేయూర బాహువు కళింగ దేశపురాజు

అతని మంత్రి భాగు రాయణుడు

మంత్రి మేనల్లుడు సోమదత్తుడు, మంచి బుద్ధిశాలి, మంత్రాలోచనలో మేనమామకు కుడిభుజం వంటివాడు

రాజు పట్టపురాణి రత్నసుందరి

ఆమె చెలికత్తె కళావతి

విదూషకుడు చారాయణుడు

ఇది ఒకవైపు పాత్రవర్గం –

రెండోవైపు లాటదేశాధీశుడు చండవర్మ, రత్నసుందరికి (రాణికి) పినతల్లి పెనిమిటి -

ఇతనికి పుత్రసంతానంలేదు మృగాంకావళి అనే పుత్రికమాత్రమే ఉంది ఆమెకు పురుష వేషం వేసి మృగాంకవర్మ అనే పేరుతో పెంచుతున్నాడు

మృంగాంకను పెండ్లాడిన వాడు చక్రవర్తి అవుతాడని ఒక సిద్ధుడన్నాడు ఆ సంగతి విని మంత్రి తనరాజు శృంగారలోలుడై రాజ్యాభివృద్ధిని పట్టించుకోవడం లేదని మేనల్లుని బుద్ధి బలంతో ఒక పథకం వేసి లాటరాజు కుమార్తెను తన రాజుకు పెండ్లి చేయించాలని కథ నడుపుతాడు ఈ ఎత్తుగడలో రాజు చెలికాడు విదూషకుడు, రాణి చెలికత్తె కళావతి మంత్రికి తోడ్పడతారు

లాటరాజుకు మహా ఽ ప్రాగి. తి భయం ఉంది అది సాకుగా మృగాంకవర్మను తనవద్ద ఉంచమని రాజు కోరడం, దానికి సమ్మతించి లాటరాజు పంపడం, తుదకు ఆ వర్మ మృగాంకావళిగా తేలి కళావతిద్వారా రాజు వద్దకు చేరడం, అన్యోన్యానురాగం, కొన్నాళ్లు ఇద్దరి విరహం, తర్వాత పెండ్లి వరుసగా జరిగిపోతాయి రాణి రత్న సుందరికి ముందు కోపం వచ్చినా ఆ రాచకూతురు తన పినతల్లి కుమార్తెయే అని తెలిసి స్తిమిత పడుతుంది

ఈ చిరు కావ్యానికి వెలనాటి చోడరాజుల మంత్రి అయిన నండూరి గుండయమంత్రి కృతిపతి

'స్థాయి రసము శృంగారం
బై యలవడ కథలు నీతులై యెడనెడ, రా
కేయూర బాహు చరితము
సేయుము నీవాంధ్రభాష శిల్పము మెఱయన్

అని మంచన కవిని కోరగా ఆతడు ఈ నాలుగాశ్వాసాల కావ్యం రచించాడు

కేయూరబాహు మృగాంకావలుల అనురాగం స్థాయిగా కావ్యం శృంగారంతో నడిచిన మాట నిజమే కాని కావ్యంలో మధ్యమధ్య వచ్చిన నీతికథలు ఆ రస పరిపాకాన్ని కప్పివేశాయి ఆ నీతి కథల్లో కథలుగా పెరిగి, అసలు కథను మరచిపోయేటంత గహనంగా అల్లుకొని వ్యాపించాయి

తొలి రెండు ఆశ్వాసాల్లో ప్రధాన కథాసూచన కనబడడం, తర్వాత ఒక చిన్న నీతి చెప్పడానికి మొదలై, అవాంతర కథ ప్రధానేతివృత్తాన్ని మింగివేయడం జరిగింది మూడో ఆశ్వాసంలో 300 పద్యాలు నీతికథలకే ఖర్చయాయి నాలుగో ఆశ్వాసంలో అసలు కథావస్తువు కదలి చరచర నడిచి తొందర చేసి పండించిన పండుగా ముగుస్తుంది

అసలు కథలోని యంత్ర స్తంభాలు, భవనాలు, వేషాలు, మార్చి చేసిన పెండ్లిండ్లు, అభూత కల్పనల జానపద చిత్రాలుగా మిగిలి, రసానుభూతిలో తాదాత్మ్యం పొందనీయవు, నాటకాలను ఆధారంగా చేసుకుని రచించిన రచన కుండ వలసిన వాతావరణం సంభాషణ చాతురీ నిర్వహణం ఇందులో రాలేదు దీని ఆధారం ఒక నాటక కథ మాత్రమే

మంచన కవి తెలుగు కవితలో నుంచి + అన్న అనవచ్చు ఒక కథ ఎత్తు కుంటే విడవకుండా చదివించే నేర్పు ఈయనకు సమృద్ధిగా ఉంది పద్య విద్య తెలిసినవాడు

కంద పద్యం తిక్కన్నతో దీటుగా వ్రాయగలవాడు నీతి, వర్ణనం, రసచిత్రణం, తెలుగు మాటల ఒడుపు బాగా తెలిసినవాడు ఈ నీతి చాతురి చూడండి -

> "అమరగ నాయవ్యయముల
> క్రమము - జలము పెద్ద వాతగై కొని యది స
> న్నముగ వెలార్చుచు నుండెడి
> కమండలువుఁ జూచి యైనఁ గాదే తెలియన్ 3-164

"సుమతి పగమేలు, విమతి నెయ్యమున కంటె" (తృతీయ,) చతుర్థాశ్వాసంలోని 7,21 పద్యాలతో రసాలంబనమైన రాజు వర్ణనం, 31 మృగాంక వర్ణనం ఈతని వర్ణన పరిపాకానికి నిదర్శనాలు 26 పద్యంలోని ప్రత్యూష వర్ణనం చెప్పదగ్గది

మృగాంక నాయకుని యంత్రభవనంలో కలుసు కున్నప్పుడు చేసిన చమత్కారం -

> అసదృశ తారమౌక్తిక సమంచిత నాయకరత్నమై సమం
> జస రుచిపుంజమై తన కుచంబుల మీద వెలుంగు హారమున్
> బిసరుహహస్త పుచ్చుకొని పెట్టె ప్రియంబునఁ జేరి 'తే నమః
> ప్రసవ శరాసనాయ' యని పల్కుచు భూపతి కంధరంబునన్

రాజు మృగాంకను చూచినప్పుడు—

"ఇంచుక నాపయిం బొలసె నిందు కరావళి ముంచి తెచ్చి పై
వంచిన పోల్కిఁ బువ్వువలవైచిన చాడ్పున కల్వదండ సా
రించిన లీలఁ దమ్మి విరిద్రిప్పిన భంగి, మెఱుంగుదీగ గ
ప్పించిన మాడ్కి వాలు జళిపించిన కైవడి నింతి నేత్రముల్"

మంచన నాటికి మధురమైన మనోభావచిత్రణం, అందాల ప్రకృతి దర్శనం మాత్రమే ఉన్నవిగాని ప్రబంధాల అంగాంగ వర్ణనం, ఉత్కట శృంగార విజృంభణం ఇంకా తెల్గుకవితలో కాలూన లేదు

తొలి తెలుగు రామాయణాలు

౧. భాస్కరం -

సంస్కృతంలో ఆదికావ్యం రామాయణం అయితే ఆంధ్రంలో ఆదిగ్రంథం భారతం అయింది

తిక్కన నిర్వచనోత్తర రామాయణం వ్రాసినా అది పూర్తి రామాయణం కాదు దానికి ముందే ఒక పూర్వ రామాయణం ఉంది ఉండాలనడం ఊహామాత్రమే -

అసలు సంపూర్ణ రామాయణ రచన అనేది క్రీ శ 14 శతాబ్దిలో జరిగింది ఈ శతాబ్ది పూర్వార్ధంలో భాస్కర రామాయణం పుడితే మధ్య కాలంలో ఎఱ్ఱన రామాయణం పుట్టి ఉండాలి ఉత్తరార్థంలో రంగనాథ రామాయణ రచన - అయి ఉంటుంది అని చరిత్రజ్ఞుల భావన

ఎఱ్ఱన రామాయణంలోవి అవి కొన్ని పద్యాలు లక్షణ గ్రంథాల్లోనూ, పరిశోధకుల ఉద్ధారాలలోను తప్ప పరిపూర్ణ స్వరూపం ఎక్కడా కనపడదు కాబట్టి తొలి తెలుగు రామాయణం భాస్కరమే అని చెప్పవచ్చు అయితే ఇది పేరుకు భాస్కరమే కాని అంతా భాస్కర కవి రచన కాదు ఇందులో అరణ్య కాండమూ, యుద్ధ కాండమూ మాత్రమే భాస్కర ప్రణీతాలు తక్కిన కాండల్లో బాల, కిష్కింధా, సుందర కాండలు భాస్కర పుత్రుడు మల్లికార్జున కవి రచిస్తే, అయోధ్యను భాస్కర శిష్యుడు కుమార రుద్రుడు రచించాడు యుద్ధంలో మిగిలిన భాగం భాస్కర మిత్రుడు అయ్యలార్యుడు పూరించాడు, ఈవిధంగా భాస్కర రామాయణం నాలుగు చేతులమీదుగా నడిచి గట్టెక్కింది

భాస్కరం, ప్రౌఢమూ, లాక్షణికమూ అయిన, తొలి

ఇది వినుకొండ ప్రాంతంలోని పరిమిత భాగానికి ప్రభువైన సాహిణిమారయ్యకు అంకితం, అయితే దీనికి ఉండవలసిన సరియైన కృత్యాది లేదు ఆద్యంతాలు శివాంకితంగాను - తక్కినవి సాహిణికి అంకితం గాను కనిపిస్తాయి. ఈ గ్రంథం 'రాముని శుభచరితంబును' అనే కందపద్యంతో ప్రారంభ మవుతుంది

ఈ రామాయణ కర్త మంత్రి భాస్కరుడా? మంగళంపల్లి భాస్కరుడా అనే వివాదం కొన్నాళ్లు సాగింది కాని భాస్కరుని చేతినుంచి వచ్చిన అరణ్య, యుద్ధ కాండల్లో, తిక్కన రచనను పోలిన పద్యాలుండడం చేత తిక్కన తర్వాత వచ్చిన మంగళంపల్లి భాస్కరునిదే ఈ రచన అని నిర్ధారణ అయింది ఇతనికే హుళక్కి భాస్కరుడనే బిరుదనామం యుద్ధకాండను పూర్తి చేసిన అయ్యలార్యుడు 'అమర హుళక్కి భాస్కర మహాకవి చెప్పగ - నున్న యుద్ధ కాండమును ' అని చెప్పడమున్ను పై నిర్ధారణకు బలమిచ్చింది

హుళక్కి భాస్కరుడు నన్నయ తిక్కనలకు సమాన స్కంధుడైన కవి భూషణకవి "మహామహిముల్ సోముడు భాస్కరుండు వెలయింపన్ సొంపు వాటించునీ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహింప చెదన్" అని చేసిన ప్రశంస శ్లేష చమత్కారమే కాక యదార్థ వచనమే అనవచ్చు

ఒక్క భాస్కరుని చేతిమీదనే ఈ రామాయణం అంతా పూర్తి అయి ఉంటే - తిక్కన భారతంతో దీటుగా నిలిచి ఉండేది అట్లా కాకపోయినా ఆయన దేశికత్వంలో పర్యవేక్షణలో కుమారుడు శిష్యుడూ విరచించి ఉండడం చేత ఆ లోటు కనిపించకుండా ఇది గణనీయమే అయింది ఆ గౌరవ భావం చేతనే దీనికి భాస్కర రామాయణ మనే పేరు చెల్లింది

భాస్కర రామాయణం వాల్మీకానికి అనువాదం కాదు వాల్మీకం ఆధారంగా ప్రవర్తిల్లిన స్వతంత్ర రచన అది వాల్మీకంలో లేని వింతలూ విశేషాలు ఎన్నో భాస్కరంలో ఉన్నాయి

వాల్మీకిని అనుసరించిన ఘట్టాలు, సన్నివేశాలు ఇందులో లేక పోలేదు గాని - అంతటా భాస్కర కవుల స్వతంత్ర ప్రవృత్తీ, స్వప్రతిభ, తమదైన ఒక పలుకు, విజృంభించి కనపడతాయి

తు చ తప్పకుండా ఆంధ్రీకరించామనే ఆధునికులకంటె పూర్వాంధ్ర కవులు సర్వస్వతంత్రంగా స్వప్రతిభాసము న్మేషంతో పురాణేతి హాసాలు తెనిగించారు అవి చదువుతున్నపుడు గాఢ ప్రతిభులైన కవుల స్వతంత్ర

రచనలు చదువుతున్న అనుభూతి కలుగుతుందిగాని – అడుగులో అడుగువేసి నడిచే అస్వతంత్ర గమనం కనిపించదు

పూర్వాంధ్ర కవులు మూల సంస్కృత గ్రంథాలను ఆధారంగా పెట్టుకుని స్వహస్త కౌశలంతో తైల వర్ణచిత్రాలు రచించారుగాని – ఆధునికులవలె పూర్వ గ్రంథాలకు 'ఫోటోలు' తియ్యలేదు వారిది సజీవ సృష్టి, వీరిది యాంత్రిక నిర్మాణం పూర్వకవులు సంస్కృతాన్ని తెలుగు అధీనంచేస్తే ఆధునికులు తెనుగును 'సంస్కృతాధీనం' చేశారు

భాస్కర కవుల తెనిగింపు సొగసు ఇట్లా ఉంటుంది

"ఎల్ల సుఖంబులు చేకొనఁ
జెల్లుట యౌవనమునంద - చిక్కిన మరి పా
టిల్లునె? వెన్నెల దినముల
నల్లో నేరేళ్లుగాక యావల గలవే?" సుందర 181

దీనికి మూలమైన సంస్కృత శ్లోకం చూచినప్పుడు దానికి ఇదేమి తెనుగు? అనిపిస్తుంది సంస్కృతంలో అర్థచమత్కృతి శబ్ద విన్యాసం ఆ నాటి ఋషి భావనకు తగి ఉంటే – ఈ నాటి తెలుగు మనస్సుకు తగిలేలా అదే భావనను తెలుగు జాతీయంతో తెనిగించడం ఒక నేర్పు

ఆ పద్యానికి మూలం ఇది –

"ఇదంతే చారు సంజాతం యౌవనం వ్యతి వర్తతే,
య దతీతం పున ర్నైతి స్రోత శ్శీఘ్ర మపా మివ"

"సీతా! నీ అందమైన యౌవనం వృథాగా గడచి పోతున్నది పరుగెత్తి పోయే నీటిప్రవాహం మళ్లీ వెనక్కు రాదుగదా!"

'పరుగెత్తే నీటివాగు మళ్లా వెనక్కు రాదనడం' సర్వసాధారణమైన ఉపమానం దీన్ని తెలుగు హృదయానికి దగ్గరగా తేవాలంటే వారిమాటల్లోనే, చెప్పాలి సుందర కాండకవి ఆ ఒడుపు చూపాడు

'సీతా! ఏ సుఖమైనా యౌవనంలోనే అనుభవించాలి వెన్నెల రాత్రుల లో 'అల్లో నేరేళ్లుగాని తర్వాత ఏముంది?'

అల్లో నేరేళ్లు అంటే ఇక్కడ పళ్లు కావు ఆడపిల్లలు వెన్నెలరేలలో గంతులు వేస్తూ పాడుకొనే పాటలు ఆ వెన్నెలపోతే ఆ ఆట పాటలు ఇంకెక్కడుంటాయి? అని చెబితే ఆ సంస్కృత భావం తెలుగులో మొలిచి నట్టుంటుంది

యౌవనాతి క్రమణంలోని శూన్యాన్ని, దిగులును ఈ దృష్టాంతంతో వ్యంజించడం ఎంత బాగుంది!

అఖరాలా భాస్కరకవి యుద్ధకాండ పద్యం ఈ క్రిందిది శుకుడనే చారుడు వానరసేనానివేశం చూచి వచ్చి రావణునితో, అందులో ప్రముఖం గా కనపడే రామచంద్రుని గూర్చి ఇట్లా అంటాడు

మృగ భాతిఁ బొలిచిన మీ మంత్రి మారీచు
పసిడి చర్మంబుపై పవ్వళించి
నీపేరు విన్నంతఁ గోపించి మండెడు
మిత్ర తనూభవు మీద వ్రాలి
నిను వాలమునగట్టి వనధుల ముంచిన
వాలి నందనునిపైఁ గేలు మోపి
అలనాడు మీసుతు నక్షునిఁ జంపిన
గాడుపు పట్టిపైఁ గాలు సాచి

మొనసి నీదు సహోదరి ముక్కుచెవులు
మోటు పరఁచిన ఖడ్గంబె ప్రోలఁ గ్రాల
ఖరుని దునిమిన శిత సాయకంబు మొక్క
దీర్చుచున్నాడు కంటె వైదేహివిభుడు - యుద్ధ 361

'కవీనాం కవిః' అయిన వాల్మీకి మహర్షి మాటలు కావివి భాస్కర కవి ఊహాలోని మెరుపులు!

రామచంద్రుని పరాక్రమం, అజేయత్వం, ఈ మాటల్లో ధ్వనించిన తీరు అతిలోక రమణీయం!

బంగారు లేడి అబద్ధం! దాని చర్మం అంతకన్నా అబద్ధం దానిమీద రాముడు పవ్వళించి ఉన్నాడనడంలో ఎంత ఎత్తిపొడుపు! నీవు పన్నిన

మారీచమాయను చీల్చి చెండాడిన రాముడు అడుగో! యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు నీ చెల్లెలి ముక్కు చెవులు చెండిన పదునుకత్తి పక్కనే ఉన్నది ఖరుణ్ణి హతమార్చిన బాణం కొంచెం మొక్క పోతే సవరిస్తున్నాడు ఆరాముడు!

శూర్పణఖ ముక్కుసెవులు కోసినవాడు లక్ష్మణుడు గాని రాముడు కాడు, ఇద్దరికీ అభేదం అనుకున్నా నిజంగా ఆకత్తి అక్కడ ఉన్నదా? సరిగ్గా ఖరుణ్ణి చంపిన బాణాన్నే సరిచేస్తున్నాడా

ఇక్కడ ఉన్న ఈ వాచ్యార్థాలకన్న వీనివెనక ఉన్న వ్యంగ్యం ఉజ్జ్వలం - నీ పరమాప్తుల్ని నిర్లక్ష్యంగా పరాభవించిన వాడు వధించినవాడు అదిగో అక్కడ కూర్చున్నాడు నిన్ను ముప్పతిప్పలు పెట్టినవారు అతని పరమ విధేయులు నీ భవిష్యం ఆలోచించుకో? అని చెప్పడం శుకుని ఉద్దేశం - అతని మాటలకు అంత పదును కల్పించినది తెలుగు రామాయణకర్త హృదయం! ఇదీ భాస్కర రామాయణ ధోరణి

పోతన్నగారు అన్నారట - 'రామాయణం నాచేతికి చిక్కలేదు గాని చిక్కితే బండ్ల కెక్కించనా?' అని

దానికి బదులు భాగవతాన్ని చేపట్టి ఆభక్తి పారవశ్యంతో దానిని పెంచి బండ్ల కెక్కించిన మాట నిజమే గాని - పూర్వ రామాయణాలను మాత్రం తిరస్కరించక - కవితా ధర్మంలో తనకు ముందు పుట్టిన భాస్కరాన్ని గురుపదంగా మన్నించినట్టు కనపడుతుంది

ఒక సమాపక క్రియను ముందువాడి, దానికి కర్మగా ఉన్నదానికి అంత్యాను ప్రాసలతో విశేషణాలను బిగించి పొంకంగా పద్యాన్ని నడపడం ఆయన భాస్కరం నుంచి స్వీకరించాడు

"అటఁజని కాంచి రంత వసుధాధిపు, లారతిలోల కిన్నరీ
ఘటిత గుహా కుటీ కనక కమ్ర కవాటము, సన్మణి ప్రభా
పాటదుర శృంగజూటము ... ...
బహుళ తాపస కూటము, చిత్రకూటమున్ -"

అనే అయోధ్యలోని పద్యమూ -

'రాకొమరుల్ గనుంగొనిరి రమ్యగుహాగత కిన్నరీకమున్,
స్వీకృత నాకసింధు జలసేకము, సంకుల దంతి దంత భిద్
భీకర పుండరీకమును . .ఋశ్య మూకమున్'

అనే అరణ్యకాండ పద్యమూ - పోతనార్యునకు భాగవత ప్రారంభ పద్యం నుంచి వాణీస్తుతి వరకూ ఎడతెగని ప్రేరణ ఇచ్చాయి ఈ అనుప్రాస పోతన చేతిలో కొంచెం 'అతి' అయి అర్థపుష్టిని పోగొట్టుకోవడం కూడా కద్దు

శబ్ద శిల్పంలోనే కాక భావ సౌందర్యంలో కూడ భాస్కరం పోతనకు ప్రేరకమయినట్టు చూస్తాం యుద్ధకాండంలో అగ్ని సీతను ఒప్పగించే సందర్భంలోని -

'మందార భూజంబు మరగిన భృంగికి
పిచు మంద శాఖపై ప్రేమగలదె?'

అనే పద్య భావం -

'మందార మకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు'

అనే పద్యంలో ప్రత్యక్ష మవుతుంది

భాస్కర కవులు అటు ఆది కవుల భావక్లిష్టినీ, రచనా సౌలభ్యాన్నీ, ఇటు లౌకిక కవుల ఆలంకారిక శైలినీ, భాషా ప్రౌఢినీ, అలవర్చుకుని రచన సాగించిన ప్రౌఢ కవులు ఐతిహాసిక విషయ ప్రాధాన్యం కంటె కావ్యశిల్ప సంపద విస్తరించడం వైపే వారి దృష్టి ప్రసరించినట్టు గోచరిస్తుంది

వాల్మీకం నుంచి భాస్కర కవుల వద్దకు వచ్చేసరికి రామాయణ కథ అనుకోని చాలా వన్నె చిన్నెలు సంతరించుకుంది రామాయణ పరంగా ప్రజల్లో వ్యాపించిన దంతకథలూ, అపూర్వ కల్పనలూ భాస్కరంలో చేరాయి అంతేకాక తర్వాత పుట్టిన సంస్కృత రామాయణాల కొత్త కథలు కూడా జనప్రీతికోసం ఇందులో ప్రవేశించినట్టు తోస్తుంది

1 గౌతముడు తన నాతిని రాతిగా శపించడం.

2 విద్యుజ్జిహ్వుని కొడుకు జంబు కుమారుణ్ణి లక్ష్మణుడు చంపడం,

3 నాగపాశవిమోచనానికి గరుడుని స్మరించమని నారదుడు చెప్పడం

4. హనుమంతుడు సంజీవనిని తేవడానికి వెళ్లేటప్పుడు ఎదురైన కాలనేమి వృత్తాంతం

5 ధాన్యమాలిని శాపవిముక్తి

6 శుక్రాచార్య ప్రేరణంవల్ల రావణుడు చేసిన పాతాళహోమం

7 అంగదుడు చేసిన మండోదరీ పరాభవం

8 విభీషణుడు రావణ వధ నిమిత్తం చెప్పిన అమృతకలశ కథ ఇత్యాదులు మూలరామాయణానికి భిన్నమైనవి అయితే ఇందు లోని అహల్యా శిలాశాపం, కాలనేమి జపం, ధాన్యమాలిని మోక్షం, రావణ నాభిలోని అమృతకలశకథ అధ్యాత్మ రామాయణ బాల (6 వ) యుద్ధ (7 8 సర్గలు) కాండల నుంచి వచ్చినట్టు కనపడుతున్నది పరిశోధకులు ఈ భిన్నకథలు ఆనందరామాయణం నుంచి కొన్నీ పశ్చిమోత్తర శాఖీయ రామాయణ ప్రతినుంచి కొన్నీ, వచ్చినట్టు చెబుతున్నారు నిజానికి ఈ రామాయణాలన్నీ ఆది వాల్మీకం తర్వాతనే పుట్టి ప్రజావళి ఉత్సుకతకోసం కొత్త కథలు చెప్పి మురిపించాయని తోస్తుంది

మొత్తంమీద భాస్కర రామాయణ కథనం, ప్రధాన కథాసూత్రానికి అడ్డు తగలక పాత్రల స్వభావానికి విరుద్ధంకాక - పాఠకుని ఉత్కంఠను పోషిస్తూ, హృద్యంగా నడుస్తుంది

కవుల వర్ణనశక్తివల్ల, వారి భావనాగరిమ వ్యక్తమవుతుంది భాస్కరం లోని అయోధ్యారణ్య, సముద్ర లంకావర్ణనలు వారి ఊహావధికి గొప్ప నిదర్శనాలు అట్టి వర్ణనల్లో కిష్కింధలోని ఈ వర్షావర్ణనం అపూర్వ మని పిస్తుంది

యమునద్గంగము, కృష్ణభూమదిల, మబ్జాస్యన్మనుష్యంబు నీ
లమహీధ్ర న్నిఖిలాచలావళి, తమాలద్భూజ, మిందీవరత్
కుముదశ్రేణి పికద్విహంగము, తమస్తోమద్గ్రహార్క ప్రభా
సముదాయం బగుచుండె లోకము లఘుశ్యామాభ్రముల్ గప్పినన్.

వర్షాకాలంలో నల్లని మేఘాలు ఆకాశాన్ని కప్పివేస్తే—
తెల్లనిగంగ యమున అవుతున్నది,
నేలంతా ఒకటే నల్లరేగడి,
మనుషులందరూ కృష్ణమూర్తులు,
కొండలన్నీ అంజనాచలాలు,
చెట్లన్నీ తమాల వృక్షాలు,
తెల్ల కలువలన్నీ నీలోత్పలాలు,
పక్షులన్నీ కోకిలలు,

సూర్యాది గ్రహకాంతులు చీకటి ముద్దలు - గా మారిపోతున్నాయి

ఇక్కడ కవి చూపించిన ఆర్థి[1] ఉపమానం సొగసు హృదయావర్జకమైనది ఆ సొగసు వెనక నిలిచిన వ్యాకరణ బలం కవి వ్యుత్పత్తిని పట్టియిస్తుంది

'యమునతి' అనే నామధాతువుకు శతృ ప్రత్యయం చేసి యమునత్ అనడం ఒక ప్రయోగ విశేషం కృష్ణశబ్ద పరమైన భూమి అకారాన్తమై కృష్ణభూమత్ అనడం మరో విశేషం

కవి ప్రతిభకు వ్యుత్పత్తి ఎంత దీప్తి తెస్తుందో దీనివల్ల గ్రహించవచ్చు

కావ్యానికి రసం ప్రాణమైనప్పుడు ఆ రసచిత్రణం ఈ భాస్కర కవుల చేతిలో ఎంత సార్థకమైనదో మనం చూడవచ్చు

అయోధ్య వెల్వడి సీత రామునితో అంటుంది

'ఆ నగరంబు వెల్వడి ధరాత్మజ వఱందర గానవచ్చు ను
ద్యానము జూచి కోమల కరాబ్జమునన్ భుజ మప్పళించుచున్
లేనగ వొప్ప 'నల్లి తరులే మనయేగెడు కాననంబు' నాన్
ఆననపద్మ మెత్తె వసుధాధిపు డశ్రువితాన పంక్తితోన్'

ఈ కరుణధ్వని గుండెను పట్టి లాగుతుంది

1. సమాన ధర్మము, ఇవాది వాచకము లేనిది, లుప్తోపమ (ఆర్థి)

ఇది సుందరం చివరి వానరుల ప్రవృత్తి—

> 'ఒక్కని వీపుపై కురికి ఒక్కరుడుండగ వానిమూపుపై
> నొక్కరు డెక్క వానితల నొక్కరుడెక్కగ నోలి దొంతులై
> దిక్కులనాడగా నొకడు తీవ్రత వారలగూలదన్నగా
> నొక్కడు వాని మూపున మహోన్నతి నెక్కుచు జీరుచుండగన్'

ఇట్లే కిష్కింధలో రాముని విప్రలంభం సుందరంలో రావణుని చెంత హనుమ వీరోక్తులు, పాతాళహోమంలోని భీభత్సం, ఇంద్రజిత్తుని రౌద్ర ప్రాగల్భ్యం, భాస్కర కవుల రస ప్రవణతకు నిదర్శనాలు

భాస్కర కవులు వాల్మీకాన్నే బహుళంగా అనుసరించినా కావ్య చమత్కారాతిశయంకోసం – ప్రసన్న రాఘవ నాటకంలోని భావాన్ననుసరించి 'ఈ తిగ్మాంశుడు (అర 268) అనే పద్యం, కుందమాల ననుసరించి 'ఘన రతి శ్రమ జాత' (కిష్కింధం) వంటి పద్యాలను వ్రాసి ఆయా సందర్భాలను మరింత దీప్తం చేశారు

వీరి ప్రభావం పోతనార్యుని మీదనేకాక సోమన, శ్రీనాథ, వసుచరిత్ర కారుల మీద కూడ కనబడుతుంది

'వల్లవీ వలమాన ఝల్లరీ' అనుపద్యం నడకచూచి 'లలనా జనాపాంగ వలనా వస దనంగ' వంటి వసుపద్యాలు అనుప్రాణితములైనట్టు గ్రహించ వచ్చు

భాస్కరుని పద్యవిద్యలోని హస్తకౌశలం భట్టారకుణ్ణి తలపింపచేస్తుంది

> 'వీచుల తాకునం బొడమి వెల్లువలై నవఫేన మాలికల్
> రాచిన రామకీర్తు లొగి లంక కళంకము బుచ్చి పై పయిం
> ద్రోచిన లీల కూలముల దొట్టి నిలింపుల దొప్పదోచె నా
> నాఽచలపాత జాత మకరాకర భీకర శీకరాకృతుల్ '

అరణ్యంలోని 'నెంలోని ఇట్టికి' అనే మాయా కురంగం, సన్యాసి యైన రావణరూపం, యుద్ధకాండలోని కాలనేమి ఆశ్రమం, ధాన్యమాలిని శాపమోక్షం వంటివి, భాస్కరంలోని మెరుగు గవ్వలుగా దర్శించ దగ్గవి

భాస్కర కవుల సంభాషణ చమత్కృతి ఇది

విభీషణుడు యుద్ధకాండలో అన్నమాట –

"మగమాటల్ మనకేల? నా డల హనూమంతుండు లంకాపురం
బెగువం గాల్పగ నెందుబోయితిమి? నేడెవ్వండు లజ్జింప, డే
తగవుం జెప్పడు, సీ! బుచ్చు మనః డా ధాత్రీశు నుల్కా సమా
శుగ వేగంబు దలంప, డింక నిదియుం జూడంగ నేరాజులన్"
యుద్ధ-123

యుద్ధ కాండలో ప్రారంభంలో రాముడు ఉంజ నేయునితో -

'తమ్ముడ విను మేనును నా
తమ్ముడు లక్ష్మణుడు నీ ‍కమ్మన గాదే
క్రమ్మఱ గలుగుట రఘువం
శమ్మిట రక్షింపనీక చనియె మహాత్మా!' (యుద్ధ 6)

అని అన్నమాట – తిక్కన ధర్మరాజు నోట అనిపించిన 'ఆపద గడవం బెట్టగ' అనేపద్యాన్ని జ్ఞాపకం తెస్తుంది

భాస్కర కవులు సలక్షణ భాషా ప్రియులు కాని వ్యవహార బలంతో 'కలరే అనడానికి 'ఎలారే' అనీ, 'మఱువక' అనడానికి 'మజాక' అనీ వ్రాయడానికి జంకరు అంతేకాదు వైరి సమాసమైనా 'మహా మంచి'దని నిర్భయంగా వ్రాయగలరు

వాల్మీకి రామాయణానికి సంక్షేపరూపంగా కావ్య గౌరవాన్ని ఇనుమడింప జేస్తూ, వ్రాసిన ఈ రామాయణాన్ని 'భాస్వర రామాయణం' అంటే ఇంకా ఎంత బాగుంటుందో అనిపిస్తుంది

ద్విపద రామాయణం

తెలుగు పాట ద్విపద తెలుగు వారి ఉత్సాహ, ఉద్వేగాలకు ఇది ప్రతినిధి ప్రజాసమూహంలో ఇది తెగ విరిగి ఉండడం వల్ల ప్రామాణికులైన మార్గకవులు దీన్ని యథాతథంగా కావ్య వృత్తంగా స్వీకరించక పోయినా దీని విస్తరరూపం తరువోజను అంగీకరించి ఆదరించారు. దేశి ఛ్ఛందస్సు, జాను

దెనుగు అనే నినాదం లేవదీసిన శైవకవులకు ఇది ప్రధాన కావ్యవృత్తం, భావ వాహిక, అయింది వారి ప్రచార ప్రాచుర్యంవల్ల దీని వెలి తీరి - ఒక గుర్తింపు వచ్చి ఒక మహాకావ్యానికి ప్రధానవృత్తమైనా అప్పు లేదని పించింది

దీని స్థాయి సంస్కృతంలోని అనుష్టుప్ వంటిది దాని నాలుగు పాదాలకు 32 అక్షరాలైతే దీని 2 పాదాలకు 30 అక్షరాల వరకు ఉండవచ్చు అయితే దీని ప్రాసవల్లా, గణ నియమంవల్లా లయనిబద్ధత ఎక్కువయింది కాబట్టి దీనికంటె అనుష్టుప్పునకు నడకలో స్వేచ్ఛ ఎక్కువ అందువల్ల దీనిని సర్వసాధారణ రచన లన్నింటికీ పురాణేతి హాసాలకూ, సర్వతోముఖంగా, వాడారు కావలిస్తే పాడవచ్చు లేకపోతే చదువుకోవచ్చు

రామాయణమంతా – సర్గాంతాలలో తప్ప - నష్టుప్‌లోనే ఉంది దాన్ని 'తంత్రీలయ సమన్వితంగా' కుశలవులు పాడి మెప్పించారు కాళిదాసు రఘువంశంలో 'గేయే కోను వినేతా వామ్' అని రామాయణాన్నంతటిని ఒక పాటగానే భావించాడు కనక - రామాయణాన్నంతనూ ఒక పాటలోనే ఎందుకు వ్రాయకూడదూ ? అనే ఒక ప్రబలమైన ఊహా కలగడం సహజం కాని ద్విపదలోని నిర్దిష్టమైన నడకవల్ల ఎక్కువ వైవిధ్యం చూపడానికి వీలులేక - కొంత దూరం వెళ్లే సరికి విసుగు రావచ్చు కాబట్టి పద్యరచనే మేలు అనుకున్నారు ముందువారు

అయితే 14 శతాబ్దంలోని ఒక తెలుగు కవి సాహసించి రామకథ నంతటినీ వాల్మీకాను సారంగా ద్విపదలోనే వ్రాశాడు దానికి రంగనాథ రామాయణ మని పేరు ఈ పేరు వల్ల రంగనాథుడనే కవి రచించాడనే భావం కలుగుతుంది కాని గ్రంథాదిలోను, అంతంలోను, గోన బుద్ధరాజు అనే ఆయన తన తండ్రి విఠ్ఠలరాజు కోరికమీద దీన్ని రచించి నట్లు విస్పష్టంగా ఉంది అయితే రంగనాథుని పేరుతో దీనికి ప్రసిద్ధి ఎలా వచ్చింది ? అనిప్రశ్న -

దీనిమీద చాల తర్జన గర్జనలు వచ్చాయి తండ్రి, పాండురంగ విట్ఠలనాథుడు గనక - అందులోని రంగ - నాథ - శబ్దాలను ఏరి, కవే సంక్షేపంగా రంగనాథ రామాయణం అని ఉండవచ్చు నన్నారు అది కిట్టింపు మాటగా తోచి చాలమంది ఆవాదం తిరస్కరించి – రంగనాథశబ్దం శ్రీ రంగనాథునకు రూఢం గనక ఇది పాండురంగనికి చెంద దన్నారు కొందరు బుద్ధరాజును

బుద్ధారెడ్డిని చేశారు రాజ శబ్ద పర్యాయాన్ని రెడ్డిగా మార్చ వలసిన అవసరం ఏమిటని ? కొందరడిగారు మరికొందరు, అనంతర కవులు రంగనాథుని కవిగా పేర్కొన్నారుగాని [illegible]ను కవిగా స్మరించడం జరిగిందా ? అని ప్రశ్నించి అనంతుడు, అప్పకవి, గోపరాజు రంగనాథుని కవిగా నుతించారుగాని బుద్ధరాజు పేరు ఎక్కడా కనపడ దన్నారు ఇంకొకరు మరికొంచెం ముందుకు వెళ్లి 'లక్షణ శిరోమణి' కర్త పొత్తపి వెంకట రమణ కవి 4 ఆశ్వాసంలో రెండుచోట్ల అచ్చవెల్లి రంగన్న గారి రామాయణ ద్విపద అని సహజస్వరయతికి, నిత్యసమాస యతికి ఉదాహరణ లిచ్చాడు గనక ఈ రామాయణ కర్త అచ్చవెల్లి రంగనాథుడయి ఉంటాడని ప్రతిపాదించారు

కాగా—

బుద్ధరాజు అనామకుడు కాడు

"కమనీయ బహుకళా గమ విచక్షణుడు
సుమనీషి పోషణోత్సుక సుఖోన్నతుడు
కవి సార్వభౌముండు, కవి కల్పతరువు
కవిలోక భోజుండు, కవి పురందరుడు"

అని రామాయణ ప్రారంభంలోను,

"అని ఆంధ్ర భాషాధీశ నిభుడు
వినుత కావ్యాగమ విమల మానసుడు
పాలితాచారు డపారధీశరధి
భూలోక నిధి గోనబుద్ధ భూవిభుడు"

అని కాండాంతంలోను ఉన్న మాటలు శుద్ధ అబద్ధాలేనా ? ఇట్టి మాటలు వ్రాసుకున్నవాడు ఎంత ప్రభువైనా - ఆనాటి అక్షరాస్యులకు హాస్యాస్పదుడు కాడా ? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి ఉంటుంది

రంగనాథ రామాయణం అనే పేరు మొదటి నుంచీ ఉండి ఉండదు కాలక్రమంలో - బుద్ధరాజు అనంతరమేనా కావచ్చు - దీనికి రంగనాథుడనే కవి తోడ్పడిన సంబంధం వెల్లడై అది క్రమంగా ప్రజల్లో వ్యాపించి రంగనాథ రామాయణంగా స్థిరపడి ఉండవచ్చు

రాజులకు రాచకార్యాలతో తీరిక ఎక్కడిది? అయినా అంత వైదుష్య కవితాశక్తులు ఎక్కడి నుంచి వస్తాయి? అనే అపోహ ప్రబలంగా ఉండడంవల్ల రాజును ఒకంతట కవిగా ఒప్పుకోకపోవడం ఉంది సంస్కృతంలో శ్రీహర్షుని మీద తెలుగులో శ్రీకృష్ణరాయలమీద ఈ అపనమ్మకం మనకు తెలిసినదే

కాని భోజుడు రాజైనా ఉద్గ్రంథాలు రచించాడు రఘునాథ నాయకుడు రామాయణాదులు వ్రాశాడు కాకతీయ రాజుల్లో కవులున్నారు

ఈ ఉదాహరణలవల్ల పై అపోహలు తొలగిపోవచ్చు కాని తొలగలేదు భోజాదులకు ఈ అపప్రథ రాలేదు కృష్ణరాయాదులకు వచ్చింది నిప్పు లేనిదే పొగరాదు ఏదో కొంత సంబంధం ఉండనిదే ఒకవాదు పుట్టదు కనుక ఒక విధంగా ఊహించవచ్చు

బుద్ధరాజు వాడుకున్న విశేషణాలవల్ల అతడు రాజమాత్రుడుగాకాక - కావ్యప్రియుడుగా సాహిత్య రసికుడుగా కనిపిస్తాడు కవి సార్వభౌముడు, కవిలోక భోజుడు అనే మాటలు పట్టి స్తుతిపరంగా ఎంచనక్కరలేదు పూర్వపు రాజులు ఎంత రాజకార్య నిమగ్నులైనా కవితా ప్రియులై భాషాభిమానులై, సన్నిహితులైన కవి మిత్రుల సాహచర్యంలో పాండిత్యము, కవితా సంపత్తి సంపాదించడం దుర్లభంకాదు అట్టివారు దీక్షతో రచనా ప్రయత్నంలో ఉన్నప్పుడు ఒక ఆశ్రిత కవి తుదికంటూ ఆ రచనలో తన అనుభవ విశేషం ఉపయోగించి అండగా నిలవవచ్చు మేలైన సలహాలు ఇవ్వవచ్చు ఆ విధంగా రంగనాథుడు తోడ్పడడం ఎరిగినవారు క్రమంగా రంగనాథుని పేరనే ద్విపద రామాయణాన్ని వ్యవహరించి ఉంటారు

ఇట్టి తోడ్పాటే కృష్ణరాయలకు పెద్దన్నగారిది ఉంటే ఆముక్తమాల్యద పెద్దనగారి రచనయేమో అనే కింవదంతి బయలుదేరింది అట్లాగే సంస్కృతంలో ధావక కవి శ్రీహర్షుని నాటకత్రయంలో సహాయపడి ఉండవచ్చు అంతమాత్రంచేత అన్యులచేత వ్రాయించి ఆ రాజులు తమ పేరు పెట్టుకున్నారనుకో నక్కరలేదు

పతావతా—

ద్విపద రామాయణకర్త గోనబుద్ధరాజే రంగనాథుని సహాయ సంపత్తి ఎరగినవారు తర్వాత రంగనాథ రామాయణం అనే వ్యవహారనామం పెట్టి ఉంటారు

బుద్ధరాజు రెడ్డి అని చెప్పే ప్రబలాధారాలు ఏవీలేవు ఆయన క్షత్రియుడూ కావచ్చు చతుర్థకులజుడూ కావచ్చు అది ఇదీ అని చెప్పడం సాధ్యంకాదు ఈ ద్విపద రామాయణంలోని తెనుగు తిక్కనకు తరువాతిది ఆధునికము అయినందువల్ల బుద్ధరాజు 1360-80 ప్రాంతంలో ఉండి ఉండవచ్చని మల్లంపల్లి వారి ప్రతిపాదనం

కాగా—

బుద్ధ భూవిభుని ద్విపద రామాయణం క్రీ శ 14 శ॥ తుదిభాగంలో భాస్కరం తర్వాత పుట్టి ఉంటుందని ప్రస్తుతానికి నిలిచిన అభిప్రాయం

ముందు పుట్టిన పద్య రామాయణాలు పండితైక వేద్యములూ, ప్రౌఢములు అయి ఉండడంవల్ల – తెలుగుజాతికి స్వీయవృత్తమైన ద్విపదలో ప్రజాబాహుళ్యానికి అందుబాటులో ఉండేలా పాటలా పరుగెత్తేలా–వ్రాయడం ఒప్పు అని ద్విపదరామాయణ కవి భావించి ఉంటాడు అంతే కాక ఏ జాను తెనుగుతో, దేశీయ వృత్తంతో, శివకవులు వైష్ణవాదులమీద దాడిచేశారో ఆ విధానంలోనే వైష్ణవ కథను ప్రజల్లో వ్యాపింప జెయ్యాలనే తలంపుకూడా ప్రబలంగా పనిచేసి ఉండవచ్చు

అన్నింటికీ ఫలితంగా తెలుగువారికి ఒక తమదైన రామాయణం వెలువడింది ఇది బాహ్యరూపంలోనె దేశీయం కాకుండా ఆంతర్యంలో కూడా తెనుగుతనం సంతరించుకోవడం చెప్పదగ్గ విశేషం

కవి 'వాల్మీకి చెప్పిన తెరగున' రామాయణం వ్రాస్తానని మాట ఇచ్చినా – వాల్మీకిని విడిచి - తెలుగు స్త్రీ బాలవృద్ధుల్లో - ఉన్న దంత కథలను కూడా ఈ రామాయణంలో చొప్పించాడు ఈ కథల్లో కొన్ని ముందుగా భాస్కరంలోనే ప్రవేశించినట్టు మనం చూచాము తర్వాత ఇందులో మరి కొన్ని విశృంఖలంగా ప్రవేశించాయి

అందులో ప్రస్ఫుటంగా కనిపించేవి ఇవి

(1) ఇంద్రుడు గౌతమాశ్రమంలో కోడై కూయడం

(2) లక్ష్మణుడు సీత బైటికి రాకుండా ఏడుబరులు గీయడం

(3) రాముని యెడల ఉడుతభక్తి

(4) సులోచన కథ

(5) లక్ష్మణుడు 14 ఏండ్లూ నిద్రపోనని ప్రతిజ్ఞ చేసి - పట్టాభిషేకా నంతరం నిద్ర సాక్షాత్కరిస్తే పక్కున నవ్వడం

ఇవి ముఖ్యంగా కనపడేవి ఇంకా చేసిన మార్పులు అనేకం ఉన్నాయి తెలుగు వారిలో 'రాతినాతిగజేసి' వంటి పాటలూ - ఉడతాభక్తి, లక్ష్మణ రేఖ, లక్ష్మణదేవరనవ్వు, ఇంద్రుడు - కోడి కూయడం - అనే నానుడులూ ఎవరూ తీసివేయలేనంతగా పాదుకొని ఉన్నాయి అవి లేకపోతే తెలుగు వారికి అది రామాయణమే అనిపించదు కనుక ద్విపద కవి వాటి నన్నిటినీ తన రామాయణంలో పొదిగి జన ప్రీతికి పాత్రుడైనాడని చెప్పవచ్చు

తళతళలాడే సులోచన కథను ఏ ఆనంద రామాయణపు అపురూప కథలనుంచో తెచ్చి ఉండవచ్చు ఈ విధంగా ద్విపద రామాయణం బాహ్యా భ్యంతరాల్లో తెలుగువారికీ దగ్గరగా తయారయింది అయితే ఇతడు వాల్మీకిని పూర్తిగా విడిచిపెట్టలేదు వర్ణనల్లో సంభాషణల్లో, రస సన్నివేశంలో కొంత వరకు పాత్ర సృష్టిలో వాల్మీకాన్ని గురుపదంగా స్వీకరించాడు కాని మొత్తంమీద స్వాతంత్ర్యమే ఎక్కువ

పాత్రల స్వభావాలు కూడా ఆదికవి ఉదాత్తతకు గాంభీర్యానికి అనుగుణంగా కాక తెలుగువారి ఆవేశాలకు, అహంకారానికి అనుకూలంగా రూపుదాల్చిన చోట్లు కనబడతాయి

రాముడు చిన్నతనంలో మంథర కాలు విరగగొడితే ఆమె పగ తీర్చు కోవడం, ధనుర్భంగ సమయంలో విశ్వామిత్రుడు దిక్పాలకులను హెచ్చ రించడం, జనకుని దగ్గర రాముని ప్రగల్భవచనాలు శ్రీరాముడు పరశు రామునితో పలికిన తిరస్కారోక్తులు, హనుమంతుడు రావణునితో పలికిన పరుషోక్తులు, నవదంపతులు సీతారాముల విహారం, దశరథుడు మితిమీరి కైకను బతిమాలడం ఆదికవి హృదయానికి అనుగుణమైనవి కావు

వాల్మీకి మహర్షి దృష్టిలో రామచంద్రుడు పురుషోత్తముడు మాత్రమే సూచనలు చేసినా భగవత్స్వరూపం ముందుకు తోసుకు రానీయడు మానవుడు గానే ఉంటూ మానవచరిత్రను దిద్దితీర్చే విధంగా ప్రవర్తిస్తాడు ద్విపద రామాయణంలో రాముడు దేవుడనే భావం స్థిరపడింది పరశురాముడు,

వాలి, నారదుడు మొదలైనవారు రాముణ్ణి స్పష్టంగా భగవంతుడుగా స్తుతిస్తారు

ద్విపద రామాయణం నాటికి రాముడు స్పష్టంగా దేవుడు ఇది అధ్యాత్మ రామాయణ ప్రభావం కావచ్చు

ద్విపద కవి ఎంత దేశీయాభిమాని అయినా వాల్మీకిని అనుసరించిన చోట్ల ఔనన్నట్లు రచించాడు

వాల్మీకంలో మారీచుడు రావణునితో 'నాకు రాముడంటేనే కాదు రకారం అంటేనే వణుకు పుడుతుంది అన్నచోట ద్విపదకర్త విపులీకరించి రంజకంగా చెబుతాడు

"రవమన్న రథమన్న రమణీయమన్న
రవియన్న రతియన్న రత్నంబులన్న
మఱియు రేఫాదినామము లెవ్వియన్న
దఱుచైన భీతి నాతని నెన్నుదును'

ఇతడు గూడ సూచనగా ప్రసన్న రాఘవాది ఇతర రచనల పోకడలను గూడా అందంకోసం తన రామాయణంలో చొప్పిస్తాడు

'ఇదియేమీ ఈరాత్రి ఇనుడేల పొడిచె
నా మేని తాప మిన్మడి గాగ జొచ్చె
సౌమిత్రి నను తరుచ్ఛాయల జేర్చు'

అనే భావం ప్రసన్న రాఘవానుసారి అయితే

"పాయని ఈ జల్లు పయ్యెదచీర
కీ యవస్థలు వచ్చె నేమనగవచ్చు?
పన్నీటి నా పాదపద్మమ్ముల్ కడిగి
ఉన్నతి తడి యొత్తు లొత్తును దీన
నురటి గావించి భాసురలీల దీన
భరిం శ్రమాంబువుల్ పలుచగా జేయు"

అవే సీత పైట చెంగును గూర్చి రాముడన్న మాటలు కుంద మాలలోని ఉత్తరీయ సందర్భాన్ని స్ఫురింప జేస్తాయి "విడుతు ప్రాణమునైన విడుతు

నిన్నైన విడుతుఁ దమ్ముని నైన - విడుతునే ప్రతిన" అన్న పలుకులు భవభూతిని తలపిస్తాయి

ఆనాటి సంస్కృత కావ్య నాటకపరిచయం ప్రకరణానుకూలంగా ఇట్లా చొచ్చుకు వచ్చినా - ఇతని దేశీయ రచనాభిమానంలో అది సముద్ర గర్భంలో నీటిబొట్టులా లీనమయిపోయింది

ధనుర్భంగానికి ముందు సీతాకుమారికి చేసిన అలంకారం, సీతారాముల పెళ్లితీరు అచ్చపు తెలుగు అభిరుచికి, ఆచారానికి చెందినవి

దశరథుడు పరశురామునకు భయపడి స్త్రీల మరుగు చొచ్చినా డనడ మున్నూ తెనుగు కథల సారమే

కిష్కింధలోని శకునములు బల్లి, చిలుత, గబ్బిల్లు రొప్పుట తెలుగు వారి విశ్వాసమే

హనుమ రామునకు మాకంద ఫలమిచ్చుట తెలుగున శుభసూచనం మాకంద మనగా మామిడిపండు

వాల్మీకంలో లక్ష్మణుడు అసలు నిద్రమానిన ప్రసక్తిలేదు అందులో రాముడు నిద్రిస్తున్న లక్ష్మణుణ్ణి లేపిన సందర్భమున్నూ ఉంది అట్టి సందర్భంలో ద్విపద కవి ఈ కల్పన, తెలుగుజనం చిరకాలం నుంచి చెప్పుకునే కథనుంచి వచ్చి ప్రవేశించింది ఇదే తెలుగు ఇల్లాండ్ర 'లక్ష్మణ దేవరనవ్వు' లో మనకు దర్శన మిస్తుంది

నిద్ర లక్ష్మణుడితో అన్నమాట—

ఏను నిద్రాదేవి నేర్పడ దెల్పు
మా ! నాకు నింకెట్లు మానాథ్య ! యంత
విధి విధించెను వెంటవెంట వర్తింప
విధ మదియేమి నే విడచుట కింక ?
ననిన 'నూర్మిళయందు నహరహంబునను
జనియుండు మంత నీ సమయంబు దీర్చి
వచ్చిన గైకొందు వరుస నిన్ననిన
నిచ్చ నౌ గాకంచు నేగె నిద్రయును'

అట్లా ఒడంబడిక చేసుకున్న నిద్ర పట్టాభిషేకానంతరం లక్ష్మణుని వద్దకువస్తే - ఆయన పదునాలుగేండ్లు మరచిపోయిన నిద్దుర కనబడితే పక్కున నవ్వాడు అదే 'లక్ష్మణదేవర నవ్వు' అయింది

ద్విపదకవి వాల్మీకి కథా సన్నివేశంలోని వర్ణనలు అనుసరించినా తన ఉపజ్ఞను తాను ఎన్నడు జారవిడుచుకో లేదు

అరణ్యకాండాంతంలో హేమంత వర్ణనం వాల్మీకానికి అలంకార ప్రాయమైనది దానిని తానూ స్వీకరించినా -

'కనుగొంటివే శీతకాలంబు మహిమ !
దెసలెల్ల చలికి భీతిలి దెలిపట్టు
ముసుగు పెట్టినయట్లు ముంచె హిమంబు'

అని అందుకొని 18 పంక్తులు స్వీయ భావనతో వెలయించి

"అడవి యేనుగులు నీరాన నీనదికి
దుడి దుడి వచ్చి తత్తోయంబు దొడికి
నడికి గిట్టనుచుఁ దొండములు వేవేగ
ముడిచి పాఱెడిని తమ్ముడ విలోకింపు !"

అనే వాల్మీకి భావాన్ని తెలుగు మాటల తీపులోనికి మరలించాడు

సీత రావణుని తిరస్కరించిన తీరు వాల్మీకిదే ఐనా తెలుగు ఇల్లాలి చురుకు దనం కనబడుతుంది

"ఎన్నగ నీకునా ఇనకులాగ్రణికి
నక్కకు సింహంబు నకును, దోమకును
దిక్కరికిని పయోధికిని కాల్వకును
వాయసంబునకును, వైనతేయునకు
నేయంతరువు పెద్ద నేర్పరింపుదురు
నా యంతరవు గలదు . ..... "

సీతా పహరణం తర్వాత రాము నంతటి వాని ఈచిత్తవిభ్రాంతి కరుణరస ప్లావితం అనిస్తుంది

"ఏ దెస బోయెనో ఇందీవరాక్షి ?
ఈ దెసగాదొకో - ఇది పర్ణశాల
గాదొకో, ఇది దండకావనభూమి
గాదొకో ! రాముడ గానొకో నేను ?
నైన నా ప్రాణంబు లకట ! నాబోంది
లో నెట్టులున్నవి లోలాక్షిఁ బాసి ?

ఈతని కరుణరస సృష్టి రాముని విప్రలంభంలో పరసీమ నందుకుంది

"అలసయానముల బాగంచలకిచ్చి
లలితాంఘ్రిరుచి ప్రవాళంబులకిచ్చి
వరకుచోన్నతి చక్రవాకులకిచ్చి
రదముల యొప్పు వజ్రంబులకిచ్చి
పొదలు మై తావులు పూవులకిచ్చి
సన్నపు నడు మాకసంబునకిచ్చి
నిన్ను దైవము మ్రింగెనే సీత యనుచు"

ఇందలి సులోచనా వృత్తాంతం ఈతని కవితకు కలికితురాయి అందు లోని పాత్ర చిత్రణం, సులోచన రూప గాంభీర్యం కన్నులకు కట్టినట్టుంటుంది

"చనుదెంచి యరదంబు చయ్యన డిగ్గి
పుత్తడి బొమ్మయో పొసగంగ మొదల
కొత్తగు ముత్తెమో కొదమ రాయంచో
అనగ సన్నపు నడుమసి యాడు చుండ
కనుగవలను బాష్ప కణములు దొరుగ
నందందు దూలుచు నురుసు రనుచు
మందయానంబున మగువ రాఘవుని
గదిసి సాగిలి నమస్కారంబు చేసి ..

ఇతడు ఉపజ్ఞావంతుడైన కవిఅనడానికి ఇతని సముద్ర, చంద్ర వర్ణనలు, లంకాదహన వర్ణనం మొదలైనవి తిరుగులేని ఉదాహరణలు

ఈ కవి ద్విపద రామాయణం వ్రాసినా, శివకవులవలె జానుదెనుగు పట్టుదల వహించకుండానే కమ్మని తెనుగును, మృదువైన సంస్కృతాన్ని వాడి సమతా గౌరవం పొందిన ఉత్తమ కవి

ఈ రామాయణం మధ్యాధికారులనే కాక ఉత్తమాధికారులను కూడా మెప్పించే ఉద్గ్రంథం అని చెప్పడానికి ఎట్టి అభ్యంతరం లేదు

ఎఱ్ఱన భారతాదికం

ఎఱ్ఱన రచనలుగా ప్రసిద్ధమైనవి నాలుగు 1 రామాయణం, 2 హరివంశం, 3 అరణ్యశేషం 4 లక్ష్మీనరసింహావతారమనే పురాణకథ

ఆయన రచనాక్రమం కూడా ఇదే అనడానికి ఉపపత్తులున్నాయి

ఎఱ్ఱన రామాయణం ఇప్పుడు దొరకదు ఆతని రామాయణం లోనివని ఊహించి కొందరు ప్రకటించిన పద్యాలు సంశయాతీతములుగా లేవు

రాఘవ పాండవీయంలో సూచన చేసిన కవిత్రయస్తుతిని బట్టి ఎఱ్ఱన రామకథను వ్రాసినట్టున్నూ అప్పటివరకు ప్రసిద్ధి ఉన్నట్టున్నూ స్పష్టం హరివంశ పీఠికలో కృతిపతి వేమారెడ్డి 'రామకథ మున్ జెప్పించి' అనడం, కవి స్వయంగా చెప్పిన మాట – కనుక హరివంశానికి ముందు రామాయణ రచన ఖాయం అట్టి రచన ఎందుచేతనో విన్పష్టమయింది దాని స్వరూప స్వభావాలను గురించి ఊహించడం ఆకాశ విహారం, ఇక రెండవది హరివంశం ఇది క్రీ శ 1325-53 నడుమ అద్దంకి రాజధానిగా రెడ్డిరాజ్యం పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డికి అంకితం కనుక ఎఱ్ఱనగారి కాలమూ అదే

ఎఱ్ఱన కవితాశక్తికి కళాదర్శనానికి, పాండిత్య ప్రకర్షకు ఈ గ్రంథం తారకాణ ఇది ఒకటి వ్రాసి ఊరుకున్నా ఆయన స్థానం భారత కవిత్రయంలో చెక్కుచెదరనిదే అనిపిస్తుంది పలనంటే – హరివంశంకూడా భారత పరాంశమే కనక——

తర్వాత అరణ్యపర్వ శేషం తెనిగించి ఉండాలి హరివంశ రచనకంటే అరణ్య రచన ధారాళము, ప్రసన్న గంభీరమూ అయి ఉండడం ఈ ఊహకు ఆధారం అంతేకాదు – ఆయన చేయి తిరిగిన కవి అయేవరకు

నన్నయ తిక్కనలు చేపట్టిన భారతం మీద చేయివేయడానికి సాహసించి ఉండడు ఎందుచేతనంటే-తిక్కన్నగారి సమకాలికులైన కేతన, మారనాదులు భారతంజోలికి పోకుండా తమకు తోచిన రచనలు తాము చేసుకున్నారు

హరివంశ రచన తర్వాత కలిగిన ధైర్య సాహసాలు ఎఱ్ఱనచేత ఆరణ్యశేష రచన చేయించి ఉంటాయి అనుకోడానికి వీలుంది

తరువాతది నృసింహావతారం ఇది బ్రహ్మాండ పురాణంలోని కథను తీసుకుని చేసిన స్వతంత్ర రచన ఇందులో ఎఱ్ఱన కవితా పరిపాకదశ కన బడుతుంది

ఎఱ్ఱన బిరుదులు ప్రబంధ పరమేశ్వరుడు, శంభుదాసుడు 'సంస్కృతాది చతురోక్తి పదంబుల కావ్యకర్తలై ఎన్నికమై ప్రబంధ పరమేశుడనగ' అని ఎఱ్ఱన తాతగారి మాట 'కావ్యంకర్త' అన్నమాటలో రామాయణ హరి వంశాలు దాగి ఉన్నాయని అనుమానించదగి ఉంది రామాయణం మాట తెలియదు గాని హరివంశం మాత్రం ఆయన ప్రతిష్ఠను పెంచి, ప్రబంధ పరమేశ్వర పదానికి అర్హుణ్ణి చేయగిలది అనుకోవడానికి ఏమీ అభ్యంతరం లేదు

సంస్కృత మూలం ఉన్నా దాని వాసన ఏమీ తగలకుండా తెలుగులో ప్రౌఢ సుందరంగా హరివంశ రచనసాగి నన్నయ తిక్కనల తర్వాత ఆ స్థాయిలో మళ్లా ఒక ఉద్గ్రంథం పుట్టింది అనే అనుభూతి కలుగుతుంది ఆ భావన తీరు, హృద్యమైన వర్ణనలు, పతన్మాత్రులకు సాధ్యంకాని వనిపిస్తాయి

ఆయన జన్మతః కవి ఆ ప్రతిభ సోపానక్రమంలో ఎదిగి ఆరణ్య పర్వశేష రచనలో స్థిరపడి నృసింహ రచనతో పరాకాష్ఠ చేరుకుంది

నృసింహం చదివిన తర్వాత మహాగ్రంథితాశ్రేణిలో ఆయన ప్రబంధ పరమేశ్వరుడే అనే నిశ్చయ భావం కలుగుతుంది

రామాయణ హరివంశాలు వేమారెడ్డివి ఆరణ్యశేషం రాజనరేంద్రునిది కనుక మూడూ నరాంకితాలేఅయి ఒక్క నృసింహపురాణం మాత్రం భగవదర్పితంగా తేలింది తిక్కనార్యుడు నిర్వచనోత్తర రామాయణం రాజాంకితంచేసి భారత రచనను భగవదర్పితం చేసినట్టు ఈయన కూడా తన పూర్వరచనలు

పురుషాంకితాలు చేసి తుదిరచనను భక్తితో పురుషోత్తమాంకితంచేసి ధన్యుడై నాడని చెప్పవచ్చు

ఎఱ్ఱన సహజంగా తిక్కనవలెనే ముందు శివభక్తుడు

"గిరిశ పద భక్తిరస త
త్పర భావము కలిమి శంభుదాసుం డనగా౯
బరగియు గోవింద గుణా
దర సంభృత సౌమనస్య ధన్యుడ వెందున్"

అని ఆతని తాత మాట –

'శంకర స్వామి గురుండు మా తలపు
సర్వము దానయి యుండు గావుత౯ హరి ౧,

అని హరివంశంలో కవిమాట తన గురువు శంకరస్వామి మహాశివ భాగవతుడు అట్టి గురుదేవుడు తన తలపులో నిండి ఉండుగాక అని కోరిన శంభుదాసుడు ఎఱ్ఱన అయినా 'గోవింద గుణాదర సంభృత సౌమనస్య ధన్యుడై' శివకేశవ భేదంలేని అద్వైతిగానే రాణ కెక్కాడు

ఎఱ్ఱన తన రచనలో ఇతరులు తన్ను గూర్చి అన్నట్టుగా వ్రాసుకున్న మాటలు స్వోత్కర్ష గాను, అతిశయోక్తులుగాను కనిపించక – యదార్థములే అనిపిస్తాయి

వేమారెడ్డి 'సకల భాషా కవిత్వ విశారదుడవు' అన్నాడు స్వపితా మహుడు 'ప్రబంధ రచనా ప్రావీణ్యము నీకు సహజ పరిణత సిద్ధంబై వెలసిన యది' అని పలికినాడు ముఖ్యంగా పై రెండు మాటలు కవితాకళకు చెందినవి

సాంఖ్య, యోగ మీమాంసాది శాస్త్ర పరిజ్ఞానం, హరివంశ, నృసింహ పురాణాలలో కనబడుతుంది బహుపురాణ కథా విస్తర వేది' అయినట్టుకూడా హరివంశాదులవల్ల తెలుస్తుంది ఇంత సాధన సామగ్రి వెనుక ఉంచుకొని ఆయన కవిత్వావతరణం చేశాడు

గంగా యమునల మధ్య సరస్వతిలా నన్నయ తిక్కనల మధ్య నిలిచి ఎఱ్ఱన తన దృశ్యాదృశ్య దర్శనంతో శరత్ప్రసన్న వాణితో ఆంధ్ర కవితా ప్రియులను అలరించాడు

నన్నపార్యుడు ఆరణ్యపర్వంలోని 'శారద'ను ఎఱ్ఱనకు అందిచ్చి తాను తప్పుకున్నాడు. ఆ శారదను అంజలిపట్టి పరిగ్రహించి 'నన్నయ పరస సాహిత్యతారక ప్రశస్తి' తన్ను చెందగా 'తత్కవితారీతియు కొంత తోచ' ఎఱ్ఱన ఆ పర్వశేషం పొసగునట్లు నిర్వహించాడు.

మార్కండేయుడు సరస్వతీ గీత అనే ఇతిహాసం చెబుతూ తార్క్ష్యుడనే ముని భారతిని స్తుతించిన విధం చెప్పాడు. సరస్వతి ప్రత్యక్షమైంది, పిలిస్తే పలికినట్టు!

ఆమె శారద చంద్ర చంద్రికాచారుమూర్తి
'భావాంబర వీధి విశ్రుత విహారిణి'

అటు ఆ మునికి ప్రత్యక్షమైనట్లే ఎఱ్ఱన్నగారికిన్ని శారద చంద్రికవలె విశ్రుత విహారంతో ప్రత్యక్షమైంది.

నన్నయ భట్టారకుడు శారదను అర్చించింది రెండు పద్యాలతోనే. ఆ ప్రేరణతో ఎఱ్ఱన అదే అచ్చుకట్టులో ప్రౌఢ సుందరమైన 5 పద్యాలు వ్రాసి శారదామూర్తిని పూజించాడు.

ఆ పూజావేళ ఇట్టిది—

'స్ఫుర దరుణాంశు రాగరుచిఁ బొంపిరివోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతర హంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగగా
కరము వెలింగె వాసర ముఖంబులు శారదవేళ చూడగన్'

ఎఱ్ఱన ప్రవేశంతో అరణ్య పర్వశేషం మీద ఉన్న నీరదావరణం తొలగి పోయింది. కవితా సౌరభం విజృంభించింది. మధువ్రత హంసముల వంటి కావ్య ప్రియులు ఉల్లసిల్లారు. ముడుచుకున్న ఆంధ్ర కవితా సతీముఖం వికసించి కరము వెలిగింది.

అక్కడ నుంచి 'తత్సర్వం ధర్మ వీర్యేణ యథావత్ సంప్రపశ్యతి' అని వాల్మీకంలో చెప్పినట్టు ఎఱ్ఱన యోగ శక్తితో పరకాయ ప్రవేశంచేసి నన్నయ గొంతితో పలికాడు.

"చతురంభోధి పరీత
క్షితితల సామ్రాజ్యలక్ష్మికిం బతివి జగ
న్నుత! నీక నీవు దలచిన
నతి దుష్కర మెందులే దనర్గళ మహిమన్" ఆర ౪-161

ధారాశుద్ధిలో నన్నయ్య శయ్య పుణికి పుచ్చుకున్నట్టున్నది గదా - తుదకు ప్రాస లంకడంలో నన్నయగారికి ఊతపదమైన 'జగన్నుత' కూడ వచ్చింది

ఈ పద్యంలోని నాదమాధుర్యం కూడా భట్టారకుణ్ణే తలపిస్తుంది

"శంకర సన్నిభుండు జనకంబు సత్కరుణాకరుం డసా
తంకు డొకండు డమ్మని స్థిరంస్థితియై మరుభూమి యందు ని
శ్శంక మతిన్ వసించి యనిశంబును నవ్యయు నచ్యుతున్ మనః
పంకజ వేదిపై నిడి ప్రసన్నుఁ బొనర్చె ననేక వర్షముల్" ఆర ౪-374

ఈతనికి ఆరణ్య పర్వ శేషంలో దక్కిన కథలు - 1 ధర్మవ్యాధుడు 2 సత్యాద్రౌపదీ సంవాదం 3 ఘోషయాత్ర 4 రామాయణం 5 సావిత్రి 6 కర్ణజననం 7 యక్షప్రశ్నలు

ఇందలి ధర్మవ్యాధ, ఘోషయాత్ర, సావిత్రి కర్ణజనన కథలు ఇంపుగా చదవదగ్గవి

ధర్మవ్యాధ కథలో - కులంకంటె గుణం గొప్పది, క్రోధాహంకారాలతో బ్రాహ్మణుడు కొక్కెరను చంపగలిగాడు గాని పతివ్రత దగ్గర కొఱగాక ఆమె బోధవల్ల కళ్లు తెరచి ఒక బోయవద్ద ధర్మ రహస్యాలు తెలుసుకోవలసి వచ్చింది అందలి పాత్రల చిత్త వృత్తులు, వాక్చాతురి, వివేకపాకం దర్శనీయమైంది

పతివ్రత కౌశికునితో అన్నమాట—

క్రోధమోహ నామకులైన ఘోరశత్రు
లిరువు రెదయించు చుండుదు రెపుడు నంత
రంగ మయ్యుభయంబు నసంగకున్న
కలదె యూరక బ్రాహ్మణ్య గౌరవంబు? ౫-23

ధర్మ వ్యాధుడంటాడు—

> 'మాతహితంబుగా బలుకు బొంకును సత్యఫలంబు' ౫-62

> 'పాపవర్తనుండు బ్రాహ్మణుండగును
> నిజము శూద్రుకంటె నీచతముడు' ౫-137

సావిత్రి త్రిరాత్రోపవాస దీక్షలో ఉండి నవ్వుతూ అంటుంది—

> 'ఉపవాసశ్రమ మించుకేనియును నా యుల్లంబునన్ దోప దీ
> విపినం బుజ్జ్వల పుష్ప పల్లవ ఫలాభిఖ్యాల నానా లతా
> గ్రి పరీతంబగు నందు జూడగ మదిం గౌతూహలం బయ్యె న
> న్నుపరోధింపకు మింతపట్టు చనని యుక్తుండవ వెబ్బంగు న్ ౨-207

ఇక్కడ ఎక్కిన కథలలోని సొగసులును చూడదగ్గవి.

ఎఱ్ఱన రచనలలో ఉద్గ్రంథం హరివంశం. హరివంశం యొక్క తక్కిన అవతార విశేషాలు క్లుప్తంగా ఉండి ఇందులో కృష్ణావతార కథా సౌందర్య ప్రస్తారమే ఎక్కువగా కనబడుతుంది. పోతరాజు భాగవతమే ప్రామాణికంగా ఉండే ఆ స్థానంలో నిలబడగలిగింది ఒక్క హరివంశమే. జ్ఞానం వెన్నంటగా భక్తి మాధుర్యం వెల్లివిరియించి పోతన భాగవత కథలు చెబితే ఎఱ్ఱన భక్తిని వెనక ఉంచి జ్ఞాన ప్రకాశంతో సంయమనంతో హరివంశం నిర్వహించాడు.

'ఉన్నత గోత్ర సంభవము' 'ఉద్ధతాంఘ్రి ప్రభావి' 'మదోత్కటము' 'నరేంద్ర పూజోన్నయ నోచితంబు' అనే విశేషణాలు నన్నయ భట్ట కుంజరానివే కావు. ఈ ప్రబంధ పరమేశ్వరుడికి కూడా చెందవలసినవే.

ఈ రచనలో ప్రారంభం నుంచీ ఒక [illegible], ఊర్జస్వలత అంతర్లీనంగా కనపడతాయి.

> శర్వాణీ స్తన చక్రవాకములు పత్యుః స్ఫార సంసారమున్
> గర్వంబింపెసలారగాం దగిలి వేడ్కల్ సల్ప రోమాంచమున్
> సర్వాంగీణముగా ధరించికొని యుచ్చన్ బేర్చు శంభుండు స
> ర్వోర్వీపాలుర దక్కు వేమనృపు నత్యూర్జ స్వలుం జేయుతన్

ఇందులో శంకరుని మీది భక్తికంటె తన కవితమీద భక్తి కుదిరించినట్టు గోచరిస్తుంది.

హరివంశంలోని శ్రీకృష్ణుని బాల్యం అక్రూర సమాగమం కంసవధ, జరాసంధ యుద్ధం, రుక్మిణీ కల్యాణాదులలో ఆయన శబ్దశక్తి, కవితా ప్రతిభ, ప్రఖ్యాతమవుతాయి. అంతేకాదు గోప గొల్లవేషంలోని మూర్తి కల్పన, వసంత గ్రీష్మాది వర్ణనములలోని ప్రకృతి పరిశీలనం, విష్ణుస్తుతిలోని తత్త్వజ్ఞానం ఈయన ప్రబంధ పరమేశ్వరత్వాన్ని ప్రతిష్ఠింప జాలినవి.

కాళీయునకు లొంగినట్లు నటించే బాలకృష్ణునితో బలభద్రు డంటాడు—

"ద్వైతభ్రాంతి నివృత్తిఁ బొందఁగ నభేద బ్రహ్మ బోధంబు సం
భూతంబైన నశేష బంధ కులముం బోద్రోచు సిద్ధాత్ము న
ట్లాతం డమ్మెయి నాత్మ తత్త్వవిదుడై యప్పాపచుట్టల్ విని
ర్ధూతిం బొందఁ నీల్గి బిట్టు నెగసెం దోయౌఘ[illegible]బునన్"

ఇట్టి గభీర పారమార్థిక రహస్యం చెప్పిన నోటనే కన్నతల్లి చేతి అమృత స్పర్శను మెత్తని తెలుగు మాటలతో చెప్పడమూ ఈయనకి చేతనవును.

"ముదముతో నడ్డునకు బెట్టి మూతి జిడ్డు
మోమునను మేన జమరి యమ్ముదిత యక్కు
గలయ నిమురుచు, నేనుగు దిన్న వెలగపండు
నాగ నొప్పుఁ గృష్ణుఁడు చారునయనుఁ డగుచు"

కృష్ణుని ఈ బాల్యరూపచిత్రణం కవి చాతుర్యానికి పరసీమ అనిపిస్తుంది.

"నోరం జేతులు రెండు గుక్కి కొనుచుం మోమెల్ల బాష్పాంజన
స్మేరంబై తిలకింప నేడ్చుచు ఁబొరిన్ మీఁజేతులం గన్నులిం
పారం దోముచు లేవఁజూచి పిరు దొయ్యన్ మీది కల్లార్చుచున్
శ్రీరమ్యాంఘ్రియుగంబు గింజు కొనుచుం జెల్వంబు రెట్టింపగన్"

ప్రబంధ పరమేశ్వరుని కవితా ప్రభావం తర్వాతి నాచన, శ్రీనాథ, పోతనాదుల మీద స్పష్టంగా కనబడుతుంది. ముడి పదార్థంగా ఇచ్చిన ఎఱ్ఱన పలుకునే శ్రీనాథాదులు తమ జిలుగు పనితో తళతళలాడించారు.

శ్రీనాథ, సోమనాథులకు మూలమైన ఎఱ్ఱన పలుకు—

శ్రీ స్తన కుంకుమద్రవ నిషిక్త 2 37
మెచ్చక యెదురైన క్రొవ్వాడి కోఱలు త్రెవ్వరాచి 2 119
పాపముల క్రుస్సన 2,127
హరి ఉత్తర ౬ ఆ"

శివ వర్ణనము - అపూర్వ భావుకత —

"జొదలఁ జదలేటి లేఁదరఁగలు బాలుఁ
డగు చందమామ నుయ్యాల లూప
నొడవులఁ దలల జెన్నడరు మానికముల
చాయ దిక్కుల నెఱసంజ పరువ
దోరంపు కేనిరతోలి యే త్తైఱ కప్పు
కుత్తుక కఱతోడఁ బొత్తుసేయ
దిట్టంపు పులి దిండ్లు బూది సరచిం
పునుకల పేరురంబునఁ దలిర్ప

"మూడు లోకంబులను గావ మొనసినట్లు
చేత ముమ్మొనకైదువు చెన్ను మీఱ
వేల్పుఁ జదువు చూడ్కికిఁ గడు వింత వేడ్క
సేసె ముక్కంటి యున్న యాచెలువు పేర్మి" 38

హరిఁ జూతురు హరుఁ జూతురు
హరిఁ జూతురుఁ గ్రమ్మరంగ హరుఁ జూతురు ని
ర్జరులును మునులును నిమ్మెయి
హరిహర తత్త్వయుగ సమ్మితాకను లగుచున్ 39,

యజ్ఞరక్షకుడును యజ్ఞ విధ్వంసియు నై లోకనుతుల బెంపారువారు
కందర్ప జనకుండు గందర్పదర్పైక దమనుండునై లీల దనరువారు
భువన సంభర్తయు భువనసంహర్తయు నన నాత్మగుణ కృత్యులైన వారు
భూధరోద్ధారియు భూధరావాసియు నగుట నిత్యప్రీతి నెగడు వారు

"అంబుధి జాతంబులగు రత్న విషములు రమఁ
గన్నఁ గంఠంబుఁ గై సేయ నొప్పు వారు
భుజగ శయనుండు భుజగ భూషణుండు
నెపుడు గరుణతో వరదు లయ్యెదరు మాకు" -41

దేవతలందరు 'హరి హరులకు అంజలి పుటంబులు ఘటించి' పై విధముగ అన్నమాటలు సోమనాథునకు స్ఫూర్తి నిచ్చినవి.

నృసింహ పురాణం ఎఱ్ఱన రచన. హరివంశంలోని ఉద్ధతి వైదుష్య ప్రదర్శనం ఇందులో మెత్తబడి రసయోజ్జ్వలంగా కనపడతాయి. రచన అయత్న సుందరమూ, తేజస్వి ఐ దర్శన మిస్తుంది. బ్రహ్మాండపురాణంలోని కథ నామమాత్ర ఆధారమై కవి భావనా విహారానికి స్వేచ్ఛ నిచ్చింది. ఇది తాత ఎఱపోత సూరి కోరగా ఎఱ్ఱన భగవదర్పితంగా వ్రాసినకావ్యం. దీనికి కవి పెట్టిన పేరు లక్ష్మీ నరసింహావతారం. కథ ఏకవస్తుకం. గాలవముని అహోబిల క్షేత్ర మాహాత్మ్యం ఏమిటి? అని అడగగా దేవశ్రవుడు చెబుతాడు.

సనకసనందనులు జయవిజయులను శపించడం వారు హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా పుట్టి సురలను పీడించడం దేవతలు విష్ణుని దర్శించి తమ గోడు విన్నవించగా, ఆ దేవుడు ప్రసన్నుడై నరసింహావతార మెత్తి, అసురవధ నెరవేరుస్తానని చెప్పడం ప్రహ్లాద చరిత్ర, హిరణ్యకశిపుని సంహారం ఇందలి కథాసూత్రం.

ఎఱ్ఱన కావ్యప్రారంభంలోని వినయోక్తి ఇది—

'అపయాతుల [illegible] వా జనితంబైన నైసర్గిక చాపలంబు పతంబున—

"మించన పఱ్క పీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మరా
యంచలు గూయ, క్రౌంచమును నావల గూయ నడంగు భంగి బ్రా
ధాంచిత శబ్దసారులు మహాకవు లాద్యులు కావ్య శయ్యఁ గీ
లించిన కీర్తి సంగసుఖ లీలకు నేనును గాంతుఁ జేసితిన్"

నృసింహ పీఠిక -13

ఇందలి రాయంచలు నన్నయ, తిక్కనలు వారి కవితాయశః ప్రాప్తికై నేను కవిత చెప్పడం, కొఱు పిట్ట హంసల ననుకరించడం వంటిది -

అన్నమాటలు చూస్తే కాళిదాసు "మందః కవియశః ప్రార్థీ చాపలాయ ప్రచోదితః" అనే మాటలు జ్ఞాపకం వస్తాయి. ఈ ప్రారంభ వచనాలను చూచి ఇది ఈతని ప్రథమ కవిత అని పొరబడకూడదు. ఇవి విరాటంలోని తిక్కన వినయోక్తులవంటివి.

'కావ్యశయ్య' 'శక్తిసంగసుఖలీల' అనే మాటల స్వారస్యం ఈతని రచనా పరిపాకానికి నిదర్శనం. ఇతడెంత అద్వైతిఐనా శివదైవతాభిరుచి చిత్రంగా కనబడుతుంది.

క్షీరాబ్ధిలో శ్వేతద్వీపం అక్కడ వైకుంఠ నగరం. ఆ సముద్రం ఎఱ్ఱయకు తాండవ శివుడుగా కనబడుతుంది.

"కడల జేతులార్చుచు ఫేన ఘన తరాట్ట
హాసరుచితో బ్రవాళ జటాళి విద్రిచి
యౌర్వ శిఖి ఫాల లోచనం బలగ సింధు
వమరు తాండవ మాడెడు హరుని భంగి ప్రథమ 84

ఈ ఉత్ప్రేక్షా వైభవం ఇట్లా ఉండగా—

శ్రీనాథునకు కూడ ఒజ్జబంతి అయిన ఈ సీసవిలాసం సముద్ర దర్శనంలో చూడదగ్గది.

"పుట్టినిల్లు రాజీవలోచను సెజ్జ
 పట్టు మహికాంత చుట్టు జీరు,
గిరులు డాగెడు గొంది, గిరిభేది పగఱకు
 బలుకోట, బడబాగ్ని బ్రతుకు చోటు
కట్టు పయోధరములు పాలి ప్రపాసీమ
 అమృతాంశు పొడవున కనుగలంబు
మర్యాదలకు గుఱి, మహిమల కందువ
 అఖిల రత్నములకు నాకరంబు

సుచరిత భవనంబు వాహినీ సుందరులకు
కూర్మి నిలుకడ, గంభీర గుణము నెలవు

తెంఁరు నొప్పిదముల కెల్ల తానకంబు
వనధి గొనియాడ చతురాననుం నకువశమె?" సృ ౧ 37

ఇట్లే శ్వేతద్వీప వసంత, గ్రీష్మ, పానగోష్ఠ్యాది వర్ణనల్లో ఆయన కల్పనా శిల్పం ప్రశంసనీయంగా కనపడుతుంది

ముఖ్యంగా ఈయన ప్రహ్లాద [illegible] లోని విష్ణుప్రాంమ్యం, పద్యవిద్య, అనుప్రాసలు పోలనగారికి రాచబాట చూపినట్టిని అందుకు 'ఊషర బీజముల్' ౫-24 అన్నదానికి పోతన వ్రాసిన 'అంధేందూదయముల్' వంటి భావ ప్రతిబింబాలు, ఒల్పిణ రత్నాకర చయ 187 'విస్ఫంజాలు భవస్మ హాల్యము' 3-20 వంటి ప్రాసలు ఎన్నో ఉదాహరణాలు చూపవచ్చు ఎఱ్ఱయ నన్నయ తిక్కనల సంస్కృతాంధ్ర రుచితో క్షోత్తరసాయసం పంచి, ఎసవిద్యానాథుకు ఉత్తర కవులకు అప్రయత్నంగా ప్రబంధమార్గం చూపిం ఘనత ఎఱ్ఱనదే ఎఱ్ఱన సూక్తి వైచిత్రి ఆయన భావ విస్ఫూర్తిలోనే కాదు ఈ లోకోక్తులలో కూడా చూడవచ్చు

కుంపటిలోఁ దామర మొలచిన క్రియ 3 127
బలియు నింట బానిసనైన జెఱుప వెఱతురు 3 48
మూడేండ్ల లేని సద్బుద్ధి ముప్పదేండ్ల లేదు 3 151
ఒక గుడ్డు కుఱిగి పోనేమి యగున్ 4 25
నిప్పునఁ జెదలంటున్ ? 4 32
నోరు మూయఁ బెడతల వాపోయెదు 4 37
జాతీయములు లేక [illegible] నాలుకాడునే 2 28
వాడు నాకు, వానికిఁ గలనేను 3 56
ఏల చెడిలి రోరె? 4 15
చే చఱచి కొంచు 4 170
మీది మూరెడు వేర్చి 5 95
కాదు కూడ దనంగ - 4 28

ఎఱ్ఱనగారి లాక్షణిక స్వాతంత్ర్యం ఈ క్రింది ప్రయోగాలలో కనబడు తుంది___

ఆజ్ రాకపోవుట—

త్రిభువన మహాద్వి ద్విషత్ - 4 188
సుమహాత్ ఆరణ్య 5 365, 6-1
సుమహా దుపనిషత్ (మహాప్రస్థాన తిక్కన) - 1 79

ధర్మ ధర్మి సాంకర్యము -
అట్టి క్రూరమునకు, అట్టిఘోరమునకు 4 21
ఎలి రహితంబు దుస్సహము అం 5 307
తిక్కన

సహాయంబు నొల్లం శాంతి 3 87
శాంతము ధర్మ ప్రచయం బంతటికి 5 185
మయట్ వ్యస్తత
తనమయంబ యగుచు 2 19
జనిత్రి = జనయిత్రి

నాచన సోమన

తిక్కనార్యుని చేతి చలువ వల్ల అలజడులు ఆడంబరాలు చల్లబడ్డాయి ఆంధ్ర కవితా సీమలో భారత మార్గం నిండొక్కకుంది భట్టారకుని ఆర్ష రచనా సరోవరంలో, దేశీయ కవితా సరళి జానుదెనుగు రీతి వేణికలు వచ్చి కలిసి, తెనుగు కవితకు కొత్తరుచులు, వాసనలు సమకూడాయి

అటు పురాణ విధానప్రియులు, ఇటు దేశి కవితాభిమానులు తృప్తి పడి 'భేదము లేని భక్తిమతి'తో ఏక మార్గాభిముఖులైనారు హరిహరాద్వైతంలా అందరికీ నచ్చిన ఒక కవిత్వమతం ఏర్పడింది

సంస్కృత కథలు తెనిగించారు పురాణాలు ఆంధ్రీకరించారు గీర్వాణ నాటక వస్తువును కావ్యమార్గంలో చవిచూపించారు

నన్నయనాడే ప్రారంభమయిన రసాభి ముఖ్యం కావ్యలక్షణాలూ, తిక్కనార్యునితో బలపడి ఎఱ్ఱయగారిని ప్రబంధ పరమేశ్వరుణ్ణి చేశాయి

సంస్కృతంలో కావ్యంగానే ప్రసిద్ధి చెందిన కవితాకళ ప్రబంధమనే కొత్తరూపు తెచ్చుకుని తెలుగులో ప్రసిద్ధి చెందింది

కావ్యమంటే సంస్కృతం ఎవ్వమే జ్ఞాపకం వస్తుంది ప్రబంధమంటే తెలుగు పోహాళింపే స్ఫురిస్తుంది ఇది కావ్యం ప్రబంధంగా రూపు దిద్దుకునే సమయం

ఆంధ్ర సాహిత్యాకాశంలో చరాలున ఒక మెఱుపు మెఱిసింది ! అందరి కళ్లూ మిరుమిట్లుగొన్నాయి కనికప స్నిగ్ధమైన ఆ తేజోరేఖ ఆకాశంలో ఒక పెద్ద గీత గీచింది ఆ గీత కవతలి వాళ్లు తెలుగులో ఆర్ష కవులు - ఇవతలివాళ్లు ప్రబంధ కవులు !

ఆ మెరుపు గీ గీచిన సోమనాథుడు !

చిత్రమేమిటంటే గీత పూర్వార్ధంలోని వారూ సంస్కృత పురాణేతిహాసాలనే ఆధారంగా తీసుకున్నారు ఉత్తరార్థం వారూ ఆ పురాణేతిహాసాలనే భూమికగా చేసుకున్నారు కాని - వస్తుస్వీకరణంలో రస నిర్వహణంలో సూత్రీకరణలో ఎంత భేదం ? ఎంత వైవిధ్యం ? ఎంత నవ్య మార్గాన్వేషణం ఎంత ఒపన ?

ఆంధ్రదేశచరిత్రలో 14 శతాబ్ది చాల విచిత్ర సంఘటనలకు ఆలవాలమయింది

కాకతీయ రాజ్యం డిపోగానే కొత్త ప్రాంతీయ రాజ్యాలు వెలిశాయి ఒక పక్క రెడ్లు, ఇంకో పక్క వెలమ వారు, వేరొక పక్క సంగమ వంశీయుల విజయనగర రాజ్యం

వైదేశికుల ఆటోపాన్ని, చమూఘాటిని చవిచూచారు విమతస్థుల పరిపీడనంలో ఇల్లు వాకిళ్లకు దూరమై బిడ్డలను కోల్పోయి కడలేని కడగండ్ల పాలైనారు జర్జరమైన హైందవాన్ని రెండు చేతులా నిలబెట్టాలని తహతహ చెందారు ఏకేశ్వరోపాసనవంటి హరిహరాద్వైతం కొంత ఊరట కూర్చగా దేశీయ ప్రభువుల అండ మరికొంత తృప్తి నిచ్చింది

ఎంత లేదనుకున్నా - సమాజ జీవితపు పతనోత్థానాలు ఖేద మోదాలు, ఆనాటి కవుల రచనల్లో ముద్ర వేయకుండా ఉండవు అవి కొందరి మీద

తక్కువ ప్రభావమూ, మరికొందరి మీద ఎక్కువ ప్రభావమూ చూపి ఉండవచ్చు.

నాటి సమాజపు భాషాముద్ర నాచన సోమన మీద ఎక్కువ పడింది. తమ రుచులు ప్రతిఫలించిన సోమనాథుని రచనను ఆనాటి సాహిత్యరసికులు ఎక్కువ అభినందించినట్లు కానవస్తుంది. క్రీ.శ. 1344 నాటి సంగమవంశ ప్రభువు బుక్కరాయలు సోమన్నకు ఒక అగ్రహారమే ఇచ్చాడు. ప్రజలు పుక్కిటిబంటిగా బిరుదులిచ్చారు.

1 సకల భాషా భూషణ
2 సాహిత్యరస పోషణ
3 సంవిధాన చక్రవర్తి
4 సంపూర్ణ కీర్తి
5 నవీన గుణ సనాథ

కవి ప్రజల ప్రశంసలను అలంకారిక భాషలో అనుప్రాసలతో బిగించి వ్రాసుకున్నా, వాటి భావంగల మాటలను తప్పక బహుముఖాల అని ఉంటారు. లేకపోతే వాటికి విలువ లేక హాస్యాస్పదుడై ఉండేవాడు.

ఆనాటి వారేకాక 19వ శతాబ్దంలోని ఆధునికులు కూడా అతనిని 'అశేషమున అభినివేశించిన సర్వజ్ఞుడనీ', కొన్ని యెడల కవిత్రయమును మించినవాడనీ శతవిధాల ప్రస్తుతించారు (చిన్నయ, కం. వీ.) ఇత్యాదులు. అందరి ప్రశంసలకు పాత్రుడైనవాడు ఏతన్మాత్రుడు కాకపోవడం నిజం. నిజం నికషం మీద తేలాలి!

నన్నయగారికి తాను వాగనుశాసనుణ్ణని తెలియదు. తిక్కనార్యుడు తాను కవి బ్రహ్మననీ అనుకోలేదు. తన తాత తన్ను 'ప్రబంధ పరమేశ్వరుడు' అన్నాడని ప్రెగ్గడగారు మాత్రం తన గ్రంథంలో వ్రాసుకున్నారు. 'భవ్య భారతి' 'అభినవదండి' ఇత్యాదులు అభిజ్ఞులు అనగా ప్రచారంలోకి వచ్చినవి. ఆలోచించగా నాటి బిరుదులు పట్టరాని ఇంత ఇష్టానిష్టాపేక్ష పుట్టినవి కావు. ప్రజ్ఞా ప్రకర్షలనుబట్టి ప్రాజ్ఞులు ముక్తకంఠంగా వ్యాప్తిలోకి తెచ్చినట్టివిగా తోస్తాయి. ఈ సూత్రమే సోమనాథునిపట్ల వర్తింపజేసి చూస్తే ఏమి తేలుతుందో గమనిద్దాము.

కావ్యేంద్ర ధనువు

తృతీయ ప్రసంగం

రెండవ భాగం

సోమన్నగారి మొదటి బిరుదు 'సకలభాషాభూషణ' అన్నది ఈ 'సకల' లోని కలరూపు ఏదో స్పష్టంకాదు ఆ సకల భాషలవల్లా ఈతని తెలుగు కవిత్వానికి ఏమి మేలు జరిగిందో తెలియదు ఆనాటి పెద్ద కవులకు సంస్కృత ప్రాకృతాల్లో మంచి ప్రవేశం ఉండడం సహజం తెలుగుభాష లోతుపాతులు తెలిసి ఉంటాయనడం సరేసరి ఇక పొరుగు భాషలు తమిళ కన్నడాలతో మంచిపొత్తు ఉండేదనుకోవడం అసంభావ్యం కాదు అయితే అవి భావగతిలో ఏమైనా తోడ్పడి ఉంటాయేమోగాని భాషారీత్యా సరాసరి ఉపయోగపడి ఉంటాయనుకోలేము ఏను౦ మొత్తంమీద ఈయన సంస్కృత సాహిత్యం లోను, సాంఖ్య, యోగ, మీమాంసలలోను గొప్ప పండితుడనీ, ఆంధ్రభాషా హృదయం స్పష్టంగా ఎ౯గినవాడనీ, తక్కిన ప్రవేశాలు అలంకార ప్రాయా లనీ అనుకోవచ్చు

రెండవ బిరుదు సాహిత్యరస పోషణ——

ఇక్కడ భవభూతి . అన్నమాట ఒకటి జ్ఞాపకం వస్తుంది మాలతీ మాధవం ప్రస్తావనలో అంటాడు

'వెదాధ్యయనం ఉంటే ఉపనిషత్తులు చదివితే సాంఖ్య, యోగాల్లో జ్ఞాననిధి అయితే మాత్రం ఏం లాభం? నాటక రచనలో అవేవీ కొరగావు నాటక రచనలో మెరగాలంటే వేరే గుణాలుండాలి

అట్లాగే సోమనాథుని శాస్త్ర పాండిత్యం ముఖాముఖిగా కవితా కళకు ఏమీ ఉపయోగించదు వాటి బలంవల్ల పరోక్షంగా ఆయా సందర్భాల్లో ౼త్వం రాణించవచ్చు ఆ ఎరుకతోనే – ఒకరన్నా – ఆయన అనుకున్నా -

సాహిత్యంలో రసపోషణం, శరీరానికి ప్రాణం వంటిది ఆ విషయంలో కూడా ఆయన మిక్కిలి చతురుడని ఈ బిరుదం చాటి చెబుతుంది

ఆయన రసపోషణ గురించి తెలుసుకోదలచినప్పుడు ఆయన రచన గురించి ముందు కొంచెం తెలుసుకోవడం భావ్యం

సోమనాథుడు రచించిన ఉత్తర హరివంశం ప్రసిద్ధం ఆయనదే అని చెప్పబడే 'వసంత విలాసం' లోని కొన్ని పద్యాలు తప్ప గ్రంథమంతా దొరకదు

హరివంశం సంస్కృతంలో భారతానికి అవశిష్టభాగం భారతానికి హరివంశం కూడా కలిపితేనేగాని సంఖ్య పూర్తికాదని నగభిజ్ఞుల ప్రవచనం

హరి వంశంలో మూడు పర్వాలు 1 హరి వంశపర్వం 2 విష్ణుపర్వం 3 భవిష్యపర్వం

దీనిని భారతాంశమని చెప్పి ఎఱ్ఱాప్రెగ్గడ పూర్వం, ఉత్తరం అనే పేర్లతో రెండు భాగాలుగా సమగ్రంగా తెనిగించాడు తర్వాత సోమనాథుని ఉత్తర హరివంశం వచ్చింది పూర్వ భాగం తెలుగింపబడిందీ లేనిదీ తెలియదు పూర్వభాగం ఉండి ఉండాలని కొందరి ఊహ।

పూర్వభాగంతో నిమిత్తం లేకుండానే ఆయన ఉత్తర భాగమందలి ప్రీతితో కవితావకాశమున్న వాటిని ఎంచుకొని సరసంగా తెలుగు చేశాడని మరికొందరి ప్రతిపాదనం - నేటికీ రెండవవాదాన్నే పలువురు సాహితీ పరులు నమ్ముతున్నారు అయితే—

సోమన ఉత్తర హరివంశ ప్రారంభం విచిత్రంగా ఉంది అంతవరకు - నన్నయ తిక్కనాదుల దగ్గర నుంచీ - కృత్యాది పీఠిక లేకుండా ఏ తెలుగు పద్య గ్రంథమూ లేదు అంతవరకూ ఎందుకూ - తనకు పూర్వం హరివంశం వ్రాసిన ఎఱ్ఱనగారి హరివంశానికే లక్షణంగా ఎంతో పీఠిక ఉంది సోమన ఉత్తర హరి వంశం మాత్రం - తుంచినట్టు వైశంపాయనుడు జనమే జయుడికి కథ చెప్పడంతో ప్రారంభ మవుతుంది

కృతినాథుడు హరిహర దేవుడని తొలిపద్యంవల్ల తెలుస్తుంది తక్కిన ఆయన వివరాలన్నీ ఆశ్వాసాంత గద్యవల్ల తెలియవలసిందే ఇది కృలకంగా

ఉంది పీఠికగా వ్రాసిన గ్రంథం ఉత్తమయి పోయిందా? అసలు వ్రాయనే లేదా? అది సంభవమా! అనేవి విపుల పరిశోధన చేస్తేనేగాని తీరని సంశయాలు. అయితే అంతలో ఉన్న కవిత్వం ఆస్వాదించడానికి ఏమీ అభ్యంతరం ఉండదు. ఇక అసలు కవితా ప్రస్థానం మీద దృష్టి నిలుపుదాం.

సోమనాథుడు హరివంశపు భవిష్యత్పర్వ కథలనే ఎన్నుకొని తన గ్రంథం వెలయించాడు. అందులో ముఖ్యంగా చేరవలసిన రుక్మిణీ కల్యాణ పారిజాతాపహరణాదులను - రసవంతంగా వ్రాయదగినవైనా - ఎందుకో స్వీకరించలేదు. శ్రీకృష్ణ జన్మం మొదలు కంసవధ వరకూ పూర్వభాగం (విష్ణుపర్వం) లోని ఉత్తర హరివంశంలో తీసుకునే ప్రసక్తే లేదు.

ఉత్తర హరివంశం 6 ఆశ్వాసాల గ్రంథం—

అందులో 1 నరకుని కథ 2 మృతబాలుర రక్షణం 3 పుత్రార్థియైన కృష్ణుని తపస్సు 4 పౌండ్రకకథ 5 హంసడిభకోపాఖ్యానం 6 ఉషా వృత్తాంతం ఉన్నాయి.

గ్రంథం తెరవగానే నరక వృత్తాంతంలోని వీరకరుణాలు సోమన చేతిలో అపూర్వ పాకం పొందినట్టు కనిపిస్తాయి.

> “ధనదాంగనా హారములు, యా
> దశపాల బాలాఘన
> స్తన కాశ్మీరము ధర్మరాట్సతి దుకూ
> సంవ్యాన కౌశేయమున్
> దనుజేంద్రా! ఐరావరోధ దయితా
> ధమ్మిల్ల మాల్యంబులున్
> గిను దెచ్చి ఘటింపజూచు జయల
> క్ష్మీ నిత్య నైపథ్యమున్” ఉ ౧-16

సోమనాథుని సుప్రసిద్ధ పద్యాల్లో ఇది ఒకటి. పద్యంలోని పరుగు సమాసాల కూర్పులోని జిగి సంస్కృత శబ్దాలతో జల్లులాడే నేర్పు ముందు మనలను చకితులను చేస్తుంది. తర్వాత శృంగార గర్భితమైన వీరం ఆస్వాద్యమవుతుంది.

నరకుడు దిక్పతు భార్యల అలంకార సామగ్రిని కొల్లలాడి నిత్యమూ తన జయలక్ష్మిని సింగారింప జూస్తున్నాడు 'ఇంతవరకూ మీ భార్యలే అపూర్వ భూషణాలతో కులుకుతున్నారు ఈపైని సాగదు' అని వారిపై కినుక వాటిని దోచుకొని తనకు ప్రియమైన జయలక్ష్మి కివ్వడంలో సాటిలేని తృప్తి ఈ రసకతలోని నరకుని ఉత్సాహం వీరరసాభిముఖమై మెరుగు తెచ్చింది ఈ సన్నివేశాన్ని సోమన సాహిత్య రసపోషణకు తార్కాణ

నరకునికి దిక్పతులందరూ ఓడారు అలాగు స్వర్గాధిపతి అయినాడు అప్పటి అమరపట్టణపు భగ్నదృశ్యాలు, రాక్షసుల అమానుష కృత్యాలు సన్నీటి మడుగులైన కాలువ గోమయం నరకుని సురుల కృత్యాలేకావు, ఆంధ్ర శత్రువులు కాకతీ పట్టణంలో యాదవాంధ్ర సీమలో చెలరేగి చేసిన దారుణ కృత్యాలను జ్ఞాపకం చేస్తాయి సోమన ఆత్మీయత ఇందులో ప్రతిఫలించి కరుణ రసాన్ని వెల్లువికించింది

నరకుడు ఊర్వశి మాటమీద యజ్ఞభాగా లివ్వమని మున్యాశ్రమాల మీద పడ్డాడు "పలి నౌదు మఖాంశ శ్రీలకు" అని తలవిసిరి మాట్లాడి "శిరసుండగ మోకాలికి సేస పెట్టుట" అని తానుండగా దేవతలను పూజించడం వెంగలితనం అని పరిహసించాడు

హవిర్భాగా లివ్వని మునుల బాములివి

> "జడలు జుంజులు పట్టి జరగ నీకున్నచో
> పీడింప శిష్యుల వెదకువారు
> జన్నిదంబులు తలిసంకెలై సడ్డ
> తెగదన్ని మిన్నర బ్రుంగువారు
> ముందటి దిక్కాడి మొలకాండ్రు దవిలిన
> తోకగోచులవెంట తూలువారు
> దగిరెత్తి పోలే దండంబు లటువైచి
> హా విధీయని చేతులార్చువారు
>
> కడవ సంబులు మోదిన గలగువారు
> వల్కలంబులు దోచిన వంగువారు
> చెలుబువోయిన వారల జీరువారు
> నై మునీంద్రులు గలగి రయ్యాశ్రమమున"

ఈమునుల విస్మృతస్థితి చూచి వచ్చే కన్నీటి చిరునవ్వులో నవ్వులేదు గుండెను పట్టి సలపరించే కరుణం ఉంది

నరకుని విజృంభణంలో త్రిలోకాధిపతి దేవేంద్రుని ఈ గంభీర వచనాల లో తొంగి చూచే భయానక దృశ్యాలు దయనీయమైనవి

"చొరని బంటులున్ వెడలజూడని క్రంతలుం, గాలు రాపడన్
దిరుగని త్రోవలున్ విడియదీర్పని గొందులు, నాలుబిడ్డ లే
నెగయని రేలుం జీను చిటుకన్నను విప్పని మూలుం బయిన్
జిరుగని చీరలుంగలవె? చేరిన ఈ సురకోటి కచ్యుతా!"

వారా దిక్పతులు కాని ఎటు స్థింపినది ఒకచోట నిలవని కాందిశీక స్థితి! రెండు రేఖలలో వారి దుఃస్థితిని గీచి చూపే ఈ సోమన చిత్రం మరపురానిది

వీర శృంగారాలను అద్భుతంగా మేళవించి తీర్చిదిద్దినదృశ్యం నరకాసురునితో సత్యభామ యుద్ధఘట్టం ఇది హరివంశకథలోనిదే - అయినా

'వీరం బాడుతనంబు నొందెననగా చిత్రకాంతి సౌందర్య లక్ష్మీరేఖం బచరించె నాగ ధీరోదాత్త పతి ప్రియాచరణ భక్తి ప్రౌఢముగా' ఎఱ్ఱన గారు సూచించి విడిచిపెట్టిన సత్యభామ సమరక్రీడను అఖిలలోక రమణీయంగా ఎదుట పెట్టినవాడు సోమనాథుడు

"గనయంబుం గొనవసంబు, నెన్నడుముతోం గర్ణావతంసంబుతో
జనుదోయిం గనుదోయి సాయకముతో, సంధాన హస్తంబుతో,
జెనకం జేయుచు నేయుచుండె సతి లక్ష్మీ భూతిదై తేయ ల
ర్జన గర్జా వ జర్జరాంగ రుధిరాసారంబు తోరంబుగా" ౧ 157

ఈ యథా సంఖ్యలో వీరశృంగారాలను పెనవైచి లక్ష్మీ భుతుడైన నరకుని 'రుధిరాసారంబు తోరంబుగా' వర్జించి గర్జించడం సోమన రస నిర్వహణంలోని ఒక ఒడుపు

వీరరౌద్రాలకు ఓజోగుణాన్ని, మహాప్రాణాక్షరాలను, ఉపయోగించి రసస్ఫూర్తి కలిగించడం కవులకు పరిపాటి కాని అలతి యలంతి మాటలతో వీరాన్ని స్ఫురింప జేయడం ఒక రసవిద్య ఈ విద్య తిక్కనార్యునివల్ల

సంగ్రహించిన సోమనాథుని పద్యానికి 'అచ్చరలే' కాదు మనమూ 'ఇచ్చ' మెచ్చ వలసిందే

'ఊచనకట్టు వంపని పయోరుహాలోచన మింట మంటలం
బూచిన బాణజాలమునఁ బూర్వసుపర్వ పురాణ గర్వమున్
వేచిన చందమున్ విపుల వీరరసంబున నాత్మ చిత్రముం
దోచిన చందముం దెలియ దోచిన నచ్చరు లిచ్చ మెచ్చరే' !

'మింట మంటలు పూచుట', 'పురాణ గర్వమున్ వేచుట' అనుమాటలు ఈరసాను భూతికి ప్రాణతుల్యాలు

ఇక్కడ వీరరసం స్వశబ్ద వాచ్యమయిందని శంకించ నక్కర లేదు నన్నయ సభాపర్వ జరాసంధ యుద్ధఘట్టంలో భయానక శబ్దం (సభా ౧ 204) కనబడుతుంది తిక్కన పలుచోట్ల రసాలను స్వశబ్దంతో వాడడం ఉంది (విరాట భీష్మాదుల్లో) అయితే ఇక్కడ రసశబ్దాన్ని కావ్యరస రంగా కాక అనుభూతి పరంగా మాత్రం స్వీకరిస్తే ఆదోషం కనబడదు

ఈ ప్రకరణంలోని మరి ఒక సుప్రసిద్ధ పద్యం 'అరిఁజూచున్ హరిఁజూచు' అన్నది ఇందులోని సోమన శృంగార ప్రీతి వీరాన్ని ఎక్కరానివ్వక పోయినా – ఆ వర్ణనం మాత్రం 'లోకుల రసనలె ఆకులుగా' ప్రఖ్యాతి పొందింది

సోమన యుద్ధరంగ చటుల దృశ్యాలను స్వయంగాచూచినవాడో లేక చేసినవారివల్ల విన్నవాడో – కాకుంటే వాటిని అంత వివరంగా వర్ణించడం సాధ్యంకాదు ఈ యుద్ధ వర్ణనలు చూచినప్పుడు నన్నిచోడుడు, తిక్కనార్యుడు స్ఫురణకు తగులుతారు

పౌండ్రక వాసుదేవునితో యుద్ధం, హంసడిభకుల తోడి సమరక్రీడ, భీషణ రమణీయంగా దర్శనమిస్తాయి

'ఈ చందంబునఁ దెఱపులు
వేచియుఁ బయి బూచిలాచి వ్రేసియుఁ బైపై
ద్రోచు రుధిరమునఁ దడిసిరి
పూచిన మోదుగుల తోడబుట్టువులనఁగన్' 3-63

'పూచిన మోదుగుల కోడబుట్టువులు' అనే ఉపమానం ... రక్తసిక్త దేహాలకు అచ్చుకట్టు

హాస్యరసానికి భారతీయ ఉదాత్తగ్రంథాలలో ఆట్టేచోటు ఉండదు కాని తుంటరులు చేసిన కొంటెపనులు నవ్వుపుట్టిస్తాయి హంసడిభకులు దుర్వాసుని యెడల ప్రవర్తించిన తీరులో ఇది నిపుణంగా మలచబడింది వారు చూచిన దుర్వాసునిరూపం ఇది ఇది సజ్జనులకు పూజ్యమయితే - వీరికి హాస్యాస్పదమవడంలో వీరికి చేటుకాలం ఎంతదగ్గరలో ఉందో ధ్వనింపజేశాడు కవి

'కావిచీర ముసుగు కచ్చడంబును జూచి
బోడతలయు నిడుదబొట్టు చూచి
గోచితోడి వెదురు కోలయుఁ జిక్కంబు
గట్టియున్న బుఱ్ఱ కాయ జూచి'

'మిడికెడు పెదవులు వ్రేళులు
మడిచెదు కనుదోయి మొగిడి మా యెదుర గడున్
వెడవీక యొడలు చేసెదు,
...డవుల జపములకు నేడు కలదో ? లేదో ?'

ఆ మహాత్ముని పెదవుల వ్రేళ్ళ కదలిక, కనుమోడ్పు, బక్కచిక్కిన ఒడలు, జపం, వారి వెక్కిరింపుకు గురి అయింది

ఆ వెక్కిరింపు అచ్చపు తెలుగు మాటల్లో పలికించిన తీరు సోమన ప్రత్యేకత

సోమన రసపోషణంలో మరి ఒకవైపు - చిత్రమైన పాత్ర ప్రవేశంతో రససిద్ధి కూర్చడం

ఒక బ్రాహ్మణుడు హఠాత్తుగా కృష్ణునివద్దకు వచ్చాడు

'వెడవీడెడు దోవతియును
బెడలిన చేతులు, వడంకు పెదవులు, తూగా
డెడు వెంట్రుకలును వైపై
వెడలెడు కన్నీరు గలుగు, వేషము తోడన్' —7

అలౌకిక, అమాయిక బ్రాహ్మణరూపం ఇది అతణ్ణి చూచి మాకు చెప్పవలసిన మీవంటివారు ఇట్లా దురపిల్లడం ఉచితమేనా ? అని కృష్ణుడు చనవు చూపగా - ఆ బాపడు బావురుమని తన దుఃఖం వెడల గ్రక్కుతాడు అలని బిడ్డలమీది మమకారం, దీనావస్థ, మనోవేదన, ఈ సీసపద్యంలో అభివర్ణించిన తీరు ఎలువురి మన్ననలకు పాత్రమయింది

'వడియొత్తు చీరతో దాది కౌగిట జేర్చి
చూపంగఁ గన్నారఁ జూడనైతి
పడవి యాడకమున్న తట్టాడుమని పట్టి
వడకంగ సెజ్జపై వ్రాల్పనైతి
సల్లంత దవ్వుల నప్పలప్పలనంగ
నెదురుగా బఱతేర నెత్తనైతి
వియ్యాలచే నిచ్చి వేడుక నను వారు
తిట్టింప విని దప్పిదేరనైతి

నకట మిథ్యా మనోరథుండైతిఁ గాని
కొడుకులం గని దమవారు గొండనేయు
నుండలేదయ్యె సంపద లుబ్బనేని
లేబరమకాదె బిడ్డలు లేని బ్రతుకు'

ఇది కృష్ణునినాటి బ్రాహ్మణుని మనోవేదనే కాదు బిడ్డలు లేని ప్రతి గృహస్థు వ్యథను బొమ్మగీసి చూపిన పద్యమిది ఆర్ద్రహృదయం పెల్లుబికినప్పుడు వచ్చే నిండు తెనుగు మాటలు ఈ పద్యానికి ఎనలేని మాధుర్యాన్ని కూర్చాయి

అతని వేషం, ఉత్తలపాటు, అంతటి కృష్ణునకు కూడ "ఒకింత లేత నగవును' తెప్పించాయి ఆ నవ్వులో ఆ బాపని అమాయకత్వంమీద జాలి ఉంది ఎట్లాగైనా ఉద్ధరించాలనే తపన ఉంది

అన్న హంసుడు యుద్ధంలో కృష్ణుని చేతిలో మరణిస్తే డిభకుడు దుఃఖించే విధం తిక్కన స్త్రీపర్వ ఉద్వేగాన్ని తలంపునకు తెస్తుంది

'నా యెల్లి నీడన నరలోక మేలుదు
నను లావు వటితి పాంయెన్యనన్న'

నిచట నిలువ
నాకు నేల నీతోడిదే లోకమన్న! ఆ-300

అనే సీసమూ,

ప్రేలెడు వెంద్రుక లిరుగడ
దూలఁగఁ దలయూచు దొప్పదొప్పన నోరుం
గేల నడచికొను సెలవుల
లాలలు దొరుగంగ, నన్నలా! యని యొఱలున్ ఆ-302

సోమన కరుణరస నిర్వహణాని కిది పరమావధి—

బాణుని ఇంటికాపున్న శివపార్వతుల ఉద్యాన జల విహారములలో, ఉషానిరుద్ధుల ప్రేమ కలాపంలో సోమనాథుని శృంగార చిత్రణం హద్దులు మీరక హృదయగ్రాహిగా నడిచింది

ఉద్యాన సలిల విహారాల్లో పార్వతీశ్వరులతో చెలులు చేసిన శృంగార క్రీడలు ఉష విప్రలంభ వేదన అనిరుద్ధని కలయికలోని గాటపు మమత లోకోత్తరంగా చిత్రితములైనాయి తరువాతి ప్రబంధ కర్తలు సంభోగ శృంగారాన్ని హద్దులు దాటిస్తే ఈయన ఉషానిరుద్ధుల ఆభ్యంతర వర్తనాన్ని ఔచిత్య సౌకుమార్యాలతో

'పూవిలుతు చేతి జంత్రపు బొమ్మ జేసె
మానినీ తిలకంబుఁ గుమార వరుడు!'

అనే ఎత్తుగీతిగల సీసంలో నిపుణంగా నిర్వహించాడు

మూడవ బిరుదు 'సంవిధాన చక్రవర్తి'

పురాణ కవితలో కథను యథాతథంగా నడిపించడం పరిపాటి ఆ కథలో కొన్ని ఘట్టాలను వాటి ప్రాముఖ్యాన్ని బట్టి తీర్చిదిద్దడం సంవిధాన చాతుర్యం అనిపించుకుంటుంది

ఉత్తర హరివంశం తీయగానే ముఖ్యంగా మూడు సన్నివేశాలు జ్ఞాపకం వస్తాయి అందులోని పాత్రల మూర్తికల్పన సంభాషణా చాతురి, పద్యాల విరుపు పాఠకుని మనసులో ముద్రితమవుతాయి

మొదటిది ఊర్వశీ నరకాసుర ఘట్టం

నరకుడు స్వర్గాన్ని జయించడం ఒకయెత్తు అయితే ఊర్వశివంటి నెఱజాణను చేపట్టడం ఒకయెత్తు అనుకున్నాడు 'ఊర్వశిఁ దోడి దెమ్మనుచు నొక్కని బంప పదుండ్రు పాటి' నారు ఊర్వశి కనపడ్డది భటుల శ్రమ ఫలించింది 'నిమం దోడి తెమ్మనె మారాజదె! బడి బడి వచ్చెదగు!' ఈ మాటలలో కవి కల్పించిన ధ్వని చమత్కారం చూడదగ్గది

ఊర్వశిని తీసుకురమ్మంటే పదిమంది పరుగెత్తారు అంటే - రాజాజ్ఞను భయభక్తులతో నెరవేర్చడం మామూలే కాని ఇక్కడ ఊర్వశిని చూడాలనే తొందర రాజుకంటె భటులకు మరీ ఎక్కువగా ఉంది చెవులు కందేలా వినడమేకాని ఆ అపురూప సౌందర్యరాశిని ఎప్పుడూ చూడలేదు ఇప్పుడా అవకాశం వచ్చింది జన్మ ధన్యమైంది అవకాశం ఎక్కడ జారిపోతుందో అని ఒకడికి పదిమంది, వారైనా వెంటబడి త్రోసుకుంటూ వస్తున్నారు ఊర్వశి ఆకర్షణ ఎంతటిదో కవి ఈ మాటల్లో పలికించాడు

ఆమె రాకకు ఎదురుచూస్తూ నరకుడు ఇంద్ర సింహాసనం మీద కూర్చుని గంధర్వగానం వింటున్నాడు

ఆ రాక్షసుడు అంతటి రసజ్ఞుడా? కాదు—

ఊర్వశి వచ్చేసరికి తన రసికత తెలియాలి యుద్ధపు కనరు కనపడ కూడదు ఆమెను లాలించడానికి అది ఒక భంగిమ అంతే—

ఊర్వశి సభలో ప్రవేశించింది

నరకుని మనస్సు ఉప్పొంగింది

తన తలను ఒకసారి నిమురుకున్నాడు

ఉత్తరీయం సరిదిద్దాడు

కులుకు కోర్కులతో మొగలిరేకును సుతారంగా చీల్చుతున్నాడు ఎందుకు? అక్కడే చమత్కారం—

కాళిదాసు రఘువంశంలో, ఇందుమతీ స్వయంవర సందర్భంలో అభ్యర్థులైన రాజకుమారులంతా ఆసీనులై ఉన్నారు ఇందుమతి స్వయంవర మండపంలో ప్రవేశించింది ఆమెను చూచిన రాజకుమారుల్లో శృంగార

చేష్టలు ప్రారంభమైనాయి 'శృంగార చేష్టా వివిధా బభూవుః' అన్నాడు హృదయజ్ఞుడు మహాకవి

ఆ తత్త్వ మెరిగిన సోమన నరకునిలో ఆ చేష్టలు పొదిగాడు ఆ చేష్టలు ఉత్తమ జాతివి కావు ఇందుమతి వారిని నిరాకరించినట్టే ఊర్వశి ఈ వెంగిలిని నిరాకరిస్తుందని సూచన

అతనిలో సౌందర్యాన్ని మన్నించే గుణం ఉంది 'నా సఖన్ నీ కను దోయి వెన్నెలలు నిండక కోర్కులు నాకు నిండునే' అనడంలో ఎంత సౌందర్యారాధన !

'నీఁ కేఁ గలుగంగ సంపదల కేల విచారము పద్మగంధి ?'

అన్నంతవరకు అతని ఉదారత దృశ్యాదృశ్యంగా కనపడుతుంది దాన్ని ఆధారం చేసుకుని ఊర్వశి మాటలలోకి దించి అతని నీచత్వాన్ని కనుక్కుంటుంది అతని మాటల్లో లంజెరికపు కోరిక గాని లాలిత్యం లేదు ప్రేమలేదు ఆ నెఱజాణకు అన్ని వంచించడం తేలికయింది ఆ ఇంద్రపదవికి తగినట్టుగా యజ్ఞభాగాలు పొందితే నేను నీ దాన నంది ఆ మాట నచ్చింది నరకుడు నరకంలో పడ్డాడు

రెండవది శ్రీకృష్ణుని తపోఘట్టం—

రుక్మిణీ కృష్ణుల ఏకాంత గృహం ఒకనాడు 'లేనగవు శృంగారంబుగా కన్నులన్ పారంబేదని లజ్జదోప-రుక్మిణి కుట్మలిత హస్తాంభోజయై' పతి దేవునితో అంటుంది

'ఒక కుమారుని దయచేసి ఉర్విలోన
కడుపు చల్లని కాంతలఁ గలుపు నన్ను'

ఈ కోరిక వింత ఐనది భార్య భర్తను కుమారు నిమ్మని అడగడమేమిటి ? ఆయన సమాదరంగా సరే అనడమేమిటి ?

ఎఱ్ఱయగారి హరి వంశంలో అప్పటికే కృష్ణునకు కుమారుడున్నాడు ఐనా కృష్ణుడు శివునిగూర్చి తపస్సు చేశాడు సోమన్న ఈ కథలో ఒక పరమార్థం నిక్షేపించాడు వధూవరుల కలయిక కామోప శాంతికోసం కాదు

'ప్రజాయై గృహమేధినాం' అన్నట్టు అది ప్రజాసంతు పరిరక్షణంలోనే కృతార్థమవుతుంది కడుపు చల్లని కాంతలంటే అట్టివారు, ఈ ధర్మ ప్రబోధం కాంతా సమ్మితంగా చెప్పడం కవి హృదయం మరొకింత - భగవత్స్వరూపుడైన శ్రీకృష్ణుడు శివుని గూర్చి తపస్సు చేయడం—

ఈ శివకేశవ సమాగమంలో హరిహరాభేదం కావ్యధ్వని - దీన్ని ఇంత బలంగా చిత్రించడం ఇంతవరకు జరగలేదు తిక్కనార్యుని భారత పీఠికలోని హరిహరాద్వైతం ఇందులో విశ్వరూపంతో విలసించి కనపడుతుంది

దానిముందు ఘంటాకర్ణకథ వాడొక పైశాచిక ప్రకృతివాడు ఒకవైపు పరమ బీభత్స ప్రవర్తన - ఇంకొకవైపు తరగని విష్ణుభక్తి వాడు సభక్తికంగా ఒక బ్రాహ్మణ శవాన్ని నైవేద్యం పెట్టడం - కృష్ణుడు ఎవ్వి వాడి పిశాచభక్తికి మెచ్చుకొని బుద్ధిచెప్పి ఇంద్రపదవి ఇవ్వడం - సోమనగారి గొప్ప సంవిధాన నైపుణికి నిదర్శనం

శ్రీకృష్ణుడు పండ్రెండేండ్ల తపస్సు తర్వాత శివుడు ప్రత్యక్షమై అంటాడు

> 'యదువంశాంబుధిచంద్ర ! నీ మదిఁ గుమారాపేక్ష నాలో నెఱుం
> గుదు, నా కీ చన వీ దలంచియు తపోఘోరక్రియ న్మెచ్చగాఁ
> బిదపం జెప్పెడి వాడవే తగుఁ దగున్ బృందారక శ్రేణికిన్
> హృదయాహ్లాదముగా మదీయ మకుటం బెక్కెన్ భవత్పాదమున్'

శివునకు విష్ణువుమీద ఎంత చనవు, ఆప్తభావం ఉందో ఈ మాటల కూర్పులో ధ్వనిస్తుంది

'కృష్ణా ! నీ కున్న పుత్రాపేక్ష నాకు తెలుసు నాకా చనవు ఇవ్వవచ్చు గదా ! ఈ ఘోరతపోదీక్ష ఎందుకు, ఎవరినో పరాయి వానిని అర్థించినట్టు - నీ తపస్సునకు నేను మెచ్చి వస్తే తర్వాత చెబుదామనా ? చాలు చాలు దేవతల కందరికీ మెచ్చుగా నీ పాదాలు నేను ధరించిన వాడనని ఎరుగవా ? ఏమి చమత్కారమివి ?' తెలుగు నేలలోని మిత్రులిద్దరు కలిస్తే చనవుగా ఇట్లా మాట్లాడుకుంటారు ఆ మాటల తీర్పువల్ల శివకేశవ తాదాత్మ్యం మనకు స్ఫురించాలి అదీ కవి హృదయం ! ఈ స్ఫురణ అంతా 'తగుఁదగున్' అనే

రెండు మాటల్లో నిక్షేపించాడు పిదప నీ పాదాలను శిరసావహించిన వాడి దగ్గర (లక్షణ చేత - గంగ) ఇంత బెరుకా ? అని మందలించాడు

తర్వాతి శివుని మాట—

'నీ కొడుకు నీకు నిచ్చితి ! గైకొనుము' అంతతో ఆగక - ఆ పరమేశ్వరుడు చేతులు మొగిచి విష్ణు పరతత్త్వాన్ని, హరిహరా ద్వైతాన్ని 20 పద్యాలలో స ృ ానుమతంగా ప్రపంచించాడు

సోమన హరిహర తత్త్వావగాహనం, శాస్త్రప్రవేశం, ఈ సన్నివేశ చాతుర్యంలో తెలియడమేకాక, తిక్కనార్యుని మీద భక్తిని సార్థకం చేసుకున్నాడు అంతేకాదు తిక్కన భారతకథానంతర గౌరవం తన రచనకే ఉండవలెననే కాంక్షకూడా అంతర్యంలో ఉన్నవాసన తగులుతుంది

మూడవ సంవిధాన మిది

బాణపుత్రిక ఉషాకన్య లోకయాత్ర తెలియని ముద్దరాలు ఉద్యాన కేళిలో పార్వతి బోటి కత్తెలు శివునిలా అభినయిస్తే వారిమీద ఉమాదేవి ఆస చూపడం - ఉషాకన్యలో నిద్రించే శృంగారభావాన్ని మేలుకొల్పింది ఆమె ఆ భావం అణచుకోలేక చెలిమి కత్తెలతో చెప్పింది అది విని 'చలిగొండ చూలు' 'మనోభవుని పట్టముగట్టి కొనంగజాలు జాణని మగనిం గవుంగిటి ననారతముంగొని యాడుదో చెలీ !' అని ముద్దుగా ఆశీర్వదించింది తర్వాత కొన్నాళ్లకు 'కలలోఁ గుమారుఁ డొకడేమో చేసనన్' దిగ్గున మేలుకుంది 'కుమారుడు చేసిన ఏమో' అర్థంకాలేదు వల వల ఏడ్చింది ఎందుకు ? నిజమో కలో తెలియదు తనకు అభిమాన భంగమయి నందుకు - తన ఎరువు ప్రతిష్ఠ గంగ గలిసినందుకు—

పురుష స్పర్శవల్ల కలిగిన అనుభూతి విశేషం కన్న - ఇక్కడ ఒక అనన్య చుంబితమైన కన్య ఆత్మాభిమానం, అభిజాత్య గౌరవం ప్రశంసార్హమైనదని చెప్పడం కవి హృదయంగా కనపడుతుంది గడుసు చెలికత్తె చిత్రరేఖవల్ల తేరుకొన్న ఆ కన్య చింత వలవంతగా మారడం, ఆ చిత్తవృత్తిని హృద్యంగా చిత్రించడం సోమన సంవిధాన చాతురిని చాటి చెబుతుంది

సోమన నవీనగుణ సనాథత ఏమిటి ?

ఇంతవరకు ఏ తెలుగు కవీ నేను నవీన గుణ నిర్మాతనని సగర్వంగా చెప్పుకోలేదు ఈయన ముక్తకంఠంగా చెప్పాడు అయితే అది పరీక్షకు నిలవాలి

కొంచెం పరిశీలించి చూద్దాం

ఎఱ్ఱన హరివంశం సాంగోపాంగంగా చదివి ముగించాం ఇప్పుడు సోమన ఉత్తర హరివంశం తీశాం మనకు కలిగిన అనుభవ విశేషం ఏమిటి ?

ఏ కవి వాడినా అవే శబ్దాలు, అవే అర్థాలు అయినప్పుడు, ఒక కవిలో నవ్యత ఉన్నదీ అని చెప్పడం ఎట్లా ? అంటే – కావ్యాలను ఓడిచి వడపోసిన ఆలంకారిక ప్రముఖులు 'నవ్యం గ్రథనకౌశలాత్' అని తీర్మానించారు అంటే - కూర్పు నేర్పువల్ల కొత్తతనం తప్పక తేవచ్చునన్న మాట—

ఆ దృష్టితో చూస్తే - సోమన హరివంశంలో స్ఫుటమైన నవ్యత కనపడు తుంది ఎఱ్ఱన తీసుకున్న కథలనే తానూ తీసుకుని తనదైన ఒక కూర్పు నేర్పు వల్ల తన రచనను ధగ ధగ మనిపించాడు సోమనాథుడు—

ఈ తళుకు అర్థ చమత్కారంవల్లను, శబ్ద శిల్పంవల్లను సోమన సాధించాడు పద్య రచనకు ఒక కొత్త ఊపు విరుపు ఇచ్చి అనంతరభావి అయిన ప్రబంధ నిర్మాణానికి బలమైన భూమిక నిర్మించాడు

అర్జునుడు బ్రాహ్మణ బాలకుణ్ణి రక్షిస్తానని రక్షించలేక పోయాడు బ్రాహ్మణుడు కోపగించి అర్జునుణ్ణి తూలనాడాడు అప్పు డర్జును డంటాడు—

"అనుచు ననుచారినైయె విప్రుడరుగుదేరఁ
దేర గాండివమిడి యస్మదీయ మహిమ
మహిమడుంగి మడుంగగు మనసుమాయ
మాయ కన్నుల గ్రమ్మ గ్రమ్మటితి నేను" ౨-84

అర్థ పుష్టికి భంగములేని ఈ శబ్దాలంకార రచనలో సోమన నిష్ఠమైన నవ్యత దర్శన మిస్తుంది

దుఃఖితుడైన బాపడు వెంటరాగా, నిష్ప్రయోజకుడైన అర్జునుడు చిన్న బుచ్చుకుని రథంమీద గాండీవం పడవేశాడు అతని మహిమ మొక్కవోయింది

స్వచ్ఛమైన మనస్సు మాసిపోయింది ఏదో మాయ కళ్లను కమ్మివేయగా వెనక్కు తిరిగి వచ్చాడు ఇందులో ఒన అసమ్మతమిద అర్జునుని అనుతాపం స్పష్టంగా ఉంటూ శబ్ద చమత్కారం సమృద్ధిగా ఉంది ఇట్టి రచన పూర్వం లేదు

ఇట్టి దానికి ఇతడే ఆద్యుడంటే తప్పులేదు

విషయ ప్రధానమైన పురాణ భావనకు పూసికట్టి తోడి మెరిపించడం ఈయన నవ్యత

శివకేశవ సమాగమ సందర్భంలో దేవతలు 'హరిఁ జూతురు హరు జూతురు' అని ఎఱ్ఱనగారి పద్యం ఎత్తుగడ చూచి సోమనాథుడు దానిని మరింత ఎత్తుకు తీసుకునిపోయి - 'అరిజూచున్ హరిజూచుఁ జూచుకము లం దందంద మందార కేసరమాలా మకరంద బిందు సలిల స్యందంబు లందంబులై" అనే పద్యంలో తన శిల్ప పారమ్యం చూపాడు

అక్కడనే ఎఱ్ఱన శివకేశవుల మహిమను విరోధాభాసతో

'యజ్ఞ రక్షకుడును, యజ్ఞ విధ్వంసియు
నై లోకనుతుల బెంపారువారు'

అని చెప్పగా దానిని మరింత ఉక్తి విశేషంతో—

'అభ్రంకషంబైన యాలపోతు నితండు
త్రుంచి నా డీతండు పెంచినాడు ' ౨-180
'సారసంబున లేవ సారసంబున జావ
పద్మాసనుఁడు వీరి పాలగనియె ' ౨-181

అని రెండు విరుపులు పెట్టి శబ్దాలంకారంతో మెరుగుతెచ్చి సోమనాథుడు పాఠకుల చూపులో మెప్పు సంపాదించాడు పద్య రచనలోని ఈ ప్రౌఢతనం తర్వాతి వారిని ఎందరినో ప్రలోభ పెట్టింది

పద్య రచనలో ఈయన చూపిన అతిలోక శిల్పం ప్రబంధ మార్గానికి మేలుబంతి అయింది

చిత్రరేఖ బాణాసురుణ్ణి ప్రశంసిస్తుంది

'గెలిచినవాడు నేడు రణకేళిఁ బురందరుఁ దగ్గజేంద్రమున్
వెఱచినవాడు దేవతల వెట్టికి బట్టినవాడు ధూర్జటిన్
విలిచినవాడు భక్తిమయ విత్తమునన్ ధర నేకవీరుడై
నిలిచినవాడు శౌర్యమున నీ జనకుండు భయం బిదేటికిన్' ౫-37

అంతేకాః అచ్చతెలుగు పద్యాలు వ్రాసి, నిరోష్ఠ్యం అనుసంధించి ఆ మార్గానికి ఇతడే ప్రవర్తకు డనిపించాడు సంస్కృతల అంత్యాను ప్రాసలతో ఓజః ప్రధానంగా ఒకవైపు నిక్కని పద్యాలు వ్రాస్తే, కమ్మని జాను తెనుగుతో వేరొకవైపు పద్యం వ్రాయగలిగిన సవ్యసాచి సోమన

శివ సాక్షాత్కార సందర్భంలో ఇతడు 7 సీసపద్యాలు వ్రాశాడు ఒక దానిని వేరొకటి పోలని వైవిధ్యంతో అవి ఆకర్షిస్తాయి ఒక పద్యం (౨-171) రాయజాలి, ఘోరగెలిచి అని అసమాపక క్రియలతో నడిస్తే వేరొకదు (౨-174) ఎఱిగి అనే ఒకే అసమాపకంతో నడుస్తుంది రెండు పద్యాలు కోలాహలంబు (౨ 173) ఆరగ్వధంబు పెంచినాడు త్రుంచినాడు (౨ 180) అని ప్రథమావిభక్తితో ముగుస్తే వేరొకటి 'చివురాకు జొంపమైనన్, సేసపూవు లైనన్ (౨-175) అని కొత్తతోవ తొక్కుతుంది మరి ఒక పద్యంలో ముందొక శంక, వెంటనే సమాధానం (౨-176) ఇంకొక దానిలో కారణము, దానివెంట కార్యముగా సమాపక క్రియ (౨ 181)

సీస పద్య గతమైన ఈతని ఉపజ్ఞ శ్రీనాథునకు కూడ ప్రేరకం ఉద్బోధకం అయిందనడం నిశ్చయం

సోమన సవ్యతకు సంపూర్ణ కీర్తికి మరోము ఖ్యాంశం కూడా దోహదకారి అయింది

తెలుగుజాతి నాడి, తెలుగు పలుకువాడి తిక్కన తర్వాత ఇతనికి తెలిసినంతగా ఇంకొకరికి తెలియ దనిపిస్తుంది

ఇతడు తెలుగు సామెతలపుట్ట, జాతీయాలగని ఆ దీప్తితో ఇతని కవిత్వానికి ఎక్కడలేని వెలుగూవచ్చి ఆ నవ్యత ఆసక్తి పాత్రమయింది అతడు నోర్విప్పితే ఒక అపూర్వమైన సామె, ఊడి పడుతుంది ఒక జాతీయం తళుక్కు

మంటుంది వాటికి జాబితా ఇస్తే అవి స్వస్థానం ఊడదీసి పోగుపెట్టిన అవయవాలు వాటి సత్తువ ఆ సందర్భంలోనే చూడాలి

ఊర్వశి నరకునితో అంటుంది—

'చిత్తమెల్లం జెడియుండ జిత్త యొడలం జవి చేరునె!
చిల్కవోయివం బంజర మేమి సేయ?' 1-72

పౌండ్రకుడు సాత్యకితో—

'ఓరి మీ వంశమందు తాకోర్వజాలు
వారెఁ జూపుము కుమ్మరావమున రాగి
ముంత లేరంగ గలవే? ' 3-48

జనార్దనుడను బ్రాహ్మణ మిత్రుడు హంసడిభకులతో—

'చెలిమి మీ తోడ జేయుట చెట్టతనము
వరుగుతో దాగరయు నెండవలసినట్లు'

శ్రీకృష్ణుడు చప్పటలు గొట్టి అపహసించి రాయబారి జనార్దనునితో చెప్పినది—

1 ఈశు వరముచేత నెవ్వడేని ప్పాట
శూరుడైన - దువ్వుజూచి నక్క
ఒడలు గాల్చికొన్న వడువున—

2 వరము మిమ్ముగావ వలతి యగునె?
వెట్టివార! పిడుగు వ్రేసిన తల టొప్పి
ఆగునే? వివేకమైన వలదె?

ఇట్టివి సోమన రచనలో కొల్లలు

హంస డిభకులు—

కఱవగ వచ్చునే బలిమి గాడిదకుం బులితోలు గప్పినన్?

కోపము కన్నుల గ్రోలనవ్వి 3-118 జూదములో శారి.

ఈ జాతీయాలు విలక్షణమైనవి

1	ఇట్టిక సూడినవాడు	=	ఇటికావము అంటించినవాడు తిరిగి చూడడు
2	వెట్టికి బట్టుట	=	వెట్టిచాకిరీ చేయించడం (లోకువ)
3	పొంగిన పుడిసెడువోయె	=	దొరకిన కొంచెము పోయింది
4	కాలిన త్రాటి చందము	=	రూపం ఉండి ముట్టుకుంటే పోతుంది

అంతేకాదు సోమన్న పిశాచ వర్ణనం, వేట, సలిలోద్యాన క్రీడలు వరుసగా - ఆముక్తపు మాలదాసరిలో, మనుచరిత్ర మృగయా విహారంలో, ప్రబంధ సామాన్యంగా ప్రతిఫలించినట్టు కనపడతాయి

ఈతని నాటి సజీవమైన యుద్ధపరిభాషలు సొగటాల మాటలు, పలుకుబళ్లు నేడు దురవగాహమైనవి వీటిని ఏర్చిరచి వ్యాఖ్యానించవలసిన అవసరం ఎంతైనా ఉంది

సొగటాలు	యుద్ధం
అత్తీవం బిత్తిగ దుగ	కోట సింగారించి కొత్తళంబుల
సత్తా దచ్చేక వంచి చౌవంచిరై	నెల్లc నట్టళ్ళ మన్నించి యాళు
దిత్తిగ యిద్దుగ బత్రలు	వరికి పందిళ్ళు వెట్టించి
చిత్తంబున దులచినట్లు చేతికి వచ్చున్	

పురాణ రచనా విధానం భావబంధురమైనది తక్కిన గుణ విశేషాలు దానికి పోషకంగా ప్రవర్తిల్లాయి

సోమన హృదయ ధర్మం ఆ మార్గానికి చెందినదికాదు అతడు భావ సమృద్ధిగల రచన చేయగలిగినా ఆయన మొగ్గు ఎక్కువ అర్థ శబ్ద చమత్కారాల మీదనే— ఆనాటి రసికులకు విషయ ప్రధానములై ప్రాయశః నిరలంకృతములయిన పురాణ రచనలమీద మోజుతగ్గి గాంభీర్యము, భావనిష్ఠవంటి వాటికన్న ఈ అర్థ శబ్ద చమత్కారాలే ఎక్కువ ప్రీతిపాత్రములైనవేమో! అనే ఊహ కలుగుతుంది కాకపోతె సోమన రచనకు అంత ఆకర్షణ, అన్ని బిరుదుల పరంపర ఉండేవి కావు

ఎఱ్ఱన సోమన లిద్దరూ హరివంశ రచనే చేయడంవల్ల ఎంత వద్దనుకున్నా పోల్చి చూడడం తప్పక ఉంటుంది ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడే అయినా

ఆయన బలం అంతా విషయ ప్రధానమైన భావగరిమీద, నిండైన వర్ణనలమీద, రస నిర్వహణంమీద, సోమనకు ఆ విషయాలు, ఆ ప్రజ్ఞ ఎరుగనివి కావు తలచుకున్నప్పుడు లక్షణంగా నిర్వహించ గలవాడు కాని ఆయన తెలుగు కవితను పురాణ మార్గం నుంచి మళ్లించ దలచాడు, మళ్లించాడు

ఎఱ్ఱయ రచన ఒడ్డుతాచి నిండుగా ప్రవహించే శాంతగంభీర నదీ సదృశం అయితే సోమనాథునిది పైనుంచి కిందికిదూకి రాతిపలుకలమీద చిద్రుపలై ముత్యాల జల్లులు విసరి నిమ్నోన్నతాలలో కుంగుతూ పొంగుతూ నిలవక పరుగెత్తే గిరినిర్ఝరిణి

ఒక్కమాటలో చెప్పవలసివస్తే ఎఱ్ఱన ఋషి సోమన కవి అంతే—

నైషధాదులు శ్రీనాథుడు

సోమనుడు ఒక వెలుగు వెలిగి తప్పుకొన్నాక - ఆంధ్ర సాహిత్య వినీలాకాశంలో పలువన్నెలతో - వంపులతో - విశాలంగా పరుచుకున్న అద్భుత ఇంద్రధనువు శ్రీనాథుడు

అంతకుముందు పురాణేతిహాసాలను తెనిగించి తెనుగు కవితను సుసంపన్నం చేసిన వ్యోమకేశులున్నారు ఎన్నుకొన్న చిన్న పరిధిలో మెరసి అదృశ్యమైన చిరుకవులూ ఉన్నారు కాని అంతవరకు ప్రహతమైన మార్గాన్ని మళ్లించి కవితారథాన్ని కొత్తతోవ పట్టించడంలో, కావ్య ధర్మాన్ని పూజాపీఠం ఎక్కించడంలో సోమన వేలుచూపితే - మోచేయివరకు దింగెయ్య గలవాడు శ్రీనాథుడు

సోమన ఎత్తిన కావ్య ధ్వజాన్ని - తుదకంటానిల్పి, మార్గం విశాల పరచి - సుస్థిర దుర్గం ఏర్పరచి కవి సార్వభౌముడై ఆంధ్రకవితా సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసినవాడు ఇతడు

అంతేకాక - సంస్కృత కావ్యాలను తొలిగా చేపట్టి తన అమృత హస్త స్పర్శతో తెలుగుల సొత్తుచేసి 'ఒక శ్రీనాథుని తనం' స్థాపించాడు

చదువులో సోమనాథుని కంటె 'ఏడాకు' లెక్కువ చదివి పాండిత్యంలో మల్లచరచి నిలబడ్డాడు

సంస్కృత ప్రాకృతాది భాషల్లో అఖండ పండితుడు
తర్క, వ్యాకరణ శాస్త్ర విశారదుడు
అఖిల పురాణ విద్యా ప్రవీణుడు
బ్రాహ్మీదత్త వరప్రసాదుడు
బ్రహ్మజ్ఞాన కళానిధి
కృష్ణయజుర్వేద నిష్ణాతుడు
కవితా మహారాజ్య భద్రాసనారూఢుడు

ఈ లక్షణాలు ఆయనే చెప్పుకున్నవి కొన్నీ - హితులు, సన్నిహితులు చెప్పినవి కొన్నీ ఇవి లాంఛన ప్రాయాలు కాక అతని రచనలు చదివితే తప్పక ఋజువయ్యేవి ఇక్కడ చిత్రమేమిటంటే అంతటి శాస్త్ర పండితులు తరచు కవిత్వంలోకిరాక - పారప్రవచనాల్లోనో, పాండిత్య ప్రదర్శనాల్లోనో, తమ కాలం వినియోగిస్తూ ఉంటారు కాని ఈయన విశేషం 'కవితా మహా రాజ్య భద్రాసనారూఢుడు' కావడం

అయితే - అంతటి సంస్కృతి ప్రభుత్వం ఉన్నప్పుడు సమకాలికుడు వామన భట్టబాణుని లాగు సంస్కృతంలోనే మహాకావ్యాలు వ్రాసి, అఖండ ఖ్యాతి ఆర్జించవచ్చు గదా - సంస్కృత విద్వాంసులు చులకన చేసే తెలుగు కవిత్వంలోకి దిగడం ఎందుకు అని ఒక ప్రశ్న—

అక్కడే - శ్రీనాథుని వ్యక్తిత్వంలోని కీలకం ఉంది - అతడు కావ్య కళానిధులైన తెలుగు కవుల కుటుంబంలో పుట్టాడు - అతని తాత కమల నాభామాత్యుడు (ఆంధ్ర) కవితా విద్యాధరుడు పద్మపురాణం సంగ్రహించి ప్రఖ్యాతి గన్నవాడు తండ్రి మారన 'విద్యారాజీవభవుడు' తన తాత గొప్ప కవి అని సగర్వంగా చెప్పుకోవడం అతని కిష్టం కనుకనే 'అనుగుందాత' అంటాడు తండ్రి లక్షణాలకంటె తాత లక్షణాలు రావడం ఎక్కువ చూస్తాం కనుక శ్రీనాథుడు సంస్కృత కవి కాక అచ్చపు తెలుగుకవి అయాడు

అయితే తాతగారిలాగు ఒక పురాణమో, ఇతిహాసమో తెనిగించి తానూ ఒక ఎన్నికగన్న కవి ననిపించుకోవచ్చు కాని అతని ఉరుకు అంతతో ఆగలేదు వంశక్రమంలో వచ్చే తెనుగు కవిత్వమంటే ఇష్టపడడంతో అతని

తెనుగుప్రీతి అంతరించలేదు తెలుగు దేశమంటే ఇష్టం తెలుగు కొండలు, నదులు, నేల అంతా అతనికి ఆరాధ్యం తెలుగులోకంలో గాలిలా వ్యాపించి, నీరులా ప్రవహించి తెలుగు రుచుల్లో కరిగిపోయాడు

కొండ గుర్తుకు - అతడు 1360 లోనో 78 లోనో పుట్టాడనీ, అతని అభిజనం తూర్పు సముద్ర తీరంలో ఒంగోలు చేరువ పాదర్తి అనో, కొత్త పట్టణమనో అనుకోవడం, 1404 నుంచి 20 వరకు కొండవీటి రాజ్యమేలిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా - విద్వత్కవిగా జీవితం ప్రారంభించాడని చెప్పుకోవడం పరిపాటిగాని, నిజానికి తెలుగుదేశం అంతా అతనిదే 'పాయ కొకచోట జదికిల బడక యుండనైన ఫలమేమి' అటు వినోదార్థమరిగి, సంచరింతముగాక (భీమ ౫ 16) అనే తత్త్వంవాడు సింహాచలం తిరునాళ్ళలో పల్నాటి మెట్ట నేలల్లో - ఓరుగల్లు రాజవీధుల ఉత్సవాల్లో - విద్యానగర వీధుల దగ్గరనుంచి - రాచకొండ వెలమల రాచబాటలదాకా తరగని ఉత్సాహంతో తిరిగినవాడు శిష్యులకు కవితా రహస్యాలు చెబుతూనో స్నేహితులతో ముచ్చటలాడుతూనో, చాటువులు విసరుతూనో తెలుగు దేశమంతా ఒక పెండ్లి పందిరిగా నడయాడినవాడు ఈ రోజు నెల్లూరులో కనపడితే - రేపు రాజ మహేంద్రవరం ఎల్లుండి శ్రీకూర్మంలో - దర్శన మిచ్చి నట్టుంటాడు తెలుగు కవుల్లో ఇంత ఆంధ్రాంచలాలు ముట్టినవాడూ ఇన్ని రచనలుచేసి, దిశాంగణాలు కీర్తి కర్పూరాలు వెదచల్లినవాడు వేరొకడు లేడంటే ఆశ్చర్యపడనక్కరలేదు

ఇతః పూర్వం తెలుగు మహాకవుల గ్రంథాలే చదివి హర్షించాం ఆనందించాం కాని వారివైపు పరీక్షగా చూచే అవకాశం మనకులేదు అయితే శ్రీనాథుని పుస్తకాలకంటే అతని వర్తనాన్ని తేరిపారి చూడాలని పిస్తుంది

కొందరు వ్రాసినప్పుడే కవులు, కొందరు వ్రాస్తూన్నంత కాలం కవులు, మరికొందరు వ్రాసినా వ్రాయకపోయినా నిత్యం కవులే అనిపిస్తుంది శ్రీనాథుడు మూడో కోవకు చెందినవాడు

"నేను కవిత్వంకోసం పుట్టాను, కవిత్వం నా వృత్తి, భాషే మతం, కవిత్వమే దైవం, దానితో నా వారికి రక్తి చూరలిస్తాను" అని ఎలుగెత్తి చెప్పినట్టుంటాడు

పల్నాటి సీమలో దాహమైతే పద్యం, ఓరుగంటిలో కోడి పందాలు చూస్తే కవిత, సింహాచలం తిరునాళ్లలో తిరిగే వన్నెవన్నెల పధూమణులమీద చంపకాల ఉత్పలాల జల్లులు! సీసపు విసరులు!

రాజమహేంద్రపురపు వైతండికపు పిచ్చుకలమీద బ్రహ్మాస్త్రాలు! రామయమంత్రి భోజన పరాక్రమం మీద పరిహాస దరహాసాలు! ఎన్నని చెప్పడం?

చతుర వ్యాహారమే ఆహారం -
మధుర పద్యధారలే పానీయం -
అట్లా పరిమళించిన బ్రతుకది -
అట్లా పులకరించిన రోజులవి!

గౌతమీ తీరంలో మార్కండేయాలయం దగ్గర - వేణుగోపాలస్వామి ఆలయం ముందు ఆ వచ్చే మహానుభావు డెవరు?

చేతికి మాణిక్యాంగుళీయకం -
ముఖం మీద కస్తూరి రేఖ -
గొప్పదమంత జుట్టువండిలో చెంగల్వ విరి
సన్నని పట్టుపంచె రాచుకుంటూ ముత్యాలహారం
ఇంట్లో వెండి బంగారాలు పండుతున్నవాడిలా ఉన్నాడు
అతని కొంటె చిరునవ్వులో శాలివాహన సప్తశతి -
విశాల ఫాలభాగంలో నైషధం -
బంగరు తీగతో చుట్టిన రుద్రాక్షమాలలో హారవిలాసాలు -
పెదవుల కదలికలో భీమయదేవుని పలకరింపు -
అదీ శ్రీనాథుని శాంతిమూర్తి అనిపిస్తుంది!

నిండు జవ్వనం వచ్చింది. అంతకు ముందు రెండు మూడు రచనలు చేశాడు. కాని తృప్తిలేదు. తన వైదుష్యధాటికి అవి ఆపోవ లేదు.

పండితులు వెన్నుచరిచి భేష్ అనే ఉద్గ్రంథం వ్రాయాలి. అదీ తన కవితా ప్రస్థానానికి చరితార్థం—

'నైషధం విద్వదౌషధం' అన్నారు. ఆ నైషధం ఏది? నిస్సందేహంగా శ్రీహర్ష సంస్కృత నైషధమే. ఔషధం రోగగ్రస్తులు పుచ్చుకోవచ్చు. కండ బలానికి గ్రహించవచ్చు. అయితే ఈ నైషధం ఎందుకు?

అజ్ఞాన రోగావిష్టులకు ఔషధం క్రమిస్తుంది
బలహీనులకు అపరిమిత భాషాబలం ఇస్తుంది

సంస్కృతంలోని అపూర్వ శబ్దాలు, లకార ప్రయోగాలు, కారక చమత్కారం పదబంధాలు ఉక్తి విశేషాలకు అది ఒక గని కనుకనే అది శాస్త్రకావ్య మయింది

గీర్వాణ భాషాస్వభావాన్ని బట్టి అది తెలుగులో ఒదగదు ఆశ్లేషలు రావు కొన్ని శబ్దాలకు తెలుగులేదు దాన్ని తెలుగులో పలికించడం ఒక ప్రతిష్ఠా సమస్య

"కావ్య నిర్మాణంలో సంస్కృతం సుప్రతిష్ఠిత స్థానంలో ఉంది ఆ వజ్ర సింహాసనం పక్క తెలుగు తల్లి భద్రాసనం ప్రతిష్ఠించాలి అదీ ప్రజ్ఞ -" అని సింగనామాత్యుడే అన్నాడో అతని ఉద్దండ పాండితికే అనిపించిందో శ్రీహర్ష మహాపండితుని నైషధకావ్యం చేపట్టాడు

నాటి యువకవి శ్రీనాథుడు, చిరునవ్వుతో బాలకృష్ణుడు, కువలయాపీడ మత్తేభాన్ని లొంగదీసినట్టు నైషధాన్ని వంచి స్వాధీనం చేసుకున్నాడు

నైషధం మీద ఆయనకు చాలా మోజు
నారికేళ ఫలపాకమునం జవియైన భట్టహర్షుని కవితాను గుంభములు
'ఆంధ్ర నైషధాబ్జభవుని'

'కల్పించినాడవు గాఢపాకంబైన హర్షనైషధకావ్య మాంధ్రభాష' అని ఎలుగెత్తి చాటాడు

'ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండ' చేత బట్టినది కాశీ ఖండం 'కాశీ ఖండ మయఃపిండమ్' అని లోకోక్తి అంటే కాశీ ఖండమనే గ్రంథం ఇనుపగుండు అనగా - విడగొట్టరానంత కఠినమైనదని - గ్రంథపరంగా అంత క్లిష్టమని వారి ఊహ ఈ మాట గూడ సంస్కృత గ్రంథానికి చెందినదే - ఈ క్లిష్టత రెండు విధాలుగా ఉండవచ్చు ఒకటి మూల కాశీ ఖండంలోని సాముద్రిక, యోగ మంత్ర, శాస్త్ర రహస్యాలు వ్యాఖ్యాన సాపేక్షములు అట్టి వాటిని మనసుకు తెచ్చుకుని తెలుగులో తేటగా చెప్పడం శ్రమైకసాధ్యం

రెండు అర్థ సమన్వయ కాఠిన్యం — ముడికందని కథలను ఒక కొలికికి తేవడం ఈ రెండిటినీ అవలీలగా నిర్వహించ గలనని ఆయన అభినివేశం

కనుకనే 'కాశికాఖండ మను మహాగ్రంథ మేను తెలుగుజేసెద' అని చెప్పి తన సామర్థ్యాన్ని 'కర్ణాటదేశ కటక పద్మవనహేళి శ్రీనాథ భట్టసుకవి-' అనే విశేషణాలతో ఉగ్గడించాడు

కాశికాఖండం అంని దృష్టిలో 'మహాగ్రంథం' దాని ప్రసక్తిలో రెండుచోట్ల అదేమాట అంటాడు

కేవలం శాస్త్ర పండితులకు కవిత్వంమీద ఆసక్తి ఉండదు శాస్త్రం చదివి పూర్వపక్ష సిద్ధాంతాలుచేసి ప్రతి పక్షుల ముఖపిధానం చెయ్యడమే వారి పరమార్థం — లోలోపల సంస్కృత పండితులలోనే శాస్త్ర పండితులకూ కవులకూ రవంవలు ఉన్నాయి

'ఘటః పట ఇతి స్ఫుటం పటురటంతి నైయాయికాః
పరంతిచ హాతాత్తరాం కఫ ఛలేతి పాతంజలాః
వయం వకుళ మంజరీ గళదరీణ మాధ్వీఝురీ
ధురీణ శుభరీతిభిః ఫణితిభిః ప్రమోదామహే'

తర్క వ్యాకరణ పండితులు రసజ్ఞులు కారు శుష్క తర్క వితర్క వాచాలురు కవులు మధుమయ ఫణుతులతో వినోదిస్తారు

'నైవ వ్యాకరణజ్ఞ మేవ పితరం న భ్రాతరం తార్కికం
దూరా త్సంకుచితైవ గచ్ఛతి యథా చండాలవ చ్ఛాందసాత్
మీమాంసా నిపుణం నపుంసకమితి జ్ఞాత్వా నిరస్యాదరాత్
కావ్యాలంకరణజ్ఞ మేవ కవితాకన్యా వృణేతే స్వయమ్'

కవితా కన్యకు తండ్రి వంటివాడు వైయాకరణుడు సోదరుడు తార్కికుడు, శ్రోత్రియుడు అంటరానివాడు, మీమాంసకుడు నపుంసకుడు వారెవ్వరూ వంచదగ్గవారుకారు ఇక కావ్యాలంకారవేత్త అయిన రసజ్ఞుడే వరణీయుడు - అని కవులు శాస్త్ర పండితులను ఈసడించారు

'విద్వత్కవయః కవయః కేవల కవయస్తు కేవలం కపయః' పాండిత్యంతో చెప్పినవారే కవులు వట్టి కవులు వట్టి కపులు - అని పండితులు తిరస్కరించారు

మొత్తం మీద చూస్తే కవులకు శాస్త్ర పాండిత్యం అవసరమే కాని దానికి కొమ్ములిస్తే మాత్రం అది కవిత్వాన్ని పట్టి పల్లార్చడం నిజం

రెండింటి సరస సమ్మిశ్రణమే ఉత్తమ కవితామార్గం

శ్రీనాథుడు ఎంతటి మహా విద్వాంసుడైనా - ఆస్థాన విద్యాధికారి అయినా - పాండిత్యానికి కొమ్ము లివ్వలేదు శాస్త్రం హద్దుమీరకుండా శిక్షణలో ఉంచి కవిత్వాన్ని రసవంతం చేశాడు

గౌడ డిండిమభట్టు కంచుఢక్క పగులగొట్టించడానికి ముందుగా - పెదకోమటి వేమారెడ్డి పరిపాలిస్తున్న రాజమహేంద్రవరం వచ్చాడు అంతా కొత్త ఇంకా రాజాశ్రయం దొరకలేదు అన్నయ మంత్రి అండ కనుచూపు మేరలో ఉంది ఏ గోష్ఠిలోనో శుష్క తార్కికులు తగిలారు వైతండికులు అడ్డుపడ్డారు తన పాండిత్యమేమీ తక్కువది కాదు ఎదిరించి విదళించాడు అయినా వారు వదలలేదు, విసిగించారు వితండం అడ్డు పెట్టుకున్నారు తానింకా పాదుకోలేదు మనఃక్లేశం కలిగించారు అది మనస్సును పట్టి పోయింది దాని ఫలితంగా భీమఖండం వ్రాస్తూన్నప్పుడు వారు జ్ఞాపకం వచ్చారు

> 'బోధ మల్పంబు గర్వ మభ్యున్నతంబు
> శాంతి నిప్పచ్చరమ్ము మచ్చరము ఘనము
> కూప మండూకముల బోలి కొంచె మెఱిగి
> పండితమ్మన్యులైన వైతండికులకు'
>
> 'నికటమున నుండి శ్రుతిపుట నిష్ఠురముగ
> అదరి కాకులు బిట్టు పెద్దఱచినపుడు
> ఉడిగి రాయంచ ఊరక యుంట లెస్స
> సైపరాకున్న ఎందేని చనుట యొప్పు' భీమ ౧-13, 14

అతడు ఎంత సహనం కోల్పోయాడంటే అశ్లీలం కూడా లెక్కచెయ్యకుండా వారిని గేలిచేస్తేగాని తీరనంత అసహ్యం చాటువుల్లో చాటాడు

ఇది కుకవి దూషణం పేరిట దుష్పండిత తిరస్కారం తక్కిన గ్రంథాల్లో ఇంత పారుష్యం కనబడదు

భీమఖండపు కుకవి దూషణ సందర్భంలో—

"ఎవ్వరేమన్న నంద్రుడు గాకేల కొఱంత
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష" ౧-15

అనే వింతమాట ఒకటి అన్నాడు - ఇది గొంతు పట్టుకుంది అతడు వ్రాసిందంతా నన్నయాదుఃవంటి మార్గకవిత అయినప్పుడు - నాది 'కర్ణాట భాష' అంటే - అర్థమేమిటి ? 'కర్ణేషు అటతీతి కర్ణాటా + సా చ + భాషా' అని చెప్పి- చెవుల కింపైన భాష - అని అర్థం చెప్పి ముడి పెట్టారు ఇది సమర్థింపుగాని, పూర్వ కవులది ఎవరిది ఇంపైన భాష కాదు ? దేనికిది వ్యావర్తకం ? పూర్వ గ్రంథ కర్తలు ఈ అర్థంలో ఎవరైనా ఎప్పుడైనా వాడారా ? అనేది తీరని సందేహం

'నా సంస్కృత ప్రౌఢి చూచి సంస్కృత భాష అంటున్నారు పలుకు నుడికారంచూచి ఆంధ్రభాష అంటున్నారు రెండూ విడి విడిగా ఏర్పాటుగా వాడడం నా శైలికాదు నాది నిజానికి ర్ణాటభాష అంటే -'జాణ్ణుడి' అంటే జానుదెనుగు ఈ జానుదెనుగు నినాదం నన్నెచోడునితో మొదలై, సోమనాథుని ద్వారా ప్రచారమై, శైవ సంప్రదాయం కారణంగా శ్రీనాథుని దగ్గరకు వచ్చింది దాన్ని శ్రీనాథుడు అభిమానించి 'జాణ్ణుడి' అనే అర్థంలో ఈ మాట ఉపయోగించినట్టు కనబడుతుంది స్థూలంగా చూస్తే నన్నయాదుల మార్గమే కనపడినా, సూక్ష్మానికి నన్నయకంటె నగానికి స ం చిక్కని తెనుగు ప్రయోగాలు పోహాళించినవాడు శ్రీనాథుడు

నన్నెచోడుడు కూడా సమృద్ధిగా సంస్కృతం వాడినవాడే కాని జానుదెనుగు నా రచన అన్నాడు అంటే సంస్కృతాంధ్రాలు సమసమ్మిశ్రితమైన కొత్త తెనుగు దానినే జాణ్ణుడికి మూలమైన కర్ణాటభాష అని చమత్కారంగా అన్నాడు కాని అతని కవితలో నన్నెచోడుని వంటి కన్నడ పదబాహుళ్యం ుపడదు అయితే రాయవేశ్యా భుజంగ, జగనొబ్బగండ గాయగోవాళ, వీరరాహుత్త వంటి పదెనిమిది కన్నడ బిరుద ప్రయోగాలు, దినవెచ్చమువంటి వైరి సమాసాలు కనబడడం కద్దు అం మాత్రం చేత కర్ణాటభాష అ వేసిన అవసరం లేదు అవి నామవాచకాలవంటివి యథాతథంగా వాడవలసినవి వైరి సమాసాలు క్వాచిత్కంగా శ్లాఘ్యకవి

ప్రయుక్తాలే ఉన్నాయి అవి గూడ కర్ణాట పద సాధకాలు కావు ఆలోచించ వలసిన ఇంకొక కారణం గూడా కనపడుతుంది

శ్రీనాథుని మధ్య కాలంలో - పాకనాడు ప్రౌఢదేవరాయలు పాలకుడుగా తెలుగు రాయలు సామంత రాజుగా, ప్రవర్తిల్లింది అప్పుడు కర్ణాట రాజ భాష ప్రభావం పాకనాడు మీద ఉండి ఉండవచ్చు ఆ ప్రభావానికి లోనైన పాకనాటి భాషను[1] శ్రీనాథుడు వ్యవహరిస్తే వేగినాటి రాజ మహేంద్రవరపువారు పరిహసించడం అసంభవం కాదు అప్పుడు అహంకారం వెల్లువికినాది కర్ణాటభాషే ఏమనుకుంటే అనుకోండి అని వ్యతిరేక లక్షణంగా అన్నా అని ఉండవచ్చు

మొత్తం మీద అది వైరి తిరస్కారంగా అన్నమాటగాని యథార్థ కథనంగా మాత్రం కనపడదు

విద్వాంసులు నన్నయగారిని గూడా వేరొక విధంగా వేధించినట్టు సూచన ఉంది

ఘోరయుద్ధంలో పాకశాసనికి నారాయణునట్లు, తనకు మిత్రుడు నారాయణభట్టు సాహాయ్యం చేశాడన్నారు ఇక్కడ యుద్ధోపమానం ఆంధ్ర భాషా రచనలోని తర్క వితర్కాలను సూచిస్తుంది లేకపోతే తత్త్వోపదేశం, ఆపదుద్ధరణం, వంటి ఉపమానాలు తేవచ్చు

అయితే వేంగినాడులో అందరూ మత్సరులే అని అపోహపడగూడదు ఆ పట్టణంలో కావ్య రసికులూ, గుణ గ్రాహులూ అయినవారు ఆ మహాకవులిద్దరి రచనలకూ హర్షించి ప్రోత్సహించారు నారాయణభట్టు వంటి సత్పురుషుని అండ నన్నయకు, అన్నయ మంత్రివంటి ఆత్మీయుని ప్రాపు శ్రీనాథునికి లభించాయి కనకనే వారి కవితలు మత్సరి గ్రస్తులను ఈసడించి శోభించాయి

శ్రీనాథ కవి విరోధులకు వజ్రం, అయినట్టే సజ్జనులకు చందనం ఆ శక్తివల్లనే ఆయన కవిత అడ్డుపడిన బండలను చీల్చుకుంటూ ప్రవహించి తెలుగు

---

1 ఉదా పాకనాటి వారు వప్పులను బేడలంటారు 'బెల్లపుటచ్చులున్ సెనగ బేడలు'— హర ౨-91

దేశంలో స్థిరపడిపోయింది ఆక్షేపించిన అమాయకులు కలికంలోకీకూడా రాకుండా పోయారు వారి అపకీర్తిమాత్రం శ్రీనాథుని చాటువులబట్టి బ్రతుకుతోంది

ఏతావతా - అతని ఉద్దండ పాండిత్యం కవితామాధుర్యానికి అడ్డుగా నిలవలేదు కవిత్వానికి ఒదిగి తన పరువు నిలుపుకుంది చేయికలిపి నడిచింది

కవితా ప్రస్థానం

శ్రీనాథ కవి రచనలుగా చెప్పబడుతున్న గ్రంథాలు 13 ఇప్పుడు మనకు దొరుకుతున్నవి 7 నామమాత్రములు 6

1 శృంగార నైషధం 2 హరవిలాసం 3 భీమ ఖండం 4 క్రీడాభిరామం 5 కాశీ ఖండం 6 శివరాత్రి మాహాత్మ్యం 7 పల్నాటి వీరచరిత్ర - అనేవి ప్రస్తుతం లభిస్తున్నవి

లభించనివి - మరుత్తరాట్చరిత్ర 2 శాలివాహన సప్తశతి 3 పండితారాధ్య చరిత్ర 4 ధనంజయ విజయం 5 నందనందన చరిత్ర 6 వల్లభాభ్యుదయం

లభించని గ్రంథాల గురించి దీర్ఘచర్చ అకించిత్కరం అది చరిత్రకారులకు వదిలేద్దాం

లభించే వాటిలో పల్నాటి చరిత్ర గురించి అభిప్రాయ భేదాలున్నాయి గాని తక్కిన వాటి గురించి ఏకవాక్యతే

పల్నాటి వీరచరిత్ర శ్రీనాథునిదే అని ఉపపత్తులు చెప్పి సాధిస్తున్నవారున్నారు వచః శక్తివల్ల సాధించినా నాణానికి రెండోవైపు కూడా ఉంటుంది తక్కిన గ్రంథాలతో పోల్చిచూచి నప్పుడు శ్రీనాథుని కవితానుభూతి కలుగుతున్నదా ? అని విచికిత్స - ఆ అనుభూతి కొందరికి కలుగుతున్నదేమో గాని మరి కొందరికి కలగడం లేదు విషయ పరిజ్ఞానం, రచనా ప్రౌఢి చూపి శ్రీనాథునివే అని నిర్ధరించిన భాగాల్లో కూడా - అతని వక్రోక్తి శబ్దాల విరువు పదబంధ వైలక్షణ్యం ఎక్కడా కనిపించదు ఆ భాగాలు వ్రాసినవాడు గొప్పకవే కావచ్చుగాని శ్రీనాథవాసన లేదు అది మధ్య

మాధికారల కోసం వ్రాసిందని ప్రతివాదం చేయవచ్చు కాని ఎంత సామాన్య స్థాయికి దిగినా కవి తన జీవ లక్షణమైన శైలీచ్ఛాయను ముడిచి దాచుకోలేడు. కవిగా నోరువిప్పితే అది బయటపడవలసిందే అందులోను తెనుగు కవిత్వంలో కొత్తస్ఫూర్తిని, కొత్త పోహళింపును స్థిరపర్చి ఇది శ్రీనాథుని తనం అని ఒక ఘంటాపథాన్ని నిర్మించినవాడు ఎక్కడా 'తన తనం' లేకుండా ముడిచిపెట్టుకుని వ్రాశాడంటే - అంతరాత్మ ఒకంతట ఒప్పుకోదు గరుత్మంతుడు ఎంత రెక్క ముడుచుకున్నా అతనిధాటి కనబడకుండా ఉండదుగదా!

ఇది మంజరీ ద్విపదలో రమ్యమైన రచన బ్రహ్మనాయని భార్య సంతానంకోసం చేసిన వ్రతాలు బాలుని బొంగరాలాట బాలచంద్రుని ప్రచండ పౌరుషం, మగువ మాంచాల ప్రోత్సాహం వంటి ఘట్టాలు ఎన్నో ఆస్వాద్యములై ఉన్నాయి

లభించని వాటిలో శాలివాహన సప్తశతి కూడా ఉన్నా క్రీడాభిరామం లోని కొన్ని పద్యాలు చూచి శ్రీనాథ హృదయజ్ఞులు ఇవి శాలివాహనలోవి అయి ఉండవచ్చు నన్నారు వాటికి మూలమైన గాథలను కూడా చూపారు

ఒక మచ్చు చూడవచ్చును—

> "విక్కిణయి మాహమాస - మ్మిపామరోపా ఇడింప ఇవేణ।
> ణిద్ధూమ ముమ్మురవ్వి అ - సామలియథణో పడిచ్ఛన్తో॥"

దీని సంస్కృతచ్ఛాయ—

> "విక్రీణీతే మాఘమాసే - పామరః ప్రావరణం బలీవర్దేన।
> నిర్ధూమ ముర్మురనిభౌ - శ్యామల్యాః స్తనౌ పశ్యన్॥"

దీనికి తెలుగుసేత—

> "మాఘమాసము పులివలె మలయుచుండ
> పచ్చడంబమ్మె కొంచ్చాడు వసరమునకు
> ముదిత చన్నులు పొగలేని ముర్మురములు
> చలికి ఒరగోయ కేలుండు సైరికుండు"

ఇందులో 'పులిపలె' 'పచ్చడము' పసరము' 'ఒరగోయు' అనే మాటలు తెలుగు గుండెకు తగిలేటట్టు ఉన్నాయి ఈ స్వాతంత్ర్యం చేయి తిరిగిన కవే చేయగలడు ప్రాకృత సంస్కృతాలు ఆధారంగా తెలుగు చుట్రుమని తగులుతున్నది

ఇందులోని 'ఒరగోయు'కు అర్థం తెలుగు నిఘంటువుల్లో లేదు 'ఒరుగు + కోయు' శబ్ద పల్లవంగా గ్రహించి పోగొట్టు 'నశింపజేయు' అనే అర్థాలను సాధించవచ్చు

ఇట్లే 'హారణనేయ దావగొనవా ?' పటుఝుంఝూ పవనోత్తృణాలయములో' అనే పద్యాలు చూడవచ్చు

వీటిలోని సంస్కృత పదబంధము, తెనుగు కూర్పు, శబ్దాలంకారం శ్రీనాథుని గంరధ్వనిని తలపింప జేస్తాయి

ఇతడు తనకు ప్రతిష్ఠాకరంగా ఎంచి పలుమారు ఉగ్గడించిన కావ్యం శృంగార నైషధం

> ' భట్టహర్షుండు వాక్ప్రౌఢి మెఱయ జెప్పిన
> నైషధ శృంగార కావ్యంబుఁ దెలియ జెప్పితి నాంధ్రదేశభాష'
>
> ౧-203

అని గ్రంథాంత పద్యంలో తన హృదయం వెల్లడించాడు

ఇందులోని శృంగార ప్రాచుర్యాన్ని బట్టి ఈఅడే నైషధానికి శృంగార శబ్దం చేర్చాడు

సంస్కృత సాహిత్యంలో కొండలు తిరిగిన బాణుడు, భవభూతి, భారవి, మురారి, మయూరుడు వంటి కవులంటే వల్లమాలిన ఆరాధన వారికి దీటైన హర్షుడంటే అభిమానం ఉండడం సహజం వారి అపార రచనా శక్తిమీద ఉన్న మోజుతో వారిని అనుసరించాడు, ఆంధ్రీకరించాడు కాని వారికి బానిసయై శుకానువాదం చెయ్యలేదు వారి ప్రతిభను, పాండిత్యాన్ని జీర్ణించుకుని స్వప్రజ్ఞతో తెనుగుదారి పట్టించాడు తెనుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు సంస్కృత పండితులు సాహంకారంగా చెప్పుకుని పన్నిదం చరచే గ్రంథాలను ఎంత ముద్దుల మూట కట్టేలా తెనుగులోకి

తేవచ్చునో చేసి చూపించాడు ఇంకా సూదుంతో విడదీసి సూక్ష్మలేశాల దగ్గిర ఆక్షేపించేవారూ ఉండవచ్చు వారికి అక్షరాలేగాని అంతరంగంతో పనిలేదు వారిని పట్టించుకోకుండా ముందుకు నడచి పోవడమే ఆయన లక్ష్యం ఆయన రచనలోని 'ఇంపు' చాలమంది సహృదయులకు సమ్మత మయింది కనుకనే హర్ష నైషధానికి ఆయన హర్షిస్తే, ఈతని శృంగార నైషధానికి తెలుగునాడు హర్షించింది లోపాలుండవచ్చు (చేతో నలంకా మయతే పంచ నైషధి వంటి చోట్ల ఎంచేవి) దానికి ఒప్పుకున్నా ఆయన రచనా ప్రతిష్ఠకు వాటివల్ల భంగం వాటిల్లలేదు కనుకనే నాటినుంచి నేటి వరకు దానిమీద వేరొకడు చేయివెయ్యడానికి సాహసించలేదు

నిజానికి శ్రీహర్ష నైషధంలో రసవత్కవితా వైభవం కంటె ప్రచండ మేధాబలం ఎక్కువ - ఆయన బుద్ధి ఎవారానికి ఎంత చకితులమైనా - కవితా మాధుర్యంలో ముగ్ధులం కాలేము శ్రీనాథ కవికి ఈ కిటుకు తెలుసు పాండిత్య ప్రకర్షపై మొగ్గుచూపే ఆ యుగలక్షణం శ్రీనాథునిలోనూ కొంత లేకపోలేదు భట్టహర్షుని కవితాను గుంభములు నారికేళ ఫలపాకము నం జవియైనవి! (టెంకాయ పెంకు పగలగొడితేగాని దానిరుచి అందదు) అని ఆయన ఒప్పుకుంటూనే భాషలో పటు పరిశ్రమ చేయని సోమరిపోతులకు అవి అర్థంకావని శ్రీహర్షుని మాటనే అనువదించాడు

ఆనాడు నైషధానికి సరియైన వ్యాఖ్యలున్నాయో లేవో చెప్పలేం మల్లినాథుని వ్యాఖ్య 15 శతాబ్దిలోనే పుట్టినా - ఇతడు చూచాడో లేదో కూడా నిర్ధరించలేం

మల్లినాథుడు తన వ్యాఖ్యావతారికలో—

> 'క్షుద్రవ్యాఖ్యా విషార్తానాం। శ్రీహర్ష కవిరాడ్గిరాం।
> ఉజ్జీవనాయ జీవాతు ర్జియా దేషమయాకృత॥'

అన్నాడు అంటే తనకు ముందు క్షుద్ర వ్యాఖ్యలున్నాయనీ, అవి శ్రీహర్ష కవి వతంసుని కవితకు విషం పెట్టాయనీ తన వ్యాఖ్య దానికి ఉజ్జీవన హేతువై జీవాతువు అవుతుందనీ శపథంచేసి చెప్పాడు అంటే నైషధం సరియైన వ్యాఖ్యలేనిదే అర్థంకాదని తాత్పర్యం అట్టి నైషధ కవితకు సరియైన అర్థం

నిర్ణయించి తెలుగు చెయ్యడం అనే ప్రతిష్ఠకు గీటురాయిగా శ్రీనాథుడు భావించడంలో అర్థం ఉంది

నైషధాన్ని తెలుగులోకి తేవడానికి కొన్ని నియమాలు పెట్టుకున్నాడు ఆ నియమాలు చాలవరకు పాటించాడు భావ, అలంకార, రసాలమీద శ్రద్ధ చూపాడు. అనౌచిత్యం పరిహరిస్తా నన్నాడు కాని కొన్ని అనౌచిత్యాలు ఉండిపోయాయి అవి నేటి అభిరుచికి సరిపడకపోయినా ఆయనకంత పట్టింపు లేకపోయిందను కోవాలి దమయంతీ వర్ణనంలో 'వరాంగం' వర్ణించకపోయినా - అశ్వమేథ వివరాలు చెప్పకపోయినా చెడిపోయే కావ్యధర్మం ఏమీలేదు పెండ్లిలోని బువ్వపుబంతి హాస్యం శ్రీనాథుని హాస్యప్రీతికి నిదర్శనం కావచ్చుగాని సభ్యతాదృష్టిలో నేటి రుచికి సరిపడదు

ఇంక - శృంగార నైషధం సుగుణం ఏమిటంటే - ఎంత సంస్కృతం వచ్చినా - చేతబట్టిన తెనుగు భావుకుడు శ్రీనాథ నైషధమే ప్రియంగా చదువుతాడు దానిలో ఆయన తెచ్చిన తెనుగుతనం రసనిష్పత్తి అంతటిది

హర్షుని భావాన్ని జీర్ణించుకొని ఆయన రెండు మూడు శ్లోకాలను విస్తరించి రసహృదయంతో చెప్పడం, కుదించి క్లిష్టపరచడం శ్రీనాథుని లక్ష్యం అని చెప్పవచ్చు

నలుడు వినోదార్థం హంసను పట్టుకున్నాడు హంస గింజుకొని కోపంతో 'ధిగస్తు' 'ధిగీదృశం' 'కువిక్రమం' అని నిందా వచనాలతో తూలనాడుతుంది అది విడిపించుకునేవారి గడుసుదనం కాదు కావ్యవాదంకాని ఆక్రోశం తెలుగుహంస అట్లా అనక తన తిరస్కారం వ్యంగ్యంచే జాలిపడేలా మాట్లాడుతుంది

> ఇక్కల కొనలం గలిగిన
> యిక్కాంచన మాసపడియెదే నృప! నీకే
> యక్కర దీనం దీరెడు?
> నక్కట! నీహారలేశ మబ్ధికి వోలెన్ శృం ౨-౩

ద్విత్వ ంకారంలో తెలుగు పలుకులో తన కొంచెపుదనం, తుది సంస్కృత సమాసంలో రాజు పెద్దతనం ధ్వనించి అతని ఆనుకూల్యం సంపాదింప జూస్తుంది ఇది తెనిగింపులోని గడుసుదనం అనకుండా ఉండలేం

హంస ముఖాముఖిగా రాజుతో మాట్లాడదు. విధిని, తల్లిని, భార్యను, బ్రహ్మను, పిల్లలనుగూర్చి మాట్లాడుతూ దురపిల్లుతుంది. ఈ రచన కరుణావహంగానే ఉంది. కాని ఆ రసస్ఫూర్తి తెలుగులో ప్రక్రియాంతరంవల్ల వెల్లుబుకుతుంది.

తెలుగులో హంస తన విన్నపం రాజుకే చేస్తుంది. ఆ చెయ్యడంలో కరుణస్ఫూర్తి కంటనీరు పెట్టేటంత ఆర్ద్రంగా ఉంది - ఆ మాటలు వేటికో ఆంధ్రీకరణంలా ఉండక తెలుగులో ఒక బేల హంస గుండెనిండిన ఆర్తితో పలికినట్టుంటుంది. ఇక్కడ తెలుగుకవి రసపోషణ మూలాతిశాయిగా ఉంది.

ఇక్కడ బిగువైన సంస్కృతపు మాటలు వాడకపోవడం, ఎచ్చుచెప్ప డానికి విస్తృతిగల సీసపద్యం వాడడం, మూలంలో లేని మాటలు తెచ్చి రస పోషణకు ఊత ఇవ్వడం గమనించదగ్గ ప్రతిభావిశేషాలు.

తల్లి మదేక పుత్రిక, పెద్ద, కన్నులు
కాన దిప్పుడు మూడుకాళ్ళ ముసలి
ఇల్లాలు కడుసాధ్వి, యేమియు నెఱుగదు
పరమ పాతివ్రత్య భవ్య చరిత
వెనుక ముందర లేరు, నెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
కానకకన్న సంతానంబు శిశువులు
జీవనస్థితి కేన తావలంబు

కృప దలంపగదయ్య, యో నృపవరేణ్య!
అభయ మీవయ్య, యో తుహినాంశువంశ!
కావగదవయ్య, అర్థార్థి కల్పశాఖ!
[illegible] యో నిషధరాజ! ౧-109

ఇక్కడ సంస్కృతానికి డు, ము, వు, లే కలిపాడో హృదయమే వంచి తెలిగించాడో సహృదయులకు చెప్పవలసిన పనిలేదు. తెలిగింపు అంటే ఏమిటో నేర్చుకోవలసిన పద్యం ఇది. మాతృకానుసారం అంటే అక్షరాలు కావనీ, అంతఃకరణం అనీ చెబుతుంది.

ద్వితీయాశ్వాసంలోని—

'నళిన సంభవు వాహనము వారువంబులు
కులము సాములు మాకు కువలయాక్షి" ౨-5

అనే పద్యం ప్రసిద్ధమైంది దీనికి మూలం నైషధ తృతీయ సర్గలోని రెండు శ్లోకాలు వాటిలోని తొలి శబ్దాలంకారాలు, లర్వాతి అర్థాంతరన్యాసం, హంస ఘనపకంకు కవి ఘనతను చెబుతూ అందులోని భావ సౌందర్యాన్ని కప్పివేశాయి ఆ రెండు శ్లోకాలకు అంత సీసపద్యం నిజానికి అనవసరం ఆ భావాన్ని ఒక వృత్తంలో చెప్పవచ్చు కాని ఇక్కడ హంస దమయంతిని తన లోకోత్తర ప్రాభవంతో ముగ్ధపించాలి, చేతికి లొంగేలా చెయ్యాలి దాని మీదనే తన ఒ యబారపు సాఫల్యం ఆధారపడి ఉంది కనక దానిని ఎంత విస్తరిస్తే అంతలాభం! కనుక పద్యం లాళికే మారింది అందలి తెలుగు మాటల కమ్మదనం ముందు దమయంతిని లర్వాక పారకులను లోబరుచు కుంటుంది ప్రతివాదం చివరఉన్న దమయంతీ సంబోధనలు సాభిప్రాయాలు తమకూ కువలయాదులకున్నూ నిత్య స్నేహంగదా! కనుక 'నీవు నాకు సహజంగానే నేస్తురాలవు' అని చెప్పడంలో మరింత దగ్గర అవుతుంది

ఎత్తుగీతి భావమంతా పూర్వభావానికి పరిపోషకమైన శ్రీనాథుని స్వీయ రచన రెండు రచనలు జోడించి చదివినవారికి తెలుగు పద్యం నిగనిగ గోచరిస్తుంది ఇక్కడ తుదిమెరుపు ఏమిటంటే - 'తరుణి నీయాన అనడం అచ్చపు తెనుగువారి ఆత్మీయత

ఈ తెనిగింపే ఆతని కవితకు కలికితురాయి

ఈ అచ్చు కట్టు పెద్దనగారి వరూధినికి కులుకు తోడయింది

ఎక్కడ సంస్కృతం రచనా సౌందర్యం తెస్తుందో ఎక్కడ జాను తెనుగు తెస్తుందో అనే కవిత్వపు నాడీ నిదానం శ్రీనాథు కు పుట్టుకతో పట్టు బడిన విద్య

ద్వితీయాశ్వాస ప్రారంభంలోని 'అట్లు పురుషోత్తముండైన అలనివలన' అనే గీత పద్యాన్ని యథాతథంగా ఒక్క సంస్కృతం మాట మార్చకుండా ఆంధ్రీకరించాడు అందుకు కారణం 'ద్విజ ముఖ్యుడు' 'పురుషోత్తముడు'

'ముక్తి' అనే మాటలవల్ల ఒక ఉత్తమ బ్రాహ్మణుడికి విష్ణుదేవునివల్ల మోక్షం కలగడం అనే శబ్దశక్తి మూలధ్వని పోషింపబడింది

'ప్రాతఃకాలమునందు' (౩-19)
'పరిఖ గుడివోలె దనచుట్టు దిరిగియుండ' (౨-38)
'ణిసి ధాత్వర్థ మనుగ్రహింప గదవే' (౩-52)

అనే పద్యాలు మూలకారునితోకూడా అతని వ్యాకరణ ప్రీతిని వెల్లడిస్తాయి

'కాకులు కాకా అంటే కోకిలలు తుహీ తుహీ అనడం, విదర్భరాజు కోట అగడ్త భాష్యంలోని దుర్గ్రహ భాగాలకు సున్నచుట్టినట్టుం దనడం, ణిచ్ ధాత్వర్థం అంటే 'నింస్తే' అనే ప్రథమ పురుష రూపానికి చుంబనం అర్థం కనక అది అందించమనడం, వైయాకరణులు సంతోషించవలసిన చమక్కులు అట్లే అనేక శాస్త్రమర్యాదలను మూలం చెప్పితే - తానేమీ తక్కువవాడను కానని చెప్పడానికి ఈయనా తెలుగులో ప్రయత్నించాడు

వీటిమాట ఇట్లా ఉంచితే - కృత్యాదిలో 'కాలకంఠ కఠోరకంఠ హుంకారంబు - చెవులు సోకని నాటి చిత్తభవుడు' ౧-35 అనే వేమనామాత్య వర్ణనం, 'గగన కల్లోలినీ కల్లోల మాలికా హల్లీసకములలో నవఘళించి' ౧-37 అనే సింగన మంత్రి వర్ణనం తెలుగు పద్యానికే కొత్త రీతిని నేర్పాయి

అంతే కాదు——

ఆయన వశ్యవాక్కు - భాషను మైనంలా చెప్పినట్టు వంచుతుంది

'దాస్య మొనరించు విధుడేత దాస్యమునకు
పల్లవము లేతదంఘ్రి సంపల్లవములు
జలరుహాముఖకు దచ్ఛయచ్ఛాయదాయ
అనగ నతడొప్పె నవయౌవ నాగమమున' ౧ 61

ఆతని తెలుగులో ఒలికిన తియ్యదనం - చూడదగ్గది

అతి తమం సమపాది జడాశయం
స్మితలవ స్మరదేపి శదాననం ।
అజని పంగు రపాంగ నిజాంగణ
భ్రమికణేఽపి తదీక్షణ ఖంజనః 4 స 4 శ్లో

'బాలిక చెక్కుటద్దముల పజ్జల కోమల మందహాస రే
ఖాలపె మంకురింపదు వికాసము చాలదు నెమ్మనమ్మునన్
వాలిక మించు కన్గొనల వాకిట నల్లన సంచరింపనుం
జాలక చాలకుంటువడె చారు నిరీక్షణ ఖంజరీటమున్' ౨-112

కాలాంభఃపుర కామినీ కుచతటీ కస్తూరికా సౌరభ
శ్రీలుంటాకము, చందనాచల లతా శ్రీఖండ సంవేష్టిక
వ్యాళ స్ఫార ఫణా కరోర [illegible] పాణింధమం
బేలా నాపయి దక్షిణానిలము పక్షే సేయు దాక్షిణ్యమున్ ౨-32

దాని ఈ సంస్కృతం పడగ ముడుచుకున్న సర్పంలాగుంది

విషమో మలయాహి మండలీ
విషపూత్కారమయో మయోహితః
బత కాలకళత్ర దిగ్భవః
పవనస్త ద్విరహానలైధసా ౨-57

'పురాణము' తెల్గొనరించినన్ గడున్
శ్రావ్యలగాంచి యొప్పెసంగి సంస్కృతముంగని గేలిసేయు
అని చెళ్లపిళ్ల కవి అన్నమాట నిజ మనిపిస్తుంది

భీమేశ్వర పురాణం

'ప్రౌఢ నిర్భరవయః పరిపాకమున గొని
యాడితి భీమ నాయకుని మహిమ'

అన్నాడు పురాణమని పేరేగాని దీనికి పురాణ లక్షణాలు లేవు పూర్వకథలు చెప్పడం చేతగాని, ఒక మహాపురాణంలో అంతర్భాగం అవడం చేతగాని, దీన్ని పురాణమనడం నిజానికి ఇది ప్రౌఢ కవితా బద్ధమైన కావ్యం

కవిత్వంలో ఆరితేరిన వయస్సులో దీన్ని రచించానని ఆయనే చెప్పాడు శృంగార నైషధంలో క్లిష్టశ్లేషలు, అనుప్రాసలు, వ్యుత్పత్తి ప్రాగల్భ్యం మూల గ్రంథాన్నిబట్టి వచ్చాయిగాని శ్రీనాథుని కవితా ప్రస్థానం అదికాదు అతడు తన కవిత్వానికి మూల సూత్రంగా పేర్కొన్న లక్షణాలు ఇవి

"హరచూడా హరిణాంక వక్రతయు కాలాంతక స్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్
సరసత్వంబును సంభవించె ననగా సత్కావ్యమున్ దిక్కులం
జిరకాలంబు నటించుచుండు కవిరాజీ గేహ రంగంబులన్" ౧-11

సత్కవిత్వానికి ముఖ్య లక్షణాలుగా ఆయన ఎంచుకున్నవి మూడు 1 వక్రోక్తి 2 ప్రౌఢత 3 సరసత

వక్రోక్తి అంటే చమత్కారం వంకరమాటలు కావు భాషా దారిద్ర్యం లేని చిక్కని రచన ప్రౌఢత వాటిలో మొదటిది అర్థ చమత్కారమైతే రెండవది శబ్ద చమత్కారం వాటిని రెండిటినీ హృదయ ధర్మంతో కాపాడే ఆర్ద్రత - సరసత ఒక రచనను కవితామయం చెయ్యాలంటే - ఈ లక్షణాలుండి తీరాలి కావ్యం పని విషయ నివేదనం కాదు శబ్దార్థాలతో చేసే ఇంద్రజాల ప్రదర్శనం - పాఠకులు హర్ష వివశులు కావడం దీని పరమార్థంగాని - అపూర్వ విషయాలు తెలుసుకుని ఆచరించడం ఆశ్చర్య పడడం కాదు

శ్రీనాథుని ఆత్మీయ సారస్వతమూర్తి పూర్తిగా ఈ భీమఖండంలో దర్శన మిస్తుంది

భీమ ఖండానికి మూలం స్కాంద పురాణంలోని గోదావరీ ఖండమని కవి అంటాడు గాని స్కాందంలో ఈ వృత్తాంతం కనపడలే దన్నారు పరిశోధకులు ఆ సంస్కృత క్షేత్రమాహాత్మ్యం శ్రీనాథ కృతికే సంస్కృతీ కరణమన్నారు, మరికొందరు

అయితే - శ్రీనాథుని కృతిలో కొన్ని మాటలు, భావాలు అందులో కనపడడం మాట నిజమే కాని - అంతమాత్రంచే అది శ్రీనాథుని కృతి నుంచే పుట్టిందనడం సంభావ్యంగా తోచదు. ఎవరో క్షేత్రాభిమానులు సంస్కృతంలో రచించి శ్రీనాథునికు ముందే గ్రంథ గౌరవంకోసం స్కాందం లోనిదని ప్రచారం చెయ్యడం జరిగి ఉంటుంది ఆ విశ్వాసం తోటే కవి దాన్ని తెలుగుచేసి రాజ మహేంద్రవర పాలకులకు మంత్రి ఐన బెండపూడి అన్నయ మంత్రికి అంకితం చేశాడు ఆ మంత్రి 'పానాటింటి బాంధవుడు' గనక -

అల్లాడ వీరారెడ్డి వేమారెడ్ల ఆశ్రయం ప్రసాదించి అతణ్ణి వీరభద్రారెడ్డి విద్యాంసుణ్ణి చేశాడు

ఆతని ఆంధ్రీకరణ ప్రణాళిక ప్రకారం దేనినీ సర్వాత్మనా తెలిగించడం పరిపాటి కాదు రేఖా మాత్రంగా మూలసూత్రాన్ని చేపట్టడం ఆ విషయ విస్తరంమీద కవితాభిషేకం చెయ్యడం మామూలు ఆ కవితాకళ సంస్కృత మూలంలో లేదు రేఖలు మాత్రమున్నాయి ఆ రేఖలనే ఆయన స్వీకరించా డనడం సబబుగా తోస్తుంది

భీమేశ్వర క్షేత్రాన్ని నన్నయగారు కూడా అర్జున తీర్థయాత్రా సందర్భంలో ప్రస్తావించడంవల్లను భీమయదేవుడు అన్నయ మంత్రికి ఇష్టదైవం కావడంవల్లను, ఆ క్షేత్ర గౌరవాన్ని మరింత పెంచి శ్రీనాథుడు రచించిన మంచికావ్యం ఇది

భీమ ఖండం సారాంశం ఇది

కాశీలో విశ్వనాథ బహిష్కృతుడైన వ్యాసుడికి దక్షారామం ఆశ్రయ మిచ్చింది వింధ్య గర్వ పరిహారంకోసం దక్షిణాదికి వచ్చిన అగస్త్య లోపా ముద్రలున్ను అక్కడ వ్యాసుడికి తటస్థపడ్డారు అగస్త్యుడు ఆ గోదావరి ఖండ విశేషాలన్నీ తరచి తరచి వ్యాసుడికి వర్ణించి చెప్పాడు

ఆ భూమి ఖండం మీద అంత అభిమానం శ్రీనాథుడిది గాని కుంభ సంభవునిది కాదు 15 శతాబ్దిలోని అ ఆంధ్ర ఖండ సౌభాగ్యం కళ్లముందు నడయాడినట్టు చిత్రించడం కవి భావుకతకు, తెలుగుగడ్డ మీద తీరని అపేక్షకు నిదర్శనం

ఒకచోట కోటిపల్ల్యుడు రాజకోటీర
విభ్రాజితోత్సంగ,వృద్ధగంగ
ఒకచోట పీఠాంబికోన్నత స్తనభరా
స్ఫాల జర్జరిత కల్లోల యేల
ఒకచోట చటుల నక్రకుళీర పాఠీన
తోయ గర్భాభోగ తుల్యభాగ
ఒకచోట నప్సరో నికర సంసేవితాం
తరము శ్రీ సప్త గోదావరంబు

> ామరు నాగర ఖండ సిద్ధార్థజాతి
> నాగవల్లీ సమాక్రాంత పూగ ఖండ
> మండితోద్యాన వాటికాఖండ విభవ
> పాత్రమగు భీమమండలీ క్షేత్రమునకు 3 21

> ఎక్కడ జూచినన్ సరసి, ఎక్కడ జూచిన దేవమందిరం,
> బెక్కడ జూచినం దటిని, యెక్కడ జూచిన పుష్పవాటికల్,
> ఎక్కడ జూచిన న్నది, మహీవలయంబున భీమ మండలం
> బెక్కడ ? నన్య మండలము లెక్కడ ? భావనజేసి చూచినన్ 3-23

ఈ భీమ మండలం ఇంచుమించు ఇప్పటికీ ఇలాగే ఉండడం చూస్తాం

వశిష్ఠాది మునులు కాశీవెళ్ళి వ్యాస నిష్కాసనం సంగతి విని 'ద్వైపాయన ముని వెడలం ద్రోపించిన కోపకాడు ధూర్జటి . ' ఇచట మనలను ఏల బ్రతుకంగ నిచ్చున్' అని కాశీ విడిచి దక్షారామం చేరారు

ఇంద్రుడు ఆ గోదావరీ ఖండాన్ని భీమనాథునకు సమర్పించాడు భీమ నాయకుని మహిమగా త్రిపుర సంహారాదులు అవాంతర కథలుగా వస్తాయి కాశీకంటె గూడా దక్షారామం రక్తిముక్తి ప్రదం అనే అర్థవాదం కావ్య ధ్వని—

ఇందులో శ్రీనాథకవి పరువమైన కవిత పరవళ్ళు తొక్కింది అతడు హరిహర భేదంలేని అద్వైతి అయినా 'తథాపి భక్తి స్తరుణేందు శేఖరే' అనే తత్త్వంగల శైవాభిమాని

శైవులకు శృంగారప్రీతి నిషిద్ధం కాదు వారు భౌతిక మాధుర్యాన్ని అనుభవిస్తూ అపార శైవ పారమ్యంవల్ల ముక్తిసాధకు లవుతారు దీనికి బసవ పురాణపు మిండజంగాలకథ, కాళహస్తి మాహాత్మ్యంలోని శివవేశ్యా సంపర్కం వం మోదాహరణాలు భీమఖండంలో ఆ స్ఫూర్తి కనబడుతుంది కృతిపతి అయిన మంత్రీ, అతని ఏలికలూ, శృంగార ప్రియులని ఆ రచనవల్లనే తెలుస్తుంది

దక్షారామ వర్ణనలో ముందు దర్శన మిచ్చేవారు 'సానులను పేరి అప్సరశ్చంద్రముఖులు' శ్రీనాథుని శృంగార ప్రస్థానానికి తగిన పాథేయం

సమృద్ధిగా దొరికింది అతని భీమేశ్వరుడు మన్మథుణ్ణి 'మసి' చేసిన 'యోగి' కాడు 'దక్షపురి సానికూతుల దగిలి' 'గన్నెలు కాదారి ప్రొద్దున సానివాడకు ప్రభుల కైదండలతో ప్రయాణించే 'భోగి' ఈ రక్తిని తన ఉక్తి చాతుర్యంతో చెప్పడం ఒక్క శ్రీనాథునకే తెలుసు అది ఎబ్బెట్టు కానంత ఇంపుగా చెప్ప గలవాడు ఆ ప్రభువు హాలాపానమూ చెయ్యగలవాడు అప్సరశ్చంద్రముఖుల అధరసుధలూ ఆస్వాదించగలడు 'ఆడ' వాసనే పరిహరించినవాడు 'పడకు గుబ్బలి రాచవారి ముద్దుల బిడ్డను' వదలకుండా వంటికి కట్టుకున్నవాడు ఆ మహానుభావంలో ఏది పరిహార్యం? ఏది స్వీకార్యం? ఆయనే చెప్పాలి

హాలాహలంబను అల్లోనేరెడు పండు
మిసిమింతుఁడునుగాక మ్రింగినాఁడు
వెనువ్రేలి కొనగోర విసరుహానను మోము
కెందమ్మి విరివోలె గిల్లినాఁడు
పంచవన్నియతోడ ప్రసవనారాచుని
ఎట్టి చిచ్చరకంట జుట్టినాఁడు
మెఱుగు కోఱఁడుల్ల మృత్యుదేవతనోట
ధట్టించి యఱకాలఁ దన్నినాఁడు
త్రిపుర దైత్యాపరోధ నారీవిలాస
దంత తాటంకముల కెగ్గు దలచినాఁడు

ఈ శివ కథలు అందరికీ తెలిసినవే కాని ఈ పద్యం ఇంత తళతళలాడడానికి కారణం ఆయన వక్రోక్తి ఇందులోని మ్రింగు, గిల్లు, జుట్టు, తన్ను, ఎగ్గు దలచు అనే క్రియలకు తగిన ఊపు ముందు మాటలలో ఉంచి వాటిని ఒడుపుగా వాడడంవల్ల ఈ రచన మనస్సు పట్టుకు వదలదు అదే శ్రీనాథుని ఇంద్రజాలం శ్రీనాథుని దేవతలంతా దక్షారామంలో మనుష్యులై పోయి మనతో తిరుగుతారు పెనగులాడుతూ ఉత్సవాలు చూస్తారు నవ్వుతారు నవ్విస్తారు విగ్రహాలు కారు విలసన్మూర్తులు!

ఓకసారి వసంతం వచ్చింది

ఆ వసంతోత్సవంలో కవి కొండవీటి వసంతోత్సవాలను జ్ఞాపకం చేసుకుని కాబోలు దేవతలను భూవిహారాలకు దించడం ముచ్చట గొలుపుతుంది

ఇక్కడ వక్రోక్తి, సరసత చేయి చేయి కలిపి వాహ్యాళి చేశాయి

'కొమ్మ యొక్కతె యందంద కొమరుసామి
మొదలల యందు జవ్వాది యసలుకొలిపె
పునుగు మణికుంభమున నించి పోసె నొక్క
పొలతి విఘ్నేశ్వరుని కుండబొజ్జమీద' ౫-115

'అచ్యుతుని మీద జల్లె దుగ్ధాబ్ధికన్య
భారతీదేవి పద్మజుమీద జల్లె
శచి మహేంద్రుని జల్లె వసంతకేళి
గంధ కర్పూర కస్తూరికా జలంబు' ౫-121

భీమ ఖండంలోని సూర్యోదయ చంద్రోదయ వర్ణనలు ఆయన భావనా శక్తికి నిదర్శనాలు

"గిరిని కుంజముల కుంజర పుంజ మను శంక
కంఠీరవంబు లుత్కంఠ నెగయ" ౨-85

అనే సూర్యాస్తమయ పద్యం పెద్దనగారి 'ఉరుదరీ కుహర' అనే పద్యానికి ఉపజీవకం అయితే చంద్రోదయంలోని 'కాదు కాదు నయాద్రి కనక కూటం బిది డంబైన పాన వట్టంబు గాని' అనే పద్యం ధూర్జటి 'ఉదయ గ్రావము పానవట్టము' అనే దానికి ప్రేరకమయింది అంతేకాదు పోతన్నగారి 'కమలాక్షు నర్చించు కరములు కరములు' అనే పద్యానికి మూలం—

'శ్రీభీమ నామక శివనామధేయంబు
చింతింప నేర్చిన జిహ్వ జిహ్వ' ౩-198

అనే శ్రీనాథ వాణియే

ఈతని కవిత 'గరిమనాభి' (Centre of gravity) శబ్దశక్తి దాని విశ్వరూపంలో శబ్దాలు అద్భుత చిత్రాలుగా విడతాయి

'ఆడెందాండవ మార్భటీ పటహా లీలాటోప విస్ఫూర్జిత
క్రీడాడంబర మల్లసిల్ల గరళగ్రీవుండు జూటాటవీ
క్రోడా మాత కరోర కోటకరుటీ కోటీలుర చ్ఛింధు వీ
చీ డోలా పటలీ పరిస్ఫుట తర స్ఫీతధ్వని ప్రౌఢిమన్ ఆ-148

ఇందులో శబ్ద ప్రౌఢిమ తాండవ క్రీడకు స్ఫోరకం
తర్వాత హరవిలాసం జ్ఞాపకం వస్తుంది

ఇది కేవల హరవిలాసం కాదు మనోహర విలాసం భీమ ఖండంలో ఒక్క భీమనాయకుని మహిమే బహురూపాల విస్తరిస్తే - ఇందులో హరివిల్లు లాంటి రంగు రంగుల హరకథలు జోడించి శివకథాప్రియులకు ఆమెతె చేశాడు

కనుకనే పరమ మాహేశ్వరుడూ, బాలసఖుడూ అయిన అవచితిప్పయ్య శ్రేష్ఠికి అంకిత మయింది

ఇందులో వరుసగా సిరియాళ కథ, గౌరీ కల్యాణం దారుకావన క్రీడ, క్షీర సాగర మథనం, కిరాతార్జునీయం అని శివ పారమ్యాన్ని తెలిపే అయిదు కథ లున్నాయి

అందులో సిరియాళ కథ బసవపురాణం నుంచి గ్రహించి కొన్ని మార్పులతో కేవలం స్వతంత్రంగా చేసిన రచన సిరియాళ కుమారుని తండ్రి చిరుతొండనంబి తల్లి తిరువెంగనాంచి వీర మాహేశ్వరాచార వ్రతులై నిర్లిప్తంగా ముద్దుబిడ్డని చంపి చేసిన శివారాధనకు ఒడలు గగురు పొడుస్తుంది ఆ శిశుమాంసం వండిన తీరు ఈ బ్రాహ్మణకవి ఎప్పుడు చూచాడా ? అని చకితులం అవుతాము

"మిరియము, నుల్లియున్, బసపు మెంతియు, నింగువ, జీరకంబు, శ
ర్కరయును, జింతపండును, గరాంబువు, గమ్మని నేయి తైలమున్,
బెరుగును, మేళవించి, కడు బెక్కు విధంబుల శాకశుద్ధి వం
డిరి, సిరియాళునిం గటికి డెందమునం దరళాతు లిద్దరున్' ౨ 120

. .. చక్కగాఁదరిగిన సన్నమాంసంబులు
పరిపాటియై ఝుట్టు బదను వండి ౨-121

కటికి డెందంతో సిద్ధం చేయడం ఈ ఈశ్వరార్చన కళాశీలునకు ఎంత సహజంగా కనపడిందో మరి——

అంతకు ముందు సిరియాళ కుమారుణ్ణి తిరువెంగ నాంచిని ప్రలోభ పెట్టడానికి వెలుపు కల్పించడానికి శివాజ్ఞ నడిచిన తీరు, వారిద్దరూ ఆవంత చలించకుండా శివారాధనలో నిలిచిన తీరూ, బొమ్మగీచి ఎదుట పెట్టినట్లు ్రద్వా ాు ూాఉ

ఈ కథలో శ్రీనాథుని సహజశైలీ ప్రసన్నత మనః పరిశీలనం రసప్రవణ వాణి, దర్శనీయమైనవి ఈయనకు సంస్కృతం మీద ఎంత ప్రభుత్వం ఉందో తెలుగు నుడికారంమీద అంత పెత్తనమూ ఉందని ఇది రుజువు చేస్తుంది

శివయోగి 'అలుమగడును ఒక కుత్తుకై నగాక' రానవడం, 'చెక్కనిండిం పసవల్కు చిఱుతవానిని' చావు తప్పించుకోమని చెప్పడం 'శూలి నాంచారి పాలిండ్ల చూచుకములు పాంచేపున గిలిగింతవారి, - 'మగవాడో మానో' అని తిరువెంగనాంచిని విముఖురాలిని చెయ్యబోవడం, చిన్ని సిరియాళుడు 'తన చిన్ని కరాంగుళి వంచి వంచి ఊకించడం ప్రతి తెలుగువాడు ఆత్మీయతతో చూడవలసిన ఘట్టాలు ఈ కథలో చేసిన 'ఏమీ కొంకక' ఉరుసజ్జ, శ్రీవాకిట, మహేశహారముగ (ఆహారం) వంటి ప్రయోగాలు ఆయన వ్యవహార ప్రీతికి మచ్చుతునకలు

గౌరీకల్యాణం అచ్చంగా కాళిదాసు కుమార సంభవం చూచి చేసిన రచన ఇంచుమించు ప్రతిపద్యంలోను పారదర్శకంగా కాళిదాస భావం కనిపిస్తూ ఉంటుంది ఆ భావం అంత హృద్గతమై, పక్వమై, సహజోద్గమంగా, తెలుగు రూపంతో వెలువడడం అనితర సాధ్యమైన శ్రీనాథ శిల్ప విశేషం ఈ కుమార సంభవాన్ని ఆధునికులు సుమారు పదిమంది అయినా అనువాదం చేసి ఉంటారు అవి ఎంత చూచినా తు, చ, ల వెనుగులాటతో సరిపెట్టాయి, వాటిలో కవి హృదయం కాదు అవి అక్షరాల పోగులుగాని అర్థవంతమైన అను భూతిని ఇవ్వవు ఏ పద్యమూ తన కాలిమీద తాను నిలిచిన పాపాన పోలేదు

కాళిదాస రచన ఎరిగినా ఎరక్కపోయినా ఈ గౌరీకల్యాణం ఒక కళాఖండంగా మనకు దర్శన మిస్తుంది

తారకునివల్ల మునులు, బ్ర   పడినపాట్లు చెప్పడంలో, మన్మథుడు ఇంద్ర సన్నిధికి వచ్చిన ఘట్టంలో, రతి విలాపంలో, ఈశ్వర తపస్సందర్భంలో శివుడు పెండ్లికొడుకైన విధంలో గౌరీకల్యాణ, సంగమ రీతిలో శ్రీనాథుడు పుట్టించిన కవితాలోకం అనన్యసామాన్యం

దేవతలు బ్రహ్మసన్నిధికివెళ్ళి మొఱపెట్టడం కాళిదాస భావం - దాన్ని శ్రీనాథుడు మలచిన తీరిది——

'పడితిమి కు   లుం బడని పాటులు   మైన వృత్తి వెన్
బడితిమి, గర్భయాచకుల భంగి దరిద్రత వట్టుకొంచు లో
బడితిమి, పాలలోబడిన బల్లుల కైవడి నెల్ల వెంటలం
జెడితిమి, వేయునేల, సరసీరుహ సంభవ ! దుష్టదైత్యుచే' 3-15

ప్రాసకూర్పులో ఉపమాన సంధానంలో, తెలుగు మాటల తీర్పులో వేల్పుల దైన్యం ప్రత్యక్ష మవుతుంది

ఇక్కడ ఒక సీసపద్యం ఉంది అందులో 30 బాధా సూచక క్రియా పదాలు, ఇంకో వాక్యం లేదు 'అనువు దప్పిరి, నొచ్చి లసి   , పద నొంది, రదవదలైరి చీకాకు పడిరి ..తారకునిచేత మునులు, బృందారకులును 3-10 ఇది శ్రీనాథుని చేతి ఇంద్రజాలం వట్టి క్రియాపదాలతో చెప్ప దలచిన అనుభూతికి సీసపు కొత్త ఊపుతో కోటకట్టడం ఇక్కడ చూస్తాం ఇట్లాంటి రచన వాల్మీకి కిష్కింధ వర్ణావర్ణనంలో కనపడుతుంది

ఇంద్రుని పిలుపుమీద మన్మథుడు బయలుదేరాడు అతి కాళిదాస మయిన ఈ రచన కవి సౌందర్యదర్శన పతా ——

'కాంతాజనంబుల కటివంక బొమలతో
ప్రతివచ్చు పుష్ప చాపంబుతోడ,
కోకిల   ంబు, గుక్కిళ్ళు మింగించు,
  మ్మావి, చిగురాకు, గొడుగుతోడ,
రతిదేవి నిడుసో గ్రాలు, న్నులడాలు
దలపించు మీన కేతనముతోడ
భుజగ లీలావతీ, భుక్తశేషములైన

గంధవాహ కిశోరకములతోడ,
చందురునితో, వసంత మాసంబుతోడ,
రాజకీర రథంబెక్కి ప్రాభవమున వచ్చె,
వలరాజు చిత్తాను వర్తనముగ,
సంభ్రమముతో, మహేంద్రు నాస్థానమునకు' 3-38

కాళిదాసు సువర్ణ ముడిపదార్థం భూషణ వికాసం కవి ఇష్టం గౌరీ కల్యాణానంతర హిమవద్వర్ణనం తాను మలచిన దారుకావన కథకు పీఠికగా ఉపయోగించుకున్నాడు

పెండ్లికొడుకు శివుని మనుగుడుపులోని ప్రమథుల ఆగడాలలో శ్రీనాథుని హాస్యప్రీతి పరవళ్ళుదొక్కింది

'పులి కళాసంబు గప్పుదురు పొఱగమీద
విద్యాధరాంగనా విటగణంబు...ఇత్యాదిగా 5-10

ఈ ప్రమథుల ధూర్తత వీరశైవంలోని మిండజంగాల కథలను జ్ఞాపకం చేస్తుంది మామ హిమవంతుడు విసుక్కుంటాడు ఆ విసుగులో విశ్వపతిని చిత్రించిన తీరు, కవి తలుచుకుంటే ఎవరినైనా ఎంత పరిహాస పాత్రులను చేయవచ్చునో చెబుతుంది

'తలమీద చదలేటి దరిమీల దినజేరు
కొంగలు చెలగి గొంగొంగు రనగ
తమ్మి పూఁజూలి పునుక కంచమ్ము సాచి
దిట్టతనమున, బిచ్చమ్ము దేహి యనుచు
వాడవాడల భిక్షించు కూడుగాని
ఇట్టి దివ్యాన్నములు మెచ్చునే? శివుండు?'

తరువాతి దారుకావనంలోని శివుని శృంగార లీలలు—

'దరహాసంబుల, భ్రూలతా నటనచేతన్, విభ్రమ ప్రౌఢిమన్,
పరిహాసోక్తుల, భావగర్భరస సంపత్తి స్ఫుటాలోకన
స్ఫురణారంగుల, మౌనికాంతల మనంబుల్ చూఱలాడెన్ మహే
శ్వరు డుద్దామ విలాస దారువనికా వాటప్రదేశంబులన్'' 7-63.

క్షీరసాగర మథనంలోని జగన్మోహిని వలపునటనం - ఊర్వశి అర్జునుని మీద చూపిన జాణతనం, స్వర్గంలో తెల్లవారడంలో వర్ణించిన దృశ్యాలు హార విలాసంలోని కవితా శిఖరాలుగా చెప్పవచ్చు

స్వర్గంలో ప్రాతఃకాలం

పారిజాతకలతా పల్లవంబులు మేసి
కొసరె నుద్యాన పుంస్కోకిలములు
ంధరాగ్రైవేయ కనక ఘంటిక మ్రోయ
వేల్పు టేనిక యుషర్విధికి నేగె
మందాకినీ వీచి మారుతం బల్లార్చె
అప్సరః స్త్రీల నీలాలకముల
సప్తర్షి పావనాశ్రమ వనాంతరమున
ఆమ్నాయఘోష మభ్యధిక మయ్యె ఇత్యాది
౭-135

కాశీ ఖండం

శ్రీనాథుడు 'ప్రాయ మింతకు మిగుల గైవ్రాలకుండ' తన సంస్కృతి సారమంతా కూడగట్టి చేసిన పరిపక్వరచన కాశీఖండం ఆతని దృష్టిలో అది మహాగ్రంథం!

దాని 'మహత్త్వం' ఎందులో?

విస్మయావహ కవితా పరిచాలనంలో—

సంక్షిప్తరూప విజ్ఞాన సర్వస్వ విన్యాసంలో—

యోగ, సాంఖ్య, సాముద్రిక శాస్త్ర మర్యాదలు, నిత్య ర్మానుష్ఠాన విధి నిషేధాలు—

శివ విష్ణుధర్మ ప్రబోధాలు

నరకలోక నానా దర్శనాలు—

పుణ్యక్షేత్ర యాత్రా విశేషాలు—

దివ్యలోకావలోకనాలు - అందులో నిబిడంగా ఉన్నాయి

ఆ మహా గ్రంథాన్ని సంస్కృతంలో కవిత్వంకోసం చదవరు అపూర్వ విషయావగాహనం కోసం పురాణ శ్రవణంగా మన్నిస్తారు

అట్టి గ్రంథాన్ని అన్ని విషయాలతోను సంగ్రహించి, దానిపై కవితామృతాన్ని చిలకరించడం ఏతన్మాత్రులకు సాధ్యంగాని పని

అట్టి అశక్య సాహసిక్యానికి పూనుకొన్నవాడు కవిసార్వభౌముడు

ఆ సుకృతికి 'వేమభూపతి కృపావీక్షణం' - సద్గురు రాజ భీమేశ్వర పద సమారాధనం, 'మార్కండేయ, శివచంద్రాంశు నవసుధాసారధార', 'నరసింహ వక్షఃస్థలీ కల్హార మాలికా గంథలహరి' కారణాలు, ఉద్బోధకాలు అయినాయి ఏలిక వేమభూపాలుడు 'ఈ క్షోణిన్ నినుబోలు సత్కవులు వేరీ నేటి కాలంబునన్ ?' అని సగర్వంగా ప్రశ్నించాడు

ఆతని రచనల్లో ఒకటి రెంటిలోతప్ప - ఎందులోనూ నియతవస్తుకమైన ఇతివృత్తం లేనట్టే కాశీఖండంలోనూ ఏకనాయకమై, వివిధపాత్ర చిత్రణంలో పూర్వాపర సమన్వయంతో నడిచిన వస్తువు లేదు

ఒక విషయ విస్తరంకోసం ఒక కథ మొదలై - ఆ విషయ వినివేదనంతో అది పరిసమాప్త మవుతుంది అందులో హద్దులు ఎరగని అవాంతర కథలూ రావచ్చు మొత్తంమీద ధార్మిక, పారమార్థిక, శాస్త్రీయ విషయాలు సుహృత్సమ్మితంగా పురాణరీతిలో బోధించడానికి పుట్టిన గ్రంథంగాని, కాంతా సమ్మితంగా కావ్యసౌందర్యం వెలార్చడానికి పుట్టినది కాదు ఆ పరిమితి పరిధిలోనే కొన్ని కథలు పాత్రలు వర్ణనలు, రమణీయార్థాలు మనల్ని అమోఘంగా ఆకట్టుకుంటాయి

అట్టివాటిలో వింధ్య విజృంభణం, అగస్త్యాగమనం, అతని యాత్రా విశేషాలు, కుబేర వృత్తాంతమైన గుణనిధికథ శివశర్మ, దివోదాస, వ్యాస నిష్కాసన గాథలు, ముఖ్యమైనవి

పర్వతాలకు, నదులకు పుంస్త్వ, స్త్రీత్వ కల్పనలుచేసి, మానవ మనోధర్మం ఆరోపించి చమత్కరించడం మనకు పూర్వసాహిత్యంనుంచీ వస్తున్నదే, సముద్రుడు భర్త, నదులు భార్యలు, పర్వతం మేఘం నేస్తాలు, కోలాహల పర్వతానికీ శుక్తిమతినదికీ ఇద్దరు బిడ్డలు, ఇత్యాదులు మనం ఎరిగి ఉన్నవే

వింధ్య పర్వతానికీ, మేరునగానికీ పొగలు కక్కేటపగ, వింధ్యానికి తగని అసూయ ద్వేషాలు నారదుడు వాటిని మరింత రాజవేశాడు వింధ్యం ఆకాశం దాకా విజృంభించింది సూర్యచంద్ర గమనాలు ఆగిపోయాయి

వింధ్యం ఆలోచించిన తీరుచూస్తే శ్రీనాథుడు తన సారస్వత విరోధుల యెడ చూపిన పట్టుదల ధ్వనిస్తుంది

"శాస్త్ర మాచార్యు సన్నిధి జదువడేని
ఇద్ద బోధంబు తగ సంగ్రహింపడేని
తెగువమీఱి ప్రతిజ్ఞ సాధింపడేని
జ్ఞాతి జయమందడేని తజ్జనుడు జనుడే?" ౧-107

పర్వత విషయమే అయితే శాస్త్రం, 'ఇద్ధబోధం' ప్రసక్తి రావడంలో అంత సంగతి కనపడదు

తక్కిన వింధ్య విషయం తీసుకుంటే అసమాన విరోధం అసూయా ద్వేషాలు అనర్థకాలని వ్యంగ్యార్థం

వింధ్యం అడ్డుపడినప్పుడు—

(ఎత్తుగీతి) 'నడచు రవితేరు, మింటి నన్నడుము చక్కి,
బ్రిగ్గనగదాకె, వింధ్యపర్వతము చలుల
గలిన నిర్ఘోష నిర్ఘాత ఘట్టనమున
పంకజాత భవాండ కర్పరము పగుల ౧-132

నక్షత్రాలు వింధ్యానికి తగులుకొన్న విధంలో నక్షత్ర నిజరూపాలు వర్ణించిన శ్రీనాథ భావన, పలుకులో విస్పష్టత అనన్యాదృశం అనిపిస్తుంది

"పూచిన కొరవి పూఁబోదరింటి చందానఁ
గిత్తైర యొక్కచోఁ గదలకుండె
నొకచోఁ దగుల్పడె నుపకారి కొటికిఁ
దరమైన రోహిణీ తారకంబు
నొకచోఁ బునర్వసు పూఁగె వృక్షముకొమ్మ
నుడిబడ్డ ముత్యాలజోఁగువోలె

శయనించె నొకచోట శ్రవణ నక్షత్రంబు
గుంటె మీఁదటి ప్రత్తికొడుపువోలె

స్వాతి చిత్తలు తోరణ స్తంభయుగము
ననుకరించుచు నొక్కచో నత్తమిల్లెఁ
జిలుతవోయిన మూఁకుటి చెలువుఁదాల్చి
హత్తె నొకచో విశాఖ వింధ్యాద్రియందు" ౧-138

కాశి విడిచి వింధ్య విజృంభణం అణచడానికి వచ్చే అగస్త్యుని వేదన—

ఏల మ్రింగితి వాతాపి నిల్వలు? నిల
నేల త్రోచితి దివినుండి యోలి నహుషు?
నా ప్రభావంబుగాదె నన్నదిరి పాటు
కాశివెడలంగఁ ద్రోచె నిష్కారణంబ! ౨-157

'పరమ కల్యాణి! యో భాగీరథీ! గంగ!
వార్ధి భామిని! పోయివత్తునమ్మ!'. ౧-39
'కలహంసి రారాదె కదలి నాతోగూడ!
నీ వేల వత్తమ్మ నెమ్మినుండి. ౧-140

ఇందులో వింధ్యమూ, అగస్త్యుడూ, ప్రత్యక్షమూర్తి మత్త్వంతో కనిపిస్తారు

ఇందలి సూర్యోదయ వర్ణన మయూరుని భావాలకు తెనుగు - కాని ఆ చిత్ర కల్పన, భాషాక్రీడ శ్రీనాథుని ప్రత్యేకత

సవితృసారథి 'నిశాలతకు గండ్రగొడ్డలి', 'అంధకార సత్రవాటికి వీతి హోత్ర జిహ్వ', 'ప్రాచి యెత్తిన హస్తపల్లవాగ్రము', 'మింటికి మంటికి ఐక్య సందేహము పోగొట్టే అవధి' మయూరుని సూర్యస్తోత్ర భావం తెలుగులో అంచులకంటూ విచ్చుకొన్న తమ్మిపూవులా గమగమలాడుతుంది

అగస్త్యుని దక్షిణ యాత్రలో 'దక్షవాటిక సప్తగోదావరమున మునిగి భీమేశ్వరుని గాంచ' నిదే ఆ మునివరుడు వెళ్ళకపోవడం శ్రీనాథుని ఆంధ్ర దేశపు మమతకు తిరుగులేని నిదర్శనం అందులో కోటిఫలి, పట్టిసం, పల్వెల, రాజమహేంద్రవరం, శ్రీశైలం చూడకుండా ఆ ఋషిని కవి అడుగుదాట నివ్వడు

గుణనిధి కథలో బ్రాహ్మణి అంతర్వేదన, బ్రాహ్మణుని కోపం, కొడుకు కొయ్యతనం - నాటకీయంగా సంభాషణ చాతురితో, సహజ చిత్రణంతో విలసిల్లాయి దుర్గుణనిధికి గుణనిధి అని పేరు పెట్టడంలోనే విపరీత లక్షణ స్ఫురిస్తుంది ఇతడు అన్నిటా పాండురంగ నిగమశర్మకు అన్న శివరాత్రి మాహాత్మ్యపు సుకుమారునకు సైదోడు

శివశర్మ కథలో అతని కాశీవాస గరిమ విష్ణు సారూప్యం కవి కథన నైపుణికి నిదర్శనాలు అయితే అవాంతరగాథలు దాన్ని సూటిగా నడవ నివ్వక పురాణ శైలిలో పరిసమాప్త మవుతాయి

భూ సత్ప్రరి పాలనకు బ్రహ్మచే నియోగింపబడ్డ దివోదాసుకు మళ్లా త్రిమూర్తులే అడ్డుపడతారు శివుడు కాశీ విరహం భరించలేక లక్ష్మీనారాణు లను ధర్మేతర ప్రచారానికి పంపుతాడు దివోదాసు విరక్తి చెంది దేహం చాలిస్తాడు

ఇది కాశీ మహిమకు పరోక్ష అర్థవాదంగా గ్రహించాలి దైవలీలలు అవి దితగతులుగా ఉంటాయి

ఇందులో దివోదాసు యోగశక్తి, పుణ్యకీర్తి అనే బౌద్ధుని అవైదిక మత ప్రచారమూ ఆశ్చర్యం గొలుపుతాయి

వ్యాస కథలో శివుని పరీక్ష, మౌనికోపం, విశాలాక్షి విందు, వ్యాస బహిష్కారం అవశ్యపఠనీయాలు

"బ్రహ్మలోకంబు కాశికి బడిసివాటు
విష్ణు లోకంబు కాశికి వినిమయంబు
దాసదాసానుదాస బృందంబు కాశి
కింద్ర చంద్రాదిలోకంబు లిద్ద మహిమ" 2 151

అట్టి కాశిలో 3 రోజులు మునికి, శిష్యులకు భిక్ష దొరకలేదు వ్యాసుని ఓర్పు క్షీణించింది శపించడానికి సిద్ధమైనాడు కాని 'వేనలి పాట పాట, నరవెంట్రు కతో తిలతండులాన్వయశ్రీ నటియింప ఒక మంజుల భామిని వీధిలోకి' వచ్చింది ఆ 'వేద పురాణ శాస్త్ర పదవీ నదవీయసి', 'హస్త సంజ్ఞాదరలీల సంయమివరా!' అని చెయి వీచింది ఇందులో ఎత్తిపొడుపుంది ఆదరమూ

ఉంది మృష్టాన్నం పెట్టింది ఆ పదార్థాల సమృద్ధి, వైవిధ్యం, రుచి భేదాలు శ్రీనాథుని అనుభవాలే - 2-86

తుది ఉపదేశం ఇది—

"క్రోధంబు ఫలమె నిర్మల
బోధమునకు ? తీర్థవాసమున కర్హంబే
క్రోధము ? వారాణసిపై
క్రోధించిన విశ్వభర్త కోపింపడొకో ? ౨-195

విశ్వనాథుడు కోపించనూ కోపించాడు

"కాశి నివసింప నర్హుడుగాడు వీడు
వెడలి పొమ్మను మాటలు వేయు నేల ?"

అని బహిష్కరించనూ బహిష్కరించాడు

శ్రీనాథుని ప్రౌఢ సాహిత్యం సంస్కృతాంధ్ర ద్వైరాజ్యభారం అధ్యక్షించే శక్తి గలది అతని వర్ణనలు ఉపజ్ఞతో కూడి రసికుల హృదయాలకు గిలిగింతలు పెడతాయి

'యామినీ వ్యపగమమున, తూలిక చందమైన కులుకు బ్రాయపు నూనూగు కోదమయెండ' జగచ్చిత్రాన్ని చిత్రించడానికి ప్రకృతి నుంచే ఎన్నుకొన్న రంగులు హృదయరంజకాలు

నారదుని వెంట ఒక శిష్యురాలు గాంధర్వం అభ్యసించడానికని ఒకసాకు ఆమె లేకపోయినా నారద సంచారానికి భంగంలేదు కాని ఆ సంగీత కళానిధి చెంత ఒక సారసనేత్ర ఉండడం కన్నుల పండువు మగ శిష్యునిలో ఆ మాధుర్యం లేదు 'స్త్రీ తి నా మాపి మధురం' అని గదా రసప్రవణులు

'రసనకమేఖల జఘన చక్రమున జాఱ
నీవి బంధంబు నాలోన నెమ్మి వదల
మహతి ధరియించి ఒక తనుమధ్య తన్ను
నను చరించుచు గాంధర్వమభ్యసింప' ౧-90

శివశర్మ కంచియాత్ర దైవభక్తి ప్రచోదితం - కాని అక్కడ మనకు 'కంచి వ్రేతలు కుసుమాస్త్రు ఖడ్గ లతలు' కనపడడం శ్రీనాథుని సౌందర్యా రాధన ఫలం ఇది ఆయన తూలిక చిత్రించిన సూర్యాస్తమయ రూపం

ఘుసృణ కుసుమమాలా కోటి
కిసలయము, చాయం గీర చంచూ పుటశ్రీ
విసృమర స్మరరోర్ణా విభ్రమ ప్రౌఢి మింటన్
బిసరుహ హితదీప్తుల్ సింగళత్వంబు నొందెన్ ౪ 116

ఈ కవితా మంత్రబలమే ఆ పురాణ ఖండాన్ని పుణ్యపాపాల పట్టికగా దిగజారి పోకుండా కావ్యస్ఫూర్తితో కాపాడింది

శివరాత్రి మాహాత్మ్యం ప్రాయం, ఉత్సాహం, కైవ్రాలిప్పుడు వ్రాసిన కావ్యంగా కనిపిస్తుంది

సుకుమారుడనే మంత్రి పుత్రుడు భ్రష్టుడై చండాలీ సంపర్కంతో పతితుడై తుదకు శివరాత్రినాడు శివదర్శనంతో ముక్తుడు కావడం ఈ కథ సారాంశం

కావ్యశరీరం చాలవరకు బాణకవికి అనుకృతి పూర్వరచిత కావ్యాల ప్రతిబింబం చాలచోట్ల

క్రీడాభిరామం వినుకొండ వల్లభామాత్యుని పేరుతో ఉన్నా శ్రీనాథుని పదగుంఫనం, ధారాశుద్ధీ, దాచినా దాగని రూపాలతో కనపడతాయి

బుద్ధారెడ్డి రామాయణం రంగనాథుని పేరుతో ముడిపడినట్టు ఈ రచన శ్రీనాథుని పేరుతో ముడిపడి ఉంది

ఇట్లా క్రీ శ 14 శతాబ్ది ఉత్తరభాగం అంతా శ్రీనాథ రచనలతో ముఖరితమై అతణ్ణి యుగపురుషుణ్ణి చేసింది నాచన సోముడు పురాణ వీధుల నుంచి తప్పించి, కావ్యమార్గంలో పెట్టిన ఆంధ్ర వితానం శ్రీనాథుని సారథ్యంలో అపూర్వ కావ్యకళా పథాలు తొక్కి, అతిలోక రమణీయమైన మన వైఖరి సాధించి భావి ప్రబంధ శరత్తుకు రేఖలు తీర్చిదిద్దింది

అతడు రాజాశ్రయంలో హేమ పాత్రలలో భుజించాడు, రత్నాంబరాలు కట్టాడు గుప్పిళ్ళకొలది కస్తూరి వాడినవాడు కాని తాడిచెట్టునీడ, రాజాశ్రయం అస్థిరం, అన్నట్టు ఆశ్రయదాతలు పోగానే పడరానిపాట్లు అనుభవించాడు అతని దైవభక్తి తక్కువది కాకపోయినా అంతరాంతరాలలోని భోగాసక్తి, ఇంద్రియరక్తి తుదినాళ్లలో కుంగదీశాయి

అయినా అంతవిషాదాన్ని గుండెల్లో దాచుకుని చిరునవ్వుతో 'దివిజ కవివరుగుండియల్ దిగ్గు రనగ' అమరపురి జేరి తన అద్వితీయ రచనలతో అజరామరుడైనాడు

భాగవత కల్పతరువు పోతన

తెలుగు దేశంలో—

ఒక ఎల్లి మేలుకుంది!

గృహస్థు నిద్రనుంచి లేచి కళ్ళు నులుముకుంటూ

"శ్రీకృష్ణా యదుభూషణా నరసఖా!

శృంగార రత్నాకరా!

అని చదువుకుని కళ్ళు విప్పాడు—

లోగిలిలో - చల్ల చిలుకుతూ ఇల్లాలు —

'నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై జల్లెడువాడు'

అని పాడుకుంటూ వెన్న తీస్తున్నది

ఒక ముత్తైదువు కలయంపి చల్లుతూ

'నీ పాద కమల సేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాంతాపార భూతదయయును తాపస మందార నాకు దయసేయగదే!' అని తనలో గొణుక్కుంటూ ఇంటిలోకి వెడుతున్నది

ఎక్కడివీ పద్యాలు? ఎవరు వ్రాశారు? ఆ బాలవృద్ధమూ - ఆ మాటలు పాటలుగా, ఊతపదాలుగా ఎట్లా అయిపోయాయి!

ఓరుగంటికి అనతిదూరంలో బమ్మెర అనే కుగ్రామంలో ఒక పర్ణకుటీరం నుంచి బయలుదేరి ఆహరిగుణగానం గాలితోపాటు కదులుతూ, వ్యాపిస్తూ, తెలుగు పల్లె పట్టుల్లో, పట్టణ ప్రాసాదాల్లో నిండిపోయింది. చక్కని ఏ పద్యాలైనా రాకపోవచ్చుగాని - ఆ పద్యాల పరంపర రానివారు - అప్పుడు తెలుగుగడ్డలో ఎవ్వరూ లేరు

ఆ పద్యాలు ఒక సంస్కృత పురాణానికి తెనిగింపు అని ఎవరూ అనుకో లేదు ఎన్నో తెనిగింపులున్నాయి గొప్పవారే వ్రాశారు అయితే ఇంతగా తెలుగు ఆకాశంలో కలిసి పోలేదేమి ? తెలుగుల రక్తంలో జీర్ణించి పోలేదేమి ?

కళ్లు అశ్రుపూరితాలవుతాయి——

అవి ఏ ప్రభువో వ్రాయమంటే వ్రాసినవి కావు గుండె గూళ్లలో నుంచి కదిలి కదిలి పరుగెత్తుకుంటూ వచ్చినవి ఆర్తిని, అనుభూతిని, ఒంటి నిండా పూసుకుని బయలుదేరినవి

వాటికి సంస్కృత బీజప్రాయమే ఆ బీజం సుక్షేత్రంలోపడి మొలకెత్తి తనకు తానై పెరిగి - పూలు విరిసి సుగంధాలు వెదజల్లింది కనకనే వాటి కంత ప్రత్యగ్రత, జీవశక్తి !

తండ్రి కేసన 'శైవశాస్త్ర మతము గన్న' వాడు 'ఈశ్వర సేవా కాముడు తిప్పన్న అన్న తానూ అచ్చపు శైవుడు కావలసిందే - కాని తాను 'పోతన' అయినాడు అంటే భాగవతానికి పర్యాయ పదం ! విష్ణు భక్తికి మరోపేరు

బమ్మెరకు పాలకుర్తి ఎంతో దూరంలో లేదు అది శైవానికి పీఠం సోమనాథుని 'హర హర' నాదం గాలిలో గట్టిగా ప్రతిధ్వనిస్తూనే ఉంది విభూతి ముద్రిత ఫాలభాగుడూ, రుద్రాక్షమాలా విలసిత వక్షుడూ కావలసినవాడు

తులసీదామ విభూషితుడైనాడు !

'శైవా వయం నఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జపపరా నితరాం తథాపి
చేతో మదీయ మతసీ కుసుమావభాసం
స్మేరాననం స్మరతి గోపవధూ కిశోరమ్' (కృష్ణ కర్ణామృతం)

అన్న లీలాశుకుడిలా పంచాక్షరీ జపంలో మునిగి ఉండవలసిన వాడు గోపవధూ కిశోరుని చిరునవ్వు ముఖం చూస్తూ తన్మయుడై పోయాడు

లీలాశుకుడికీ పోతనకూ ఉన్న పోలికలు చూస్తే ఎంత ఉత్సుకత కలుగుతుంది మనకు! ఎవరు ముందు? ఎవరు తర్వాత? అనే ప్రశ్న అలా ఉండనివ్వండి పోలికలు చిత్రంగా ఉంటాయి

ఇద్దరూ ఆంధ్రులు—

ఒకరు గోదావరీ ప్రాంతవాసి ఐతే - వేరొకరు కృష్ణా పశ్చిమ తీర నివాసి—

ఇద్దరూ వేశ్యాల నెరుగుదురు

పుట్టుక చేత ఇద్దరూ శైవులు

అయినా 'నందాంగనా డింభకునకు' క్రీతదాసులై కృష్ణ కథామృతంతో తెలుగుదేశాన్ని నింపివేశారు

ఇక్కడ పోతనగారి భోగినీదండకం జ్ఞాపకం రాకతప్పదు అది పోతన రాసిందే అనడానికి అంతస్సాక్ష్యం ఉంది

> 'లేమా, ధరింపంగలేమా?
> కవుంగింపలేమా? మహీశున్ (భోగన్)'
>
> 'మందార రాజన్మరందంబునున్ గ్రోలు
> మత్తాళి ధత్తూర ముంగోరునే'

వంటి మాటలూ అనుప్రాసలూ ఆయనవే ఆ రెండూ మళ్లా భాగవతంలో గరకాసుర వధలోనూ ప్రహ్లాద కథలోనూ కనబడతాయి

చివర పద్యమూ ఉంది 'బమ్మెర పోతన, రావుసింగభూభర్తకు దండకమున్ రచించె' అని—

యౌవన దశలో రావు సింగభూపాలునితో స్నేహమూ, భోగినీదర్శనం, వారి సౌందర్య కళాభిరతీ, పోతనకు అసహజములూ - అప్రాప్తములూ అనిపించవు ఆ చనువుతోనే పాలకుని ప్రీతికోసం పాలితుడు దండకం వ్రాశాడు ఒక విలాస పురుషుడు ఒక సుందరాంగిని అభిలషించడంలో ఆశ్చర్యంలేదు

కాని ఒక రూపాజీవ పురుషపుంగవుని తానై వరించి విరహాపడడంలో రసాతిశయం ఉంది అది ఆ పురుషుని ప్రాభవానికి, రసికతకు చిహ్నం ఆ చమత్కారాన్ని వర్ణించి 15వ శతాబ్దంలో సమకాలీనుడైన రాచకొండ ప్రభువు రావు సింగమహీపాలుని (క్రీ శ 1425-75) మెప్పించడానికి పోతన తన కవితా ప్రారంభదశలో ప్రయత్నించి ఉండవచ్చు

విధి ఆ యువకవిని ఆ రాజాశ్రయంలో చిరకాలం ఉండనివ్వలేదు ప్రభువులు నూతన ప్రియులు, భోక్తలు 'రాజసేవా మనుష్యాణాం అసిధారావలేహనం' అన్నట్టు వారి ఇష్టానిష్టాలను 'దివ్యదృష్టి'తో కనిపెట్టి సేవించడం కత్తివాదరను ముద్దుపెట్టుకోవడం లాంటిది ఎందుకో ఉభయులకూ పరస్పరం వైముఖ్యం కలిగింది అదే పోతనకు వరప్రసాదం అయింది యావదాంధ్రానికి ఏకైక భాగవత మహాకవిని చేసింది లేకపోతే రాజుగారి వికార, విలాస, ప్రేరితమైన ఒక శృంగార కావ్యం వ్రాసి, పదిమందిలో తామూ ఒకడుగా మిగిలిపోయేవాడు

తొలుత శివభక్తుడై వీరభద్ర విజయం వ్రాశాడని ప్రతీతి వారి పూర్వులు అనూచానంగా శైవులు చిన్ననాటి గురువు ఇవటూరి సోమనాథుడు, శైవుడు ఆ గురు ప్రభావంవల్లకూడా ముందు ఈ శివకావ్యం వ్రాశా డనుకోవడానికి వీలుంది కాని భాగవతపు దక్షయజ్ఞ సందర్భంలో చేసిన శివనిందకు ప్రాయశ్చిత్తంగా ఈ శివ ప్రశంసా కావ్యం వ్రాస్తున్నానని ఆయనే అన్నట్టు వీరభద్ర విజయంలో ఒక పద్యం ఉంది అది ప్రక్షిప్త మనడానికి ఆ మాటలోని అర్థహీన కారణమే రుజువు పాత్రముఖాన పాత్రౌచిత్యం కోసం పలికించిన మాటలు కవివి ఎలా అవుతాయి? అతడు పశ్చాత్తప్తుడు కావడం ఏమిటి? కావ్యమర్యాద తెలిసిన వారెవరూ ఇట్లా అనరు ఇదే నిజమయితే వాల్మీక్యాది కవులెవరూ దీనికి అపవాదంగా నిలువలేరు ఇది ఎవరో వీరభద్ర రచనకు కల్పించిన కుంటిసాకు

నిర్గళ అమృతధారలా ప్రవహించిన భాగవతం తర్వాత పేలవమైన 'వీరభద్రం' వ్రాశాడంటే కవితాధర్మం తెలిసిన ఎవరూ నమ్మరు

పోతన, తన కవిత పరిపాక దశకురాని స్థితిలో ఇంటబుట్టిన శివభక్తికొద్దీ వ్రాసిన ప్రారంభ రచన వీరభద్ర విజయం

నైమిశారణ్యంలో మునులు దీర్ఘ సత్రమనే యాగం చేస్తూండగా వాయుదేవు డక్కడికి వచ్చాడు. అతణ్ణి చూచి ఋషులు 'వాయుదేవా! నీవు శివకథల్లో పారంగతుడవు. మాకు వీరభద్ర విజయ కథ చెప్పుమని అడిగారు. అతడు వరసగా శివకథలు చెప్పడం ప్రారంభించాడు. అందులో భవాని యోగాగ్నిలో దగ్ధం కావడం, పార్వతిగా పుట్టడం, తర్వాత కుమార సంభవ కావ్యకథ, మళ్లా దక్షుడు మరుజన్మలో అశ్వమేధంచేస్తూ శివుణ్ణి వెలివెట్టడం, శివకోపంనుండి వీరభద్ర జననం, యజ్ఞధ్వంసం, విష్ణువుతోకూడా దేవతలు వీరుణ్ణి ఎదిరించి భంగపడడం, తర్వాత అంగరిమీద శివానుగ్రహం అనే కథలు ముఖ్యంగా వస్తాయి.

ఇందులో పోతన శుద్ధశైవుడు. కృత్యాది 11 పద్యంలో బసవపురాణాదుల్లోని '. వీర మాహేశ్వరా! చారుపరుల వీర సత్యవ్రతుల! వీర సచ్చరితుల వీరవిక్రములను! బరగ మ్రొక్కి దలంచి భక్తితోడ' ఇరవైమందికి పైగా వీరశైవులను స్మరించి మ్రొక్కి కావ్యం ప్రారంభించాడు. వీరభద్రుని చేతిలో విష్ణువు ఓడిపోవడం, హరి ప్రార్థిస్తే హరుడు కరుణించడం ఇందలి పోతన శివపారమ్యానికి నిదర్శనం.

నన్నెచోడుని కుమారసంభవ రచన ప్రభావం అడుగడుగునా కనపడుతుంది. శైవకవుల వైరి సమాసాలు, లక్షణ తిరస్కారం, శబ్ద స్వాతంత్ర్యం, వీరభద్రంలో పోకకు పుట్టెడుగా చూడవచ్చు. కాని పద్యరచనలో, భావనలో తనదైన ఒక పలుకు పోడిమి నిలుపుకొని పోతన అద్భుతంగా వికసించబోయే తన కవితకు, వీరభద్రంలో ఒక ఆకాశవాణిని వినిపిస్తాడు.

ఇట్లా వామనరూపంలో బయలుదేరిన పోతన కవిత, త్రివిక్రమావతారంగా విజృంభించి ఆంధ్ర భాగవత రచనతో తెలుగు దేశాన్నంతటినీ ఆక్రమించింది.

భాగవతావతరణం

అది సరస్వతీ నదీతీరం. హిమాలయ కందరాల్లో మూడు సంవత్సరాలు కూర్చుని దీక్షతో మహాభారతం రచించిన వేదవ్యాస మహర్షి ఏకాంతంలో కూర్చుని ఆలోచనా నిమగ్నుడై ఉన్నాడు.

'మూఢుల కెల్ల మే-గునని భారతాఖ్యానంబు సేసియు భూతహితంబు నందు (తన) హృదయము సంతసింపలేదు'

మహర్షి మనస్సుకు శాంతి కలగలేదు నిరంతర లోకయాత్రా ఖిన్నులైన ఈ జనావళి నిరతిశయ ఆనందిలబ్ధికి ఏమి చేశాను ? అని ఆయన చింత

'హా౨కి యోగివరుల కఖిలమితంబైన
భాగవత విధంబు బలుకనైతి
మోసమయ్యె తెలిపి మొనయదు మఱచితి
అనుచు వగచుచున్న యవసరమున' ౧-85

అప్పుడు అక్కడికి వచ్చిన నారదు డన్నాడు

'అంచితమైన కర్మచయమంతయు జెప్పితి వందులోన నిం
చించుక గాని విష్ణుకథ లేర్పడ జెప్పవు, ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే ? గుణ విశేషము లెన్నినగాక నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిగోరి నుతింపమి నార్యపూజితా ! ౧ 95

భారతంలో కర్మ విశేషాలు, ధర్మ విశేషాలు చెప్పావు ఏకాగ్రమైన భగవద్భక్తి నేర్పలేదు హరిగుణగానం నోరార చేయని లోపంగా నీకీ అశాంతి ఏర్పడింది

'మునీంద్రా ! నిర్గత కర్మంబై నిరుపాధికంబైన జ్ఞానంబు హరిభక్తిలేక శోభితంబుగాదు . భక్తి హీనంబులైన జ్ఞాన వాచాకర్మ కౌశలంబులు నిరర్థకంబులు . . నిఖిల భవబ ధ మోచనంబు కొఱకు వాసుదేవుని లీలా విశేషంబులు భక్తితోడ వర్ణింపుము' ౧-98

చిత్రం ! ఆదిని నారద ప్రోదంపల్లనే అమృతవాహినివంటి రామాయణం పుట్టింది ఇప్పుడూ ఆ పరమ భాగ తునివల్లనే భాగవత కల్పశాఖ ఉద్భవించింది

నిగమ కల్పతరో ర్గళితం ఫలం
శుకముఖా దమృత ద్రవ మిశ్రితం

పిబత భాగవతం రస మాలయం
ముహురహో రసికా భువి భావుకాః ప్ర 3

అని సంస్కృత భాగవతం అంటే—

తెలుగు భాగవతం ఇట్లా అంది—

'లలిత స్కంధము కృష్ణమూలము శుకా
లాపాభిరామంబు మంజులతా
శోభితమున్ సువర్ణ సుమనః
సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల
వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వు
ర్విన్ సద్విజ శ్రేయమై' ప్ర 22

శ్లేషాను ప్రాణితమైన ఈ రూపకం భాగవత కల్పకాన్ని మరింత శాఖోప శాఖలుగా పెంచి సంస్కృతాన్ని మించిన ప్రపత్తిని విస్తరించింది పద్యంలో విస్తరించివల్లే ఆంధ్రభాషలో - (మూలం 20 వేలైతే) 60 వేలుగా విశ్వరూపం ధరించింది

వ్యక్తిత్వం

రావుసింగ మహీపాలుని కాకపోతే - వేరొక భూపాలుని ఆశ్రయించి 'జాంబూనదాంబరంబులు' గ్రహించి కావ్యం చెప్పవచ్చు కడుపునిండా తినవచ్చు కాంచన చేలాలు కట్టవచ్చు అందలాల్లో ఊరేగవచ్చు పలికితో వచ్చిన వైరుధ్యం ఎంత ప్రబలమైనదోగాని రాజులంటే మొగం మొత్తింది మనసు విరిగిపోయింది

పూర్వమెంత విహితమో, ఇప్పుడంత విరోధం రాజీలేని నిశ్చయం

"ఇమ్మనుజేశ్వరాధముల
కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని
చొక్కి శరీరము వాసి కాలుచే

సమ్మెట పోటులంబడక
సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోత రాజొకడు
భాగవతమ్ము జగద్ధితంబుగన్"

తనవరకు పూర్వాంధ్ర కవుల్లో ప్రముఖులు అంతా పురంబులు, వాహనంబులున్, సొమ్ములున్ పుచ్చుకొని చొక్కిన వారే! వారంతా కాలుని సమ్మెట పోటులకు సిద్ధమైన వారేనా?

ఏమో – వారికి మనుజేశ్వరులు అధము లనిపించలేదు తన కనిపించింది మనస్సులో మబ్బులు విడిపోయాయి

సమ్మతితో, సన్మతితో తన మహా రచనను శ్రీహరికి సమర్పింప దలచాడు

తన అదృష్టం వెల్లివిరిసినట్టు ఒక పూర్ణిమ ఆనాడు చంద్రగ్రహణం కొంచెం దూరమైన - గోదావరికి వెళ్లి పుణ్యస్నానం చేశాడు. పులినతలం మీద కూర్చుని 'మహేశ్వర ధ్యానం' లో ఉన్నాడు చేసింది మహేశ్వర ధ్యానం కనిపించినవాడు

'మెఱుగు చెంగట నున్న మేఘంబు కైవడి
ఉవిద చెంగట నుండ నొప్పువాడు'

శ్రీరామచంద్రుడు తానా - వీరమాహేశ్వరుల ఇంటివాడు ఈ విష్ణు దర్శన మేమిటి? కనిపించి ఊరుకున్నాడా? 'మన్నా మాంకితంబుగా శ్రీ మహా భాగవతంబు తెనుంగు సేయుము నీకు భవబంధంబులు తెగును' అని తిరోహితుడైనాడు

నవ్వు వచ్చింది గ్రహణపు చీకటి పటాపంచ లయింది అచ్చపు వెన్నెల్లా అద్వైత జ్ఞానం వెల్లివిరిసింది

'చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
కలుగనేటికి తల్లుల కడుపుచేటు!

ఆ క్షణంలో తల్లి 'బమ్మెర కేసయ లక్కసాని' కడుపు అక్షరాలా పండింది

ఆ తల్లి సుకృతం ఏనాటికీ మరచిపోకుండా చేశాడు ఆ సుకృతి—

ఆనాడు వ్యాసమహర్షి భూతహితం కోసం భాగవతం వ్రాయాలను కొన్నాడు

బమ్మెర పోతరాజొకడు భాగవతం జగద్ధితం కోసం వ్రాయాలను కొన్నాడు

ఒక మహర్షిదీ మహాపురుషునిదీ ఏకవాక్యం అయింది
తనలో ఏదో ప్రేరణ తొలిచి వేస్తుంది
తన గుండెలో ఏదో ఏకతార – విడవకుండా మ్రోగుతున్నది
ఎవరో ఊ - పాడమని తొందర చేస్తున్నారు
ఆ గానం ఊరవడిగా పొంగులెత్తి వస్తున్నది

భాగవతం వ్రాయడానికి తగిన చిత్త సంస్కారం సమృద్ధిగా ఉండ వచ్చు. అయితే ఆధ్యాత్మికపు లోతులు ముట్టే పాండిత్య ప్రకర్ష తన దగ్గర ఉన్నదా? అప్పటికే తెలుగు కవిత్వం గట్టిగా వేరూని మహాకవుల ప్రౌఢిలో తనదైన ఒక విశిష్టత సంతరించుకుంది మేలైన పద్య విద్యను స్థిరపరచింది నాటి తెలుగు కవులందరిలోనూ తన ఉపజ్ఞ నిలదొక్కుకునే రచనా సౌష్ఠవం తన చేతిలో ఉందా? ఈ ప్రశ్నలు అతణ్ణి ఏమీ కలవర పరచలేదు

'విబుధ జనులవలన విన్నంత కన్నంత
తెలియ వచ్చినంత తేటపఱుతు'

అని తత్త్వం తెలిపాడు

ఇక కవిత్వంలో-కొందరికి తెనుగంటే ఇష్టం మరి కొందరికి సంస్కృతం అంటే ప్రాణం ఇందులో ఎవరిని మెప్పించడం?

ఇందులో శివకవుల సంస్కృత తిరస్కారం, మార్గకవుల తెనుగు ఉపేక్ష రెండూ గూఢంగా ఉన్నాయి. పరమార్థ విషయంలో తనకు శివకేశవ భేదం ఎట్లాలేదో భాషలోనూ తాను ఉభయ సముడు. ఇద్దరినీ మెప్పించడం నా అభిమతం అన్నాడు

తనకు ముందు సంవిధాన చక్రవర్తులూ కవి సార్వభౌములూ ఉన్నారు తానెవరు ?

పట్టి 'పరమేశ్వర కరుణా కలిత కవితా విచిత్ర సహజ పాండిత్య పోతనమాత్య ! ఆ రెండూ పౌరుష బిరుదాలు కావు భగవంతుని దయనే నమ్ముకున్నవి కనుకనే 'పలికించెడు వాడు రామభద్రుడు' అనే నిండు విశ్వాసంతో రంగంలోకి దిగాడు

అయితే - అతనికి సామాన్య సాహిత్య విద్య కూడా - ఆకాశం నుంచి శివుడి తలమీద పడిన గంగలా – తలలో వచ్చిపడిందని అనుకోనక్కర లేదు

"చదువని వా డజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గలుగున్"

అనే రూఢి అయిన వివేకం కలవాడు

'పద్యం బొక్కటి చెప్పి సార్థముగ తాత్పర్యంబు భాషించడ' మనే నాటి సామాన్య విద్యా సూత్రంలో ఆరితేరిన వా డనిపిస్తాడు అంతకు ముందున్న ప్రముఖ కవుల పద్యాలు శ్రద్ధగా చదవడం వాటి తాత్పర్యాన్ని విప్పి చెప్పడం ఆనాటి సామాన్య విద్యా ప్రణాళిక కావచ్చు ఆ విధంగా పూర్వ సంస్కృతాంధ్ర కవుల పద్యాలు సవిమర్శంగా గురువు బోధించగా అవగతం చేసుకొన్నవాడు నాటి విద్యాక్రమం ఆయనకు తెలియనిది కాదు (చూ 'అజామీళ' లో చదువు సంగతి 6 స్కం) ఇక అందులోని రహస్యాలు 'విబుధ జనులవలన విన్నంత కన్నంతగా తన మేధా సంపత్తివల్ల ప్రోదిచేసుకుని వైదుష్యం స్వయంగా బలపర్చుకున్నవాడుగా కనిపిస్తాడు

"మాయతోడ మూర్తి మంతుడై యొప్పారఁ
గలడతండు నిఖిల గణములందు
భవతిధాతు వెట్లు భావార్థమై పర్వ
ధాతు గణమునందు దనరు నట్లు" దశమ పూ 593

శబ్ద శాస్త్ర గతమైన ఈ చమత్కారం చూపడానికి ఆ భాషలో గట్టి ప్రవేశం ఉన్న వాడికిగాని సాధ్యం కాదు, సంస్కృత ధాతు పాఠంలోని దశగణాలూ, అందులో ప్రతి ధాత్వర్థంలోను భూధాతువులీనమై ఉండడం

శాన్ని భగవత్పరంగా అన్వయించడం పల్లవగ్రాహి పాండిత్యానికి సాధ్యం కానిపని—

విశిష్ట కళా మూల్యాలమాట అలా ఉంచితే తిక్కనార్యుసం - ఆంధ్ర ఉద్గ్రంథం వ్రాసిన ఘనత పోతనామాత్యునిదే—

హరికథా గానంలో ఎఱ్ఱాప్రెగ్గడతో ఒప్పిక పోలిక వస్తుంది పోతన భాగవతమే వ్రాయకపోతే ఎఱ్ఱన హరివంశమే భాగవతంగా నిలబడేది

పోతన భాగవతం పుట్టిన తర్వాత హరివంశం పరిమిత ప్రయోజనం అయిపోయింది హరివంశం రెండుగట్ల నియమనంలో ప్రవహించిన మందాకిని అయితే గట్లులేని క్షీరాబ్ధి భాగవతం! ఎఱ్ఱన కళాసూత్రాలు, సంయమనం, భాగవతపు పాలవెల్లిలో మునిగిపోయాయి మనోవేగం, భావాలపొంగు శాంతించేదాకా భాగవత పద్యాలు పరుగెత్త వలసిందే పునరుక్తులుగాని, అత్యావేశంగాని, గణించని ప్రచండ గమనం వాటిది ఆ వైవశ్యం, ఒత్తి ఒత్తి చెప్పడం తెలుగువారికి ఇష్టంగాబోలు! కనుకనే ఎఱ్ఱన్నను వదలివేసి ఎన్ని సార్లయినా భాగవత పద్యాలే చదివి పరవశులవుతారు

అంత మాత్రమేగాక ఇంకో ప్రబల కారణం గూడా కనబడుతుంది

ఎఱ్ఱనగారిది ఆ చితూచి వాడిన చిక్కనిభాష ఆది అందరికీ అందు బాటులో ఉండక చురుకైన చూపు వారికే ప్రాప్త మవుతుంది

పోతనగారిది మంచినీళ్ల ప్రవాహం చేతికి ఒగలగానే ప్రాణం చల్ల బడుతుంది నాలుకకు రుచి తగులుతుంది జనావళి సౌలభ్య ప్రియులు గదా! కనక పోతన మరీ దగ్గరైనాడు

తనకు అవ్యవహిత పూర్వులైన ంవి చక్రవర్తులూ, కవి సార్వభౌములూ 'కవీనాం కవయః' అయితే ఈయన 'ప్రజానాం కవిః' అయినాడు

అంటే - వారి కవితా ప్రౌఢి, శబ్దాలలోతు, వక్రోక్తి, తెలిసినవారు మాత్రమే చదివి ఆనందించతగినది ఈయన కవిత అవేవీ చూడకుండా అచ్చంగా గుండెలో నుంచి దూసుకు వస్తుంది ఆ నిజాయితీ, వైవశ్యం, ప్రజా సామాన్యాన్ని పట్టుగుంటుంది ఇవి మాకోసమే పుట్టినవి అనే

మమకారంతో పాఠకులు వీటిని వదులుకో లేరు ఈ వీడని బంధం భాగవతం ప్రజలతో పెట్టుకుంది

'తల్లీ నిన్నుదలంచి పుస్తకము చే
తం బూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా
నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదు వాక్కునను సం
ప్రీతిం జగన్మోహినీ ?
ఫుల్లాబ్జాక్షీ ! సరస్వతీ ! భగవతీ !
పూర్ణేందు బింబాననా !'

కల్పన లేదు అలంకార వైభవం లేదు శబ్దగాంభీర్యం లేదు 7 సంబోధనలే 'అమ్మల గన్న యమ్మ' 'హరికిం బట్టపు దేవి' అన్నవి ఇట్లాంటివే

'కలడందురు దీనులయెడ
కలడందురు పరమయోగి గణములపాలన్
కలడంద్రు రన్నిదిశలను
కలడు కలండనెడు వాడు కలడో ? లేడో ?'

ఇంత నిరాడంబరమైన, నిరలంకారములైన పద్యాలకు ఎందుకంత ప్రాణం పెడతారు ? కంఠస్థం చేస్తారు అదే చిత్రం ! ఆ పద్యాల్లో నిండు హృదయం కొట్టుకుంటుంది అచ్చపు చిత్తశుద్ధి తళతళ మెరుస్తుంది అందుకే వాటికంత ఆకర్షణ—

భాగవతమంతా ఇదే ధోరణిలో ఉంటుందని కాదు ఎక్కువ భాగంలో పోతన ఈ హృదయ స్పందనం ప్రబలంగా వినిపిస్తుంది పోతన తాలూకు ఈ హృదయ ధర్మంతో పాటు అపారమైన కవితా సంపదకూడా ఉంది లేకపోతే ఈ గ్రంథం [illegible] సాధనమైన ఒక పురాణ గ్రంథంగా మాత్రం మిగిలి ఉండేది

ఆయనలో రెండువైపు లున్నాయి

ఒకటి నిరాఘాటమైన జ్ఞానవాహిని
రెండు అపరిహార్యమైన మధురభక్తి

మొదటిది అతిగహనమైన ఆధ్యాత్మిక రహస్యాలను అరటిపండు ఒలిచి పెట్టినట్టు చేతి కందిస్తే రెండవది ఆ పాత మధురమై రసహృదయాలను కదిలించి వేస్తుంది ఈ రెండు శక్తులవల్ల తెలుగు భాగవతం ఏ నాటికీ చెక్కు చెదరని అమృత కలశం అయింది

ఆయన జీవ ధర్మాలైన నిరాడంబరత, చిత్తశుద్ధి, భాగవతంలో ప్రతిబింబిస్తాయి

రాజులను తిరస్కరించి భోగభాగ్యాల వెలియై పేదతనాన్ని కోరి వరించాడు నిధి కంటె భగవత్సన్నిధినే పెన్నిధిగా భావించాడు దారిద్ర్యమే పరమపదానికి దగ్గరతోవ అని నమ్మాడు

> 'కృష్ణుఁ గొంద ఱట గందు రకించన వైష్ణవాంఘ్రి, సం
> స్థాన రజోభిషిక్తులగు సంహృత కర్ములు దానవేశ్వరా!
> తత్సంపన్నాంధున కంజనంబు వినుమీ
> దారిద్ర్య మూహింపగన్!'

అని అతని కథా పాత్ర లంటాయి పోతన హృదయం అంతకంటె భిన్నం కాదు

విన్న కథలను బట్టి – అతడు వ్యవసాయం చేశాడు జొన్నలే పండించాడో వరి వెన్నులే పోగుచేశాడో బతకడం కోసం తిన్నాడు నిజదార సుతోదర పోషణం చేశాడు అతని హృదయంలో మారుమోగుతున్న ప్రధాన తంత్రి ఒకటే – భవ బంధంబులు తెగుట—

> "దీనిం దెనింగించి నా జననంబున్ సఫలంబుఁ
> జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్" ౧-21

సరిగ్గా తిక్కన్నగారూ ఇలాగే అన్నారు

> 'జన్మాంతర దుఃఖముల్ తొలఁగునట్లుగఁ జేసి కృతార్థుఁ జేయవే!
> విరా ౧. 21

అభిజ్ఞాన శాకుంతలం చివర కాళిదాసుదీ ఇదే మాట—
"మే పునర్భవం క్షపయతు నీలలోహితః" (శాకుం భరతవాక్యం)

పక్వహృదయులూ, అంతర్ముఖులూ అయిన మహాపురుషులు కోరే కోరిక ఇదే నన్నమాట - ఈ ఏకైక లక్ష్యంతోనే భాగవతం ప్రారంభించాడు పోతనార్యుడు - 'శ్రీకైవల్య పదంబు చేరుటకునై' కన్నులు మూసుకుని గాఢంగా చింతించాడు

ఎవరిని ?

లోకైక రక్షారంభకుని - దేవకీ వసుదేవ, అక్రూర వృద్ధజన గోపాలకాదులను రక్షించడానికి పుట్టినవాణ్ణి - భక్తపాలన కళాసంరంభకుని - గజేంద్రుడు, ప్రహ్లాదుడు ధ్రువుడు, కుచేలుడు వంటి వారిని ఆదుకున్నవాణ్ణి, దానవోద్రేక స్తంభకుని - హిరణ్యకశిపు కంసుడు, జరాసంధుడు, శిశుపాలుడు వంటివారి అణచివేసినవాణ్ణి (స్తంభ శబ్దంవల్ల నృసింహస్ఫూర్తి) కేళిలోల విలసత్ = అమానుష లీలా ఖేలనంలో, అంటకుండా, అలంకరించిన వాణ్ణి - అతడు మహానందాంగనా డింభకుడు, మహత్వపూర్ణుడు డింభకుడు ఈ విరోధాభాసం ఆయనవద్దనే అలంకారమయింది అంతేకాదు అతడు మహానందమనే అంగన బిడ్డ తన రచన పరమావధి ఆ మహానందం చూరగొనడమే

ఆ తొలిపద్యం చదవగానే భాగవతంలోని ముఖ్య భాగాలన్నీ మన కళ్ళఎదుట తిరుగుతాయి కవి ప్రయత్న పూర్వకంగా వ్రాసినా అప్రయత్నంగా వ్రాసినా బహుకాల భావితములైన కథలు అన్నీ ఆ పద్యంలో ఇమిడి ఉన్నాయి

భాగవత మనగానే - ఏ అవతారంలోనూ లేని అపూర్వ కృష్ణలీలలూ, కంసవధ, రుక్మిణీ కల్యాణం నరకాసుర సంహారం, కుచేలోపాఖ్యానం మన ముందుంటాయి వెనక్కి వెడితే ధ్రువుడు, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, యజ్ఞ వాటికలో నిలిచిన చిన్ని వామనుడు మనలను తనివితీరా పలకరిస్తారు

భగవద్గీతలో వ్యాసమహాత్ముడు సూత్రప్రాయంగా చెప్పిన సూక్తులు ప్రాణశక్తితో పాత్రలై భాగవతంలో కదులుతూ కనిపిస్తాయి

'చతుర్విధా భజన్తే మాం జనా స్సుకృతినోఽర్జున !
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ !'' గీ॥ 7-16

ఇందులో మొదట జిజ్ఞాసువు పరీక్షిత్తు ఉత్తమ పాండవ వంశంలో పుట్టాడు సత్ప్రజాపాలకు డనిపించుకున్నాడు అతనిలో పతన హేతువులైన మద మాత్సర్యాలు ప్రవేశించాయి వేట నెపం, అంతే అప్పటికే కలి, ధర్మదేవత తలదన్నాడు తన పూర్వు లెవరూ ఎంత నొచ్చినా ఋషి పుంగవులను అవమానించలేదు అతడు ప్రభుత్వాహంకారాలకు ప్రతీక ఆ అహంకారాన్ని చెండాడితేగాని జ్ఞానోదయంకాదు మునికుమారుడైన శృంగి రూపంలో దానికి శిక్ష జరిగింది పరీక్షిత్తులో నాటి రాజుంటే, శృంగిలో శిక్షకుడైన కవి ఉన్నాడు

సంస్కృతంలో ఉన్న మాటలకు పోతన్న శృంగి మాటలకు పోలికలేదు పోతన ఏనాటికీ ప్రాభవ గర్వితులు మదమత్తులు అయిన ప్రభువులను గూర్చి అన్న మాట లవి ఆ రోజుల్లో ఆ మాట లనడానికి తిరుగులేని ధైర్య స్థైర్యాలుండాలి లౌకికంగా నిరుపేద అయినా — అవి ఆయనకు సమృద్ధిగా ఉన్నాయి అవి ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టినా ఓర్చుకునే క్షమను భగవంతు డాయన కిచ్చాడు శృంగి అన్నమాటలు —

"ఆడడు తన్ను దూషణము, లాశ్రమ వాసులుగాని వైరులం
గూడడు, కందమూలములఁ గూడుగఁ దించు సమాధిచిత్తుడై
వీడడు లోనిచూడ్కులను విష్ణునిఁ దక్కఁ బరప్రపంచముం
జూడడు మద్గురుండు ఫణిఁ జుట్టగనేటికి? రాచవానికిన్ ౧-467

'పోము వారణ్య దానములఁ బుచ్చుకొనంగ ధనంబు లేమియున్
దేము సవంచనంబులుగ, దీవన లిచ్చుచు వేసరింపగా రాము..'
౧-468

'పుడమిగల జనులు పొగడగఁ,
గుడుతురు గట్టుదురు కాక కువలయపతులై
యడవుల నిడుములఁ బడియెడి
బడుగుల మెడ నిడగదగునె? పన్నగ శవమున్' ౧-469

ఆ తెలుగు మాటఃలోని పదును, ప్రాసలలోని బిగువు, భావంలోని తీక్ష్ణత, శృంగి నోటితో పలికిన పోతన పలుకులవి

ఆ మాటలకు నాటి రాజులు ఏమనుకున్నారోగాని పరీక్షిత్తు విని ఎగసి పడలేదు పశ్చాత్తప్తుడై —

'ఏపారు నహంకార
వ్యాపారములందు మునిగి వర్తింపంగా
నాపాలిటి హరి భూసుర
శాపవ్యాజమున ముక్తసంగుం జేసెన్' ౧-503

అని జ్ఞానాభిముఖుడైనాడు

శుకమహర్షి ఖట్వాంగుని కథచెప్పి 'హరిభక్తునకు రెండు గడియల్లో కైవల్యం వచ్చే వీలుంది బెంగపడకు' అని ఓదార్చి పరమ జ్ఞానేచ్ఛ గలిగిన పరీక్షిత్తుకు పరతత్త్వం బోధిస్తాడు

మకర బాధితుడైన గజేంద్రుడు కంస బాధితులైన దేవకీ వసుదేవులు, ఇతర బాధితులైన గోపకులు ఆర్తులు వారికి అండగానిలిచి ఆపద్బాంధవుడు అయి ఆదుకున్నాడు

'కరి మకరితోడ నుద్దండత రాత్రులు సంధ్యలు
దివసంబులు సలిపెం బోరొక్క వేయి సంవత్సరముల్' ౮-69

గజేంద్రునికి తన బలగర్వాలమీద తరగని విశ్వాసం విరిగిపోయింది ప్రసన్నుడైనాడు

'లేరే? ముక్కొద దిక్కుమాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్'
౮-71

'ఆత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్' ౮-73

అని కరమెత్తి మొరపెట్టాడు

'రావే ఈశ్వర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా' అని వేడుకున్నాడు.

అప్పుడు హరి కరుణించాడు

అర్థార్థులైన వారు ధ్రువుడు, కుచేలుడు

ధ్రువుణ్ణి పినతల్లి అవమానించింది తన తండ్రి ఒడికంటె ఉన్నత పదవికోసం హరి అనుగ్రహించాడు

కుచేలుడు దారిద్ర్య పీడితుడు భార్యపోరు పడలేక బాల్యసఖుడు కృష్ణుణ్ణి వేడడానికి వెళ్లాడు ఆయన తామర తంపరగా సంపదలిచ్చాడు అయితే అతడు ఆ ఐశ్వర్యంలో మునిగి పోలేదు రాగరహితుడు, నిర్వికారుడు అయి అపవర్గం పొందాడు

ప్రహ్లాదుడు, అక్రూరుడు, జ్ఞానులు అంతర్గతంగా హరిచింతనంలో మునిగి బాహ్యాబంధాలను లెక్క చెయ్యనివారు తమ ఏకైక శరణ్యం శ్రీహరియే అనే పరమ విశ్వాసం కలవారు

"పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్
భాషించుచున్ హాసలీ
లా నిద్రాదులఁ జేయుచున్ దిరుగుచున్
లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగ ళీ
చింతామృతా స్వాద సం
ధానుండై మఱచెన్ సురారి సుతు డే
తద్విశ్వమున్ భూవరా! ౭-128

ఆ విశ్వాన్ని మరవడమే జ్ఞాని లక్షణం అచ్చపు ప్రపత్తికి అతడు నిదర్శనం

అక్రూరుడు కంసునకు భృత్యుడు అతడెందుకు కృష్ణుణ్ణి పిలుస్తున్నాడో తనకు తెలుసు ఏమీ చెప్పకుండానే ఆ జగన్నాటక సూత్రధారికి తెలుసు ఎవరూ మనసు విప్పరు రామకృష్ణులు రథం మీదనే ఉన్నారు తాను స్నానానికి సరసులో దిగాడు అందులోనూ వారే కనిపిస్తున్నారు

ముందు వేయిపడగలు విప్పుకుని శేషుడు కనిపించాడు ఆ శేషుని మీద 'సౌందర్య ఖనియైన వానినొక్క దివ్య పురుషుఁ గనియె' ౧౦ 1235.

చేతులు మొగిడ్చి వివశుడై ప్రార్థించాడు

'మూఢుఁడ వృథా తత్త్వజ్ఞుడన్ నాకు నీ
వీఁ సత్ పాదయుగంబు సూపి కరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ! ౧౦ 1238

అక్రూరునికి' తన మొదటిరూపు సూపి నటుని కైవడి తిరోహితుడైన 'శ్రీహరి దయ' వర్ణనాతీతం

'ప్రియోఽహి జ్ఞానినో ఒత్యర్థం అహం 7-17 మను సచ ప్రియః'
అన్న గీతావాక్యం పరమసత్యం గదా!

మధుర భక్తిలో ఈ నాలుగు లక్షణాలూ తగిన పాళ్లలో పెనవేసుకు ఉంటాయి గాబోలు—

మధుర భక్తునకు సర్వార్పణంగా గాఢంగా భగవంతుణ్ణి ప్రేమించడం ఒక్కటే తెలుసు అందులో ఆర్తి ఉంది, జిజ్ఞాస ఉంది కోర్కె ఉంది జ్ఞానం ఉంది

గను హృద్ భావసల సఖ్యమున్, శ్రవణమున్
దాసత్వమున్ వంద నా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుఁగుగున్
సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల స
ర్వాత్మున్ హరిన్నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచుఁ దలతున్
సత్యంబు దైత్యోత్తమా! ౫-167

గోపికలు, రుక్మిణి ఇత్యాదులు అట్టివారు పరిచ్ఛిన్నమైన నది అపరిచ్ఛిన్నమైన సముద్రంలో లీనం కావాలి, స్త్రీ పురుషునితో సాయుజ్యం పొందాలి జీవుడు పరమాత్మలో కరిగి పోవాలి అది అపరిహార్యమైన సృష్టి సూత్రం

పరమ పురుషు డొక్కడే పురుషుడు జీవులంతా స్త్రీలే ఆ మహా పురుషునితో కలిసి పోవడానికి పడే తహతహే మధురభక్తి

చైతన్య ప్రభువు వంటి మహా భక్తులంతా తమ్మును రాధగా భావించు కొని విరహపడేవారు వ్యథ చెందేవారు

ఆ లక్షణమే మనం భాగవతంలో ఇళ్లు వాకిళ్లు విడిచి కృష్ణునివైపు పరిగెత్తే గొల్లభామలలో చూస్తాం రుక్మిణి రాయబారంలో విరహంలో చూస్తాం

"తరు మృగ ఖగ గోగణములు
కరమొప్పెడు నిన్ను గన్న గానము విన్నన్
గరగి పులకించు నబలలు
కరగరె? నిను గన్న నీదు గానము విన్నన్" ౧౦-1000

కిటియై కౌగిటఁ జేర్చెను
వటుడై వర్ధిల్ల కొలిచె వడిఁ గృష్ణుండై
యిట పద చిహ్నములిడె క్రిం
దటి జామున నేమి నోచితమ్మ! ధరిత్రీ! ౧౦-1020

అంటారు గోపికలు—

"ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై
గౌరీశు మర్యాద నె
వ్వని పాదాంబుజ తోయమందు మునుగన్
వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రత చ
ర్యన్ నూఱు జన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్
నిక్కంబు ప్రాణేశ్వరా! ౧౦-1712

"శ్రీయుత మూర్తి! యో పురుష
సింహమ! సింహము పాలిసొమ్ము గో
మాయువు గోరు చందమున
మత్తుడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయిని నైన నన్ను వడిఁ
దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం డెరుగ
డద్భుతమైన భవత్ప్రతాపముల్
౧౦ పూ-1708 (170౩)

ఇవి రుక్మిణి మాటలు—

రుక్మిణి పరిణీత భార్య అయింది. ఈ ఆత్మార్పణాన్ని ప్రేమను అర్థం చేసుకుంటారు.

1 కాని గోపికలు మగనాండ్రు అందరినీ విడిచి తెగించి వచ్చి కృష్ణునితో క్రీడిస్తారు. ఇది సమర్థనీయమేనా? అవతార పురుషుడు చూపే ఆదర్శం ఇదేనా?

2 అంతేకాదు నరకాసురుని అంతఃపురంలో బంధింపబడ్డ "పదారువేల నృప బాలలఁ బ్రీతి పదారువేల చందముల విభూతి నొందుచు యథావిధితో వరియించె" అని కూడా ఉంది. పదారువేల మందిని ఒక్కడు వరించడం, వారితో వినోదించడం, సంభవమేనా? అయినా అది స్త్రీ లౌల్యానికి పరమావధిగదా! అట్టివాణ్ణి భగవంతుడని పూజించడం వివేకమేనా?

3 గోపికా వస్త్రాపహరణం జుగుప్సావహమైన పనిగదా! అది ఒక భగవల్లీలగా జమ కట్టడం భావ్యమేనా?

తొలి ప్రశ్నకు భాగవతంలోనే సమాధానం ఉంది. పరీక్షిత్తు శుకయోగిని అడిగాడు—

"జారుఁడని కాని కృష్ణుఁడు భూరి పరబ్రహ్మమనియు బుద్ధిదలంపన్
నేరరు, గుణమయ దేహము లేరీతిన్ విడిచి రంతు లెఱిఁగింపు శుకా!"

శుకుని జవాబు ఇది—

"మును నేఁ జెప్పితిఁ జక్రికిం బగతుఁడై
మూఢుండు చైద్యుండు పెం
పునఁ గైవల్య పదంబునందె ప్రియుఁడై
పొందంగ రాకున్నదే
యనఘుం డవ్యయుఁ డప్రమేయుఁ డగుణుం
డై నట్టి గోవిందు మూ
ర్తి నరశ్రేణికి ముక్తిదాయిని సుమీ
తెల్లంబు భూవల్లభా!"

హరి నిశ్చయ వచనంవల్ల శిశుపాల కంసాదులే కైవల్యం పొందారు శత్రులకు కూడా ముక్తినిచ్చే కరుణాళునకు తన్ను శరణు పొందినవారికి శ్రేయస్సు ఇవ్వడంలో ఆశ్చర్యం ఏముంది

ఆయన అవ్యయుడు, అప్రమేయుడు, అగుణుడు, జరామరణాలు లేవు! ఇట్టివాడని చెప్పలేము! మూడు గుణాలకు అతీతుడు అట్టివాడు కామ పరతంత్రుడై గోపికలను చేరదీశాడంటారా?

అక్కడ పరమాత్మను చేరుకోడానికి ఆత్రపడే జీవులకు గోపికలు ప్రతీకలు హరి గుణాతీతుడై వారిని ఐక్యం చేసుకోవడం పరమార్థం

భక్తుని భగవత్ప్రీతి, స్త్రీ యొక్క అనురాగ తీవ్రత వంటిది అనురాగమే కలగాలిగాని స్త్రీ ఏ అడ్డంకులను లెక్కచెయ్యదు శృంగారానికి భక్తికి, స్థాయి అనురాగమే కనుక భగవద్భక్తుల అనుబంధాన్ని స్త్రీ ప్రేమతో పోల్చి చెప్పడం దీని రహస్యం 'ముక్తిని' కాంత అనడం కూడా ఈ అనురక్తిని చెప్పడానికే

లేకపోతే - అందరితో అన్ని మూర్తులై క్రీడించడం అందరికీ తమవాడే అనిపించడం లౌకికంగా అనన్వితం అప్పుడు లోకోత్తరమైన మహిమ కావ్య వ్యంగ్యంగా వుంటుంది లేకపోతే శృంగార చపలమైన ఒక కట్టుకథే అవుతుంది దానికి భాగవతం అక్కరలేదు

ఈ దృష్టితో చూస్తే రెండవ ప్రశ్నకు కూడా సమాధానం దొరుకుతుంది

మూడవ ప్రశ్న వస్త్రాపహరణం

జాగ్రత్తగా వస్త్రాపహరణ ఘట్టం చదివితే సమాధానం అందులోనే ఉంది

గోపికలు ఇసుకతో కాత్యాయనీ విగ్రహంచేసి పూజించి '. మా కిందరకును వైశమ శ్రీకృష్ణుడు మగడుగాగ జేయుము తల్లీ' అని మాస వ్రతం చేస్తూ ఒకనాడు యమునలో వివస్త్రలై స్నానానికి దిగారు కృష్ణుడు వస్త్రాలు అపహరించాడు వారు ఇమ్మని ప్రార్థించారు అప్పుడు కృష్ణుడు 'ఎఱుగనే మీలోన నెప్పుడు నున్నాడ, నేను జూడని మర్మమెద్ది గలదు? వ్రతనిష్ఠలై యుండి వలువలు గట్టక నీరు సొత్తురే మీరు నియతిదప్పి?

కాత్యాయినీదేవిఁ గొల్లసేయుటగాక ఈ రీతి నోము వారెందుఁ గలరు?'
అని వారి వ్రతంలోని లోపాన్ని కాత్యాయినీ దేవికి చేసిన అపచారాన్ని, విశదపరచాడు. తనయందే తగిలిన వారి హృదయాలను కనుక్కున్నాడు.

'గత చేలా ప్లవనంబు నేడు వ్రత భంగంబంచు శంకించి ఫాలస్థటన్యస్త కరాబ్జలై సరసలీలన్ మ్రొక్కి పట్లందరున్' ౧౦ పూ 845 గోపాలుడు బాలలకు అంబరము లిచ్చాడు.

గోపస్త్రీలు తమ తప్పు తెలుసుకున్నారు. తమ వ్రతభంగం కాకుండా తప్పు చెప్పి సందిద్దిన భగవంతుని ప్రస్తుతించారు గాని అలిగి ఆగం చెయ్యలేదు. వారి కృతజ్ఞతా వచనాలివి

"చీర లపహరించి సిగ్గులు విడిపించి పరిహాసించినాయె
పరగ మనకు ఘనుడు నోము కొఱత గాకుండ రక్షించె
అనుచు హరి నుతించి రబల లెల్ల' ౧౦-847

'పరము పండె ననుచు తత్పదాంబుజములు
మానసించుకొనుచు మందకడకు' ౧౦-850

చదివి వారి హృదయం తెలుసుకుంటే ఇందులో తప్పు పట్టవలసినదేమీ కనిపించదు. అయితే 'కర సంఘాదిక పంచాయుధ గేహా' అనుచు - అనేమాట ఎంత స్వభావోక్తి అయినా, అనవసరం - అనిపిస్తుంది. అంతే

తెనిగింపు

"మతిర్న కృష్ణే పరతః స్వతో వా
మిథో౽భిపద్యేత గృహవ్రతానాం
అదాంత గోభిర్విశతాం తమిస్రం
పునః పునశ్చర్విత చర్వణానామ్" మత్తు ౫ 6

"అచ్చపుఁ జీకటిం బడి గృహవ్రతులై విషయ ప్రమత్తులై
చచ్చుచు బుట్టుచున్ మఱలఁ జర్విత చర్వణులైన వారికిన్
జెచ్చెర పుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైన నే
మిచ్చిన నైనఁ గానలకు నేగిననైన హరి ప్రబోధముల్"

పద్యం ఎత్తుగడలోనే తెలుగు పలుకుబడిలోని స్వాతంత్ర్యం, చకార ద్విత్వప్రాసలోని ఊనిక సంస్కృత హృదయం అవగతం చేసుకొన్న ధీమా స్పష్టంగా సూచిస్తాయి ఈ పద్యానికి జీవం వంటి మాటలు గృహావతులు, చర్విత చర్వణులు వాటిని విడవకుండా తెచ్చి చేర్చటిని 'పునః పునః' అన్న మాటలలోని స్వారస్యాన్ని వ్యాఖ్యానించడం గొప్ప భావుకుడైన కవికి మాత్రమే సాధ్యమైనవి

గజేంద్ర మోక్షణంలో 'తం తద్వదార్త ముపలభ్య జగన్నివాసః' 'సోఽంతస్సర స్యురు బలేన' 'తం వీక్ష్య పీడిత మజః' ఇత్యాది మూడు శ్లోకాలకు పోతనార్యుడు వ్రాసిన 'అల వైకుంఠ పురంబులో' అనే పద్యం మొదలు 'పూరించెన్ హరి' అన్నంతవరకు వ్రాసిన 20 గద్య పద్యాలు చూస్తే సంస్కృతాన్ని అనుసరించని అతని సర్వస్వతంత్రమైన ఆత్మీయత అబ్బుర మనిపిస్తుంది

ప్రహ్లాద చరిత్రలో హిరణ్య కశిపుడు అన్న 'ప్రహ్లాద ఉచ్యతాం తాత' అన్న ప్రశ్నకు ప్రహ్లాదుడు 'శ్రవణం, కీర్తనం' అని నవవిధ భక్తుల గూర్చి చెప్పి 'తన్మన్యే ఽధీత ముత్తమం' అని ముగించాడు

ఆ భక్తిని ఊతగా తీసుకుని వివశుడై పోతన 'అంధేందూదయముల్' 'కమలాక్షునర్చించు' 'కంజాక్షునకుగాని' 'సంసార జీమూత' అనే నాలుగు సుప్రసిద్ధ పద్యాలు వ్రాశాడు

కవిత్వ సంపద

సంస్కృత భాగవతం పురాణం కవిత్వం కోసం ఉద్దేశించిన కావ్యం కాదు కవిత్వ వాసన గూఢంగా ఉంటుంది పోతన తెలుగు భాగవతంలోని కథలు పౌరాణికమైనవి నమ్మిన పరమ భక్తులను హరి కరుణించిన గాథలు ప్రతిపాద్య వస్తువు ఆ వస్తువును తన కావ్య రసాయనంలో ముంచి మాధుర్యమయం చేసినవాడు పోతన కనుకనే కావ్యేంద్ర ధనువులో దాని రంగులు సముజ్జ్వలంగా దర్శన మిస్తాయి

కవిత్వ మనగా ఒక్క భావ సౌందర్యమే కాదు మరువరాని కథలు, పాత్రలు, వర్ణనలు, లోకోత్తర ఊహాశాలిత, అన్నిటి సమాహారమ్మును

ఆయన చిత్రించిన ద్రౌపది, కుబ్జ రుక్మిణి, గోపికలు, యశోద, సత్యభామ శృంగి వామనుడు గజేంద్రుడు ప్రహ్లాదుడు, కంసుడు, వారి కథలు అన్నీ నిండు ప్రాణ శక్తితో ఎదుట ప్రత్యక్షమౌతాయి

శృంగిలో అధికారమత్తులను తిరస్కరించే నిబ్బరం కనిపిస్తే అపరాధి అశ్వత్థామను కరుణించే ఔదార్యం ద్రౌపదిలో చూస్తాం

కుబ్జ రాజు కోపాన్ని కూడా లెక్కచేయకుండా చేసిన త్యాగం, రుక్మిణి సాత్త్విక ప్రేమ, గోపికల సర్వ సమర్పణలోని గాఢత, యశోద ముగ్ధ మాతృ హృదయం, సత్యభామ అహంకారంలోని వీరం మరపురానివి గజేంద్రుని ప్రపత్తి ప్రహ్లాదుని జ్ఞానభక్తి, కంస శిశుపాలుర వైరభక్తి ఇద్దరి - అద్దరులు వారి కథలు చదివిస్తాయి, కరిగిస్తాయి

ఇది హృదయ సౌందర్యమైతే అతని ప్రసన్న శైలి ముఖ సౌందర్యం ఆయన హరిభక్తిలో ఎంత తపస్సు చేశాడో, రచనాశక్తిలో అంతకంటె ఎక్కువ చేశాడా! అనిపిస్తుంది

ఆ శైలి పదగుంభిన పద్యగమనం అయన స్వతం సంస్కృతంలో ఎంత గంభీర రచన చెయ్యగలడో తెలుగులో అంతకంటె ఒయ్యారంగా పలికించగలడు——

ఈ సంస్కృతం చూడండి

"హాలాపాన విజృంభమాణ మదగర్వాతీత మోహోల్లసద్
బాలాలోకన శృంఖలా నిచయ సంబద్ధాత్ముడై లేశమున్
వేలా నిస్సరణంబు గానక మహావిద్వాంసుడున్ గామినీ
హేలాకృష్ట కురంగ శాబకమగున్ హీనస్థితిన్ వింటిరే ?" 1-215

ఇది తెలుగు పోహళింపు

ఓయమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలుపెరుగు మన నీడమ్మా!
పోయెద మెక్కడికైనను
మాయన్నలు సురభులాన, మంజులవాణీ!

'పుట్టినేర్చుకొనెనో, పుట్టక నేర్చెనో
చిట్టిబుద్ధు లిట్టి పొట్టి వడుగు
పొట్ట నున్నవెల్ల బూమెలు నని నవ్వి
యెలమి ధరణి దాన మిచ్చెనపుడు' ౮-623

ఈ అమాయికమైన తెలుగు మాటల్లో హరి నిజతత్త్వం వెదకితే కనపడుతుంది

మా, మా వలు వలు ముట్టకు
మామా కొనిపోకు పోకు మన్నింపు తగన్ ౧౦-825

లేమా! దనుజుల గెలువగ
లేమా? నీ వేల కడగి లేచితి విటు రా
లే మాను మానవే నా
లే మా విల్లందు కొనుము, లీలం గేలన్ ఉ ౧౦-172

అనే తెలుగు విరుపులోని గడుసు పోకడలు ఒకవంక అయితే, వేరొక వంక నోరు విప్పితే ఊడిపడే అంత్యాను ప్రాసలు ముచ్చట గొలుపుతాయి ఓం అని మొదలు పెట్టిన తొలి 5 పద్యాలలోనే ఈ అంత్యాను ప్రాసల ప్రాబల్యం చూడవచ్చు

క్షోణి తలంబునన్ నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికి చంచరీక చయ సుందర వేణికి రక్షితామర
శ్రేణికి, దోయజాత భవచిత్తవశీకరణైక వాణికిన్,
వాణికి, నక్షదామ శుక వారిజపుస్తక రమ్యపాణికిన్ ౧-౫

ఇవి భాస్కరునితో మొదలై ఈయనలో పారంముట్టాయి

కావ్యానికి రసం ప్రధానం, అని మన ఆలంకారికుల పరమ సిద్ధాంతం పోతన భాగవతమంతా రస నిష్ఠతో నడిచింది హరి నిష్ఠమైన గోపికల శృంగారం, రుక్మిణి అనురాగం, పదారువేల రాచకన్నెల సంప్రీతి, రతి స్థాయిలో పక్వములై రస స్థితికి తోడుపడ్డాయి కాని ఈ రాగాతిశయం స్త్రీ పురుష సమాగమ మాత్రంతో విశ్రమించక భగవత్సాయుజ్యంగా రూపు దిద్దుకొని శాంత రసంలో లీనమవుతుంది లేకపోతే భాగవత పరమార్థానికే భంగం వాటిల్లుతుంది

గీత గోవిందంలో వర్ణితమైన ఉత్కట రాధాకృష్ణ శృంగారం కూడ భగవత్సంప్రాప్తికే అని అందులో సూచితమయింది. వంగీయుల మధుర భక్తికి చరమసీమ భగవత్సాన్నిధ్య ప్రాప్తియే కదా! ఈ దృష్టితో కృష్ణుని రాసక్రీడలు, గోపికా విరహంలోని గోపికా గీతలు, భ్రమర గీతలు రసవత్ఖండ కావ్యాలు.

కంస వధ, నరకాసుర సంహారం వగైరాలు వీరరస పోషకాలు.

నృసింహావతారం, వ్రేపల్లెలోని ధేనుకాది నిర్వాపణం రౌద్రరసానికి ఆలంబనమైతే కృష్ణ బాల్య క్రీడలలో హాస్యం తొంగి చూస్తుంది. అల్లే భాగవతం సమిష్టిమీద సర్వరసాశ్రయం.

తర్వాత చెప్పదగ్గవి ఆయన రచించిన స్తుతులు. ప్రారంభంలోని కుంతీ స్తుతి, తదుపరి భీష్మస్తుతి తెలుగు వారికి కంఠపాఠమైనవి.

కుంతి కృష్ణుని మేనల్లునిగా చూడక పురుషోత్తమ బుద్ధితో నుతించింది.

యాదవులందు పాండవులయందు నధీశ్వర నాకు మోహవి
చ్ఛేదము సేయవయ్య ఘన సింధువుఁ జేరెడి గంగ భంగి నీ
పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయ బుద్ధి న
త్యాదర వృత్తితోఁ గదియునట్లుగఁ జేయఁగదయ్య ఈశ్వరా

భీష్ముడు సంస్కృతంలో 'విజయ సఖే రతి రస్తు మే ఽనవద్యా' అని అంటే - తెలుగు కృష్ణుని రూప పటం అపురూపంగా దర్శన మిస్తుంది.

'త్రిజగన్మోహన నీలకాంతిఁ దను వుద్దీపింపఁ బ్రాభాత నీ రజ
బంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజ సంయుక్త ముఖారవింద మతి సేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడి వన్నెకాఁడు మదిఁ నావేశించు నెల్లప్పుడున్' 1 281

ఈ స్తుతుల వెనక ఆ పాత్రల కంటె పరవశుడైన పోతనార్యుడే చేతులు మోడ్చి నిమీలిత నేత్రుడై కనిపిస్తాడు.

ఆతని శరద్ హేమంత వర్ణనలు చూడదగ్గవి.

కలువల మేలి కందువలు కాముని కయ్యపు ఠాణెముల్ విర
క్తులు దలడించు వేళలు చకోరక పంక్తుల భోగ కాలముల్

సెలువలు సైరణన్ విడిచి చిక్కు బుల్ ఘనచంద్ర చంద్రికా
జ్వలిత దిశల్ శ న్నిశలు జారక దుర్దశలయ్యె నయ్యెడన్
౧ పు 965

శంభుకంట నొకటి జలరాశి నొక్కటి
మఱియు నొకటి మనుజ మందిరముల
నొదిగెగాక మెఱయున్న మూడగ్నులు
చలికి నోడి భక్తి సలుపకున్నె ?

హేమంతంలోని ఈ ఉత్ప్రేక్ష కవి ఊహాశాలి కు మంచి నిదర్శనం

పూర్వ కవుల జాడలు

పోతనకు ఎంత ఉపజ్ఞ, స్వీయశైలి, రచనా వైచిత్రి ఉన్నా ఆయన కవితలో నన్నయ, ఎఱ్ఱన, భాస్కరుడు, నాచన, శ్రీనాథుడు, కాళిదాసు, బాణుడు వంటి వారి పోకడలు, పదబంధాలు కనిపిస్తాయి

అయితే వారు యందలి ప్రీతికి అవి మచ్చులు అనుకోవాలి

యశోద కృష్ణుని దుడుకు చేష్టలు ఉటంకిస్తూ—

వీరెవ్వరు శ్రీకృష్ణులు
గారా ? యెన్నడును వెన్నగానరట గదా !
చోరత్వం బించుకయును
నేరరట ! ధరిత్రి నిట్టి నియతులు గలరే ! దశ 375

వెంటనే నన్నయగారి వీరెవ్వరయ్య ద్రుపద మహారాజులే' అనే పద్యం జ్ఞాపకం వస్తుంది అట్లే ఎఱ్ఱన 'ఊషర బీజములు' అనే పద్యానికి 'అంధే దూయముల్' అనేది నాచన 'అరజూచున్' అనే దానికి 'పరుజూచున్ వరుజూచు' అనేదీ, శ్రీనాథుని 'శివనామధేయంబు చింతింప నేర్చిన జిహ్వా జిహ్వ' అనే పద్యానికి 'కమలాక్షు నర్చించు కరములు కరములు' అనే పద్యమూ పుత్రికలనడానికి ఏమీ అభ్యంతరం లేదు తర్వాత పోతనార్యునిమీది గౌరవంతో ఆయనను అనుసరించిన వారూ ఉన్నారు

యశోద స్త్రీ సాధారణమైన అలతి మాటలలో ధ్వనించే దశావతార స్ఫూర్తి పోతన లోతైన ఊహాశాలితకు దివ్య దర్శనం - దానికే తర్వాత భంగ్యంతరంగా పాండురంగ కవిలో చూస్తాం

భాగవతంలో యశోద బాల కృష్ణుని అన్నమాటలు—

'తోయంబు లివియని తొలగవు చొచ్చెదు
 తలఁచెదు గట్టెనఁ దరలనెత్త
మంటితో నాటలు మానవు, గోరాడె
 దున్నత స్తంభంబు లూసబోయె
దన్యుల నర్పంబు లడుగంగఁ బాఱెదు
 రాచవేటల చాల అవ్వ దెచ్చె
దలయవు నీళ్లకు నడ్డంబు గట్టెదు
 ముసలివై హలివృత్తి మొనయఁజూచె

దంబరంబు మొలకు నడుగవు తిరిగెద
వింకఁగలికి తనములేల పుత్ర!
నిన్ను వంప వ్రాల్ప నే నేరననియొ నీ
 విట్లు క్రిందు మీదు నెఱుఁగ కునికి' దశ పూ 378

తల్లి పిల్లవాని అల్లరి చేష్టలను ఎత్తి మందలించడం ప్రకృతార్థమైతే - ఆ శబ్దాల శక్తివల్ల మత్స్యాది దశావతారాలు స్ఫురించడం శబ్దశక్తి మూల ధ్వనియై ఇక్కడ సహృదయులను అలరిస్తుంది అట్లే 'కమలాక్షు నర్చించు' 'అంధేందూదయ' వంటి పద్యచ్ఛాయలు ఎన్నో తర్వాతి కవులలో కనబడుతూ ఉంటాయి

కళాప్రసక్తి

పురాణమైన భాగవతాన్ని కావ్య ధర్మంతో రసరామణీయకాలతో తెనిగించడంవల్ల దీనిలో కావ్యాని కుండవలసిన కళాసృష్టి ఎట్లా జరిగింది? అని భావుకులు సమీక్షించడం తప్పుకాదు రీతికు శద్ధి, భావ సౌందర్య దర్శనమే కాకుండా ఔచిత్య పాలనం ఒకటి అసిధారావ్రతంగా ఉంటుంది

రెండవది భావ సంయమనం భావ స్రవంతిని అడ్డమాకలు లేక పోయినట్టే పోనివ్వడం కావ్య మర్యాదకు భంగం

పోతన ఎంత కవి అయినా రచనను అలంకరించినా, అవధిలేని అనుప్రాసలు అడ్డుపడుతూ సమయాసమయాలు చూడకుండా వస్తూపోతూ ఉండడం కళా దృష్ట్యా కొంత అపచారం అనిపిస్తాయి ఇవి ఇంత అతివేలంగా మరి ఏ కవిలోనూ కనిపించవు ఒకొక్కప్పుడు అర్థపుష్టిని కూడా లెక్కచేయవు

రెండవది - తను నచ్చిన భావాన్ని 'పదే పదే' చెప్పడంవల్ల దాని అందం పలచబడ పోవడం ముద్దు సుకుమార మకరంద వంటి భావం పలుచోట్ల కనపడడం ఉదాహరణంగా చూడవచ్చు

నరకాసుర యుద్ధ ఘట్టంలో, స్త్రీ యుద్ధంలో పాల్గొనడం ఎంత అశక్యమో చెప్పడానికి అన్ని పునరుక్తులు అక్కరలేదు

గోపికలు కృష్ణుని దుడుకు చేష్టలు చెప్పడంలో ఆడవారి చేత అట్టి 'మగపనులు' చెప్పించడం అనుచితం అనక తప్పదు ఈ సన్నివేశంలో ఎట్టిన ఇతర చేష్టలను వర్ణించాడు గాని బాలుని అనుచిత శృంగార చేష్టలను వర్ణించలేదు

శ్రీనాథుడు శృంగారకవి అనీ, పోతన మహాభక్తకవి అనీ వాడుక అయితే పోతన శృంగార వర్ణనంలో ఏమీ తక్కువ చెయ్యలేదు

శరద్రాత్రి క్రీడలలో రాస లీలలలో, గోపికా కృష్ణరతిని సాంగోపాంగంగా వర్ణించాడు అజామీళుని కథలో ఒక దాసి విటునితో రమించిన విధం ఏ ప్రబంధ శృంగారానికీ తీసిపోని విధంగా ఉంది అయితే శ్రీనాథుని శృంగారం దేవతల నుంచి మానవ స్థాయికి దిగితే, పోతన శృంగారం దైవాభిముఖమై పరమార్థ స్థాయికి ఎదిగి కైవల్యంలో లీనమవుతుంది ఈ భేదంవల్ల ఈయని శృంగారం చరమ సీమలో భక్తి భావనలో మునిగిపోతుంది కవి రస చిత్రణంలో శృంగారం అవడం అపరాధమేమీ కాదు కవి రసోపాసనలో వీరాగి అయితే ఆ కావ్యం నీరసమవుతుంది కావ్యం రసహీనమైతే అది ఒక పెద్ద అపశబ్దం మాత్రమే

కావ్యం యొక్క ఉపక్రమోపసంహారాలలో కవి లక్ష్యం ప్రస్ఫుటమవుతుంది

కావ్య ప్రారంభంలో పోతన 'శ్రీకైవల్య పదంబు చేరుటకే' ఇష్టదైవాన్ని చింతించాడు

మధ్యను పరీక్షిత్తు మాటగా 'ప్రబ్బిన భక్తిని హరిపైఁ కబ్బంబులు సెప్పి కవులు కైవల్య శ్రీ కబ్బుదురట' అని పలుగా తన కైవల్య పుంతను వెల్లడించాడు దశ పూ 352

దశమోత్తర భాగం తుదిని, శుకయోగి వచనంలో 'ఈ కృష్ణ కథా సుధా సము సంప్రీతాత్ములై భక్తి గ్రోలిన పుణ్యాత్ములు నిర్ధూత సర్వాఘులై యనుయంబున్ దుదిఁగాంతు రక్షయ్యం దంబైనట్టి కైవల్యమున్' అని అన పరమగమ్యాన్ని ఉద్ఘాటించి పునరావృత్తి రహితమైన పరమపదం చేరుకొన్న ధన్యుడు పోతనార్యుడు

11, 12 స్కంధాలు శిష్యుడు నారయ రచన కనుక - దశమ స్కంధంతోనే మనకు పోతన దర్శనం తిరోహితం అవుతుంది కథలో లక్షణ విరోధాలు కనబడితే అవి పోతన శిష్యుల రచనలోనివిగాని ఆయనవి కావని పండితులు సమర్థించారు ఆయనవే అని ఒప్పుకొన్నా - 'అపశబ్దంబులఁ గూడియున్ హరి చరిత్రాలాపముల్ సర్వపాప పరిత్యాగము సేయు' అని ప్రథమంలో అన్న ఆయన మాట శ్రీరామ రక్షగా నిలుస్తుంది

హరిశ్చంద్రోపాఖ్యానం - గౌరన

సత్యానికి హరిశ్చంద్రుడికి విడరాని బంకె 'వాడేమైనా సత్య హరిశ్చంద్రుడా ?' అనేది నిత్యసూక్తి హరిశ్చంద్ర కథ రామాయణ భారత కథలంత బలంగా ప్రజల మనస్సుల్లో నాటుకుపోయింది ఈ కథ ఇంతగా నాటుకుపోవడానికి కారణం ఎవరు ?

ప్రస్తుతం ప్రజల్లో ప్రచారమయిన కథకు గౌరన అనే కవి కారణం ఋగ్వేదంలో, మార్కండేయ, భాగవత, పురాణాల్లో ఉన్న హరిశ్చంద్రోపాఖ్యానానికి హస్తిమశకాంతరం భేదం ఉంది

ఋగ్వేద సంబంధి ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం హరిశ్చంద్రుడు సత్యవ్రతుడు కాడు ఆడితప్పడంలో అంతవాడు లేడు

మార్కండేయ పురాణంలోని కొన్ని ముఖ్యాంశాలు గౌరన కథలో ఉన్నా పేరులు సన్నివేశాలు వస్తువు రూపురేఖలు అన్నీ మారిపోయాయి

భాగవత కథ సూర్యవంశ కథా ప్రస్తావంలో సూక్ష్మంగా వచ్చి మార్కండేయాంశాలనే తడివిపోతుంది

స్కాందంలో కూడా ఈ కథ ఉన్నదంటారు కాని దాని వివరాలు చెప్పినవారు లేరు అది విరళ ప్రచారమై జనశ్రుతిలోనుంచి దూరమై పోయింది ఏతావతా - సత్యంకో - సర్వనైచ్యాలకు ఒడబడి బాధలో కాలి తప్త కాంచనంలా నిలిచిన నేటి తెలుగు హరిశ్చంద్ర కథకు సృష్టికర్త గౌరన అని చెప్పవచ్చు

ఒకనాడు తెలుగు రంగస్థలానికి రెండు గొప్ప నాటకాల కథలిచ్చిన ఘనత గౌరన్నకు దక్కుతుంది అందులో మొదటిది సారంగధర కథ రెండవది హరిశ్చంద్ర కథ——

సారంగధర కథ - దురదృష్టవశాత్తు – పదకొండో శతాబ్దంలో వేంగి రాజ్యం ఏలి ఆంధ్ర మహాభారత రచనకు కారకుడయిన చాళుక్య రాజ రాజ నరేంద్రుని శుభ్రకీర్తిలో తుడువరాని మచ్చలాగు అంటుకు పోయింది రాజ రాజుకు రత్నాంగి చిత్రాంగి అనే భార్యలుగాని, సారంగధరుడనే కుమారుడు గాని ఉన్నట్టు – 'రామ రామ'– చరిత్ర చెప్పదు ఆయన భార్య పేరు అమ్మంగ దేవి ఇంకో భార్య ఉన్నదనుకున్నా ఆమె పేరు చిత్రాంగి కాదు

ఈ అపకీర్తిని రాజమహేంద్రవగం వారే సంతోషంగా స్వీకరించారు ఒక చోటికి చిత్రాంగిమేడ అనీ, వేరొక చోటికి సారంగధరుని మెట్ట అనీ కట్టు కథకు కాళ్లిచ్చి నిలబెట్టారు

ఈ పొరపాటు ఎలా వచ్చిందంటే లాటదేశపు రాజు పేరు కూడా రాజ మహేంద్రుడే ఆయనకు పై పేరులుగల రాణులూ, ఆ పేరుగల కుమారుడు ఉన్నారు నామసాదృశ్యంవల్ల చరిత్రమీద శ్రద్ధలేని ప్రజల్లో ఈ కథ జరగనిచోట జరిగినట్లు ప్రచార మయింది

గౌరన వ్రాసిన నవనాథ చరిత్రలో - ప్రసక్తమైన మీననాథుని ఇతి వృత్తంలో ఈ కథ వస్తుంది మీననాథుడు సారంగధరునకు తన యోగశక్తివల్ల

కాళ్ళిచ్చి చౌరంగి అనే పేరుతో అగ్రశిష్యునిగా స్వీకరించారు ఆ కథ మనకు సారంగధర నాటకంగా ప్రత్యక్షమయింది

ఆ విధంగా గౌరన్న మనకు దగ్గరయ్యాడు

గౌరన క్రీ శ 1440 - 1450 ప్రాంతపు వాడని చరిత్రకారులు ఆతని తెలుగు నుడికారాన్నిబట్టి కూడా కాకతీయ సీమవాడుగా కనబడతాడు

తెలుగు కవిత్వంలో కొత్త ఊపుతో రసజ్ఞులను ఊయ్యాలలూచిన శ్రీనాథకవికి సమకాలికుడు, వయసులో 10, 15 ఏండ్లు చిన్నవాడు కావచ్చు పోతనార్యుడికి దగ్గరి కాలపువాడు ఇతడు తన్ను గూర్చి హరిశ్చంద్ర గ్రంథాంతంలో చెప్పుకున్న మాటలివి

> "భ్రమరా ప్రసాద సంప్రాప్త కవిత్వ
> సుమహిత సామ్రాజ్య సుఖ పరాయణుడు
> చతుర సామాన్య లక్షణ చక్రవర్తి
> ప్రతివాది మదగజ పంచాననుండు
> మతిమంతు డయ్యలమంత్రి పుంగవుని
> సుతుడు గౌరన మంత్రి సుకవిశేఖరుడు"

ఇందులో ముఖ్యమైనవి - లక్షణ చక్రవర్తి, ప్రతివాది గజపంచాననుడు, సుకవిశేఖరుడు

ఇతడు 'లక్షణ దీపిక' అనే గ్రంథం వ్రాయడంవల్ల మొదటి బిరుదం సార్థకం రెండవది విద్యాస్పర్థకు సంబంధించింది కవిత్వంతో సంబంధంలేనిది మూడవది ఈతని రచనను మెచ్చుకున్నవారు ప్రశంసించిన మాటగా ప్రథమ పురుషలో వ్రాసుకున్నాడు

ఇతని లక్షణ దీపికను లక్షణ గ్రంథాలలో చేరిస్తే ఈయన కవితా రచనలు రెండు 1 నవనాథ చరిత్ర 2 హరిశ్చంద్రోపాఖ్యానం రెండూ ద్విపద రచనలే

శివకవులకు రంగనాథునకు, తర్వాత మళ్లా ద్విపదకు ఆంధ్ర కవితలో స్థానం కల్పించిన ప్రత్యేకత గౌరన మంత్రిది మార్గ కవితనుంచి మళ్లీ

ద్విపదను చేపట్టడం శివకవుల ఉద్యమం అయితే – దానినొక కావ్య ప్రక్రియగా స్వీకరించడం గౌరన చేసిన పని

నిజానికి ఇతడు శివభక్తుడు శ్రీశైల భ్రమరాంబా మల్లినాథులను స్మరించి మరీ కావ్యరచనకు ఉపక్రమించాడు నవనాథ చరిత్రను శ్రీశైల మఠాధిపతి మమ్మడి శాంతయ్యకు కృతి ఇచ్చాడు రచనలో శివప్రసక్తి వచ్చినప్పుడు ఇతని మనసు పొంగు కనబడుతుంది ఈ శైవాభిమానం ద్విపద రచనకు ప్రోత్సహించింది అనుకున్నా వీరశైవ ఉద్యమవాసన ఇందులో లేదు 'వాసుదేవ ప్రియ' 'వాసుకి నిలయ!' అన్న ఇతడు అద్వైతివై కేవల కావ్యధర్మంతోనే దీన్ని నిర్వహించాడు

నవనాథ చరిత్రకంటె హరిశ్చంద్రకథ పక్వమైన రచన పూర్వభాగంలో సంస్కృతవాసన ఎక్కువగా ఉన్నా, ఉత్తర భాగంలో తెలుగు నుడికారపు సొంపు సంవాద చాతురి పాత్రోచిత భాష, వర్ణన చాతురి బాగా కనబడుతుంది

ఇతని హరిశ్చంద్రోపాఖ్యానం పూర్వకథలకు భిన్నమై కొత్త సంఘటనలతో కొత్త పాత్రలతో, కొత్త రూపుతో చాలమంది కవితా ప్రియులను ఆకర్షించింది దీన్నే మూలవస్తువుగా పెట్టుకుని శంకరకవి మల్లారెడ్డి కంచి వీరశరభకవి, హరిశ్చంద్ర కావ్యాలు విరచించారు

ఆధునికుల సత్య హరిశ్చంద్రాది నాటకాలకు గౌరన ద్విపద కావ్యమే ఆధారం కావడం సరేసరి

ఇంద్రసభలో వసిష్ఠ విశ్వామిత్రుల వాగ్వివాదం, మృగాల కల్పన, రాజు వేట, మాతంగ కన్యల వృత్తాంతం, కౌశికుని యాగధనం పరిమితి, రాజ్యభ్రష్టుడైన హరిశ్చంద్రునకు నక్షత్రకుని పీడ, త్రోవలో దావాగ్ని, కాశిలో ఆలుబిడ్డల విక్రయ వివరాలు, సర్పదంశన కారణం, చంద్రమతిమీద చౌర్యారోపణం చంద్రమతి దండనమును హరిశ్చంద్రుడే అమలు జరపవలసి రావడం తుదకు దేవతా సాక్షాత్కారం అనే అంశాలు గౌరన క్రొత్తగా ప్రవేశపెట్టినవి

పురాణాదుల్లో లేని ఇన్ని అంశాలను గౌరన స్వకపోల కల్పితంచేసి ఉంటాడా? దీనికి సరియైన మూలం ఏదైనా ఉండకూడదా? అన్న సంగతి బహుళ పరిశోధనమీద తేలవలసినది

మనకు ఎదుట ఉన్న కావ్యాస్వాదమే ముఖ్యం కనుక హరిశ్చంద్ర కవిత మీదనే దృష్టి ఉంచుదాం

కావ్యానికి వస్తువు శరీరం అది వర్ణనలతోనూ, సంభాషణలతోనూ సాగదీస్తే రూపు చెడుతుంది సంఘటనంతో సన్నివేశ చాతురితో మలుపులు తిరిగి అది సహజమైన ముగింపుకువస్తే పుష్టిగా కనబడుతుంది

ఈ హరిశ్చంద్ర కథ అట్లా పుష్టిచెంది ఏకవస్తుకమూ, ఏకనాయకమూ అయింది

వసిష్ఠ విశ్వామిత్రుల వివాదం విశ్వామిత్రుని కుయుక్తులకు దారితీసింది దానితో యాగప్రసక్తి - కౌశికునికి వాగ్దానం - అతని మాయలవల్ల రాజు వేట - అందులో మాతంగ కన్యలు - మాట పట్టింపులో సర్వరాజ్యభ్రంశం, మొదటి వాగ్దానం తీర్చడానికి కాశీప్రయాణం । తోవలో మళ్లా మాయలు - నక్షత్రక పీడ, కాశీలో ఆలుబిడ్డల అమ్మకం, అయినా అప్పుతీరకపోవడం, ఆత్మ విక్రయం - కాటికాపరితనం - పుత్రుని మరణం, భార్యమీద చౌర్యారోపణం - హరిశ్చంద్రుని తుది పరీక్ష - విజయం

ఈ ఘటనమీద ఘటన పాఠక కుతూహలానికి కారణమై రసవంత మయింది కాని - తుదిని శమదమాది సంపన్నులైన ఋషిపుంగవులు కౌశిక వసిష్ఠులు ఒకరినొకరు జలపక్షులుగా శపించుకొని మాత్సర్యంలో మునిగి పోవడం ఈ కథకు మంచి ముగింపు కాదు

అయితే - ఈ ఆడి బక శాపకథ గౌరన వారి ... ఉన్నా దానిని అనుచితమని వేదంవారు తాము సంస్కరించిన గ్రంథంనుంచి తీసివేశారట !

వారు ఔచిత్యంకోసం తీసివేసినా - కొన్ని ముద్రిత ప్రతులలో ఉండి గౌరన కథా నిర్మాణానికి కళంకం తెచ్చిందనే చెప్పవలసి ఉంటుంది

గౌరన ఈ కథలో కొత్తపాత్రలను ప్రవేశపెట్టి కథకు మంచి గమన వైఖరి కూర్చాడు

రాజు మంత్రి సత్యకీర్తి, మాలకన్నెలు, నక్షత్రకుడు, కాలకౌశికుడు, కలహకంఠి, చోరకుడు మొదలైన పాత్రలు గౌరన సృష్టి పురాణపు పేగులు

కొన్ని మార్చాడు హరిశ్చంద్రుని భార్య పేరు అసలు శైబ్య దానిని చంద్రమతిగా మార్చాడు కుమారుని పేరు రోహితుడు, అది లోహితాస్యుడుగా మారింది

ఇందులో ప్రముఖంగా కనిపించే కరుణం అంగరసం మాత్రమే అది హరిశ్చంద్రుని ధర్మవీరానికి ఎనలేని పుష్టికూర్చి నిలిచింది

అయోధ్యలో, కాశిలో ఆ రాజదంపతులను చూచి ప్రజలు పడిన దుఃఖం, ప్రయాణంలో వారుపడిన దుర్భర యాతనలు, పరస్పర వియోగంలో అనుభవించిన ఖేదం, సర్పదష్టుడైన పుత్రుని చూచి చంద్రమతి శోకించిన విధం గౌరన కరుణరస సృష్టికి మంచి ఉదాహరణాలు

హరిశ్చంద్రుడు భూత పిశాచాలమీద చూపిన రౌద్రం శ్మశాన భీభత్సం, కాలకౌశిక కలహకంఠులమీద నెరపిన హాస్యం చూడదగ్గవి

చంద్రమతి, మాతంగకన్యల స్త్రీ వర్ణనం మాయాకురంగ వర్ణనం, ఆశ్రమ వర్ణనం చదువదగ్గవి

ఈతని ఊహాశాలితకు, పదప్రయోగ నైపుణికి, ఈ క్రింది పంక్తులు చూస్తే చాలు

చంద్రమతి దావాగ్నిలో దూకినప్పుడు —

"చెచ్చెర రాయంచ చెంగల్వ కొలను
జొచ్చిన గతిఁ జిచ్చు చొచ్చి యానడుమ
కలయఁ జూచిన కింశుకంబులలోనఁ
జెలువారుచున్న రాచిలుక చందమునఁ
బ్రబల సంధ్యారాగ పటలంబునందు
సొబగొందు క్రొన్నెల సోగబాగునను
మలసి మండెడు పెను మంటలలోన
నిలిచి" ప్రథమ-2277

చంద్రమతి కన్నీరు —

'మెఱుగు ముత్యంబుల మ్రింగు మీనంబు
లఱుగక వెసఁ గ్రక్కునట్టి చందమున
బలుమాఱు గ్రమ్మెడు బాష్పబిందువులు' ప్రథమ

మాటల విరుపు అర్థపుష్టి

'పుట్టక పుట్టిన ట్ట ...
పుట్టభోగికి పగబుట్ట నేమిటికి'' ద్వి 1855

పాము నిందలోని 'శ్రుతి బాహ్యుడిల పుట్టుగ్రుడ్డి తామసుడు' అనే మాటల లోని అర్థాంతరస్ఫూర్తి ఈ.ని శబ్దశక్తిక మెచ్చుకునక

సొగసైన నుడికారం వాడడంలో గొప్ప పట్టు

'జనపతు లేయూరు? సత్యమేయూరు'

'వేద నేనని నోట బ్రేవులు సూపం బోదురే ఋణముం
దెంపు గొనువాగు'

'కడగి పీనుగుమీద పంచమ్ము వెట్టి
చదువగాం జూచు కక్కుర్తిగా డితండు'

"తృప్తాఽస్థ'గా జుట్టి" సంస్కారులు తృప్తిగా అనడానికి ఉపయోగించే సంస్కృత స్థాధాతు మధ్యమ పురుష

లన పూర్వుల, సమకాలీన పలుకు సొగసులను అందుకుని వాడడంలో మొగమాటం ఎఱుగడు 'నెడు నోకో చీరరాచిన పాముకాటు' వంటి నాచన సోమన్న ఉక్తిని, 'నక్కబెట్టగలేరు సాధు రేగినను, బొక్కి నిల్వదు తల పొలముపగాని' వంటి తిక్కన సూక్తిని 'ఉఱక పువ్వుల విల్తు నొంజుట్టి గొన్న చుఱుకు చూపుల కన్ను చోద్యమై మెఱయు' ఇత్యాదిగా శ్రీనాథుని చమత్కారాన్ని, 'ఎనయ నిద్దర యెల్ల యేలిన నృపులు, నిపోయిరే నేల కొనిదె దంతైన' అనే పోతన లోకోక్తి పోలికను చక్కగా ఉపయోగించుకొన్నాడు

హరిశ్చంద్రుడు కొలువు చేసినది శ్మశానం కాదని, అది యజ్ఞశాల అని నిరూపించడం నాటకంలో నిర్వహణ సంధిలా చమత్కార జనకంగా ఉంది

ఈ గ్రంథంలో ఈ లోపాలు లేకుండా ఉంటే బాగుండు ననిపిస్తుంది

కృ యుగంలోని హ శ్చంద్ర థలో , ననాటి బ్రాహ్మణ పురోహితుల నైచ్యం వికృతవేషం, డబ్బు కక్కురితి, అట్టివాణ్ణి చూచి పిల్లలుచేసే అల్ల ,

కలహాకంఠి శరీర వాక్పారుష్యం హేయంగా వర్ణించడం కావ్యౌచిత్యానికి తగవు

ఎక్కడనైనా ఏకాంత క్రౌర్యంగాని, ఏకాంత సాధుత్వంగాని ఉండవు అట్టియెడ విశ్వామిత్ర నక్షత్రకుల నిర్విరామ క్రూరత్వ వర్ణనం కళాదృష్టిలో ఒక వికారం మానవ నైజానికి విరుద్ధం రెండిటి కలగలుపే మానవత్వం విశ్వామిత్రునికి పట్టుదల తప్ప పగలేదు దానిని అంత అమానుషంగా చూపనక్కరలేదు

భాషాదృష్ట్యా, చెయ్యొచ్చు, కప్పింది యాయవారము, మృగనేత్రి, వంటి అలాక్షణిక ప్రయోగాలున్నా వ్యవహారబలంవల్ల వచ్చినవి రసపోషకాలు గాని దూషకాలు కావు

మొత్తంమీద గౌరన ఆనాటి ఉత్తమ కవులలో ఒకడు ఉపజ్ఞ, ప్రతిభ కలవాడు ద్విపదకు పునరుజ్జీవనం ఇచ్చినవాడు

విక్రమార్క చరిత్ర – జక్కన

విక్రమార్క చరిత్ర చిత్రమైన కథాకావ్యం ఇదివరకే రెండు కథా కావ్యాలు చదివాం కనక ఇది ఎందుకు ? అని విడిచి ముందుకుపోతే 15 శతాబ్దిలో పుట్టిన గొప్ప కథా కావ్యాన్ని పోగొట్టుకున్నవాళ్ళ మవుతాము

విక్రమార్క చరిత్ర నారింజపండువంటిది చక్కని సువర్ణచ్ఛాయగల చర్మపు ఆవరణంతో ఏకాకారంగా కనిపించే పండును విప్పిచూస్తే - ఒక దానితో ఒకటి సంబంధంలేని పది పండ్రెండు తొనల సంపుటి అది అని తెలుస్తుంది

తొనలు పరమ రసవంతంగా రుచిగా ఉండవచ్చు కాని – మామిడి పండులాగు, అరటిపండువలె ఏకహృదయం ఉండదు అయినా దేని రుచి దానిది, దేని విలువ దానిది

అట్టి ప్రత్యేకమైన రుచీ, విలువా గల కావ్యం విక్రమార్క చరిత్ర

ఈ కావ్య నాయకుడు విక్రమార్కుడు, క్రీ పూ 1 శతాబ్దిలో ఉజ్జయినిని ఏలిన శకారాతి, కాళిదాసాది కవి పోషకుడు, అయిన చారిత్రక

పురుషుడు కాడు. భారతదేశపు దంత కథలలో సుప్రసిద్ధుడై సాహసాంకుడుగా పేరుపడ్డ విక్రమార్కుడు.

ఈ చిత్రాఖ్యాయికల కన్నింటికీ మూలద్రవ్యం కథా సరిత్సాగరం నుంచి సరఫరా అయినదే.

అట్టి కథలను కొన్నిటిని ఎంచి - బాల బోధగా, కథావీధిగా విక్రమార్క చరిత్ర అని సంస్కృతంలో ఒక పుస్తకం పుట్టి పరన పాఠనాల్లో ఉంది.

దానికిది తెనుగుకాదు. కొంత కాకను పోలేదు. దాన్నీ మరికొన్ని అపూర్వ కథలనూ, సేకరించి స్వతంత్రంగా పద్యకావ్యంగా వ్రాసిన గ్రంథం ఈ విక్రమార్క చరిత్ర!

తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి కథా కావ్యం కేతన దశకుమార చరిత్ర అని మనకు తెలుసు. అందులో రాజకుమారుడు నాయకుడుగా కనిపించినా - అందులో చాలా సాహస కథలు అతని మిత్రులవి. అందులో కథన చాతుర్యమే గాని కవితాప్రాచుర్యం అంతగా కనిపించదు.

రెండవ కథా కావ్యంగా చూడదగినది మంచన్న కేయూరబాహు చరిత్ర. నిజానికి ఇది ఒక నాటక కథకు ప్రబంధీకరణమైనా మూడాశ్వాసాల వరకు కథలో కథగా ఎన్నో కథలు బదరీబాదరాయణ సంబంధంగా దొరలి తుదకు ప్రధాన కథలో లీనమవుతాయి. ఈ కథలు వేటికవి ఇంపుగా ఉన్నా అసలు కథలో పొత్తుకుదర అతికించినట్లుంటాయి.

చదువరి లక్ష్యమంతా - నాయికా నాయకుల ఇతివృత్త పరిణామంమీద నిలిచి ఉన్నా - అవాంతర కథలను దాటివెళ్ళితే గాని అనుకున్న చోటికి చేరలేదు.

విక్రమార్క చరిత్ర రచనా పథకం ఆజాతికి చెందదు. నాయకుడు విక్రమాదిత్యునితోనే అన్ని కథలకు సంబంధం ఉంటుంది.

విక్రమార్కుని గుణాలలో ప్రధానమైన సాహసం, ఔదార్యం పరాక్రమం, సమయస్ఫూర్తి అనే లక్షణాలు పండును తొడిమపట్టి నిలిపినట్లు ప్రతికథను పట్టి ఉంచుతాయి. అను. యావత్ప్రబంధానికీ నాయకుడు

విక్రమార్కుడే కాని నాయకుని ప్రవృత్తి ప్రయత్నం సాఫల్యం, అంతా ఒక కథలోనే జరిగి, ఏకవస్తుకత అనే కావ్య ముఖ్యగుణం ఇందులో ఉండదు. విక్రమార్కుని నాయకత్వంలో సుమారు 20 కథలు జరిగి అవి మరువరాని శిల్పపు విన్నాణంతో రసజ్ఞులను అలరిస్తాయి.

ఈ చమత్కార కథలను కావ్యవస్తువుగా ఎంపిక చేసి రచన సాగించినవాడు జక్కన కవి.

జక్కన ఈ కృతిని వెన్నెలగంటి సిద్ధన మంత్రికి అంకితం చేశాడు. దేవరాయల కాలంలో ఉదయగిరి దుర్గాధిపతిగానో ఆయనవద్ద మంత్రిగానో ఉన్న సిద్ధన మంత్రి సంపన్నుడు. స్వయంగా కవి. కవితాప్రియుడు. ఇతని కాలం క్రీ. శ. 1425-47 అని చారిత్రకుల స్థూలనిర్దేశం.

కృతిపతి కవిని "ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రం అనే కథలు అనేకం విన్నాను.

ఆ కథానాయకుల కంటె సాహసక్రియా, కవిత వదాన్యతాది గుణ గౌరవరేఖల విక్రమార్కుఁడు ఎలపలి యెక్కుడై నెగడెఁ దచ్చరితంబు ప్రబంధశయ్యగా దెలుఁగునఁ జెప్పి యాకృతి పతిత్వము" అన కిమ్మని కోరాడు. ప్రభువు తలచిందే తథ్యం. ఈ విక్రమార్క కథనే 8 ఆశ్వాసాల ప్రబంధంగా జక్కన తీర్చిదిద్దాడు.

జక్కనది పటిష్ఠమైన కవి వంశం. తన తాత పెద్దయామాత్యుడు ప్రబంధ రచనలోనే కాక బహుభాషావేత్తయై అవధానాది విద్యలలో ఆరితేరి క్లిష్టమైన శబ్ద చిత్ర ఖేలనాలలో ప్రసిద్ధుడైనాడని 12 పాదాల సీసపద్యం వ్రాసి జక్కన తనివితీరా ప్రశంసించాడు. దీనివల్ల 19 శతాబ్దంలో ప్రఖ్యాతి పొందిన అవధానాదులు, చిత్రకవితా క్రీడలు, 15 శతాబ్ది పూర్వం నుంచీ తెలుగులో నెలకొని ఉన్నా - వాటిని విద్వత్ పేరిట భుజబల ప్రదర్శనానికి మాత్రం ఉపయోగించేవారుగాని - రసవత్కవితకు దూరంగానే ఉంచేవారని ఊహించవచ్చు. ఎందుచేతనంటే - తాతను ఇంత గొప్పగా ప్రస్తుతించిన జక్కనయే అట్లాంటి వాటిని తన కవిత్వంలోకి చొరనీయలేదు.

తండ్రి అన్నయ అతడూ మంచికవి—

"ఆడడు మయూర రేఖను,
గాడం బాణుండు బాణగతి మనమెటియన్,
బ్రోడగు పెద్దయ యన్నయ,
మాడకు మాడెత్తు యతని మాటలు జగతిన్" ౧-21

ఇందులో ఒక చమత్కారం ఉంది నెమలిలా ఆడడు బాణంలా ఎవరి మనస్సుకీ గుచ్చుకోడు అతని మాటలు మాడకు మాడెత్తు అంత విలువైన వన్నమాట ఊరికే ఆటలాడితే ఒకరి మనస్సు నొప్పిస్తే, గొప్ప కవు లవుతారా? అనేది ఒకటి ప్రకృతార్థంగా వస్తూ ఉండగా మయూర కవిలా, బాణునిలా పాండిత్య ప్రకర్ష కోసం క్లిష్ట రచన చేయడనీ, అతనిది 'జనవినుత రస ప్రసంగ సంగ కవిత' అనీ - కృతిపతి ప్రశంసించినట్టు జక్కన అంటాడు.

దీనినిబట్టి కృతిపతి అభినందనం ఎట్లా ఉన్నా జక్కన అభిమతం రసవత్త ప్రసన్నశైలి మాధుర్యగుణం, కవితకు అవసరమని చెప్పినట్టయింది సరిగ్గా దానినే అతడు తన కవితకు లక్ష్యంగా ఉంచుకున్నట్టు అతని కవిత చదివితే నిర్ధారణ అవుతుంది

ఈ కవితా గుణం కృతిపతి సిద్ధన్నకు నచ్చి అంటాడు—

చక్కన నీ వైదుష్యము,
చక్కన నీ కావ్యరచనా చాతుర్యంబున్,
చక్కన నీ వాగ్వైఖరి,
చక్కన నీ వంశమహిమ జక్కన సుకవీ! ౧-23

జక్కన అభిజనం పాకనాడు అందు రెండుచోట్ల నెల్లూరును పెన్నను ప్రశంసించాడు ఉదయగిరి సంపన్నగిరి మెప్పించిన కవి ఆ ప్రాంత నివాసియై ఉండవచ్చునని చెప్పడం అసంగతం కాదు

అంతేకాక అతని తాత నెల్లూరి రాజు తిరుకాళ విభుని సత్కారం పొందినవాడు కూడా

విక్రమ చరిత్ర తీర్పు

సంస్కృత విక్రమార్క చరిత్ర రచయిత ఎవరో తెలియదు వినోద ప్రోదమైన విక్రమార్క కథలు తీసుకుని మధ్యమధ్య పూర్వకవుల సూక్తి

శ్లోకాలను పొందుపరుస్తూ బాలావబోధంగా నడిచింది ఆ రచన జక్కన కావ్యం దానికి తెనిగింపు కాదని ముందే అనుకున్నాం జక్కన తన రచన దేనికీ ఆంధ్రీకరణం అనలేదు అంటే తనకు నచ్చిన కథలు తీసుకుని రమ్యంగా మలచి రంగురంగుల హరివిల్లులా కూర్చాడు

సంస్కృతల విక్రమార్క చరిత్ర ప్రకారం - భర్తృహరికి విక్రముడు తమ్ముడు రాజు భర్తృహరి తన భార్య అనంగసేన దుశ్చర్యద్వారా విరక్తి చెంది విక్రమార్కుడికి రాజ్యమిచ్చి అడవికి వెళ్ళిపోతాడు

విక్రముడు సత్పరిపాలకుడై ప్రజాదరం పొందుతాడు ఒకసారి దేవేంద్రుడు రంభోర్వశీ నాట్య చాతుర్యాలలో ఏది మెరుగైనదో నిర్ణయించలేక విక్రమార్కుణ్ణి పిలిచి నిర్ణయించమంటాడు విక్రముడు ఊర్వశీ నాట్యం శాస్త్రీయమూ, శ్లాఘ్యమూ, అని పరిష్కరిస్తాడు

ఇంద్రుడు సంతోషించి 32 బొమ్మల సింహాసనం విక్రముడికి బహూకరిస్తాడు దానిమీద ఆసీనుడై విక్రమార్కుడు చిరకాలం పరిపాలించి శాలివాహనుడిచే నిహతుడై మరణిస్తాడు

ఆ సింహాసనాన్ని అన్యులు అధిష్ఠించరాదని మంత్రులు భూమిలో పాతివేస్తారు అది పరంపరగా కొన్నాళ్లకు భోజునకు లభిస్తుంది భోజమంత్రి, ప్రసంగవశాత్తు నందరాజ కుమారుని ససేమిరా కథ చెబుతాడు రాజగురువు శారదానందుని ప్రజ్ఞవల్ల రాజకుమారుని శాపకథ బయల్పడి ససేమిరా ప్రలాపం పోయి స్వస్థుడవుతాడు

ఆ సింహాసనం అధిష్ఠించాలని భోజుని కుతూహలం, సింహాసనంమీద ఉన్న ఒక్కొక్క బొమ్మ తలమీద కాలువేసి సింహాసనం ఎక్కాలి ఒకొక్కరోజు ఒకొక్కబొమ్మ విక్రమార్కుని లోకోత్తర గుణాలు నీకున్నాయా ? అని ప్రశ్నించి ఒకొక్కకథ చెప్పి అతడు మౌనం వహించగా నీవు అధిష్ఠించరాదని నిషేధిస్తుంది తుదకు బొమ్మలన్నీ అచ్చరలై భోజునకు వరాలిచ్చి ఎగిరి పోతాయి

రాజు ఆ సింహాసనంమీద పరమేశ్వరుణ్ణి ఉంచి పూజిస్తూ ఉంటాడు

పై కథలోని భర్తృహరి యొక్క విక్రమార్క సోదరప్రీతి అనంగసేన దుర్గుణం భర్తృహరి విరక్తి, భట్టి మంత్రిత్వం, ఇంద్రునివల్ల ద్వాత్రింశ

త్సాలభంజికా సింహాసన ప్రాప్తి ససేమిరా కథ, ద్వితీయోపాఖ్యానంలోని బ్రాహ్మణకథ వంటివి కొన్ని జక్కన విక్రమార్క చరిత్రలోనూ ఇంచించుక మార్పులతో ప్రవేశించాయి అందులోని ప్రాస్తావిక శ్లోకాంను, ససేమిరా శ్లోకాలను యథాతథంగా తెనిగించనూ తెనిగించాడు

అయితే అట్టి అనుబంధం మొత్తం ప్రబంధంమీద తక్కువే కనుక తన రచనను దానికి ఆంధ్రీకరణంగా అంగీకరించలేదు అనే కథల సంపాదన, కూర్పు, కొత్తవే కనుక దీనిని స్వతంత్ర ప్రబంధంగానే ఎంచాడు

జక్కన ప్రబంధం ప్రకారం - చంద్రగుప్తుడనే బ్రాహ్మణ యువకుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రకులాల యువతులను పెండ్లాడగా వారికి వరసగా వరరుచి విక్రమార్కుడు, భట్టి భర్తృహరి అనే నలుగురు పుత్రులు పుట్టారు

వారు పెరిగి పెద్దవారుకాగా చంద్రగుప్తుడు తన సంపదను వారికిచ్చి భార్యలతోకూడా మోక్షకాంక్షతో శ్రీశైల క్షేత్రానికి వెళ్ళిపోయాడు

తండ్రి ఆశీస్సు ప్రకారం దిగ్విజయంచేసి విక్రమార్కుడు రాజయ్యాడు భట్టి మంత్రి తండ్రి ఇచ్చిన సంపత్తితో భర్తృహరి మంచి గృహస్థు అయ్యాడు వరరుచి విద్యావంతుడై వంశకర్తగా రూపొందాడు

విక్రమార్కుని అదృష్టరేఖ పనిచెయ్యడం ప్రారంభించింది

దిగ్విజయ యాత్రలో వింధ్యపర్వతం మీదఉన్న వింధ్య వాసినికి మ్రొక్కి విక్రముడు బయటికి రాగానే ఇద్దరు రాక్షసులు నాలుగు వస్తువుల కోసం ఘోరయుద్ధం చేస్తున్నారు ఆ వస్తువులు మహామహిమ కలవి 1 పట్టు బొంత దాన్ని దులిపితే వేలు లక్షలు బంగారు నాణాలు రాల్తాయి 2 ఒక దండం దానితో ఎక్కడగీస్తే అక్కడ పట్టణం పుడుతుంది 3 పాదుకలు అవి ఎక్కితే ఏ లోకానికి కావలిస్తే అక్కడికి వెళ్ళవచ్చు 4 రత్నపాత్రిక కోరితే దీనిలో దివ్యాన్నాలు పుడతాయి

ఆ రాక్షసులను వంచించి విక్రముడు వాటిని అవలీలగా సంగ్రహించి పాదుకలు తొడుక్కుని ఆకాశానికి ఎగిరిపోతాడు

మేరు పర్వతం దగ్గర దిగి, రత్నపాత్ర ఇచ్చిన ఆహారం భుజించి పర్వత దక్షిణ ప్రాంతంలో దండంతో రేఖలుగీచి చంద్రపురం నిర్మించాడు

కొంత విదిలించి పదికోట్ల మాడలు రాల్చి దానధర్మాలు చెయ్యడం మొదలు పెట్టాడు

చంద్రపుర రాజ్యం చేస్తూ పాదుకల సాహాయ్యంతో బ్రహ్మలోకం వెళ్ళి విరించికి నమస్కరించి కత్తితో తన నుదురు చీరుకొని - ఇక్కడ వ్రాసిన నీ వ్రాతవల్ల నా కాంతులు తిరగతాయా? లేక కొత్తవ్రాత వ్రాస్తావా? అని అడిగితే బ్రహ్మదేవుడు సంతోషించి అతని వదాన్యతను సాహసికత్వాన్ని, విక్రమాన్ని ప్రశంసించి బ్రహ్మాస్త్రమిచ్చి పంపాడు

ఉజ్జయిని దగ్గర మహాకాళికాలయ ప్రాంతంలో సరస్తీరంలో ఒక మర్రి చెట్టుంది దాన్ని పట్టుకొని ఒక ఉట్టి వ్రేలాడుతూ ఉంటుంది దానిమీద ఎక్కి ఎవడు ఒక్కసారిగా ఉట్టి నాలుగు పేరులూ కోసి కింది సరస్సులోని శూలంమీద దూకుతాడో వాడు ఉజ్జయినీ సామ్రాజ్య రాజవుతాడని ఒక శిలాఫలకం మీద ఉంది ఈ సంగతి విక్రముడు విన్నాడు భట్టిని చంద్రపురానికి పాలకునిగా ఉంచి ఆ వింత చూడడానికి వెళ్ళి కాళికి మ్రొక్కి చెట్టెక్కి ఒక్కసారిగా ఉట్టి నాలుగు తాళ్ళూ కోసి శూలంమీద పడడానికి సర్ధంగా ఉండగా కాళి పడకుండా అనుగ్రహించి "నీకు వెయ్యేళ్ళు ఉజ్జయిని పాలించే వరం ఇస్తున్నాను నీవు ఆదినారాయణాంశంతో పుట్టావు భట్టిది బ్రహ్మాంశ మీరిద్దరూ కలసి ఈ భూపరిపాలనం చేయండి" అని ఆనతిచ్చింది విక్రముడు ఆ వరం పొంది ఆ ప్రాంతంలో తిరుగుతూ ఉండగా - ఉజ్జయినిని పరిపాలించే రాజు మరణించడం, పట్టపుటేనుగువచ్చి ఇతని మెడలో ముత్యాలహారం వేయడం, దానితో విక్రముడు ఉజ్జయినీ రాజవడం క్రమంగా జరుగుతాయి తదుపరి విక్రముడు ఉజ్జయినీ రాజుగా స్థిరపడి రాజ్యపాలనం సాగిస్తాడు

భట్టి మాటలలో విక్రమార్కుని లోకోత్తర చరిత్ర సంగ్రహం ఇది

"ఏ రాజునకుఁ జెల్లు నెంతయు నరుదైన
మణిపాదుకాదులు మహిమఁ గొనఁగ
నేరాజునకుఁ జెల్లునింద్రుని మెప్పించి
నవరత్న సింహాసనంబు పడయ
నే రాజునకుఁ జెల్లు నీరజాసను సభ
బ్రహ్మాస్త్రలాభ సంపద వహింప

నే రాజునకుఁ జెల్లు నితర దుర్లభమైన
యట్టి బేరులు గోయు దిట్టతనము
దేవ పతియైన శ్రీమహాదేవు దేవి
కాళికాదేవి యేరాజు కడిమి మెచ్చి
లీల నుజ్జని వేయేడు లేల నిచ్చె
ననుచు నినునెల్ల దేవం యభినుతించు" ఆ-44

విక్రమ ప్రబంధంలోని అన్ని కథలూ చదువ దగ్గవే అయినా - మూడు కథలు మరీ ఆసక్తికరంగా చదివిస్తాయి

అందులో ఒకటి కనక స్తంభ కథ

పాపనాశనమనే తీర్థంలో సూర్యోదయంతో, పైని మణిపీఠం కలిగిన కనకస్తంభం ఒకటి నీటిపైకి తేలుతుంది అది క్రమంగా ఆకాశంపైకి ఎదిగి సూర్యునితాకి మళ్లా సూర్యాస్తమయానికి నీటిలోకి దిగిపోతుంది విక్రముడు ఆ బంగరు స్తంభ పీఠంమీద కూర్చుని సూర్యుని సమీపించి ఆ తీవ్రతాపానికి సహించి నిలచాడు దానికి సంతసించి సూర్యుడు రెండు రత్నకుండలాలు బహుకరించి ఇవి రోజుకు రెండు బారువుల బంగారం ఇస్తాయని చెప్పాడు

విక్రముడు వాటిని స్వీకరించి వస్తూ - ఉజ్జయిని ప్రాంతంలో కనిపించి ఆశీర్వదించిన ఒక వృద్ధ బ్రాహ్మణునకు నిశ్చింతగా దానం చేస్తాడు ఇది అతని దాతృత్వానికి చిహ్నం

రెండవది విదర్భరాజ పుత్రిక అనంగవతిని పెండ్లాడిన కథ

ఈ కథ ఒక నిండు ప్రబంధంలా నడచింది విక్రముడు విదర్భరాజు కుమార్తె అనంగవతిని ప్రేమించాడు ఆ అనంగవతిని తన కిమ్మని సిద్ధపురరాజు వైదర్భుని మీద దండెత్తితే - విక్రముడు మంత్రి భట్టితో చతురంగబల సమేతుడై వెళ్ళి సిద్ధపురరాజును జయించి అనంగవతిని శాస్త్రీయంగా స్వీకరించి ఇష్టోపభోగాలు పొందుతాడు దీన్ని ఒక ఉపాఖ్యానంవలెకాక అనంగవతి అనురాగం నుంచి సిద్ధరాజుతో జరిగిన యుద్ధంతో కూడా వివాహ వర్ణనాదులను జక్కన సాంగోపాంగంగా చిత్రించి తన చాతుర్యం వెల్లడించాడు అయితే ఇక్కడ ఒక చారిత్రకాంశం స్ఫురణకు వస్తుంది

ఈ సిద్ధపురీశునికి విదేహరాజు, శకరాజు, శాలివాహనుడు అనే పేర్లు ఈ కథలో కనబడతాయి. క్రీ పూ 1 శ లో చరిత్ర ప్రసిద్ధుడైన విక్రమార్కునకు శకారాతి అనే పేరుంది ఆ శకుడు అభారతీయుడు శాలివాహనుడు సంస్కృత విక్రమార్క చరిత్రననుబట్టి - రెండున్నర ఏండ్ల బ్రాహ్మణ బాలికకు పుట్టిన అపూర్వ వ్యక్తి ఇందులో విక్రముడు శకనామక రాజును జయించి నట్లున్నా శాలివాహనుణ్ణి జయించలేదు అతని మీద దండెత్తి అతనిచే వధింప బడ్డాడు ఏవో దంత కథల్లో విన్న పేర్లు ఈ కథతో ముడిపడ్డాయిగాని ఇందులో చరిత్ర సత్యం లేదు

జక్కన ఈ ఉపాఖ్యానంలో చేసిన రాజనీతి ప్రస్తావం, అనంగవతీ సౌందర్య వర్ణనం, విక్రముని యుద్ధ వర్ణనం, వివాహ సమాగమాదులు, కవి సమధిక లోకజ్ఞతను వెల్లడిస్తాయి ఈ కథవల్ల విక్రముని అవక్రపరాక్రమం తెలుస్తుంది

మూడవది కళావతి అనే పాతాళరాజ పుత్రిక కథ

ఈమె విక్రముణ్ణి తన మందిరానికి తెచ్చి మౌనవ్రతంలో ఉంటుంది ఈ వ్రతభంగంచేసి మూడు సారులు మాట్లాడిస్తే పెండ్లాడుతుంది విక్రముడు సదానందుడనే సిద్ధుడు తన కుపదేశించిన విద్యవల్ల ఒకసారి దీప స్తంభం చేతను రెండవసారి కర్పూర కరండం చేతను, మూడవసారి సువర్ణ కలశంచేతను వింత కథలు చెప్పించి కళావతి మౌనభంగంచేసి ఆమె అనురాగానికి పాత్రుడవుతాడు

మూడవ కథలో వచ్చిన ముగ్గురక్కచెల్లెళ్ల కథ ముందు నీతి బాహ్యంగా తోస్తుంది లౌకికంగా చూస్తే అట్లా అనిపించినా - కళాపరంగా ఆ ప్రశ్న రాదు కళకు ప్రధానమైనది నీతి చెప్పడం కాదు రస చమత్కృతులు ప్రధానం ఆ దృష్ట్యా ఈ కథలో చక్కని రసచిత్రణం అక్క చెల్లెండ్ర అతి బుద్ధి కౌశల్యం చమత్కార జనకమైనవి కావ్యదృష్ట్యా ఇవి పరిహరణీయాలు కావు అట్లాగే చూస్తే మన తారాశశాంక విజయం, విప్రనారాయణ చరిత్ర కావ్యాలే కాకుండా పోతాయి గాథాసప్తశతిలోని రసధ్వని అనీతి కావలసి వస్తుంది

పై కథవల్ల విక్రమార్కుని విద్యా ప్రభావం వెల్లడవుతుంది

కవితా వైఖరి

ఈ కవికి స్పష్టమైన కవితావగాహనం ఉంది

"ప్రతి పద్యము చోద్యముగాఁ
గృతి చెప్పిన నొప్పుగాక కృతి నొక పద్యం
బతి మూఢుడైన జిత్రత
బ్రతి పాదింపఁడె ఘుణాక్షర న్యాయమునన్" ౧-17

కావ్యం వ్రాస్తూన్నప్పుడు ఎక్కడో ఒక పద్యం చమత్కారంగా ఉంటే చాలదు ప్రతి పద్యంలోనూ ఏదో ఒక చమత్కృతి ఉంటేనే ఆ కవికి రాణింపు అంతేకాక ఇతడు కవిత్వం విషయంలో 'నవ' అనే మాటను కనీసం పది సార్లైనా వాడి ఉంటాడు ఈ 'నవ' ఇతనికి ఊతపదం కాదు ఆలోచించి సార్థకంగానే అన్నట్టు కనపడుతుంది ఎవరు వాడినా అవే శబ్దాలూ అవే అర్థాలు అయినప్పుడు కొత్తతనం ఎక్కడ నుండి వస్తుంది? అంటే ఒకొక్క కవి హస్తకౌశలంవల్ల, కూర్పు నేర్పువల్ల నవ్యతాదర్శనం కలుగుతుంది లేకపోతే ఇందరు కవులు ఇన్ని కావ్యాలు వ్రాసి ఎలా ఆకర్షించ గలుగుతున్నారు?

ఇతని వింత కథల ఎంపికలో - వాక్చమత్కృతిలో, రచన విన్యాసంలో, వర్ణనా వైవిధ్యంలో ఈ నవత్వం సాధించాడు

కాశీ పట్టణాన్ని వర్ణిస్తూన్న ఒక పద్యం ఇతని చమత్కారానికి పరమావధి

'కాశిలో ఒకపులి ఆకలిగొని లేడిని చంపి తిన్నది ఆకలి తీరలేదు ఒక ఎద్దుతో పోరాడింది పరస్పరం చంపుకొన్నాయి అంతతో ఆగలేదు కథ——

లేడి మళ్లా సజీవమై ఒక లేడిని ధరించింది పులి పులితోలు కప్పుకుంది ఎద్దు వేరొక్క ఎద్దు నెక్కింది ద్వి 91 ఏమి చమత్కారం!

కాశిలో మరణించిన అన్నింటికీ శివ స్వరూపం వచ్చిందని అర్థం ఈ సందర్భంలోనే 'కాశిలో మేను దొరగిన ఘనయశుండు - రూపు మొక్కటి రెండు రూపులై చెలువొందు, మూడు మొనల పోటుముట్టు బట్టు' అనే సీస పద్యంలో 12 అంకెలవరకు శివ స్వరూపంతో చేసిన చమత్కారం దర్శనీయం

కథలో వచ్చిన శృంగార నాయికల వర్ణనలో చేసిన సొగసు చేయకుండా ఒక పద్యాన్ని వేరొకటి పోకుండా చేసిన వర్ణనలు ప్రశంసార్హములైనవి స్త్రీ పురుషుల కలయికలోని అనుభూతి వర్ణన ప్రత్యేకత రతిస్థాయికి దిగకుండా గంభీరంగా ఔచిత్యపూర్ణంగా ఉండడం ఎన్నదగిన సుగుణం

ఇంకా ద్వితీయాశ్వాసంలోని వృద్ధ బ్రాహ్మణ వర్ణనం నాలుగో ఆశ్వాసంలోని ఋతువర్ణనం ఆంధ్ర భోజన వర్ణనం, ఏడవ ఆశ్వాసంలోని నెల్లూరు పెన్నానదీ వర్ణనలు చవులూరించేవి

విక్రమార్కుని జన్మ సందర్భంలోను, విరూపాక్షు దైవవర్ణనంలోను ఇతని సంస్కృత భాషా ప్రవేశం గణనీయమైనది విరూపాక్షుని స్తుతిలో 'భజత, సమత, స్మరత' అనే పదాలతో ప్రారంభించి వ్రాసిన మూడు శ్లోకాలూ ఇతని సంస్కృత రచనా శక్తికి ప్రసన్నశయ్యకు నిదర్శనాలు

విక్రమార్క చరిత్రలోని కథన కవితా సౌందర్యాలే కాక మరికొన్ని చూడదగిన ముఖ్యాంశాలున్నాయి

నారదుడు చెప్పిన రాజనీతి విశేషాలు, వైశ్యులు చెప్పిన ధన ప్రభావం పురందరుడు వైశ్యులకు చెప్పిన దాన మహిమ, ఇతరత్రా ప్రసక్తమైన పాతివ్రత్య మహాత్మ్యం మొదలైనవి కవి లోకజ్ఞతను వెల్లడిస్తాయి

ఇందులోని ఒంకాళ ఖండకుని కథ, బకాసురుని కథనూ కామమంజరి యుద్ధం సత్యభామా నరకాసుర యుద్ధ ఘట్టాన్ని జ్ఞాపకంచేస్తూ రమ్యంగా నడిచాయి

లోకోక్తులను, సామెతలను వాడడంలో కూడా ఇతడు తన లోకానుభవాన్ని చాటిచెప్పాడు

'తెడ్డునాకి యుపవాసము మాన్పికొనంగ నేటికిన్'

'గుడి మ్రింగువానికి నంది పిండివడియము'

'పులి మీసముల నుయ్యేల లూగవచ్చునే'

'వంకలొత్తు తిలకంబులె రాజుల చిత్తవృత్తముల్'

'కామాంధోహి నపశ్యతి'

ఈ కవి ప్రభావం తర్వాత వేరుపడ్డ తెలుగు కవులు పెద్దన, తిమ్మన, చేమకూర వంటి కవుల మీద పడడం ఈతని విశిష్టతకు తిరుగులేని ఉదాహరణంగా పేర్కొనవచ్చు

జక్కన రచనలోని శ్రీనాథ కవి పోలికలు చూచి ఇతనినే శ్రీనాథుడు అనుకరించాడని కొందరు విమర్శకులు భావించారు ఇందలి 6 ఆశ్వాసం 69 పద్యంలోని వెన్నెల వర్ణన భీమ ఖండం ద్వి 35 పద్యంలోని సూర్యాస్తమయ వర్ణనకు మూలమేమో అనిపించడం, 8 ఆశ్వాసం 5 పద్యంలోని 'శివుని కనుబాటుదాకిని చిత్తభవుడా' అనే మాట ఆధారంగానే నైషధంలోని 'కాలకంఠ శరీరి కంఠరహుంకారంబు చెవుల సోకని నాటి చిత్తభవుడు' అనే పద్యం వచ్చి ఉంటుదని ఊహించడం, ఇంకా మరికొన్ని భావాలు శ్రీనాథ రచనలలో కనబడుతూ ఉండడం వారి ఊహకు ఆధారాలు ఇద్దరు సమకాలికులు కావడంవల్ల ఎవరిని ఎవరు అనుకరించారో చెప్పడం అంత సుకరం కాదు కాని మరికొంత లోతుకు దిగి విచారణచేస్తే శ్రీనాథుకు ముందు వాడని, జక్కన తర్వాతి వాడని తెలుస్తుంది జక్కన నవనాథుల ప్రసక్తి తెచ్చి సదానందుడనే యోగినాథుడు విక్రమునికి ఒక విద్య ఉపదేశించాడని చెప్పాడు ఈ నవనాథ చరిత్ర గౌరన రచనవల్ల ప్రసిద్ధికి వచ్చింది కనుక గౌరన తర్వాతనే జక్కన విక్రమ రచన అని ఊహించవచ్చు గౌరన హరిశ్చంద్రోపాఖ్యానంలో శ్రీనాథుని భావానుకరణలు, ఆయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తాయి కనుక శ్రీనాథుణ్ణే జక్కన ఆయన యందలి ఆత్మీయతా భావంకొద్దీ అనుసరించి ఉంటాడని తోస్తుంది ఇంకొక కారణం కూడా ఉంది శ్రీనాథునికి పోతన తర్వాతి వాడని స్పష్టంగాదా పోతన అంత్యాను ప్రాసలను అతివేలంగా అనుసరించినవాడు - ముందు జక్కన, తర్వాత చాలమంది శ్రీనాథునిలో ఈ అంత్యానుప్రాసల అత్యాసక్తి కనపడదు కనుక జక్కన రచన పోతన తర్వాత అనికూడా అనిపించవచ్చు అంతేకాక జక్కనలో శ్రీనాథుని గాఢ పాకంగాని వక్రోక్తి బాహుళ్యంగాని కనపడదు శ్రీనాథుని అనన్య సాధారణ ప్రతిభ జక్కనలో మృగ్యం జక్కన శైలి ప్రసన్న మధురం సంస్కృత ప్రాబల్యం వర్ణన ప్రసక్తిలోనేగాని తక్కిన చోట జాను తెనుగు మాటలతోనే తాను చెప్పగలచినది సూటిగా చెబుతాడు అది ఒక విలక్షణమైన కథన శైలి ఇందువల్ల కూడ శ్రీనాథుడు జక్కనను అనుసరించాడనుకోడానికి వీలు లేదు

మొత్తంమీద జక్కన వైదుష్యం, కావ్య రచనా చాతుర్యం, వాగ్వైఖరి 'చక్కన' అని కృతిపతి సిద్ధన మంత్రి చేసిన ప్రశంస అతిశయోక్తి కాదు ప్రతిపద్యం చోద్యంగా చెప్పకపోతే అది కృతి ఏమిటి? అనే అతని ఆత్మ విశ్వాసం చాలవరకు విక్రమార్క చరిత్రలో సఫలమై ఆంధ్ర కవి శ్రేణిలో అతన్ని అగ్రస్థానంలో ఉంచిందని నిస్సంశయంగా చెప్పవచ్చు

మరికొన్ని కథా కావ్యాలు

లోకంలో వినుకలిలో ఉన్నవీ చాలవరకు కాలక్షేపానికి చెప్పుకొనేవీ, అయిన కథలకు జక్కనకు పూర్వం కావ్య రూపమిచ్చినవారు లేరు అట్టి కథలకు కావ్య గౌరవం ఇవ్వడం జక్కనతో ప్రారంభమయితే దానిని ఒక కళగా, పఠనయోగ్యంగా చేసి కొనసాగించినవారు అనంతామాత్యుడు కొలని గోపరాజు దూబగుంట నారాయణ కవి బైచరాజు వెంకటనాథుడు, పాలవేకరి కదిరీపతి ఇత్యాదులు

వీటిలో ముఖ్యంగా చెప్పదగ్గది అనంతుని భోజరాజీయం ఇందులోని గోవ్యాఘ్ర సంవాదం - మిక్కిలి ప్రసిద్ధమైనది ఇట్టిదే అందలి మదన రేఖ కథ మాతృ వాత్సల్యం పరమావధిగా - సత్యపాలనం సందేశంగా పుట్టిన గోవుకథ మదనరేఖ అనే రాజపుత్రిక తన పొందుకోరిన గురుపుత్రుణ్ణి వివాహానంతరం తృప్తి పరుస్తానని చెప్పి, పెండ్లి చేసుకుని భర్తకు నచ్చచెప్పి, వెడుతూ ఉండగా త్రోవలో అడ్డగించిన రాక్షసునితో గురుపుత్రుని తృప్తిపరచి తప్పక వస్తానని శపథం చేసి వెడుతుంది గురుపుత్రుడు తప్పు తెలుసుకుని ఆమెను సగౌరవంగా పంపివేస్తాడు రాక్షసుడున్ను ఆమె మాట తప్పనితనానికి సంతోషించి విడిచి పుచ్చుతాడు ఆమె నిజాయితీకి భర్త పరితుష్టు డవుతాడు ఆత్మత్యాగం, సత్యం అనే గొప్ప ధర్మానికి అద్దం ఈ రెండు కథలు

గోపరాజు మున్నగువారికి సంస్కృత మూలకథలున్నా వాటిని నిమిత్త మాత్రంగా ఉంచుకుని వారు స్వచాతుర్యంతో నిర్వహించి మంచి కథా కావ్య రచయిత లనిపించుకున్నారు

కదిరీపతి కథలు స్థూలంగా అవినీతి జాతివి అనిపించినా తుదకవి నీతి పర్యవసన్నాలవడం విశేషం

శృంగార శాకుంతలం

జైమినీ భారతం - పిల్లలమర్రి పిన వీరన

'తాజ్‌మహల్‌ను పడగొట్టి మళ్లా కట్టవచ్చునుగాని అభిజ్ఞాన శాకుంతలం వ్రాసేవాడు మళ్లా పుట్టడు' అన్నాడొక తత్త్వవేత్త, విమర్శకుడు.

అట్టి ఉదాత్తమైన రచనను మన భాషలోకి తెచ్చుకోవాలని తెలుగువారు కోరుకోవటంలో ఆశ్చర్యం లేదు.

అట్టి మహోన్నత నాటకాన్ని తెలుగులోకి తెచ్చుకోవాలనే ప్రయత్నం క్రీ.శ. 15 శతాబ్దం దాకా జరగలేదు. ఆ ప్రయత్నానికి పూనుకున్నవాడు పిన వీరభద్రుడు. అయితే ఆయన ఆ నాటక రచనా సౌందర్యానికి ఎంత ముగ్ధుడైనా శాకుంతలాన్ని యథాతథంగా తెలుగు భాషలోకి తేవడానికి వీలులేకపోయింది.

తనకు ముందున్న ఏ ఆంధ్ర కవీ ఏ సంస్కృత నాటకాన్ని తెలుగులోకి తెచ్చే నిర్దిష్టమైన బాట ఏదీ వేయనందువల్ల - తాను నాటక రూపంలో ఆంధ్రీకరించడానికి సాహసించలేక ప్రబంధ మార్గంలోనే దాని అందాన్ని కొంతవరకు చూపించడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో శాకుంతలాన్ని పూర్తిగా అనుసరిస్తే అది కొంత మేలయ్యేది. అట్లా చెయ్యక - కాళిదాసు శాకుంతలాన్ని 4 అంకాల వరకు అనుసరించి తర్వాత భారత కథను స్వీకరించి కథను సాదాగానే ముగించాడు. దీనికి కృతిపతి కోరికను జోడించాడు.

> 'కథ ప్రసిద్ధయు మిగుల శృంగారవతియుఁ
> బరిగణింపంగ శ్రీమహాభారతమునఁ
> గథితమైన శకుంతలాఖ్యాన భంగి
> నది ప్రబంధంబుఁ జేయు ప్రఖ్యాతి నొంద' 1-25.

కృతిపతి అభిలషితం ఎట్లా ఉన్నా ఈ కథకం ఈయనకు నచ్చినదని మనం అనుకోవచ్చు.

సంస్కృత పురాణేతిహాసాదులవలెనే నాటక వాఙ్మయాన్ని కూడా లక్షణంగా ఆంధ్రీకరించవచ్చుగదా ! ఆ పని ఎందుకు జరగలేదు ? అనే ప్రశ్నకు విమర్శకులు పలువిధాల సమాధానాలు ఊహించారు

ఒక ప్రముఖ విమర్శకుడు ఇట్లా అంటాడు :-[1]

తెలుగులో దేశీయమైన యక్షగానాది రూపక ప్రదర్శనలు ఉండనే ఉన్నాయి. వాటికి ఒక పందిరివేసి తెరకట్టి ప్రదర్శిస్తే సరిపోతుంది. సంస్కృత నాటక ప్రదర్శనాలకు ఆ రంగస్థలం సంకుచితమై అనువుగా ఉండదు. దానికి శాస్త్రీయమైన నాటక శాలలుండాలి. అవి పట్టణాలలో ఏ ప్రభువులో కట్టించినా అట్టివి గ్రామాల్లో ఏర్పడే అవకాశం లేదు. అప్పుడు తెలుగులోకి వచ్చిన సంస్కృత నాటకాలు ప్రయోజనాలయి పోతాయి. నాటకం, ప్రదర్శన ప్రయోజకంగాని చదువుకోడానికి మాత్రమే కాదుగదా ! అందువల్ల ప్రదర్శనానుకూల్యం లేక పోవడంవల్ల తెలుగుకవు లెవరూ వాటిని ముట్టలేదు

ఇది వినడానికి బాగానే ఉన్నా ఈ ఊహలో బలంలేదు. నిజంగా మహారాజులకు గాని, ఆంధ్ర సంపన్న గృహస్థులకుగాని – నాటకాలమీద అభిమానమే ఉంటే – నాటకశాలలు మృగ్య మవుతాయా ? ఎవరి తాహతుకు తగినట్టు వారు స్వ స్థలాలలో నాటక శాలలు నిర్మించక పోయేవారా ?

19 వ శతాబ్దిలో ఏ మహారాష్ట్రులో ప్రదర్శించిన రంగస్థల నాటకాలు చూచి మోజుపడి తెలుగుదేశంలో ఊరూరా ఎన్ని నాటకశాలలు వెలయలేదు ? ఎన్ని అనువాద నాటకాలు, స్వతంత్ర నాటకాలు పుట్టలేదు ? కనుక తగిన నాటకశాలలు లేక పూర్వాంధ్ర సాహిత్యంలో నాటకాలు పుట్టలేదనడం సరియైన మాటకాదు.

అసలు కారణం ఒకటి తోస్తుంది :-

పూర్వాంధ్ర కవులు పురాణేతిహాసాలను తెలిగించడానికి నిర్దిష్టమైన ఒక కావ్యభాషను రూపొందించుకున్నారు. దానిలోనే గద్య పద్యాలను వ్రాశారు. అక్కడ ఒకే భాష అనుకూల మయింది. నాటకంలో అది

1. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, శ్రీ పింగళి.

కువరదు పాత్రౌచిత్యంకోసం సంస్కృతంలో రెండు భాష లుంటాయి ఒకటి సంస్కృతం, రెండు ప్రాకృతం

ఉత్తమ పాత్రలకు సంస్కృతమనీ, నీచపాత్రలకు ప్రాకృతమనీ నిర్ణయం తెలుగులో ఉత్తమ పాత్రలకు కావ్యభాష వాడవచ్చు మరి తక్కువ తరగతి పాత్రలకు? తగినభాష తమ దగ్గరలేదు ఆనాటి వాడుక భాషలో శాసనాలూ కైఫీయతులూ, రాజకీయ పత్రాలూ, వ్రాయడమేగాని దాన్ని కావ్యాల్లో ప్రవేశపెట్టే ఆచారం లేదు దానికొక నిర్దిష్ట రూపంలేదు ఛాందసుల భాష వేరు సంస్కారుల భాషవేరు, రాజకీయాల భాషవేరు ఇందులో దేనిని ప్రాకృతానికి బదులుగా తీసుకొని వాడడం? ఇది పెద్ద సమస్య అయింది

పోనీ అన్నింటికీ కావ్యభాషే వాడకూడదా? అంటే నాటకానికి ప్రాణ భూతమైన పాత్ర ఔచిత్యం దెబ్బతింటుంది దానివల్ల రస పోషణానికి విఘాతం ఏర్పడవచ్చు ఈ అడ్డంకివల్ల పూర్వకవులెవ్వరూ నాటకాల జోలికి పోక కావ్యరూపంలోనే కావ్యభాషతోనే తమ రచనలు సాగించారు

ఆధునిక ఆంధ్ర నాటక కర్తలు ఈ ఔచిత్యం విస్మరించి సంస్కృత నాటకాలను ఆంధ్రీకరించడం ప్రారంభించారు ఉత్తమాధమ పాత్రభేదం లేక అన్నింటికీ కావ్యభాషే ఉపయోగించారు అదే ఆచారమై స్వతంత్ర నాటకాలూ అదే బాణీలో పుట్టుకు వచ్చాయి దీనికి వ్యతిరేకంగా వేదం వారు ప్రతాపరుద్రీయంలో వ్యావహారికం, పామరభాష పాత్రౌచిత్యానికి ప్రయోగిస్తే - పండితు లాక్షేపించారు అప్పుడు ఆయన సంస్కృత నాటకాల్లో ప్రాకృతం వంటిది మన వ్యావహారభాష కనుక పాత్రౌచిత్యం కోసం దీన్ని తప్పక వాడవచ్చు వ్యాకరణం కోసం చూడనక్కరలేదు భరత మహర్షి ప్రాకృత భాషకు సంస్కారం లేదు, అయినా పాత్రౌచితినిబట్టి దానిని వాడవచ్చునన్నాడు ఆ భరతర్షి వచనాన్నిబట్టి నేను రెండు భాషలను ఉపయోగించాను' అని సమర్థించుకో వలసి వచ్చింది

కనుక ఆనాడు తెలుగులో సంస్కృత నాటకాలు రాకపోవడానికి కారణం ప్రాకృత ప్రయోగం అడ్డమయింది గాని ఇంకేదీ కారణం కాదు

అందువల్ల పిన వీరన ఎంత మోజుపడినా అభిజ్ఞాన శాకుంతలాన్ని ఉన్నదున్నట్టు అనువదించడానికి వీలులేక ప్రబంధ మార్గం అవలంబించి

కావ్యంగా వ్రాయవలసి వచ్చింది. ఈ కారణంవల్లనే మల్లయ, సింగయ కవులు కూడా, ప్రబోధ చంద్రోదయ నాటకాన్ని ప్రబంధంగానే తెలిగించవలసి వచ్చింది. అయితే వారు సంస్కృత నాటకాన్ని సాధ్యమైనంత సన్నిహితంగా ప్రబంధీకరించారు. పిన వీరన కవి అట్లాకాక - సగం నాటకాన్ని సగం భారతాన్ని అనుసరించి శృంగార శాకుంతల రచన సాగించాడు.

నిజానికి - కవి దీనికి ఏ పేరు పెట్టాడో స్పష్టంగా తెలియదు కాని - ఆశ్వాసాంత గద్యంలో 'శాకుంతలం బనెడు శృంగార కావ్యంబున' అని ఉండడం చేత వ్యవహారంలో దీనికి శృంగార శాకుంతలం అనే పేరు రూఢి అయింది.

హర్షుని నైషధాన్ని తెనిగిస్తూ శ్రీనాథుడు శృంగార నైషధం అన్నట్టు, పిన వీరన కూడా ఈ కావ్యాన్ని శృంగారోపపాదంతో వ్యవహరించడానికి సుముఖుడని తోస్తుంది. ఎందుకంటే శ్రీనాథుని ప్రభావం ఆ యుగకవులందరి మీదనుకంటే పిన వీరన మీద అధికాధికంగా ఉన్నట్టు కావ్యమంతటా కనబడుతుంది. అంతే ఆయన శృంగార శబ్దప్రీతి కూడా ఈయనను లోబరచుకుంది.

శృంగార శాకుంతలం నాలుగాశ్వాసాల ప్రబంధం. తన శృంగార చిత్రణానికి అనువైన శకుంతలాదర్శనం, పరస్పర ప్రీతి, అనురాగ వృద్ధి, గాంధర్వ వివాహం, అంగుళీయక ప్రదానం, సమాగమం, దుష్యంతుని గమనం, దుర్వాసశ్శాపం, అనే అంశాలు నాటకం నుంచి తీసుకుని తర్వాతి కుమారోత్పత్తి, హస్తినా ప్రయాణం, రాజసభ, రాజ విస్మృతి, ఆకాశవాణీ వచనం, పుత్రపత్నీ స్వీకరణం. మున్నగు అంశాలు భారతాన సారంగా గ్రహించి కావ్యం ముగించాడు.

కాళిదాస అభిజ్ఞాన శాకుంతలానికి కేంద్రబిందువు అభిజ్ఞానమయిన రాజముద్రిక. అది గుర్తుగా చూపితే ఆయన విధిగా శకుంతలను స్వీకరిస్తాడు. దాన్ని దురదృష్టవశాత్తు శకుంతల అప్సరతీర్థంలో పారవేసుకుంది. పూర్వస్మృతులవల్ల స్వీకరించడానికి దుర్వాసుని శాపం అడ్డమవుతుంది. కనుక దుష్యంతుని తప్పు ఏమీలేదు. అతడు రాజర్షి; ధర్మోత్తరుడు. పోనీ తనకు ప్రతిబింబంవంటి పుత్రుని చూచి పరిగ్రహించ వచ్చునన్నా - ఆమె గర్భవతి

మాత్రమే. ఇంకా ప్రసవించలేదు పురోహితు నింట ప్రసవిస్తే రాజలక్షణాలు బిడ్డలో చూచి. అప్పుడు పునర్విచారణ చేయవచ్చునని నిర్ణయించుకున్నాడు. ఇంత ధీరోదాత్తంగా తన నాయకుణ్ణి మలచాడు కాళిదాస మహాకవి.

పిన వీరన శాకుంతలానికి ప్రధాన కేంద్రం శృంగారం, అది శకుంతలా దుష్యంతుల అనురాగంతో, ప్రవృద్ధితో, విరహంతో, సంయోగంతో, పరిపూర్ణమయింది. తెలుగు కవులు భావించిన శృంగార సమృద్ధి సంపన్నం అయింది. ఇక కథ అవరోహణదశలో దుర్వాసః శాపంవల్ల మరచిపోవడం, ఆకాశవాణివల్ల జ్ఞాపకం రావడం, పశ్చాత్తాపం. స్వీకరణం. ఇత్యాదులు యథా సంభవంగా జరిగిపోయాయి.

ప్రబంధ సామగ్రిగా పనికివచ్చే పుర, రాజ, వర్ణనలు. ఆశ్రమం, సఖీజన సహకారంతో నాయికా నాయకుల అవలోకన, అనురాగ, విరహా, సమాగమాలు, కణ్వుని అంపకాలు, కావ్యపుష్టికి నాటకంలోనుంచి తీసుకుని తర్వాతి కథ త్వరగా ముగింపుకువచ్చే భారత కథను కవి సాభిప్రాయంగా పరిగ్రహించినట్టు తోస్తుంది.

ఈ పరివర్తనంవల్ల తన లక్ష్యమైన శృంగార సంపోషణం సిద్ధించినా - కాళిదాసు పోషించిన నాయకోదాత్తత భగ్నమయింది.

పిన వీరన కూడా దుర్వాసః శాపం స్వీకరించడంవల్ల 'రాజు శకుంతలా విస్మృతికి కారణం ఏర్పడింది నిజమే. కాని ఆ విస్మృతి అనసూయా ప్రియంవదల ప్రార్థనతో ఆకాశవాణి వచనంవల్ల తొలగిపోయింది. ఇక ఉంగరంవల్ల ప్రయోజనం లేదు. అలాంటప్పుడు ఆ సఖులిద్దరూ శకుంతల వేలి నుంచి ఉంగరం ఊడ్చి రాజుపై [illegible] సాధించిన ప్రయోజన యేమిటో తెలియదు.

వారు యువతులు : రాజభటు వారని పంపడంలోను. వారు చేసిన పరుష సంభాషణంలోను, కవి చూచిన ఔచిత్యం ఏమో బోధపడదు

సంస్కృత కవి ఇద్దరు శిష్యులను. ఒక వృద్ధ తపస్విని ఈ సందర్భంలో శకుంతల వెంట పంపడంలోని మెలకువను ఈ కవి గ్రహించలేదు.

ఇంకొక విషయంలో కూడా తెలుగు కవి కాళిదాస హృదయాన్ని దర్శించినట్టు కనపడదు

భారతంలో శకుంతల తన జన్మకథ తన నోటితో తానే చెబుతుంది కాళిదాసు ఆ శృంగార గాథను ముగ్ధ అయిన నాయికచేత చెప్పించడం అనుచితమని చెలి త్రైచేత అర్థోక్తిగా సూచించాడు

పిన వీరన ఆ శృంగార కథ ఒక యువతిచేత ఎందుకని కాబోలు ఒక శిష్యునిచే సాంగోపాంగంగా చెప్పించాడు అయితే – ముని కన్యచేత చెప్పించడం అనే అనౌచిత్యాన్ని తప్పించబోయి బ్రహ్మచారి శిష్యునిచేత చెప్పించి ఇంకొక అనౌచిత్యాన్ని ఆహ్వానించి నట్లయింది

తుదిని నారదునిచేత భరతకుమారునకు చేయించిన రాజనీతి బోధకూడా కావ్యదర్మాన్ని పెంచడం కన్న కవి రాజనీతి పరిజ్ఞానాన్ని ప్రపంచించడానికే ఎక్కువ తోడ్పడుతుంది

కథా పరంగా చూస్తే పిన వీరన అభిజ్ఞాన శాకుంతలపు అంతస్సును అందుకోలేకపోయినా కవితారీతిలో తెలుగులో ఏ ఉత్తమ కవి స్థాయికి తీసి పోకుండా న స్థానాన్ని ఆంధ్ర • వ్యంలో నిలబెట్టుకున్నాడనే చెప్పవచ్చు

నాటకంలో సూచనాప్రాయంగా ఉన్న కావ్య వర్ణ్యాలను ప్రబంధో చితంగా విస్తరించి మంచి భాషతో నుడికారపు సౌరుతో తీర్చిదిద్దాడు

క్రీ శ 15 శ॥ తుది దశలోకంలో పాకనాటి సీమలో 'పంటనృప కౌస్తుభములకు పాలవెల్లి' అయిన సింగరాయ కొండ దగ్గర సోమరాజు పల్లెలో ఆ పంట రెడ్డిరాజులకు మంత్రి అయిన చిల్లర వెన్నయ మంత్రికి అంకితంగా పిన వీరన శృంగార శాకుంతలం రచించాడు బిట్రగుంట భైరవ స్వామిని స్మరించినందువల్ల కృతిపతి మంత్రోపదేష్ట కావలి వెన్నయారాధ్యుని పేర్కొడంచేత ఈ కవి బిట్రగుంట కావలి – సోమరాజుపల్లి అనే ఊళ్లు గల సీమమీద అభిమాని అని తెలుస్తుంది శాకుంతల రచనానంతరం క్రీ శ 1485 ప్రాంతంలో విజయనగర ప్రభువైన సాళువ నరసరాజు దగ్గర రాజోద్యోగి అయిన అన్న పెద వీరన ప్రాపకంవల్ల అక్కడచేరి జైమినీ భారతాంధ్రీకరణం

ఆ రాజు కోరికమీద సాగించాడు. పిన వీరన కవితాపరంగా సాధించిన పెనకువ ప్రౌఢి, జైమినీ భారతంలో బాగా కనపడుతుంది.

కృతిపతి వెన్నయ పూర్వ కవులందరి ప్రజ్ఞా పిన వీరనవద్ద ఉన్నదని భావించాడు. పిల్లలమఱ్ఱి వారింట 'పైతామహం బగు మను కవిత్వ లక్ష్మి వెలయుచున్న' దని ప్రశంసించాడు.

'భారత ప్రోక్త కథ మూల కారణముగఁ
గాళిదాసుని నాటక క్రమము కొంత
తావకోక్తికి అభినవశ్రీ మహిమఁ
గూర్మిఁ గృతిసేయు నాకు శాకుంతలంబు' 1-27

అని కవిని కోరాడు.

కవి ఆ పదకం ప్రకారం భారత కథా - నాట క్రమమూ తన ఉక్తికి అభినవశ్రీ ఘటింపగా శాకుంతల కావ్య రచనకు పూనుకొన్నాడు.

ఆ అభినవశ్రీ ఏది?

నాటకంలో రేఖామాత్రంగా స్ఫురించే సన్నివేశాలకు రక్తమాంసాలతో బలమిచ్చి నిలబెట్టడం ఒకటి—

ప్రబంధ కథకు పుష్టి కలిగిస్తాయనుకున్న కథాంశాలను విస్తరించి ప్రదర్శింపడం రెండు —

రస ప్రసక్తి ఉన్నచోట మనోధర్మంతో మరెంత ఆర్ద్రత పెంచడం మూడు.

దుష్యంతుడు లేడిని తరుముటు రావడంలో నాటకకవి సూచించిన వేటను సాంగోపాంగంగా 50 పద్యాలతో కనులకు కట్టినట్టు వర్ణించాడు. ఈ వేట వర్ణనం పెద్దనాది ఉత్తర కవులకు ప్రలోభనీయం అయిందంటే దీని ప్రత్యేకత తెలుసుకోవచ్చు. ఈ వేట ఛాయలు మనుచరిత్రలో దృశ్యాదృశ్యంగా దర్శనమిస్తాయి.

వేటలో గొల్లపల్లెలో రాజుకు జరిగిన విందు తెలుగువారికి నోరూరించేటంత ఇంపయింది. తర్వాత - దుష్యంతుడు పరిమేలేడి ఎంత ముద్దులొలికేదో పిన వీరన మాటల్లో బొమ్మగీచాడు.

'వనచరులను జూచుచుంట
జని జనపతిగాంచె నొక్క చక్కని యిట్టిన్
మునిపతి పెంపుడు బుట్టిని,
వనమునఁ జరియించు వేళ వలపు కుట్టిన్ ౨-17.

తర్వాత ఎదురుపడిన మునులు ఆ లేడి కూనతో నమకున్న మురిపెం వర్ణించిన తీరు హృద్యమైనది.

కాని ఆశ్రమ సమీపానికి వచ్చేసరికి రాజుకు దానిపై దయకలగడం ఆశ్రమ మహిమ అయితే కావచ్చు కాని - మునులు ఎదురుపడి లేడిని రక్షించవలసిన ప్రయోజనం దిగజారిపోయింది. వారి ఆశీర్వచనానికి ఉండవలసినంత బలం లేకుండాపోయింది. వేట ఆశ్రమ వర్ణనాదుల్లోపడి ఈ ప్రధానాంశం అప్రధాన స్థితికి జారిపోయింది.

నాటకంలో శకుంతలా ప్రేమ, రాజునుండి రక్షణ, కాశ్యపుడు కన్యను అత్తవారింటికి పంపే సన్నివేశం వంటి నిర్భరములైనా అందులో మొదటి రెండూ వ్యంగ్యసుందరంగా నడిచాయి

కావ్యంలో పై శృంగార, వీర, రౌద్ర, కరుణ రసాల ప్రస్తారాలకు మంచివీలు దొరకింది

దుష్యంతుడు ఆశ్రమంలో ప్రవేశించబోతూ చూచిన మాలినీ నది స్త్రీ మూర్తిగా కన్నన మివ్వడంలో కవి చూపిన భావ్యర్థ సూచనం ప్రశంసార్హమైనది.

దుష్యంతుడు శకుంతలను చూచి ఆసక్తి చూపిన ఘట్టంలో సంస్కృత కవి హృదయాన్ని తెలుగు మెత్తదనానికి మళ్లించి కవి చూపిన ప్రజ్ఞ గణనీయమైనది

'దీనిని పూవుకంటెను గఱుతింపగ మెత్తనిమేనుఁ దీఁగె యీ
తరుణికి. నిట్టి కోమలి లతాంతరు సేచన మాచరింపగా
గరుణ యొకింతలేక పనిగట్టె మునీంద్రుఁడు మాటలేటికిన్,
సరవి యెఱుంగలేక కటకట జాదులు పేచరె? మంగలంబునన్' ౨-61

సంస్కృతంలోని నిదర్శనాన్నే మార్చివేసి అంతకన్న చురుకైన మాటతో ఆమె సౌకుమార్యాన్ని వర్ణించడం వివ్యక్తిత్వానికి నిదర్శనం-

శకుంతులా సౌందర్యంలోని ఈ పలుకు పోతిమి పిస వీరన స్వీయ ప్రతిభ నుంచి వచ్చినది.

'చందనంబుకం బుష్పంబు ! గుందన మునఁ
బరిమళం బిఘులతికను ప సూచాకై
నతి మనోహరమైన యీ యతిన మేన
సగయ గనుగొంటిగాదె యీ యౌవనంబు

కుసుమమివ లోభనీయం యౌవన మంగేషు సన్నద్ధం' అన్న కాళిదాసు మాటకు తెలుగు కవి ఇచ్చిన వికాసమిది—

ఈ శృంగార భావం క్రమంగా ఎదిగి పుష్పించి ఇట్లా ఫలించింది.

'......కొసరుం గొంకు దేర్చి......
తేల్చె రమణిన్ హేలాసుఖాం భోనిధిన్' ౩-21౨.

నాటకంలో రాక్షసుల యజ్ఞ విఘ్నస్థితి సూచనగా ఉండగా ఈయన పేరు పేరు వరుసను ఆ రాక్షసులను సృష్టించి వారితో నాయకునకు జరిగిన యుద్ధమూ దానిలో ఆయన అఖండ విజయం వర్ణించి యుద్ధ వర్ణనంలో కూడా కృతహస్తుడు అనిపించుకున్నాడు.

'తత్రాపిచ చతుర్థోఽంకః' అని అభిజ్ఞాన శాకుంతలంలోని చతుర్థాంకం ప్రసిద్ధమయింది. దానిలో సర్వసంగ పరిత్యాగి కణ్వుని వాత్సల్యం, శకుంతలా పితృప్రేమ హృదయ స్పందకమైనవి ఆ ఘట్టాన్ని కాళిదాసచ్ఛాయలోనే తీర్చినా అతికాళిదాసమైన రస నిర్భరత కనబడుతుంది.

ఇచట కణ్వుడు శకుంతలకు చేసిన హితబోధ తెలుగు గృహస్థు కన్నబిడ్డ గడ్డం పుణుకుతూ తడికళ్ళతో చేసినట్టు ప్రత్యక్షమవుతుంది. కాని సంస్కృత నాటకానికి నకలు కాదు.

'గౌరవ హీను లిజ్జగతిఁ గన్నియ నిచ్చినవారు కోమలీ '' అనడం అసలు కణ్వుని మాట అయినా కాకపోయినా తననాటి మామలస్థితి కవి ఎత్తిపొడిచి నట్లుంది. శకుంతలను పంపుతూ కణ్వుడు :

'బొమ్మనఁజూచుఁ జూచి మదిబుట్టిన ప్రేమము పేర్మి బాష్పముల్
గ్రమ్మినఁ గ్రమ్మఱం పెడ మొగంబయి కన్నుల నీరు మ్రింగుచున్
ద్రిమ్మరఁ దాళకుం డల మొగంబగు, నశ్రులు నించు, గొంత సే
పమ్మని జాలిబొంది ధృతి యందయి నిల్వక విచ్చి పాఱగన్' ర-84

ఈ పలం బొమ్మలో నుంచి 'యాస్యత్యద్య' అనే శ్లోకం తొంగి చూస్తుంది. కాని దాన్ని మింగివేసే ఆర్ద్రిత మనశ్చిత్రణం ఇందులో కనబడుతుంది.

మౌని నోరు తెరచి నీతులన్నీ చెప్పాడు. శరీరం-లా శూన్యమైన ఆశ్రమంలో ఏమిచూచి ఓదార్పు పొందగలడో ఉగ్గడించాడు. తర్వాత తోబుట్టువుల్లా శకుంతల పెంచి చెట్ల చేమలవద్ద సెలవు తీసుకోవాలి.

అప్పుడు కణ్వుడు వృక్షలతాకులను పిలిచి అన్న ఈ మాటలు గుండెను పట్టి పీడిస్తవి. ఇది చదివినప్పుడు 'పాతుం న ప్రథమం' అనే శ్లోకం సాక్షాత్కరిస్తుంది. అయినా ఈ త్రిమయతా వ్యాఖ్యానం నిరుపమానమైనది.

'అలపెరుంగక తావకాలవాలములను
నెమ్మితో నిండ నీరుపోసి
క్రమవృద్ధిఁ బొందు మార్గంబు లారసి వచ్చి
పూటపూటకుఁ జాల ప్రోదిచేసి
ప్రేమాతిరేకత ప్రియమండనమునను
జిగురాకుఁ గొనగోర గిదుమ వెఱచి
వసపాటి తల్లులు ప్రసవోద్గమంబైన
సఖులు దానును మహోత్సవ మొనర్చి

తల్లియై పెంచె మిమ్ము నే తలిరుబోణి
అత్తవారింటి కేగెడు నాలతాంగి
క్షితిరుహములార! పుష్పిత లతికలార!
అనుమతింతురుగాక కల్యాణయాత్ర!' ర-93

సంస్కృత శ్లోకానికి తెనుగు చెయ్యబోయి చాలమంది ఆధునికులు తూ,చాల, తోసం ఎన్నుకుని మూలంలోని ప్రాణస్పందనం మాత్రం రాకుండా

చేశారు అవి గుల్మములు కాక అశ్వములూ కాక 'గుశ్వము' లైనాయి స్వంత కండగల తెలుగు కవి ఎట్లా చెయ్యాలో ఈ కవి పలుశ్లోకాలు చేసి చూపి ఆ భావాలకు తళతళ తెచ్చాడు

'ప్రసవాన్ని వాసన చూడడం'లో తెలుగు పలుకు సిద్ధించదు 'క్రొవ్విరి తావి మూర్కొ-వడం'లో ఉంది తెలుగు ప్రాణం ఈ దృష్టితో ఇందలి శ్లోకచ్ఛాయలు చూస్తే ఈ కవి పస యేమిటో తెలుస్తుంది

పూర్వకవి ప్రభావం

'మునులు నిత్య స్నానవంలు దీర్చి యెడలం
కాసారముల కంచ గదియ వెఱచు' 2-44

ఇది నన్నెచోడుని అనుసరణం

'చంచత్పల్లవ కోమలాంగుళికరన్' 2-53

పెద్దన వరూధిని వర్ణనలో ప్రతిబింబించింది

గ్రీవా భంగాభిరామమె' అనే శ్లోకానికి

'విలుగొని వెంట వెంట పృథివీ పతి రా
శరపాత భీతిఁ దా
మలిగి మలంగ నిగ్గొనుచు
మార్గము ప్రేకకు నడ్డగించుచు
న్నిలుచుచుఁ గొంత కొంత గమ
నించుచు నర్థము మేసిమేసి ద
ర్భలు వివృతాస్య పార్శ్వముల
రాలగ మింటికిఁ జౌకళించుచున్' 2-19

'వనిత కిష్టదైవంబు జీవితేశుండు,
భామకు ముంగొంగు పసిడి, భర్త ు 82

అనే పద్యం పెద్దన ప్రథమ ఆశ్వాసంలోని గృహస్థ వర్ణనకు మూలం

'శుశ్రూషస్వ గురూన్' అనే శ్లోకపు తెనుగు ఇది

'అత్తమామలకు నీయ పనేమి వెట్టం
కినుస్సుఁ జేయుమీ పను లెటింగి' ఆ-88

ఇత్యాది

ఇది పుణ్యస్త్రీ మూర్తి కల్పన—

'కంచెలయుం, బటీర తిలకంబును బాటల చెందిరంబు ఫా
లాంచల సీమ లేఁబసపుఁ టచ్చతబొట్టు జెవాకు గాజులున్
గొంచెము వీడ్వమ్మ్, రుల కొప్పును నోట్పు నొన వ్వెప్పుడున్
జంజలనేత్రి యుండదగు సంతత భర్తృ లాభివృద్ధికిన్' ఆ-78

అచ్చపు తెలుగు ముత్తైదువ ఎదుట నిలిచి నట్లున్నది 15 శ॥ వు పుణ్యస్త్రీ రూపము ఇది అని చెప్పను

ద్వి ఆ 129 పద్యంలో నన్నయ 'దళిత నవీన' పద్యభావం, ప్ర ఆ 92 పద్యంలో దండి గారి శ్లోకభావం, ప్ర ఆ 86 వచనంలో బాణుని చ్ఛాయలు, ఈ కావ్యంలో స్పష్టంగా కనిపిస్తాయి ఆ ఏవుఁను అంతహృదయ దఘ్నంగా చదివిన కవితాప్రీతి వెల్లడవుతుంది గాని అసమర్థుని అనుకరణంగా పొడగట్టదు

ఈయనకున్న శ్రీనాథ ప్రీతి ప్రత్యేకంగా చెప్పదగ్గది

అవతారికలో నన్నయకు అంజలి ఘటించేని విధం, పురవర్ణనంలో 'గండూ పితాజాండ మండలంబు' వంటి భావచిత్రం ద్వి-అ లో విశ్వామిత్ర తపోభంగంలోని సీసం నడక, ద్వి 132 లో 'కాలాంతః కామినీ' భావవిస్తరణం, నడుమ కనిపించే వక్రోక్తి, శ్రీనాథుని నుంచి పుణికి పుచ్చుకున్నట్టు అగపడతాయి

అంతేకాక విశ్వామిత్ర కథలో చేసిన హిమ వద్వర్ణనం, శకుంతలా సౌందర్య వర్ణనంలోని 'అదెం ఇంద్రుడు' అనే పద్యం వరుసగా కుమార సంభవ, విక్రమోర్వశీయ పద్యాల తెలుగు పోహళింపు

ఏ భావాన్నయినా పద్యంలో పొదిగి రంగురుచి కల్పించి తనముద్ర వేసే నేర్పు ఈ కవికి ఆజానజమైన విద్య అనిపిస్తుంది

అట్లాగే ఈయన పలుకు సొగసును రామరాజ భూషణుడు మున్నగు ఉత్తర కవులు ఆప్యాయంగా స్వీకరించిన జాడలు గూడా కనిపిస్తాయి (౨-87 వాలికపై).

పాండిత్యం : పలుకుబడులు

పిన వీరన సంస్కృతంలో శాస్త్ర సంప్రదాయాలు సాహిత్య ప్రమేయం క్షుణ్ణంగా ఎరిగినవాడు యోగ, జ్యోతిష నీతిశాస్త్ర ప్రవేశాలు ఆయా సందర్భాలలో కనపడతాయి.

దయా సమన్వితుకు వివహం (వివాహం), ఉగ్రం ఖ్యుడు వంటి ప్రౌఢ శబ్దాలు వాడినా, త్రిణయన వంటి అపాణినీయాలను కూడా వ్యవహారబలంవల్ల వాడడానికి జంకడు. అంతేకాక తెలుగు లాక్షణికులు అంతగా సమ్మతించని ద్రుత ద్విత్వ, క్త్వార్థకార, సత్సమాకార సంధులను అఖండయతిని స్వేచ్ఛగా ప్రయోగించగల స్వతంత్రుడు.

తెలుగులో జీవంగల పలుకుబళ్లు, సూక్తులు, వాడి తెలుగు భాషలోని తన ఆత్మీయతను ప్రదర్శిస్తారు

1 నాలుక వెచ్చన మునుల ——
2. మచ్చనాలుక వాడవు ——
3. అరయంగా బెడబెట్టుకొంచు దిరుగన్ హారిమ్ముమ్మలే భామినుల్ ?.
4 అనటి పండొల్ప నేటికి నినునగోరు ?
5. తోటకూరను చంద్రహారంబు దెత్తురే ?
6. తల్లి విషమువెట్ట తండ్రి యమ్మగ మాన్పగలరె ఒరులు జగతి ?
7 ‘ఉసర వయసుని నాలంబయష్టి కొడుకు’

వంటి వాటిని అవలీలగా. వాడడమే కాకుండా కొన్ని ఇంపయిన పదబంధాలను వాడి తన ప్రత్యేకత ప్రదర్శించినవాడు

కమ్మ విల్తుని మేసినకన్ను
తామర పూ బెలసాల

కన్నులార్చి
విచ్చదమ్మి పుప్పుమేడలు

ఇత్యాదులను చూడవచ్చు

జైమినీ భారతం

శ్రీనాథ యుగంలో ఒక చేతితో ఇతిహాసిక కథను తీసుకుని స్వతంత్ర ప్రబంధ రచనా వేరొక చేతితో పురాణాంధ్రీకరణం, చేసిన ఘనత పిన వీరనకే చెందుతుంది పేరుకు పురాణాన్ని తెనిగించినా తమ రచనను తెనుగు తనంతో స్వప్రతిభతో సముజ్జ్వలం చెయ్యడం ఈ యుగకవుల ప్రత్యేక లక్షణం అని చెప్పుకోవచ్చు

' జైమిని భారతము౦గా
భూమి నపూర్వము పురాణముల గణియింపన్' ౧-17

'ఆ పురాణము౦గసం దెనుంగయ్యెనేని
జెప్ప నేర్చిన యయుం బ్రసిద్ధుడేని
దెనుంగు నుడికారమున మించుం గనియెనేని
కుందనపు కమ్మ వంచిన చందమగును' ౧-18

అని సాళువ నరసరాజు చే ప్రశంసగన్న గ్రంథం ఈ జైమినీ భారతం

పేరునుబట్టి ఇది జైమిని ముని వ్రాసదని స్పష్టమవుతూనే ఉంది కాని ఈ జైమిని వ్యాస శిష్యుడా? భారతమంతా వ్రాశాడా? ఒక్క ఈ అశ్వమేధ పర్వమే వ్రాశాడా' అనే ప్రశ్నలు వచ్చాయి పరిశోధకులు, దొరికిన ప్రమాణాలతో ఇది వ్యాస శిష్యుడే వ్రాశాడనీ పూర్తి భారతం వ్రాసినా ఒక అశ్వమేధం మాత్రమే లభ్యమవుతున్నదనీ ఈ జైమిని కాలం సంప్రదాయ పండితుల విశ్వాస ప్రకారం అయితే క్రీ పూ 3000 అనీ ఆధునిక చారిత్రకులనుబట్టి అయితే క్రీ పు 1200 అని చెబుతున్నారు

కృత్యాది దేవతా స్తుతుల దగ్గర నుంచీ కవి కవితా పరిపాకం కల్పనా చాతురి జైమినీ భారతంలో ప్రస్ఫుటంగా కనబడుతుంది

కృతిపతి మాటమీదుగా పిన వీరన తన కవితా సౌరభం ఎట్టిదో ఇట్లా వివరిస్తాడు.

'అల్లన విచ్చు చెంగలువలందు రజంబును, కప్పురంబు పైఁ
జల్లగ జల్లనై నలుచు సౌరభముల్, వెదజల్లు భావముల్
పల్లవహస్త చన్నుగవ పయ్యెద జీబుగఁ దోఁచు భాతిగా,
బిల్లనమంత్రి వీరన లగుభిజ్ఞుడు చెప్పగనేర్చుఁ గబ్బముల్' ౧-25.

జైమినీ భారతం చదువుతూన్నప్పుడు ఈతని ఆత్మవిశ్వాసం అతిశయోక్తికాదని రుజువవుతుంది

జైమినీ భారత రచనా సందర్భంలోనే పిన వీరన మొరకు 'వాణి నా రాణి' అన్నాడనే ఒక కథ పుట్టుకుంది దీనికి సీమన్తినీ పరిణయకర్త సోమన్న చెప్పిన పుక్కిటి గాథ తోడయింది ఒక కవి ప్రజ్ఞను మెచ్చుకొనే తీరులో ప్రజలు కల్పించిన దంతకథ కలుపుకొంటె ఎక్కువ విలువ ఇవ్వనక్కర లేదని విమర్శకుల భావన - ఎందుచేతనంటే - అవతారిక 5 పద్యంలో కవిచేసిన వాణీస్తుతి చూస్తే అతడు భారతీదేవి ఎడల ఎంతటి మాతృభావన, భక్తి ప్రపత్తులు కలవాడో విశద మవుతుంది.

జైమినీ భారతం వ్యాస భారతం కంటె విలక్షణమైన కథలకు పుట్టినిల్లు.

లోకంలో ప్రసిద్ధమై నాటక రూపంగా వచ్చిన ప్రమీలార్జునీయ కథ, హాస్య ప్రసక్తిలో వచ్చే గయ్యాళిభార్య చండి కథ, కథా రూపంలో సుప్రతిష్ఠితమైన చంద్రహాస చరిత్ర, ఈ జైమినీ భారతం నుంచి వచ్చినవే.

అంతేకాక - ఇందులోని ఉత్తర రామాయణ కథ మూల రామాయణానికి భిన్నమై కొత్త సంఘటనలతో కొత్త మలుపులు తిరగడం ఒక విశేషం

లోకంలో సీతా వివాసానికి కారణంగా చెప్పే రజక కథ, లవకుశులు రామ, రామానుజులతో చేసిన యుద్ధం వారి ఓటమి, హనుమజ్జాంబవంతులు బద్ధులు కావడం ఇత్యాదులు తెలుగు జానపద గేయాల్లో ఎడనెడ కనిపిస్తున్నా వీటికి మూలం రామాయణంలో దొరకదు

జైమినీ భారతంలో ఇవి గ్రంథస్థములై కనిపిస్తున్నాయి. ఈ జైమినీయ కథలకు మూలం పద్మపురాణపు పాతాళ ఖండంలో ఉన్నదని

తద్దేశ్యుల ప్రతిపాదనం. భవభూతి లవకుశ యుద్ధాదను జైమినీయం నుంచే గ్రహించినాడేమో ఆలోచించవలసి ఉంది. ఉజ్జాగుని కుందమాల కూడా రామాయణాన్నే అనుసరించింది. ఈ విధంగా జైమినీ భారతానుబంధం మనకు తెలియకుండానే పెరుగుతూ ఉంది.

సంస్కృత జైమినీ భారతం ఇదివరకు ప్రయత్నసాధ్యమే అయినా ఈ నడుమ గోరఖ్‌పూర్ గీతాప్రెస్ వారి ప్రచురణవల్ల సులభ సాధ్యమే అవుతున్నది. దానితోబట్టి పోల్చిచూస్తే పినవీరన చాలవరకు క్లిష్టపరచి మూల హృదయానికి భిన్నంకాకుండా యథోచితమైన మార్పులు చేసి తెనిగించినట్లు స్పష్టమవుతుంది.

ఈ అశ్వమేధ కథ అంతా కృష్ణ పారమ్యంవైపు మొగ్గుచూపుతూ ఆయన మహాత్త్వం ఉగ్గడిస్తూ నడుస్తుంది.

కృష్ణుడు ధర్మరాజుతో అశ్వమేధీయాశ్వ గ్రహణానికి భీముడు చాలడని పరిహాసిస్తే – ఆ భీముడు కృష్ణుడు చేసిన ఆక్షేపణలను ఆయనకే తిప్పికొడుతూ చేసిన ప్రసంగం సారస్వరచనా నైపుణ్యంతో కలబోడినా – తుదకు కృష్ణుని ఆధిక్యం అంగీకరించి ఆనతుడు కావడంలో జైమినీయ పరమార్థం ఇదీ అని తెలుస్తుంది

ఇచటి కృష్ణ భీముల పరిహాసోక్తులు ఆస్వాద్యములై నవి–

'అచ్యుతుడు భీముదెసజూచి యుల్లసిగుచు–
మందమతియు బహ్వాశియుఁ
దుందిలుడును రాక్షసీసుతుడు నిష్ఠురవాక్
సందర్భుడు, నగు మారుతి
నందను సచివతఁ బ్రయోజనము సిద్ధించున్' ౧–120

ఇంకా మరికొన్ని అసలతఱాలతో భీముణ్ణి ఎత్తిపొడిస్తే అతడంటాడు.

అనఘ నీ వానతిచ్చినయట్లు మిగులఁ
దుందిలుండను బహ్వాశి దుష్టరాత్మ
సీరతుండను నగుదుఁ జర్చించి చూడ
దేవరకు నట్టి గుణములు లేవుగాన

ఇక్కడ 'దేవరకు' అనే మాటలో భీముని వెటకారమంతా గూడు కట్టుకొని ఉంది

అట్టి 'దేవర గుణాలు' వివరిస్తున్నాడు—

"మొదల సత్యంత కాముకు లౌటకు గొల్ల
యిల్లాంద్ర గుబ్బ పాలిండ్లు సాక్షి
అతి నీచరతి శీలివగుటకుఁ బారిన
కమఠ సూకర విగ్రహములు సాక్షి
బహుశీలివగుటకు బ్రహ్మాండ కోట్లును
బూరింప వేని నీ బొజ్జసాక్షి
స్త్రీలోలుడగుటకు త్రైలోక్యము నెఱుంగ
ధరకుఁ దెచ్చిన వేల్పు తరువుసాక్షి

జడ సముత్సాహి వగుటకు జలధిసాక్షి
వామనుడవగుటకు బలిశ్వగుడు సాక్షి
మందమతి నది మఱి పొందెగాక
సరవిఁ బేర్కొనఁ దగునె నీ సటలు కృష్ణ!"

వ్యాస భారతంలో భీమునికి ఇంత నోటి చురుకు ఎరగం జైమినీయంలో భీముని వ్యక్తిత్వమే వింతగా కనపడుతుంది అర్జుననంత ఎత్తుకు ఎదిగి కృష్ణునితో ఎకసక్కాలు సాగిస్తాడు

ఇంత ఎదిరించి మాటలాడినా - ఆ మనసులో వెన్నవంటి ఆరాధన ఆశ్చర్య పరుస్తుంది

" నీ కరుణ తోడుగా వైరి నృపుల గెల్తు
హయముఁ గొనివత్తు సాగింతు నధ్వరంబు -
• నా హృదయంబు లోననీ పదయుగళంబు నిల్పి
కుల పర్వతముల్ పెకలింతు ౧- 27, 128

కృష్ణ భీముల సరస సల్లాప ఘట్టం ఇంకొకటి చూడదగ్గది అంతః పురంలో శ్రీకృష్ణుడు భోజనం చేస్తూ ఉంటాడు ఆనాటి పురాణ పురుషుల భోజన స్వరూపం ఎట్టిదో మనకు తెలియదు గాని - ఇక్కడ భోజన సమృద్ధి

ఒకనాటి తెలుగువారి భోజన రుచిని కనుల ముందుంచుతుంది శ్రీనాథుని భోజన ప్రీతిని పిన వీరన కూడా పోషించాడేమో అనిపిస్తుంది

"మెత్తనై మిలమిల మెఱయు రాజాన్నంబు
నొలపుఁ బప్పులును సద్యోఘృతంబు
నప్పడములు, వడియములుఁ దాలింపులు
బలుచని నులివెచ్చ పడిదములును
పులుసుఁ గూరలును బజ్జులు దియ్యబేగులు
బంచదారలు నానవాలు జున్ను
బులగంబు బహువిధంబుల పిండివంటలు
బాయసంబులు వడపప్పుఁ దేనె

పానకంబులు సిగరులు ఫలరసాయ
నములు బచ్చళ్ళుఁ గల వంటకములుఁ బెరుగు
నూరుగాయలు మొదలుగా నుచిత వృత్తి
నారగింపఁ జతుర్వి హా ములును" 3-50

క్షత్రియ భోజనంలో కూడా పేలవమైన ఈ శాకాహారమేనా అనుకోకుండా - చిత్రమైన మాంసాహారం కూడా జోడించాడు కవి—

మఱియు భూచర జల చరాంబర చరముల
పేరుకల మాంసములు నంజి ప్రియముతోడ
రుక్మిణీ సత్యభామ లిరువురు గదిసి
తాళవృంతంబు లిడుచుఁ ద్రస్తరులు సేయ

తెలుగు సంపన్నుల భోజన విశ్వరూపం చూచిన మీదట నేటి భోజనపు నిరుపేదతనం నిట్టూర్పు తెస్తుందనుకోండి అదట్లా ఉంచితే - భీముడు సరిగ్గా ఆ సమయానికి అక్కడికి విచ్చేశాడు అప్పుడు కృష్ణుడు చేయిబట్టి రాదిగిచి భీముణ్ణి ఆకలిగొన్నావు, భోజనానికి లెమ్మన్నాడు అప్పుడూ భీమునకు బావమరది పరిహాసమే—

ఎత్తుగీతి — 'కడుపులోపఁ సకలలోకములు వరుస
గూరుకొన్నప్పుడును నది గొఱఁతగాని

తుష్టుడవుగావు ! నీదుపొత్తున భుజింపఁ
దీరునే నాకు ఘనమైన దీపనంబు !'' 3-53

అని సల్లాపాలాడుతూనే వాయునందనుడు తృప్తిగా పుచ్చుకున్నాడు

ఈ విషయం ఇంతగా చెప్పడం ఎందుకంటే - తెలుగు సాహిత్యంలో హాస్యం మృగ్యమనే వారికి కొంత తెలివిడి కలిగించడానికి - మూలంలో ఈ పరిహాసస్పర్శ ఉన్నా - దాన్ని తెలుగులో ఎంత హస్తలాఘవంతో కవి చిత్రించ గలిగాడో చూచి ఆశ్చర్య పడతాం

శ్రీకృష్ణుడూ రుక్మిణీ ఒక సందర్భంలో కూర్చుని ఉండగా కృష్ణుడు చమత్కారంగా ఈ కమలిని కామవ్యామోహం మాడు మగడు (సూర్యుడు) కనుచాటు కాగానే మరాళ, సామజ భ్రమరములు పైబడగా ఎలా క్రీడిస్తున్నదో అంటే రుక్మిణి చెప్పిన జవాబులో ఆమె వివేకం, వాక్చమత్కృతి, మెప్పు పొందదగినది

'స్వామి పద్మినికి (లక్ష్మికి) వాటితో మీరన్న సంబంధం లేదు ఆమెకు హంస, పుత్రవాహనం, ఏనుగు ఒన వాహనం తుమ్మెదలు సంతానం వంటి వారు ఉత్తమ స్త్రీ కలలోనైనా అట్లా ప్రవర్తిస్తుందా ? సర్వాంతర్యాములు మీకు తెలియని దేమున్నది ? 3-68 లక్ష్మికి ప్రతిరూపమైన రుక్మిణి మాత్రమే ఈ సమాధానం చెప్పి కృష్ణుని నిరుత్తరుణ్ణి చెయ్యగలదు

ఆ సమయంలో అమాయకులైన గొల్లలు కృష్ణ దర్శనానికి వచ్చారు వారి బొమ్మ ఇది

తెల్లని పట్టెవర్ధనాలు, తీగపాగాలు పిల్ల చెప్పులు, చెవుల్లో నెమలిపింఛం, మొలకు కొత్త కంబళ్ళు, వంక కావళ్ళలో పెరుగునేతులు - వచ్చారు బాగుంది కాని వారి ప్రసంగం సంస్కృత వాసనలేని అచ్చ తెలుగుమాటల్లో ఎంత దేశీయ వాసన సంతరించుకొన్నది

వారికి కృష్ణుడు తామెరిగిన నందనందనుడు కాడు నాగరిక వేషంలో మారిపోయాడు వారి అచ్చెరువుకు మేరలేదు వారి పల్లెటూరి చల్లని మాటలు వినండి——

"కోరగించెడు కొండగోగు బువ్వులచాయ
దీవన్నె గోఁ ప్పడం బెట్లుగలిగె ?
మెఱుగు జుక్కల చాయ మించు నీ తెల్లని
గురువింద పేరెందు గూర్చుకొంటి ?
నిగురు గప్పని చంద్రనిప్పు క్రై పడినున్న
దీ కొడ్డి పూస నీ కెవ్వడిచ్చె ?
బొలసిన గబ్బు కింపులు సోడుముట్టెడు
నీ నల్లతిరునామ మెచట దొరకె ?

జడలు మెడమీద ద్రేలెడు జల్లితోక
నేడ సవరించు కొంటిబ బోడకోడె
యనుచు నాడెడు ముగ్ధవాక్యములు చేరి
శ్రీధరుడు వారిఁగృప నాదరించె నపుడు"

బంగరు దుప్పటం, ముత్యాలహారం, కౌస్తుభం, కస్తూరి తిలకం, జరీ తలపాగ, వారి భాషలో మారిన తీరు హృదయంగమంగా ఉంది

మగవాళ్లూ అయితే ఇక ప్రౌఢ గోపాంగనలు—

'తెలవ యొక్కతె జుంటితేనె కానుక జేసి
తలపించె నధరామృతమ్ము చవులు'

ఇత్యాదిగా తమ ప్రాంవలపు వెల్లి పిరియ జేసినారట !

అల్లే తెలుగు జైమినీయంలో నాల్గవ ఆశ్వాసంలోని ఉద్దాలకుని సంసారక్షోభ, ౫ ఆ లోని ప్రమీల చతురోక్తులు 8 ఆ లో చంద్రహాసుని యెడల పురస్త్రీలు చూపిన వాత్సల్యం చదివి ఆనందించ దగ్గవి కవి స్తుతిలో 'మా నన్నయ' అన్నట్లుగా పిన వీరన శైలి ప్రసన్న గంభీరమై నన్నయను తలపిస్తూ, శ్రీనాథుని వక్రోక్తిని, తిక్కన తెలుగు తేటను, ఎఱ్ఱన పొదుపును, ఎంతరించుకొని ఒక ఉన్నత స్థాయికి చేరింది

భాషా ప్రయోగంలో ప్రౌఢిమవంటి విలక్షణ శబ్దాలను, దృంభూ (సర్పం) సౌత్యం (దున్నిన నేల) వంటి అపూర్వ పదాలను వాడగలదిట్ట న, ణ, బ, భ ప్రాసలు వంటివి వాడి ఛందస్సులో ప్రౌఢతనం చూపగలవాడు

ఇకారి సంధులు, తత్సమ సంధులు ఇందులోనూ క్వాచిత్కంగా కనబడతాయి కృతిపతి నరసరాజు అన్నట్లు పిన వీరన జైమినీ భారతం 'కుందనం కమ్మగా వలచినట్లున్న' దని చెప్పడంలో నిజం లేకపోలేదు

తెలుగులో జంట కవులు

ఒకే రచనను ఇద్దరు కలసి వ్రాయడం ఒక వింత సంఘటన ఇతర భాషల్లో ఇలాంటి ప్రక్రియ ఉందో లేదో తెలియదు గాని క్రీ శ 15 శతాబ్ది చివరి భాగంలో రెండు కవి జంటలు బయలుదేరి తెలుగులో రచనలు చేశాయి వారిలో మొదటి జంట గోన బుద్ధరాజు ద్విపద రామాయణానికి అనుబంధంగా ఉత్తర రామాయణం వ్రాసిన కాచవిభుడు, విఠ్ఠల రాజాను వీరు బుద్ధరాజు కుమాళ్ళు తండ్రి కోరిక మీద వీరీ గ్రంథం వ్రాశారట

ఇది పూర్వ రామాయణ మంత ప్రౌఢమూ, రసవం మూ కాకపోయినా ద్విపదరామాయణ సంపూర్తికి పనికి వచ్చింది

తర్వాత ప్రసిద్ధమైన జంట నంది మల్లయ, ఘంట సింగియ అనే ఇద్దరు కవులు వీరు ప్రబోధ చంద్రోదయం అనే కృష్ణ మిశ్రుని సంస్కృత నాటకాన్ని ప్రబంధ రూపంలో ఆంధ్రీకరించారు సంస్కృత వరాహ పురాణాన్ని తెలుగు చేశారు

మొదటి గ్రంథాన్ని ఉదయగిరి దుర్గాన్ని గజపతుల సామంతుడుగా పాలించిన పూసపాటి బసవరాజుకు మంత్రియైన గంగయ మంత్రికి అంకితం చేశారు

ప్రబోధ చంద్రోదయం విచిత్రమైన వేదాంత నాటకం మహామోహం, వివేకం వంటి వాటికి పుంస్త్వమూ, ప్రవృత్తి – నివృత్తి వంటి వాటికి స్త్రీత్వమూ, ఆరోపించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మానవ రూపాలతో మలచి ప్రత్యక్ష దృశ్యకావ్యంగా రూపొందించిన అపూర్వ రచన దీనిని చూచి ఒక వైష్ణవ దేశికుడు స్వమతానుకూలంగా సంకల్ప సూర్యోదయం అనే నాటకం వ్రాశాడనీ, అట్లాంటివే ఇతర వారి మత ప్రబోధాలకు అనేకులు ఇట్లాంటి రూపకాలు వ్రాశారని ప్రతీతి

ప్రబోధ చంద్రోదయం అద్వైతులకు ప్రియమైన గ్రంథం విషయం, గహనమైన వేదాంత ప్రబోధం అయినా, సంస్కృత కవిత ప్రసన్న మధురంగా ఉంటుంది ఈ జంట కవులు శ్రవ్యకావ్యంగా ఉండడానికి అలతి అలతి మార్పులు చే ినా చాలా దగ్గరగా రుచిమంతంగా ఆంధ్రీకరించారు

"ఇమ్మహా రసపాకము నెఱిఁగి ుట్టి
జనుఁ డెఱుంగడు మఱి తల్లి చన్నుపాలు,
దీని సరి చెప్ప మరి లేవు త్రిభువనముల
దొరక దీకృతి నీ వంటి దొరకుగాని"

అని గంగయ మంత్రి హితవరులు, ఈ రచనను ప్రశంసించి కృతిగా స్వీకరించ మన్నారు

రెండవది వరాహపురాణం పేరు వరాహమే అయినా వరాహావతార కథతో దీనికి సంబంధం లేదు ఆదివరాహమూర్తి భూదేవికి దీన్ని చెప్పడమే దీని నామసార్థకత ఇది నిజానికి కవిత్వానికి అనువైన గ్రంథం కాదు భిన్న భిన్న కథలు కలిపి కట్టిన సంపుటం అనవచ్చు అయితే దీనిని ఎన్నుకోవడం ఎందుకు ? అంటే - ఇది తుళువ నరసానాయనికి అంకితం సాళువ, తుళువ వారంతా వరాహలాంఛనులు, వరాహ కథ చేపట్టడం - వారి సంతోషానికి ప్రభు ప్రీతికే ప్రజలున్నూ చదివి మెచ్చుకోవడం పరిపాటి—

తిథి, వార వ్రతాలూ, శ్రౌత స్మార్త విధులు, భూగోళ వర్ణనం, ఇత్యాదులు దీని ముఖ్యాంశాలు ఈ శుష్క సామగ్రిని సరసం చెయ్యడం ఒకపాటి తేలికపనికాదు కాని కవులు చేయి తిరిగినవారు గనక - ఉన్న పరిమితిలోనే రస రామణీయకాలు సృష్టించడానికి ప్రయత్నించారు తటస్థ పడ్డ కథల్లో వేట, చంద్రోదయ, సూర్యోదయ సముద్ర వర్ణనలు శృంగార ప్రసక్తిలో నాయికా నాయక దర్శనాను రాగాలూ, విరహం, సంయోగం వంటివి ప్రయోగించి తెలుగు ప్రబంధ సామగ్రిని తెచ్చి స్థిర పరిచారు ఇందలి శృంగారంలో ఒక చమత్కారం ఉంది

నాయకుడు దుర్జయుడనే రాజు నాయికలు ఇద్దరు సహేతి, ప్రహేతి అనే రాక్షసుల పుత్రికలు - సుకేశి, మిత్రకేశి - అనేవారు

నాయకుడు ఇద్దరినీ సమంగా ప్రేమిస్తాడు ఇద్దరు ప్రియురాండ్రూ పొరపొచ్చాలు లేకుండా అతనితో అనగి పెనగి ఉంటారు

'కలహించుట యే రాత్రియుఁ
గలియుటయే పగలు - నయ్యోఁగాని తఱంపన్
గలనైన లేవు మఱి వా
రల హృదయాంభోజములకు రాత్రింబగలున్' వరాహ ౬-69

ఇంకా సోమె ధర్మ వ్యాధుని కూతురు కాపురం, జీవపదార్థ వ్యాఖ్యానం, అత్తకోడళ్ళ తగవులు, నారదుని సావిత్రీ దర్శనం, ఇత్యాదులు పాఠకులను అలరించగల ఘట్టాలు

ఈ నంది, ఘంట కవుల తర్వాత మళ్ళా ఎవరూ నాల్గువందల పండ్ల దాకా జంటకవులై కవిత్వం చెప్పడానికి ప్రయత్నించలేదు ఆధునిక యుగంలో క్రీ శ 19, 20 శతాబ్దాలలో జంట కవిత్వం ఒక కవితా క్రీడ అయి చాలా జంట ఉద్భవించాయి

వరాహపురాణ కృతిపతి తుళువ నరసరాజు ఈ కవులతో ఇట్లా అన్నాడట—

'మీ రిరువురు నెప్పుడును శ
రీర ప్రాణముల క్రియఁ జరింతురు మిగులం
గూరిమి కృతి ప్రతి పద్యముఁ
జారు ఫణితిఁ జెప్పఁ గలరు చాటువుగాఁగన్' వ ౧ 13

శరీర ప్రాణాల్లా ఉండే వీరిని చూచి సంబరపడి మీరిద్దరూ కలిసి కవిత్వం చెప్పండి అని రాజు కోరడం చేతనే వీరు జంటకవులైనారో లేక ముందే జంట కవిత్వం చెబుతూ ఉంటే ఇట్లా ప్రోత్సహించాడో చెప్పలేము

ఇద్దరు కలిసి రచన చేయడం విచిత్రమైనదే ఇందులో నంది 'అంకె' ఏదో, ఘంటా 'నాదం' ఏదో నిర్ణయించడం తేలిక కాదు ప్రీతి పాత్రమైన ఘట్టాన్ని ఎంచుకుని ఎవరికి వారు రచించి గ్రథనం చేసి ఉంటారేమో అని తోస్తుంది

ఇందులో రెండవ కవికి మలయ మారుత కవి అనే బిరుదుకూడా ఉన్నది అయితే ఆ సుఖ స్పర్శ పట్టడం ప్రయత్న సాధ్యమే అనుకోవాలి

తిక్కనార్యుని కుంభవృష్టితో విరగబండిన ఆంధ్ర కవితా సస్యం, ఆ సంపన్నమైన కాలంలో ఇంద్ర ధనుస్సౌందర్యంతో కావ్యం రూపంకూడా చూరగొని, శుభ్రజ్యోత్స్నా పులకిత శరత్తుకోసం ఎదురు చూస్తున్నది

ప్రబంధ శరత్తు

చతుర్థ ప్రసంగం

పెద్దన పేశల సుదోక్తి

శరత్తుకు శారదకు ఏదో విడదీయరాని బంధం ఉంది అదే దశరా పండుగ అక్షరాలు కొంచెం మారిస్తే దశరా శారద అవుతుంది

శుద్ధ నవమినాడు వాగ్దేవి మేల్కొని ప్రసన్నంగా ఉంటుందట, కనుకనే సరస్వతీ పూజలు

ఆనాడు విజయనగరంలో కొత్త సరస్వతీ పూజ జరిగింది

కటకం నుండి కన్యాకుమారి వరకు ఒక్క గొడుగు కిందకు తెచ్చి పట్టణాన్ని విజయనగరంగానూ విద్యానగరంగానూ జేగీయమానం చేసినవాడు శ్రీకృష్ణదేవరాయలు (క్రీ శ 1509-30)

అతడు సాహస విక్రమార్కుడే కాదు సరసకవి సార్వభౌముడు కూడా కనుకనే తన 'భువన విజయ' సభా భవనంలో అష్టదిక్కులను అష్టకవి దిగ్గజ పీఠాలను ప్రతిష్ఠించిన ఘనతను దక్కించుకొన్నాడు

కొత్త ఋతువుతో ప్రకృతి కొత్త అందాలు సంతరించుకొన్నట్టే కొత్త ప్రభువుతో ఆంధ్ర కవితా శారద కొత్తరూపు సవరించుకుంది

సంస్కృత పురాణేతిహాసాల, కావ్య నాటకాల తల్లికొంగు పట్టుకు తిరగడం మానేసి - తన పెత్తనం తాను నిలుపుకుంది కావ్య ప్రక్రియ నుంచి ప్రబంధ నిబంధనాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచుకుంది రాజ్యం సర్వ సమృద్ధులకు ఆలవాలం అయినట్టే, కవిత్వం బహు సౌందర్యాలకు నిలయమయింది

స్థూలంగా ఈ కాలానికి ప్రబంధయుగం అని పేరు నిజానికి ప్రబంధ మనేమాట కొత్తదేమీ కాదు సంస్కృత రచయితలు ఇంచు మించు రచనా

సామాన్యాన్నంతటినీ ప్రబంధమనే వ్యవహరించారు తిక్కనార్యుడు తన భారతాన్ని ప్రపంధ మండలి అన్నాడు కాళిదాసు నాటకాన్నే ప్రబంధ మంటాడు!

కాని - తెలుగులో ప్రబంధమంటే ఒక నిర్దిష్ట కవితాప్రక్రియకే రూఢ మయింది ఆ మాట ఉచ్చరిస్తే ఇంకొక రకం రచన జ్ఞాపకం రాదు

మొత్తానికి ఈ రూపురేఖలు పూర్వాంధ్ర కావ్యాల్లోనే ఉన్నా - ఒక చిత్రమైన కట్టుబడి రూఢం అయి, రాయలకాలం నుంచీ వేరొక దానిని చొరనీయకుండా ఈ శాఖ ప్రవర్ధమానం అయింది

దీని ముఖ్య లక్షణం - దేనికీ భాషాంతరీకరణం కాకుండా స్వతంత్రంగా ఉండడం, నిర్దుష్ట ఇతిహాసాగమనం ధార్మిక నైతిక ప్రబోధం, క్లిష్టత దీని స్వభావం కాదు

ఆలంకారిక భాష, వర్ణన ప్రాగల్భ్యం, రసాభినివేశం, అవధిలేని ఊహా విహారం దీని ఆంతర్యం

ఎవడు ఎంత రెక్క విప్ప గలిగితే వాడికంత మన్నన!

ఈ నవ్య లక్షణాలతో అచ్చపు తొలి తెలుగు ప్రబంధం వ్రాసినవాడు అల్లసాని పెద్దన కనుకనే ఆయనకు రాయలు అష్టదిగ్గజాలలో అగ్రపీఠం ఇచ్చి 'ఆంధ్ర కవితా పితామహా' అని సంభావించాడు పితామహుడంటే - తాత అని కాకుండా కొత్తమార్గానికి సృష్టికర్త అనుకోవాలి

తలవని తలంపుగా - ఈ కవితా ప్రక్రియకు ఈతడు పెద్దన్న అన్నమాట సార్థకమయినట్టే, ఈయన రచనకు 'మను - చరిత్ర' అంటే - చిరకాలం మన్నే చరిత్ర అనేది అన్వర్థం అవుతుంది దాని యోగ్యత అట్టిది అనిభావం

శ్రీకృష్ణ దేవరాయలు 'భువన విజయ సంసత్ భవన స్థిత సింహపీఠిఁ' గొలువుండి - కృతి రచింపుము మాకు శిరీష కుసుమపేశల సుధామయోక్తులఁ బెద్దనార్య! ఆంధ్ర కవితా పితామహుఁడ వెవ్వరిదు? పేర్కొన నీకున్—

మనువులలో స్వారోచిష
మను సంభవ మరయ రససమంచిత కథలన్

వినవింపు, కలిధ్వంసక
మనఘ ! భవచ్చతుర రచన కనుకూలంబున్

మార్కండేయ పురాణోక్త ప్రకారంబునన్ జెప్పుమని కర్పూర తాంబూలంబు పెట్టినాడు

ఆ మహారాజు ఇట్లా ఏ కవినీ కోరలేదు ఆంధ్ర కవిత్వపు కొత్త భవిష్యం ఈ కోరికలో ఇమిడి ఉంది మార్కండేయ రస సమంచిత కథలను తెనిగించ మనలేదు అప్పటికే మార్కండేయ పురాణం తెనుగులో సిద్ధంగా ఉంది తాను కోరిన కథ అందులో ఉంది అయితే ఇప్పుడు పెద్దనార్యుడు చేయవలసిందేమిటి ? ఆ కోరిక కర్థం ఏమిటి ?

ఆ రస సమంచిత కథను 'నీ చతుర రచనతో వినవింపుగా వ్రాయవల సింది' అని అర్థం

ఆ రచన 'శిరీష కుసుమ పేశల సుధామయోక్తులతో మమ్ములను అలరించాలి - అని ముక్తాయింపు

కోరిక చిన్నదే కాని బాధ్యత పెద్దది

మార్కండేయ పురాణంలో స్వారోచిష మను సంభవ కథ 4 ఆశ్వాసం చివర 5 ఆశ్వాసం మొదట కలిపి 140 పద్యాలలో ఉంది సుమారుగా ఒక ప్రబంధంలో ఒక ఆశ్వాసమంత దీన్ని ఎంత పెంచితే ప్రబంధ మవుతుంది ! చాతుర్యంతో పెంచాలి పేశల సుధామయోక్తులతో నింపాలి అంటే నీ నైపుణ్యమంతా చూపి ఒక కొత్త ప్రబంధం వ్రాయుమన్నమాట !

ఆంధ్ర కవితా పితామహుడవు గనుక, నీకే ఇది సాధ్యం అనే ప్రశంసా వచనం

పెద్దన్నగారు ఆ బాధ్యతను, బరువును సంతోషంగా స్వీకరించారు

లోకంలో అందరూ అనుకునేటట్టు ఇది - నిజానికి - మను చరిత్ర కాదు, మనువు చరిత్ర ఇందులో లేదు మను సంభవం మాత్రమే మను చరిత్ర అనడం వ్యవహార సౌకర్యం కోసమే

కవికూడా క్లుప్తతకోసం 'మనుచరిత్రం బందుకొనువేళ' అన్నట్టు ప్రతీతి—

స్వారోచిష మను సంభవం ప్రధాన కథ అయితే స్వరోచితో ప్రారంభం కావాలి మనువు పుట్టడంతో అంతం కావాలి అట్లాకాక స్వరోచితల్లి వరూథిని శృంగా కథతో ప్రారంభమయింది. అది సరిగ్గా చెరసగం ఆక్రమించింది అంటే ఆరాశ్వాసాల ప్రబంధంలో మూడాశ్వాసాల మేర అన్నమాట - ఆ శృంగార కథా నిర్వహణంలోని చాతుర్యంలో, అపూర్వ పాత్ర చిత్రణంలో, సంభాషణ నైపుణ్యంలో పాఠకులు రస వివశులై ఆపైని సాధారణంగా చదవక పోవడం పరిపాటి వారి దృష్టిలో 'మనుచరిత్ర' అంటే మూడాశ్వాసాలే తర్వాత ఏముందో చాలమందికి తెలియదు అంటే పెద్దనార్యుడు అస్థిపంజరంగా పొడచూపిన పురాణ కథను ఎంత రచనా మాంసలం చేశాడో అర్థమవుతుంది

ఒక చిన్న పురాణ కథను తీసుకుని సజీవ పాత్ర చిత్రణతో రస నిర్భరంగా ఎట్లా రచించ వచ్చునో పెద్దన వ్రాసి చూపించాడు అయితే కథకు ఎంతవరకు న్యాయం జరిగింది ? అనేది ప్రశ్న—

ప్రవరాఖ్యుడనే తరుణాగ్ని హోత్రి శ్రోత్రియ బ్రాహ్మణుడు, పసరు వల్ల మోసపోయి హిమపర్వతం మీద చిక్కు పడ్డాడు అక్కడ వరూథిని అనే గంధర్వ కన్య ఎటలస్థపడితే తన ఊరికి త్రోవ చెప్పమని ప్రార్థించాడు ఆమె అతని చక్కదనానికి ముగ్ధురాలై తనతో ఉండమంటుంది ఆమె శృంగారవతి, అతడు వైదిక కర్మ పరతంత్రుడు ఇద్దరికీ పొసగలేదు అతని దారి అతడు చూచుకున్నాడు వరూథిని అతణ్ణి మరచిపోలేక విరాళిగొని - అంతకు ముందు తనచే తిరస్కరించబడిన ఒక గంధర్వ కుమారుడు మాయా ప్రవర రూపంతో వస్తే, అతణ్ణి నమ్మి, అతనితో కూడి స్వరోచి అనే బిడ్డను కంటుంది స్వరోచి జన్మకు కావలసిన కథ ఇంతే - తర్వాత స్వరోచి మందర ప్రాంత నివాసం, అతని వేట, మనోరమ ఆర్తనాదం, ఆమెను వెంట తరిమే రాక్షసునితో స్వరోచి యుద్ధంచేసి రక్షించడం, ఆ రాక్షసుడు శాపగ్రస్తుడైన తన మేనమామ ఇందీవరాక్షుడే అని తేలడం, అతని కూతురే మనోరమ కావడం, మనోరమతో పెండ్లి, ఆమె విచారం స్వరోచి ఆమె చెలికత్తెలను ఇద్దరినీ క్షయరోగం నుంచి తప్పించి పెండ్లాడడం రాజహంసి, చక్రవాకుల సంభాషణం, లేడి తన తోడి లేళ్లతో చేసిన ఆక్షేపణ, స్వరోచి విచారం, తర్వాత ఒకనాటి వేటలో స్వరోచి ఒక లేడిని కౌగిలించుకుంటే అది వనదేవత అయి అతనితో క్రీడించి, మనువును

కనడం, అనే బహు సన్నివేశాలతో కూడిన పెద్ద ధ తర్వాత జరుగవలసి ఉంది అంతకథను మూడాశ్వాసాలలో కుదించి వరూథినీ ప్రవరుల కథను మూడాశ్వాసాలకు పెంచుకుంటూ పోవడంవల్ల కథ సమ విభక్తాంగం కాలేదు

అంతేకా మను సంభవ కథలో శ్రద్ధాశైథిల్యంవల్ల కాబోలు - కొన్ని అనన్వితాలు ప్రవేశించాయి

సిద్ధుడు ప్రవరుని ఇంటికి కుతపకాలంలో వచ్చాడు అంటే సుమారు పగలు పంద్రెండు గంటలవేళ ప్రవరుడు అతణ్ణి 'ఇష్ట మృష్టాన్న కలన సంతుష్టు' ని చేసిన తర్వాత పరస్పర సంభాషణం పసరు పూయడం జరిగింది వెంటనే హిమ నగానికి వెళ్లాడనుకుంటే - అక్కడ ప్రవరుడు పర్వతమంతా తిరిగిచూచి ఇప్పుడు మధ్యాహ్నమైంది తక్కిన , రేపు చూడవచ్చు ననుకుంటే- ఒకే రోజున రెండు మధ్యాహ్నాలుండవు కనుక మరునాడు వెళ్ళినట్టు భావించాలి అయితే రాత్రి నిత్యకర్మానుష్ఠానంలో పాద ప్రక్షాళనం జరగ లేదా ? జరిగితే పస రుంటుందా ? ఇక్కడి సందర్భ శుద్ధి ఏమిటి ? అనే ప్రశ్నకు సరియైన సమాధానం కుదరదు

పురాణంలో ఈ బాధలేదు సిద్ధుడు వచ్చిన సమయం నిర్దిష్టంగా లేదు కనుక ఉదయం అనుకోవచ్చు ప్రవరుడు అ ణ్ణి వందన పూజలతో హృష్టుని చేసినాడు అప్పుడే తీర్థయాత్రా ప్రసంగం వచ్చింది సిద్ధుడు ప్రవరుని కుతూహలం చూచి పసరు పూశాడు ప్రవరుడు పసరు మహిమవల్ల మరు క్షణంలో హిమవంతం మీద ఉన్నాడు చూడవలసినవన్నీ చూచాడు పసరు పోయినా అగ్నిదేవుని కరుణవల్ల శీఘ్ర గమనంబు వడసి నిజ గృహంబున కరిగి నిత్యక్రియా కలాపంబులు నిర్వర్తించెను, (8-254) అతిథియైన సిద్ధుడు ప్రవరుని యోగ్యత చూచినవాడు గనక అన్యథా తలచక వేరొక చోటికి వెళ్ళి ఉండవచ్చు లేక 'నిత్యక్రియా కలాపం' లోనే అతిథి పూజ కూడా ఉన్న దనుకున్నా పురాణ క్లిష్టతలో ఆ వివరాలు లుప్తమైనాయని సరిపెట్టు కోవచ్చు

మను సంభవ కథలో స్వరోచి చరిత్రకు సరియైన ముగింపు కనబడదు

పురాణంలో మనువు పుట్టిన తర్వాత స్వరోచి హంస హంసీ సంవాదం వింటాడు హంస నేను స్వరోచివలె కామాంధుడను కాను అంటే - అదివిని

అతడు సిగ్గుపడి విరక్తుడై ముగ్గురు భార్యలతో తపస్సుచేసి ముక్తు డవుతాడు మను సంభవ కథలో స్వరోచి వనదేవతవల్ల మనువును కన్నంతవరకే కథ ఉండి - ఆపైని మనువు చేసిన విష్ణు ప్రార్థనం, విష్ణు కృపవల్ల అతడు ద్వితీయ మనుపదవిని చేపట్టి సత్పరిపాలకుడు కావడంతో కావ్యం ముగుస్తుంది పురాణంలోని స్వరోచి సమాప్తిని పెద్దనార్యుడు ఎందుకు ? మనించలేదో తెలియదు

పురాణంలో మాయా ప్రవరుని పేరు కలి మనువు పేరు ద్యుతిమంతుడు అన్వర్థములైన ఈ పేర్లు కవి ఎందుకు ఉపయోగించుకో లేదో తెలియదు

ఏది ఏమైనా - మను చరిత్ర తన అమోఘ కవితా మాధుర్యంతో, సజీవ పాత్రలతో, పాఠకుణ్ణి తలమునకలు చేసి అసలు కథను జ్ఞాపకం రానివ్వదు చదువరి ఒక స్వప్న సుందర జగత్తులో మునిగితేలి ఇంకేమీ ఆలోచించలేదు అదీ మనుచరిత్ర ఇంద్రజాలం

పురాణంలో మను సంభవ కథ ప్రవర వరూథినీ ఘట్టంతోనే ప్రారంభ మవుతుంది అయితే అది తరువాతి కథకు ప్రాతిపది అయేటంత పరిమితిలోనే సమ విభక్త మయింది

పురాణాను సారంగా మను ప్రబంధంకూడా ప్రవర కథతోనే ప్రారంభ మయింది అయితే పెద్దన్నగారి ఎదుట ప్రవర వరూధినులే కాదు విజయనగర సౌందర్య రాశులున్నారు 'గమ గమ వలచు చొక్కపు జవాదు' లున్నాయి పెనుగొండలోయ లున్నాయి 'వీటీ గంధ స్థగితేతర పరిమళా' లున్నాయి గానఘూర్ణిత భవనాలున్నాయి రేయింబవళ్ళు రసాను భూతిలో మునిగి తేలే రసికు లొక పక్క ఉంటే - నిత్యకర్మానుష్ఠానాలతో నిష్ఠావంతులైన అగ్ని సమ తేజస్కులు ఇంకొక పక్క——

ఏది నిత్యం ? ఏది సత్యం ?

ఏది కార్యం ? ఏదకార్యం ?

అని నిలదీసి ప్రశ్నించే వివేకం ఉంది దాన్ని గీటురాయిగాచేసి విమర్శించి చర్చించి తటస్థంగా ఒక అద్భుత పరిష్కారం ఇవాలి

ఈ భావ సంఘర్షణం గొప్ప కవితా వస్తువు !

హిమ వంతమనగానే ఎన్ని కథలు గాథలుజ్ఞాపకం వస్తాయి ఎన్ని సౌందర్య పరసీమలు ! ఎన్ని వర్ణనీయ దృశ్యాలు ! కవితకు ఇంతకన్న సార్థకమైన చోటెక్కడ ? రసజ్ఞుల 'జిహ్వా త్రుప్ప' దుల్ల ఎన్ని ఆమెత లివ్వవచ్చు ! ఎందరో మహా కవులు హిమనగాన్ని వర్ణించారు కాని – తనది విలక్షణంగా ఉండాలి !

ఎదురెదురుగా నిలిచిన ఆ జంట మామూలు శృంగార జాతిదికాదు ఒకరిది ప్రవృత్తి అయితే వేరొకరిది నివృత్తి రెండూ ఢీకొన్నప్పుడు ఎట్టి తేజః కణాలు లేస్తాయి ? ఏది చలిస్తుంది ? ఏది గెలుస్తుంది ? ఫలితం ఏమిటి ?

ఈ అద్భుత కవితా వస్తువుదగ్గర పెద్దన్నగారు చాలా ప్రతిభ ఖర్చుపెట్టారు అనితర సాధ్యం అనిపించారు అది మూడాశ్వాసాలయింది ఇక్కడ కవి సంయమనం పని చెయ్యలేదు

ఆ ఘట్టం మిగిల్చిన ప్రతిభతో తక్కిన మూడాశ్వాసాలూ వచ్చాయి కనుక అవి తేలిపోయినట్టు కనిపిస్తాయి కాని తేలిపోలేదు వాటి పరువం పరిమళం వాటికున్నాయి

ప్రవరుడు హిమగిరిమీద 'పురిగొను కౌతుకముతోడ' తిరుగుతున్నాడు పేరుపడ్డ పురాణ స్థలాలు దర్శన మిస్తున్నాయి

నిడుద పెన్నెటి గుంపు జడగట్ట సగరు ము
 మ్మనుమండు తపము గైకొనిన చోటు
జరఠ కచ్ఛప కులేశ్వరు వెన్నుగాన రా
 జగతికి మిన్నేఱు దిగినచోటు
పుచ్చడీక తనంబు పోఁబెట్టి గిరికన్య
 పతిగోల్వ నాయాసపడినచోటు
వలరాచరాచవా డలికాక్షుకను వెచ్చ
 గరగిన యల కనికరపు చోటు

తపసి యిల్లాండ్ర చెలువంబుఁ దలఁచి తలఁచి
మున్ను ముచ్చిచ్చును విరాళిఁ గొన్నచోటు
కనుపపులు వేల్పు బడవాలుఁ గన్నచోటు
హర్ష మునఁజూచి ప్రవరాఖ్యు డాత్మలోన —౨—౧

అల్లసానివారి కవిత్వానికి అనురూప లక్షణమైన జిగి బిగి ఇందులో పెనవైచుకొని కనిపిస్తాయి జిగి అంటే కాంతి, కాంతి కావ్యగుణాల్లో ఒకటి సుప్రసిద్ధ కథలను చమత్కారాతిశయంతో చెప్పడం ఇక్కడ జిగి, రంగుమాసి పాతబడిన ఈ కథా చిత్ర పరంపరను కలకలలాడే వర్ణసౌందర్యంతో మెరిసించడం ఇక్కడ చూడదగ్గది

ఈ పద్యంలో 6 కథలున్నాయి అవి అందరికీ తెలిసినవే అవి ఉన్నవి ఉన్నట్టు చెబితే ఏమంది! వట్టిపొడి మాటల కతలు అవుతాయి అట్లాకాక వాటి అతిశయాన్ని పట్టిచూపుతూ ఏదో కొత్తది చెబుతూన్నట్టు వింత ఒడుపుతో చెప్పడం మన దృష్టిని పట్టుకుంటుంది

భగీరథుడు తపస్సు చేసినచోటు మొదటిది ఆ తపస్సు ఎంత దీర్ఘమైనది? ఎంత కఠోరమైనది? నిడుద పెన్నెఱి గుంపు జడగట్టి పోయేటంత ఎన్నాళ్ళు చేస్తే అంత పెద్దజుట్టు జడగడుతుంది ఇంత అర్థబలం ఉన్న పదబంధం అది

రెండవది ఆకాశగంగ నేలకు దిగినచోటు అది ఎంతలోతు భూమిని కోసుకుంటూపోతే ఆది కూర్మం వెన్ను కనబడుతుంది? అంత కోసినచోటు, సౌందర్యవతి గిరికన్య, భర్తకోసం సేవచేసి శ్రమించడమా? ఎంత సిగ్గుచేటు! ఆ భర్త వెదుక్కుంటూ రాకద్దా? రాలేదు అప్పుడు 'పుచ్చడేకతనము' పోగొట్టుకుని కష్టపడింది సిగ్గుకు 'పుచ్చడేకతనము' అనే కొత్తమాట వాడి ఎంతదీప్తి తెచ్చాడు కవి!

వలరాచరాచవాడు పొగరణగి భస్మమైనాడు కాని పెద్దనగారి కనికరంవల్ల వెన్నలా కరిగి కనిపించకుండా పోయాడు ఒక క్రూరసత్యాన్ని ఎంత సుకుమారంగా చెప్పగలడు కవి!

విరహాన్ని అగ్నితో పోలుస్తారు ఆ అగ్నికే విరహం వస్తే - ముచ్చిచ్చు - 'మూడు చిచ్చు' అవుతాడు ఏమి చమత్కారం!

కను పపులు - వట్టి రెల్లుగడ్డి - దేవసేనాధిపతిని కన్నదట - వింతలలో వింతగాదూ! రెల్లుగడ్డి అనడు 'కనుపపులు' అంటాడు ఆ వింత తెలుగులో ఎంత అల్పత్వ సూచన!

ఈ సీస పద్యపు బిగి శ్రీనాథుని చలువ! తెలుగు సంస్కృత పదాల మేళవింపులో, కొత్తమాటల పోహళింపులో, సీసాన్ని బంగారం చెయ్యడం శ్రీనాథుని తనం సీసపద్య శిల్పంలో చాలమంది శ్రీనాథుని శిష్యులు పేరు చెప్పకపోయినా పెద్దన్న గారు శ్రీనాథుని ఒరవడిని కళ్ళకద్దుకున్నారు

కనుక ఆయన సీసాలు ఒకొక్కచోట శ్రీనాథుని పనితనంకన్నా మెరుగు లీనుతూ స్తిమిత సుందరంగా కనిపిస్తాయి

తర్వాతి "పసుపు నిగ్గులుదేరు" నను నిముసంబుగానక, "కులిశధారా హతి" అనే సీసాలు ఒకదాని ఎత్తుగడతో పదబంధాలతో ఇంకొకటి పోలిక - ఒకటి అపూర్వ దృశ్య దర్శనం చేయిస్తే వేరొకటి కరుణవిస్ఫూర్తి కలిగి స్తుంది మూడవది పాదాలవద్ద తెగని గుమగు సీసమై సాగిసాగి 'గానఘూర్ణిత మైన ఒక కోన' లోకి తీసుకు వెళ్ళుతుంది

ఇవి అనుకున్నా అనుకోకపోయినా శబ్దశక్తివల్ల చమత్కారాతి శయం స్ఫురిస్తుంది

పైని పేర్కొన్న నిడుదపెన్నోటి గుంపు అనే పద్యంలో ఆరుకథల కూర్పులోను కావ్యార్థ సూచనం ఇమిడి ఉన్నట్టు గోచరిస్తుంది

తపస్వి అయిన భగీరథుని నిష్ఠ ప్రవరుని సూచిస్తూ ముందుకు నడుస్తుంది

జగతికి మిన్నేరు దిగడం ప్రవరుడు లోయలోకి దిగడం అనుకోవచ్చు

గిరికన్య పుచ్ఛడీకతనం పోగొట్టుకుని పతిసేవకు క్రమించడం, వరూధిని సిగ్గువదలి శ్రోత్రియుని వరించడానికి సూచన

వలరాజు కరిగిపోవడం, ప్రవరుని నివృత్తిలో కామం ధ్వంసం కావడం - చెలువం తలచి తలచి విరాళిగొనడం ప్రవరునికోసం వరూధిని విరహాన్ని స్ఫురింప జేస్తాయి

రెల్లుగడ్డి కుమారస్వామిని కనడం, దేవవేశ్య రెండవ మనువుకు తండ్రి కాదగిన స్వరోచిని ప్రసవించడం చెబుతుంది

ఇట్టి అర్థవంతమైన పద్యం వ్రాసి కవి తన బిరుదాన్ని సార్థకం చేసుకున్నాడు అనిపిస్తుంది

పర్వత శోభ చూస్తూ ఉంటే మంచువల్ల పాదలేపం కరిగిపోయింది ప్రవరుడు బెంగపడి ఇల్లు చేరే ఉపాయం ఏ సుకృతి అయినా చెప్పాడా - అని ఒక కోనలోకి దిగాడు అది ' గంధర్వ యక్షగాన ఘూర్ణితమైనా' మున్యాశ్రమం అనుకున్నాడు

'అంతగానం మున్యాశ్రమ లక్షణమా ?' అనుకో గూడదు అసలే మనసు చెడి ఉన్నవాడు గనుక - అలా అనుకున్నాడు అచటి 'విచిత్రోదంచిత సౌభాగ్య గరిమ' కు ఆశ్చర్యపడుతూనే కాళ్ళు నడిపించినట్టూ వెళ్ళాడు అక్కడ నరవాసనకు బదులు నారీవాసన పరిగింది ముందుకు అడుగు వెయ్యగానే 'విద్యుల్లతా విగ్రహా' కనబడింది !

అక్కడి నుంచి కథ రక్తిలో పడింది

ఆ వరూథిని నలకూబరుని వంటి బ్రాహ్మణ కుమారుణ్ణి చూచింది

అక్కడ నుంచి పెద్దన్నగారి ప్రతిభ ఇంద్ర ధనువులా విప్పుకుంది

ఒకవైపు పరమ శృంగారవతి వేరొకవైపు వైదిక నిష్ఠగల ఆర్యధర్మానికి, ప్రతిరూపమైన అచ్చపు శ్రోత్రియ పుత్రుడు అతని పొలుపు, భోగ బాహ్యమని ముందే కవి చెప్పి ఉంచాడు

ఆ సన్నివేశంలోని మనస్సంచార రీతి, నర్మగర్భ సంభాషణం యుక్తి ప్రయుక్తులు రసజ్ఞులకు నిత్యపారాయణమైనవి

"తెరువెద్ది ? శుభంబు నీకగున్" అన్నాడు అమాయకుడు వనిత సెలవివాటి నవ్వి—

"ఇంతలు కన్నులుండ తెరువెవ్వ వేడెదు భూసురేంద్ర ! యే
కాంతము నందునున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించు లా
గింతయు కాక నీ వెఱుగవే మునువచ్చిన త్రోవచొప్పు ? నీ
కింత భయంబు లేకడుగ, నెల్లిదమైతిమె ? మాట లేటికిన్"

అని నర్మ గర్భంగా పలికింది - అంటే మేల మాడింది ఆ నర్మంలోని మర్మం రసికులకు తెలుసు వరూధిని వాక్చాతురికి ఈ పద్యం నికషం - ఆమె భాషలోని శృంగార పరిభాష ఇది - సాహిత్యశాస్త్రంలో భావధ్వని—

'ఇంత లేసి కళ్ళు పెట్టుకొని నువ్వు వచ్చిన త్రోవే నీకు తెలియదా? - నీకు తెలియక కాదు, నీవు చాలా గడుసువాడవు ఏకాంతంగా ఉన్న స్త్రీలను ులకరించడానికి ఇదో ఎత్తు ఇంత నిశ్చయంగావచ్చి మాటలాడడానికి ఎంత లోకువ అయినాను నేను!

అంటే - 'నీ కళ్ళ అందం నీకు తెలియదు, నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నది- ఇక్కడ ఏకాంతంలో ఉన్నాను ఒరులెవ్వరూ లేరు జంకు లేకుండా నా దగ్గరకు రావచ్చు నిన్నూ, నీ అందం చూడగానే నీ వశమైనాను'

వారిద్దరూ విహరించే లోకాలు వేరు వారు కోరే సుఖమూ వేరే ఒకరిది ఏ భౌతిక నైతిక బంధమూ అంటని స్వేచ్ఛాలోకం ఇంకొకరిది భౌమమైన నీతి ధర్మాలకు కట్టుబడ్డ మర్త్యసీమ

ఆమె దృష్టిలో సశరీర స్వర్గ సుఖము సమకొని ఉండగా 'ఇంద్రియ నిరోధమునన్ గృశుడగుట కుశలత' కాదు ఆతని మతంలో 'ఈ యర్థమెల్ల కాముకుడైన వానికి నిజము, అకాముడిది గణింపడు'

ఇంద్రియాల ఏకాగ్ర పారవశ్యమే బ్రహ్మానందం అని వరూధిని వ్యాఖ్యానమైతే - సిగ్గూ, వెగటూ, పెల్లుబికే ఒక చిరునవ్వు జవాబు ఒక ఈసడింపు పరిష్కారం 'మేలు, మేలు - త్రయీధర్మం పాపం రతి పుణ్యం మోక్షశాస్త్ర పంక్తికి నీ సంప్రదాయార్థం బాగు బాగు!'' ఈ తర్కం చాలు

"ఇట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్'' నిగ్రహమే గెలిచింది పరిగ్రహం ఓడింది ఆ రంగం మీద తెరపడింది

ఈ భావ సంఘర్షణంలో పెద్దన్నగారి మొగ్గు ఎటు? ఈ ప్రపంచపు పొలిమేరలు దాటిన వరూధిని భోగాభిరతిని కొంచెము చేయకుండా - పరమార్థాన్నే నమ్మిన బ్రాహ్మణుణ్ణి కించపరచకుండా - ఆయన వహించిన తాటస్థ్యం ఆయన పెద్దతనానికి గుర్తు

అయితే తృ ఆ లోని 'క్రూరుడై యరిగె మహీసురాధము' డని 'నభోమణి కషాయ దీధితి వహించి నాడేమో' అని చేసిన ఉత్ప్రేక్షకు అర్థం ఏమిటి ? అంటే - ఆ ఆదిత్యు కు ఆదిత్యుల (దేవజాతి) మీద ఉండే పక్షపాతం అని బోధపర్చుకోవాలి లేకపోతే ఆతని తీక్ష్ణ స్వభావానికి అది చమత్కృత వ్యాఖ్య అన్నా సరిపోతుంది అది కవి భావమే అనుకుంటే - ప్రవరుని పాత్రను ఆయన తీర్చిన తీర్పులోని నిజాయితీని శంకించవలసి వస్తుంది అది పెద్దన ఉదాత్తతకు తగినదికాదు

మార్కండేయ పురాణంలో మంచుతెర చాటున మసక మసకగా కనపడే పాత్రలు మనుచరిత్రలో రక్త మాంసాలతో కదలుతూ నిండుగా కనుపిస్తాయి

ప్రవర వరూధినులు, స్వరోచి మనోరమలు, కోపి బ్రహ్మ మిత్రుడు, పరిహాస శీలుడు పారర్షి, హంసీ చక్రవాకులు, మృగీ మృగాలు ఇత్యాదులు

బహిర్మూర్తి చిత్రణంలో ఆయన ఎంత నిపుణుడో అంతరంగ చిత్రణంలో కూడా అంత నేర్పరి వరూధిని మూర్తిని 'తతనితంబాభోగ' అనే పద్యంలో ఎంత సుందర తరంగా తీర్చాడో అంత సునిశితంగాను ఆమె మనస్సంచారాన్ని 'మును మున్ బుట్టెడు' 'తొంగలి రెప్పలన్', 'అనిమేషస్థితి' అనే పద్యాలలో వ్యాఖ్యానించారు

ఆయన ఉజ్జ్వల భావన హిమ వద్వర్ణనంలో కనపడుతుంది. ఇందీవ రాక్షుని రాక్ష సత్వంలో దర్శన మిస్తుంది తేనెటీగలు ఎండలో పైకెగిరితే వాటి నీడపడిన చోట నువ్వులు, బియ్యం కలిపినట్లు చేసిన ఉత్ప్రేక్ష సాటిలేనిది

సురరాజు, చదలేట ప్రియురాలు శచీదేవికి ఈతనేర్పే జలకేళిని ఒక్క పెద్దన్నగారే చూడగలరేమో !

ఇందీవరాక్షుడు గంధర్వరాజు శాపంవల్ల రాక్షసుడైనాడు ఒకనికి హఠాత్తుగా రాక్షసత్వంవస్తే ఎట్లా ఉంటుంది ?

'అభ్రమండిలి మోచునంధాక నూరక
పెరిగినట్లా మేను నరవరేణ్య !

అఖిల జగములు మ్రింగు నంతాకలియును
అబ్ధిలేడును జెడఁగ్రోలు నంత తృషయు
అచల చాలన చణమైన యదటుగలిగె
నసుర భావంబు ననుజెందు నవరసమున ౫-24

ఆ రాక్షసుని బీభత్స పరమావధి ఇది—

విసుమానములు గాగ వసతోడ బెనవెట్టి
నెట్టెంబుగా బ్రేవు చుట్టినాడు
బండి కందెన చాయ జై సిమాలిన మేన
మెదడు గంధపు రొంపి మెత్తినాడు ౪-73

వాసుకి అబ్ధిమధనవేళ మందరాద్రికి తరిత్రాడయినాడు ఆ రాపిడిలో ఆతనిరూపం ఇట్లా ఊహిస్తాడు

'నాలుక బంతిబ్రేలబడ, నంజునదోగి, తమాల పల్లవ
శ్రీల హసింప నుబ్బి, కనుగ్రేవల జేవురు పుక్కిలింపగా,
వాలిక మేని పిచెగయ వాడిన మాల్యమువోలె, నాదిమ
వ్యాళము దీని పగ్గమయినట్టి యవస్థ దలంతు నెప్పుడున్ ౫-50

ఒడల పీచురేగగా వాడిన పూదండవలె వ్రేలాడే ఆదిసర్పం ప్రత్యక్ష మౌతుంది గదా!

దేవాపి అనే బోగపువాడు పారర్షిని పిల్ల నడగవచ్చినపుడు చేసిన కోప పరిహాసం కవి హాస్యప్రీతిని వెల్లడిస్తుంది

'ఆహా ధన్యుడనైతి, మద్విమల వంశాచార విద్యాతపః
శ్రీహోమాదులు నేడుగా తుదిఫలించెన్, నాగవాసంబు మ
ద్గేహక్షోణిక బిడ్డ వేడుటకు నేతేఁగాంచుటన్, బ్రాహ్మ్య మిం
కోహో చాలు పొకాలి పోయెదరొ పోరో, నోటిక్రోవ్వేటికిన్"
౯-45

మను చరిత్రలోని స్వరోచి వేట, రాక్షసునితో యుద్ధం, పెండ్లి సందడి, పారర్షి కథలోని వసంత, మనోరమ చెలులతో పూలుకోసిన కైలాసం, స్వరోచి పలుబడిలోని మందరం, ప్రవరుడు తిరస్కరించి వెళ్ళిన వెంటనే

వచ్చిన సంజ ప్రియుశాసిన చక్రవాకి కన్నీరునించే వగ, అంధకార విజృంభణం, పెద్దనార్యుని వర్ణనల్లోని ఉపజ్ఞను, ఊహా చారిమను వేనోళ్ల చాటి చెప్పగలవి

ప్రకరణాను సారంగా అర్థాన్ని అలంకరించే స్వభావోక్తి, ఉత్ప్రేక్ష అర్థాంతర న్యాసం, ఈ రచనలో తరచు కనిపిస్తూ ఉంటాయి (౬-27, ౩-17, ౬-47, ౩-69)

శ్లేష ఒకటి రెండుచోట్లగాని వాడలేదు అదైనా అప్రయత్న సుందర మైనది గాని, తల పెంచుకోవలసింది కాదు

"తొలుదొల్త కమల మిత్రుని వంకరూపోట
దక్షాధ్వర ధ్వంసి అన్న గనుట
అంతరంబెద్ది యాత్మలో నరసిచూడ
రాజ! నీకును నల ధర్మరాజునకును ౩-37

ఇచట చంద్రుడికీ యమధర్మరాజుకూ బాధించడంలో ఐక్యం చూపుతూ చేసిన శ్లేష రమ్యమైనది

వికసిల్లం బ్రజ చక్రిపాలనము గావించెన్, కరవ్యాప్తిన్ కకుబంతంబుల నాక్రమించెను ౫-32 అనే పద్యంలో చూపినది శ్లేషవలె కనపడే శబ్దశక్తి మూలధ్వని ఇది ప్రకృతార్థాన్ని నిర్వహించిన మీదట అప్రకృతమైన ఒకరాజు వృత్తాంతం ధ్వనించి ధ్వనికోటిలో చేరుతుంది

ఈ విరుపులు, వసుచరిత్రాదులకు గురుత్వం వహించ దగ్గవి

"ఏలర ఈ చలంబుడిగి
యేలర! బాలరసాలమాలలీ
జాలములో, శశాంకకర
జాలములో వలవం తన క్రుపుల్
జాలుగనాల్గుజాలు, నిఁకఁ
జాలు భవంబనునంత కాకకుం
బాలయి, రాత్రి పంచశరు
బారికిఁ జిక్కితి, నీకు దక్కితిన్" ౩-93

పెద్దన పద్యవిద్య సర్వతోముఖంగా ఎరిగినవాడు, నన్నయ, శ్రీనాథుడు ఒరవడి పెట్టిన ధారాశుద్ధి పట్టుకొని తనదైన ఒక స్వీయ శైలి నిర్మించుకున్నవాడు

'పవమాన ప్లవమాన పంకజరజః పాళీ పిశంగిచ్ఛవి
భవ దభ్యర్ణ వికీర్ణ కృత్రిమ సరిత్ పాథస్తరంగాహతిం
దవ పాషాణ వితర్ది కాంచలమున న్నాళీంపత్రాతతు లు
త్సవ మొప్పన్ విహరించుచున్ సరసవాచా ప్రౌఢిమల్ మీఱగన్'
3-74

ధారా సౌష్ఠవంతో, అర్థ పుష్టితో చేతులు కలిపి నడచిన శబ్దాలంకారం, పెద్దనగారి సరస వాచా ప్రౌఢిమలో ఇది ఒక మచ్చుతునక.

సమయం చూచి విసిరిన లోకోక్తులవల్ల కవి సమయస్ఫూర్తి, లోకానుభవం, ప్రత్యక్షమై గిలిగింతలు పెడతుంది. సంస్కృతాంధ్రాలు రెండిటిలోను ఈయన విసరిన లోకోక్తులు నానుడులు కొల్లలు

అందులో కొన్ని

ద్వేష్టి గతాయు శ్చికిత్సకమ్ 5-12
దుర్బలస్య బలం రాజా 4-74
వనిత తనంత 2
క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్ 3-69
సందు సుడిమాయలుగా మగవారి కృత్యముల్ 3-82
పోరాకుండగ నేమి కాళ్ళు దెగెనే? 3 138
రవ్వకు మొదలగు ప్రాపు జవ్వన మెదిరించె 5 42
ముసలిగదా పుట్టినిల్లు ముఖ్యోష్ణతకున్ 5-47

ఈయన పదబంధాలు కొన్ని అపురూపమైనవి. 'అనార్తవంపు బువ్వు', 'మిసిమి వరసీమ', 'మిన్నులు పడ్డచోటు', 'మీనాలపై తేనెవల్', 'మృగతృష్ణా వార్ధులు', 'ముంగైముదారి వంగై'

రాయల నాటికి తెలుగులో ప్రవేశించిన అన్యభాషా శబ్దాలను స్వేచ్ఛగా వాడి తెలుగు భాష వైశాల్యాన్ని పెంచినవాడు - హౌరు ముంజి, పక్కెర, పైతాణంపు సింగిణి, పసిండి పరుంజు వంటివి అనేకం

పురాణం నుంచి సూటిగా కధ తీసుకుని - కావ్య లక్షణాలైన నగర, ఋతు, మృగయా యుద్ధ, వివాహ, సుతజన్మాది వర్ణనలతో పెంచి, అలంక రించాడు తరువాతి వారికి బాటచూపే పద్యపు సొగసులను ప్రదర్శించాడు తొలి ప్రబంధానికి సృష్టికర్తయై రాణించాడు, మహాకవి పెద్దన

మను చరిత్ర అంతా చదివి కళ్లు మూసుకుంటే - కావ్యానందమే కాకుండా ఈ సందేశం ప్రతి "ప" _ు౯

ఒక మహా సౌందర్య వాహిని పర్వతాన్ని డీకొని చలింప చేద్దా మను కుంది పర్వతం నవ్వి నిలుచుంది నది కొండను కొట్టుకొని చిద్రుపలై ఎగసి పైకొని దిగజారి పోయింది 'కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్' అని మనస్సులో మోగింది

స్వరోచి ముగ్గురిని పెండ్లాడి సుఖోపభోగాలలో ఓలలాడుతున్నాడు. హంసి మెచ్చుకుంది చక్రవాకి ఆ బహుపత్నీత్వాన్ని, వారి నిర్లజ్జను, తెగనాడి ఒక భర్తకు ఒక భార్య ఇదీ ధర్మసుఖం, నీతి సౌందర్యం, తక్కినది సుఖాభాసం, ఆత్మ వంచన, అని ఎలుగెత్తి చాటుతుంది ఇది గుండెకు తగిలేమాట

ఆడు లేళ్లు కామవ్యామోహం చూపితే మగలేడి నేను స్వరోచిని కానంటుంది ఆ తిరస్కారం స్వరోచి హృదయంలో గుచ్చుకుంటుంది

ఇక్కడ ఆడులేడి వరూధిని అయితే మగలేడి ప్రవరుడు తల్లి వ్యామోహం కొడుక్కివస్తే - తాత పరమార్థ చింతన మనువుకు వచ్చి అతడు పుణ్యపురుషుడైనాడు

జీర్ణమునీ, పాంక్షి సత్త్వమూర్తులగు ఎప్రవరులకు ఉండగూడని ముకోపంతో - ఒకడు మూర్ఖుడై హింసించాడు వేరొకడు హింస పడ్డాడు

రాయలు కోరినట్టు ఇది ఇంపైన మహాకావ్యమే కాదు కలిధ్వంసక మున్న అయి అపమార్గం నుంచి సన్మార్గానికి మరలించే ఉత్తమ రచన అనినీ తృప్తిపడతాము

తిమ్మన ముద్దుపలుకు

శ్రీకృష్ణ దేవరాయలకు అంకితమైన రెండో కావ్యం పారిజాతాప హారణం నంది (ముక్కు) తిమ్మన కవి రచన

'ప్రతివర్ష వసంతోత్సవ
కుతుకాగత సుకవి నికర గుంఫిత కావ్య
స్మృతి రోమాంచ విశంకిత
చతురాంతఃపుర వధూ ప్రసాధన రసికా !' ౧-139

ఇది ఒక ఆశ్వాసాంత పద్యం ఇది కృతిపతి సంబోధనంలో ఉంది కాని కేవల సంబోధనం కాదు

నంది తిమ్మన ఊహ సొగసు ఎంతదూరం వెళ్ళగలదో చూపే గడుసైన పద్యం

కావ్య హృదయాన్ని సన్నని మువ్వల సవ్వడిగా ధ్వనించే సత్తాగలది

ఆ రసిక రాజు చేసే ప్రతి వసంతోత్సవానికీ అన్ని దిక్కుల నుంచీ అనేక కవీశ్వరులు వస్తారు రస బంధురములైన తమ రచనలు రాజుకు వినిపిస్తారు సహృదయుడైన రాజు విని పులకితు డవుతాడు అప్పుడేకాదు ఆ కావ్య మాధుర్యం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా శరీరం రోమాంచితం అవుతూనే ఉంటుంది అది చూచి అంతఃపుర స్త్రీలు ఎవరో ప్రియురాలు జ్ఞాపకం వచ్చి ఉంటుందని అసూయ పడతారు వారిని లాలించడంలో – ఆనందపరచడంలో తృప్తిపడతాడట రాయలు !

అంటే పారిజాతంరాక - సత్య అలక, కృష్ణుని లాలన - ఎంత చక్కగా ధ్వనిస్తుందీ, ఈ పద్యంలో - ఈ సుద్దిలో, కవిది ఎంత ముద్దు పలుకు ! అనిపిస్తుంది

ఆ కృష్ణ కథలు రాయలకిష్టం ఆయన్ను కృష్ణుడనడం కవులకు ప్రీతి ఆ ప్రీతిని కావ్యంచేసి తిమ్మన, ప్రశంసలు పొందాడు (౧-17, 19) రాయలకు 'సత్యావధూ ప్రీణనం' అంత యిష్ట మన్నమాట

పారిజాతం మను వసు చరిత్రల కంటె చిన్నదైనా మంచి ప్రబంధం అని పేరుపడ్డది కాని - ప్రబంధానికి మను చరిత్ర ఒక ఒరవడి పెట్టింది అందులోని పుర చాతుర్వర్ణ్య, పుర వనితా వర్ణనాదులను తిమ్మన గుడ్డిగా అనుకరించ లేదు

తన ఉపజ్ఞ తనది, తన ఎత్తుగడ తనది

సరాసరి రుక్మిణీ కృష్ణులను రంగంమీద ప్రవేశపెట్టాడు కుతూహల ప్రదమైన నాటకం మొదలౌతుంది

ఇందులో ముఖ్య పాత్రలు నారదుడు, కృష్ణుడు, రుక్మిణి, సత్యభామ సందర్భాన్ని బట్టి ఇంద్రాదులు వచ్చినా వారికి అట్టే ప్రాధాన్యం లేదు

ఆర్వాత చెప్పదగ్గ పాత్ర పారిజాత వృక్షం నోరులేంపోయినా అది నిర్వహించిన పాత్ర మరువరానిది

సత్యభామ వృక్షమైతే, పువ్వు రుక్మిణి రుక్మిణి కృష్ణుడికి హృదయమైతే సత్య శరీరం కృష్ణ హృదయం రుక్మిణివద్ద విశ్రమిస్తే, సత్యభామ దగ్గర శరీరం సుఖిస్తుంది

ఈ కావ్యం రుక్మిణి దగ్గర పరిమళిస్తే సత్య దగ్గర వృక్షమై నిలబడు తుంది అపురూపంగా నారదుడు పొందామర పత్రంలో పొదివి తెచ్చిన పువ్వు మీద ఉండే మోజు సత్యభామ పెరటి చెట్టుగా నాటినప్పుడు సాధారణమై పోతుంది పుణ్యకవ్రతంలో బంగారు పాత్రలతో దానిపూలు వాయినా లిచ్చి నప్పుడు దానికి పెరటిచెట్టు స్థాయే మిగులుతుంది

అయితే - సత్యభామ ఇంతచేసి పొందిన లాభ మేమిటి?

తన రాజసం, స్వాభిమానం, ఇంతటిదని చెప్పడానికి - కృష్ణుని ప్రేమ పందెంలో గెలుపు నాదే అని చెప్పుకోడానికి - సవతులలో విర్రవీగడానికి -

సత్యకు, చెట్టుకంటె పువ్వు - శరీరంకంటె హృదయం - గొప్పవని తెలిసినా - ఆమె లౌకిక రాజసం ఒప్పుకోనీయదు

అది సత్యాపాత్రతీరు -

అయినా ఆమెమీద మనకు అనిష్టంరాదు

ఆ రూప గర్వానికి, వచోధాటికి ముక్కుమీద కోపానికి లోపల నవ్వు కుంటూనే ఆమె అంటే ఇష్టపడతాం చరాలున మెరిసే ఆమె పాత్ర విద్యు త్కాంతికి చకితుల మవుతాం తెలుగు వాళ్ళకు భామాకలాపం అంటే ఎంత ప్రియమో—

నారదుడు ఒక సుప్రభాతాన శుభంమల్లె - తామరాకులో చుట్టి పుష్ప రూపంలో 'కలహం' తెచ్చి కృష్ణుని నట్టింట పెట్టాడు

జగన్నాటక సూత్రధారికి ఈ జడదారి ఎత్తు తెలియదా? తెలియకపోతే ఈ నాటకానికి సూత్రధారణం ఎవరు చేస్తారు?

నారదాదులు నటులైతే కృష్ణుడు వాళ్ళ నందరినీ సూత్రబద్ధులనుచేసి ఆడించే సూత్రధారి!

పారిజాత కావ్యకల్పనలో ఈ సూచన లున్నాయి శ్లేష్ట హృదయం ఇదియేనేమో అనిపిస్తుంది

నారదుడు రావడం నటనా ప్రదర్శనానికి మిక్కిలి అనువుగా కుదిరింది

రుక్మిణికి తన ఆంతర్యం విశదమవుతుంది సత్యయెడల తనకెంత ప్రేమో బాగా నటించవచ్చు

తలుచుకుంటే ఇంద్రాదులనైనా జయించి తన ప్రేయసి కోర్కె తీర్చగల మగటిమి గలవాడనను దక్షిణ నాయకుడంటే ఇదీ ఒరవడి అని ప్రకటించవచ్చు కల్పవృక్షం మూలంగా వ్రతంపేరిట ప్రియురాలికోసం తాను అమ్ముడు పోయినట్టు బాగా అభినయించి రసికులను రంజింపజేయవచ్చు ఈ సంవిధా నంతో తిమ్మనకవి, కృష్ణునితో తాదాత్మ్యం పొందిన రాయలకు రసికత్వంలోని ఒక చమత్కృతిని స్ఫురింపజేయడం పరిమార్గం కావచ్చు

ఇదంతా రమ్యమైన కృష్ణలీలలో ఒ భాగం ఈ భోగం శ్రీరాముడికి లేదు ఆయనకు ఒకే మాట, ఒకే బాణం ఒకే భార్య! ఈ లీలల కోసమే కృష్ణావతార 'పాడస్యావం పరిష్కారం—

రుక్మిణి ఏమీ మాట్లాడలేదు స్వచ్ఛమైన పారిజాతం తలలో ముడుచుకుని మాటలాడకుండా ఊరుకుంటుంది

'సతులు పదారువేవురును సంగడిరా' కృష్ణుని పట్టపుదేవిగా, ఇందిరా ప్రతినిధిగా దర్శనమిస్తుంది వదనంలో మాత్రం కృతక వికాసం! అందులోనే ఉంది ఆమె రీవి అంతా

రుక్మిణి ఇట్లూ అనుకుంటుంది గాబోలు 'ఈ సత్య సమారంభమంతా ఈసునబుట్టిన ఆడంబరం హృదయ మాధుర్యం ఎరగని వైభవ ప్రదర్శనం' అయినా నలుగురితోపాటు మెచ్చుకోలు నవ్వు, నిజానికి సత్యకంటె రుక్మిణే మిక్కిలి గడుసు అనిపిస్తుంది

కాదామరి -

రుక్మిణి సహజంగా మహాలక్ష్మి -

సత్యభామ సపర్వత వనాకుల భూదేవి అదీ తేడా -

సంకీర్ణ మానవ మనస్తత్వంతో తీర్చిన ఈ పాత్రసృష్టి - తిమ్మన హస్త కౌశలానికి నిదర్శనం

'నారదుడు స్వర్గమునుండి ఒక పూవు తెచ్చెను కృష్ణుడు దానిని రుక్మిణి కిచ్చెను

సత్యాదేవికి కోపము వచ్చెను ఆయన పారిజాత వృక్షమునే పెకల్చెను

సత్య పుణ్యకవ్రతముచేసి దానిని కృష్ణునితోకూడ దానిమిచ్చి తదుపరి తగిన మూల్యమిచ్చి ఉభయులను స్వీకరించెను

ఈ అయిదారు వాక్యముల కథను ఎంతచేసిన ప్రబంధ మగును?

ఈ కథను హరివంశంనుంచి తీసుకుని ఉండవచ్చు, లేక హరివంశ కథా సారమునుండి - దీనిలో హృదయావర్జకమైన కావ్యసామగ్రి ఏది?

ఇదే కవిప్రజ్ఞకు పరీక్షా స్థానం—

నామ మాత్రంగా నిలిచిన ప్రతిపాత్రకు ప్రాణంపోసి కదిలించి చిత్త విభ్రమాలు చూపి కన్నుల ముందుపెట్టడం కవి పని - అంతేకాదు - అపూర్వ భావనా కలితములైన వర్ణనలతో సంభాషణ చాతురితో అలంకార సౌరభంతో రచనను ప్రదీప్తం చేసినప్పుడే కవితకు కృతార్థత - ఆ పని ఈ కావ్యంలో ఎట్లా సాగింది?

ప్రథమాశ్వాసం - పువ్వుతో ప్రారంభమై సత్య ప్రణయ కోపంతో విస్తరించి కృష్ణుని అనునయంతో, ప్రతిజ్ఞతో ముగిసింది

ద్వితీయం - మజ్జన భోజనాదులతో సాయంకాల, అంధకార, నక్షత్ర, చంద్ర స్వర్గ ప్రయాణ వర్ణనలతో నడిచింది

తృతీయం - స్వర్గంలో ఇంద్రుని స్వాగతం, పురస్త్రీల చూపులు, అదితి సందర్శనం, దశావతార వర్ణనం, వైజయంతం, నందనవన విహారం సాగి పోతాయి

చతుర్థం - పుష్పాపచయం, జలక్రీడలు, మళ్లా సాయంకాలం రాత్రి, చంద్రుడు, చుక్కలు, సూర్యోదయం ఇత్యాదులు వస్తాయి

పంచమం - పారిజాతం కోసం యుద్ధం, దిక్పాలకుల ఓటమి ఇంద్రుని శరణాగతి, కృష్ణ విజయం, కల్పవృక్షాన్ని పెరటి చెట్టుగా నాటడం, పుణ్యకవ్రతం నారదుని ఆశీర్వాదంతో పరిసమాప్తి

ప్రబంధంలో కథ నిమిత్తమాత్రమని మనకు తెలుసు అయితే అవి ఎందుకంత ప్రీతిపాత్ర మౌతున్నాయి? అంటే ముందు అందులోని పాత్రలు తమ విలక్షణమైన సాక్షాత్కారంతో పాఠకులను వశపరచుకుంటాయి

పారిజాతంలో తిమ్మనగారి కృష్ణుడు నిలువెత్తు తైలవర్ణ చిత్రంలా మన ఎదుట నిలుస్తాడు

''భోజకన్యా సరిద్రాజ హంసము సత్య
 భామాశుక కేళి పంజరంబు,
జాంబవతీ నిశాచంద్రోదయంబు కా
 ళిందీ సరోజినీందిందిరంబు,
భద్రా కలాపినీ ప్రావృడంబుదము సు
 దంతా రసాలలతా పికంబు
మిత్రవిందావనీ చైత్రాగమము, లక్ష
 ణాహార యష్టికా నాయకంబు

షోడశ సహస్ర కామినీస్తోమ ధేను
కా రిరంసా మదోత్కట వారణేంద్ర,

మనగ సౌభాగ్యంబునిధి నోలలాడుచుండెఁ
గృష్ణు డఖిలావనైక వర్తిష్ణుడగుచు'' ౫-105

ఇదీ తిమ్మన్నగారు దర్శించిన కృష్ణుని మూర్తి, ఆయన శృంగార జీవిత పరమావధి

ఇక్కడ భారత ఘోర రణరంగంలో నరునకు గీత ఉపదేశించిన పురుషోత్తముడుగాని, కురుపాండవులకు అద్వితీయ - రాయబారం నడిపిన రాజకీయ ధురంధరుడుగాని, భీష్ముడు అంతర్దృష్టితో దర్శించిన సగుణ బ్రహ్మ స్వరూపిగాని కానిపించడు

ఆయన శృంగార మూర్తిని మన కెంత ప్రియంగా చూపినా అఖిలావనైక వర్తిష్ణు డనడం మానలేదు ఆంతర భగవన్మూర్తిని మరచిపోలేదు

కృష్ణుడు మానవ సహజంగా——

'మునివర ! మీ రిట కరుదేరగ నిప్పుడే కృతార్థుడ నయితిన్' అంటాడు అంతే నారదుడు

"   మర్త్యుఁ డాడెడు రీతిన్
నీ విట్లు పలుక నుచితమె - యే విశ్వజనీన చరిత !
యెఱుగనె నిన్నున్ ?'' ౧-48

అనగానే ఆయన నడిపే తరువాతి కథ అంతా భగవల్లీలగా లోకోత్తరంగా కనపడుతుంది

దానికిది పునాది——

పారిజాత పుష్పం ధరించిన రుక్మిణీదేవి రూపం చిత్రించడంలో తిమ్మన్న చేతి నేర్పు ఇది

"మగమీల నగజాలు తెగగీలు కొనువాలు
కనుగవ కొకవింత కాంతియొదవె
వల జక్కవల వెక్కు వలుదక్కువగ నిక్కు
చనుదోయి కొకవింత చాయదోచె
ఎల తుమ్మెదల దిమ్ము వెలిజిమ్ము చెలువమ్ము
గలవేణి కొకవింత నలువు మీఱె

అల చెందొవల విందు చెలువెందు వెదచిందు
మొగమున కొకవింత జిగితొలంకె

చక్కదనమున కొకవింత చక్కదనము
జవ్వనంబున కొకవింత జవ్వనంబు
విభ్రమంబున కొకవింత విభ్రమంబు
గలిగె నద్దివ్య కుసుమంబు ఎలన నలికి'' ౧-౯౬

ఈ రూప చిత్రణంలోని కాంతి అనే కావ్యగుణం ఉజ్జ్వలంగా కనపడడమే కాకుండా శబ్ద శిల్పంలో పేరు గాంచిన భూషణ కవికి గూడా దారిచూపిందా అనిపించే పద్యం ఇది పద్యంలోని అనుప్రాస కొంచెం కృత్రకమైనా – అర్థ పుష్టిని చెడగొట్టకుండా సంగీతపు ఒయ్యారాన్ని సంతరించుకుంది గొప్ప సౌందర్యం సంగీతాన్ని జ్ఞాపకంచేస్తే సంగీతం గొప్ప రూప వైభవాన్ని చూపుతుంది

'అవ్విరిం దన నెఱికొప్పు౦ జెఱవినన్ వలిగుబ్బలి
ముద్దుపట్టి లేతనెల ధరించిన ట్లమరె' ౧-౯౫

ఈ ఉపమానం తిమ్మన ముద్దుపల్కులో నుంచి వచ్చి తన్నే చూడ మన్నట్టుంది

తర్వాత స్ఫుటంగా కనుపించె పాత్ర సత్యభామ ఈమె కథానాయిక, ఆమె వెనక కవి నిలిపిన నేపథ్య దృశ్యం చూడదగ్గది

అంటె రాయలనాటి మధురాను భూతులకు ప్రతిబింబం అన్నమాట—

"తన శృంగార వనంబులో నగరి పొం
తం జక్కగాదిద్ది తీ
ర్చిన పూఁదేనియ యేటికాలువ దరిన్
చెంగల్వ పుప్పొళ్లు నిం
చిన చంద్రోపల వేదిపై సరసగో
ష్ఠిన్'' ఆసీనయై శౌరిగుణ గోష్ఠిచేస్తూ తొలి దర్శన

మిస్తుంది

ఆమె సౌందర్యారాధన, సుఖమయ జీవనాభిరుచి, పరోక్షంలో కూడా శౌరిమీద తీరని కాంక్ష, ఈ దృశ్యంలో ప్రత్యక్ష మౌతాయి

ఆ అనురాగానికి విఘాతం కలిగితే ఎంతటి సంక్షోభం చెలరేగుతుందో ఇక్కడ కవి సూచిస్తాడు

భర్త రుక్మిణికి పారిజాతం ఇచ్చాడని విన్నప్పుడే మనసు విరిగి ఉంటే - నారదుని ఎత్తిపొడుపు మాటలు కూడా తోడయితే ఇక చెప్పేదేమిటి ?

ఆమె ద్వితీయ ప్రకృతి ఇది

'అనవిని వ్రేటువడ్డ యురగాంగన కైవడి నేయివోయ భ
గ్గన దరికొన్న భీషణ హుతాశను కీలయనంగ లేచి హె
చ్చిన కనుదోయి కెంపు తన చెక్కుల కుంకుమ పత్రభంగ సం
జనిత నవీనకాంతి వెదఁజల్లగ లేచి నిలబడి'

'అమ్మతకరి వేలుపుం దపసి
మమ్ము దలంపగ నేల యచ్చటన్ ?

అనేటంత పరాకాష్ఠకు వెళ్ళింది ఆమె కోపం

'మతకరి వేలుపుందపసి' అనడం ఆమె అభిమానాన్ని, ఈసును, తిరస్కారాన్ని కుమ్మరించి నట్టుంది ఇట్లాంటిదే 'అరివేరంపుఁదపసి' అనే మాటకూడా ఈ తెలుగుమాటలు భావానుగుణంగా ఎన్నుకోవడంలోనే కవి తెలివి చరాలున మెరుస్తుంది

జగన్నాటక సూత్రధారికి సత్యభామ భావదృశ్యం అంతా మనోగమ్యమే

మాసిన చీరగట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై
వాసెనకట్టుకట్టి నిడువాలిక కస్తురిపట్టువెట్టి లో
గాసిలి చీకటింటి కడకంకటిపై జలదాంత చంద్ర రే
ఖా సదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాద వేదనన్ ౧ 99

అక్కడ 'రుక్మిణి పలిగుబ్బలిఁ ట్టి లేత నెల ధరించినట్లు' ఇక్కడ 'జలదాంత చంద్రరేఖ' - రెండూ శశికళలే - కాని ఎంత వ్యత్యాసం !

అయినా లోక సంగ్రహానికి ఏమీ ఎరగనట్టు - 'అరదము నెక్కి కేతన పటాంచల చంచలమైన తాల్మితో' కళవళపడుతూ వచ్చి 'లలితాంగి చిత్తమొక యించుక చూచెదనంచు ధూర్తగోపాలుడు తాలవృంత మొక భామిని' చేతి

నుంచి తీసుకొని 'పీచెం దద్వపుః కీలిత పంచసాయక శిఖం దరికొల్పుచు నున్న కైవడిన్'

ధూర్త గోపాలు డనడంతో ఇక్కడ కొత్తరంగం ప్రారంభ మయిందని తెలుస్తుంది

ఆమె విసరి కొడ్తుంది

'యదు నందను దర్మిలి మ్రొక్కె'

'వామ పాదంబునన్ తొలగం ద్రోచె లతాంగి' దేనిని ?

'జలజాతాసన వాసవాది సుర పూజా భాజనంబై తనర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిరము' తాపుతిన్న శిరస్సుకు అంత విశేషణం ఎందుకు ? ఆమె అలకకు కొలబద్ద అది

ఆమె ఈసుకు చరమ సీమ
చిరకాలం రసికులు చెప్పుకుని ఊరట చెందే పరమౌషధం రాయలవారికి మెత్తని మందలింపు

ఇంకా ఆమె కోపం తీరలేదు

'వల్లవీ కింకర చాలు చాలు నుడి కింపకు నింపకు లేని కూరుముల్'

" నిన్ను నమ్మినా గుట్టును దేజమున్ మిగుల
గోల్పడి పోయితి నేమి సేయుదున్" ౧-127

"నీవిట వచ్చుట పారిజాత వాసనఁ గ్రహించి నాకు
నెకసెక్కెము సేయనగాదె చెప్పుమా !"

"మాన రహితమైన బ్రతుకు మానినికేలా ?"

"నన్ను నాతోడి సవతులు నగగమున్న
వంత మఱరంగ నిన్ను మెప్పింతుగాన

అంత తియ్యని బ్రతుకుకోసం పరితపిస్తూనే - ఇంక బ్రతకనని ధ్వని - ఏమి అభిజాత్యం !

'కలకంఠ వధూకల కాకలీధ్వనిన్ మోముపయి చేల చెఱంగిడి యేడ్చె'

మబ్బు ఉరమవలసినంతా ఉరిమింది
కురవ వలసినంతా కురిసింది
ఇక చక్కని బంగారు ఎండ —
నేల చల్లబడింది

'ఓలలితేంద్ర నీలశకలోపమ
కైశికి ఇంతవంత నీ కేల
లతాంత మాత్రమున కేగలుగన్ - విను
ఆట దెచ్చెదనిచ్చెద పారిజాతమున్' ౧ 135

ఈ రమ్య సంబోధనం శ్రీకృష్ణుని తేట నిట్టూర్పులా ఉంది ఆ అంబుద శ్యాముని గర్జిత మధుర వాక్యముకు సత్యామానిని నీప లతిక అయింది

సఖులు మయూరిక లైనారు

అప్పటికి లలితేంద్ర చాప శబల వర్ణ శోభా రంజిత మయింది ఆ ప్రాంగణ మంతా—

ఆ సమయానికి అక్కడికి దిగాడు నారదమహర్షి - అతనిపని ఇంకా పూర్తికాలేదు పారిజాతంకోసం స్వర్గలోక యుద్ధం మిగిలి ఉంది

అంత మండిపడ్డ సత్య మహర్షినిచూచి చల్లబడ్డది ముందు కృష్ణుడు తర్వాత ముని పుంగవుడు భోజనశాలకు వెళ్లారు 'తటిల్లతయున్ జలదంబు యామినీ పతి వెనుకొన్న కైవడి'

ఇక్కడ నారదుని స్వస్వరూపం కనపడుతుంది అక్కడ రుక్మిణిని పొగడి పువ్విప్పించాడు ఇక్కడ సత్యను దీవించి పారిజాతం రప్పించాలి

'అటులైనను - గానిమ్మో
కుటిలాలక నీకు మగడు కోరిన కోర్కుల్
ఘటియించుగాక - తానెం
తటి కార్యంబైన డించి నాదీవెనలన్' ౨-28

'అని పలికి శౌరి గనుగొని
దనుజాంతక పోయివచ్చెదను 'మఱువకుమీ'

నను నావుడు 'గోప వధూ
జన వంచకుఁ' డనియె గార్య సంఘట నేర్చన్' ౨–27

'ఆ మతంబె వేలుపుం దపసి' భావం ఈ 'వంచకు' డెుగును 'మఱవకుమీ' అని నారదుడన్న మాటకు ఈ గోపవధూ వంచకుడు 'నరకుడు అపహరించిన కుండలాలు నా దగ్గరే ఉండిపోయాయి నేను పరాయివాడనా? నేనే వచ్చి ఇస్తానని ఇంద్రునితో చెప్పు' అని పారిజాతాపహరణానికి బీజం వేశాడు నారదుడు విదూషకుడు కాడు ఆ భగవల్లీలకు ఒక ప్రేరణం మాత్రమే—

యదుపతి స్వర్గ ప్రయాణానికి గరుడుని స్మరించాడు

"వజ్రంబునకు నీక వైచిన బలశాలి
గజ కచ్ఛపాశన ఘాతుకుండు
జనని దాస్యంబు నీగిన కుల శ్రేష్ఠుండు
దుర్లభామృత పశ్యతోహరుండు
కమలాప్తు సారథి గారాబుఁ దమ్ముండు
కశ్యపకృత పుణ్యకర్మఫలము
సకల శకుంతౌఘ సామ్రాజ్య ధౌరేయుఁ
డహి మృగయా వ్యసనాకులుండు
మింటి పాకెంబు లేర్చు ముక్కంటి తూవు
గటి నిపాలిత రోహిణ స్కంధు డనిల
మానసాతీత వేగ సంపన్నుండు
తార్క్ష్యు డేతెంచె దానవ ధ్వంసి కడకు" ౨-72

అతడు ఇంద్రుడి మీదకు వెళ్లడమంటే 'జాదలుం బ్రసాదము' అని సంతోషించాడు

ఈ గరుడుడు నిలచిన తీరే కయ్యానికి కాలుదువ్వేలా ఉంది అన్నంత పనీ జరిగింది

'నా పగ నీఁగెద నేడు నీ కృపన్' అన్నాడు

కృష్ణస్వామి ప్రియభామినితో గూడ విహగపతిని అధిష్ఠించాడు వ్యోమయానం రివ్వున ఎగసింది ఇక్కడ కథ ఆగింది

ఆశ్వాసాంతం వరకూ సురాలయం మేరు పర్వతం మీద స్వర్గధామం అ ఒకడి అద్భుత దృశ్యాలు తెరమీద చలన చిత్ర దృశ్యాలు - ఒకదానివెంట ఒకటి పరుగెత్తి పోయినట్టు కదిలిపోతాయి

శ్రీనాథుడు హరవిలాసంలో లోకోత్తర స్వర్గదృశ్యాలు ఊహించాడు ఆ జాడలో అపూర్వభావనా చిత్రాలు నిక్షేపించి - కృతార్థుడైనవాడు, తిమ్మకవి

ఈ మేరు దర్శనంలో శ్రీనాథుని సీసపు పొంకం, పెద్దన ఊహా వైభవం జోడుగూడి నడిచాయి

> "జీర్ణ పర్ణాద్రి సంకీర్ణాహి మణి విభా
> మాయా కిసలవంచ్య మానపికము
> శశికాంత రుచి మృషా సలిల సంస్నాలన
> శ్లథ ... ద్విప సైరిభంబు
>
> గారుడాశ్మచ్ఛవిచ్ఛటా కపట యవస
> పూళికా చర్వణ వ్యగ్రబాల మృగ వి
> లంబ్య మానాబ్జరాగ శిలావితాన
> కూట దావాగ్ని ఈ మరుత్కు ధరమబల!" ౨-౩౬

తిమ్మన ముద్దుపలుకుకు ఎంత ప్రసిద్ధుడైనా ఆయన విజృంభిస్తే ఎంత విదగ్ధంగా పలకగలడో ఇట్లాంటి పద్యాలు చెబుతాయి సంస్కృతపు వెన్ను బలంమీద తెలుగు కవులు ఎంతగా నిలదొక్కుకున్నారో, సంస్కృతం పోకడలను కూడా మించి ఎంత ఎత్తుకు పోగలరో ఇట్లాంటివి నిరూపిస్తాయి

తర్వాత కిన్నరులు, సిద్ధ విద్యాధరులు, యక్ష గుహ్యకాదులు కంట బడతారు వెంటనే మాయనువుతాగు అంతట వేలువుటావు తియ్యని తెలి నురుగు పాల తెలుగులో ప్రత్యక్షమవుతుంది

> 'అచ్చర పువ్వుబోండ్లు సరసామృత ధారయుఁ గల్పవాటియున్
> లచ్చియుఁ జందమామయుఁ దఱింపులమానికముం దలంపఁ బై

పెచ్చులు దీనికిన్, నెఱురు వెట్టుచు నందిని యఱ్ఱు నాకుచున్
బచ్చికఁ బండియున్నయది భామిని! వేలుపుటావుఁ జూచితే' — 96

మళ్ళా కథ కదిలినచోటు అదితి దీవనదగ్గర, వామనావతారంలో అదితి కృష్ణునకు తల్లి [illegible] కుండలాలు సంగ్రహించి కృష్ణుడు తల్లి కిప్పుడు సమర్పించాడు

"మే నిమిరి శిరసు మూర్కొని
దాసివ పరివంధి! ఎంత ధన్యవో"

అని సంతోషిస్తుంది ఆమె. అదృష్టంవల్ల [illegible] బిడ్డగా పుట్టిన భ[illegible] వంతుని అవతారాలన్నీ జ్ఞాపకం రాక [illegible]ప్పదు గదా! [illegible]ృష్ణావతారం గూడా స్మరించడం – అదితిని మించి కవి చేసినపని ఆమె దేవమూల [illegible] ఆమాత్రం భవిష్యం చెప్పడం ఉచితమే అను[illegible]న్నా – కృష్ణావ[illegible] దండకం మాత్రం కథకు గుదిబండ – అతి డెరిగిన దానినే అదితి మళ్ళా ఏ రువు పెట్టడం [illegible] కథమీద లక్ష్యం లేకపోవడమే—

కృష్ణుని వైజయంత నందన విహారాలతో ఆ శ్వాసం తు[illegible]ముట్టుతుంది
అక్కడ ప్రకృత కథ తలయెత్తింది

మలి ఆశ్వాసంలో పారిజాత దర్శనం దాని మహిమ, అందచందాలు, దోహదక్రియల చమత్కారాలు, పది పద్యాలలో నడచిన మీదట – సత్య ఎందుకీ కాలయాపన? పారిజాతం పెకలించ మంటుంది

అప్పుడే పెకలిస్తే ఏముంది? కథ కంచికే—

తర్వాత పుష్పాపచయం, జలక్రీడ, సాయంకాలం చంద్రోదయం, సూర్యోదయం, కొనసాగినమీదట గోవర్ధనం అవలీలగా ఎత్తిన చేతితో పారి జాతాన్ని పెకలించి, నందకుమారుడు గరుడుని మీద పెట్టి [illegible] మన [illegible]న్నాహంలో ఉండగా సత్యభామ చేతి సంజ్ఞతో ఆపి పైట సవరించుకొని జుట్టు ముడివేసుకొని జగడంబు డంబుతో నిలబడి అంటుంది

"సముద్రంలో పుట్టిన ఈ కల్పవృక్షం మీద పెత్తనం చెయ్యడానికి ఇంద్రాణి ఎవత? ఇంద్రు డెవడు?

ఆ వృక్షంతో కూడా పుట్టిన కమలను, కౌస్తుభాన్ని ధరించినవాడే ఈ వృక్షాన్నికూడా స్వీకరిస్తాడు

ఇదిగో - నా భర్తచేత పెకలించి నేను తీసుకొని పోతున్నాను ఇంద్రాణి వీరపత్ని అయితే - తన భర్తను పంపి ఈ సత్యా విధేయుని దగ్గర నుంచి మళ్ళా తీసుకోవచ్చు'

సత్యభామ నరకుని నాడు వింటితో యుద్ధంచేస్తే ఇప్పుడు వంటి కలహంలోకి దిగింది

ఇక్కడ శచీదేవి ప్రసక్తి ఏముంది? ఆమె నీ తగవులోనికి లాగడం ఎందుకు? అది తోడికోడంద్ర ఈసు మాత్సర్యం మగవారిని పక్కనుంచి కయ్యానికి కాలు దువ్వడం, నోటిధాటి, గరువం గల స్త్రీల లక్షణం, తొలి రంగాలలో ఖండిత నాయికగా శృంగార వీర విహారంచేసిన సత్య రెండో వైపు పట్టరాని అహంకారం ఇది సత్య అంతరంగ చిత్రణానికి ఇది పరమావధి

సముద్రంలో పుట్టిన వస్తువులను నాడే ఎవరి యోగ్యతనుబట్టి వారు పంచుకున్నారు ఆ ఒట్టడి సాగుతోంది అది ఉమ్మడి సొమ్మని ఇప్పుడు తగవు లోకి దింపడం సత్యభామకే చెల్లింది!

పారిజాతపు పువ్వులు శచికి ఇష్టం కావచ్చు ఆమె ప్రియుడు ఆమెను ఒడిలో కూర్చోబెట్టుకుని జడ సవరించి ముడవనూవచ్చు (౪-8) అంతమాత్రం చేత శచిని దుయ్యబట్టడంలో సబబున్నదా? పారిజాతం పెకలించి చెప్పకుండా తీసుకొని పోవడం చోరత్వంలోకి వస్తుందిగాని ఉదాత్త లక్షణం కాదు 'రత్న హారీతు పార్థివ' రాజు ఉత్తమ వస్తువు ఎక్కడ ఉన్నా స్వీకరిస్తాడు దానికి తిరుగు లేదు రాజ్యం వీరభోజ్యమే అని రాజ నీతిజ్ఞుల సమర్థనం ఇంద్రుడు త్రిలోకపాలకుడైతే కృష్ణుడు చతుర్దశ భువన పరిపాలకుడు కనుక ఈ అపహరణం వీరకృత్యం క్రిందే గణనీయం! ఏ నీతినైనా మనకు అనుకూలంగా సమన్వయించడంలో ఉంటుంది తెలివి

ఈ వాదంలోని సారం అదే—

యుద్ధ వర్ణనం కూడా ఒక కావ్య వస్తువే కనుక వచ్చిన అవకాశం జారవిడవకుండా - దేవతలకు కృష్ణుడికీ యుద్ధం జరుగుతుంది ఆ వర్ణనం,

ఓటమిలో చమత్కారాలూ నన్నెచోడుని జ్ఞాపకం చేస్తాయి యుద్ధంలోని ఒక చెణుకు ఇది

"చోద్య మప్పుడు భవరోగ వైద్యుడైన
యంబు జోదరు డాసిన యంతమాత్ర
అపగతాసాధ్య గదుడయ్యె యతుభర్త
నొందె గుద్రులు నిర్ముక్త శూలులైరి" ౫ 11

కుబేరుడు, ఏకాదశరుద్రులు పరాజితులైనారని ప్రస్తుతార్థం గద, శూల అనే రోగార్థక శబ్దశక్తివల్ల కృష్ణుడు వారి రోగాలు బాగా కదిల్చాడని కవి చమత్కృతి

దేవతలు ప్రయోగించిన అస్త్రాన్నీ శ్రీకృష్ణుని అవయవాదుల్లో లీనమైనాయనే ఒక సీసం (౫-30) ఆయన అఖిలాత్ముడని అందంగా చెబుతుంది

ఇంద్రుడు విసరిన వజ్రాయుధాన్ని ఉపేంద్రుడు బంతిలా అందుకొని చేతబట్టడం ఆరణకేళికి ముగింపు

"మీ మరదలు సరదాపడితే ఈ పారిజాతం తెచ్చానుగాని - నాకేమీ వ్యామోహం లేదు నీ సొత్తు నీవు పుచ్చుకో, ఇదిగో వజ్రం, ఇదిగో వృక్షం" అని చుట్టరికం కలిపి తమ్ముడు ఛలోక్తి విసరితే - ఇంద్రుడు నా సొమ్మనగా ఏమిటి? అంతా నీదే - నీవు భూలోకంలో ఉన్నంతవరకూ ఈ వృక్షమూ నీ దగ్గర ఉంటుంది" అని అన్న సమాధానం నిజంగా ఆన్నదలచుకుంటే - అన్నకా యుద్ధం ఎందుకు? పరాక్రమించి చేతబట్టిన ఈ తమ్ముని కింత ఔదార్యం ఎక్కడి నుంచి వచ్చింది? నిజంగా ఇచ్చివేస్తే సత్యభామతో కాపుర మెట్లాగు! అంతామాయ! భగవల్లీల! జరగవలసింది జరిగి పోవలసిందే—

తర్వాత యథోచితంగా పారిజాతం సత్యభామ పెరటి చెట్టవుతుంది ఆ తృప్తితో సత్య, పుణ్యకవ్రతం తలపెట్టి సవతులలో పరువు నిలబెట్టుకుంటుంది బంధువులంతా వస్తారు పాండవుల హాస్యం నారదుడు చెట్టుతోగూడా కృష్ణుని దానంగా స్వీకరించి భృత్యునిలా లిప్పితే ఆయన చిరునవ్వుతో తిరుగుతాడు ఆ పలుకు సొగసు చూడవలసిందే

"మేళ వించినవి సుమ్మీ దీని మెట్లని
మాంసలాంసమ్మున మహతిఁ జేర్చి
మిన్నేటి జలము సుమ్మీ తొలంకెడునని
డా చేత మణి కమండలు జొసంగి
ఇది జపోచితము సుమ్మీ జతనంబని
వలచేత పద్మాక్ష వలయ మిచ్చి
ఈశానుఁడిచ్చె జుమ్మీ మాకు నిదియని
శార్దూల చర్మంబుఁ జంకఁ జొనిపి

పొమ్ము పొమ్మని యొకకొంత పోవఁ బోవ
రమ్ము రమ్మని మరఁ జేరంగ బిలిచి
కపట నటనా పరుండైన కంసవైరిఁ
బరమముని వ్యాటా కు బనులు గొనియె" 1-86

ఆ పరమునకు కవి నివాళి - ఇది

"భక్త పరాధీనుఁడనంగ నవ్విభుఁడు
లో ఖ్యాతిఁ బెంపొందఁడే?"

అంతలో ఆ వాచంయమి వరుడు ఊరుకోలేదు 'చతురవాచా ప్రౌఢిన్' ప్రస్తుతించాడు

ఆ చాతుర్యం ఎట్టిదో గదా అని పాఠకులకు భ్రమ కలుగుతుంది తీరా చూస్తే అది పాదభ్రమకం

తిమ్మకవి చతురవాక్కుకోసం ఎదురుచూచే రసహృదయులకు ఆశా భంగం కలిగించే చిత్ర కవిత అది దానివెంట పుంఖాను పుంఖంగా 4 బంధ కవితలు, రెండు గర్భకవితలు వెలువడ్డాయి

ఈ బంధ కవిత్వం ఆనాడు నిర్బంధ కవిత్వంగా కొందరు కవులను పట్టుకొన్నట్టు కనిపిస్తుంది పెద్దనగారు పరిహరించిన ఈ బంధగర్భ నిర్బంధాన్ని తిమ్మన వరాహపురాణాన్నుంచి మేనమామ పోలికగా స్వీకరించాడేమో అనిపిస్తుంది ఇది రసహీనం - శబ్ద క్రీడామాత్రఫలం, అని తెలిసికూడా తిమ్మన వంటి రస వక్కవులు స్వీకరించారంటే ఏదో ప్రబలమైన కారణం ఉండి ఉండాలి రాజ సభలలో పాండిత్య ప్రదర్శనం, సాటి కవులలో విశిష్టతా

నిరూపణం ఏదైనా కావచ్చు అంతేకాని దానిని అభిమానించి మాత్రం కాదని నిదానించి చూస్తే తెలుస్తుంది

పారిజాతాపహరణం మనుచరిత్ర తర్వాత పేర్కొదగ్గ చక్కని ప్రబంధం దానివలెనే ఇదికూడా ఏ వస్తుకమైనదే కాని - ఇతివృత్త ప్రధానంగా - అన్యూనాతిరిక్తంగా వ్రాయడంమీద వారు శ్రద్ధ చూపరు సూటిగా గుత్తంగా కథ చెప్పడం ఇతిహాస పురాణాలపని, ప్రబంధ కవుల లక్ష్యం కథను ఊతగా తీసుకుని భావనా బలంతో, వర్ణన ప్రాభవంతో రచనను కవితా మయం చెయ్యడమే ఆ దృష్టితో చూస్తే కథలోని శైథిల్యంపై వారికంత పట్టింపు లేదని తోస్తుంది

పాత్ర సృష్టి సంభాషణా చాతురి, అలంకార విన్యాసం, పాఠకులను అలరించాలని వారి అభిలషితం, ఆ దృష్టితో చూస్తే పారిజాతం కృతార్థమనే చెప్పవచ్చు

తొలి ఆశ్వాసంలోని వాకోవాక్య నైపుణి సజీవ పాత్రలు, తర్వాతి వర్ణనలు తిమ్మన వితాశక్తికి నిదర్శనాలు సూర్యాస్తమయ, అంధకార, చంద్రోదయ, చంద్రికా వర్ణనల్లో అపూర్వ చారిమ కనిపిస్తుంది అనుపమ భావన పరుగులు వారుతుంది

'తనుపు వెన్నెల రసాయనము గూర్చి' చకోరపు పేరటాంద్రు పెట్టిన బువ్వపు బంతి విందు తెనుగు రసికులు ఏనాటికీ మరువరానిది దీనిని తొలుత తీర్చినవారు జక్కన, అనంతామాత్యుడు - అయినా దానికి మరింత పాకం కూర్చినవాడు తిమ్మన

ఈయన సంస్కృత పాండిత్యం ఏతన్మాత్రంకాదని చెప్పడానికి ఈయన షష్ఠ్యంతాలలో ప్రయోగించిన 'సుభగం భావుక', 'కూల ముద్రుజ', 'ఆముష్యాయ'ణాది విశిష్ట శబ్దాలు దృష్టాంతాలు

తిమ్మనార్యుడు జీవి యాత్రలో కూడ అదృష్ట వంతుడు మలయ మారుత కవికి మేనల్లుడై కవుల కోవలో ప్రసిద్ధుడైనాడు

'కృష్ణరాయ కరుణా సమాలబ్ధ చతురంత యాన మహాగ్రహార సన్మానయుతుడు'

'అఘోర శివగురు శిష్యుడైనా, శివపరాధీన మతి అయినా విష్ణు కథను ప్రియంగా స్వీకరించి నయగారంతో నిర్వహించి తన అద్వైత బుద్ధిని ప్రదర్శించినవాడు

ధూర్జటి మాధురీ మహిమ

"ఉదయ గ్రావము పానవట్ట మభిషే
కోదన ప్రవాహంబు వా
ర్ధి దరీ ధ్వాంతము ధూపధూమము జ్వల
ద్దీప ప్రభారాజి కౌ
ముది తారా నివహంబు లర్చిత సుమం
బుల్ గాఁ దమోదూర సౌ
ఖ్యదమై శీత గభస్తిబింబ శివ లిం
గం బొప్పెఁ బ్రాచీదిసన్" కాళ ౨-133

చంద్రోదయాన్ని శివలింగంగా దర్శించిన వేరొం కొ కనిపించాడు అచ్చపు భక్తునకు అంతా శివమయమే గాబోలు !

తూర్పుకొండ పానవట్టం అభిషేకించగా ఒడియలు పట్టిన నీరే సముద్రం, గుహలలో నిలిచిన చీకటే ధూపం వేసిన పొగ వెలిగే వెన్నెల, దీపకాంతి, తోచిన చుక్కలు, పూజ చేసిన పువ్వులు, ఉదయించే చంద్రుడు పూజిత శివలింగం !

ఈ దర్శనం కాళహస్తి కావ్యంలో ధూర్జటి మహాకవిది ఈ ఊహా సౌందర్యం చూసే గాబోలు కృష్ణదేవరాయలు వంటి కవితా రసజ్ఞుడు ధూర్జటి వాక్కుది 'అతులిత మాధురీ మహిమ' అన్నాడు

రాయలు రాజీలేని ఎంతటి వీర వైష్ణవుడో ధూర్జటి అంత తిరుగులేని పరమ శైవుడు - అయితే రాయలు అంతగా ఎలా మెచ్చుకున్నాడు ? అంటే - కవితా రసజ్ఞతకు - ఏ మతం అడ్డు నిలువరాదనే ఔదార్యం వారిది, అన్నమాట——

ఇది ఒక చాటు పద్యానికి చెందిన కథ - అసలు ధూర్జటి రాయల అష్ట దిగ్గజాలలో ఒకడు అనడానికి అతని గ్రంథాలలో ఆధారం లేదు

కాని - అతని మనుమల కోవలోని వాడనని చెప్పుకున్న కుమార ధూర్జటి (వెంకటార్యుడు) తన కృష్ణరాయ విజయ కావ్యంలో ధూర్జటి రాయల మన్ననల పొందినవాడని—

"స్తుత మతియైన యంధ్రకవి
ధూర్జటి పల్కుల కేల కల్గెనో
అతులిత మాధురీ మహిమ -
నా మును మీ పెదతాత చాల స
న్నుతిఁ గనెఁ గృష్ణ రాయల మ
నోజ్ఞ సభన్ (కృ.రా.వి 29)

అనే పద్యంలో స్పష్టం చేసినందువల్ల అతడు కృష్ణరాయల ఆస్థానంలో ఉన్నాడనీ, అష్ట దిగ్గజాల్లో ఒకడనీ జనశ్రుతి బలపడింది

ధూర్జటి గురించి మరికొన్ని చిత్రమైన సందేహాలు - ధూర్జటి అన్నది ఇంటిపేరా ? మనిషి పేరా ? పాకనాటి సీమలో ధూర్జటి ఇంటిపేరు గలవారున్నారు కాళహస్తి ప్రాంతంలో ధూర్జటివారి అగ్రహారం ఉన్నదట ! కనుక ఇతని ఇంటిపేరు ధూర్జటి అనీ పేరు లింగరాజనీ కొందరంటారు దీనికి ఉపబలకంగా కుమార ధూర్జటి కుమారుని పేరు లింగరాజు

అయితే ధూర్జటి తనపేరు లింగరాజని ఎక్కడా అనలేదు వాచ్యంగా ఆశ్వాసాంత గద్యల్లో 'ధూర్జటి ప్రణీతంబైన' అని తనపేరు ధూర్జటి అనే చెప్పాడు అంతేకాదు కావ్యావతారిక 8 పద్యంలో 'ధూర్జటీ ! నీ శివభక్తి కావ్య సరణిం గడు ధన్యతఁ బొంద సర్వభాషా శతధా నిగుంభన వసస్థితి నొప్పు దలిర్పఁ జెప్పుమీ' అని గురువు తనతో అన్నట్టు నిస్సంశయంగా తన పేరు విశదీకరించాడు కాబట్టి ఈ కవి పేరు ధూర్జటి అనేది నిశ్చయం ఈతని ప్రసిద్ధినిబట్టి తద్వంశస్థులు ఘనంగా అతని పేరే తమ ఇంటిపేరు చేసుకొని ఉంటారు

ఈతని సుప్రసిద్ధ రచనలు రెండు ఒకటి శ్రీకాళహస్తి మహాత్మ్యం, రెండు కాళహస్తీశ్వర శతకం

సాధారణంగా కవులు ముందు ఇష్టదైవం మీద శతకం వ్రాసి చేయి తిరిగిన తర్వాత కావ్య రచనకు ఉపక్రమిస్తారు కాని ఈయన ముందు కావ్యం

వ్రాసి, తన వయస్సుకు, మనస్సుకు పరిపాకదశ వచ్చాక శతకం వ్రాసినట్టు కనబడుతుంది

ఏమంటే ఇంద్రియ భోగాలపై విసుగు, రాజ సేవలోని అసహ్యాత శత ంలోని అగ్గలంగా కనబడుతుంది కావ్యంలో అంతగా రాజులను అసహ్యించుకున్నట్టుగాని, శృంగార సుఖాన్ని నిరసించినట్టుగానీ కనిపించదు

కాబట్టి - శ్రీకాళహస్తి మాహాత్మ్య కావ్యమే ముందటి రచన అని భావించవచ్చు

ప్రబంధ యుగంనాటి కావ్యాల్లో శృంగారం కేంద్ర బిందువుగా, కథ ఆ రసపోషణకు విధేయంగా ప్రవర్తిల్లడం మామూలు

కాళహస్తి కావ్యం మాత్రం దానికి అపవాదం శివభక్తి కేంద్రం, కథలు తదనుకూలంగా ప్రవర్తిల్లినవి

ఈ కావ్యం ఏకవస్తుకం కాదు శివ పారమ్యంలో ఆత్మార్పణం చేసిన పలువురు శివభక్తుల కథలతో కూర్చిన శివపూజా పుష్పమాల

ఈ పరమార్థం కావ్యం తొలిపద్యం చదివితేనే తెలుస్తుంది

"శ్రీ విద్యానిధియై మహామహిమచే జెన్నైన, వసిష్ఠాజ లూ
తా వాతాశన సామజా టవిక గోత్రాదేవ నత్కీర రా
జీవాక్షీయుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా
ర్యా వామాంగము, దివ్యలింగము మదీయాభీష్టముల్ సల్పెడున్"

కాళ ౧-1

ఇందులో ముఖ్యమైనవి 'లూతా, వాతాశన, సామజ కథలు వీనివల్లనే శ్రీ, కాళ, హస్తి అనే క్షేత్రనామం సార్థక మయింది శివానుగ్రహానికి పాత్రులయిన ఉత్తమ భక్తులుగా తక్కినవారు పరిగణనలోకి వస్తారు

ఇంకొక విశేషం ఏమంటే - ఈయన తనకు ముందు వచ్చిన ప్రబంధాల అచ్చుంట్టులో ఈ కావ్యాన్ని తీర్చలేదు దేవతా ప్రార్థనలు, పూర్వకవి స్తుతులు, కుకవి నిందలు, కృతికర్తృ, కృతిభర్తృ వంశ వర్ణనలు ఇత్యాది లాంఛనభారం దీనికిలేదు సూటిగా తన కృతిపతి పరమశివుని మనికిపట్టయిన కాళహస్తిపుర వర్ణనతో ప్రారంభించాడు ఆ వర్ణన అయినా అతిశయోక్తు

లతో కల్పనా ప్రాగల్భ్యంతో కాక లోకసాధారణంగా కనబడుతూ పర మార్థంలో పర్యవసన్నమై చమత్కరింపబడింది

తొండ మండలంలోని నారాయణవనపురాన్ని యాదవరాజు వీర నరసింహుడు ఏలుతున్నాడు ఒకనాడు శివుడు మిండజంగమ రూపంతో ఆ రాజు భక్తిని పరీక్షించదలచి ఆ ఊరు వచ్చాడు. త్రోవలో ఒక చక్కని వేశ్య కనబడి తన ఆతిథ్యం స్వీకరించమని శైవుల 'కన్నడ పరిభాషలో' ప్రార్థించగా దాన్ని స్వీకరించి, ఆమె తీర్థాన్నీ యౌవనాన్ని చూరగొన్నాడు ఆ పారవశ్యంలో వేశ్య రాజసేవ మరచిపోయింది రాజు పిలిపించి, ఆమె ఏమరుపాటుకు మండిపడి శిక్షగా తల గొరిగించాడు మరునాడు యథా ప్రకారం చక్కని తలకట్టుతో రాజసేవకు వెళ్ళింది రాజాశ్చర్యపడి నీకు శిక్ష జరగలేదా ? అంటే వేశ్య, తన ఇంట నున్న జంగముని దయవల్ల తనకు మళ్ళా కేశపాశం లభించిందని చెప్పింది రాజు భయభక్తులతో సపరివారంగా వెళ్ళి నమస్కరించగా, మాయా జంగముడైన పరమేశ్వరుడు రాజును అనుగ్ర హించి కాళహస్తి దేవునకు ఆలయ నిర్మాణం చేయుమని ప్రబోధించి ఆ రాజుకు కాళహస్తి మహిమకు చెందిన కొన్ని అద్భుత కథలు చెప్పడం ప్రారంభించాడు జంగముడు చెప్పడం, రాజు వినడం అనే ఏక సూత్రానికి గుచ్చిన పూలమాలగా ఈ కావ్యం ఉద్భవించింది

క్షేత్ర కావ్యాలు అర్థవాద ప్రధానంగా ఉంటాయి అంటే - ఆ క్షేత్ర ప్రభావం శ్లాఘా పూర్వకంగా వివరించడ మన్నమాట - ఆ దేవుని కృపావిశేషం వల్ల - భక్తులైన మనుష్యులే కాదు మృగ కీటకాదులు సైతం ముక్తి పొందుతాయి అని చెప్పడం వాటి పరమ ప్రయోజనం

అవి సంభవమా ? అసంభవమా ? అన్న ప్రశ్న లేదు ఆ దేవుని అనుగ్రహంవల్ల అట్లా జరగవలసిందే జరిగింది ఇది ప్రబలమైన హిందూ ధర్మ విశ్వాసం మీద ఆధారపడిన ప్రవృత్తి దీని ఊతమీద నిర్మాణం పొందినవే కాశీఖండ భీమఖండాలూ పాండురంగ మాహాత్మ్యాదులున్నూ అయితే ఆ కథా ప్రస్థానాలకు, కాళహస్తి కావ్యానికి భేదం ఉంది వాటిలో ఎంత దుష్టులూ, భ్రష్టులూ అయినా ఏ వంకనో ఆయా దైవాల కంటపడితే చాలు హఠాత్తుగా వారికి కైవల్యం వస్తుంది వారి పూర్వ పాపాలన్నీ తుడుచుకొని

పోతాయి కాని కాళహస్తి కావ్యంలోని పాత్రలు గొప్ప తపనవల్ల, త్యాగంవల్ల, ఆత్మార్పణంవల్ల భ[illegible]వ్ పాత్రములై నా[illegible]ర్యం పొందుతాయి ఇదీ ఈ కావ్యంలో ముఖ్య విశేషం

తెలుగులో ఏ గొప్ప కావ్యంలోనైనా కథా సన్నివేశాల[illegible]ంటె ఆ కథ చెప్పేతీరులోని సొగసు, ఉక్తి చాతుర్యం ప్రధానం దానినిబట్టి కాళహస్తి లోని కథలు ఒకొక్కటి ఒక్కొక్క విలక్షణ ప్రతిభతో నిర్వహి[illegible]పబడి ఒకొక్క కళాఖండంగా నిలిచి పోయాయి కావ్యం పేరెత్తితే చాలు ఆ కథలు, శిల్పం ఎదుటవచ్చి నిలుస్తాయి

ఈ కథలకు శ్రీకాళం చుట్టింది ఒక సాలెపురుగు దాని పేరే శ్రీ

కృతయుగంలో ఒక సాలెపురుగు [illegible]నలోనుంచి నిరంతరం ఉప్పతిల్లే దారాలతో శివ సన్నిధిలో అద్భుతమైన ఆకార ప్రాకారాలు నిర్మించింది

"ప్రాకా[illegible]ములు, గోపురమ్ములు, కొలువు కూ
టములు, నర్తన మందిరములు, కోశ
గేహముల్, పందిళ్లు, కేళీ నివాసంబు
[illegible]ంతః ప్రదక్షిణాయతన వీధి,
ఉపహార భోగమండపము గర్భ గృహమ్ము,
పరిణ[illegible]య హైమ వైభవ నిశాంత,
మం[illegible]ః పు[illegible]ంబు, కక్ష్యాంతర[illegible]ంబులు, జాల
క[illegible]ంబులు మేడలు, కరుణ తోడ

నిశ ముఖానల జాత చండీశ పుండ
రీక లోచన, మాతృకాలోక నయన
దక్షిణామూర్తి వటుకాది దైవతముల
నిలయముల గట్టె నత్యంత నిష్టతోడ" ౨-96

ఇది పాదాల దగ్గర తెగిపోని సీసపద్యం, ఎక్కడా ఒక్కపోగు తెగి పోకుండా చె[illegible]ది పురుగుచేసిన నిర్మాణ వైభవం స్ఫురించేలా ఉంది

ఒక శివ మంది[illegible]ంలో ఉండవల న నిర్మాణ పరంపర, పరివార దేవతలు, దాని ఆభోగం అంతా ఉంది ఎవరైనా గొప్ప శివాలయం కట్ట దలచు

కుంటే ఈ వాస్తువును అనుసరించి పోతేచాలు ప్రశస్త శివాయతనం ఏర్పడుతుంది

చెలది కట్టిన శివాలయం ప్రాతఃకాల తుషార బిందువులు పడితేచాలు ముత్యాలు సగచి ట్లుంటుంది దానిమీద సూర్యకాంతులు ప్రసరిస్తే ఆ భవన పరంపర సువర్ణ రత్న కాంతులతో వెలిగిపోతుంది

గాలికి ఆ సుతిమెత్తని దారాలు తెగిపోతూంటాయి పురుగు విసుగులేక సరిచేస్తూంటుంది

అవిరళ శివభక్తిలో శిల్ప తృప్తిలో మునిగి ఉంది చెలది ఆ తన్మ యత్వానికి ఏకాగ్రతకు శివ ప్రభువు సంతోషించ వచ్చునా? లేదు దాన్ని పరీక్షించదలచి చెంతనున్న దీపశిఖతో ఆ తంతు భవనాలను భస్మం చేశాడు చెలది కొన్నేళ్ళు కష్టపడి కట్టిన భవనాలు 'కుమ్మరి కొక ఏడు, గుదియకు ఒక పెట్టు' అన్నట్టు నిమిషంలో అదృశ్యమైనాయి

సాలెకు పట్టరాని కోపం వచ్చింది 'ఈ దీపాన్ని మింగితేగాని నా కోపం తీరదు' అని బతుకుమీద తీపి విడిచి దీపం మింగ వచ్చిన పురుగును పట్టుకొని ఆ ఆశుతోషుడు నవ్వుతూ 'నీకేం కావాలి' అంటే - 'దేవా! నిన్ను నుతింపలే నథమ బుద్ధిన్', 'లోకంబెన్నడు నెఱుగని ఆ కైవల్య మభీష్టము' అన్నది పురుగు 'శివలింగము భక్తలోలతన్ - తన తేజము లోపల నూర్ణనాభమున్ గ్రక్కునఁ జేర్చె'—

త్రేతా యుగాంతంలో ఒకపాము (కాళం) పాతాళం నుంచి వచ్చి రత్నాలతో ఆ ఈశ్వరుణ్ణి పూజించి వెళ్లేది ద్వాపరం ప్రారంభ మయింది ఒక అడవి యేనుగు శివుని మీద ఉన్న ఆ రత్నాలను, రాళ్ళు రప్పలు అనుకొని వాటిని తొలగద్రోసి తుండంతో ఏటినీరు తెచ్చి అభిషేకించి కలువలు, కమలాలు మారేడు దళాలతో పూజించేది

పాముకు ఆ పత్రీ, పువ్వులూ అంటే మంట - ఏనుగుకు రత్నాలంటే చెప్పలేని చిరాకు

ఒకరు పూర్వ పూజ తుడిచివేస్తే ఇంకొకరు ఉత్తర పూజను ఊడ్చి వేసేవారు ఘర్షణ ప్రారంభం అయింది ఎవరికీ మనశ్శాంతి లేదు విరోధిని సాధిద్దామని ఇద్దరికీ ఎడతెగని తపన - ఒకరివేళ, ఇంకొకరి అవేళ. ఇద్దరూ

అఖండ శివభక్తులే - కాని పూజా విధానంలోనే చెప్పలేని వైరం వాటి అంతర్వేదన అణచరాని ఆగ్రహం కలిగి గొప్ప కావ్యవస్తువయింది ఆ వస్తు చిత్రణంలో ధూర్జటి ప్రజ్ఞ అవిస్మరణీయం అయింది

పాము చేసిన రత్నపూజ వృధా అయినందుకు శివునిమీదనే ఆగ్రహించింది ఆ చనవు ఎంతటిదో - ఈశ్వరుణ్ణే 'దుర్మదు' డనడానికి వెనుదీయదు బిడ్డకు తండ్రివద్దనున్న బిరుసు !

'అహహా ! పగవానిని గూడె దైవమున్' అని విసుక్కొని ఈశ్వరుణ్ణి ఇట్లా నిగ్గదీస్తుంది

"కంటక మెట్లు నాక సుముఖత్వము నొందితివయ్య ! పార్వతీ
కంటకితాంగ బాహులతికాయుగ సంగతిఁబోలె, దుఃఖ కృత్
కంటక బిల్వికా విమలకాండము లెత్తిన మోచి మోచి ము
క్కంటి యెఱుంగవే ? నొసటి కంటి మహత్త్వము నీకుఁగల్గుటన్
౨-117

తర్వాత ఏనుగు - 'నాతోఁ జనంబో - నేడే 'శిల' విశ్వనాయకుని పైఁ బొందించి నా డెవ్వడో ?' అని ఆశ్చర్యపడి ఈశ్వరుణ్ణే అడుగుతుంది 'శిలలకు పూలకు తేడాయే తెలియదా ? నీకు తండ్రీ - లేక శిలలమీద మనసు తీరలేదా ?

"అచ్చపు నీలవర్ణ దృషదావళి నల్లని కల్వలే ? కడుం
బచ్చనిరాలు బిల్వవన పత్రములే ? యగణ్యాశ్మ భంగముల్
విచ్చిన యెఱ్ఱదామరలె ? విశ్వపతీ ! విసోపలంబు లె
ట్లచ్చుదలయ్యె నీకు ? నయందునె ? యంత మృదుత్వ శైత్యముల్"
౨ 121

"ఉనికి శిలోచ్చయంబు నిజయోష శిలోచ్చయరాజపుత్రి, నీ
ధనువు శిలోచ్చయంబు, పురదాహ ! రథీకృత రత్నగర్భ ! నీ
మనమున కీ శిలాశకల మండల మెట్లు ప్రియంబుసేసె ? నే
మన గలవాఁడ నిన్ను ? ప్రతహాని యొనర్చు దురాత్ముఁడుండగన్"
౨-122

తుదకు తెగించి 'వాఁడా నేనా నొకజాడం బోయెదను లేదా జీవ మింకేటికిన్' అని నిశ్చయించుకుంది

పాముదీ అదే నిర్ణయం పగ పరమావధికి వెళ్ళింది కాళం ఆరోజు పూజ చెయ్యలేదు ఏనుగు పూజించిన నిర్మాల్యంలో దాగి కూర్చుంది తన పూజ నిలిచినందుకు హస్తి సంతోషించి యథాపూర్వంగా పూజా ద్రవ్యాలతో వచ్చి నిర్మాల్యం తుడవబోయింది పాము ఏనుగు ముక్కుగ్రోళ్లలో ఎక్కి తలలో కలవరం లేవదీ ంది ఏనుగు వేదన వర్ణనాతీతం - ఆ బాధను కనుగొన్న కవి అంతశ్చక్షువు నిరుపమానం—

"మొగలేటి మడుగున మునిగి తుండమ్మున
నుదక మాకర్షించి యూదియూది
కడు గపాలము దాకి ఎలగంగఁ జక్కగాఁ
జేసాచి జిట్టునఁ జీది చీది
ఇలమీద తలవాక నీప్రక్క నాప్రక్క
బెడమర్లుగా బొడపెట్టి పెట్టి
యుడివోని వేదన నున్నచో నుండక
పనిలేని పరువులు పాఱి పాఱి

పెద్దమ్రాకులతో కుంభ పీఠయుగము
దోము కొనుచును వెట్టులు దూఱితూఱి
పాము చేసిన దుఃఖంబు సామజంబు
తీర్చుకొను వెఱవెఱుగక ధీరబుద్ధి" ౨-148

"ఏనా చచ్చుట తప్ప దిప్పుడు సమాధీ శోప ంరంబునన్
దానుంజావక చంప నోప దురగేంద్రం, బెక్కుడీ దుఃఖమే
లా నాకున్ ? సరి చంపి చచ్చుట జనాహ్లాదంబుగాదా ! యవా
చీన స్థాణు నగంబె వధ్యశిలగా సేవింతుగా కింతటన్" ౨-149

హస్తి వైరిని చంపి చావదలుచుకుంది ఈ దక్షిణ శైలమే వధ్యశిల కావాలి తొండం చుట్టి పట్టుకుని ఆ కొండను ఢీకొన్నది కుంభస్థలం ముక్క చెక్కలయింది పాము ఏనుగు తలలో చిదికి పోయింది హస్తి రక్తపు మడుగులో ఒరిగి పోయింది ఆ మరణం దక్షిణ కైలాసంవద్ద సువర్ణముఖీ తీరంలో జరగడంవల్ల కాళమూ, హస్తీ కూడా రుద్రగణరూపం స్వీకరించాయి ప్రభువు సపరివారంగా దర్శనమిచ్చి 'దాయం విల్చుక వారి

నిద్దఱ తన సర్వ వ్యాప జ్యోతిలో సాయుజ్యం బొనగూర్చె' 'అది మొదలుగ చంద్రాలంకారుఁడు జగతీ పాలక శ్రీకాళహస్తి పతి యని బరగెన్' అని మిండజంగము యాదవ రాజుతో శ్రీకాళహస్తి క్షేత్రనామం ఎట్లా సార్థక మయిందో వివరించాడు

గుడి గోపురాలు నిర్మిస్తే చాలదు ఆ గుడిలోని దైవానికి ఆత్మార్పణం చేసిననాడే మోక్షం - అని చెలది కథ బోధిస్తే - ఇద్దరూ దైవభక్తులైనా నా మతం దొడ్డది నా పూజ గొప్పది' అని అహంకరించే పాషండులకు ముక్తి లేదు భేద బుద్ధి విడిచి అభేదం సాధిస్తేనే సాయుజ్యం - అని రెండవ కథ ప్రబోధిస్తుంది

పై మూడింటి కైవల్య ప్రాప్తిం పూర్వజన్మ కథ తోడయింది విశ్వకర్మ పుత్రుడు ఊర్ణనాభుడు సృష్టికి ప్రతి సృష్టి చేస్తూ ఉంటే బ్రహ్మ సాలె పురుగువు కమ్మని శపించడం తదుపరి అనుగ్రహించి గిరణ్యంలో శివుని కృపవల్ల శాపావసానం కలుగుతుందని నిర్దేశించడం జరిగింది,

సర్వ సర్పాలూ శివసేవకు వస్తే కాళుడనే నాగుడు భార్యా వ్యామోహంలోపడి రాలేకపోయాడు ఆ శివాపరాధంవల్ల కాళుడు కైలాసానికి దూరమై శాపగ్రస్తుడై పాతాళంలోపడి ఉండి తుదకు దక్షిణ కైలాసక్షేత్రంలో శివుని రత్నాలతో పూజించి గజ విరోధంలో మృతుడై శివ సాయుజ్యం పొందాడు

హస్తి అనే ప్రమథుడు గర్వితుడై శివ పార్వతుల ఏకాంతానికి భంగం కలిగించగా పార్వతి మదహస్తి కమ్మని శపించింది తర్వాత కరుణించి దక్షిణ శివుని దర్శనంవల్ల శాప విముక్తి కలుగుతుందని అనుగ్రహించింది

కాళహస్తి శివలింగం విలక్షణ మయింది ఇప్పటికీ ఆ మూడింటి ఆకృతులూ ఘనాకృతిలో ఉన్న ఆ శివలింగం మీద ముద్రితములై కనిపిస్తాయి ధూర్జటి, ఆ శివలింగం నిత్య దర్శనంవల్ల ఉత్తేజం పొంది వాటి కథను అపూర్వంగా చిత్రించాడు

ఈ కావ్యంలో శివపారమ్యం చెప్పే ఇంకో చిత్రకథ - కన్నప్పది - 130 పద్యాలకు విస్తరించి ఉంది ఇందులో వైదిక అవైదిక శివ పూజల సంఘర్షణం ప్రధాన వస్తువు

"విల్లొక చంక, సంపపొది వీఁపున దొప్పలు కేలుదోయి పు
క్కిళ్లఁ బవిత్ర కాంచన ముఖీ జలమొప్పగ వచ్చి భక్తి రా
జిల్లఁ దదంబు మజ్జనము సేయుచు దొప్పల నంజు డద్రిరా
జల్లుని నారగింపు మన నా పరమేశ్వరుఁ డూరకుండినన్' 3-87

అత డొక బోయరాజు కొడుకు

"ఈ లింగములో ప్రాణముఁ
గాలము గడదాఁక నొడగట్టిన దూలం
బై లంకె నుండఁ జేసితి"

అని అడవిలో శివుని చూచిన క్షణం నుంచీ తన ప్రాణాన్ని శివునితో లంకెవేసి ఆ శివ సన్నిధిని పడిఉన్నాడు

ఆతని బొమ్మ అది

చంకలో విల్లు! వీపుమీద అమ్ముల పొది, చేతిలో నైవేద్యానికి తెచ్చిన మాంసపు దొప్పలు, పుక్కిటిలో శివాభిషేకానికి కొనివచ్చిన పవిత్ర సువర్ణ ముఖీ నదీ జలాలు ఇది అతని శివపూజాక్రమం

ఈ వామాచారానికి ఒకంతట మనస్సు ఒప్పుకోదు కాని - అతని అఖండ భక్తిని ఆచార్య శంకరులే - 'వనచరో భక్తావతంసాయతే' అని ప్రశంసించకుండా ఉండలేక పోయారు

ఎట్టి అనాచారమైనా - భక్తి ప్రపూతమైతే శైవుల దృష్టిలో అది పరిపూతమే వారు దాన్ని తప్పుబట్టరు అనన్య శివభక్తే వారి ఏకైక దీక్ష ఎన్నో వీరశైవ గథలు దీన్ని రుజువు చేస్తాయి

అట్టి పరమ శైవుడు కన్నప్ప - అయితే అసలు పేరు అదికాదు తండ్రి పెట్టిన పేరు తిన్నడు అతడు తన శివుని కంటి వ్యాధికి నిశ్చింతగా తన కన్ను ఊడదీసి పెట్టినందువల్ల అతని కా పేరు స్థిరపడింది ఆ కన్ను అర్పించుకోవడానికి కారణం - ఇంకొక వైపున ఉంది ఆ వైపున ఒక బ్రాహ్మణ శివ భక్తుడు, వైదిక పూజా ధురంధరుడు - ఆ శివ సన్నిధిని రోతలు చూచి క్రక్కదలిపోయాడు

"కుల దైవంబని యర్కి పూసి గుడి ముగ్గుల్ వెట్టి కైసేయ లో
పలి కిల్లెంగిలి మంగళంబులగు దొప్పల్ రాగతంబేమి ? ని
ర్మలతోయ స్నపనం బొనర్చిన శరీరం బేటికి స్నీరు వ
ట్టులు గట్టెన్ ? భవదాత్మ శుద్ధికిది, గూడుంగా ? మహాహేయముల్"

"దేవా ! ఈ కుసుమాలము
దేవెడు కేల్దోయి నీదు దేహంబంటం
గా వెఱవయ్యెడు, నెంగిలి
కీ వెల్లోగ్గితివి ? పార్వతీశ్వర చెపుమా ?" 97

అని మడిగట్టుకు వచ్చిన 'బ్రాహ్మడు' నొచ్చుకుంటూ అడిగాడు శివుడు మాటాడడు విప్రునికి మరీ కోపం వచ్చింది ఔనులే - నీ భక్త పక్షపాతం మరీ విడ్డూరం - ఎంత నీచానికైనా ఒడంబడతావు !

"ప్రాణులు మీదఁ గప్పిన కృపామతి నోర్చితి, నీచుపొత్తునన్
బ్రాంతి మెయిన్ మెసంగితివి భక్తుడు కుంచెను బంపబోతి, మై
పూత యొనర్చు కొంటి శవభూతి గపాలమునన్ భుజించి తీ
రోతలు పెక్కులుండ నివి రోయుదువే ? యిక భక్తవత్సలా !"
-100

అంత కోపాన్నీ 'భక్తవత్సలా !' అనేమాట మింగివేస్తుంది

"నాకా పాపాత్ముని బెప్పినన్ బదిలతుల్
లేకున్న విడతుఁ బ్రాణము నీకై కూడుగ్గబట్టి "

అని భీష్మించుకు కూర్చుంటాడు

ఆ ప్రభువుకు అలని మీదా దయే !

ఏది ఆచారం ? ఏదనాచారం ? ఏది జ్ఞానం ? ఏదజ్ఞానం ? ఆయన సర్వాతీతుడు, తన మీద అనన్య భక్తే ముక్తిమార్గం - అన్యమంతా ఆడంబరమే విడంబనమే

పరమేశ్వరుడు ఆదరంగా చేరదీసి అంటాడు 'ఎందుకు కష్టపడతావు చెంచొకడు 'శ్రుతి వ్యవహారేతరంగా నన్ను సేవిస్తున్నాడు అతని భక్తికి

లొంగిపోయాను ఇక్కడ ఒదిగి కూర్చో, ఆ భక్తి నీవూ చూతువుగాని - అన్నాడు

చెంచు వచ్చాడు చెప్పుకాలితో నిర్మాల్యం తుడిచాడు నోటి యేటి నీటితో అభిషేకించాడు ఎత్తిరి ఉంచాడు పంది మాంసం ముక్కలు నైవేద్యం పెట్టాడు

శంకరుని కంటివెంట ధారగా నీరు బోయడం తెలిసిపోయింది కంటి నొప్పివల్ల కలుకుట్లు తినడు చెప్పలేనన్ని వైద్యాలు చేశాడు 'పెల్లి గలిపిన చింతపండు' లా వ్యర్థమయాయి

ఏమిటి కర్తవ్యం? కంటికి కన్నే మందు అని నిశ్చయించి చురుకు ఒం బాణం లాగి తన కన్ను పెకల్చి శివుని కంటికి అమర్చాడు అమరింది రెండవ కంటి నుంచి నీరు మందున్నదిగా అని సంతోషంతో తన చెప్పు కాలితో ఈశ్వరుని కన్ను గుర్తుగా పెట్టుకొని రెండవ కన్ను పెకలించడానికి సిద్ధ మయ్యాడు శివుడు ప్రత్యక్షమై ఆపి విప్రునితో అంటాడు

"శివగోచరం! ఈ శివభక్తుని
అవిరళతర భక్తి మహిమ యాద్యంతము కం
టివి గద! సద్భక్తుండిత
డవుఁగద! నీ మనసు వచ్చునా? యికననుచున్" 3 121

బ్రాహ్మణుడికి అప్పుడు నిజమైన జ్ఞాన దర్శనం అయింది

"ఇతఁడు కిరాతుం డేదు
రశ్మతి, మమ్మడిగియె మహేశ! మన్నించి ప్రస
న్నతఁ జూపితిరి!" 3-125

అని సాష్టాంగపడి 'మీ తలపునన్న నధికమె? మా తలపు'- అని ధ్యాన మగ్నుడు కాగా 'ప్రపంచ బుద్ధి మగుడన్ వర్తింపగా నీక వారి నంతంబగు నాత్మ రూపమున గూర్చెం దీర్చె బంధంబులన్' 3-128

అమృతంవలె పెల్లుబికే భక్తిధార లేకపోతే ఇక్క పండిత్యాలూ, తపస్సులూ ముక్తి నివ్వలేవు లోక విడంబనానికి మాత్రమే పనికివస్తాయి ఆ భక్తే ఉంటే ఎంతటి అజ్ఞానికైనా, అధమునికైనా కైవల్యం కరతలా

మలకం అని శైవ వైష్ణవ నిష్ణాతుల విశ్వాసం ఆ పరమ సత్యాన్నే ధూర్జటి నమ్మాడు ఈ కథలో పరమ రమణీయంగా చిత్రించాడు కులక్షయానికి కారకుడైన అర్జునుడు ఆ జన్మలో ముక్తుడుకాక తిన్నడై ముక్తి సాధించాడని పూర్వకథ—

అయితే - బసవ పురాణంలోని కన్నప్ప కథకు కాళహస్తి గాధ - కొంచెం భిన్నం అతడు శివునకు రెండు కన్ను లివ్వగా నాలుగైనవనీ, శివుడు తిన్న మాంస ఖండాలు రాక్షసులు మృగరూపము లెత్తగా వాటివనీ అందులో కనబడుతుంది అట్లాగే ఏనుగును చంపినది చెలదికాని పాము కాదు

ధూర్జటి ఈ కథలను బసవపురాణం నుంచికాక ఏదో స్థల పురాణం నుంచీ జన పరంపరనుంచీ గ్రహించి ఉండాలి

నత్కీరుని కధగూడా అట్టి స్థల పురాణంనుంచో దంత కథలనుంచో స్వీకరించినట్లు గోచరిస్తుంది

నత్కీరుడనే ద్రవిడకవి శివకోపానికి అగ్గమై కుష్ఠరోగం తెచ్చుకొని, దక్షిణ కైలాసదర్శనంవల్ల శుద్ధుడై రోగ విముక్తుడైనాడని కాళహస్తి మహిమ ఉగ్గడించడం జరిగింది ఇందులో ఆ కథ చెప్పినతీరూ, సంఘటనలూ ఎంత రమ్యంగా ఉన్నా - ఆ గాధ తర్కబద్ధంకాక చాలా సంశయాలకు చోటిస్తుంది

మధురాపుర రాజుకు అగస్త్యమహర్షి అష్టాదశాక్షర మాతృకవ్రాసి ఒక శంఖఫలకం ఇచ్చి ఇది ద్రావిడ కవితకు ఆధారపీఠం దీనిమీద మహాకవు లెందరైనా కూర్చోవచ్చు ఒకడైతే అతనికే చోటు వంశ పరంపరగా దీనిని ఆరాధించండని చెప్పాడు దానిమీద నత్కీరాది వులు ఆసీనులై ఉండేవారు

అయితే - శంఖ ఫలకం అంటే అర్థం తెలియలేదు వ్యాఖ్యాతలు ఆ మాటను వివరించకుండా దాటి ఉన్నదానికే ఏదో ముడిపెట్టి అర్థం చెప్పారు

ద్రావిడ సంప్రదాయవేత్తలు దానికి సమ్మతించ లేదు శంఖంతో ఫలకం అసంభవం అది సంఘ ఫలకం గాని శంఖ ఫలకం కాదు ఆదిలో ద్రావిడ సాహిత్య సంప్రదాయ పరిరక్షణకు సంఘా లుండేవి ఆ సంఘం వారు కూర్చునే ఫలకం అది మధు రాజువద్ద ఉండేది అట్టిలల తొలి తెలుగు

కవి నన్నయకూడా అట్టి తెలుగు పండిత సంఘానికే 'పరమ వివేక సౌరభ' అనే పద్యంలో నతు లర్పించాడు

రెండవ అనన్వితం ఇది దుర్భరమైన కరువు వస్తే శివుడు తన పూజారికి ఒక పద్యం రాసిచ్చి రాజు గొప్పకవుల కిచ్చే బహుమానం పుచ్చుకుని అవసరం తీర్చుకో, అని చెప్పి పంపాడు పూజారి రాజ సభకువచ్చి పద్యం చదివాడు నత్కీరుడు ఇది తప్పు అన్నాడు ఆ పద్యం 'అలివజాసలో శృంగార రసా పద్యంబు' గా ఉన్నదట పద్యార్థమేమో తెలియదు

అందులో 'సింధుర రాజగమనా ధమ్మిల్ల బంధంబు సహజ గంధంబు' అని ప్రతిపాదింప బడింది

ఆ పద్యం విని నత్కీరుడు 'వేనలికి సహజగంధం ఉన్నదంటే విజ్ఞులు నవ్వుతారు ఇది లోక విరుద్ధం అని ఆక్షేపించాడు శివ బ్రాహ్మణుడు సమాధానం చెప్పలేక చిన్న బుచ్చుకొని - శివుడి దగ్గరకెళ్ళి 'పద్యంవల్ల మాడలు రాలేదుగాని, మానం పోయింది' అని వాపోయాడు

శివునకు జాలివేసింది 'పద ఆ రాజ సభకు వెళ్ళి ఆ తప్పేమో తెలుసు కుంటాను' అని ఓదార్చి శివుడు రాజ సభకు వచ్చి 'ఈ రాజపుంగవుడి మీద నేను కవిత చెబితే నత్కీరుడు తప్పు పట్టాడట - ఏదీ చెప్పండి చూస్తాను అలంకారమా? లక్షణమా? పదబంధమా? ఏది తప్పు' అని గద్దించి అడుగగా - నత్కీరుడు ఏమీ చలించక - ఔను ఇందులో లోకవిరుద్ధ మనే కావ్యదోషం ఉంది పుష్ప తైలాదులవల్లగాని కేశబంధం పరిమళించదు అని పూర్వా క్షేపమే మళ్ళా చేశాడు - శివుడు 'పార్వతీ కేశపాశం సహజగంధంతో ఉంటుంది' అంటే నత్కీరుడు దేవికి ఉంటే ఉండవచ్చు 'ఇలలోని మగువలకు' ఉండదు అని నిగ్గదీసి [illegible]

ఫాలాక్షునకు కోపంవచ్చి తన మూడో కన్ను చూపించాడు దానికి నత్కీరుడు లొంగలేదు 'నుదుటనే కాదు, ఒళ్ళంతా కళ్ళున్నా' ఈ పద్యం తప్పే అని నిరాకరించాడు

శివునకు పట్టరాని కోపం వచ్చింది అలసీ తిరస్కార వచనాలకు బదులుగా - నీకు కుష్ఠువ్యాధి వస్తుంది దానితో పడరాని పాట్లు పడుదువుగాక'

అని శపించాడు నత్కీరుడు పశ్చాత్తాపం చెంది ఆయన పాదాల మీద పడితే కరుణించి ఆయన, కైలాసం దర్శిస్తే ఈ రోగం శాంతిస్తుందని అనుగ్రహించాడు నత్కీరుడు పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి తుదకు కుమారస్వామి ఉపదేశం వల్ల కాళహస్తి దర్శనం చేసి రోగ విముక్తుడై ఆ టవంలో శివునిమీద ఒక శతకం చెప్పి తరించాడు

ఈ కథ అంతా సవిమర్శంగా చూస్తే నత్కీరుని మీద శివుడంత కోపపడి శపించ వలసిన అవసర మేమో తెలియదు

అరవ పద్యపు పూర్తిభావం ఈ కావ్యంలో లేదు అది రాజుగారి ప్రియురాలి వర్ణన మని కొందరు భావించారు అయితే ఆమె మనుష్యకాంత, జుట్టు పరిమళించే వీలులేదు ఇది లోక విరుద్ధమూ కవి సంప్రదాయ విరుద్ధమూ కూడా కనుక నత్కీరుని ఆక్షేపం సమంజసం పార్వతి శిరోజాల సుగంధం అందరికీ ఉంటుందని వర్ణించడం విమర్శకు నిలవదు

శివుడు రాజసభకు వచ్చా డన్నారు అయితే ఏ రూపంతో? శివ స్వరూపంచూస్తే శివ భక్తుడైన కవి వాదించడు మారువేషం అయి ఉండాలి ఆ మారు వేషగాడు చూపిన మూడోకన్నుగూడా ఏదో గారడీ అని భావించాడు గాని నిజమైనదిగా అనుకోలేదు కనుకనే 'ఈ మాయా విలసనములు పనికిరావు' అని తెగనాడాడు నిజంగా ఫాలాక్షుమే అయితే మన్మథ కథలా ఆ సభ భస్మం కావాలి అట్లా జరగలేదు శివుడు శపించేదాకా ఆయన సత్య శివుడని తెలియదు తెలిసి పాదాక్రాంతుడైనాడు ఇందులో నత్కీరుని తప్పేమీ లేనప్పుడు శివుని శాపం న్యాయ్యం కాదు

అంతేకాదు - మధుర నుంచి తీర్థయాత్రలకు బయలుదేరి 'విక్రమ సింహపురాసన్న' యగు పెన్నను దాటినవాడు అక్కడకు అనతి దూరంలో ఉన్న కాళహస్తి క్షేత్రానికి వెళ్ళక ఎంతోదూరం ముందుకువెళ్లి కుమారో పదేశంవల్లగాని కాళహస్తిని దర్శించక పోవడం కూడా సంగతంగా కనపడదు ఉత్తర కైలాస బుద్ధితో ముందుకు వెళ్ళా డనుకున్నా త్రోవలోనే ఉన్న శివక్షేత్రాన్ని సహజ భక్తి భావనతో నైనా దర్శించి పోవచ్చుగదా!

ధూర్జటి ఏ స్థల పురాణ కథనో ఆధారంగా తీసుకొని కాళహస్తి దక్షిణ కైలాసమని, దాని దర్శనంవల్ల కుష్ఠాది ఘోర వ్యాధులు కూడా తిరోహితం

అవుతాయని వర్ణించడమే పరమావధిగా పెట్టుకున్నట్టు కనబడుతుంది గాని కథలోని సామంజస్యాన్ని సవిమర్శంగా చూచినట్టు కనబడదు

స్కాంద పురాణ కథలోవలె ఇందలి నక్కీరుడు కుటిలతార్కికుడుగా, అసూయా పరుడుగా వర్ణితుడు కాలేదు

మధుర రాజు కొలువులోని నక్కీరాదులు ఉత్తమ పండితులు, మధుర కవులు——

'నక్కీరాది కవీంద్రులన్ దివిషదన్నప్రాయ వాగ్గుంభ సం
పత్కావ్య ప్రతిపాదక ప్రతిభులన్ బన్నిద్దరన్ శైవ సం
విత్కాసార మరాళరత్నములఁ దద్విద్యా సాపేక్ష భూ
భృత్కంఠీరవుఁడుంచె సంపదలఁ దృప్తిం బొందగాఁ జేయుచున్'
3-145

నక్కీరుడు కాళహస్తీశ్వరుని చూచి 'సంస్తుతి నూఱు పద్యములఁ జేసెన్ ద్రావిడోక్తిన్ దగన్' 3 216

ఏమ వృత్తిని విడిచి శివైక చిత్తలైన వేశ్యాకుమారికలు కాళహస్తికి వెళ్ళినప్పుడు చదివిన స్తోత్రములు ఈ ద్రవిళ కవి రచిత నుతిశతమే

ఈ ద్రవిడ కవి మీద ఎంత గౌరవ ప్రపత్తులున్నా ఇతని చరిత్ర చిత్రణంలో మాత్రం ధూర్జటి తగినంత అవధానం చూపించలేదనే అనుకోవాలి

దీని తర్వాత ఇద్దరు వేశ్యా పుత్రికలు రంగంమీదికి వస్తారు వారి తల్లి అనంగ శాస్త్రమంతా బోధించింది విటాకర్షణ నూరిపోసింది కాని ఆ కుమారికలు పుట్టుకతోటే శంకర భక్తితో పుట్టారు

'మణి మంత్రౌషధ శక్తిచే విటులఁ బ్రేమ గ్రస్తులంజేసి త
న్మణి భూషాదులు పుచ్చుకోఁ గొలువదమ్మా! బుద్ధి రుద్రాక్షమే
మణి, పంచాక్షరి మంత్ర మౌషధము భస్మం బాత్మనాథుండు ద
క్షిణ కైలాస విభుండు భక్తిదమకున్ శ్రీ పాద మింకేటికిన్'
3-38

అని నిస్సంశయంగా చెప్పి, కాళహస్తీశ్వరుని దర్శించడానికి బయలుదేరి వెంట పడిన దొంగల మోసాలు ఈశ్వర కృపవల్ల దాటగా—

'జ్ఞాన ప్రసూన కళికయుఁ
దానుం గన్యకల జన్మదైన్యంబుడుపన్,
బూని యొక దేహమై యెదు
రై నిల్చె శివుండు భాగ్యమది పెద్ద! తలపన్' ౪-127

"దాక్షాయణి నిగ్గువడ, సాయుజ్యం ఇచ్చి యంతర్హితుండయ్యే" శివానుగ్రహ పాత్రలైనారు

ఒక వర్ణ చిత్రానికి చుట్టూ చక్కని చట్రంవలె, ధూర్జటి శ్రీ కాళహస్తి ప్రధాన చిత్రానికి, ఆ వసిష్ఠ, అజ కిరాత, నత్కీర వేశ్యా కథలను అమర్చి భక్తి రక్తి ప్రపూరితంగా కావ్యాన్ని నిర్వహించాడు

అతులిత మాధురీ మహిమ

ఏ కవీ అందుకోని ప్రశంస, ధూర్జటిని విశిష్ట స్థానంలో ఉంచింది అయితే ఈ ప్రశస్తిని సమర్థిస్తూ ఉత్తరార్థంలో ఉన్న 'వార వనితా మధురాధరోదిత సుధారస ధారల' వల్లనే అది వచ్చిందా? అంటే - అది అతిశయోక్తి కావచ్చు కాని అతడు శృంగార విముఖుడు మాత్రం కాడు శతకంలోని వైముఖ్యం వైరాగ్యంతో పండిన మనసులో నుంచి వచ్చినట్టిది కావ్యంలోని అతని శృంగారాభిముఖ్యం వర్ణనీయమైంది

కాళహస్తీపుర వర్ణనంలోని—

"ఎలదోట్ల్వనము ల్వధూకుచము లద్రీంద్రంబు లాకంటికిన్
ఫలముల్వాతెరు లంగజాగమ కళాబంధంబు లిచ్ఛానసం
బులు కోపంబునఁ బాయుటల్ తపము సంభోగంబు కైవల్య, మం
దుల లీలారతినుండు మానవుల, కెందుంగాన మీ చిత్రముల్" 1-21

అనే ముక్తి క్షేత్రంలోని శృంగార సాకల్యం కవి శృంగార ప్రీతికి నిదర్శనం అయితే 'ఎంచే డెందము కందళించు రహి నాయించె పరబ్రహ్మము' అని నిర్వచించిన వరూధిని వాదాన్ని ధర్మమీమాంసా పరుడైన ప్రవరుడు

ఛాందసంగా తిరస్కరించాడు గాని లౌకిక భోగాను భవానికీ పరమార్థ చింతనకూ ఏమీ సంబంధంలేదనే శైవాగమానుయాయి ధూర్జటి అనిపిస్తుంది

అక్కడి కామినీ జనులు యోగిజనం వంటివారని ఉపమాశ్లేషవల్ల ఈయన సాధించిన చమత్కారం - పై ప్రశంసకు ధూర్జటిని దగ్గరగా నడిపిస్తుంది

"పరిచిత బంధనై పుణి నపాంగ కళానుభవ ప్రసక్తి, నా
దరస రవే సంపద, సదాశుక వాక్య సుధానుభూతి, మో
హారహిత వృత్తిఁ బ్రస్ఫురదనంగ రహస్య విచారబుద్ధి న
ప్పురమునఁ గామినీ జనులు పొల్తురు యోగిజనంబుపోలికన్"

౧-24

అంతేకాదు - మిండజంగము వేశ్యతో చేసిన క్రీడలూ, శతానందుని శృంగార విజృంభణం, వేశ్యమాత శృంగార ప్రబోధాలు ఈయన శృంగార ప్రవేశానికి గాఢ నిదర్శనాలు

అయితే ధూర్జటి ఎంత రక్తుడో అంత భక్తుడు శివనామంతో, శివభక్త కథలతో ఆయన తన్మయుడౌతాడు ఎంత లౌకికానుభూతి లోతులు చూచినవాడో అంత పారలౌకిక పరమార్థ శిఖరాలు ముట్టినవాడు శంఖ (సంఘ) ఫలకంమీద కూర్చున్న మహాకవులకు ఉపయోగించిన విశేషణాల కన్నిటికీ తాను సాటిగా గలవాడు—

"దివిషదన్న ప్రాయ వాగ్గుంభ
సంపత్కావ్య ప్రతిపాదక ప్రతిభుడు"

'శైవ సంవిత్కాసార మరాళరత్నము'

అంతర్ముఖుడైన ఈ కవి అంటాడు

ఇరువది నాలుగు తత్త్వము
లరయగ నీయంద పుట్టి యణగెనస జగత్
పరిపూర్ణుడవగు విశ్వే
తర మూర్తివనంగ విందు దత్త్వజ్ఞులచే! ౧ 79

స్వాను భవంబున సత్యము
కానంబడుగాని నీ యఖండా ద్వైత
జ్ఞాన మయాకృతి బహు భా
షా నైపుణి దెలియునది యశక్యమట ! శివా ! ౧-80

ఇంకా అగస్త్యకృత శివస్తుతి సంప్రగజములు వినుతించిన రగడా ఇతని అఖండ తాత్త్వికానుభూతికి దర్పణాలు

కవితా రక్తి

ఈతడు ఆయా ప్రకరణాలలో పలికిన మాటలవల్ల ఇతని కవితావ గాహనం ఎట్టిదో తెలుస్తుంది కవిత్వానికి మంచి లక్షణ జ్ఞానం అలంకార దర్శనం, పదబంధపు నేర్పు, రసపోషణ విధిగా ఉండాలి దానివల్ల సాహిత్య స్ఫురన్మాధురి వస్తుంది అమృత ప్రాయమైన వాగ్గుంభన కావ్యానికి సంపద

కావ్యం చిన్నదే అయినా పాత్ర నిర్మాణం, సంభాషణాల నేర్పు, పరతత్త్వ సంవేదన, ఉక్తివైచిత్రి, సమృద్ధిగా గల రచన

నన్నయ పద్య విద్య, శ్రీనాథుని వక్రోక్తి, పోతన తాదాత్మ్యం, తిక్కన చిక్కదనం, ఎఱ్ఱన వర్ణన చాతుర్యం ఈ కావ్యంలో చూడవచ్చు

"కాంచి మునీంద్రుడు జలనిధి
కాంచిపలయ ప్రసిద్ధ కాశీమధురా
కాంచీముఖ పుర లక్ష్మీ కాంచీ మణి
యామ్య భాగ కైలాస గిరిన్" ౧-110

ఇది నన్నయవంటి ధారాశుద్ధి

ఈ సీస పద్యాల్లో శ్రీనాథుని భీమఖండ, హరవిలాస వైఖరి కనబడుతుంది

"విహరించు నొకవేళ విపినామ్ర పల్లవ
చ్ఛాయల గిరిజా సహాయుడగుచు
క్రీడించు నొకవేళ గిరివర నిర్ఝర
ధారాపనీత నిదాఘుడగుచు" ౨-22

"జడకొప్పు కేకిపింఛపు ద్రాటి చుట్టగా
బిసరుహోహిత రేఖ పికెగాగ
సెగలు జల్లెడు కన్ను జేగురు బొట్టుగా
శ్రుతిఫణి యౌషధలతిక గాగ" ఆ-177

పోతన పలుకు, అనుప్రాస, వీనిలో చూడవచ్చు—

శివు నపేక్షించిన చిత్తంబు చిత్త జా
యత్తమై విటులపై నాస డునె?
పట శివస్తుతి కథా భాషలు విను వీను
లానునె కుంటెన లాడు పలుకు? ఆ-39

"తండెకు జీవి మంకస్మిన
కుందకు ప్రాణేశ్వరోపగూహన జనితా
నందకు వచనామృత ని
ష్యందకు నెల మసలె శైల జాధిపు కరుణన్" ఆ-21

సంభాపణలో, కథ గుత్తంగా పొదుపుగా చెప్పడంలో తిక్కన పొందిక కనబడు తుంది నత్కీరుని ప్రయాణంలో, తిన్నని ప్రవాసంలో ఈ తీరు దర్శించగలం ఎట్టిన ఊహాశాలిత స్వీయ అలంకార చారిమ, పదబంధ గరిమ ఈ చంద్ర వర్ణనంలో ప్రత్యక్ష మవుతుంది

"కాముక హృద్దదిం గలచు కవ్వము, బువ్వపు దేవకోటికిన్
వ్యోమ పథంబుతేనె పెరకొప్పెడు పగ్వము మవ్వ ముత్వల
శ్రీమతికిన్ జకోర మహిషి మధుపాళికిఁ బ్రోచునన్నమై
యామవతీశబింబ ముదయాచల మెక్కెఁ బ్రభాళి పెక్కువన్"
ఆ-92

ధూర్జటి ప్రకృతి పరిశీలనం అనితర సాధ్యం అనిపిస్తుంది పిల్లల ఆటలు, కంటి వైద్యపు చిట్కాలు, చెంచుపల్లెల ఇంపు సొంపులు కాళ్రేని జాతరలోని మూఢాచారాలు, సానివాడలోని చాతుర్య రహస్యాలు, ఇవి లోకాన్ని గాలించి చూచినట్టు ఈ కవి లేశాలేశాల పరిశీలించి వర్ణించడం ఆశ్చర్యం గొలుపుతుంది కాగా - కాళహస్తి కావ్యంలో ఈయన సాధించిన విజయం విస్మరించరానిది

ధూర్జటి రెండవ రచన శ్రీకాళహస్తీశ్వర శతకం. ఆయన హృదయం, కవిత్వం, ఆ స్వామికే అంకితమయిపోయాయి. శతకంలో అదే అంటాడు

'నీకుం గాని కవిత్వ మెవ్వరికి నేనీనంచు మీదెత్తితిన్ !'

మీదు కట్టిన ద్రవ్యం ఇంకో విధంగా వినియోగించరుగదా !

ఈ శతక రచనకు స్వామి యందలి భక్తిపరే - కాని నత్కీరుని అరవ శతకం ప్రేరకం అయిందేమో అనిపిస్తుంది. దీని ప్రస్తావం నత్కీరుడు రోగ విముక్తుడైన చోటను, వేశ్య పుత్రికలు స్వామివద్దకువచ్చి చేసిన స్తుతి సందర్భం లోను, కావ్యంలో రెండుసార్లు వస్తుంది. అందువల్ల ఇతనికి ఆ శతకం మీద ఉన్న ఆదరం వెల్లడి అవుతుంది.

శతకం వ్రాసే నాటికి ధూర్జటి భావతత్త్వం, లోకవృత్తం ఎన్నో మార్పులకు లోనైనట్టు కనబడుతుంది. రాయల అవసాన దశలో దేశం స్తిమితంగా లేదు. గర్విత ప్రభువుల పెత్తనాలు, సజ్జన తిరస్కారాలు, అయ్యవార్ల ఆడంబరాలు, అజ్ఞానుల విడంబనాలు పెచ్చు పెరిగాయి. కవి హృదయం రక్తి నుంచి విరక్తికి తిరిగిపోయింది. ఆ ఛాయలు శతకమంతటా కనబడతాయి.

ధూర్జటికి పోతనతో చాలా పోలికలున్నాయి. ఆయన వలెనే ఇతడు దుష్టరాజుల మీద కత్తికట్టాడు. దుష్టవ్యవస్థను దుయ్యబట్టడంలో వెనుదియ్యని పదును పలుకు, లక్షణం మీద ఎంత గౌరవం ఉన్నా కవితావేశంలో శాస్త్రవచనాలను లెక్కచెయ్యని స్వాతంత్ర్యం ఉభయ సాధారణం.

ఆయన శతకంలో ముక్తకంఠంగా చెప్పే మాటలు రెండే. తర్క మీమాంసలు వాదోపవాదాలు ముక్తిమార్గంలో ముళ్లపొదలు, అడుగడుగునా అవి అడ్డమే. తిరుగులేని భగవద్భక్తి, ఆత్మార్పణం ఒక్కటే రాజమార్గం.

పొట్ట నింపుకోడానికి దుష్టులను ఆశ్రయించడం సిగ్గుచేటు. చిత్తశుద్ధితో స్థైర్యంతో బతకడం సర్వోత్తమం.

ఈ భావాలు ఆయన శతకంలో ఎంత బలంగా ప్రతిపాదితములైనాయో మనం చూడవచ్చు.

ఆయన దృష్టిలో రాజులు—

"రాజుల్ మత్తులు, వారిసేవ నరకప్రాయంబు, వారిచ్చు నం
భోజాక్షీ చతురంతయాన తురగా భూషాదు, లాత్మవ్యథా
బీజంబుల్ తదపేక్ష చాలు, పరితృప్తిం బొందితిన్ మోక్షల
క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ముదయతో శ్రీకాళహస్తీశ్వరా" శత-18

"రాజై దుష్కృతి జెందెఁ జందురుడు రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబునఁ గాంచె దుఃఖము కురుక్ష్మాపాలుఁ డామాటనే
యాజిం గూలె సమస్త బంధువులతో, నారాజ శబ్దంబు చీ
చీ జన్మాంతర మందు నొల్లను జుమీ! శ్రీకాళహస్తీశ్వరా'

ఆరాధ్యులు, అయ్యవార్లూ ఆడంబర సంచారులే గాని అపరోక్షాను భూతికి పనికిరారంటాడు

"అయవార్లై చరియింపవచ్చు దన పాదాంభోజ తీర్థంబులన్
దయతో గొమ్మనవచ్చు సేవకుని యర్థ, ప్రాణ దేహాదుల
న్నియు నా సొమ్మనవచ్చుగాని, సిరుల న్నిందించి నిన్నాత్మ ని
ష్క్రియతన్ గానగరాదు పండితుకున్, శ్రీకాళహస్తీశ్వరా"
శత 73

దుష్పండితులు చిత్సుఖం అనుభవించలేరు—

"పటవద్రజ్జు భుజంగవద్రజత విభ్రాంతి స్ఫురించు త్రిప
ద్ఘటవచ్చంద్ర శిలాజపాకుసుమ రుక్కాంతత్వవర్తించు వా
క్పటిమల్ నేర్తురు, చిత్సుఖంబను భవింపన్ లేక గుర్మేధసుల్
చిటుకన్నన్ దెసపోయి జూతు రధముల్ శ్రీకాళహస్తీశ్వరా" 108

ధూర్జటి కవీంద్రుని తుదికోరిక ఒక్కటే—

"దంతంబుల్ పడనప్పుడే తనువునం దారూఢియున్నప్పుడే,
కాంతాసంఘము రోయనప్పుడె, జరాక్రాంతంబు కానప్పుడే
చింతింపన్వలె నీ పదాంబుజములన్, శ్రీకాళహస్తీశ్వరా" 116

'దేవా! నీ కరుణా శరత్సమయ మింతేచాలు' అని బతుకంతా దోసిట బట్టి ఒక్క నమస్కారం చేస్తాడు

'తింటేగాని', 'అంతా మిధ్య', 'రోసీరోయదు', చేయగా 'బోతే' 'చేసిందేటిది' 'దొంగర్కము' - అనేవి ఆ కవితా వేశంలో లక్షణాన్ని లెక్క చేయకుండా వచ్చిన సమాజ వ్యవహార వచనాలు - ఇవి పూర్వ శివ కవుల పద ముద్రలు - ధూర్జటి వాటిని గౌరవిస్తాడు

మల్లన మంజు కవిత

లోకంలో ఒకవైపు బృందావనం వంటి మహోద్యానాలూ ఉండవచ్చు వేరొకవైపు ముచ్చటగొలిపే చిన్ని పూదోటలూ ఉండవచ్చు దేని అందం దానిది దేని మురిపెం దానిది ఆ దృష్టితో చూస్తేనే చాలా వాటికి న్యాయం జరుగుతుంది

మల్లన 'రాజశేఖర చరిత్ర' మూడాశ్వాసాలూ సుమారు అయిదు వందల పద్యాలూగల చిన్న ప్రబంధం అంతకంటె అతడు మరో పెద్ద రచన గాని, చిన్న రచనగాని చేసిన ఆధారాలు కనబడవు అయినా అతని సారస్వత మూర్తి విస్మరింప దగ్గది కాదు

శివాంశమైన ప్రతిభ ఏ ప్రమాణంలో ఎక్కడ ఉన్నా అది తళుక్కున మెరవకుండా ఉండదు అదే కవిత్వానికి జీవనాడి దాని స్పందనం ఎక్కడ వినపడినా అది మనల్ని ఆకర్షిస్తుంది ఆనంద మిస్తుంది

> ''నీలకంఠుని శిరసుపై నీళ్ళుచల్లి
> పత్తిరిసుమంత నెవ్వడు పాఱవైచు
> కామధేనువు వానింటి గాడిపసర
> మల్లసుర శాఖి వానింటి మల్లెచెట్టు'' ౧-65

అని చదివినప్పుడు, ఇతడెవడో విలక్షణమైనవాడు తనదైన ఒక పలుకు సొగసు కలవాడు అనిపించి దీని సంగతేదో పూర్తిగా చూడా లనిపిస్తుంది

ఒకింత శివాభిషేకం చేసి ఇంత పత్రి ఆ శివలింగంమీద అశ్రద్ధగానైనా పడవేస్తే - అదే కోటి గుణితమై వానింట్లో కామధేనువు పెరటి పశువున్నూ, కల్పవృక్షం మల్లె చెట్టున్నూ ఐ పడి ఉంటాయి అదే శ్రద్ధా భక్తులతో చేస్తే ఇక చెప్పేదేమిటి? ఆ చెప్పేతీరు కొంచెం దురుసుగా ఉన్నా దాని ధ్వని మాత్రం ఆ ఆశుతోషుని అఖండ భక్త పరాధీనతను వెల్లడిస్తుంది

మల్లన అపార శివభక్తుడు అఘోర శివాచార్య శిష్యుడు. కనక అతని మాట శివాపచారంగా పలకదు. కాబట్టి అది అతనికి శివునిమీద ఉండే వల్లమాలిన చనవు అనుకోవడమే సబబు

ఒక చిన్న కావ్యం వ్రాసి అతడు చూపిన ఆత్మ ప్రత్యయం ఆశ్చర్యాం గొలుపుతుంది.

కృతిపతి అన్నాడట!

"నీ విపుడు చెప్పఁ దలచిన
భావ రసోద్యన్మహా ప్రబంధము నాపైఁ
నా పేర నంకితంబుగ......"

మూడాశ్వాసాల గ్రంథాన్ని పట్టుకుని 'మహా ప్రబంధం' అనడం ముందు ఎవరికైనా నవ్వు పుట్టిస్తుంది. కాని శ్రద్ధగా చదివిచూస్తే మహాప్రబంధం అనడం కొంచెం అతిశయోక్తి అనిపించినా భావరసస్ఫూర్తి బలంగా ఉన్న మహా ప్రబంధం అని భావుకుడు తృప్తి పడడంలో అసంభావ్యం లేదు.

మల్లన సారస్వత మూర్తి పతన్మాత్రం కాదు. తెలుగు పద్యాన్ని పన్ని ఒడుపులుగానైనా అక్షరాల శక్తివాక్కు నన్నయవలె పద్యవిద్య తెలిసిన వాడు. తిక్కనవలె తెలుగుపలుకు పోషించగలవాడు. సీసపద్యానికి శ్రీనాథునివలె ఎన్ని ఒయ్యారాలైనా ఇవ్వగలవాడు వర్ణించ దలచుకుంటె బొమ్మగీచినట్లు చూపగలవాడు. ఎంచుకున్న పాత్రలను ఎంత జీవంతోనైనా కదిలించగలడు. కొత్తమార్గాలేవీ సాధించక పోయినా ఏర్పడిన మార్గాలలో అనివారులు పోగలడు.

అతని ఆత్మ విశ్వాసం గొప్పది కృతిపతిని అడ్డం పెట్టుకుని అది ఇట్లా వెల్లి విరుస్తుంది

"శంకర పాదసేవన విశంకర మానస పంకజాత! ని
శ్శంక వచోవిలాస రుచిసార వినిర్జిత పూర్ణ పూర్ణిమా
శాంక! దురత్తురానన భయంకర! శౌనక గోత్రపాత్ర! య
య్యాంక పురాగ్రహార విభవాకర! మాదయమల్ల సత్కవీ!"

(24)

గొప్ప శివదీక్షాపరుడు; తన మాటకు తిరుగులేదు; చంద్రునివలె ఆహ్లాదకరుడు; దుష్పండితులను అదరగొట్టేవాడు; శాంత గోత్ర ప్రసన్నుడు; అయ్యంకి పురాగ్రహార వైభవోపేతుడు; మాదయగారి మల్లన అనే సత్కవి తాను.

రేఖా మాత్రంగా చెప్పిన అతని ఆత్మకథ ఇది. ఆత్మ 'ప్రశంసల' మాట అట్లా ఉంచితే అసలు సంగతి ఇట్లా తెలుసుకోవచ్చు.

అతని పేరు మల్లన్న. శ్రీశైల నాథుని దయవల్ల, మల్లన్నలు పలువురు; కవులలో కలుగుకి వైమాట - ఇతరుల నుంచి వ్యావృత్తికి తండ్రి మాదయ్య గారితో కలిపి పలకడం అలవాటై వెరసి మాదయగారి మల్లన అయినాడు. ఇంటిపేరు మరుగున పడింది. అది అయ్యంకి అని కొందరి ఊహ. అయ్యంకి పుర - అగ్రహార వైభవోపేతుడు కావడం దానికి అనుకూలం.

వినుకొండ సీమలో కొండవీటి ప్రాంతానికి ఏలిక అయిన నాదెండ్ల అప్పన మంత్రి అనుగ్రహప్రాప్తం ఆ వైభవం. అప్పన మంత్రి సాళువ తిమ్మరుసయ్య మేనల్లుడు, అల్లుడున్నూ. ఇతని వ్యుత్పత్తికీ కవితా నైపుణ్యానికీ మెచ్చి అతడే అగ్రహారం ఇచ్చి ఉంటాడు. అంతేకాదు అప్పన మంత్రికి సన్నిహితుడు కావడంవల్ల తిమ్మరుసయ్య ఆదరానికిపాత్రుడై కృష్ణరాయల సభా ప్రవేశం చేసి ఉంటాడు. కావ్యంలో తిమ్మరుసు ప్రశంస ఉంది. కాని రాయల స్మరణ కూడా లేదు. అయితే రాయలు ఇతని కవిత్వం విని సంతోషించి అభిమానించి ఉండవచ్చు. లేకపోతే ఇంత చిన్నకావ్యం వ్రాసిన వాడికి అష్టదిగ్గజాలలో ఒక చోటు దొరకడం సంభవం కాదు. ఈ అష్టదిగ్గజాల కథ ఒక దేవతావస్త్రం లాటింది. ఉన్నట్టు ఊహించడమే గాని వ్యక్తులెవరో నిర్వివాదంగా తేలలేదు. జనశ్రుతి కొందరికి ఆ పీఠాలు బహూకరించింది. వారిలో కొందరు రాయల సమకాలీనులైనా ఆయనవల్ల 'జాంబూనదాంబరాలు' పుచ్చుకున్న జాడ కనపడదు. భువన విజయం అనగానే ఒక జాబితా సిద్ధం. దానినెవరూ ప్రశ్నించే అవసరం పెట్టుకోలేదు. విక్రమార్కుని నవరత్నాలవంటివారే వీరున్నూ. భిన్నకాలాల వారుకూడా నిర్విచారంగా కలసి కాలక్షేపం చేస్తున్నారు.

రాయల సభ తెలుగు కవులకే ఆలవాలం కాదు. అన్యభాషా కవులకున్నూ అక్కడ ఆదరం సమృద్ధిగా ఉంది అయిదుగురు తెలుగు కవులని

ఒప్పుకున్నా, తక్కిన దిగ్గజాలు సంస్కృతి తమిళ, కన్నడ కవులు ఎందుకు కాగూడదు ? అనేది ఒక విచికిత్స - దానికి చికిత్స మన చేతిలో లేదు దాని విచారంలో వృథా కాలక్షేపమూ అంత అవసరం కాదు

రాంసవాచకాన్ని బట్టి (పు 80) మల్లన రాయల ఆస్థాన కవులలో మూడవవాడయి ఉండగా - కుమార ధూర్జటి కృష్ణరాయల విజయ కావ్యంలో ఇతడు మొదటి స్థానంలోనే ఉన్నాడు చిత్రమేమిటంటే - కుమార ధూర్జటి అన్నగూర్చి 'ధూర్జటి పౌత్రు బంధుర చరిత్రు' అనిన్నీ 'మీ పెదతాత చాల సన్నుతిగనె కృష్ణరాయల మనోజ్ఞ సభన్' (కృ రా వి ౧-28, 29 వ) అనిన్నీ తన ఘనత ఉగ్గడించి కూడా రాయల ఆస్థాన కవుల వరుసలో తాగను నిలిపి కూర్చోబెట్టలేదు ఎందుచేతనో ? ఏతావతా - తెలుగులో అష్టదిగ్గజాల ఒక నిర్దిష్ట సిద్ధాంతం లేదని తెలుస్తుంది

ఇంతకూ మల్లన అదృష్టం దొడ్డది అతి చిన్న ప్రబంధం వ్రాసినా అష్టదిగ్గజాలలో ఒకడైనాడు అందుచేతనే అతని గౌరవం పెరగకపోయినా, రచననుబట్టి అతని కవిత్వపు విలువను ఆచి చూచి అర్హమైన స్థానం ఇవ్వవచ్చు

ప్రబంధ మనగానే ముద్రవేసి స్థిరపర్చిన పడికట్లన్నీ మల్లన రాజశేఖర చరిత్రలో ఉన్నాయి జలక్రీడలు ఉద్యానం ఉదయాస్తమయ వర్ణనలు, విరహం, ఉపాలంభనం, ఎగైరాన్నీ తమ తమ సురక్షిత స్థానాల్లో సర్దుకొని కూర్చున్నాయి అయితే కొన్ని విశిష్టతలు రాజశేఖర చరిత్రను పరంపర ప్రబంధాల స్థాయిలోకి జారిపోనివ్వలేదు

ఇందులోది ప్రబంధాల్లో అచ్చుపో విడిచిన శృంగార కథ మాత్రం కాగు తన ప్రత్యేకత నిలుపుకుని కొత్తబాటలో పయనించి మలుపులు తిరిగి సుఖాంతంగా ముగుస్తుంది వర్ణనలు హద్దుల్లో ఉంటాయి శృంగారం మామూలు స్థాయిలోనే నడచినా పరిమిత మాధుర్యంతో ఉండి పడకటింటి రహస్యాల్లోకి పనిగట్టుకు జొరబడదు వ్యంగ్య సుందరంగా నడచి వెళ్ళిపోతుంది

రాజశేఖర చరిత్ర పేరు తలపెట్టగానే ముందు ఒక చిలుక జ్ఞాపకం వస్తుంది ఇది నైషధంలోని హంసకు వారసురాలయినా ప్రత్యేకాకర్షణతో కనపడుతుంది దీన్ని ఇంకా తీర్చి దిద్దిన రూపమే పింగళివారి శుచిముఖి

ఆ చిలుక :

'తూచా తప్పక యుండ నాగమ ...
... నీ కుటుంబుసు వృచ్ఛునో నేచ్చి ... 102.

అంతేకాదు, "కీరవరుడు మంజులోక్తి మీ యనుగు ...
అని రాజశేఖరుడు తన ... ఆ చిలుక మీదనే ... ఇందులో
చిలుక ... మీదటనే ... తుదకు ... చిలుక
పురోహితుడై ... సిగ్గు ... విరహాగ్ని ...
నాయిక రాజ పుత్రునిపై 'చూపుల ... బాలు' పోసింది.

... చిలుకలలో ... చిలుక ...
... 'చిలుక ...
... చిలుక ... మాటలు ...
చక్కని 'వచశ్రీ దాంపత్యం' ...

... రెండో వైపులో సౌమనస్యం ఉంది. సరసత ఉంది. కనుకనే
అతడు 'రుచిసార నినిర్జిత పూర్ణ ... ' అన్నాడు. 'చిలుక
'మంజులోక్తి' అతని కవిత్వ ... ఉంది ...
చూపినట్లు కనపడినా, తరచు వైదర్భి రీతిలో ... పోషిస్తుంది.

అనాటి రాజసభల్లో సౌజన్యం, సామరస్యం మాత్రం ఉంటే ...
... నిలవా
... చేపట్టి ...
చిలుకకు ...

[illegible] తర్వాత మనకు ప్రత్యక్షమయ్యే పాత్రలు జటిల. కౌశికుడనే ముని విశంకటుడనే రాక్షసుడు [illegible] కౌశికుణ్ణి చూస్తే దశరథ సభలో ప్రవేశించిన కౌశికుడు జ్ఞాపకం వస్తాడు. నామ సారూప్యం గూడా ఉంది. అక్కడా రాక్షస సంహారానికి లేక [illegible] క్షత్రియ కుమారుణ్ణి పంపమన్నాడు. ఇక్కడా కానకగన్న సంతానమైన రాజ పుత్రుణ్ణి పంపమనడమే సన్నివేశం.

విశంకటుడు బ్రాహ్మణుడి [illegible] ఏడ్చాడు [illegible] చదివి వాడు, వాడి స్థిరమైన క్రోధంతో లోకాతీతాలు [illegible] అపహరించే వీడు [illegible] అపహరిస్తాడు ఈ బిడ్డ పెరిగి పెద్దదై తన [illegible] ఇక దాసిలే దొరక లేదా? అంటే రాజకుమారుని చేత దానం చెయించడం ఒక రీతి అనుకోవాలి.

వీరిద్దరి తోటి కథసాగి మలుపులు తిరిగి, నాయికా నాయకుల అనురాగ ఫలితంగా పెండితో ముగుసు

ఈ కథ మూలమేదో తెలియదు. ఏ పురాణం నుంచి తెచ్చినట్టు కనపడదు ఏ ఇతిహాసంలోనో, జనశ్రుతిలోనో వినవచ్చే కథకు కావ్యరూపం ఇచ్చి తన రచనా నైపుణ్యంతో మలచి దీనిని నిర్వహించి ఉంటాడు.

[illegible]

[illegible] పురానికి [illegible] రాజు. శివానుగ్రహంవల్ల అతనికి రాజశేఖరుడనే కుమారుడు పుట్టాడు. [illegible] అన్ని విద్యలలోను ఆరితేరి [illegible] రాజసభలో ప్రవేశించి విశంకటుడనే రాక్షసుడు [illegible] బిడ్డను అపహరించినాడనీ వాని సంహారానికి రాజశేఖరుణ్ణి పంపి తన బిడ్డను తనకు ఇప్పించవలసిందనీ కోరాడు రాజు సైన్యంతో రాజశేఖరుణ్ణి పంపాడు.

మంధరాచలం దగ్గర ఒక కోన. దానిలో ఒక బిలం. దాని అవతల ఒక రక్త సరసి. దానిపైని పెద్ద బయలు అక్కడ విశంకట నివాసం.

రాజశేఖరుడు రాక్షసుని ఆట కట్టించగా, వాడు కాళికాదేవిని శరణు జొచ్చాడు. దేవి రాజశేఖరుణ్ణి లాలించి, ఒక రత్నం బహూకరించి, ఒక యోగిని ద్వారా మునికన్యను ఒప్పగించి రాక్షసుణ్ణి రక్షించింది. యోగిని

వచ్చి మునికన్యాతో పాటు రాజ పుత్రునికి ఒక చిలుకను కూడా ఇచ్చి ఇది నీకు నెచ్చెలిగా పరమోపకారిగా ఉంటుందన్నది

రాజశేఖరుడు కన్యకను ముని కొప్పగించి చిలుకతోడుగా బదరికాశ్రమంలో విశ్రాంతి తీసుకోవడం కాంతిమతి అనే సింధురాజ పుత్రికను చూచి ప్రేమించడం - చిలుకవల్ల ఆమె పూర్వ వృత్తాంతం తెలుసుకోవడం జరుగుతుంది రాజపుత్రి కూడా అతనిపట్ల అనురక్త అని తెలుసుకుని - చిలుక తెలివిగా రాయబారం చేసి వారి వివాహానికి దోహదం చేసింది పెండ్లి వైభవోపేతంగా జరిగింది తల్లి దండ్రులు సలక్షణంగా సారె చీరెలు పెట్టి కూతును సపరివారంగా అత్తవారింటికి పంపారు

ఈ కథకు కవితారూపం ఇవ్వడంలో కవి ఆలంకారికమైన ప్రౌఢ భాషా చమత్కారాలు చూపాడు వర్ణనలు చేశాడు రూప చిత్రణలు నిర్వహించాడు రసార్ద్రిల కలిగించాడు అనుకున్న అనుభూతిని అతి ప్రసన్నంగా పాఠకుడికి అందించాడు

మల్లన కవితావగాహనం ప్రత్యేకించి చెప్ప దగ్గది తెలుగు కవిత్వపు పరిమళమంతా సంస్కృతపు పూలగుత్తి నుంచి వచ్చిందేననీ, దానిని కవిత్రయం తరుణ పవమానంలా దశదిశలా వ్యాపింప చేసినదనీ అని నిశితమైన గుర్తింపు దేశి కవితాభిమానులు సంస్కృతాన్ని చూచి ఎంత కంటగించుకున్నా ఈ సత్యాన్ని ఒప్పిపుచ్చలేరు ఈ మాట చెప్పినా, చెప్పకపోయినా ఆంధ్ర కవుల్లో మహా మహులనుకున్న వారందరూ ఈ యాథార్థ్యాన్ని జీర్ణించుకున్న వారే - ఆ సంస్కృల వాసనతో గుబాళించిన వారే - దాని బలంతో మల్ల చరచినవారే—

"సరస సంస్కృత పుష్పగుచ్ఛ ప్రభూత
మగు తెనుంగను నెత్తావి కఖిల దిశల
తరుణ పవమానమగు కవిత్రయ విశేష
చతుర వాచా నిరూఢి కంజలి యొనర్చి" 1—7

మల్లన ముక్తకంఠంగా ఆ నిజాన్ని చాటాడు

కవి ఉచితజ్ఞుడు

చెబితే రసం ఉట్టిపడేలా చెప్పాలి

బళిబళి అనిపించుకోవాలి.

లేకపోతే పెదవి విప్పక పోవడం మంచిది

"చెప్పఁ దగుఁ గవిత్వ రసముల్
చిప్పిల నప్పప్ప **బళిబళీ** యన లేదా
యొప్పిదు చేయక యుండుట
యొప్పగు నొక కవి యెంత యసుచితజ్ఞు డొకో" ౧-8

చాలవరకు ఈ ఎరుకతోనే అతని కవిత ప్రవర్తిల్లిందని చెప్పవచ్చు.

అతని తెలుగు ప్రబంధంలోని సంస్కృత సమాసం ఇది—

"**విందును** వోలె నోగిమతి వీర భయంకర రాజలోక సం
క్రందన! నీవు రా నెదురు రాజకుదేంచె విరించి కామినీ
బృంద లతాంత కాంత కబరీభర సౌరభ సార సమ్మిళ
న్మందర కందరా నుధ మంథర బంధుర గంధ వాహముల్" ౨-45

"గగన పథోల్లేఖ గండ సింధుర ఘటా
ఘంటాఘణాత్కార కలిత రవము..." ౨-50.

వంటి పద్యాలతో నన్నయ శ్రీనాథులను మనస్సులో మెరిపేలా చెయ్యగలడు.

ప్రస్తుత్యల్పణ వంటి కఠిన ప్రాసలతో ఆటలాడను గలడు.

ఈతని తెలుగు తిక్కనను పుణికి పుచ్చుకొన్నట్లుంటుంది.

"రక్కస మాటలేల నగరా? ...గుహారలు; నోరు నొవ్వదే
డక్కస యొజ్జ సొమ్ములు పడంతుక? యెంత యవంత నొందెనన్
నిక్కుచు నీల్గుచున్ బలుక నేర్చెద నీవు బసున్న తీరగాపై
నిక్కను సబు గోయులకు నేటిక నేరకయుంటి? చెప్పుమా" ౪-49.

ఇది కాంతిమతి పూర్వజన్మలోని ముచ్చట

ఇచ్చట ఒక పువ్వుకోసమై ఇద్దరి మగువల తగవు. ఆ పడతుల తగువు తెలుగులో పలికినంత సొగసుగ సంస్కృతంలో రక్తికట్టదు. నన్నయ చూపిన

కిటుకిది - మల్లన అందుకున్నాడు. ఈ మగువల తగవు 'కళాపూర్ణోదయం'లోని సవతుల కయ్యానికి 'సంచిమొదలు'

రాజశేఖరుని యౌవనం ఇది—

"వనితా నేత్ర చకోర చంద్రిక తను స్వచ్ఛంద కాంతిచ్ఛటా
ఖని యుత్సాహకళా ఖళూరి మతిరేఖా మంత్ర సంసిద్ధి భో
గ నిధానంబు లతాంత సాయక భుజాగర్వావలంబంబు యౌ
వన మమ్మానవనాథ పుత్రునకు మవ్వంబొప్ప నేతెంచినన్" —2-7.

కాంతిమతి యౌవన విలాసంలోని మూడు ఋతువులు తేరిపార చూడదగ్గవి.

"ఫలిత సుధారసంబు తొలుకన్ సరసప్రియ భాషణంబులన్
బలికిన శీత కాలమగుఁ బలవ షాదములెత్తి లీలమె
మెలగ వసంత కాలమగు; మించు గనుంగవఁ బాఱఁజూచినన్
దలకొను కాఱుకాలమగుఁ, దన్వి విలాసము చిత్రమన్నఁగన

జటిల కౌశికుడు చెప్పిన రాక్షస చర్యలు చూస్తే రావణుడే నయమని పిస్తుంది

"ఒకవేళ సింహమై యుఱుకుచు బెదరించు
నొకవేళ హరిణమై యొద్దనిలుచు
ఒకవేళ భూజముల్ పెకలించు మోదియై
యొకవేళ శలభమై యుద్భవిల్లు
నొకవేళ మౌనియై యొయ్య నొయ్యనవచ్చు
నొకవేళ నగ్నియై యుఱుక వెలుగు
నొకవేళ మేఘమై యుఱుముచు నేతెంచు
నొకవేళ శైలమై యుండునడుమ

నద్దురాత్ముని మాయలేమనఁగఁ గలదు ?
జపతపో నిష్ఠలేమియు జరగనీక

బదరికాశ్రమ సీమ తాపసుల నెల్ల
నలచి యేచుచు నొక్కనాఁ డదను వేచి" ౨-౮౮.

ఇతని అలంకార ప్రజ్ఞ ఉపజ్ఞతో కూడిన చిరుమెరుపులు చిందిస్తుంది.

"వడతులఁ కన్నులఁ గనేఁగొని
యడియాసలఁ బోవఁదల్లుల నిశశరంబుల్
నిదుదలో యటువలె ? నవికడు
వెడదలో ? జడమతుల కా వివేకము గలదే ?" ౨-158.

ఇట్లే కాళికాదేవి యోగిని రూప చిత్రణం ఇతని భావనాశక్తికి నిదర్శనాలు.

ఇతడు ఆర్ద్రహృదయం ఉట్టిపడేలా చేసిన కన్నవారి వాత్సల్య వర్ణనం రెండుచోట్ల హృదయ స్పర్శిగా దర్శన మిస్తుంది. జటిల కౌశికుడు బిడ్డను తలచుకొని పడిన తపన, కాంతిమతి తల్లి, కుమార్తెను అత్తవారింటికి పంపుతూ పలికిన మాటలు మనస్సును కరిగిస్తాయి ఈ తల్లి-మాటల్లో నాటి కన్యాని హృదయం పలుకుతుంది.

పరిమిత పరిధిలో ఇతని కవితాశక్తి, భాషాపాటవం, వర్ణనప్రావీణ్యం, రసపోషణ, గుణసంపదలు ఆస్వాదించదగ్గవే గాని పరిహరణీయాలు కావు.

ఇతని రచనలో 'కాకరపండు వంటి జిగిగలిన మెలి పసిండి పలుకులూ, జాతీయాలు, లోకోక్తులు 'పోకకు పుట్టెడు'.

'ధరణీ నందనుడు అల్లారు చెల్లము'

చిలుకా రాచవారు'

'మంగలము వంటి సంసారము .

'సూది పిటింది దారమటు చొచ్చిన చోటులు'.

'పచ్చని వింటి వా డొక నెపంబిడి కత్తులు నూరు' వంటివి జాతీయాలైతే—

'బెబ్బులి పయిం జీంబోతు లంఘించునే ?

'లేమి యది యాహా!' 'యేమి గావిం దే' వంటివి లోకోక్తులు ఇతని ధారావేగంలో 'ఎటింగెటింగి' 'వానిల్లాంట' 'కాళి అదృశ్యము' 'ఆపవాతకుడు' వంటివి నిహాటలేశాలు

మొత్తం మీద మల్లన గడుసైన కవి రాజశేఖర చరిత్ర మొదలు పెడితే తప్పక చదివించే రచన ఇందులో కనపడే పూర్వ కావ్యచ్ఛాయ ఆయా రచనల గాఢావగాహనాన్ని చెబుతాయి గాని పేలవమైన అనుకరణలుగా కనపడవు

అయ్యలరాజు - అనూన రచన

అనూన రచన అనేమాటను బుద్ధి పూర్వకంగానే వాడుతున్నాను

సి.పి. బ్రౌను, అయ్యలరాజు రామభద్రుని రామాభ్యుదయ రచనను అప్రశస్త మన్నాడట - అంటే ఊన (హీన రచన మన్నమాట.

ఇటు ఆంధ్ర కవితా రసికులు రామభద్రకవిని అష్ట దిగ్గజాలలో చేర్చి ప్రశంసించడం పరిపాటి అయితే దిగ్గజాలలో చేర్చిన రామభద్రుడు వేరొకడు అని కొందరు అంటే అందురుగాక——

చెళ్లపిళ్లవారు అయ్యలరాజు కవితను ప్రశంసిస్తూ పెద్ద వ్యాసం వ్రాశారు మరి కొందరి ప్రశంసలూ అర[illegible] వినబడుతుంటాయి ఈ విధంగా ఈతని కవితా ప్రసక్తి ఒక వివాద వేదిక అయింది

కాబట్టి - మనసులోచనాలతో మనంచూచి ఈతని కవిత యొక్క యోగ్యతాయోగ్యతలు నిర్ణయించుకోవడం మంచిదనిపిస్తుంది.

బ్రౌను అప్రశస్త మనడానికి కారణాలు వివరించలేదు అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం కావచ్చు చెళ్లపిళ్ల వారి శ్లాఘనం సర్వాంగీణం కాక ఏకపక్ష దర్శనంగా తోస్తుంది వారు ముఖ్యంగా రామభద్రుని పాండిత్య ప్రకర్షను, శ్లేష సౌలభ్యాన్ని విరుపు సొగసులను, మెచ్చుకొని ఇట్టి కవికి తగినంత ఖ్యాతి రాకపోవడం ఆశ్చర్యకరమే అని తేల్చారు

ఈ విమర్శ పూర్వ పండిత సంప్రదాయానికి చెందినది ఒక తరం పండితులు కావ్య సమగ్ర స్వరూపం చూడక దానిలోని శబ్దశక్తిని, రచనలోని

గనుసు పోకడలను చూచి తృప్తిచెంది దానినొక ఉత్తమ రచనగా ఉగ్గడించడం ప్రమాతంగా జరుగుతుంది అంతకన్న దృష్టి కావ్యం నలువైపులా ప్రసరిస్తే గాని దాని నిజ స్వరూపం తెలియదు

ఒక వ్యక్తి అందం నిర్ణయించడానికి కన్నో, ముక్కో చెవో అందంగా ఉంటే చాలదు అవయవాలన్నీ తీర్చిదిద్దినట్టు ఉన్నప్పుడే ఆ అవయవి అందమైన వాడని నిశ్చయించడం ఉచితం

కావ్యంలో కథ తీర్పు, పాత్రసృష్టి సస్యందనం, శబ్దాల కూర్పు నేర్పు ఇన్నిటిని అనుశీలనంచేసి చూచినప్పుడే ఆ కావ్యం యొక్క స్థాయి నిర్ణీతం అవుతుంది

ఆ చూపుతో పరిశీలిస్తే రామాభ్యుదయ కావ్యస్థాయి ఏమిటి? అని ప్రశ్న—

క్రీ శ 16 శతాబ్ది పూర్వార్థం కంటె పరార్థంలో చాలవరకు కవిత్వ రంగం ఒక గరిడి శాలగా తేలింది

మీసాలపై చేతులు, జెబ్బ చరపులు, బోర విరుపులు ఎక్కువై ఆలోచనామృలమైన కవిత్వస్థాయి బల ప్రదర్శన స్థితికి వచ్చింది కృతకమైన కవిత్వస్థాయి బల ప్రదర్శన స్థితికి వచ్చింది కృతకమైన అలంకారికశైలి, లోకాతీత కల్పనలు, ఉన్నవారందరిలోనూ తాను మెరగవలెననే ఉబలాటం నానాటికి పెరిగింది

దీనికి ఒకటి రెండు అపవాదాలున్నా దర్పం మీద ఇదే భావన పరిపాలించడం మొదలు పెట్టింది

ఈ లక్షణాలకు అయ్యలరాజు పూర్తిగా మినహాయింపుకాడు

ఇతడు రాయలవారి సకల కథాసారాన్ని సంస్కృతం నుంచి తెనిగించినట్టు ఒక నానుడి అది ఇప్పుడు లభ్యంకాదు ఇక ఇతని రెండవ రచన రామాభ్యుదయం దాని కవితాపారమ్యాన్నిబట్టే ఇతని కవితా స్థాయిని నిర్ణయించడం సాధ్యం

రామాభ్యుదయం, అళియ రామరాజు మేనల్లుడు గొబ్బూరి నరస రాజుకు (క్రీ శ 1550-70) అంకితం అంటే ఇంచుమించు వసుచరిత్ర

కాలీనత, అన్నమాట. కాని శ్లేష చమత్కృతిలో, [illegible] ప్రతిభలో [illegible] పాండిత్య ప్రకర్షలో [illegible] తరచు దర్శనమిస్తుంటాయి. [illegible]

అప్పకవి పూర్వ కవిస్తుతిలో 'రామరాజ విభూషణ రత్న ఖచిత చారుకీర్తి [illegible] పాద [illegible] వాక్యా [illegible] కవము [illegible] గుల 'అగణనచేసి' [illegible] మాట [illegible] గుర్తించేట్లన్నదని [illegible] కుల [illegible]

అప్పకవి సనస్తుతిలో ఏ కవినీ పేరు పెట్టి స్మరించకపోయినా ఆ [illegible] నుబట్టి ఒక్కొక్క [illegible] స్ఫురిస్తూ ఉంటాడు. [illegible] ఈ విశేషణాన్ని బట్టి రామభద్రకవిని స్ఫురింపచేయడం [illegible] మీద ఆధారపడి ఉంది. [illegible]

వసుచరిత్ర కారుడైన రామ రాజ భూషణునకూ, [illegible] పందెరలో ఇతడు [illegible] శిరోభూషణాన్ని [illegible] నీ – [illegible] విశేషణం అయ్యలరాజు కవినే స్ఫురిస్తున్నదని అంటారు.

> "[illegible] పడ్జస్వరోద్గత ఖిల్లవల్లి
> వాధరా గీతికా కర్ణ [illegible]
> పరవశాత్మ [illegible] టీర కోటర కుటీర
> లీన్న ఫణియగు నక్కాన కాననయ్యె" (రామా. ౨–25)

[illegible] రామాభ్యుదయంలోని [illegible] – ద్యాన్ని [illegible] రామరాజ భూషణుడు, సంగీతానికి పాములు భయపడి [illegible]? అని ఆక్షేపిస్తే అప్పుడు అయ్యలరాజు పడ్జస్వరం నెమలిది కనుక నెమలి కూత విన్న పాములు భయ పడడం సహజమే కదా! అని సమర్థించగా నిరుత్తరుడైన రామరాజ భూషణుడు ఓడి తన శిరోభూషణం ఇచ్చివేశాడని ఒక ఐతిహ్యం చెబుతారు. కవుల చమత్కారాలకు, ఛలోక్తులకు ఇంతటి పణం [illegible] భావించడం కష్టం. అప్పకవి వాడిన [illegible] ఇంతకన్న క్లిష్టమైన [illegible] యానికి చెందినదని చెప్పవలసి ఉంటుంది. ఇంతకూ ఈ విషయం వీరిద్దరి సమకాలికత్వాన్ని రుజువు చేయడానికే ఎక్కువ ఉపయోగిస్తుంది.

అయితే వసుచరిత్ర కారుని మహత్తర రచనా శక్తికి, మేధా సంపత్తికి ఈ కథ అనుగుణం కాదు. రామాభ్యుదయం ఏ విధంగానూ వసుచరిత్రను మించి ఉండదు. కాని – శ్లేష చమత్కృతిలో, శబ్దాలతో బంతులాడడంలో, పాండిత్య బలంలో, ఈతని శక్తిని తక్కువ అంచనా వేయడానికి వీలులేదు.

ఏం, తక్కిన సమకాలీన కవులవలె అయ్యలరాజు ఏ పురాణంలోని కథనో తీసుకొని ప్రబంధం వ్రాయలేదు. సుప్రసిద్ధ రామాయణ కథనే కావ్యవస్తువుగా స్వీకరించి ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధంగా విరచించాడు.

కృతిపతి నరసరాజు 'దాశరథి కథా సుధా [illegible] కృతి రామభద్ర [illegible] కృత్యముల్' [illegible] చేతను తాత తిప్పయార్యుడు ఒంటిమిట్ట రఘువీర శతక కర్త అవడంచేతను తానున్నూ 'హృదయ పద్మాధిష్ఠిత శ్రీరామభద్రుడు' కావడం చేతనున్నూ రామకథనే కావ్య వస్తువుగా స్వీకరించడం సహేతుకంగానే జరిగింది

రామకథను స్వీయ రచనా వస్తువుగా స్వీకరించడం [illegible] ఇద్దరూ [illegible] భాస్కర, రంగనాథాదులు చేసినప్పటికీ కాని వాల్మీకి అడుగుజాడల్లోనే ఈ రచయితలను నడిపుతూ కొద్దిమార్పులు చేశారు. ఆ మార్పులు లెక్కలోకి రాకుండా [illegible] మొత్తం మీద రామాయణ రేఖనే తలపింపజేస్తూంటాయి

సంస్కృతంలో కాళిదాస [illegible] రామాయణాన్ని విడచి దూరంగా వెళ్లరు. వాల్మీకి పాత్ర సృష్టిని, స్వభావాన్ని సడలించక [illegible] రచనా వైశిష్ట్యాన్నే వారు చూపుతారు.

అయ్యలరాజు [illegible] రామాభ్యుదయం [illegible] స్వీకరించి [illegible] తెలుగు ప్రబంధ పద్ధతిలో పలు మార్పులు చేసి కొత్తరూపం ఇవ్వడానికి ప్రయత్నించాడు.

దానితో వాల్మీకి రామ కథలోని బిగువు, ఔచిత్యం, పాత్ర పరికల్పనం చెదిరి స్వచ్ఛమైన రామాయణ భావన స్రోతస్సు తప్పి ఇచ్ఛగా సంచరించడం మొదలు పెట్టింది. [illegible] చనో [illegible] ఔచిత్యం మీద గినంత శ్రద్ధ చూపలేదని [illegible]

రామాభ్యుదయం [illegible] వర్ణనతోనే ప్రారంభమైనా అది [illegible] సారి [illegible] ప్రజాపాలన సుస్థితిని చెప్పక [illegible] మార్గంలోకి [illegible] పుష్పాపచయం [illegible] జలక్రీడ [illegible] పుష్పాపచయం వంటి [illegible] నిండింది. తర్వాత చెంచులరాక, దశరథుని వేట, మునికుమారవధ, [illegible]

బమోఘం బని యంతరంగంబున శోకింపక రమ సంతోషభర మగ్నుండై, మరల వేటకు సిద్ధపడడం వాల్మీకి మార్గానికి భిన్నమై ంలమార్గం పట్టాయి

అంతేకాక - దశరథుడే వేశ్యాను ఋష్యశృంగుని వద్దకు పంపడం, తాపసాశ్రమంలో వారి శృంగార చేష్టలు ఋశ్యశృంగుడు రోమపాదుని పట్టంమీదుగా అయోధ్యకు రావడం అనేవి ఏ మూలంనుంచి వచ్చినవో తెలియదు

సీతా కల్యాణ సందర్భంలో విశ్వామిత్రుడు సీత అంగ సౌందర్యం వర్ణించడం, సీతారాముల వివాహానంతర విపరీత శృంగార వర్ణనం, రామాభ్యుదయ ఘనతను పెంచేవిగా లేవు ఇంకే అప్రసిద్ధ కథ తీసుకున్నా - కవి కుతూహలానికి అభిరుచికి మార్గం సుగమ మయ్యేది నిరూఢమై, కావ్య కళావేత్తల హృదయాలలో స్థిర పీఠం పెట్టుకు కూర్చున్న రామకథా విన్యాసంలో ఔచిత్య దూరమైన ఎట్టి మార్పుల్నీ సహృదయులు సహించలేరు

రామాభ్యుదయంలో మూడాశ్వాసాలవరకు కథ మందకొడిగా నడుస్తుంది తర్వాత వేగం అందుకొని క్లుప్తంగా ప్రధాన కథా సూత్రాన్ని నడుపుతూ ఎనిమిదవ ఆశ్వాసంలో ముగుస్తుంది

కథా పరంగా ఇట్లా ఈ కావ్యం కొంత అసంతృప్తికి చోటిస్తుంది

పాత్ర నిర్మాణంలో కూడా విశ్వామిత్రుని ఉక్తులు సీత వనవాసానికి వెడుతూ మనం ఎక్కడికి వెళుతున్నాం? మన ఊరేది? రథాలు లేవేమి? అని వట్టి ముద్దరాలితనం చూపడం, రాముడు వినయస్ఫూర్తి విడిచి శరాసన భంగ సందర్భంలో గర్వోక్తులు పలకడం వంటివి కొత్త కల్పనలైతే కావచ్చు గాని రామాయణ హృదయాన్ని అర్థం చేసుకున్నవి మాత్రం కావు

కవిత్వం విషయంలో ఇతనికి స్పష్టమైన అభిప్రాయా లున్నాయి

ఆలంకారిక నిర్వచనాలు, నిరుక్తులు తుణ్ణంగా ఎరిగినవాడు కవిత్వ పరమావధి హృదయ ధర్మమని ఎంత తెలిసినా మేధాబలం మనోధర్మం మీద పెత్తనం చేస్తూ ఉంటే ఆపుకోలేడు చాలాచోట్ల మేధతోచేసిన ఇంద్రజాల ప్రక్రియలు సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తాయి చక్కిలి గింతలు పెడతాయి కాని హృదయ ప్రసతికి తోడ్పడవు

అట్లా అని రసలుబ్ధులను అలరించే చోట్లు లేక పోలేదు. అవి తక్కువ కావచ్చు కాని - అభావం మాత్రం కాదు. ఒక సంప్రదాయ వాసనలో పెరిగిన పండితులు ఇట్టి పద్య చమత్కృతికి ఎంతైనా సంతోషిస్తారు.

అయోధ్యావర్ణనంలోని వారకన్యలు :

"పొలుపొందం బురి సింహమధ్యలు ధనుర్భ్రూవిభ్రమల్ మీననే
త్రలు కుంభస్తన పాళికల్ మకర చిత్ర శ్రీయు సద్గండ భా
గలునై మించిన వారకన్యలు త్రిలోకఖ్యాత సౌభాగ్య రా
శులు తారై యతులాకృతిన్ మెఱయుటల్ చోద్యంబుగాదే మహిన్"
౧-128.

వారు సౌభాగ్యరాశులుగా వాటి పేర్లతో వారి అంగ సౌష్ఠవాన్ని చమత్కరించడం ఈతని అపూర్వ మేధా నిదర్శనం అని చెప్పక తప్పదు. అయితే ఉపమానాలలో కొత్త ఏమీలేదు కాని రాశుల పేర్లు అతికేలా వర్ణించడంలోనే ఉంది. సొగసు - అతులాకృతిన్ అన్నచోట కూడ ఒక రాశి పేరు రానిచ్చి చేసిన పరువు అరసి గడుసుదనానికి గుర్తు

తన కవితా హృదయాన్ని వర్షర్తువర్ణనాలతో శ్లేష బలంతో ఇట్లా చమత్కరిస్తాడు—

"ధారాశుద్ధిఁ బ్రసిద్ధిఁ గాంచి ఘనశబ్దస్ఫూర్తి నర్తిల్లఁగాఁ
దోరంబైన రసస్థితిన్ దనరి విద్యున్మార్గికా లక్షణో
దారంబై కవి సేవ్యమౌ వరమయూరారాధిఁ బ్రాపించి వ
ర్షారంభంబు ప్రబంధ మట్లఖిల పద్యాళిం గాంగ మయ్యెన్ దుదన్"
౬-13.

ఈ పద్యంలోని అందమంతా - వర్షాకాలం ప్రబంధంలా ఉందని ఉభయ సాధారణ విశేషణాలతో నిర్వహించడంలోనే గూడు కట్టుకొని ఉంది

కావ్యానికి ధ్వని ఎంత ముఖ్యమో ఈతనికి తెలుసు. అది వస్త్వలంకార రూపంలోనే ఎక్కువ కనిపిస్తుంది గాని రసధ్వనిగా పెక్కుచోట్ల రూపు కట్టలేదు.

అపత్యలాభమ్ములేని దశరథుని సంతాపంలో ఇతడు ఒక మంచి పద్యం వ్రాశాడు. అందులో శబ్ద క్రీడ తగ్గించి సూటిగా చెప్పడం ఇతని ఆర్ద్ర హృదయానికి నిదర్శనం.

"నీరవి మండలంబయిన నింగియు దక్షిణలేని యాగమం
భోరుహ శూన్యమైన జలమున్ ధ్వని చాలని కావ్యమున్ సదా
చారరహితం లేని సాహిత్యము శాంతి తపంబు సపత్య దూర సం
సారము నొక్కరీతిని [illegible] సేయు నృపుండు వేమయున్"

వాచ్యంలో చమత్కారాతిశయం లేకపోయినా [illegible] తెలిసినా ఇతడు శబ్దశక్తిమూల ధ్వనిని సాధించిన విధం దర్శనీయమైనది.

ప్రథమాశ్వాసం వసంత వర్ణనం —

"కాలకంఠ్యస్తమిద్ధ సఖ్యంబు మెఱయ
నతుల చిర వైఖరి సుగర నతులు దొరయ
నల శుకాదుల కడయ ఫలదుల దగుచు
జేరె మాధవుడుపవన (శ్రీ) దలిర్ప" 1-162.

ఇక్కడ ప్రకృతమైన వసంతవర్ణనలో మాధవాది శబ్దాలు వసంత పరంగా పూర్తిగా తమ తమ అర్థాలను చెప్పి మీదట - అప్రకృతమైన విష్ణు ప్రసన్నత సూచనానుగుణంగా శబ్దశక్తిమూలధ్వని ఉద్భవిస్తున్నది. దాని వల్ల అప్రకృతార్థంతో ఉపమగా భాసిల్లి శ్లేషాతిశయం [illegible]. ఇట్టి ధ్వనులు ఇందులో చాలా చోట్ల [illegible]

ప్రతిభకు కవిత్వంలో ఎంతటి స్థానం ఉన్నదో తెలుపుతూ ఇతడు చెప్పిన ఈ ఉపమానం గణనీయమైనది.

శ్రీరామ జనన సందర్భం —

"అతి శుభవేళం గనియెన్
సతి కోసల కన్య దనయు సనయున్ దనయున్ :
కృతికర్త మతి [illegible] సత్కృతి
నతుల తర ప్రతిభ దుర్లభార్థము పోలెన్" 3-106.

ఇతని అతుల ప్రతిభ అనేక దుర్లభార్థాలను సాధించిన మాట నిజం కాని ఆ ప్రతిభ శ్లేషాలంకారాదులను నిర్వహించడంలో ఎక్కువ వ్యయమై రసలుబ్ధం కానందుకు విచారం కలుగుతుంది

వైదుష్య ప్రదర్శనానికి వైదగ్ధ్య విస్తరణానికి శ్లేషాలంకారం గొప్ప ఆయుధమగుతుంది దాన్ని ఆంధ్రకవుల్లో బాగా ఉపయోగించిన ఘనత భూషణ కవిది

ఆతడు తన కావ్య రచనకు ఎన్నుకున్న వసుచరిత్ర కథే దానికి అనుగుణమయింది ప్రకృతి కథలో ఉన్న పర్వత నదులు, పురుష స్త్రీ రూపాలతో పరస్పరాకృష్టులు కావడం సమాగమం సంతానప్రాప్తి వంటివి శబ్ద శక్తివల్ల సాధించవలసిన విశేషాలు ఆ అవకాశాన్ని ఆయన బాగా వినియోగించుకుని తనదైన ఒక మార్గానికి పవిత్త అయినాడు ఆ మార్గానికి మోజుపడిన చాలమంది ఆయన్ను అనుకరించారు

ఆయన వసుచరిత్రను ఎంత సమర్థతో నిర్వహించినా - మనుచరిత్ర ఉపజ్ఞ రసైకాగ్రత అంతరంగ పరిచాలనం, దానికి రాలేదు ఆయన కన్ను ఎప్పుడూ శబ్దైకాయత్తం అయి ఉండడం ఎంత కాదన్నా తిరస్కరించరాని విషయం

అయినా ఆతని శబ్ద సంగీతంలో అర్థాంతర నిర్వహణలోని చాతుర్యంలో, ఆ లోటు కనబడదు

రామభద్రుని రామాభ్యుదయంలో అర్థాంతర నిర్వహణ ప్రసక్తిలేదు ఎక్కడ చేయదలచినా కోరివైదుష్య ప్రకటనకు చెయ్యవలసిందే అట్టిచోట్ల తోవతప్పిన జాడ కనిపించి తీరుతుంది కౌసల్యా లాలింపులో, దశరథ విలాపంలో, సీతా సౌందర్య వర్ణనంలో తోసుకు వచ్చిన శ్లేషలు రస స్ఫూర్తికి కాక శబ్దలాలసకు ఎక్కువ తోడ్పడ్డాయి

కౌసల్య రామునితో—

> "పాలింపు మిజ్జగంబులు
> పాలింపుగ(ద్రాని చలము వాటింపకు మా
> పాలింటి వాడవై రే
> పాలింటికి వచ్చినప్పు డరయుము మమ్మున్" 3-133

[illegible] 'రేపు ఆలింటికి వచ్చినప్పుడ' ను విరుపు అసహజం

"కానకగన్న సంతానమ్ముగావున
గానక కన్న సంతాన మయ్యె

...టూ దాశరథి! సముత్కట కరీంద్ర
కట కలిత దాన ధారార్ద్రి కటక మార్గ
గామి యెట్లుచరించు? నుత్కట కరీంద్ర
కట కలిత దాన ధారార్ద్రి కటక కటకముల" 3-12

దశరథ దుఃఖమునకు ఈ సమాస రచన అనుచితం

"అసువు వాంఛ వస్తువు దురాత్ముం గెందును గీర్తి కల్గునే" 3-11

'అసు' శబ్దము మీద చూపిన ఈ చమత్కారమున్ను హృద్యం కాదు

సీతా సౌందర్యం—

"కోమలతె మంజులలాటాంగ కుంతలాది
సౌష్ఠవంబుల భూతనూజాత సీత
అఖిల దేశ ప్రసిద్ధ భాగ్యంబు కలిమి
తల్లిఁబోలిన దదియపో ధన్యకన్య! 4-70

ఈ దేశాల జాబితలో సీతా సౌందర్యం మునిగిపోయింది

ఈ శుద్ధ సంస్కృత రచన ఆముక్తమాల్యద నుంచి దిగుమతి అయినదా? అనిపిస్తుంది

"పాక విధానం చిత్రం
శాక రుచిం కిం వదామి? సమతా నాస్త్య
స్తోక దధి ఘృతానాం నా
నా కల్పిత ఫలరసాయ నానా మనుచున్" 3-21

శబ్ద చిత్రానికి ఈ పద్యం పరమావధి—

"శీతలతా స్వీయలతా
జాతి లతాంతాతి సురభి జంబీర జపా

చూత లవలీ వంగ వ
నీత ముల సేదదీర్చి నృపసూనుకున్ ౪-27

అర్థ పుష్టి ఎట్లున్నా శబ్ద సంగీతప్రీతి వసువును తలపిస్తుంది

"సన్యాసిని వన్యాసిని
కన్యా! సీమంత వీధి కా సిందూరో
పన్యాసి మృదు పదాంబుజ
ధన్యా! సిత కీర్తి! భిక్ష దయ సేయగదే!" ౫-175

రామభద్రుని వ్యాకరణ వైదుష్యం ఒదిగి ఉండే జాతిదికాదు, ఎదిగి తలయెత్తి తిరగేది—

ఈతనికి దశరథుని యజ్ఞమంతా వ్యాకరణ స భలో దర్శన మిస్తుంది ౬-20

'లాటీకుచహారత్', 'కర్ణాటీ వక్షోజ చందనత్' వంటి నామధాతు శత్రంత ప్రయోగాలూ నడ్వల, ఉ తిల పంకిల, శాడ్వలాది ప్రయోగ విశేషాలు ఇతని భాషా శౌండీర్యానికి నిదర్శనాలు —

"వాలిని గుఱించి రాఘువేశ్వరుం డమోఘ సాయకము వింట సంధించి వేయంబూని" నపుడు (౫-312) వ్రాసిన సీస పద్యం ప్రతిపద స్వారస్యంతో వసుచరిత్ర రచనా స్ఫూర్తిని తలపింప జేస్తుంది

ఒక కవి పాండిత్యం శబ్ద ప్రయోగ కౌశలం అలంకార యుక్తిమాత్రం అతనిని మహాకవిని చెయ్యలేవు ఇవి అన్నీ రచనలో గౌణమై రసాభిముఖంగా పయనించినప్పుడే ఆ కవి కావ్యం ఉత్తమ శ్రేణికి చెందుతుంది కోపం, ప్రేమ, ఆగ్రహం, మమత మాత్సర్యం వంటి మనసు పొంగులు ఆటుపోటులు, తన అంతర దృష్టితో చూచి ఆ పాత్రల మనోధర్మాలను మనలో రేకెత్తించి ప్రత్యగ్ర అనుభూతిని కలిగించినప్పుడే అది రసమయం అవుతుంది ఆ అంతశ్చక్షువు ఈయన రచనలో తక్కువగా కనపడ తుంది

అయితే - కొన్ని సన్నివేశాలలో మాత్రం ఈతని భావ చిత్రణం శ్లాఘనీయం అని చెప్పవచ్చు

కౌసల్య శిశురాముని మీద చూపిన వాత్సల్యం, సీత రావణునకు చేసిన హితోపదేశం, రామ ముద్రికను చూచినప్పుడు జానకి హృదయంలో చెలరేగిన భావావళి ఇత్యాదులు ఇతని మేలి కవితకు ఉదాహృతులు

"అప్పాలంచును బారసాచి చను దేరా అన్వయాకల్పమా!
అప్పా! యొప్పుల కుప్ప! ఆనతకకుప్పా! అన్న కష్టంగుగుల్
గప్పన్ మోమునఁజిన్ని నవ్వోలయ బంగారందియల్ మ్రోయగా
నప్పా పం డరుదెంచుఁ దల్లి తను నూరార్పన్ దగన్ ముందటన్"
బ-146

సీత రావణునితో—

"అన్నా! నీవు పులస్త్య వంశమణివై యాఖండలాదుల్ బళీ
యౌన్నత్యం బిదిగా యనన్ బ్రదికి నీ విట్యో! యిదేమి య
చ్చిన ప్రాభవ నాశహేతువు పరస్త్రీ కాంక్ష చాలింపు మిం
తన్నన్నేలినవాడు రాముఁడుఁ గురుల్ నాకుంప దనూసంభవుల్"
ఓ-160

మణి ముద్రికను చూచిన జానకి—

"ఉగ్రధనుర్విభేదనునకో మణి ముద్రిక! నీవు నేనుఁబా
ణిగ్రహణం బొనర్చి కరుణించుటయుం దగియున్నయున్కి య
వగ్ర మతిం దలంచికొని ప్రాణసఖి న్నను బాయవైవ క
త్యుగ్ర విపద్దశన్మొగిలి యున్నదిగా - యని చూడవచ్చితే"
ఓ-183

ఈ సందర్భములోని 'మొగముఁద్రిప్పిన వేగమున!' బ-194 వంటి పద్యములు మిక్కిలి రసవంతములు—

ఇందులోని భావ చిత్రణము కంటెను భాషాశిల్పమునకున్న అధిక్యాన్ని బట్టి పౌరుదౌర దీనిని అప్రశస్త కావ్యంగా పరిగణించి ఉండవచ్చు కాని ప్రాచ్య పండితుల దృష్టిలో - ఆనాటి కవితా ప్రియుల భావనలో వైదుష్యానికి భాషా ప్రకర్షకు తక్కువస్థానం లేదు

రసపరంగా చూస్తే ద్వితీయ స్థానంలో ఉండవలసిన నైషధాన్ని నాటి విద్యావంతులు 'విద్వదౌషధం' గా భావించారు ఆనాటి అభిరుచులకు ఇవ్వ

వలసిన గౌరవం ఇస్తే - రామాభ్యుదయం అప్రశస్త కావ్యం అని కొట్టివేయ దగ్గది కాదు ఇటు శిల్ప చాతుర్యమూ లేక అటు రస బంధురత్వమూ లేని కావ్యాలను, 'ఊస' రచనలని తీసివేస్తే తీసివేయ వచ్చును కాని శబ్ద ప్రభుత్వంలో అలంకార శిల్పంలో ఎన్నదగిన అయ్యలరాజు కవితను ఒక విధంగా చూస్తే అనూన రచన అనే చెప్పవలసి ఉంటుంది

రాయలవారి రాతి గోపురం ఆముక్త మాల్యద

విట్ఠలాలయ ప్రాంగణంలోని శిలారథం చైతన్యంవచ్చి కదిలితే - ఎదురుగా ఉన్న మండపంలోని స్తంభాల రాతి కొయ్యలు కంఠమెత్తి ఖంగున పాడితే - అదీ ఆముక్త మాల్యద!

పాషాణాన్ని రథంగా మలచి కదిలించడం, నోరులేని రాతికొయ్యలచే సంగీతం పాడించడం ఒక అపూర్వ కళ దానిని సాధించిన వాడు గొప్ప కళావేత్త

ఆ పాషాణ పాంపప్రభువు విజయనగర సామ్రాజ్యాన్ని స్వచ్ఛందంగా పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు

'భువన విజయాఖ్య సంసద్భవనస్థిత' కవితా గోష్ఠులలో - శాను శీలనంలో, మునిగి తేలిన మొనగాడు ఆ కన్నడ రాయడు ఆయనకు తెలియని కళా రహస్యాలు లేవు అతడు మథించి తెలుసుకోని శాస్త్రమర్మాలు లేవు

ఆయన పరిపాలించిన 16 వశాబ్ది ఇంచుమించు ఆంధ్ర కవిత్వానికి పరమోచ్ఛదశ తెలుగు కవితా సుందరి ఎన్ని ఒయ్యారాలు పోవడానికి వీలుందో, అన్ని ఒయ్యారాలు పోయింది ఎంతగా విభూషితురాలు కావాలో, అంతగాను విభూషిత అయింది

ఆయన ఆస్థానంలోనే ఉండనక్కరలేదు ఆయన సమకాలీనులైతే చాలు ఒకొక్కరు ఒకొక్క దిగ్గజం! చాలమంది ఆనాటి కవులకు దిగ్గజ సంజ్ఞ ఆ విధంగా వచ్చినదే—

ఒక వీధిలో సరస కవితా స్వారస్యాలైతే వేరొక తెరువులో వీణా నిక్వాణాలూ, నాట్య మంజీర ఘుంఘుమలు! పచ్చని పండిత ప్రాంగణాలలో

పద, వాక్య, ప్రమాణ, పారావారాలైతే - రచ్చపట్టులలో ఛలోక్తుల సల్లాపాలు - కనుకనే దాన్ని స్వర్ణయుగమన్నారు కాబోలు !

ఆ లక్షణాలన్నీ ఆముక్త మాల్యదలో కనపడతాయి

కన్నడ రాయుడు అంతవరకు ఏదీ తెలుగు గ్రంథం వ్రాసిన జాడలేదు సంస్కృతంలో మదాలస చరిత్ర సత్యావధూప్రీణనం వంటి గ్రంథాలు వ్రాసి మెప్పు పొందిన ఘనుడు అట ! అవేవీ ఇప్పుడు దొరకవు అట్టివాడు కళింగదేశ 'విజిగీషా మనీష' తో విజయ వాటికి వెళ్ళి అక్కడ కొన్నాళ్ళుండి శ్రీకాకుళ ఆంధ్రవిష్ణు దేవుని సన్నిధిని ఒక ఏకాదశి గడపగా ఆ రాత్రి నాలుగవ జామున కలలో విష్ణుదేవుడు కనిపించి ఒక తెలుగు గ్రంథం వ్రాయమని ప్రోత్సహించాడు

ఆయనకు సంస్కృతం రాదా ? తెలుగు కావ్యమే వ్రాయుమని ఏలకోరాడు ?

దానికి జవాబిది—

"తెలుఁగదేల ? అన్న—
దేశంబు తెలుఁగు
ఏను తెలుఁగు వల్లభుండ—
తెలుగొ కండ—
ఎల్ల నృపులు గొలువ ఎఱుఁగవే బాసాడి ?
దేశ భాషలందు తెలుఁగు లెస్స !" ౧-15

ఈమాట తెలుగు వల్లభుడు అన్నాడో లేదో తెలియదుగాని, అక్షరాలా అన్నవాడు కన్నడ రాయడే - ఆయన ఎన్ని గీర్వాణ గ్రంథాలు వ్రాసినా తెలుగు మీది తీపికి ఇది నిదర్శనం - మాతృభాష కన్నడంలో, పుట్టి పెరిగిన వాడు సర్వ విద్యాద్వారమైన సంస్కృతంలో ఆరితేరినవాడు పరిసర ప్రభావంవల్లను వైష్ణవాభిమానంవల్లనూ తమిళమూ వచ్చి ఉండవచ్చు కాని నోరారా 'దేశ భాషలందు తెలుగు లెస్స' అంటేగాని ఆయనకు తోచలేదు అన్య భాషీయుడన్న ఈమాట తెలుగు భాషకు జయపతాక !

అయితే - తెలుగు వల్లభుణ్ణి మెప్పించడానికి ఏ గ్రంథం వ్రాయాలి ?

దానికి తెలుగు రాయడే జవాబు చెప్పాడు

"ఎన్నినుఁ గూర్తు ? ఎన్న విను,
మే మును దాల్చిన మాల్యమిచ్చు న
ప్పిన్నది రంగమందయిన
పెండిలి సెప్పుము, మున్నుగొంటి నే
వన్నదండ యొక్క మగ
వాఁడిడ, నేను దెనుంగు రాయఁడన్
గన్నడరాయ ! యక్కొడువఁ
ప్పు ప్రియా పరిభుక్త భాక్కథన్" ౧-14

'ఏమి వ్రాయమంటావా ? విను'

తాను ముందు సిగలో దంచి తరువాత అప్పలమాలను నాకు సమర్పించిన ఒక చిన్నది ఉన్నది ' ఆమె శ్రీరంగంలో నన్ను (విష్ణురూపి రంగనాథుని) పెండ్లాడిన మధురమైన కథను కావ్యంగా చెప్పు

పూర్వం కృష్ణావతారంలో ఒక మగవాడు (సుదాముడు) పూలదండ ఇచ్చాడనుకో, కాని దాన్ని నేను అనిష్టంగానే స్వీకరించాను పూలదండ ఇస్తే పువ్వుబోడే ఇవ్వాలి స్వీకరిస్తే మనవంటి రసజ్ఞులే స్వీకరించాలి అయితే మహాభక్తుడైన విష్ణుచిత్తుని మాలాకైంకర్యాన్ని అంగీకరించినప్పుడు స్వామి ఈ సంగతి మరచిపోయాడనుకోవాలా ? లేక ఆకని పుత్రిక ఆత్మీయతను అంతకంటె అధికంగా స్వీకరించాడని భావించాలా ? అంటే - కావ్యహృదయం గోదాదేవి ప్రణయమాధుర్య ప్రధానం కనుక ఆముక్తమాల్యానికి అంత గౌరవం అని ఎంచాలి ప్రియురాలు ధరించి యిచ్చిన పూలదండ సౌరభ్యం తెలుగు రాయుణ్ణి నాకు తెలుసు, కన్నడ రాయుడవు నీకు తెలుసు కాబట్టి ఆ కథ ఇంపుగా నీవు చెప్పి ఆ లోటు తీర్చు

ఈ కోరికను ఆంధ్ర వల్లభుని మీ గా రాబట్టి, కన్నడ రాయలు సం రసజ్ఞతా ఫలంగా తీర్చిదిద్దాడు నే కృష్ణావతారం అనేటంత అభిమానంగల కృష్ణరాయలు సత్యాదేవి అపరావతారమైన ఒక సుందరాంగి న సిగలోని పూదండతో ప్రియుణ్ణి సత్కరించిన థను పరిగ్రహించి తన శక్తినంతా వినియోగించి ఏడాశ్వాసా మహాకావ్యం వ్రాయడం బహు రసవంతమైె

సంగతి ఆ సంప్రీతిని పురస్కరించుకునే తన ప్రబంధానికి 'ఆముక్త మాల్యద' అని వింతగా పేరు పెట్టాడు

ఒక కావ్యానికి పేరు, దాని నాయికా నాయకులనుబట్టి గాని, కథలోని ప్రధాన సంఘటననుబట్టిగాని ఫలితాన్నిబట్టిగాని నిర్ణయించడం వ్పాటి కాని ఈ పేరు విశేషణం మాత్రమే, విశేష్యం కథ చదివి తెలుసుకోవలసిందే—

దీనికి 'విష్ణుచిత్తీయం' అని ఇంకో పేరున్నా 'ఆముక్త మాల్యదకే ఎక్కువ ప్రచారం దీనికి మూలం ఆళ్వారుల కథల నుంచీ కొన్ని పురాణ కథల నుంచీ రాయలు ఎన్నుకొని ఉండవచ్చు

ఇందులో అధికారికేతివృత్తం పెరియాళ్వారు అనబడే విష్ణుచిత్తుని పెంపుడు కుమార్తె చూడికుడుత్తనాచ్చియార్ (గోదాదేవి) శ్రీరంగనాథుని వరించి పెండ్లాడడం ఈ తండ్రీ కూతుళ్లు ఇద్దరూ పన్నిద్దరాళ్వారులలో స్థానం సంపాదించిన పరమ వైష్ణవులే విష్ణు పారమ్యం చెప్పడమే ఈ కావ్య పరమార్థం అయితే చూడమ్మ అఖండ విష్ణుప్రీతి ఉగ్గడించడం ఇందులో జరిగింది గాని విష్ణుదేవుని ఆముక్త మాల్య ప్రీతి, ఇందులో వర్ణితం కాలేదు

గోదాదేవి తండ్రి కట్టి దేవునకు సమర్పించ దలచిన తులసీ పుష్ప మాలను ఆయన చూడకుండా ఒకసారి తన సిగలో ధరించి అందం చూచుకుని మళ్లా ఆయన పూలసజ్జలోనే ఉంచడం, ఆయన ఆ మాలలో తలవెంట్రుక చూచి భగవదపచారం అని దుఃఖించి కూతును మందలించడం, శ్రీహరి ఆ మాల్యమే కావాలని పట్టుపట్టడం నాటినుంచి పెరియాళ్వారు ఆండాళు ధరించిన మాల్యమునే సమర్పిస్తూ ఉండడం, [1]ద్వాదశ సూరి చరిత్రవల్ల మనకు తెలిసే కథ ఈ 'భగవదపచారం' విష్ణు చిత్తునకు తెలియకుండానే జరిగిందనీ, దానిని భగవంతుడు మౌనంగానే హర్షించి అంగీకరించాడని వ్యంజించడం ఈ కావ్యకర్త ఉద్దేశం అనుకోవాలి

ఇందులో ఆముక్తమాల్యద అయిన గోదాదేవి కథ చివరి మూడాశ్వాసాలలో వస్తుంది విష్ణుచిత్తుని కథతో కావ్యం ప్రారంభమౌతుంది మధ్యగా

---

1 'ద్వాదశ సూరి చరిత్ర' రచయిత శ్రీమాన్ కె టి ఎల్ నరసింహాచార్యులు. గోదా గ్రంథమాల పుట 171 గోదాదేవి.

ఖాండిక్య కేశధ్వజుల గాథ యామునాచార్యు వృత్తాంతం, ఇత్యాదులు నాలుగాశ్వాసాల్లో నడుస్తాయి

విష్ణుగాన మహిమను వివరిస్తూ చూడస్మ కథలోనే మాల దాసరి కథ పరచుకుని ఉంది

అయితే – ఈ కథలకున్న ఒండొంటితో పొత్తు ఏమిటి? అంటే – అది 'బదరీ బాదరాయణమే' ఇందులో ఏ ప్రాసంగిక కథ తీసివేసినా ప్రధాన కథకు భంగం వాటిల్లదు గోదా కల్యాణమే ప్రాయ దలచుకుంటే మూడాశ్వాసాలు చాలు

రాయల యుగంలో ప్రబంధం అంటే – ఏ పురాణేతిహాసాల నుంచో ఒక కథను నామమాత్రంగా తీసుకొని చేయి సాగినంతవరకు విస్తరించడం లక్షణంగా తేలింది

తనకు నచ్చిన ఒక కథను స్వీకరించడం, దానిని క్రమ వికాసంతో పెంచడం చక్కని సంఘటనతో నిర్వహించి ముగించడం మంచి కావ్యానికి ఉండవలసిన లక్షణం అనుకోవడంలో తప్పులేదుగాని ఎందరో ప్రబంధ కర్తలు ఈ సూత్రాన్ని పాటించలేదు కథలో అవాంతర కథలతో, వర్ణనం ప్రాగల్భ్యంతో అలంకార విజృంభణంతో తమ రచనను నిబిడంచేసి హృదయం కంటె మేధకే ఎక్కువ పని చెప్పారు 'ప్రబంధ కర్తకు కథ చెప్పడమే పనిగాదు, కథే కావలిస్తే ఇతిహాసాదులే ఆ పని చేస్తాయి ఇక కవి ఎందుకూ?' అన్న ఎదురు ప్రశ్న ఒకటి ఉంది నిజమే – పాత్రసృష్టి రసపోషణం, చమత్కారం అనేవాటితో కవి కథను లోకోత్తరం చెయ్యాలి అంతేకాని ప్రధాన కథకు ప్రాసంగిక కథలు కప్పివేసి – వర్ణనలు దురాక్రమణచేస్తే శాస్త్ర ప్రసంగాలు కొండల్లా అడ్డుపడితే – ఆ రచన రసజ్ఞుడికి ఇవ్వవలసినంత తృప్తి ఇవ్వదు

ఆముక్తలో మౌలికమైన ఈ లోపాలున్నాయి

ప్రధానమైన విష్ణుచిత్తుని ప్రపత్తి గోద భగవత్ప్రీతి అది విశుద్ధ ప్రణయంగా పరిణమించి శ్రీరంగనాథుని పాణిగ్రహణంతో ముగియడం, కవి యెత్తుకున్న కథకు సరియైన సమాప్తి కాని మధ్యవచ్చిన ఉపాఖ్యానాలు

ప్రస్తుత కథను మ చిపోయేటంత సుదీర్ఘములై వాటిని మించిన వర్ణనలతో బరువెక్కి దీని అంగసౌష్ఠవాన్ని (కొంత వరకు) భంగపరిచాయనడంలో అసత్యం లేదు

అంతే కాక - పాండ్యరాజు సభలో ప్రవర్తిల్లిన శాస్త్రార్థాలూ, కేశిధ్వజుని యాగ, యోగ ప్రసంగం యామున కథలోని వీర వైష్ణవం, రాజ నీత్యు పన్యాసం, మాలదాసరి కథా విస్తారం, కావ్య పరిధిని మించిన అప్రస్తుత ప్రసంగాలు

అన్నిటినీ మించి ఆ కావ్యంలోని ఓజోగుణం, గౌడీరీతి, చాలమంది రసహృదయులను దూరం చేసుకుంది మొత్తంమీద ఎన్నో పద్యాలు వ్యాఖ్యానాపేక్ష లేకుండా తామంత తాముగా కావ్య రసికులకు దగ్గర కావు ఒక్కమాటలో చెప్పాలంటే - ఆముక్తమాల్యద ఎదురుగా నిలుచుంటే - ఒక బలిష్ఠ శిలారథం ముందు ఆశ్చర్యపోతూ నిలబడి ట్టుంటుంది

అయితే - ఏ గుణం ఈ గ్రంథాన్ని ఆంధ్ర పంచకావ్యాల్లో ప్రముఖం చేసింది ?

ఏ జీవశక్తి ఈ ప్రబంధాన్ని ఇంతవరకూ తిరుగులేని స్థానంలో నిలిపి ఉంచింది ?

ఏ కావ్య శిల్పం దీనికి అనితర సాధారణమైన ఆస్వాద్యతను ప్రసాదించింది ? అని ప్రశ్న వేసుకుంటే—

లోకోత్తర భావనాబలం—

అపార శబ్ద ప్రభుత్వం—

అపూర్వ రచనా శిల్పం—

ఆముక్తమాల్యద ఆయువుపట్లు అని తోస్తుంది—

పెరియాళ్వారు అఖండ భగవద్భక్తి—

చూడమ్మ ముగ్ధమధుర ప్రణయం—

పాండ్య రాజుల ప్రచండ మతదీక్ష—

మాలదాసరి నీతినిష్ఠ—

ఆతని పాత్ర నిర్మాణ చాతుర్యానికి తిరుగులేని ఉదాహరణాలు ఆముక్త పేరు తలపెట్టగానే వారు శమ సజీవమూర్తులతో ప్రత్యక్ష మవుతారు

రెండవ ఋగుణం ఇందులోని అద్వితీయ వర్ణనలు విలుబుత్తూరు, మధురా వర్ణనలు ముఖ్యమైన నాలుగు ఋతువర్ణనలు బ్రహ్మ రాక్షసుని నివాస భయానక దృశ్యాలు, దాసరి బ్రహ్మ రాక్షసుల బలప్రదర్శనం సారస్వత ప్రియుల మనస్సులలో ఏ నాటికీ చెరగని ముద్రలువేసి వదలి పెట్టాయి

రచనాశైలి ఎంత క్లిష్టమైనా - అప్రసిద్ధమైన నైఘంటుక శబ్దాల పోహాళింపు గిజిగాని గూడులా చిక్కగా అల్లుకుపోయిన పద్యంలో, ఎక్కడో గువ్వలా కూర్చున్న భావం ఎంత తికమక పెట్టినా - ఆంధ్ర రసికులు ఆముక్తను విడువలేరు

"బహుప్రదోషా గుణసన్నిపాతే
మజ్జంతి[1] గ్రాహా ఇవ దుగ్ధసింధౌ"

అన్నట్టు ఎన్ని కావ్యదోషాలున్నా అవి గుణ బాహుళ్యంలో - పాలసముద్రంలో మొసళ్ళవలె మునిగిపోతాయి

ఈ సూత్రమే సరిగ్గా ఆముక్త విషయంలో వర్తిస్తుంది,

"అద్దా వాగ్విభవం బహోవచన కివ్యాహార మాహోవచ
సిద్ధం బాఃకృత తాంగతః కలిరితి శ్రీసూక్తి విద్యాధరం
విద్దౌద్ధత్యము గాల్లయంపి కుధియా మిత్థం వదత్కిన్నరం
బద్ధీరాగ్రణి గెల్పుటుత్సవము నందయ్యెన్ సభంబయ్యెడన్'

8-6

ఆముక్త చదివి ముగించగానే 'అద్ధా వాగ్విభవంబు' అన బుద్ధి పుడుతుంది ఇందులో వాక్యాలు వాక్యాలే దొర్లిన సంస్కృత ప్రాగల్భ్యం ఊపిరి తిరగనివ్వదు కాని ఇంకొకడు సాహసించి ఇట్లాంటి పద్యం వ్రాయ లేడు వ్రాయలేదు ఈ పద్యార్థాల్ని విష్ణుచిత్తుని గెల్పుకే కాకుండా ఈ కావ్యానికంతటికీ అన్వయించినా తప్పులేదు అనేటంతటి ధీమా కలుగుతుంది ఆముక్త కవి గెల్పుకూడా ఈ కోవకు చెందినదే అనిపిస్తుంది

---

1 ఒకమూక్తి ప్రాసంగిక ప్రాప్తం

అయితే - తెలుగురాయడు కలకండగా ప్రశంసించిన తెనుగు అతడా సించిన తెనుగు ఇదేనా ? అంటే - రాయలు అంతవరకూ వ్రాసినవని చెప్ప బడుతున్న గ్రంథాలన్నీ సంస్కృతంలోనే - ఆ వాసన ఎంత వద్దన్నా కొంత ఉండడం అపరిహార్యం కనక కొంత సంస్కృతం పెత్తనానికి అంగీకరించినా దానివల్ల కృతహస్తుల కావ్యాస్వాదానికి భంగం లేదనే చెప్పాలి

ద్రాక్షా, కదళీ పాకాలు రెండూ సామాన్య పాఠకుల మెప్పు సంపా దించేవే కాని నారికేళ పాక గ్రంథాలు కూడా సాహిత్యంలో ఉండడం విపరీతం కాదు భారవి కిరాతార్జునీయం, హర్షుని నైషధం నారికేళపాకానికి ప్రసిద్ధి

మల్లినాథుడు భారవి కావ్యానికి వ్యాఖ్యవ్రాస్తూ 'నారికేళ ఫల సమ్మితం వచో భారవేస్సపది తద్విభజ్యతే' అంటాడు శృంగార నైషధంలో శ్రీనాథుడు 'పనివడి నారికేళ ఫలపాకము నం జవియైన భట్టహర్షుని కవితాను గుంభములు' అని శ్లాఘించాడు పాఠకున్న సంస్కారబలంకొద్దీ కావ్యాన్ని ఆస్వాదించడం జరుగుతూ ఉంటుంది

ఇంతకు తెనుగురాయని కలకండమాట అతిశయోక్తియేనా ? ఎంత మాత్రంకాదని చెప్పదగిన మధురమైన పద్య రచన కూడా ఇందులో ఉంది

విలుబుత్తూరులో స్వభావోక్తి చారువైన ఒక సుందర దృశ్యం నడుముకు చిన్న నీటి బిందెలను ఆనించుకుని చేతిలోని పూజాకమలాలు తడబడగా ద్రవిడ దివ్య స్తోత్రాలు చదువుతూ పాద మంజీరాలు రవళింపగా తోటలలో నడచివెళ్లే ద్రావిడాంగనల అందం ఈ తెలుగు పద్యంలో ఎంత చక్కగా ముద్రిత మయింది !

"శయ పూజాంబుజముల్ ఘటింపడబడన్ జందోయి లేఁగౌనుపై
దయఁదప్పన్ బసుపాడి - పొగడపుఁజాదంబొప్పఁ జెంగల్వ డి
గ్గియ నీరచ్యుత మజ్జనార్థము కటింగీలించి దివ్య ప్రబం
ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడతు రుద్యానంపు లోఁద్రోవలన్"

౧-౫౬

ఒకవైపు ఆ పుణ్యాంగనలను చూచిన తర్వాత - ఈ పణ్యాంగనల విభ్రమం ఎంత ఇంపు గొలుపుతున్నది !

"వేవిన మేడపై పలభి వేణిక జంట వహించి విప్పగాఁ
బూవులుగోటమీటు తటిఁ బోయెడు తేఁటుల ప్రమోఁత కామిళం
కాపహమౌఁ గృతాభ్యసన లౌటను దంతపుమెట్ల వెంబడిన్
జేవడి వీణ మీటుటయుఁ జిక్కొడలించుటయున్ సరింబడన్"

౧-62

వారి వనితలు మేడపైని నిలుచుండి జడ ముందుకు వేసుకుని విప్పి పూవు ను ఎగమీటుతూండగా వాటి సౌరభానికి తుమ్మెదలు మూగి ప్రమోగుతూ ఉంటే, దంతపు సరిగట్లమీద వీణవాయిస్తున్నట్టుంది

ఈ అతిలోక కల్పనలతో పద్యపు చిక్కదనంతో ఆముక్త కవి ముందు గుండె కట్టుకుంటాడు

తెలుగు సంస్కృతాలతో, అవసరాన్నిబట్టి జల్లులాడగల చేవ లవాడు

ఆ ఊరిలో ఒక ఉత్తమ గృహస్థు కనపడతాడు విష్ణుచిత్తుడు అతణ్ణి మ చిపోలేము 'గగనము నీటిబుగ్గకెనగా జడిపట్టిన నాళ్ళ' అనడు ఇల్లాలికి చేసేసాయం అతడు అతిదులకు పెట్టే 'తెలినులివెచ్చ యోగిరము తియ్యని చారలు' శనివారాల పరదేశి వైష్ణవులచే చేయించే అభ్యంజనాలు నడిరేయిలో నైనా ఆతని యింట ఎడతెగకుండా వినపడే 'నాగేంద్ర శయాను పుణ్య కథలు' వదలకుండా మనలను వెంటాడుతాయి

వెంటనే మధురాపురి వీధిలో ఉంటాము అది పుష్ప లంగడి అక్కడ పూబోడులే పుష్ప లమ్ముతారు వారు జగజాణలు మాట తో మూటలు లాగగలరు 'వెలది ఈ నీ దండవెల యెంత?' అని అడిగితే నా దండకును నెలఁబెట్ట నెవ్వని వరంబు' ౨-19 అని తెలుగులోనే తిప్పికొట్టగలరు ఆ అంగళ్ళు పూలరాసులు, అది ఒ అనూహ్య రమ్యాలోకం అందులోకి మొదట మనల్ని దించినవాడు ఈ కవియేనేమో !

రంగం మారుతుంది

'ఇల్లు ఊడ్వడమో నీళ్ళు తేవడమో, పల్లకి మోయడమో' మాత్రం ఎరిగిన అమాయిక వైష్ణవుణ్ణి మన్నవారు శాస్త్రవాదానిక ప్రోత్సహించాడు. 'ఏ యడ్డమునలవ దవలనే నున్నాఁడన్' అని వెన్నుతట్టి పంపాడు ఆతని ప్రయాణపు సరంజామా అతని అపూర్వమైన గెలుపు, రాజసభలలోని వాదపు

తీరు, కన్నులకు కట్టినట్లు వ్రాయడం స్వానుభవం లేనివానికి అలవికానివి ఓడినవారి తడబాటు, గాంభీర్య అభినయం, అమోఘంగా చిత్రించాడు పెరియాళ్వారు అదృష్టం పండి పద్మాక్షుడే ప్రత్యక్షమైనాడు

ఇంతవరకూ ఎత్తుకొన్న కథే - విస్తరించినా అనుబంధం తెగదు విష్ణు దేవుడు కోరి లక్ష్మిని పిలిచి యామునాచార్యుడూ, ఇతడూ గదా, నా దర్శనాల్ని (మతాన్ని) ఉద్ధరించినవారు! అని చెప్పి లక్ష్మీదేవి చేత అడిగించు కుని యామునాచార్యకథ సవిస్తరంగా చెబుతాడు దీని ప్రయోజనం శైవాన్ని తృణీకరించడం వైష్ణవాన్ని అగ్గించడం మాత్రమే అయి కవి వైష్ణవ పక్షపాతానికి తోవ తీసింది నిజానికి రాయల చరిత్రనుబట్టి చూస్తే - అతడు రాజ్యానుగతమైన శైవాన్ని విడచి వైష్ణవాన్ని స్వీకరించి వేంకటేశ్వర భక్తుడైనా - శివదూషణం గాని, శివ వైముఖ్యం గాని చూపిన జాడలు కనపడవు పైగా ఎన్నో శివక్షేత్రాలను దర్శించి సేవలు చేసినట్లు ఆధారా లున్నాయి అయితే ఇంత శివ తిరస్కారం అతని చేతినుంచి ఎట్లా వచ్చింది? అనేది పెద్దప్రశ్న - దానికి ఒకటే జవాబు తోస్తుంది అతడు శివ దైవ విముఖుడు కాకపోయినా వైష్ణవాభిముఖుడు బహుశా పురాణాల్లోని విష్ణు తిరస్కారానికి గట్టి ప్రతివాదం ఇవ్వడానికీ వైష్ణవ ప్రచారానికీ, యామున కథను అతికించాడు దాని ప్రారంభంలోనే - కవి హృదయం ఇట్లా వెల్లడౌతుంది

''వెఱ్ఱిశైవంబు ముదిరి మద్వినుతి వినఁడు
నతి యొసఁగఁడు మామక ప్రతిమలకును'' ౪-42

దీనివల్ల 'వెఱ్ఱిశైవం' అంటేనే అతనికి అప్రీతి అట్టి వారినే అతడు గేలిచేస్తాడు తనకట్టి వైష్ణవం లేదు తాను సాధువైష్ణవుడు కనుక వ్యక్తి గతంగా తాను శివ విరోధి కాక శివసేవలూ చేశాడు కాని ఇందులోని వీర వైష్ణవం వీర శైవులకు గట్టి జవాబు మాత్రమే

కథ తెచ్చి పెట్టినట్టున్నా - కవి హస్త కౌశలంవల్ల మరపురాని పాత్ర లను సృష్టించాడు

పాండ్యరాజు వచ్చిశైవుడు
అతని భార్య నూటికి నూరుపాళ్ళు వైష్ణవి

వీరి చమత్కారం భావ సంఘర్షణను బొమ్మగీచినట్టు చూపుతాడు

"శివలింగముఁదాల్చిన జన నివహంబేమైనఁజేయ,
నిదిపాపము గా నవు గాదనఁడు ౪-44

"శీలమునుబట్టి గంజా హాలలుపాంశువు
భుజించు నధముల బైటం జూఁడు వైవన్" ౪-47

శివలింగం దాల్చితే చాలు, వారు ఏ దుష్కృత్యాలు చేసినా పట్టించుకోడు శుద్ధమైన శైవం స్వీకరించికూడా గంజాయి సారాయి తాగిన వారిని మందలించడు

రాయలు గయ్యాళివ్వి ది ఇట్టి శైవాన్ని దానిపై పక్షపాతాన్ని, ఆ రాజు అట్లుండగా—

'ఆ రాజు మహిషి యేని మదారాధన పరుల నుండు,
భు డస్మదంఘ్రి భక్తుడు గామిన్
దుర్వారవ్యధకు పాలము గా దు' ౪-48

ఆమె అచ్చపు వైష్ణవి, అకరాలా పర్వదినాలలో విష్ణువ్రతం పాటించి ఆ మూడునాళ్ళు (దశమి, ఏకాదశి, ద్వాదశి) వతి ద చేదు నాల్గవనాడు కస్తూరీ తిలకం తుడిచి కర్పూర తిలకం ధరించి (విభూతికి మారుగా) భర్తను సేవిస్తుంది ఎట్టి తిరస్కారం చూపదు

అంతఃపురంలో ఏమి జరుగుతున్నదీ, తన కిష్టం లేకపోవచ్చు భార్య ఇష్టాన్ని తిరస్కరించడు ఆ పాండ్యరాజు ద్వైధీభావమే రాయలలోను గూఢంగా ఉంది కనుకనే వైష్ణవం మీద ఎంత మొగ్గుచూపినా 'తానుగా' శైవాన్ని అపహాసించలేదు దానికి ఫలితమే ఈ విష్ణువాక్యం—

'వనజజ రుద్రాదులు మత్తనువులె, తత్పూజనమ్ము
తథ్యము మత్పూజనమె, తత్ఫలదాతను నేనె' ౪-51

ఆ పై మొగ్గు 'కలవు తరతమ వృత్తుల్' వైష్ణవం 'ఉత్తమం' అని ఆయన ప్రశంస !

యామునుడు వైష్ణవ వటువు రాజసభలో వాదించి వైష్ణవాన్ని ఉద్ధరిస్తానని రాజసభకు వచ్చాడు

పాషాణపాకం మీద మోజు గలిగిన రాయలు, శైవులనుగాని చూడ నొల్లని పాండ్యుని మాటగా, తెలుగులో ఒడుపైన ఈ కాకువును హేలగా ఉపయోగిస్తాడు

"సంగతియె యోయి, యిసుమంత రింగణావు !
తత్త్వనిర్ణయ వాదంబు తగమె నీకు ?
ఓడితేనియు బట్టి మొట్టో యనంగ
లింగమునుగట్టు కుడుగ మెటింగి నొడువు !'' ౪-౬౦

అతడు విష్ణుదేవుడే పరతత్త్వమని ప్రతిష్ఠించి గెలిచి రాజు చెల్లెలిని పెండ్లి చేసుకుని రాజైనాడు

రెండు నిండు ఆశ్వాసాలలో విష్ణుమతాన్ని విస్తరించి వాదాలలో గెలిపించిన తర్వాత తృప్తిపడి రాయలు అసలు కథలోకి వచ్చాడు
విష్ణుచిత్తునకు వనవీథిలో గోదాదేవి దొరికింది
దంపతులిద్దరూ అల్లారుముద్దుగా పెంచారు

ఆమెకు యౌవనం వచ్చింది ఆ యౌవనాగమంలోని వ్యంగ్యం ఆ పదాల పోహళింపు మహాకవి కొక్కడికే సాధ్యం అని 'వాతెఱ తొంటి కైవడి మాట లాడదు' అనే సీసం రుజువు చేస్తుంది

ఆమె భూదేవి అవతారం ఆమెకు చెలిమికత్తెలుగా నాగకన్యలు, మరాళికా, ఏకావళీ, మనోజ్ఞా, స్రగ్విణీ నామాలతో పొరుగిండ్లలో పుట్టారు వారి పాటల్లో శ్రీహరి కల్యాణ గుణగానం విని పూర్వజన్మ సంస్కారంవల్ల అతణ్ణే వల్లభునిగా వరించి అతని కథలతోనే మనస్సును భావితం చేసుకుని తపించింది

"హేమచంద్రిక కట్టెదు కమ్మ చెంగల్వ విరుల
తోమాలె లలకలు దువ్వి కంతునకు బాహ్యానిబద్ధ ఖేటకం
బనగ నీల వృషక కుదేఖ నెడమ కొక్కింత యొఱగ
నిడిన ధమ్మిల్లి వలయంబు నడుగుపందు
గొంత సేపర్థి గీలించి కూపవ్వారి
నీడ వీక్షించి క్రమ్మర గూడ నునుచు'' ౫-౩౮

ఆమె దరించి విడిచిన ఆ పూమాల చెంగల్వ విరుల సరాలనే ఆ రంగ్రడి స్వామికి సమర్పించేవాడు. ఆమె సౌరాశి, దానిలోని దశావతారాలు, ఆమె గోల్లభామల మీద ఈసు. ఆ ప్రబంధ ధోరణిలో సాంగోపాంగంగా వర్ణించాడు. ఆ వర్ణన ఒకొక్కచోట బీభత్సాయపిచ్చై ఇంగించినా 'అబుద్ధేశు పసుః పత్రి' అను ఆ అమ్మాయిని తల్లిదండ్రులు కూడా అవస్థను చూచి ఆ నగర వెన్నునకు విన్నవించడం చమత్కారమైన హాస్యం కలిగిస్తుంది. మరి మే కాదు ఆ వెన్నునకు కూడా 'సచ్చారింద పంబునకు మందమ్మరంబు నేని' విష్ణుగాధ మహిమగా మాలదాసరి కథ చెబుతాడు

సంస్కారవంతులైన ఇద్దరు వైష్ణవోత్తముల కథలు చెప్పి, 'పేరుకొన గాని కులంబున బుట్టిన' ఒక విష్ణుభక్తుని త్యాగకథను చెబితేగాని నా వైష్ణవ పారమ్యం పూర్తికాదని కవి తలంచి ఉంటాడు అద్భుతమైన కథా రూపంలో ఆ కథను నిర్వహించాడు. అతడు ఎంత అవకరమైనవాడో అంత నిష్కాపటుడు. ఎంత జేల అయినవాడో, అంత బలవంతుడు. ఎంత తేలిక అయినవాడో, అంత త్యాగధనుడు

అతనికి నిత్యమూ తెల్లవారు జామున 'కురుంగుడి' కి వెళ్లి స్వామిని మంగళ కైశికి గానంతో సేవించిరావడం మామూలు. అతడు దారితప్పి ఒక అరణ్య ప్రదేశానికి చేరాడు అక్కడ ఒక మఱ్ఱిచెట్టు

"కాంచెన్ వైష్ణవు, డగ్ధరోహిణ్ జటా ఘూటోర్ధ్వ శాఖోపశా
ఖాంచ జ్ఞాట చరన్మరుద్రవపదవీయః ప్రేమికోద్ఘ్రాచ్ఛదో
దంచ త్కీకటకృత వ్రణచ్ఛలని లిప్యాగ్రపారోతా ఛన్నస్వని
స్సాంచారాత్త మహాఫలోపమ ఫలస్సాయ ద్వటక్ష్మాజమున్"

6—15

ఇందులో రెండు మాటలు తీసివేస్తే మిక్కిన పద్యమంతా ఒకటే సమాసం. ఇది రాయల పండబలానికి, గుండె బలానికి, తిరుగులేని ఉదాహరణం అతని ఉత్ప్రేక్షకు శిలాగోపురం.

పద్యంచూస్తే బ్రహ్మరాక్షసుని చూచినంత భయం వేస్తుంది దానని ఎదుర్కొనబోయే భయంకర సన్నివేశానికి పీఠిక. మఱ్ఱిచెట్టు ఆకులు గాలికి

దూరానికి పడతాయి. వాటిమీద పురుగులు కొట్టిన గీతలు. అవి ఇక్కడి కెవ్వరూ రావద్దు అని వ్రాసినట్టుంటాయి. అట్లా చెప్పిన పుణ్యానికి ఫలితంలా దాని నిండా ఎర్రని పండ్ల గుత్తులు ! అది దాటి వెళ్ళాడు.

లేత గుంజు పీల్చి పారవేసిన కొబ్బరి బొండాల్లాదొర్లే పుర్రెలు ! పైకి దొంగచూపులు చూస్తూ ఎముకలెత్తుకుపోయే నక్కలు! ఇవి రెండు మచ్చులు మాత్రమే ! ఏమి భయానక దృశ్యాలు ! ఎంత బీభత్స ప్రకృతి ! రాయల ప్రకృతి పర్యవేక్షణం ఎంత నిశితమైనదో - ఎంత చొచ్చి చొచ్చి చూడగలదో ఈ ఘట్టం చెబుతుంది. అతడు శృంగారం ఎంత లోతుగా చెప్పగలడో తక్కిన రసాలను గూడా అంత హాయిగా చెప్పగలడని నిరూపించే ఘట్టం ఇది.

దానికి కుంభజానువనే బ్రహ్మరాక్షసుని చూచాడు. అతని రూపం దుర్దర్శం. అతడు ఒక చచ్చిన మనుష్యుని బిగించి గోచిగా పెట్టుకుంటే అది చిటిలి బొడ్డు అంతా రక్తం చిమ్ముతున్నది. అతని మాటలు శ్రవణ శూలాలు. అతన్ని ఊహించి అక్షరాలలో ముద్రించడం ఒక్క ఆముక్తకర్తకే చెల్లింది.

దాసరి తెగువ తెచ్చుకొని అతనితో పోరి తుదకు చిక్కిపోయాడు. బ్రహ్మరాక్షసుని ఆనందానికి మేరలేదు.

> "సారాస్వాదన ఘ్రాణ పంచకము తృష్ణం బాఱ సంతర్పణ
> మ్మారం బో నరద్రుంచి పొంగెదు భవన్మాంసంబు ధారోష్ణమిం
> పారన్ గ్రోలి పిశాచి నీకు నలుకుట్లందీ నదస్థూల కాం
> తారాంగ ర్భ్రకపాల గుండ విగళన్మస్తిష్క పేయమున్ ద్రావెదన్"
>
> ౬-25.

దాసరికి శుష్క పాండిత్యం ఉంది. మీరు అమృతం త్రాగదగినవారు. మావంటి వారిని తినరాదు. అంటే అగ్ని సర్వభక్షకుడు గదా ! మాకూ అదే దారి. మీ హరిభక్తుడైన గరుడుడు దొరికిన అమృతం విడిచి పాములనే కూడుగా అడిగి వరం పొందినవాడే గదా !

> "అమృతమైనను జవుల జాత్యన్న సమమె ?" ౬-34.

జన్మ రాక్షసమైనా బుద్ధిలో ఇంకా తెలివి పనిచేస్తోంది. నీవు చదువులు చదివి మమ్మల్ని మెప్పించలేవు ఒక్కటిమాత్రం మెచ్చుకోవాలి; నువ్వు చదివిన కూరవు ! ఈ కూర రుచి మాత్రం దొడ్డది దాసరి వాదం వెంచలేదు.

'ఈ కురుంగుడి వైకుంఠుని బాడినత్తు ప్రసాదముగ'

'ఇడపట సతతము నీకౌదు' అని శపథం చేశాడు. రాక్షసుడు చదువు కొన్న మూర్ఖుడు! అతనికి దాసరిమీద ఎంత వెటకారం! దానిని ప్రతిభా నేత్రంతో పట్టుకొన్న కవిది ఎంత చురుకైన సుడికారం! అతనికి గొప్ప తెలుగు తెలుసునన్నదానికి ఈ మాటలు సాక్షి :

'ఈమమున్ ' గొంచెము చేసి ప్రాడ్గొటికినోఁ
దళపోసెదు; మెచ్చితిన్ నినున్' ౬-40.

దాసరి తుదిమాట :

'నిష్ఠురోక్తి నివ్వల నొక్కవేళ్ళ గణియించిన
పాపకి నౌదు నేడనే నెవ్విధినైన నిగ్గదియ నేని —'

రాక్షసుడు పోనిచ్చాడు. దాసరి మంగళ కైశికితో వెన్నుని సేవించి తిరిగివచ్చి నిశ్చింతంగా అంటాడు

ఎంత ధీరత్వం! ఎంత నిర్లిప్తత! ఎంత చురుకైన వెక్కిరింపు —

"నీ చెఱఁబాసి పోయి, రజనీచర! చక్రి భజింప ముక్తి పొం
దేవర యేచెఱం దవులనే నిను నుండగ జూడు పంచుచో
నే చరణంబు లేయుదర మేయురు మేశిర మే కరంబు లీ
వా చరణంబు లాయుదర మాయురు మాశిర మాకరంబు లున్"
౬-45.

నన్నయవంటి అక్షర రమ్యతతో పెద్దన సూక్తి నైపుణ్యంతో నిర్వహించిన ఈ పద్యం రాయల తెలుగు పదునుకు అద్దం వంటిది. దాసరి శరీర నిస్పృహా ఇట్టిది.

"ఊరక నీరు చెలది నేడు మూటాయిటి
దూది యెండ పసుపు దొట్టియక్క
రంబు మేను దీని రహిఁ బుణ్యమునమ్మట
రస్పురంబు వెట్టి యుప్పుగొనుట" ౬-62

రాక్షసుడు గానఫలంలో సగమైనా ఇమ్మని ప్రాధేయ పడతాడు. దాసరి తిరస్కారం బ్రహ్మ రాక్షసుని నలకింగులు చేసేటంత ఎదిగింది.

"ఎలా నొంచె గదే మెచ్చరి!...పాతాళ ప్రశ్నలు మాని మేన్
గొనుము; బేతాళచ్ఛలో క్తిన్ రుసన్ దూలింపన్
దలఁతేని – పుట్టు మఱి నూతుల్ ద్రవ్వ బేతాళముల్" ౬–65.

తుదకు ఆ బొమ్మ రక్కసుని దైన్యం చూడలేక ఆ రోజు పాడిన తాను గీత ఫలం ఇచ్చి దానికి ఆ రాక్షసుని గుర్భర జన్మనుంచి విముక్తి చేశాడు.

దీని సందేశం ఏమిటి?

అవిరళ విష్ణు భక్తితో తరించడానికి బ్రాహ్మణ వైష్ణవుడే అక్కరలేదు. కడజాతి వాడైనా తాను తరించి ఒక్కరోజు పాడిన గీతా ఫలంతో ఎంతటి పాపినైనా తరింపజేయగలడు.

విష్ణువుకు ఇంకొక వేల్పు సమానుడన్న పాపికినొగు. అనడం వైష్ణవ పారమ్యానికి అర్థవాదం మాత్రమే.

వరాహావతారంలో 'మహీమహిళ నీవి విశేష ఫలదంబు గానంబ' అని తలచి ఆమెయే ఈ జన్మలో గోదాదేవిగా పుట్టి ప్రణయగానం చేస్తున్నది. కనుక శ్రీరంగేశుణ్ణి సేవించి రావడానికి ఈ కథను ముడిపెట్టాడు.

తండ్రి కుమార్తెలిద్దరూ రంగనాథుని సేవించారు. రంగనాథుడు అసలు గోదను తన అంతఃపురంలో దాచి మాయామూర్తిని పల్లకిలో కూర్చొపెట్టడం, అమాయకుడు విష్ణుచిత్తుడు అలజడి పడడం, తీరా ఆమె ఇంటికిపోయి చూస్తే అక్కడే ఉండడం ఒక చమత్కారమైన హాస్యలీలగాసాగగా–విష్ణుచిత్తుడు స్వామినే ననఊరువచ్చి వధువును పరిగ్రహించమనడం, రంగనాథుడు ఆ పెద్దతనం మామకే ఉండనిమ్మని నిలుబుత్తూరు సపరివారంగావెళ్ళి వైభవోపేతంగా చూడమ్మను పెండ్లిఅడడంతో, కావ్యం సమాప్త మవుతుంది.

గోదాదేవి విష్ణుప్రీతిలో ఆధ్యాత్మికఔన్నత్యంకంటే ఒక ప్రబంధనాయిక శృంగారగాఢపరిమళమే ఎక్కువ కనిపిస్తుంది. ఈవాసన 'ఏవ న్ననదండ యొక్క మగవాఁడిడ మున్నుగొంటి'.అనడంలోను 'ప్రియాపరిభుక్త భాక్కథనే ఆ కొదువగప్పు' అనడంలోను ఘగులుతుంది. నాటికవులే శృంగారప్రియులు. అందులోనూ 'బహుళాంతఃపుర కామినీప్రసాదసరసికునకు' రాయనికి ఈ శృంగారాభిరతి అయత్నసిద్ధం. వసంతవర్ణనంలో, సృష్టని వెలియంతిపురముగా

నెన్నదగిన పద్మముఖుల ప్రసక్తిలో, పుష్పలావికల సాభిప్రాయ సరసాల్లో ఈ శృంగారసౌరభం గుప్పున పరిమళిస్తుంది.

పెండ్లిదగ్గర గోదాదేవీరంగనాయకులు అచ్చు క్రొత్తవధూవరులుగానే కనిపిస్తారు. తలంబ్రాలు పోయడానికిగోదచేతులెత్తితే నువరాకి సుబ్బపాలిండ్ల మీదే దృష్టి! ఆ గడుసుపిల్ల చేతు లెత్తకుండానే తలంబ్రాలు పైకి ఎగజిమ్ముతుంది.

ఆముక్తకవి ప్రకృతిపరిశీలనం అనన్యాదృశం. ఉంపుడుత్తు సింహాసనంమీద కూర్చుండి రాచకార్యాలు తీర్చేనిపుంతరిణ్వాకారిమన్నాడు, చప్పున ఆ సింహాసనందిగి, చెవులోతలులురెక్కల్లోగుచ్చి నిద్రపోయేబాతులను చూచి శ్రోత్రియులఉతికిముడిచినతడివస్త్రాలుగా భ్రమపడేవాణ్ణిచూచి, ఎప్పుడు నవ్వుతాండో తెలియదు.

వాకిటిలో పోసిన పండుగులను దప్పిపిల్లలుతినిపోతూఉంటే ద్రవిడ కన్యలు చెంగల్వలతో అదలించడం రెప్పవేయకుండా చూస్తాడు.

వర్షానికిభయపడి పచ్చపట్టుల్లో చేరినబాటసార్లు అశ్వపతిమీద గజపతిని, అతనిమీద ఇతన్నిపెట్టి మొత్తులాడుకొని వానవెగ్గగానే ఎవరిదారిని వారు పోవడం అలవోకగా గమనిస్తాడు.

గురుగుంజెంచెలి కూరతో కట్టావి ఆరగకూడు కుడిచి, ఉదూడలు పరిచం నాకుతూఉంటే మేకెరువు కుంపట్లదగ్గరహాయిగా నిద్రిపోయేరెడ్లను వదిలి పెట్టడు.

వేసవిలో వేడిఘూమిమీదపడ్డ పండువెన్నెల, చకోరపుపిల్లలకు పోసిన పెద్దదోసెగా చూస్తాడు.

అతనికి హంసపిల్లు పలువన్నెకట్లజెట్టీగా కనబడుతుంది. పాపం ఇల్లిల్లు దిరిగి ఒకింతసంపాదించిన అగ్గి రాజడానికిపేదగేస్తులుపడే బాధ ఆరాజు ఎప్పుడు చూచాడో! తెలియదు.

ఇందులోని "పురాపఠిత శాస్త్రగ్రంథ, జాత్యంధుడు" శాస్త్రపండితులను జయించడం, బీరపూవులవంటి నాణేలజాలె తెగిపడడం, యామునకథలో

రావాకుసాత్వం, తులసిపాదులో బాలికదొరకడం. అర్చామూర్తి రంగనాథుడు అచ్చంగావచ్చి పెండ్లాడడం, వంటివి అనా పురాణాన్ని వ్యపా భావించినా-దక్కినగ్రంథంలోని పదహారవశతాబ్దినాటి చారిత్రకసత్యాలను, సాంఘికజీవన విధానాన్ని అమోఘంగా చూపే ఉదాత్తగ్రంథం ఇది అనడానికి ఎట్టి సందేహమూ లేదు.

ఈ గ్రంథంలో స్పష్టంగా రెండుశైలులు ఉన్నాయి. ఒకటి ప్రసన్నమైన వైదర్భి రెండవది క్లిష్టమైన గౌడి ఈ భేదం పట్టించుకోకుండా ఉంటే పోయేది కాదు.

ఇంకొకటి ఏమిటంటే-రాయల పంచచరిత్రలో, దశావతారవర్ణనల్లో, మనుచరిత్ర పద్యాలు, భావాలు ఉన్నాయి. కనుకనే కొందరు ఈరచనపెద్దనది అన్నారు. కొన్ని చాటువుల్లోనూ 'ఆముక్త' పెద్దనరచన అని ఉగ్గడించడంఉంది. దీనివల్ల ఈకావ్యకర్తృత్వం పెద్దవివాదానికి దారి తీసింది.

ఆముక్తకు పిసులవ్యాఖ్యవ్రాసిన వేదంవారుకూడా అంతారాయల రచనే అని బల్లగుద్దిచెప్పలేక పెద్దన్నచేదోడు వాదోడుతో సాగిన రచన అని తేల్చారు.

మనుచరిత్రకారుని చేయిసోకిఉంటే ఉండవచ్చునుకాని - ఎవరో చేయూతఇస్తేనే పైకివచ్చిన రెండవరకం రచన మాత్రంకాదు, ఆముక్త మాల్యద.

కవిపేరు ఏదికాని ఆముక్తరచనమాత్రం ఒకమహాప్రతిభావంతుని చేతి నుండి వచ్చినది, అని చెప్పడానికి ఎట్టివిప్రతిపత్తి లేదు.

విశిష్టాద్వైత వాదంలో, అప్రసిద్ధ శబ్ద ప్రయోగంలో ఆంధ్రవ్యాకరణ సాధ్యాల్లో తత్తత్పండితులు వైమత్యం చెందవచ్చు. కల్పనా ప్రాభవంలో, రచనా స్నిగ్ధతలో ఈకృతికి ఈడదే సాటి - అనే మాట నిరాఘాటంగా చెప్ప వలసినది.

పింగళికవి ఇంద్రజాలం

ఏలా శరత్తుగా పేర్వడ 16 శతాబ్ది పూర్వార్ధంలో ఎంత ఎత్తైన బాటలు పులకించారో, ఉత్తరార్ధంలోకూడా అంతటి ఉన్నతులుగా ఉద్భవించారు.

వారిలో మొదటివాడు పింగళి సూరన్న. అతడు చేతిలో కలం పట్టుకొని రాలేదు. ఒక ఇంద్రజాలపింఛిక చేతపట్టుకొని అకస్మాత్తుగా ఆంధ్ర సాహిత్యం లోకి వచ్చి పడ్డాడు.

పూర్వులు తొక్కి విడిచిన మార్గాలేవీ అతనికి రుచించలేదు. తెలుగు కవితా ప్రపంచాన్ని ఒక ఊపు ఊపి కొత్త సంచలనం లేవదియ్యాలి

ఎట్లా?

ఏమి వ్రాసినా — అంతకుముందెవరూ ప్రక్రమించనిదే ఎత్తుకోవాలి. తన ఇంద్రజాల పింఛిక గిర్రున తిప్పితే కొత్తలోకాలు కనపడాలి. కళ్ళు మిరుమిట్లు కావాలి! అదీ కాంతి; అదీ తపస్సు; అదీ దీక్ష---

రెండు కథలు ఒక పద్యంలో కలిపికట్టి ఒక కావ్యం సాధించాలి. అట్లాంటివి చెప్పుకోడమేగాని అంతవరకు ఆంధ్ర సాహిత్యంలో అయిదు శతాబ్దాలు గడచినా రాలేదు కనక రాఘవ పాండవీయం నిర్మించాడు. అది సృష్టికాదు; నిర్మాణమే అయినా అది కొత్త-సాధించాడు. ఎవరూ శుభంమల్లె గరుడ పురాణంమీద చెయ్యి వెయ్యరు. అతడు నాకేం భయంలేదని వేసి చూపించాడు. అవి రెండూ ఒక సవాలు వంటివి. కళాత్మకాలుకావు. వాటి తర్వాత అతని ప్రజ్ఞాచదువు అచ్చపు కళమీద పడింది.

కళాపూర్ణోదయం పుట్టింది

వాణీ లీలావిలాసం దీని మూలబీజం. కనుక దీనికి శారదా విలాసం అని పేరు పెట్టవచ్చు కథ కంతటికీ నాయిక మధురలాలస. కాబట్టి కాదంబరివలె క్లుప్తంగా మధురలాలస అనవచ్చు ఇతివృత్త మంతటినీ అల్లుకొని ఉన్నది. కనక మణిహారం అని నామకరణం చేసినా ఉచితమే, అనిపిస్తుంది. కాని అవి ఏవీ స్వీకరించక కళాపూర్ణోదయం అని పేరు పెట్టడం కవి ఎంతో నిశిత దృష్టితో సాభిప్రాయంగా చేసిన పనిలా తోస్తుంది.

శబ్ద శిల్పాలు, భావచమత్కృతులు, వక్రోక్తి నైపుణ్యాలు, చతుర వచోరచనలు అన్నీ గౌణాలయాయి. ఆయా ప్రక్రియల్లో ఆరితేరిన రచనలూ వెనుకబట్టాయి.

అవే తీసుకుని ఎంత ప్రజ్ఞ చూపినా అంచుమించు నకలు అని అవుతుంది గాని స్వతంత్ర కృతి కాదు. పూర్వకృతుల్లో - అన్నింటిలో కాకపోయినా - కొన్నింటిలో అవగింజంత కథ అయితే ఆకాశమంత వర్ణనం.

ఎరగని, భావగత శిల్పం గాకుండా, కథాగతమహత్త్వ శిల్పంతో రచనను ఎందుకు కళాపూర్ణం చెయ్యకూడదు. లోకోత్తర వస్తుకల్పనంతో, అపూర్వ సన్నివేశచారిమతో భావుకులను చకితులను చెయ్యాలి.

నా రచన అనిదం పూర్వం అనిపించు. వాణి స్వప్నసృష్టికి మూలభూతులైన సరస్వతీ బ్రహ్మలే ఈ అద్వితీయ కళాసృష్టికి మూలం ఎందుకు కాకూడదు. వాణీ చతుర్ముఖుల లీలావిలాసం నుంచే నా కళకు పూర్ణాభ్యుదయం చేకూరాలి అని దృఢంగా సంకల్పించి అక్కడినుంచే సంలగ్నకథను ఉదయింపచేశాడు పింగళి సూరన.

వాణీ చతుర్ముఖుల దాంపత్యమాధుర్యం ఇట్టిదో మనం సూరన మాటల్లోనే చూడవచ్చు —

“నీ సుప్రసాద సన్నిధి మహాత్త్వము సుమీ
నిగమరాశి ముఖస్థమగుట నాకు
నీ విలాసమిచర్చికా విశేషము సుమీ
సంగీత సాహిత్య సౌరభంబు

నీ పదునుగ్రహాలీల గావించుటయ సుమీ
యఖిలలోక స్థావరాదిసిద్ధి” [కళా. ౩ 114]

ఈ ‘నిగమరాశి ముఖస్థమగుట’ను
‘సంగీత సాహిత్య సౌరభాన్ని’ —

అసలలోని వస్తువహారసిద్ధిని కళాపూర్ణోదయంలో పూర్తిగా ఉపయోగించుకున్న తర్వాతనే సూరన ఈ పద్యం వ్రాశాడు.

ఇందులోని ప్రథమాగమాదులు, ‘కళా’ టీక స్త్రీ ఎరగని, పూర్వాపర సర్వకథా ఈ పద్యానికి సారభూతమైనవే.

సంగీతానికి కలభాషిణి సంకేతం అయితే సాహిత్య సంగీతాలకు మణికంధరుడు ప్రతీక. నారదముని వీణను కలభాషిణే వహించింది. శ్రీకృష్ణుని సంగీతానుగ్రహానికి పాత్రురాలైంది అతిలోక మోహనమైన ఆమె సంగీతం వినడానికి మణిస్తంభుడు వెతుక్కుంటూ వచ్చాడు.

మణికంధరుని దండక రచన విని వాసుదేవుడు మణిహారం ఇచ్చాడు. అభినవ కౌముది పాలయ్యలుకి మాన్పించి చమత్కారంలో దింపడానికి కళాపూర్ణ రూపంలోని మణికంధరుడు రెండర్థాల కందపద్యం విసిరాడు.

అంతకుముందు ప్రథమాగ మాదులు మదాళసయుని కొలువులో 'ప్రాకృత జనులవలె ప్రవేశించినప్పుడు చెప్పిన కందపద్యాన్ని ఒక విధంగా విరిస్తే సంస్కృతం అవడం వేరొక విధంగా విభజిస్తే తెలుగుపద్యం కావడం ఒక విధమైన సాహిత్యక్రీడే అంతేకాదు కళాపూర్ణుని సభలో ప్రథమాగముడు చదివిన పద్యం ముందునుంచి చదివితే తెలుగు కావడం వెనుకనుంచి చదివితే సంస్కృతమైపోవడం, రచనలోని ఒక లీలా విలాసమే ఇవి అన్నీ సాహిత్యంలోని ఎంత పోకడలు, వెంకెరాకడలు!

ఇట్టి సంగీత సాహిత్యాల విజృంభణం ఒకవైపు సాగితే, రెండోవైపు అద్భుత కథాసృష్టిలోని హస్తకౌశలం పైచేయిఅయి మొత్తంమీద కళాపూర్ణోదయంగా [illegible].

సాధారణంగా అంతవరకూ వచ్చిన ప్రబంధాలకు మూలకథ ఏ పురాణంలోనో, ఇతిహాసంలోనో, కొంత ఉండడం మామూలు. కాని కళాపూర్ణోదయ అద్భుతకథకు మూలం ఇదమిత్థమని ఎక్కడా కనబడదు.

లింగపురాణంలోని నారద తుంబుర గానస్పర్ధ, కృష్ణాంతఃపురంలోని నారద గానాభ్యాసం, శ్రీకృష్ణానుగ్రహం మున్నగు అంశాలేకాక అందలి గానప్రశంస, యోగప్రసక్తి, విష్ణుమహిమ, వగైరాలుకూడ కళాపూర్ణ కథకు కొంతవరకు ఊతనిచ్చాయని[1] అభిజ్ఞుల వచనం. అంతేకాక సరస్వతీ చతుర్ముఖ ప్రణయలీలలకు కూడా ఒకింత మూలం ఏ పురాణంలోనైనా వెదకితే కనపడ వచ్చునని వారి అనుమానం.

1. దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారి వ్యాసం. భారతి.

అయితే కళాపూర్ణోదయ మహత్తు కల్పనకు ఆ అంశాల ప్రాధాన్యం చాలదు వాటికి అతీతమైన అపూర్వ సంఘటనంతో ఆ కావ్యం బలిసి ఉన్నది ఇది ఎక్కువ తెల్పిన కావ్యమే అనడానికి బహుగ్రంథ ద్రష్టఅయిన పెనుచ[illegible] ప్రత్తి వచనమే ఎక్కువ ప్రమాణం కాకపోతే ఇందులోని అంశాలు [illegible] ప్రామాణ్యం కూడ ఉందని సంప్రదాయవాదులను సంతృప్తిపరిచడానికి పూర్వోక్త సన్నివేశాలు ఉపయోగించవచ్చు

కళాపూర్ణోదయ విశిష్టత ఏమిటంటే-అంత వరకూ ఏ పద్య కావ్యం లోను అంత జిలుగు [illegible] లేదు సంస్కృతంలోగాని, తెలుగులోగాని [illegible] కావ్యం [illegible] వస్తు నిర్దేశంతో ప్రారంభమయి నాయక ప్రవేశంతో ముందు జరిగి, ఘటనమీద ఘటనగా కొనసాగి రసాభివ్యక్తితో వర్ణన ప్రాచుర్యంలో భావుక హృదయ రంజనంగా ముగుస్తుంది

[illegible], కథాచమత్కారానికి విడదీయరాని సంబంధం ఉంది బాణుని కాదంబరి అట్టి కథా విశ్వరూపానికి తార్కాణ [illegible] కథా కావ్యాల[illegible] అలని కాదంబరీ కల్పన మేలుబంతిఅయి ఎన్నో కథా కావ్యాలకు జన్మనిచ్చింది

కళాపూర్ణోదయం పుట్టుకచే పద్యకావ్యమై, ప్రవృత్తిచేత గద్యకావ్య ధోరణిలో విస్తరించింది వెన్నుతట్టి కళాపూర్ణ రచనకు ప్రోత్సహించింది కాదంబరి అని నిరాఘాటంగా చెప్పవచ్చు అనుకనే అతడు పద్యకావ్య సంప్రదాయమైన కాలక్రమ వస్తువిన్యాసాన్ని అవలంబించక - కార్యకారణ సంబంధాన్ని స్వీకరించి కాదంబరీ పాఠకులవలె కళాపూర్ణ పాఠకులను కూడ [illegible] చకితులను చేశాడు

పలువురు కావ్యరసజ్ఞులు 'బాణోచ్ఛిష్టం జగత్సర్వమ్' అని 'కాదంబరీ రసజ్ఞానామాహారోపి న రోచతే' అని ప్రశంసా పరంపరలు కురిపించటంవల్ల పండిత లోకంలో దానిమీద మోజు పెరిగింది కాని దానిపక్కనే 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అనే నిషేధవచనానికి అసత్కావ్యాలు పాత్రమని చెబుతూ కొందరు, కాదంబరివంటివి అని ఉదాహరించడం లేకపోలేదు అయితే కాదంబరి ఎందుకు అసత్కావ్యం? అనే ప్రశ్న రాకతప్పదు దానికి పండితులు చెప్పే సమాధానం ఇది 'కాదంబరి రసబంధురం కావచ్చు' పాండిత్య ప్రకర్షకం కావచ్చు కాని అది రామాయణ భారతాదులవలె ఉత్తమ ధర్మనీతి ప్రబోధకం కాదు

త్యాగమయ ఆదర్శప్రాయ జీవన ప్రబోధ ముఖ్యం కాదు. చాల [illegible] అద్భుత కథా నిర్వహణం, కల్పనామయ ఊర్ధ్వలోక ప్రదర్శనం, అపార పాండితీ విస్ఫురణం, అక్కడక్కడ కనిపించే నీతి ధర్మవచనాలు ఉపదేశోక్తులు ఆనుషంగికాలు. ప్రకరణ వశాన వచ్చిపోయే [illegible]ప్రాయాలు. వాటికి అంతగా ప్రాధాన్యం లేదు. భారతీయ ప్రాణతంతులైన ధర్మప్రబోధం, కర్తవ్యప్రచోదనం లేకపోయినప్పుడు అది ఎంత గొప్ప రచన అయినా రెండవపక్షమే. కనుకనే రామాయణ భారతాలకు ప్రజలమీద ఉన్న ప్రభావం, లోకాతిశయ కథాసముద్రమైన బృహత్కథకు లేకుండాపోయింది. ఆ బృహత్కథా ప్రభావంతో పుట్టిన కాదంబరి [illegible]గా ఎంత గౌరవమైనా ఉండవచ్చునుగాని ధార్మిక పూజ్యభావం మాత్రం ఏర్పడడం దుర్ఘటం.

కళాపూర్ణోదయం కాదంబరి స్థాయిలో పుట్టిపెరిగినా అసత్కావ్యముద్ర పడకుండా తప్పించుకుంది. కావ్య ప్రారంభంలోని ద్వారకా ప్రవేశం, శ్రీకృష్ణస్తవం, మణికంధరుని తీర్థయాత్రా సందర్భంలోని [illegible] దృష్టి, కావ్యాంతమందలి విష్ణులోక దర్శనమూ, లక్ష్మీనారాయణ సంవాదమూ దీన్ని బృహత్కథాపరిధి నుంచి పైకెత్తి భగవత్ ప్రపత్తితో పూతం చేసింది.

అయితే కథ కట్టుబడిలోని అసహజ సంఘటనలూ అభూత కల్పనలూ కళాపూర్ణోదయాన్ని వదలలేదు. కాదంబరిలోని చంద్రాపీడుని వైశంపాయనుని మూడు జన్మల జిలుగుకథా, అప్సరో లోకాల అపూర్వ సంబంధాల వంటివి ఇందులోను [illegible] సరస్వతీ శాపగ్రస్తమైన చిలుకకు మూడు జన్మలు, మణికంధరునికి రెండు పుట్టుకలు, వాటిని చుట్టుకొని ఉన్న కతల అల్లికలు.

సింహంమీద సవారిచేసే సిద్ధులు, కాళికాలయంలోని శిలావరాలు, వాటి ఘోర నియమాలు, తత్ఫలితాలు, శిరచ్ఛేదాలు, మళ్ళీ అతుకడాలు, సముద్రంలో తిమిశిరోరంధ్రం నుంచి బుస్సని లేచిన జలస్రోతస్సు నుంచి ఎగిరిన మనుష్యులు, [illegible] ప్రశ్నలను ప్రశ్నించే రాక్షసుడు, నూరు [illegible]లో నిశ్చింతగా కూర్చున్న యోగీశ్వరుడు ఇట్లా ఎన్నింటితోనో నిబిడమైన కథ [illegible]. ఏది ఏమైనా అంతవరకు కావ్యాలలో కనపడని విస్మయకర కథావిన్యాసంచేత కళాపూర్ణోదయం

విలక్షణంగా ఉండి పాఠకులను విశేషంగా ఆకర్షించింది. అంతేకాకుండా ఇందులో ఇంకొక గొప్ప సుగుణం ఉంది.

గ్రాహ్యమైన కథకు తోడు కాదంబరీ శైలి ప్రౌఢమై పండితైక వేద్యమై సాధారణ పాఠకులకు అగ్రాహ్యమైంది. ఈ చిక్కు గ్రహించిన సూరన ఈ కావ్యంలో ప్రసన్నమైన కథనశైలిని అవలంబించాడు. తను చెప్పే కథలోని చమత్కృతిని గ్రహించడానికి గాని పద్యరచనగాని భావంగాని అడ్డురాకూడదు.

వర్ణనాంశాల్లోగాని ప్రత్యేక ప్రయోజనం ఉన్నప్పుడుగాని అలాంటి ప్రౌఢభాషను ఉపయోగించలేదు. ఇంతకుముందే పాండిత్య ప్రకర్ష చూపుతూ ఒక శ్లేష (ద్వ్యర్థి) కావ్యం వ్రాసినా ఆ వ్యామోహం కళాపూర్ణోదయం లోనికి రానివ్వలేదు. షష్ఠాశ్వాసంలోని సభంగశ్లేషకును అనులోమవిలోమ రచనకును ఏర్పడిన అవసరం అందరికీ తెలిసినదే.

ధారాళమైన తెలుగు నుడికారంతో పద్యాన్ని నడపడంలో, భావాన్ని పొందికగా పద్యంలో అమర్చడంలో తిక్కనార్యుని తీరును పుణికి పుచ్చుకున్నాడు. ఆ కథకు ఆ శైలి బంగారంలో మాణిక్యం అద్దినట్టు సరిపోయింది.

అనూహ్యమైన చోట మొదలుపెట్టి పాఠకుని కుతూహలాన్ని రెట్టిస్తూ ముడులను కల్పించి వాటిని విప్పుతూ చమత్కారంగా ముగించడం మంచి కథకుని లక్షణం. అది నేటి నవలల్లోనే కాదు, ఆనాటి కథాకావ్యాల్లోను మనకు దర్శనమిస్తుంది.

క్లుప్తంగా కళాపూర్ణోదయ కథ ఇది —

ఒక రాజసభ దాని మధ్య తొట్టెలో రెండు నెలల వయస్సు బాలిక. రాజు ఆ శిశువు మెడలో కానుకగా ఒక మణిహారం వేశాడు. అది చూచి బాలిక కపకప నవ్వి 'ఆహా! ఈ హారాన్ని రెండేళ్ళ మళ్లా [illegible]ను' అంది. ఆ మాటవిని అక్కడి వారందరూ అచ్చెరువులో మునిగి 'పిల్లా! నువ్వు సామాన్యబాలవు కావు. దేవతామూర్తివి! నీ మాటేకాదు, కథా అపూర్వమే' చెప్పు అన్నారు. ఆమె ఇట్లా మొదలు పెట్టింది.

ఎత్తుగీతి —

"ఒక యపూర్వ కథ-ననుజ్ఞ్వ లసద్రస, భావ
మాయు రభ్యుదయ, కులాభివృద్ధి
హేతు వది పవిత్ర, మిప్పుడు వినిపింప
గలిగె, జిహ్వకలిమి ఫలమునొందు" కళా-1-11

వాణీ చతుర్ముఖుల శృంగార క్రీడలో వాగ్దేవి పరవశించి కంఠంలో ఒక అవ్యక్తమైన ధ్వని చేసింది. ప్రక్కనే ఉన్న పెంపుడు చిలుక ఆ ధ్వనిని అనుకరించి పదేపదే ఆవర్తింపజేయటం మొదలుపెట్టింది. ఆ ఆది దంపతుల దర్శనానికి వచ్చిన రంభ కొసరి కొసరి చిలకచేత ధ్వని చేయించి నేర్చుకుంది. ఆ ధ్వనికి కారణమైన వాస్తవం గ్రహించి పొంచి ఉంది. ఇదంతా గమనించిన సరస్వతీదేవి చిలుక మీద కోపగించి నీవు భూలోకంలో వేశ్యవై పుడతావు అని శపించింది. బ్రహ్మదేవుడు చిలుక మీద జాలిపడి—మీ అమ్మ శాపం తప్పదు కాని, ఆ ధ్వని విన్నవాళ్ళు భూమిలో పుట్టి ఆయురైశ్వర్యాలు పొందుతారు. నీవు ఆ తరువాత జన్మలో పతివ్రతవై ఒక మహారాజు భార్యవవుతావు అని అనుగ్రహించాడు.

ఆ చిలుకయే ద్వారకానగరంలో కలభాషిణి అనే వేశ్య బాలికగా పుట్టింది. ఒక సారి విమానంలో వెళ్ళే రంభా నలకూబరులను చూచి నలకూబరుడి మీద వ్యామోహం పెంచుకుంది. తర్వాత నారదుడు మణికంధరులతో పరిచయం అయింది. నారదుని శిష్యురాలయింది. ఆయన దయవల్ల ఏ స్త్రీ రూపమైనా ధరించగల వరం పొందింది.

మణికంధరుని కవిత్వం విని ఈపనకే వాసుదేవుడు అతనికొక మణిహారం కానుకగా ఇచ్చియున్నాడు.

నారదుడు సంగీతంలో కృష్ణానుగ్రహం పొందాలని మణికంధరునికా అది లభించింది.

నారదుడు ఇచ్చవచ్చిన చోటికిపోగా మణికంధరుడు తీర్థయాత్రలకు వెళ్ళాడు.

నలకూబరుని మోహంలో పడిన కలభాషిణిని మోసగించి మణిస్తంభుడనే సిద్ధుడు, తన సింహవాహనంమీద ఆమెను 'నీకిష్టమైన చోటికి చేరుస్తా'నని చెప్పి మృగేంద్రవాహన అనే కాళికాదేవికి బలి ఇవ్వడానికి తీసుకుపోతాడు.

ఆ గుడిలో ఇదివరకే సుముఖాసత్తి అనే వృద్ధస్త్రీ ఉండి కలభాషిణికి సిద్ధుని మోసం చెప్పి నిన్ను కాళికి బలి వేయడానికి తీసుకవచ్చాడని వివరించింది సిద్ధుడు వేశ్యా బాలికను బలిచెయ్యడానికి సిద్ధపడగా—ఆ ముదుసలి సుముఖాసత్తి తన మెడను అడ్డంపెట్టి ఆమెను రక్షించింది కాని సిద్ధుడు కలభాషిణి జుట్టు పట్టుకుని విడవకుండా ఆమెతోకూడా ఎగిరి అడవిలో ఒక నికుంజంలో పడ్డాడు అక్కడ కలభాషిణిని భోగింపదలచగా ఆమె ఎలుగెత్తి మొరపెట్టింది

ఆ మొరవిని నలకూబరుడు సిద్ధుని తరిమివేసి తిరిగిరాగా రంభ ఎదురుపడ్డది ఆమెతో అతడు క్రీడిస్తూండగా, వేరొక రంభవచ్చి 'ఇది దొంగరంభ' అని రుజువుచేసి నీవు శక్తిచేత మృత్యువు పొందుతావని దొంగ రంభను శపించింది ఇంతలో వేరొక నలకూబరుడు ఆ కడకు వచ్చి 'ముందున్నవాడు దొంగ' అని ఋజువుచేసి నీ ఆయువు క్షీణిస్తుంది అని అతనిని శపిస్తాడు

తొలి రంభా నలకూబరులు మాయారూపాలతో ఉన్న కలభాషిణీ మణికంధరులు

మళ్లా అందరూ మృగేంద్ర వాహనాలయంలో కలుస్తారు కలభాషిణి గుండె రాయిచేసుకుని రంభా శాపఫలంగా సిద్ధుణ్ణి తన సఖి సరమంటుంది అతడా పనిని మణికంధరునిచేత చేయిస్తాడు తలపడి బడి, కలభాషిణి కాళి దయవల్ల మళ్ళా బ్రతికి ద్వారకకు చేరుకుంటుంది

మణికంధరుడు తన వీణను గుడిలో ఒకచోట దాచి మణిహారాన్ని అలఘువ్రతుడనే బ్రాహ్మణుడికిచ్చి తన ఆయువు తీరిందని శ్రీశైలంవద్ద భృగుపాతానికి (కొండ కొననుండి దూకి చావడం) సిద్ధపడి అభినవ కౌముది అనే అచ్చర ప్రేరణవల్ల ఆమె యిచ్చిన శక్తితో ఆమెను వెంటదరిమే శలాసురుణ్ణి చంపి తాను వాడిచేత మరణిస్తాడు

సుముఖాసత్తి మణిస్తంభులు గుడిలోనే ఉన్నారు కాని వారు పూర్వంవలె ఇప్పుడు విరోధులు కారు సుముఖాసత్తికి, తాను కలభాషిణి యెడల చేసిన త్యాగానికి కాళిదయవల్ల యౌవనం వచ్చి తళతళ లాడింది వారిద్దరూ పూర్వజన్మలోని ఉగ్రాక్షి శ్రీకంఠులను దంపతులే అని సప్రమాణంగా నిరూపణ జరుగుతుంది

వారు కొంత కాలం కాశీకాలయంలోనే నియమబద్ధులై యుండి సింహ వాహనంమీద విహారానికి బయలుదేరి సంచరిస్తూ, దాంపత్య ధర్మంమీద మనసు తగిలి, స్త్రీ పురుష రూపాలు మార్చుకుని సంసారం చేస్తారు.

స్త్రీ రూపంలోని మణిస్తంభునకు గర్భంవస్తుంది. సుముఖానస్త పురుష రూపంలో భర్త అవుతాంది. వారు తిరిగి తిరిగి కాసారపురంచేరి సత్త్వదాత్ము డనే రాజు పట్టాభిషేకానికి పాత్రులై ఉన్నారు. మణిస్తంభుడు ప్రసవించగా చక్కని కుమారుడు పుట్టి సద్యోయౌవను డైనాడు. సత్త్వదాత్ముడు ఆ కుమా రుని అంగదేశంలో క్రముక పురోత్తర పురానికి రాజునుచేసి తాను మంత్రి అవుతాడు. పిమ్మట అభినవ కౌముది ఆ రాజు భార్య అవుతుంది

మదాశయుడనే రాజు విజయగర్వితుడై, క్రముక పురరాజుపై దండెత్తి ఓడిపోను, తన భార్య రూపానుభూతితో, మంత్రులు ప్రథమాగ మాదులతో క్రముక పురరాజుకు లొంగి అతని కొలువులో ఉంటారు.

ఆరాజే కళాపూర్ణుడు. అతనికి స్వభావుడనే సిద్ధుడు ఒక విల్లును, శక్తి మంతములైన బాణాలను, ఒక సముజ్జ్వలమణిని ఇచ్చియున్నాడు. ఆ మణి దర్శన మహిమవల్ల రూపానుభూతికి మధురలాలస అనే బిడ్డ పుట్టింది.

కాలక్రమాంతరంవల్ల మదాశయుడు రాజాదరణకు దూరమై స్వస్థలానికి పోతూఉండగా బిడ్డ అస్వస్థురాలైంది. వారు మరల రాజాస్థానానికి వచ్చి చేరగా మణి దర్శనంవల్ల మధురలాలస స్వస్థురాలైంది.

మదాశయుడు పురోహితులున్నూ మణి మహిమకు వశీకృతులై కళా పూర్ణ సభలోనే స్థిరపడ్డారు.

మృగేంద్ర వాహనాలయంలో జపవిధిలో ఉన్న అఘుప్రవతుడు ఒక గాలిపాటుకు ఎగిరివచ్చి, కళాపూర్ణ సభామధ్యంలో పడి మణికంధరుడిచ్చిన మణిహారాన్ని కళాపూర్ణునకు కానుక పెట్టాడు.

అతడు ఇప్పటి కానుకలన్నీ ఈ బంగారు తొట్టెలోని పాపకు చెందవలసి నట్టివే అని ఆ బాలిక మెడలో వేశాడు. ఆ మణిహార స్పర్శవల్ల ఆ పాపకు పూర్వజన్మ స్మృతులన్నీ వచ్చి-అంతవరకు పూర్వోత్తర వృత్తంలో కవి దాచి ఉంచిన కథలన్నీ పూస గుచ్చినట్టు చెప్పింది.

ఇక్కడ కళాపూర్ణకథ ప్రారంభం అవుతుంది. మధురలాలస పెరిగి పెద్దదయింది. కళాపూర్ణుని డేగవేటలో చూచి మోహిస్తుంది అంతకుముందే ఆమె తలిదండ్రులను అత్తమామలుగా భావించిన రాజు, ఆమెను కొత్తగా చూచి విరహాకులు డౌతాడు. అక్కడ ఆమె విరాళి; అచ్చపు ప్రబంధలాంఛనాలన్నీ ఇక్కడవచ్చి వ్రాలాయి.

పరస్పర సందేశాలు, పెళ్ళి ముచ్చటలు, నిర్వాణ పడకటింటి శృంగార ప్రకాశం.

కళాపూర్ణునికు అభినవ కౌముది, మధురలాలస అని ఇద్దరు భార్యలు కదా! ముందు అభినవ కౌముది సమ్మతి తోనే రాజు మధురలాలసను పెండ్లాడినా, వారిద్దరిలోను సంగీత వివాదం వచ్చి 'అభినవ' చిన్నబుచ్చుకుంది 'మధురకు' సవతి ఈసుశాస్త్రోక్తంగానే వచ్చింది వారిని తేర్చ ఒకతెకు తాను పూర్వజన్మలో కాళికాలయంలో దాచిన వీణను తెచ్చి ఇస్తానని, వేరొకతెకు అఖిలరాజుల రాణివాసపు రత్నకిరీటాల రత్నాలు తెచ్చి కాలియందెలు చేయిస్తానని ప్రతిజ్ఞచేసి దిగ్విజయ యాత్ర చేస్తాడు యుద్ధాలు చేస్తాడు. విజయం సాధిస్తాడు. వీణతెచ్చి 'అభినవ'కు, రత్నాల మంజీరాలు చేయించి 'మధురకు' తృప్తి కలిగిస్తాడు. మధురలాలస పాత మణిహారాన్ని పైకితీసి తన మెడకు సరిదిద్ది దాని మహిమవల్ల (మధ్యమణి)మిగిలిపోయిన సత్త్వదాత్ముని కథ అంతా చెబుతుంది.

కళాపూర్ణ పుష్పహారంలో గుచ్చిన దారంలా నిండిఉన్న మణిహారకథ ఇక్కడ సుప్రకాశితం అవుతుంది. శాఖోపశాఖలుగా విస్తరించిన ఉపాఖ్యానాలకూ, సూక్ష్మాంశాలకు పోకుండా చూస్తే కళాపూర్ణ స్థూల రేఖ ఇవి.

ఇందులో అయిదు ప్రణయకథలు, నాలుగు ప్రణయేతర కథలూ, ప్రధాన కథతో అల్లుకొని ఉన్నాయి.

మొదటి ప్రణయకథ సరస్వతీ బ్రహ్మలది. వారి శృంగార లీలకు సంబంధించిన అంశాలకు మూర్తిమత్త్వం కల్పించి చేసిన అల్లికలో కళాపూర్ణ కథ. ఉద్భవించింది. ఇది కవి భావనా బలానికి తిరుగులేని నిదర్శనం. ఇది సభ్యమైన ఉత్తను దాంపత్య ధర్మానికి ప్రతీక. కాని శరీర స్పర్శలేని దివ్య సీమలో

విహరించలేదు పెద్దింటి దంపతు శృంగారానుభూతిలో స్పృహణీయమై నిలిచింది

రెండవది కలభాషిణీ మణికంధరుల కథ —

కలభాషిణి వేశ్యా మా సౌందర్యరాశి రంభతో పోటీపడదగ్గది కులవృత్తి వీడినట్టు నబడదు 'అత్యపూర్వ నిర్వర్తిత పంచబాణ సమర క్రియలన్ .. హరింప దొడగెన్ విటసంచయ చిత్తవిత్తముల్" (౧౩౩) అనడంచేత వసంపసేన వంటి శుద్ధశీల అనే అవకాశంలేదు నలకూబరుని మీద మోజు, మణికంధరుని మీద ఇష్టం రెండవదానికంటె మొదటిది పైచేయి అయింది

అయితే ఆమె ప్రేమకోసం చేసిన సాహసంలో, త్యాగంలో మణికంధరుని వద్ద చూపిన నిజాయితీతో మన సానుభూతిని చూరగొన్నది మొదట కనపడ్డ సాధారణ నాయిక, అసాధారణంగా ఎదిగి బ్రహ్మావరం సార్థకం చేసుకున్న ఉత్తమ నాయిక అయింది

మణికంధరునికి కలభాషిణి మీద మనసున్నా చెప్పలేని పరిస్థితి తపోభంగం చేసుకుని రంభ వలలోపడ్డ దయనీయుడు పశ్చాత్తప్తుడై విధి కృతమైన ప్రియాహత్యకు సిద్ధపడి, భృగువాతానికి వెనుదీయక శల్యాసురుని చంపి తాను చచ్చిన సాహసికుడు

ఇద్దరిదీ మూగప్రేమ స్వస్వ శరీరాలతో సఫలం కా పోయినా అన్య రూపాలతో ఫలించి తృప్తినిచ్చింది

మూడవది సుగాత్రీశాలీనుల కథ —

ఆ ముక్తమాల్యద అనగానే మాలదాసరి కథ జ్ఞాపకం వచ్చినట్టు ఈ కావ్యం పేరు తలపెట్టగానే స్ఫురణకు వగిలే గొప్పకథ ఇది

తెలుగులో ఇంతగొప్ప కథ ఇంతవ కు పుట్టలేదు, అనూహ్యమై సంఘటనలు అపూర్వమైన పాత్ర సృష్టి వలవని తలంపు ముగింపు

భూషణాలు గిట్టని వరుడు! భూషణాలు విడవని వధువు ఒకరి కొకరు అర్థంకాని మనస్సులు

అతని ప్రేమ పొందే కిటుకు ఆమెకు తెలియదు.

ఆమె హృదయాన్ని స్పృశించే రహస్యం అతనికి అవగతం కాదు.

నిరాభరణమైన స్వచ్ఛ సౌందర్యం హఠాత్తుగా అతనికి ప్రత్యక్షమైంది. దాన్ని రెండు చేతులా చూరగొన్నాడు. పడకటిల్లు వెగటు, పూలతోట పగటు. రాత్రి శివరాత్రి, పగలు సుగాత్రి.

ఎరుడు సంతానం వద్దంటే వధువు కావాలంది. ఇద్దరికీ సరస్వతమ్మ వరాలిచ్చింది. అవి వ్యత్యస్త రూపాలలో ఫలితానికొచ్చాయి. ముందు విరోధులు, తరువాత అనురోధులు అయి, కళాపూర్ణుని కన్నారు.

ఈ అచ్చపు ప్రేమకథలో సూరన్నగారి హృదయం ఇమిడి ఉందా? అనిపిస్తుంది, కవిస్వభావంగా కూడా.

నాల్గవది శల్యాసురకథ —

వాడు అసలు రాక్షసుడు. [illegible], అచ్చపు, వాడికి ఆమెమీద తగని మోహం. ఆమెకు అతనిమీద తగని అసహ్యం. ఆమె ముట్టాకకుండా గాయపరచకుండా ఎంత బీభత్సమైనా చేశాడు. ఆమె లొంగలేదు. మణికంధరుని చేతికి కత్తినిచ్చి చంపించింది. వాడు ఆమెపై అనురాగంతో హాయిగా చచ్చిపోయాడు. రాక్షస ప్రేమలోకూడా ఎంత హృదయం ఉంచాడు కవి!

అయిదవది విమానంలోని దివ్యమిదున కథ —

తిమి చిమ్మిన నీటిధారతో ఎగిరిపడ్డ బ్రాహ్మణ యువతులు అందుకున్న, విమానంలో ఉన్న, ఒక జంట, [illegible]ట్టింపులూ లేవు. జూదమాడుతూ తాగుతూ ఆడుతారట. పెరవారి దగ్గర సిగ్గులేదు. పెదవులు నంజుకుంటూ మద్యంతాగి విపరీతలౌతారట! ఆ స్వైర విహారంలో ప్రేమకంటె కామానిది రాజ్యం. స్త్రీ పురుషుల చిత్తగుహలను కాగడాలతో శోధించి, అనురాగ వైవిధ్యానికి సూరన ఇచ్చిన భాష్యం ఇది! ఇన్ని అనురాగాలలోను తెనుగు మాటకారితనమే, సరసమే, ప్రత్యక్షమవుతాయి.

ఈ పద్యంలో తెలుగు ప్రౌఢ దంపతులు జ్ఞాపకం వస్తారు. బ్రహ్మ సరస్వతితో అన్నమాట—

'అనుకుం బై . ఖు మాఽ గాక యిది యా
హా యాత్మ శృంగా ~ శో
భ. లీలా ౧సుళ మేఠి ౨ ప్రియము ? నీ
సల్కున్ మనోవర్తనం
బును నేకంబగునేని, నాలు. తుదన్
ముక్కందికోమ్మా, విలా
సిని! యే నమ్మెదనంచు బ్రహ్మాగి
పించెన్ మేలమాటన్ సతిన్ ' ॥ 65

తెలుగు వులు అం.ర్ముఖులై కవిత్వమంటే ఎవరికి తోచిన నిర్వచనాలు వారు వా క్రుచ్చారు అయితే అవి సంస్కృతాలంకారికుల సూత్రాల్లా ఉండవు ౹మ అనుభూతులను ప్రవచించినట్లు కనపడతాయి

"పూ౹వమెఱుంగులున్ పసరుపూప బెడంగులు చూపునట్టివా క్రైతలు? ' ఇత్యాదిగా ఎందరో తమ అనుభూతి సారాన్ని ప్రదర్శించారు

సూరన కవితామయంగానే ౧విత్వాన్ని నిర్వచించాడు దానినే ౹ రచనలో సహస్రముఖాల దర్శింపజేయడానికి తపించాడు

'చల్లని వెన్నెలలకు సువాసన ఉంటే—

సువాసనా చల్లదనమూ, కలిగిన పచ్చ౹ప్పురపు పలుకులకు మెత్తద౹ం, ఉంటే—

పరిమళమూ, చల్లదనమూ ౹ ఉన్న మలయమారుతానికి తియ్యదనం కూడా ఉంటే - అప్పుడు ఈ సుకవి ౹లుకులకు పోలిక కుదిరిందని చెప్పవచ్చు (౧-83)

మాటల ౹స్పష్టత, కూర్పులోని ఇంపు, పాషాణ శబ్దాల పరిహారం ణం, అన్నీ కలిసి - రసన్యందిగా ఉంటే ఆ కవికి అప్రాప్యం ఏమిటి

ఈ అవగాహన ఏతన్మాత్రునికి కలిగేదికాదు ఏ బలహీనతో పైకొని అలంకారాలు గుప్పితే, పాండిత్యం తల ఎరలోసుకుంటే, రసం వేంట రాపాడిస్తే ఆ కావ్యం అతని చేయిదాటి వెళ్ళదు

ఈ పద్యానికి ముందున్న పద్యంలో ఆ పరిజ్ఞానాన్ని స్పష్టపరచడానికి ప్రయత్నం చేసినా, ఆ జ్ఞానాని కంతటికీ ఫలితం ఈ విధంగా [illegible] కవి భావంగా కనబడుతుంది

ఆ పద్యంలోని మొదటిపాదం "పొసగ మన్ త్రైపురరుల్ పో [illegible] లీలందినములోన దొ[illegible]యు శబ్దములు, గూర్చి" అనే దానిలో ఆయన హృదయ ధర్మం నిస్పష్టంగా ప్రతిఫలించింది

అయితే ఆరో ఆశ్వాసంలోని అనులోమవిలోమాదులు ఆనాటి వారిని వ్యామోహపరచే చణుకులు గాని ఆయన అంతరంగంలో నుంచి వచ్చినవి కావు తన నాటి దేశకాలాభిరుచులను తృప్తి పరచడం కూడా కవి కర్తవ్యమేకదా!

ఆమె [illegible]ణిక పత్రమో పుష్పమో పుచ్చుకొని ఇచ్చిన వారిని సంతోష పెట్టడం వారిని దీనిని ఊతగా గొని ఆయన చేసిన చమత్కారం ఆయన లోకజ్ఞత, ఉక్తి చాతుర్యానిక నిదర్శనం

"పయట చెఱంగు శాఖ యను పాణిఁ దెమల్చుచు, నోలతాంగి! తాఁ
బ్రియముగ భృంగ కైరవ నిరీక్షణముల్ కుచకుట్మలంబులం
యి కొన నొప్పు పల్లవ శిఖామణి, మామిడి, [illegible]వోవునే?
భ[illegible]మిఁక నేల? దేమి నటఁ బ్ర[illegible] బుష్పము [illegible]ందితో"

౧-౩౫

ఈ పద్యానికి జీవమిచ్చిన 'పల్లవ శిఖామణి' పదము, పుష్పము అనే చతురోక్తులు

[illegible]భాషిణి చెలులు ఉయ్యాలలూగుతున్నారు వారు ఒక ఉయ్యాలలో శరీరమంతా కదలిపోగా ఊంకించి ఉయ్యాలలూగడం ఒక చూడముచ్చట కవియే కానక్కరలేదు ఎవరైనా ఏదో అనాలని తోచే సంఘటన, ఇక ఇవే అయితే —

"తమిఁ బూదీఁ గెలతూఁ గుటుయ్యాలలఁ బంతాలాడుచుం దూగునా
కొమరుం బ్రాయపు గబ్బిగుబ్బెతల యంఘ్రుల్ చక్కగా సాగి మిం
టి మొగంబై చనుదెంచు రీవిఁ గనుగొంచే దివ్య మౌనీంద్ర! నా
మృగీ నేత్రల మీఁదఁ గయ్యమునకున్ గాల్ దాఁచులా గొప్పెడిన్"

౧-49

అంటాడు. దేవకాంతల మీద కయ్యానికి కాలుదువ్వుతున్నా విన్నది చక్కని ఉత్ప్రేక్షే. కాని అందులో లేదు విశేషం. అప్రయత్నంగా అన్నట్టున్న ఈ మాటలలో కథాప్రాణం ఉండడం కవి గడుసుదనం. ఆ మాట విన్న ఎవ డైనా 'భళిరా, సత్కవివౌదు' అనకుండా ఉండలేడు. ఆ సత్కవిత్వం దేనిలో ఉంది ? సామాన్యమైన ఉత్ప్రేక్షలోనా ? రంభను తలదన్నబోయే కల భామినిలోనా ?

రెండిటిలోనూ భావించడంలోనే రసజ్ఞత సార్థకం అవుతుంది. ఉదా హృతమైన రెండు పద్యాలశైలీ ప్రాబంధికం కాదు. అచ్చ తెలుగు నుడి కారంతో తళతళ మెరిసేది

శైలిని మించిన భావం, భావాన్ని మించిన శైలీ చాలాచోట్ల చూస్తాం. జిలుగు కథను అలవోకగా చెప్పడం ఈయన నేర్చిన విద్య.

కలభాషిణీ మణిస్తంభుల సంభాషణల్లో మాయారంభా నలకూబర సంవాదాల్లో, సుగాత్రీ శాలీనుల గాథలో, వాణీ చతుర్ముఖుల సరసక్రీడలో, ఇట్లాంటి ఎన్నోచోట్ల తెలుగుకవి కథ చెప్పేతీరు, నుడికారపు పసందు కన పడుతుంది.

మణిస్తంభుడు సింహాన్ని నిలిపాడు. కలభాషిణి ఎక్కింది. అప్పుడు

"ఎక్కి సిద్ధేశ! ఎవ్వరు నెఱుఁగకుండ
నెట్లు గ[illegible]? యన' నేలశంక ?
ఎందు నెద్దులు బండియు నేకమైనఁ
గొండమీదికిఁ బోవునో కొమ్మ'' యనుచు 3-70

నింగికి 'ఛే'యని కదలిం
చెం గడు వడిగలుగు తనదు సింగముఁ బలుమా
ఱుం గలభాషిణిఁ దేటిక
నుంగొని 'పదిలమ్ము సు'మ్మనుచు శీఘ్రగతిన్ 3-71

సుగాత్రీ శాలీనులు శారదాపీఠపు పూజారి ఇంటి ఆలుమగలు. ప్రబంధపు మూసపోత శృంగారంకాక అచ్చపు తెలుగు సంసారపు తీరువారు.

పడకటింటిలో శాలీనునివద్ద సుగాత్రి [illegible] భూషిత, శాలీనుడు.

'తోఁట బరువులు వారుచు తోటపనులు
సేయు రూపుమదిన్ హత్తి పాయకనికి'

వేరొక సుగాత్రిని ఊహించలేడు ఈ మనస్సంఘర్షణ చిత్రమైనది సిగ్గుపడి
నిలుచున్న ఆడుపడుచు తెగించి ఇట్లా అంటుంది—

''అటా యేమని దూఱుదానమిము నా
థా! వేగుజామయ్యెఁ, బోం
దికగాఁ బాదము లొత్తరమ్మనుటగా
నీ, యొంటియేమో కదా
నింటఁబోణికి నేగుదెమ్మనుటగా
నీ, కొంత నెయ్యంపుఁబూ
నింతో గన్నులు విచ్చి చూచుటయొకా
నీ తేప యొక్కింతయున్ ౨ 116

రాయైనఁ గొంతమేల్ 'నా
రాయణ' మీ మనసుకంటె రహినీక నెపుడున్
మీ యంతఁ దడవెగ రెయని
యా యంగన యతనిపాద మల్లన పట్టెన్ ౪-119

కథనములు ఇట్లా ఉండగా వర్ణనల్లో సుగాత్రి తోటపనులలోని శ్రమా
కులిత సుందరరూపం మాయారంభగా మారిన కలభాషిణి మనోజ్ఞత, తిమి
శిరోరంధ్రం నుండి ఎగసిపడిన బ్రాహ్మణ యువతుల రామణీయకం, మణి
కంధరుడు యాత్రలో చూచిన శ్రీరంగ, శ్రీశైల శోభలు, విష్ణులోక దివ్య
దర్శనం పేర్కొ దగ్గవి

ఈయన సంగీత, యోగ, శిల్ప పరిజ్ఞానం ద్వితీయ, పంచమ, అష్టమాశ్వా
సాలలో దర్శనమిస్తుంది

తెలుగు లోకోక్తులను ఎంత సమయోచితంగా వాడవచ్చునో తెలిసి
కావ్యమంతా పొదిగిన కృతహస్తుడు ఒక్కొక్కచోట లక్షణాన్ని అటుపెట్టి
తెలుగు వ్యవహారాన్ని ఒడిసిపట్టి వాడగలవాడు శుష్కతార్కిక, వైయా

రణ, మీ మాంసకాయంబును గేలిచేసే నిజమైన భక్తియోగింలో పండిన పక్వ హృదయుడు అలాశేతుణ ప్రీతి, వైష్ణవ పక్షం, అతనికి రెండు కన్నులు

అట్టి వాడికి పట్టిన దురదృష్టం ఒక్కటే ఒక్కటి - అది ప్రబంధ లక్షణాలన్నీ గుది గుచ్చాలనే చాపల్యం దానితో సప్తమాష్టమ వ్యాపారాలు పుట్టి, చేతికి ఆరోవేలులా రచనను కొందరికి వికృతం చేశాయి అయితే కళాపూర్ణుడికి మచ్చ కూడా సహజమే కాని ఆ మచ్చ కళాపూర్ణోదయ గుణ బాహుళ్యంలో మునిగి కనపడదు

సూరనగారి కడగొట్టు కావ్యం ప్రభావతీ ప్రద్యుమ్నం కళాపూర్ణోదయం సర్వవిధాల ఎంత పెద్దదో ప్రభావతి అంత చిన్నకావ్యం అయినా ఆయనకు దానిమీద, కడగొట్టు సంతానంమీద ఉండే లాంటి మురిపం

జనులు మెచ్చేలాగు గారుడ, రాఘవ కళాపూర్ణ కావ్యాలు వ్రాసినా - అవి తనకు సంతుష్టి ఇవ్వలేదనీ కనుకనే ప్రభావతి వ్రాస్తున్నాననీ ఆయన తన నోటితో అన్నాడు అయితే ఆ అసంతుష్టి కావ్యాలకు చెందినది కాదు, వ్యక్తిగతం

పిత్రాది వంశాభివర్ణనం లేకపోవడం దానికి కారణమంటాడు ఈ ఒక్క కారణం సంపన్నమవడమే ప్రభావతి యోగ్యత కాక - కావ్యకళలో కూడ ఆయన కృతహస్తత ప్రభావతిలో కనపడుతుంది కళాపూర్ణం కేవల కల్పితకథ కావడంచేత సాంప్రదాయకుల ఆక్షేపణ తటస్థిస్తే పురాణ మూలకమైన కథతో ఆ కళంకాన్ని తుడుచుకోవాలని ప్రభావతి వ్రాశాడని కొందరి ఊహ అయితే దానికి బలంలేదు పూర్వోక్త కావ్యాలన్నీ 'జనముల్ మెచ్చగ' వ్రాశానని చెప్పిన ఆయన మాటలో ఈ శంకాలేశం కనబడదు

తెల్గులో కొత్త ప్రక్రియ అయిన ద్వ్యర్థి కావ్యానికీ, అపూర్వ కథా విలసితమూ, అద్వితీయ భావనాలసితమూ అయిన కళాపూర్ణకూ - కొందరు ఛాందసుల మాట అలా ఉంచితే - మెప్పు అసంభవంకాదు ప్రభావతి పుట్టుకకు ఇంకో కొత్త ధోరణిలో కావ్యం వ్రాయాలనే కుతూహలమే ముఖ్య కారణం అందులోని 'పిత్రాది వంశాభివర్ణనం' లేనికి మరింత సంతుష్టి కలిగించి ఉండవచ్చు దానిని ప్రియంగా చెప్పగోనూవచ్చు

ఇంతకూ దీనిమూలం సంశయగ్రస్తమే కాని నిర్వివాదంకాదు కావ్యారంభంలో కవి - 'అఘపావన, హరివంశ, కథాశ్రయంబు' అని కంఠోక్తిగా చెప్పినా [1]ఇద్దరు విమర్శకులు ఈ కథ హరివంశంలో కనపడలేదన్నారు హరివంశంలో కనపడే ఉషానిరుద్ధ కథనే పేర్లుమార్చి ప్రభావతిగా వ్రాశాడన్నారు [2] వేరొకరు హరివంశంలో వజ్రనాభకథ ఉన్నదనీ దానినిబట్టే 12 శతాబ్దిలో రవివర్మ భూపుడనే రాజకవి నాటకం వ్రాసాడనీ నాటకకర్త వజ్రనాభ కథకు చేసిన మార్పులకన్న సూరన ప్రభావతీ కావ్య నిర్వహణమే రసవంతంగా ఉన్నదనీ అసందిగ్ధంగా వ్రాశారు ఇప్పుడా పురాణంగాని, సంస్కృత నాటకంగాని సులభ సాధ్యాలు కావు దొరికినా కళామూల్యానుశీలనంలో వాటి పాత్ర చాలా తక్కువ కవి సత్యవాదిల మీద సంశయించడం కంటె అది నమ్మి కావ్య హృదయంలోకి ప్రవేశించడమే ఉత్తమంగా తోస్తుంది

కవి శుచిముఖిని గూర్చి అన్న 'కలరాజు' అనే మాట దీనికే వర్తిస్తుంది సూరన కళాపూర్ణలో నిజంగా కలరాజు అది గొప్ప కథాకావ్యం అయితే నాటక శిల్పంతో ఒక రచన చెయ్యాలని సంకల్పించాడు ఆ విధంగానే ఇంద్రమాతలులను ప్రథమాశ్వాసంలో ప్రవేశపెట్టి శాకుంతలంలోని దుష్యంత రథసారథులను స్ఫురింపజేస్తాడు

వారి సంభాషణం, కృష్ణదర్శన భాషణాదులు నాటక వాక్యో వాక్యాలంత సజీవంగా నడుస్తాయి

ఈ కావ్య భవనానికి పునాది భద్రుడనే నటుడు అయితే దానిపై సుందర భవనం లేపిన ఘనత శుచిముఖి అనే హంసిది

వజ్రపురికి వజ్రనాభుడనే రాక్షసుడు రాజు వాని తమ్ముడు సునాభుడు

వజ్రనాభ పుత్రి ప్రభావతి, సునాభ పుత్రికలు చంద్రవతీ గుణవతులు.

వజ్రపురిలో వాని అనుమతి లేకుండా గాలికూడా చొరరాదు అది బ్రహ్మవరం

వాని ధాటికి దేవేంద్రుడు తాళలేక కృష్ణుని శరణు పొందాడు ఆయనకూ ఆపురి అప్రవేశ్యం

---

1 తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, ప్రభావతి పీఠిక 4 పుట

2 తెలుగు విజ్ఞాన సర్వస్వం పింగళి సూరన పుట 1216

వసుదేవుని యజ్ఞ సందర్భంలో భద్రుడనే నటుడు తన నటవర్గంతో ప్రదర్శనాలిచ్చి సభ్యులను ఆనందపరచాడు సభలోని వటువుల భద్రుని, వివాదంలో కృష్ణునకు ఉపశ్రుతి దొరికింది. నటవేషంలో తన వారిని పంపి వజ్రనాభ సంహారం చేయించవచ్చుననే ఊత దొరికింది.

దేవేంద్ర ప్రేరణంతో శుచిముఖి అనే హంసి, కృష్ణుని తనయుడు ప్రద్యుమ్నునకూ వజ్రనాభపుత్రి ప్రభావతికి ప్రేమకలాపం నడిపింది సునాభ పుత్రికలు గదసాంబులతో ఒక చిలుకద్వారా ప్రణయం సాగించారు.

ప్రద్యుమ్నుడు గదసాంబులు తోడుగా నటవర్గం ఏర్పరచి శుచిముఖి ద్వారా వజ్రపురి ప్రవేశం సంపాదించి అంతఃపుర అంతరంగం సాధించి ప్రభావతిని చేపట్టాడు. గదసాంబులు చంద్రవతీ గుణవతుల సాంగత్యం పొందారు.

ముగ్గురికి సంతానప్రాప్తి అయింది ప్రభావతీ పుత్రుడు వజ్రపురికి ఏలిక అవుతాడని పార్వతీదేవి వరం. తదనుసారంగానే వజ్రనాభాదులు తమ అంతిపురిలోని కుట్ర కనిపెట్టి యుద్ధం చేయడం, కృష్ణాదుల ఆగమనం యాదవ విజయం యథావిధిగా జరిగిపోతాయి. ప్రభావతీ పుత్రాదులు రాక్షసరాజ్యానికి రాజులవుతారు.

ఈ చిన్నకథలో కవి కల్పించిన సన్నివేశ చాతుర్యం, దానివల్ల మలుపులు తీసుకునే ఇతి వృత్తం, పాఠకుల ఉత్కంఠను పెంచుతూ ఇంపుగా చదివిస్తాయి.

యాగ సందర్భంలో బ్రాహ్మణ వటువులు భద్రనటునకు తమ కౌపీనాలు కానుకగా ఇచ్చి పొగడమంటే అతడు అవి అందుకొని నుద్దుగా వారిని ప్రస్తుతించడం, వారు ఆ పొగడ్త చాలక నటులను ముచ్చులని తెగడి ఆటలు పట్టించడం, హాస్యస్ఫోరకమే కాక - శ్రీకృష్ణునకు కర్తవ్యంచూపే ఉపశ్రుతి కావడం గమనించదగ్గ సంఘటన.

హంసి శుచిముఖి, నైషధంలోని హంసకన్న ఏడాకు లెక్కువ చదివిన జగజాణ.

"ఓ వరటామణి! విహంగయోషవె? భాషా ప్రావీణ్యము చూడగ వాగ్దేవతవో? కాగ యోగాజగద్ధిత 'వినో!" అని ఇంద్రుడు ప్రశంసిస్తే

హంస, “ అనిమిషవం! అప్పుడెట్టి యర్థమును దిగుల్కొనఁ, దివియ వెలివో నిచ్చునె? బుధుఁడూహించి చేయు సుకవిప్వంబుల్” అన్న మాటల్లో ప్రకృత …ప్రమేయం ఉన్న సూరన్నగారి స్వరచనా వ్యాఖ్యానమే ఎక్కువగా స్ఫురిస్తుంది హంసి అంతటితో ఊరుకోక ఆత్మకథ ఇట్లా చెప్పుతుంది

> “విను సురేంద్ర! పద్మజుని తేరుదివుచు సా
> రంధరాఖ్యుఁడగు మరాళ విభుని
> బిడ్డ నేను' వాణి పెనుపంగఁ బెంగ …
> ద్విమల శిషగంటి విద్యలెల్ల-” ౨-6

ఈ ప్రావీణ్యం ఆ పాత్ర ప్రవృత్తిలో అడుగడుగునా వికసించి - ప్రద్యుమ్నుని ఆకర్షించడంలో, ప్రభావతి గుట్టు కనుక్కోవడంలో, నిర్లిప్తత నటిస్తూనే తన పని చక్క బెట్టుకోవడంలో మెరుస్తూ కనిపిస్తుంది అంతేకాదు వజ్రహృదయుడు వజ్రనాభుని లోగొనడంలో, కృతార్థమై నటవేషాలలోని ప్రద్యుమ్నాదులను నిరాఘాటంగా నగరంలో ప్రవేశపెట్టడంతో, సార్థకం అవుతుంది శుచిముఖి ఎవ్వరోకాదు, … కాయ ప్రవేశంచేసి బాహాటంగా సంచరించిన సూరనగారే! అనిపిస్తుంది

> ‘కాణాదంబును, గౌతమీయమును, సాంఖ్యంబున్

భుంజగాగ్రణీ వాణీ మార్గాదుల్లో విహరించడం, ‘కావ్య నాటకాలంకార, గాన మదన శాస్త్ర పంచమ మహిమంబు, నెఱపి’ అసురభర్తను ‘పురే’ అనిపించడం శుచిముఖిలోని సూరనార్యునికే సాధ్యం

…శ్యం … అయిన ఈ కవి కళా వివేచనం, అనలంకృతమైన అచ్చపు అందాన్ని …చడం అనన్యాదృశంగా ఊహించడం ఎంచి ప్రశంసించ దగ్గవి—

పార్వతి గీచిన చిత్రపటం మన ఎదుటికి ఇట్లా వస్తుంది

> “…లకల నవ్వినట్లు, తెలికన్నుల నిక్కము చూచినట్లు, తోఁ
> బలుక గడంగినట్లు కడుభావగభీరత లబ్బినట్లు, పెం
> పొలయఁ దనర్చి జీవకళ యుట్టిపడన్ శివ వ్రాసినట్టి యా
> చెలువున … మము భజింపఁదలంకెను దానుబోటియున్” ౧-188

రా॥ వల్లరి ప్రభావతి వేణీసౌందర్యానికి విస్మితురాలవుతుంది

"విరిసిన నొక్క యొప్పు, విరవీడిన వేరొక యొప్పు చిక్కు వా
టొందిన నొక్కయొప్పు, నదియూడ్చిన వేరొక యొప్పు, వేణి
భావ రచన నొక్కయొప్పు, ముడివైచిన వేరొకయొప్పు, కొప్పుగా
బరగిన నొక్కయొప్పు, గనుపట్టెం మానదు సికవంబులన్'' ..132

ఈ ఒప్పుల కుప్పను ఎందరు మంది చూడగలరు?

హంసి ఊహలో మెరుగులీనే ప్రభావతి రూపవైభవం —

"తిలకము సంహితోర్ధ్వ ముఖతీక్షణ శరాగ్రముగాగ, నాసికాం
చల విలసత్ప్రకోష్ఠ సుమసాయక ముష్టి, గ్రహీత మధ్యశా
ర్ఙ్గ లతయనన్, బొమల్ దనరగా నిరుగొమ్మల ప్రేలు వెల్లజ
ల్లుల గతి నవ్వుడాలు పొదలున్, మదిరాక్షి మెఱుంగు జెక్కులన్''
..2 69

ఈ కావ్యంలోనూ ఆనాడు తప్పించుకోలేని ప్రబంధపు అచ్చులూ అరిగిపోయిన ఉత్ప్రేక్షాదులు ఉన్నాయి ఇంకొక లోటు-సమప్రాధాన్యం పొందవలసిన వజ్రనాభ వధావ్యూహం వీర రస ప్రాచుర్యం మందగించి శృంగారం హద్దుమీరి బలియడం అంత హర్షించదగ్గది కాదు

అయితే మొత్తంమీద చిత్ర కవితా వికారాలకు చోటివ్వకుండా మనోధర్మంతో గణ్యమైన మధుర కావ్యం ప్రభావతి అని నిర్వివాదంగా చెప్పవచ్చు

రచనలో ముందుదైనా రసంలో వెనకదైనా రాఘవ పాండవీయం గురించి రెండు మాటలు

వేములవాడ భీమకవి రామభారత కథలు లిపి ద్వ్యర్థి కావ్యంగా వ్రాసినాడనే ప్రతీతేగాని అది కనపడదు ఆ ద్వ్యర్థకృతి వ్రాసే నైపుణి నీకున్నది కనక వ్రాయుమని అకువీటి వేంకటాద్రి ప్రభువుకోరగా సూరన వ్రాశాడు

" ఓహో యనం జేయదే, పాండిత్యంబు దముం దెవ్వాండల రామ
భారత కథల్ జోడింప భాషాకృతిన్'' అని కృతిపతి ప్రోత్సాహం

రెండు కథలు ఒక కావ్యంలో జోడించి వ్రాయడం నిజానికి పెద్ద ప్రజ్ఞయే కావచ్చు అది సామాన్యులకు దుస్సాధ్యమూ కావచ్చు కాని కావ్యానికి ప్రాణభూతమైన రసంపాలు అందులో ఎంత అనేది పెద్దప్రశ్న-ఇది 'పాండిత్యంబున ఓహో అనంజేయ' వలెననే ఆయన కోరికగాని రసభరితం అవుతుందని ఆయనా భావించలేదనే ఊహించవచ్చు

కనుకనే 'చూపెదఁ జమత్కృతుల మత్కృతి సుప్రకృతిత్వమున్' అని చమత్కారానికి ప్రాధాన్యం ఇచ్చి వ్రాశాడు అదీ ఎక్కువ శబ్ద సంబంధి'

సాధ్యమైనంత వరకూ ఉభయ సామాన్యమైన ఘట్టాలు ఎన్నుకొని అర్థం స్వీయం సాధించాడు ఉదాహరణకు వేట దశరథ పాండురాజుల కథలు, దశరథ పాండురాజుల సంతానాపేక్ష, సీతా ద్రౌపదీ స్వయంవరాలు, ఇత్యాదులు అట్లా కలిసి వచ్చాయి నిజానికి 24 వేల శ్లోకాల రామాయణాన్ని, లక్ష గ్రంథమైన భారతాన్ని నాలుగాశ్వాసాల ప్రబంధంగా కుదించడానికి ఎంత మనస్సును, శబ్దాన్ని కట్టుకుంటే సాధ్యమో అభిజ్ఞులు ఆలోచించవలరు

ఏది ఏమైనా ఆనాడది సాహసోపేతమైన అద్భుతకృత్యం దాన్ని సాధించి సూరన సమర్థుడనిపించుకున్నాడు

ఒక్కొకచోట గడుసైన శబ్దాల విరుపులో పాండురంగపల్లి నిప్పన్న మైన అర్థాంతర ఘటనలో సూరన నేర్పును చూచి మెచ్చుకోకపోము దశరథ పాండురాజుల వేటలో—

"ఏనుంగని కరి మృగయక
పూనితిగా కిట్టి యెడలఁ బొసఁగునె యేయన్
గానమె కాల నియమగతి
తో నా వేట మునియుగము ద్రుంగించెఁ దుదన్''

రాఘవ ౧-25

అనే పద్యం చూచినప్పుడు—

వచనములు ఉభయరాజులతో—

'ఎందు వేఁటరారె యితరు లేమనసుతో
దారి సంగసుఖము తప్పఁద్రోచి

ట పాండురాజ యశమెన్నవై తి
ర్యాగ్ర దశరథేశ కులను రోయ" ౧-31

అన్న మాటలు పఠికించి నపుడు ఆ మాటల ప్రయోగాలలో సాధించిన అర్థద్వయం హృద్య మనిపిస్తుంది

శ్రీ రామార్జునుల స్వయంవర ఘట్టంలో శబ్దశక్తి వల్ల సాధ్యమైన సవ్యార్థ గమనింపదగ్గది

"అనుపమ దివ్య విక్రమ సమగ్రుడు, రాముడు ఘండు జిష్ణుడా
యనిశం భేద్య రౌద్రధను వక్రమభంగిగ వంచె బాహు లీ
ల నెరపె నక్రభగా నిమిష స్ఫురదంబక వృత్తి నుర్వరా
జన హృదయాంతి వర్తనవమా జాల ... తవార్ధి ముంచుచున్" ౨-56

సూరన గిరిజాకల్యాణమనే మరో కావ్యం ద్వా సట్టు లక్షణగ్రంథాల్లో ఉదాహృతమైనా అది లభ్యంకాదు కాకపోయినా సూరనార్యుని ప్రబంధ యుగంలో ఒక విశిష్టభద్ర పీఠంమీద కూర్చోబెట్టడానికి మనకు లభిస్తూన్న ౩ పుస్తకాలే చాలు

మూర్తి కవి భూషణమార్గం

"... నెత్తం ... పాంసలీ ... ధు
స్పందంబు సేయన్ శుభా
...దమౌ రా కదంబు శుద్ధి మా
న్ శ్రీవిలాసంబు కేల్
గదలింపన్ సుకుమా... ల్లవ నవై
లా లక్ష్మి వీక్షింప ష
ట్పదియుం బొల్పుగ, దరంబెకన్నెగొనియా
డన్ గేయ వాక్రొన్ధిమన్" ౩-59

"శ్రీ నిధి! భవ దఖినివిశ
న్మానస ఈ సింధుతనయ మహనీయ గుణ
శ్రీ నుతికి నెక్కు నేడీ
మౌనిదయా మందరాగ మహిమను కలిమిన్! ౩-60

ఈ పద్యాలలో నాగు మూర్తికవి చిరునవ్వుతో కనిపిస్తాడు మంజు భాషిణి గిరికను అనడంకాదు నేనంటాను 'తరంబె వానికి గేయ, వాక్ప్రౌఢిమన్' అని వసు చరిత్ర చూస్తూ—

అతడు పదం ఉచ్చరిస్తేచాలు హంస ఒయ్యారాలు పోతుంది పెదవి కదిపితేచాలు అనురాగం ముందు 'సద్యశ్శ్లిష్ట గ్రంథ కల్పనుడు సర్వజ్ఞ సంగీత కళారహస్యనిధి' ఆ రెండు సువాసనలు ఇందులో కొట్టి అంటుకుంటాయి

పాట ఎత్తితే అవ్యక్త మధురధ్వనా? పెదవి విప్పితే రాగమాలికా? చెవి ఒగ్గితే శ్రీరాగమా చేయిత్రిప్పితే పలపాటా? కన్నెత్తి చూస్తే అరు పాదాల గీతికా? అవుతుంది

వాక్ప్రౌడిమ ఏదీ! అది ఇది పాదమెత్తితే హంసలీల, పెదవి కదిపితే రాగ సౌందర్యం, చెవులు శ్రీకారాలు, చేయి కదిలిస్తే పలికే తీగ సొగసులు, చూపు నిలిపితే తుమ్మెదచాలు

భేష్-ఇవి తెచ్చుకుంటేరావు, పుట్టుంతో రావాలి అంటే ప్రతిభా సాధ్యాలు, పరిశ్రమ ప్రాప్యాలుకావు

అసలు అతడు సుకుమారశ్లేషకోసమే పుట్టాడా? అనిపిస్తుంది అతడు పాపం! చక్కగా మెత్తగా భావాన్ని పొదుగుతూ ద్వ్యం వ్రాయాలని సంకల్పించి కూర్చున్నా చిరమిత్రుడిలా శ్లేషముందు వచ్చి కూర్చుంటుంది

"బహుళాంధ్రోక్తిమయ ప్రపంచంలో పూర్వుల ప్రాగల్భ్యం ఊహించి ప్రతులక్ష్పించాలనుకుంటే వాగనుశాసనుడు కుండలీంద్రుడు శ్రీనాథుడు, సోముడు, భాస్కరుడు, రెండర్థాలలో ప్రఖ్యాతమైన సొంపు పాటించడం అతడను కంటేనే వచ్చిందా?

'సుకవి ప్రణీతకృతి' ఇట్టే 'సామాన్యాకృతిం' బూనడం ఎంత అప్రయత్న సిద్ధం!

అది అలా ఉండనీయండి—

పైనుదాహరించిన రెండోపద్యంలో మొదటియా 'మందరాగ మహిమ' లోని ఎరుపు ఆ సింధు తనయను లక్ష్మిని చేరింది తన్మూలితంగా '(శ్రీ) నిధి'' అనే సంబోధనం విష్ణువును ప్రత్యక్షం చేస్తుంది

శ్లిష్టమైన వాక్యాలనుచూచి బొమలు ముడుచుకునే రసికులకు సైతం, ఈ సుకుమార శ్లేష వాక్యాలు కితకితలు పెడతాయి ఖులాసా అనిపిస్తాయి

ఉద్దండ పాండిత్యం ఉండంపోయినా-ఉభయ భాషల్లోనూ కొంత ప్రవేశమూ, చురుకైన చూపూ ఉంటేచాలు శ్లేషలు, పువ్వుల్లా విచ్చుకుంటాయి మంచులా విడిపోతాయి ఎక్కడైనా దీనికి అపవాదం ఉన్నా చాలా చోట్ల మృదుశ్లేషల్లో అవి

శ్లేష ఒక అర్థాలంకారం నిజమే కాని అన్ని తక్కిన అర్థాలంకారాల కన్నా దానిలో ఒక విశిష్టత ఉంది ఉపమాదులు ఎంత ఇంపయినవయినా-అందులోని కేవలం ఏ ఒక్క అలంకారంతోను కావ్యమంతా వ్రాయడం అసంభవం ఒక్క శ్లేషాలంకారంతోనే ద్వ్యర్థి కావ్యం వ్రాసి రాణించడం దాని ప్రత్యేకత

దానిని ఇంతకుముందు పింగళి సూరనార్యుడు సాధించి ఒక గ్రంథం వ్రాసినా - దానిలోని ఒక హస్తలాఘవం మూర్తికవి దగ్గ మెరుస్తూ కనబడుతుంది

ఇక్కడ ముఖ్యవిషయం ద్వ్యర్థి కావ్యం వ్రాయడంకాదు శ్లేషకున్న విచిత్ర శక్తిని గురించి చెప్పడమే ప్రకృతం ఇందులోని పిరుపు సొగసు, అర్థాంతర చమత్కారం, ఎంత రస నిర్భరం కాకపోయినా నిరంతరం సాహితీ ప్రియులను అలరిస్తూనే ఉంది సంప్రదాయ కవితారీతులకు దూరంగా ఉండి-ఎంత అత్యాధునికుల మనుకున్నా - 'పన్ను' (Pun) తళుకును మాత్రం వారు వదలుకోలేదు దేనిలో వసుచరిత్ర ప్రభావం ఎంత ఉందో చదివితే వారికి తెలుస్తుంది అంటే వసుచరిత్ర పలుబడి ఎంతదూరం వ్యాపించిందో ఊహించవచ్చు

సంస్కృతంలో శ్లేష యమక చక్రవర్తులున్నారు వాటితో వారు జల కాలాడిన విశేషాలూ కనిపిస్తాయి ద్వ్యర్థిత్ర్యర్థి కావ్యాలూ - ప్రచారంలో

లేకపోయినా స్మృతి పథానికి తగులుతూ ఉంటాయి ... వసుచరిత్ర వంటి ప్రబంధం ఇందులో ఏదీ పుట్టలేదనడం నిశ్చయం ... ను నే చమత్కార లుబ్ధులై ... కవులు దాన్ని సంస్కృతంలోకి కూడా పరివర్తించి తృప్తిపడ్డారు ఆ గౌరవం ఏ ఇతరాంధ్ర ... వ్యానికి ... లిగినట్టు ... పడదు ... దా! అంతేకాదు-... చరిత్ర పుట్టిన తర్వాత ఆ అర్థాంతర ఘటనా నైపుణ్యానికి-... సొగసులకు పద్యపు నడకల కొత్త ప్రోత్సాహింపులకు మోజు పెంచుకొని ఎందరో కవులు ఆ మార్గంలోపడి పిల్ల వసుచరిత్రలు సృష్టించారు క్రీ శ 17 శ॥లో పుట్టిన, మేలి కావ్యమని పేరొందిన, ప్రశంసలందిన, విజయ విలాసంమీద ఉన్న వసు ప్రభావం కాదనలేదు

ఉయితే - ఈ విశిష్టత, ఘనత, వసుచరిత్రకు ఎట్లా గల్గాయి ? అనేది ఆలోచించవలసిన విషయం

మూర్తికవి తన కావ్యానికి ఇతివృత్తాన్ని ఎన్నుకోవడంలోనే ఉంది, ఈ మెరుపు - తన జీవ... ణంలోనే ఈ శ్లేషాభిరతి ఎంతగా ఇమిడి ఉందో అతనికి తెలుసు

అతను చేసినవి మూడు రచనలు —

1 ... సంగ్రహము (అలంకార శాస్త్రం)

2 వసుచరిత్ర (కావ్యం)

3 హరిశ్చంద్రనలోపాఖ్యానం (ద్వ్యర్థి కావ్యం)

... కావ్యాలంకార సంగ్రహానికి శ్లేషాసక్తి లేదు, అయినా-అందులో కృతిపతి తనతో అన్నట్లు వ్రాసిన 'బాణు వేగంబును' అనే సీస పద్యంలో పూర్వ సంస్కృతాంధ్ర కవుల ప్రత్యేక గుణాలను స్మరిస్తూ కూర్చిన అర్థాంతరఘటనం అతని శ్లేష కావ్యాన్ని వెల్లడిస్తుంది అందులో కొంత పేలవత్వం ఉన్నా అతడు పట్టించుకోలేదు అందులో కాళిదాసులేసు కవిత్రయంలో ఇద్దరులేరు 'మాఘుని శైత్యం' అంటే అతడు ఏ కావ్యగుణాన్ని ఉద్దేశించాడో స్పష్టం కాదు అయినా - అట్లా చెప్పడం అతని పుట్టుకతో బుట్టిన గుణం!

అతడు తన గుణానికి అనుగుణమైన వస్తువును స్వీకరించి వసుచరిత్రను ... బృహత్తర కావ్యంగా వెలయించాడు అది ఆంధ్ర పంచ

కావ్యాల్లో ఒకటయింది అందులో అగ్రగణ్యమైన మను చరిత్ర స్పర్ధతో పుట్టినా - వసుచరిత్ర వేరే మార్గం తీసుకుంది

మనుచరిత్ర పుట్టిన తర్వాత సుమారు 40, 50 ఏండ్లకు ఉత్పన్నమయిన ప్రబంధం వసుచరిత్ర కృష్ణరాయల తర్వాత విజయనగర రాజ్యాధిపతి అయిన అళియ రామరాయల ఆదరానికి పాత్రుడై, రామరాజభూషణు డనిపించుకొని రామరాజు గతించిన పిమ్మట ఆతని తమ్ముడు తిరుమలరాయనికి వసుచరిత్రను అంకితం చేశాడు పరంపరాశ్రుతమైన పెద్దనార్యుని శిష్యత్వం కృష్ణరాయని విద్వత్కవితాగోష్ఠులను, కవితాప్రియం భావుకతను, మూర్తికవి స్వయంగా ఎరిగి ఉండడం, అసంభావ్యాలుకావు కాని కృష్ణరాయల కవితాభిమానాన్ని చూరగొన్నట్టుగాని - తద్వారా అష్టదిగ్గజాలలో ఒక డయినట్టుగాని నిరూపించడం కష్టం పెద్దనాగులకు యువసమకాలికుడు కావడంలో విప్రతిపత్తి ఏమీ ఉండదు

పెద్దనగారి కవితాచ్ఛాయలు వసువులో కనపడడంవల్ల మూర్తికవికి ఆయన మీద ఉండే రచనాగౌరవం స్పష్టపడుతుంది

మూర్తికవి నిస్సందేహంగా ప్రతిభావంతుడు, ప్రతిభ నవనవోన్మేషశాలిని అది తనదైన ఒక మార్గంకోసం వెదుకుతూ ఉంటుంది నిబిడ కథానిభృతం అయిన కళాపూర్ణోదయం అప్పటికే మన్ననలు పొందుతూ ఉండాలి అది అతనికి నచ్చలేదు పరోక్షంగా కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నములన్నాడు మనుచరిత్ర రసనిర్భర మార్గంలోది దాన్నే అనుసరిస్తే మెరుగులు చూపవచ్చుగాని దానికి రెండోది అవుతుంది అట్లా కావడం ఇష్టంలేదు శ్లేషకావ్యానికి (ద్వ్యర్థి) కావ్య మర్యాదలేదు ఎంతసేపూ రెండర్థాలు వెతుక్కోవడంతోనే సరిపోతుంది ఇంక రసస్పర్శ ఎక్కడ ?

తాను ఒక కొత్త మార్గానికి స్రష్టకావాలి పుట్టు రత్నమైన ఒక ఆద్యసత్కథ తీసుకుని దాన్ని అమోఘంగా సానపట్టి అపూర్వంగా మెరిపించాలి తనది రసమార్గంకంటె ఎక్కువ భూషణమార్గం, అంటే అలంకార ప్రీతి చమత్కారాతిశయం చిక్కని కావ్యభాష వాటితో తన రచనను నిగనిగలాడించడం ప్రథమ కర్తవ్యం

అతని కన్ను భాగవతపు ఆదిపర్వంలోని ఉపరిచర వసువు కథమీద పడింది

ఆ వసువు చేది దేశానికి రాజు అడవికి వేటకు వెళ్ళి విరక్తుడై తపస్సులో ఉండిపోతే దేవేంద్రుడు అతని ప్రజాపాలనకు ఉన్ముఖుణ్ణిచేసి వరంగా దేవత్వం, ఒక దివ్యవిమానం, ఇంద్రమాల, వేణుయష్టి, ఇచ్చి తనతో సఖ్యంగా దేవలోకానికి వచ్చి పోతూండమంటాడు అతడు దివ్య విమానంలో సంచరించడం చేత ఉపరిచర వసువని పేరు పడ్డాడు

అతనికి అంతకుముందే భార్య, అయిదుగురు కుమారులు ఉన్నారు

అతని పట్టణానికి దగ్గరగా శుక్తిమతి అనే నది ప్రవహిస్తున్నది దానిని కోలాహలమనే పర్వతం అడ్డగించింది అప్పుడు వసురాజు ఆ పర్వతాన్ని కొట్టి త్రోవచేశాడు ఆ పర్వత వివరం నుంచి నది స్వేచ్ఛగా ప్రవహించింది జరిగిన కథ ఇది

సంస్కృతంలో పర్వత శబ్దం పుంలింగం నది స్త్రీ లింగం ఆ స్వారస్యం వల్ల మూలంలోనే ఒక కల్పన జరిగింది

"పురోపవాహినీం తస్య నదీం శుక్తిమతీం గిరిః
అరౌత్సీత్ చేతనాయుక్తః, కామాత్ కోలాహలః కిల"
గిరిం కోలాహలం తంతు పదా వసు రతాడయత్
నిశ్చక్రామ తత స్తేన ప్రహార వివరేణ సా
తస్యాం నద్యా మజనయత్ మిథునం పర్వతః స్వయం
తస్మా ద్విమోక్షణాత్ ప్రీతా నదీరాజ్ఞే న్యవేదయత్
యః పుమానభవ త్తత్ర తం స రాజర్షి సత్తమః
వసు ర్వసు పదం చక్రే సేనాపతి మరిందమః
చకార పత్నీం కన్యాంతు, తదా తాం గిరికాం వసుః

భా. ఆది 63 అధ్యా

ఆ కోలాహలుడు చైతన్యం కలవాడు కామార్తుడై శుక్తిమతిని బలాత్కరించాడు అతని సంపర్కంవల్ల ఆ నదికి పురుష, స్త్రీ శిశువు లుద్భవించారు మగవాడు వసుపదుడు, రాజుకు సేనాని అయినాడు స్త్రీ గిరిక, ఆయనకు భార్య అయినది

ఇట్టి కథను కాళిదాసు వంటివారు కావ్యవస్తువుగా స్వీకరిస్తే పర్వతం జడమైనా దానికి దేవతాత్మ్మగ్రతి కల్పించి తర్వాతి కథ అంతా మనుష్య ప్రకృతితోనే నిర్వహిస్తారు

మూర్తికవి శ్లేషప్రియుడు వ్యంగ్య చమత్కారం ఎరిగినవాడు శబ్ద శక్తి వల్ల ఈ వసురాజు కథలో ప్రకృతాప్రకృతాలను ధ్వనింపజేస్తూ తన ప్రజ్ఞను చూపవచ్చునని ఇష్టాపత్తిగా స్వీకరించాడు రసస్ఫూర్తి కోసం, ఔచిత్యం కోసం ఈ పురాణకదను మిశ్రకథగా రూపొందించాడు

కావ్య వసురాజుకు అంతకుముందు భార్యాపుత్రులు లేరు, కోలా హలుడు హిమవత్పుత్రుడు అధియల బిడ్డలకు ఉండవలసిన అన్ని లక్షణాలూ ఉన్నాయి బ్రహ్మదేవుని సభకు చెలికత్తెలతో రాకపోకలు సాగించే శుక్తిమతిని చూచి, పట్టరాని తమకంతో ఆమె పొందుకోరి సమీపించి - ఆమె వైముఖ్యం చూపినా లెక్కచేయక స్వాయత్తం చేసుకున్నాడు తత్ఫలితంగా శుక్తిమతికి పురుష స్త్రీ శిశువులు పుట్టారు

వసంతం వచ్చింది రాజు వసంతలక్ష్మితో కలకలలాడే ఉద్యాన సందర్శ నానికి మిత్రునితో కూడా బయలుదేరాడు హఠాత్తుగా ఒకవైపునుంచి గానం వినిపించింది మిత్రుణ్ణి చూచి రమన్నాడు మిత్రుడు వెళ్ళి ఆ గానసుందరిని చెలికత్తెలను చూచాడు మొత్తంమీద ఆ యువతి శుక్తిమతీ కోలాహలుల పుత్రిక అని తెలుసుకుని తన చమత్కారంతో రాజును అక్కడికి రప్పించాడు

గిరికావసువులకు అనురాగం అంకురించింది ఇటు నర్మసచివుడు, అటు మంజుభాషిణి అనే గిరికాసఖి దానికి దోహదం చేశారు నాయికా నాయ కులు ఒకరి కోసం ఒకరు విరహపడ్డారు మంజువాణి రాయబారం చేసింది

ఇంద్రాది దేవతలు వచ్చి పెండ్లికి ముందూ తర్వాత జరగవలసిన లాంఛనాలన్నీ జరిపి బ్రహ్మాండంగా పెళ్ళిచేశారు గిరికా వసువులు భార్యా భర్తలైనారు కావ్యం సమాప్తమైంది

అయితే భారతంలో ఈ కథ ఇంకా కొనసాగి - వసువీర్యంతో మత్స్య రాజు, మత్స్యగంధి అనేవారు పుట్టడమూ మత్స్యగంధి యోజనగంధి అయి పరాశర మహర్షివల్ల వ్యాసుని కనడమూ అనే వాటితో ముగుస్తుంది

మూర్తికవి తన శృంగార ప్రబంధానికి గిరికా వసువుల వివాహమే హద్దు చేసుకుని తక్కినది విసర్జించాడు. కథలో కవి రసానుగుణంగా చేసిన మార్పులవల్ల ఇది మిశ్రకావ్యం అయింది.

వసుచరిత్రలో ఉండవలసినంత వస్తుబలంలేదు. కథాంతరంగా అది ఒక సాధారణ శృంగార ప్రబంధంగానే తేలింది. ఇట్టి చిన్న కథను అనేక ప్రబంధ లక్షణాలతోను వర్ణనలతోను, అర్థాంతర చమత్కృతులతోను, ఆరాశ్వాస కావ్యంగా సాగదీసినా మూర్తికవి శబ్ద ప్రభుత్వంవల్ల అది సాహితీ పరులకు ప్రీతి పాత్రమైంది.

ఇందులో పట్టయిన రెండు శృంగార కథలున్నాయి. ఒకటి శుక్తిమతీ కోలాహలులది. రెండవది గిరికావసువులది.

మొదటి కథ నిజానికి రసాభాసం. ఒకరికి ఎంత ప్రీతి ఉన్నదో, రెండవ వారికి అంత వైముఖ్యం, ఉన్నది. మనుచరిత్రలోని వరూధినీ ప్రవరుల గాథ జ్ఞాపకం వస్తుంది. అక్కడ మగవాడు తిరస్కరిస్తే ఇక్కడ స్త్రీ తిరస్కరిస్తుంది. అయినా ఈ రెండు కథలూ కావ్యానికి వన్నె తెచ్చేటంటి శక్తితోసాగి సగసులను అలరించాయి. రసాభాసం ప్రధాన కథలో ఉంటే-అనుచితం అనుకోవచ్చుగాని ఉపకథలో గౌణంగా ఉంటే అది అలంకారమే అవుతుంది. మనుచరిత్రలో రూపాంతరంలో వరూధిని కోర్కె సఫలమయింది గనుక, అదికూడా అంత అనుచితమనిపించుకోలేదు.

శుక్తిమతి అఖిలనదులూ బోటికత్తెలై తనతోరాగా నిత్యమూ బ్రహ్మదేవుని కొలిచి తిరిగి వస్తూండేది. త్రోవలో కోలాహలుడు ఎదురు పడేవాడు.

"అనుపమ భాగ్యశాలి కచలాధిపు మౌళికిఁ బుత్త్రుఁడై, జగ
జ్జనని కనుంగుఁదమ్ముఁడయి శంకరు ముద్దు మఱందికట్టయై
మను తన భాగధేయ మహిమంబున మిన్నులు ముట్టివచ్చు ధ
న్యుని నతనిన్ భజించి నదియున్ వినయంబున నోరయై చనన్"

౨-109

అప్పుడు వారిద్దరూ మనుష్యరూపంలో ఉన్నారు. 'మిన్నులు ముట్టివచ్చు' అనే మాట ప్రకృతార్థంలో సగర్వంగా రావడం అయితే, ధ్వనిరూపంలో ఆకాశాన్ని తగిలేటంత ఉన్నతరూపం అని స్ఫురించడం విశేషం.

ఆ నగేంద్ర తనయుడు '‿ సైకత శ్రోణి యొప్పులు ఔప్పాఁగ చూచి' మరుల ొని అంటాడు

"ఆపదోన్మేద్ధవు నోలగంబునకు దివ్య ద్వీపినుల్ నిచ్చ రా
రో పోరో, మఱి యెందఱేనియును, వారున్ మేము సంధింపమో
యే పద్మాక్షిని జూచినం జెలియ ! నిన్నీ డించి నట్లుండ దే
లా పల్మాటలు ? పూర్వజన్మ కృతముల్ గాఁబోలు నీ నెయ్యముల్"
౨-127

"విమల మధుర మనోహర వృత్తి వెలయు
వాిఁ గొనియా బుధులెంత దూరమైనఁ
బోవుదురు గాన నేను నీ పొంపుఁ గోః
దవ్వనక వచ్చితి నశేష తాపశమని" ౨-129

వాచ్యార్థం ఒం ప్రియుడు ప్రియురాలితో అన్నమాట ఇచట వారి 'అశే తాపశమని' అనే మాటలు సాభిప్రాయములై ‿ద్యర్థాన్ని ప్రతిబింబించడం చమత్కా‿ం హేతువు

శుక్తి మతికి అతని మీద మనసు లేదు సదులందరికీ సాగరుడు భర్త అది విధి విహితం లక్కినవారి యెడల వారి ప్రేమరసం జాలువారదు ఎంతటి వారు అడ్డగించినా అది విరసమే అవుతుంది

"తపః స్ఫూర్తి మెఃఃం గృశించి వనరాశిం జెందు మా
బోంట్ల నుద్ధతిచేఁ గ్రమ్మగ నేల ?"

అని ఆమె మాట ! శుక్తిమతి మణిపూస ! అవినయం కనపడకుండా అంటుంది

"అనవిని నగరాజు ఘన
ధ్వని గరిమకుఁ గలఁగి ముకుళిత కరాంబుజయై
వినయము నయము భయమును
మనమునఁ బెనఁ గొనఁగ శుక్తిమతి యిట్లనియెన్" ౨-131

ఎదురు పడ్డవాడు రాజకుమారుడు ఉద్ధతుడు అతని గంభీర కంఠ ధ్వనికి బెదరి మెత్తని చేతులు జోడించి మాట్లాడుతుంది

కొండమీద మబ్బులు - ఉరుములు, జల్లుపడితే పరు గాగిపోతుంది ఇనకర స్పర్శ తిరోహితమై వికసిత పద్మాలు ముకుళించుకు పోతాయి

అంతస్స్రోత్రమైన నది తీరు ఇది

నదీ సుందరి ఏమన్నది ?

పుడమి నచలేంద్రు లెచ్చట ?
జడవాహిను లెచట ? నెచటి సఖ్యము ? వినఁ జొ
ప్పడదు ! బొఁడవడరు మీ యెడ
నెడపక మారసము లెచటికెక్కు మహాత్మా ? ౨-135

మీరు ఎక్కువ వారలు, మేము తక్కువ వారం మనది అసమాన స్నేహం మా ఆర్ద్ర హృదయం మీ మీదకు ఎట్లా ప్రాకగలదు, మహామతీ !

సరాగంలో ఎంత ఈసడింపు ? ఎట్టి మందలింపు ? ఇది నదిగా చూచినా నిజమే గదా ?!

'మీ కులగిరి కోటిలో నా పొందు లఘుత్వం గదా ! ఆలోచించి చూడండి' అని మరల్చ జూస్తుంది కోలాహలుడు నదులను చేపట్టిన ఈశ్వరాదు లను ఉదాహరించి 'వారికే లాఘవము వచ్చె వనిత ! మారు మసలెదు ఇట్టి నేమములు చాలు !' అని బుజం మీద చేయి వేశాడు

ఇక్కడ పెద్దన్నగారి "వెలివెట్టిరే బాడబులు "అనే పద్యం జ్ఞాపకం వస్తుంది

అభిమానవతి శుక్తిమతి ఈ ధార్ష్ట్యానికి పెడమొగం పెట్టింది

"వేణి చలింపఁ గంపిత నవీన మృణాల భుజాగ్ర కంకణ
శ్రేణి నటింప లోల శఫరీ నిబిరీస కటాక్షకాంతి వి
న్నాణము సూప హంసకగణ క్వణనంబులు మీఱ సైకత
శ్రోణి వివర్తితాబ్జముఖ శోభితయై కడు సంభ్రమించినన్" ౨-138

అనర్గళ ధారాశుద్ధితో వ్రాసిన ఈ పద్యం ఈ ప్రకరణంలో చాలా ప్రసిద్ధమైనది

ఒంవైపు తొట్రుపడి ముఖ కమలం తిప్పుకున్న మహాసుందరాంగి! వేరొకవైపు కలత చెందిన విశుద్ధ వాహిని మధ్య తన అనంత శబ్ద తూలికతో హృదయంగమ చిత్రం గీచిన మూర్తికవి!

'హా శ్రీహరీ యంచుం బ్రాహ్మణు డో మోమిసి పొమ్మంచుం ద్రోచె' అన్నంత తీవ్రంగా లేకపోయినా హృదయం అదే—

అట్లా 'ఉగద్దరె ఆ ముద్దియను పెద్దయుం బ్రొద్దు' నిరోధించినాడు

"ప్రోవరావె, వసుభూప! యంచు నెలుగెత్తి వెసన్
మొఱవెట్టు చాడ్పునన్ శైవలనీ రవం బెసగె "

ఇక్కడ నుంచి అచ్చపు నదీ పర్వతాలు, ఆ రెండూ—

"ఒక్క నగంబు వచ్చి వినతోద్ధతి నొక్కడ దిక్కటాహముల్
పిక్కటిలంగఁ జెల్లున గుభిల్లన శుక్తిమతీ ప్రవంతి పేంకుక్కన వ్రాలె"
౨-146

అని ప్రజల మొర—

అప్పుడు "వసురా జయ్యేడ బలవ
ద్వ్యస్మయ పాద ప్రసార దీర్ఘాచలుడై
యె సఁగఁగ వసుధా పరి కీ
ర్ణ సరిన్నిర్ఘరము నెత్ క్షణంబునఁ దిగిచెన్" ౨-154

వసురాజు కాలి కొనగోటితో పర్వతాన్ని మీటి జలోపప్లవాన్ని నివారించడమే కాక సూర్యకాంతికి పొంగిన నది తీసిపోవడం కూడా ధ్వనించడం ఇక్కడ చమత్కారం

"అకోలాహల ముప్పై వ్రాలియును నెయ్యంబొప్ప నయ్యేటికీ
గ్రుక్కిళ్ గ్రింగుచు నుండె నెండనె వసుక్షోణీధవ త్రస్తమై"

ఏమైనా ఆ ప్రేమ విఫలం కాలేదు

గిరికా వసురాజులు ప్రధాన కథా నాయికా నాయకులు వారి అనురాగం శకుంతలా దుష్యంతులు తొక్కిన బాటలోనె నడిచి వివాహోత్సవానికి దారి తీసింది

దుష్యంతుడు లతాంతరితగాత్రుడై ఉండి తుమ్మెద సాకుతో శకుంతలా సాన్నిధ్యం పొందగా వసురాజు నర్మసచివుని నెపంగా గిరికా సామీప్యం సాధిస్తాడు

"అనుపమ కాంతివైభవ సమన్వితు నా వసురాజు గాంచు ప
ద్మిని సరసాంతరంగమున మించె వినూతన రాగ కందళం
బొనరె నఖండ వాసనలు నుత్కళికల్ విలసిల్లె సల్లన
ల్లన నిడిగెం బ్రమోద తరళ స్థితులై యమిఁ జూపు తుమ్మెదల్"
3-45

ఇక్కడ ప్రకరణార్థం పద్మినీ జాతి ఉత్తమ స్త్రీ అయిన గిరిక మనసులో అనురాగం మొలకెత్తడం ఆ వాసనా జన్యంగా స్వేదరోమాంచాదులు ఉప్పతిల్లడం ఉత్కంఠతో చూపు తుమ్మెదలు ప్రసరించడం మొదలైనవి స్థాయియైన శృంగారానికి చక్కని పట్టుగొమ్మలు

ఈ ప్రకృతార్థంలో అప్రకృతమైన పద్మినీ ఝాన్కరుల అవిచలితాను రాగం వస్తు ధ్వనిగా భాసించి ఉపమగా పర్యవసించి, కవి రసచిత్రణ చాతుర్యాన్ని చాటుతుంది

"వనజ దళాయతాక్షి నిడువాలిక చూ పని మేపవృత్తి నా
ఘను నవకంబుపైఁ బొలసి కాంత తదీక్షణ జాలకంబు పై
కొనినఁ ద్రపాబ్ధిఁ గ్రుంకియును గోరికఁ గ్రమ్మఱఁ గూడఁబాఱుమో
హన గుణశక్తి నివ్వటిలు నా వలరాయని వేర్పు పెంపునన్"
3-51

గిరిక నిడువాలు చూపు రెప్పవేయకుండా ఆ రాజు లావణ్యం మీద పడింది అతడు అంత తమితోనూ తన్ను చూస్తూ ఉండగా చప్పున దించి వేసింది కాని ఊరుకోలేదు లోపల మరుడు తొందర చేయగా మళ్లా వలపుతో అతని మీదకు చేరుతున్నది

ఇందులో ఒక యువతి తన ప్రియుణ్ణి చూచే సంప్రీతిని అద్భుతంగా చిత్రించడం చూస్తాం. అయితే మూర్తి కవి దగ్గర అంతటితో మనం తృప్తిపడి ఊరుకోకూడదు కొంచెం చూపు చురుకుగా సారిస్తే ఒక చమత్కారంతో కూడిన ఒక చేప కథ ధ్వనిస్తుంది

కన్ను చేప వంటిది

ఆ చేప కొత్తమేఘం తీపి నీటికి ఎదురెక్కి సంచరిస్తూ ఉంటే అనుకోకుండా ఒక వల మీద పడింది చట్టున అది నీటిలో మునిగిపోయింది ఒక వల రాయడు అక్కడే ఉన్నాడు అతని ప్రాటీశక్తివల్ల, నెప్పువల్ల మళ్ళా పైకి వచ్చి విహరించడం ప్రారంభించింది

ఈ వస్తు ధ్వని మూర్తి కవి చేతిలోని ఇంద్రజాలం[1] తుదకు—

"కౌతుకముఁబూని యొండొరుఁ గాంచదివిటు
చంచలాక్షికిఁ బతికి నేత్రాంచలములు
గూర్చె వలరాచయొజ్జ. ." 3-52

అట్లా ఉభయుల ప్రేమా స్థిరపడంది

ఇక్కడి 'కౌతుకము' 'నేత్రాంచలములు' 'ఒజ్జ' అనే శబ్దాలు సాభిప్రాయాలు చేతికి తోరము కట్టుకొని ఉన్న వధూవరుల వస్త్రాంచలము లను పురోహితుడు ముడి వేయించడం ఇక్కడ భావించ దగిన విశేషం

'కలికియు నా నృపాలకునిఁ గ్రమ్మఱఁ జూచుచు నేగె నేర్పుతో' గిరికా ప్రేమను సూచించే ఈ వాక్యం శాకుంతలంలోని 'దర్భాంకురేణ' అనే శ్లోకార్థానికి స్మారకం[1]

ఈ నాయికా నాయకుల ప్రేమ చిత్రణంలో ఘటనా పరంగా చెప్ప దగ్గ విశేషం లేదు సాధారణ ప్రబంధ నాయికా నాయకుల శృంగార స్థాయి లోనే ప్రవర్తించి విరహంలో సుళ్లు దిరిగి వివాహ మంగళంతో సమాప్త మవుతుంది

ఇందులోని ఇంద్రాదుల మధ్యవర్తిత్వం, గింగానది తోడ్పాటు, కుమార సంభవ సప్తర్షుల దౌత్యానికి, అరుంధతి సహకారానికి ప్రతిబింబాలు అని చెప్పవచ్చు అయితే శుక్తిమతీ బాంధవ్యంలో నదులూ, కోలాహలుని చుట్టరికంతో పర్వతాలూ, రావడం, అచ్చరలు నెరవేర్చిన పెండ్లి ముచ్చటలు మూర్తికవి వచోరామణీయకానికి గుర్తులై విసుగెత్తించకుండా చదివిస్తాయి

మూర్తికవికి పూర్వ సంస్కృతాంధ్ర కవుల కవితా ప్రస్థానం కొట్టిన పిండి. అతనికి పూర్వ కవుల ఛాయలు అప్రయత్నంగా వస్తే తప్పించుకోవాలనే పట్టింపు లేదు.

కుమార సంభవ షష్ఠ సర్గలోని 'ఏవం వాదిని దేవర్షౌ కుమారీసర' అనే శ్లోకానికి ఈ పద్యం ప్రతిబింబమై కొంత పెంపు సంపాదించింది.

> ''అనుటయు తాఁ బార్శ్వగత
> యై యొఁగునా లతకూనదా నతా
> ననయయి కేలి కేళి నళి
> నంబు మొనల్ నఖరాంచలంబులం
> దునుముచు నుండె! వజ్రధరు
> దోరళని ప్రేమమాన మీన లాం
> ఛన విశిఖంబు లింక సఖ
> సాధ్యములంచు గణించు కైపడిన్'' ౫-30

అట్లా - కాళిదాస బాణ శ్రీహర్ష కవితా ఫక్కికలు అక్కడక్కడ తొంగిచూస్తూ ఉంటాయి. శ్రీనాథ, పెద్దనార్య, వీరభద్రాదుల వచస్సరణీ అందందు విహరిస్తూంటుంది.

కాని—

అతని పద్య విద్యా ధౌరంధర్యంలో, భావ పరిపోషణంలో అవి మునిగి పోయి కనపడవు. సీస పద్య సంవిధానంలో శ్రీనాథ, పెద్దనలు త్రోవ చూపినా - గురువులను మించిన శిష్యుడితడు.

ఈతని 'లలనా జనాపాంగ', 'ఏపారు పాదండ్ల', 'ఇమ్ములై మరు హాజారమ్ములై', 'ఒకపాయ నవపాయ' వంటి సీసాలు వసుచరిత్ర రసికులకు కంఠ పాఠాలు.

వర్ణనల్లో 'నానాసూన వితాన' 'నాళీకాకర తీరసార' వంటి పద్యాలు ఎన్నో రసజ్ఞుల మన్ననలు పొందాయి.

ఈతని సంగీత కళానిధిత్వానికై 'అరిగాఁ బంచమ మేవగించి' 'ఉద్ధతరిపు విద్ధతప' అనే పద్యములు చర్వితచర్వణంగా పలువు రుదాహరించేవే

'స్వైర విహార ధీరులగు సారసలోచన లున్నచోటికిం బోరున లాతివారు చొరంబూనినచో రస భంగము' అన్నచోట 'సారసలోచనలు' లో ఒ సభంగ మైతే 'సాలోచనలు' కావడం వంటి స్వారస్యాలు చేమకూరకవి 'సహకారాళి పదంబుఁ జూడఁగ వయస్యా 'హాళి' యానేగదా'' వంటి వాటికి ఉపజీవనాలు అనవచ్చు

మూర్తి కవి విరుపు సొగసులు చాలా ముచ్చట గొలుపుతాయి

''కలికి! యశికిర మండలి కలికి చూడ
వేల? ఈ వేళఁ బలుకవే వీ వేల గోల?
నీ కటాక్షోర్మి వాక్సుధా నీకమునను
జాలిఁబడి గాదె యివి యీ కు జాలిఁ బడిరి!'' ౩-127

'ఎమ్మెక మీరం నెత్తు వద ఎమ్మెక' ౩-130

'అగత నయ యగతనయ' ౫-23

'తమ్ముల బంపుదు స్మణి శలమ్ముల బంపుదు' ౨-60

'ఆడు పడుచు లే పగవారికి వలదన నా
పగవారికి నేల నొసగె' ౨-62

ఈ విరుపులతో కలసి వచ్చిన శబ్దాలంకార పరంపర కూడా అతని అప్రయత్న శబ్ద క్రీడకు ఉదాహరణంగా చెప్పవచ్చు

అతడు అర్థాంతర స్పర్శలేకుండా హాయిగా వ్రాసిన పద్యాలు చూస్తే - అతని ఉభయ వాక్సిద్ధికి ఆశ్చర్యం కలుగుతుంది

శుక్తిమతి తన సంసార సామగ్రిలో చిన్న బిడ్డలను లాలించే విధం హృదయంగమం అనిపిస్తుంది

''జలకము లార్చి పాండు జల
జచ్ఛద పాళిఁ గప్పి తమ్మి సం
కుల తెలి తేనె లుగ్గులిడి
క్రొందరగల్ కదలించు కల్వతో

ట్లలరఁ గుమారుఁ గూతును ఘ
టించి భజించు నదీలలామ, కో
మల కుముదాగతాళికుల
మంజు రవంబున జోల బాడుచున్"

మొత్తం మీద మూర్తికవి కళాభిజ్ఞుడు వశ్యవాక్కు తన తర్వాత వారికి ఆ మార్గంలో పథప్రదర్శకుడు ఎంత రసాభిజ్ఞుడైనా అతని మొగ్గు ఆలంకారిక చమత్కృతుల మీదనే ఎక్కువ మను చరిత్ర రసమార్గంలో చిరకాలం మన్నే చరిత్ర అయితే - వసు చరిత్ర శబ్ద శక్తితో బంగారంలా తళతళలాడే రచన

తెన్నాలి కవి విన్నాణం

రామకృష్ణ అనగానే - ఒక ఎత్తైన - గంభీరమైన - తెలివీ - గడుసు దనమూ ఉట్టిపడే - మూర్తి జ్ఞాపకం వస్తుంది - గాని ఎవడో కొంటెకోణంగి హాస్యగాడు, జ్ఞాపకం రాదు

రామకృష్ణుడు బాగా సారస్వత మూర్తిగా ఎదిగిన తర్వాత జ్ఞాపకం వచ్చే పద్యాలు వేరు అతడు రామలింగడుగా ఉన్నప్పుడు స్ఫురించే పద్యం ఒకటి ఉన్నది

"లింగనిషిద్ధు కల్వల చెలిం గని మేచక కంధరున్ త్రిశూ
లిం గని సంగతాళి లవలిం గని కర్దమ దూషితం మృణా
లిం గని కృష్ణ చేలుని హాలిం గని నీలరచన్ విధాతృ నా
లిం గని రామలింగ కవిలింగని కీర్తి హసించు వేడుకన్"

(చాటువు)

దీన్ని చాలామంది చమత్కారంగా చదువుకొని ఆనందిస్తారు కాని ఇందులోని ఆనందం భావ సౌందర్యానికి చెందినది కాదు కేవలం భాషలోని పరుపులకి చెందినది

చంద్రుడికి మచ్చ ఉంది, శివుని కంఠం నలుపు! లవలి తీగ (తెలువు గాబోలు) మీద తుమ్మెదలు వాలాయి తామర తూటికి బురద తగిలింది

నల్లవస్త్రం ధరిస్తాడు బలరాముడు, సరస్వతి జుట్టు నల్లని అంత తెల్లగా ఉన్నా వారికి ఏదో నలుపు తప్పలేదు రామలింగనికీర్తి సర్వం తెల్లనై వారిని కూడా చూచి నవ్వింది ఇందులోని భావం, కీర్తి తెలుపు అనే కవి సమయంమీద ఆధారపడి ఉంది అంతే అయితే ఇందులో చెప్పదగ్గ విశేషం ఏమీలేదు శబ్దాల కూర్పువల్ల ఆయా పేర్లలో 'లింగని' గాని [illegible] అంతకంటె కీర్తి మంతుడని చెప్పడం, చతురోక్తి ఇట్లాంటి చాటుపద్యాలు చెప్పుకుని ఆ రోజుల్లో భాషాభిమానులు సంతోషించి ఉంటే ఉండవచ్చుగాని, సాహిత్య రసికులు తల ఊచే ప్రసక్తి ఇందులో ఏదీలేదు

ఈ పద్యం ఇతనిమీద ఎవరైనా సరదాకి చెప్పిందో, కుమారవేళల్లో ఉద్ధతంగా తనమీద తనే చెప్పుకున్నాడో మనకు ఆధారంలేదు కాని అతని కవిత్వం శ్రద్ధగా చదివితే అతడు ఆ ప్రశంసకు ఒక విధంగా తగినవాడే అనీ కవితాంశలలో, అంతకన్నా ఎదిగినవాడనీ మనకు తెలుస్తుంది

ఇతన అవ్యవహిత పూర్వులు, చిత్రబంధాలు ప్రదర్శించారు అమోఘమైన శ్లేషలతో విహారాలు చేశారు కాని ఈయన మనస్తత్త్వం, కొన్ని అద్భుతాలుచేసి కవితలో మెరగాలనుకోవడంకన్న భావపు ఔన్నత్యంతో, భాషలోని చారిమతో, శిల్ప కౌశలంతో, కవిగా కలకాలం నిలవాలన్న కాంక్షే కనపడుతుంది

కనుకనే కావ్యరసికులు 'పాండురంగ విభుని పదగుంభనంబును' అని ఏనాటికైనా ప్రశస్తిగా నిలిచేమాట అని ఇతని కావ్యాన్ని పంచకావ్యాల్లో చేర్చారు అష్టదిగ్గజాల్లో ఒకడని కూడా అన్నారు ఇతని కావ్యానికి ఆసత్తా ఉన్నమాట నిజమే కాని - అష్టదిగ్గజాల్లో ఒకడనడానికి రాయల సమకాలీనత్వం తప్ప ప్రబలమైన ఆధారం కనపడదు వెనక తరచుగా అనుకున్నట్టుగానే - రాయల సమకాలీనుల్లో ప్రతిష్ఠావంతులనందర్నీ మనవారు తమ శ్లాఘా సూచకంగా అష్టదిగ్గజాల్లో చేర్చారనుకోవడమే సురక్షితంగా కనుపడుతుంది

అష్టదిగ్గజాలే అన్నమాటేమిటి ? మనకున్న ఆంధ్ర దిగ్గజాల్లో ఇతడొకడు అనుకోవడానికి ఎట్టి అభ్యంతరమూ ఉండకూడదు

కనుకనే విశ్వనాథవారు – 'రామకృష్ణుడు సురా రామగజము' అన్నారు

మురారిది మూడో త్రోవ, అన్నట్లు తెలుగులో తెన్నాలివాని తెన్ను వేరు శ్రీనాథుని తర్వాత ఇంత 'మగసిరిగల' కవి మరి ఒకడు అంటే అతనిలా వక్రోక్తి ప్రియుడు, ఒకవైపు చూపి వేరొకవైపు దూకుతాడు ఉన్న శబ్దాన్ని ఎలా విరుస్తాడో లేని శబ్దాన్ని ఎట్లా సృష్టిస్తాడో తెలియదు

అవే శబ్దాలు, అవే అర్థాలు వాటితో కూర్చిన వాక్యాలూ అవే, అయినప్పుడు ఒకడు చూపలేని కొత్తదనం ఇంకొకడికి ఎలావస్తుంది ?

అదే ౬ ు ్వంలోని ఇంద్రజాలం, గారడీ!
మాటల్లోలేదు కవి ్వం,
మాటల కూర్పులో ఉంది !

శిల ఒం టే అయినా శిల్పంలో ఉంది - హస్తలాఘం! ఒక మాటలో చెప్పవలసి వస్తే - అతడు విలక్షణంగా ఊహిస్తాడు ఆ ఊహాలోంచి పాత మాటలే కొత్త తళుకు తీసుకుంటాయి

శబ్దాంభోధిలో ఎక్కడ మునుగుతాడో ఎక్కడ తేలుతాడో తెలియదు వ్యాకరణం లెక్కచేయడు ఈ కూర్పులో ఈ అర్థం వస్తుందా ? అని ఆలోచించడు వచ్చినట్టు రావల ందే

ఇతని కావ్యాన్ని కాలక్షేపానికి చదివితే లాభంలేదు కండబలంతో చదవాలి చదివినకొద్దీ చవులూరించే గ్రంథం పాండురంగమహాత్మ్యం

లో ంలో ఇతని గ్రంథాలుగా ప్ర ద్ధమై   మూడు

1 ఉద్భటారాధ్య చరిత్ర
2 ఘటికాచల మహాత్మ్యం
3 పాండురంగ మహాత్మ్యం

వీటి పుట్టుక ముందు వెనుకలు ఎట్లా ఉన్నా - ఇతనికి అనంతకీర్తిని తెచ్చి పెట్టినదీ, అష్టదిగ్గజాల్లో ఒకణ్ణి చేసినదీ పాండురంగ కథే

తక్కిన వాట్లో ఇతని భవిష్యత్ కీర్తిచ్ఛాయలు ఉంటే ఉండవచ్చుగాని రాణింపుకు వచ్చిందీ, రచ్చకెక్కిందీ, పాండురంగడే

ఇట్టి కావ్యానికి రాయలతో ముడిపడకపోవడం దురూహమైన సమస్యే అంతటి కావ్యాసికుడు, ఇంతటి వచోరచనాదక్షుణ్ణి, తనకు కాకుండా ఎట్లా వదిలివేశాడో, ఆలోచనకు అందని అబ్బురం

హాస్యకథలకో రాయలకు అంత ముడిపెట్టినవారు కవిత్వం దగ్గరకు వచ్చేసరికి కిమ్మనకుండా ఊరుకున్నారు జనశ్రుతిగా రెండు మూడు చాటువులు అతికించినా అది బలవంతపు దాంపత్యం అయిందిగాని అనగిపెనగిన ఆంతర్యంగా కనపడదు

ఇతని ఉద్భటారాధ్యచరిత్ర కొండవీటి దుర్గాధ్యక్షుడైన గోపమంత్రికి కార్య[illegible] దేచ మంత్రికి అంకితమయింది

గోపమంత్రి మహామంత్రి తిమ్మరుసయ్యకు మేనల్లుడు, అల్లుడు అతని ఆశ్రితుడు దేచమంత్రి దేచమంత్రికి అంకితమివ్వడం - ముందు గోపమంత్రికి, తర్వాత తిమ్మరుసయ్యకు దగ్గర కావడానికి అని తోస్తుంది

తిమ్మరుసయ్యకు దగ్గరయితే రాయల సభాప్రవేశం సుకరమని భావించవచ్చు కాని వారి సాన్నిధ్యం ఈయనకు ఏమిచేసిందో తెలియదు

ఈ ఉదంతం మనకేమి బోధిస్తుందంటే రామకృష్ణుడు రాయలకు సమకాలికుడనడంలో ఎట్టి అభ్యంతరమూ లేదు, అని-

పాండురంగ కావ్యాన్ని, రాయల అనంతరకాలంలో సదాశివ రాయలకు లోబడిన మండలేశ్వరుడు మంగయ గురవరాజు కుమారుడు, సంగరాజు వద్ద, వ్రాయసం పనిలో ఉన్న విరూరి వేదాద్రికి అంకితం ఇవ్వడం జరిగింది

చివరకు-

రాయలసభలో పతాక ఎగురవేయకపోతే ఏమిగాక - ఆంధ్రసాహిత్యసర్వస్వంలో తన జెండా రెపరెపలతో గట్టిగా నిలిచిన కవి రామకృష్ణుడు

కొందరి కవులలో ఉన్న అహంకారవాసన కంపుగొడుతుంది కొందరి అహంతను ఆత్మవిశ్వాసంగా ఆమోదిస్తాము రామకృష్ణుడు నిత్యజీవితంలో ఎలాటివాడో తెలియదుగాని కవితాప్రస్థానంలో మాత్రం మంచి అహంకారి

కృతిపతి వేదాద్రి అన్నాడట —

ఆ మాటల సారాంశం ఇది —

"కవులు తియ్యమామిడి చెట్లు ఆ తోటకు వసంతవస్తే పొంకంగా పలికే గండు కోయిలవు!"

'సంస్కృతాన్ని తెలుగుగాను తెలుగును సంస్కృతంగానూ మార్చి వేయగల జగజ్జాణవు!'

'బలమైన ఆంధ్ర కవిత్వ విద్యలో నీకు ఎదురు నిలవగల వారేరీ? ఇంతేల - నీవే సరస్వతివి, సరస్వతి వే నువ్వు! నీవు కవుల్లో చంద్రుడవు.' ఆ వెన్నెల తెలుగు కవిత్వమంతటా నిండిఉంది ఎంత విశ్వాసం! ఎంతటి అహం! ఈ మాటలు ఆ రోజుల్లో స్వగతంగానైనా అనుకోవడానికి సామాన్యుడికి గుండె చాలదు అటువంటప్పుడు రొమ్ముమీద చేయి వేసుకుని ప్రకాశంగా ఈ మాటలనడానికి ఎంత దమ్ముండాలో ఆలోచించవలసిందే

పూర్వకావ్యాల్లో దమ్ము పొగడుచున్న కవి ప్రవరులు లేకపోలేదు కాని ఇటని పొగడ్తలో కొత్తవాసన ఉంది కొత్త రక్తబలం, కండ చకితుల్ని చేస్తుంది ఏదో స్పర్ధ, ఎంత అణచినా తలవంచకుండా పొంచి చూస్తుంది అయితే ఈ రచన ఏ మాత్రం తేలిపోయినా ఆ అహం అంతా నవ్వులపాలు అయ్యేది కాని అట్లా జరగలేదు కావ్యరసికులకు కంఠాభరణం అయింది ఇంతకూ విరూగి వేదాద్రి ధన్యుడు పాండురంగ కథను కృతిగా స్వీకరించి ఏ రాయనికీ లబ్బని గౌరవాన్ని దక్కగొన్నాడు

వేదాద్రిని కేవలం ద్రవ్యాశతోనే ఆశ్రయించి ఈ కృతిని అతనికి అంట గట్టినట్టు తోచదు కావ్యానికి సారభూతమైన నాలుగో ఆశ్వాసం తుదిని కృతి పతి సంబోధనల్లో 'సాహిత్యాపర కాళిదాస ! గంగాహల్లోహల వాగ్విలాస! శుద్ధిపద్యాదియోజితాభ్యాస!' అన్న కవిమాటల్లో వేదాద్రి కవితారసికతా, విద్యాబలం, వక్తృత్వ విశేషం, కవికి అతని యందలి గాఢప్రీతి మనకు విని పిస్తాయి

తెనాలికవి ముందు శివభక్తుడైనా తర్వాత కృతిపతి మీది మైత్రివల్ల కావచ్చు, తనకున్న అభేద వాసనవల్ల కావచ్చు వైష్ణవాభిరతుడై, పండరి నాథుని క్షేత్రమహాత్మ్యం 5 ఆశ్వాసాల కావ్యంగా ప్రపంచించాడు అయితే

ఈ పాండురంగ వైష్ణవం రామానుజ మతానుయాయి కాదనీ, మాధ్వులైన కర్ణాటక మహారాష్ట్రులదనీ తత్వమెరిగిన వారిమాట[1] ఏమైనా విజయనగర యుగంలో పాండురంగని యందున్న ఆదరం, భక్తి ప్రతిపత్తులూ కృతిపతి ప్రోత్సహించడానికీ, కృతికర్త వ్రాయడానికీ కారణాలైనాయి.

తెలుగులో మహాత్మ్య కావ్యాలు చాలానే ఉన్నాయి. అందులో అందె వేసిన చేతులు కూడా వ్రాసి ఆ క్షేత్రకావ్యాలకు ఎనలేని గౌరవం తెచ్చారు.

శ్రీనాథుని కాశీఖండ భీమఖండ శివరాత్రి మాహాత్మ్యాదులూ, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము శైవమాహాత్మ్య కావ్యాలైతే భైరవకవి శ్రీరంగమాహాత్మ్యం, రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యం వైష్ణవ మాహాత్మ్య కావ్యాలు మరికొన్ని ఉండవచ్చును.

వీటిలో ఒక్క శ్రీరంగమాహాత్మ్యం తప్ప తక్కిన కావ్యాలన్నీ ఆంధ్ర సాహిత్యంలో మంచి ప్రచారమూ ప్రశంసా పొందాయి.

దైవత, తీర్థ క్షేత్రాల మహిమలు చెబుతూ వాటి అనుబంధ కథలు ఉగ్గడిస్తూ గ్రంథం నడపడం వీటి పని. గురుసవేదివంటి కళాత్మక హస్తం వీటి మీద పడకపోతే-ఇవి వట్టి స్త్రీల వ్రత కథలమాదిరిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఒకే హస్తంతో వ్రాసినా కాశీఖండ భీమఖండాల పొంకం శివరాత్రి మాహాత్మ్యానికి రాలేదని చెప్పవచ్చు.

తన 'అతులిత మాధురీ మహిమ'ను విరజిమ్ముతూ ధూర్జటి వ్రాసిన కాళహస్తి కథ అపూర్వ కావ్యశోభను పొందింది.

రామకృష్ణుని పాండురంగమాహాత్మ్యం ఆ ఉత్తమశ్రేణిలోని క్షేత్ర కావ్యం.

అనేక క్షేత్రకావ్యాలకు మూలం స్కాందపురాణం అయినట్లే దీనికిన్ని మూలం 'స్కంద పురాణ నిధికౌస్తుభమై ప్రభవించు దేవకీనందను సత్కథోదయము' అని కృతిపతి అన్న మాటనుబట్టి స్కాందపురాణమే అనుకోవలసి ఉంది.

1 చూ. రా అనంతకృష్ణ శర్మగారి పాండురంగ పీఠిక ఆం సా అకాడమీ ముద్రణం

ఒక [illegible] ప్రసిద్ధ ఆంధ్ర గ్రంథానికి మూలం ఒకటి ఉందని చెప్పడం దాని ప్రామాణి[illegible]త్వం కోసమే అయినా, అది చాలా [illegible] సూచిస్తుంది. కొందరు తెనిగింపు అనుకోవచ్చు; వేరొ కొందరు అనువాదం అనుకోవచ్చు.

పాండురంగ మాహాత్మ్యం [illegible] [illegible] మౌలి[illegible] చన అనీ అనుకో[illegible] దానికి వీలుం[illegible].

రామకృష్ణుడు [illegible] ఉజ్జ్వలమైన తెలుగు కవితాధో[illegible]ణులను తరచి చూచినవాడు. చక్కని జాతీయాల [illegible] తెనుగుకవిత్వం పలు[illegible]ంది ఉన్నా [illegible]వితావిహారంలో శ్రీనాథుడూ, కథన చాతుర్యంలో తిక్కనాదులూ ఇతనిని విశేషంగా ఆకర్షించినట్టు [illegible] నవవచ్చును.

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]వు. ఎందుచేతనంటే–ఒ[illegible] [illegible] [illegible] క్క [illegible] [illegible], [illegible]భీత మతిని' [illegible] ముక్తను [illegible] [illegible] [illegible] [illegible] [illegible] అఖు కన్యకను సమానంగా చెప్పడం [illegible] [illegible] [illegible] [illegible] వాని [illegible]పసక్తి లేకపోయినా కలిగే ఔచిత్యభంగ [illegible] [illegible] [illegible] [illegible] తెచ్చేదా? [illegible] [illegible] [illegible] [illegible] [illegible] శబ్దాలంకారాలనూ, వస్తు శ్లేష వర్ణనల్ని [illegible] [illegible]లో ఎక్కువ ఉపయోగించ లేదు.

కాశీఖండం [illegible] కథతో ప్రారంభమౌతుంది. ఆ ఋషి [illegible] [illegible] వంచి ఆంధ్ర క్షేత్రాలన్నీ తిరిగి కొల్లాపు[illegible] [illegible] దర్శించగా ఆమె [illegible] భద్రా తీరాన కిష్కింధాచల ప్రాంతంలో స్వామిమల అనే స్థానంలో ఉన్న కుమారస్వామినల్లా కాశీ[illegible] అవగతం చేసుకోమంటుంది.

సరిగ్గా–అట్లాగే పాండు[illegible] మా[illegible]త్మ్యంలోను అగస్త్యుడు [illegible] ప్రాంతమంతా తిరిగి కుమారుని దర్శించి పాండురంగ మహిమను పార్వతీశ్వరుని ద్వారా [illegible] [illegible] [illegible]ప్పరుస్తాడు.

నిజానికి పాండురీక [illegible] మాహాత్మ్యం గనక [illegible] పుండరీకుని వర్తనంతోనే, తత్తుల్యమైన దానితోనో ప్రారంభం కావాలి.

కాని [illegible]శీపుర[illegible] [illegible] ఆరంభమయింది. ఆతనిమధ్య వైష్ణవంలో నుంచి శివాభిమానం తొంగిచూడడం వంటి అట్లా ఉంచి–ఇ[illegible] ఆరాధ్యపీఠంలో ముఖ్యుడైన శ్రీనాథుని అడుగుజాడలు కనిపిస్తాయి.

"శీతాహార్యసుతాళిసి చ రాజీవంబు" ౧-99

"ఒకనాడు తీర్థో యోగిగాని శరుండు
నౌదల ధరియించు శుభ్రగంగ" ౧-101

వంటి పద్యాల్లో ఎత్తుగడలు, సమాసాల కూర్పు, శ్రీనాథుణ్ణి జ్ఞాపకం చేస్తాయి సీసాలలో ఈయన చేసిన ఇంద్రజాలమంతా శ్రీనాథుని అండతో జరిగింది. అట్లా నడచినట్లే నడచి ఈయన చూపిన ఊహాశాలిత, ప్రజ్ఞ, వేయి రేకలుగా విచ్చుకొని సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తుంది

కాశీ పట్టణాన్ని పీఠికాంత సాంగోపాంగంగా వర్ణించి 'అప్పుడు వారసతులు నేవళ్ళు మించడంలో ఒక చమత్కారం ఒలికిస్తాడు. అది కావ్య రసజ్ఞులకు కంఠస్థమయ్యేట్లుగా, ఇంపు సంపాదించుకుంది

'మొరక చీకటి జలజల రాల్పంగా రాదె
నెలుబు మించిన వీరి కురులయందు'... ౧-110

పాదాలన్నీ అంతే, ఎవరూ అనుసంత సొంపుగా అంటాడు. 'కురులయందు' అంటే 'కురులనుండి' అని అర్థం ఒక విభక్తికి వేరొక విభక్తి సమ్మతి ఉన్నది కనుక 'అందు' కు 'నుండి'ను సంపాదించవచ్చు. శబ్ద ప్రయోగంలో ఇతని సాహసం అంతటిది ఈ విషయానికి పక్కన పాదాలలోని సప్తములు జ్ఞాపకాలు.

ఈ క్రింది వాగ్వైఖరి శ్రీనాథునిది—అని తెలిసినదే—
'ప్రసవనారాచుని ఎఱ్ఱచిచ్చరకంట జుఱ్ఱినాడు'
'బిసగుపాసను మోము కెందమ్మి వివోలె గిల్లినాడు'
'మృత్యుదేవత నోట ధట్టించి యరకాల దన్నినాడు'.

మొదట ఒక సంస్కృత పదం ఘనంగా; దాన్ని గెంటివేస్తూ రెండు తెలుగు పదాల వాహ్యాళి, ఈ చేసే పనిలోని తేలికను వెల్లడిస్తూ.

ఈ వాసన రామకృష్ణునకు పట్టింది
'గ్రిష్మకూటపు పటు నటత్కేకి రాజమురీతి
రాధ చన్నవమీద ప్రాలి సాగుచు

చిత్రాభ్రములు నేలు సుత్రాము కైవడి
పలునన్నె యాలమందల మెరపుచు

ఆటలన్నియు జాలించి యింటికి దరల
పర్ణశాలకు దేవకీతర్ణకుండు" ౨-31

'తర్ణక'మంటే 'లేగదూడ' ఈ లాక్షణిక ప్రయోగంలోని వక్రత ముద్దులు మూటగట్టేది రసికైక వేద్యం.

తన ఉద్దండ ప్రతిభతో శ్రీనాథుని వక్రోక్తిని, ఉక్తిచాతుర్యాన్ని ఊతగా గొని ఈ కవి ఎంతైనా ఎదిగినాడు.

అల్ప శబ్దాలకు అనల్ప శబ్ద గౌరవం అనల్ప శబ్దాలకు దూదివంటి మెత్తన తేనడం ఇతనికి ఆట.

1 కప్పు వరుణదంతావళం
2 పిల్ల తుమ్మెదలు, అలికలభములు
3 ఏరు, ఉదన్వన్మహిళ
4 గోపాలకృష్ణుడు - మందప్రోయాంధ్ర కూరిమి ప్రమానివందు

ఈ మాటలకూ రామకృష్ణునకూ అవినాభావ సంబంధం—'అప్పులు పొడుచు', 'వంక రకచాటు', 'చుక్క తెగిపడినట్లు', 'పదు పడుకకు జెప్పక', 'చిరిగిన సిగ్గులు'—వంటివి ఎన్నో!

తెలుగు సంస్కృతాల క్రీడ—

పొల మారకు - మారశిలీముఖాళి
ఇల్లాలిని - ఇల్లాలి తాంకార
తన యాలిని - తన యాళిని
కలదా శూద్ర వసతి - శశికల దావన
ఆ పగలవి - బాహ్యాశాపమాపగ
ఈ గంగాదిక తీర్థము లీగంగా—

ఇది పాండురంగ విభుని పదగుంభనం. ఇట్టివి పూర్వం ఏ కొందరో చేసినా ఇవి ఈతని కూర్పు మెలపులో కొత్తగా భాసిస్తాయి.

అసలు కథలోకి వెడితే—తీర్థం భీమరథి

క్షేత్రం పౌండరీకం, వేలుపు పాండురంగడు

ఈ మూడు కలిసి ఒకచోట ఉండడం కడుగొప్ప అని ఈశ్వర ప్రతిపాదనం ఈ గొప్ప కాశ్యాదుల్లో కనిపించినా ప్రకృతం పౌండరీకం కనుక—దీన్ని అర్థవాదంగా గ్రహించాలి

వరుసగా పుండరీకుని భగీరథిని ఎన్నో చిల్లర తీర్థాలను వర్ణించి క్షేత్రమాహాత్మ్యం వివరిస్తాడు మొత్తంమీద ఇది ఒక కథాపరంపరగాని ఏకనాయకమైన ఏక కథ కాదు విష్ణుభక్తి పాపనాశకమనీ, ముక్తిహేతువనీ చెప్పడం పరమలక్ష్యం ఇది వేరొకరి చేతిలో పడి ఉంటే—ఒక పురాణ కథగా చప్పగా ముగిసుండేది

అదృష్టవశాత్తు అది ఒక ప్రజ్ఞానిధి చేతిలో పడి పరుసవేది తగిలి ఇనుము బంగారమైనట్టు కవితామయం అయింది

ఇందులో అద్భుత పాకానపడ్డ కథలు మూడు 1 నిగమశర్మ 2 సుశీల, 3 అయుతనియుతులు

ఈ మూడు కథలను అందెవేసిన కథారచయితగా రచించి తిక్కన తీర్పును తలపింపజేస్తాడు

కథను విసుగు రాకుండా ఎత్తు పెంచుతూపోయి కొంత పాఠకుని ఊహకు వదలి [illegible]త్తించినట్టు ముగిస్తాడు తుదకది పౌండరీక క్షేత్ర మహిమగా తేలడం ఏకసూత్రం!

నిజంగా ఈ మూడు కథలకోసమే ఈ కావ్యం ఎన్ని సార్లయినా చదవాలనిపిస్తుంది, ఆ కవికి పెద్ద ఋణం తీర్చుకోడానికా అన్నట్టు-

ఎంత చిన్న కథ తీసుకున్నా ఏదో ఒక మెరుపు ఏదో ఒక ఒరవులేనిదీ, అది ముగియదు

ఒక ముక్త కేశి చిలుక, కాకి, హంస సర్పం, దుప్పి ఏది తీసుకో, ఈ కథన చాతురి కనపడుతుంది

ఈ కావ్యానికి అటూ ఇటూ రెండు స్తంభాలు: విమగళ్ళస్త్రీకథ, అయుత నియుతుల గాథ - ఆ రెండిటికీ పూలతోరణంలా నిగమ శర్మకథ ఇమిడ్చిపెట్టాడు.

నిగముడు ఎంత స్త్రీలోలుడో, అయుతుడు అంత కాంతావిముఖుడు. మొదటివాడు స్త్రీల వెంటపడి ఎట్లా సర్వభ్రష్టుడయ్యాడో, రెండవవాడు స్త్రీలను ద్వేషించి తన ఉన్నతిని అంతా పోగొట్టుకున్నాడు.

నిగముని కథకు మూలబీజం భాగవతపు షష్ఠస్కంధంలోని అజామిళోపాఖ్యానం.

> "మఱి కులాచార వర్తనమూలు చేసె
> నిగుడు పిత్రర్థములు దానిపాలు జేసి
> సాధువర్తన గుణవ్రతజాలు చేసి
> లోకలోకులు నసజెంది, లోలుడయ్యె" భా.గ. 105

> "సముచిత శ్రుతి చర్చ లుజ్జించినొల్లక
> సతికి పద్వగా చర్చలు జన్మసేయు" భా.గ. 108

ఈ అన్ని లక్షణాలు నిగమునిలో ప్రతిఫలించి ఉన్నాయి. కవి శ్రీనాథుడు ఇష్టుడు నిగ, కాశీఖండంలోని గుణనిధి, శివరాత్రి మాహాత్మ్యంలోని సుకుమారుడు, ఇతన్ని ఆవహించారు

గుణనిధి కథలోని 'నిగమజ్ఞ' అనే నామధేయం, నచ్చిన వాడు చచ్చి కళింగదేశంలో పుట్టడం, రామకృష్ణుని ఎత్తుగడకు దోహదకాలు కూడా అయినవా? అనిపిస్తుంది అయితే దాన్ని మలచిన తీరు కేవలం రామకృష్ణుని పజ్ఞకం.

> కులమా? 'బ్రాహ్మణపుత్రు' వంటిది-
> సంబ్రమే? వేదముల్ 'వాసినగాదె'-

నిగముడా? 'వనితామానస, సూన సాయకుడు' 'జీవత్త్రాతపాదుడు' 'భూజన సమ్మాన్య, విశుద్ధ వర్తనుడు' పలుగడు సంగబడ్డ,నునుమాన్యము'.

> ఆ ముత్యం, బురదంలో పడ్డది-
> అది పదునుపోయిన కస్తూరి-

[illegible]లిగిపో[illegible]న పువ్వు-

పట్టిపో[illegible] చెప[illegible] అయిం[illegible] అం[illegible] [illegible]ం కోలుపోయింది. [illegible] ఇల్లు దూ[illegible]యి[illegible]. గు[illegible]కి తల్లిచే[illegible] [illegible]మే ఇంకో రూపంలో సిగముని [illegible] ఒ పెద్ద తెను[illegible] ఆడబడుచు పుట్టింటి మీది తీపి[illegible] చె[illegible] చే[illegible]ంది. ఈ తెనుగు అ[illegible] [illegible]మ ప్రతిష్ఠని అపూర్వసృష్టి. అట్టి [illegible] - కొంత పొల్లుపోయినా. ఎందరు తమ్ములు [illegible] అనిపిస్తుంది.

[illegible] కార్యంలేదు చే[illegible] ఒ[illegible] కార్యంలేదు చక్కని అక్కమాటను [illegible]పథువును రో[illegible]. ఇల్లు దోచుకున్నాడు దొంగలు ప్రాణా పశిష్టుణిచే[illegible] [illegible] కడిని అ[illegible]యమిచ్చి [illegible] భాగ్యాను లే[illegible] నెత్తుగొని పో[illegible]డు

ఆమె మ[illegible]ంచగా ఒ[illegible] చం[illegible] కను చేపట్టి వేటలుచేసి [illegible]చితిని [illegible]ల్లు[illegible]గి - [illegible]మైనా [illegible] - ఆ బాహ్మ[illegible] కూడా [illegible]డిగివేసు కున్నాడు

ఒక[illegible] ఇల్ల [illegible] జాతి ఇల్లాలు పిల్లలతో కూడా క[illegible]తేరగా - '[illegible]ను[illegible]గంటల[illegible] బో[illegible] [illegible] [illegible]పూర[illegible] [illegible]మ్మగా' ఏడ్చాడు. ఈ [illegible] కని '[illegible]' [illegible]మైనది.

> '[illegible] నెల[illegible] [illegible]లిచి మృ[illegible]తులం
> గొం[illegible] [illegible] [illegible]
> [illegible] [illegible] వంశమ్ముని[illegible]
> [illegible] [illegible]మని న[illegible]మ్మి' ౩-౯౩

> "ఈ కడజాతి నాతికి హిహీ మహిదేవుడు దక్కెనంచునన్
> [illegible] బో[illegible]కున్ జన పరంపర కెం[illegible]గు జూడ్కి[illegible]జూచియుం[illegible]
> బూత్కృత మాచ[illegible]చుటకు బుద్ధిదల[illegible] కలం[illegible] ముక్త
> చం[illegible] [illegible]లిబొల్చునీ[illegible]ముఖ[illegible]ంచిమించుటన్" ౩-౯౫.

ఆ దుఃఖంలో అన్నపానాలు ముట్టలేదు పుండరీ ప్రాంత మందలి నృసింహ క్షేత్రానికి వచ్చాడు అక్కడ సంగమరాజ తీర్థంలో ఆ ఒడ్డునపడి వెర్రి చూపులు - చూడడం ప్రారంభించాడు

"ఎన్ని పాపాలు చేసినా, ఏ పుణ్యక్షేత్రంలోనో మునిగితే స్వామిని సందర్శిస్తే, అన్నీ పోయి ముక్తి వస్తుంది" అని తెలిసేగా మోక్షమార్గం ఉప దేశించడంకద్దు దీని పరమార్థం ఆ పతితుడు అది ఆలోచించి చేయనూలేదు అందువల్ల వానికి ముక్తి ప్రాప్తించనూలేదు పూర్వకర్మలు క్షయమై ఆ దర్శనం లభించింది ముక్తి ఏరించింది అదే అంటాడు కవి ——

"చేరువ చేరువై కడు పచేళిమమై తనరారు పూర్వసం
స్కార తపః ఫలంబున భజద్ వృజిన ప్రజనాశ కృష్ణపుం
రీకవ దేవనిర్యా సదనీకృత సంగమ తీర్థరాజ వార్
ధారల నాడి, కల్పిమ ధామపతంబులామూరుఁ జూచుచున్"

3-101

ఆ చూడడంలో వాడికి విష్ణు దశావతారాలు పట్టాయి ప్రకృతమైన ఆ పన్నని స్థితిలో - ఆ ఎన్నుగడ అంతా కవివరో నైపుణ్యానికి తిరుగులేని ఉదాహరణం——

"ఒక యింత ఉప్పవేయక చూచుఁ బెలువారిఁ
దలఁగొట్టుకొని దుఃఖ జలధి మునుఁగు
బిలము తెలువుమంచుఁ బృథివిలోఁ జొరఁబాఱు
సముధిక స్తంభోద్భవము గమించుఁ
దిరియు వాఁడునుబోలెఁ దెసలకుఁ జెయిఁజాచుఁ
దొరగు,న ప్రాంబుధిఁ దొప్పదోఁగు
హా పోయితేయని యఱచు భాగ్యగుదించి
బహు విధైరాసక్తి భ్రాంతిఁ బొందుఁ

జేరఁగారాని దర్శనస్థితి వహించు
బాడబస్ఫూర్తి లోఁగొన్న పగిదినుండు
దానవారాతి కాఁబూని తదవతార
దశకమును మున్ను తాల్చెనా ధగణిసురుఁడు" పాండు 3-102

శబ్దశక్తివల్లను, అర్థశక్తివల్లను సీసపు తొలి ఎనిమిది పాదాలలోను, ఎత్తుగీతి రెండు పాదాలలోను మత్స్యాది దశావతారాలను భావించవచ్చు

కర్మపాకంవల్ల, క్షేత్ర మహిమతోడై ఆ జీవుడికి విష్ణు సామీప్యం వచ్చింది అతడు పార్శ్వచరులలో ఒకడైనాడు

అగస్త్యమునికి అయుతుడు, నియుతుడు అని ఇద్దరు శిష్యులు వారి బ్రహ్మచర్య విద్యాదీక్షలకు మిక్కిలి సంతోషించి ముని వారికి పెండ్లి చేయాలని సంకల్పించి బ్రహ్మ వద్దకు వెళ్లాడు బ్రహ్మ అగస్త్యుని చూచి మనసార సంతోషించాడు ఆ సంతోషం రామకృష్ణుడే చెప్పాలి

''హుంకారములు లేవె? యువ పురందర హరో
త్పాటనంబునకు శాల్పడవు గాక
భ్రూభంగములు లేవే? యాఖిల వింధ్యాగ
గ్ర్వ స్తంభనమునకు రావుగాక ౫-176

రామకృష్ణుని గొప్ప పద్యాల్లో ఇది ఒకటి

అగస్త్యుడు బ్రహ్మపుత్రికలు గాయత్రిని, సావిత్రిని తెచ్చి చెరి యొకరిని పెండ్లాడమన్నాడు అయుతుడు నాకు పెండ్లి వద్దన్నాడు ముని కోపగించి వాణ్ణి ఆశ్రమంనుంచి వెళ్ళగొట్టి ఇద్దరినీ నియుతునికే పెండ్లి చేశాడు అయుతునకు ఆడవాళ్ళంటే ఎంత అసహ్యమో గురువంటే అంత గౌరవం—

అతని మనస్సంఘర్షణం ఇది.—

''ఉర్విధరగము లెక్క యుఱుకనే, కుచకుంభ
యుగమొల్లఁగాక, తానుఱుకు మనిన
వాడి కైదువులపై వ్రాలనే నిడుచూపు
డాలొల్లఁగాక తా వ్రాలు మనిన ౫-184

ఈ వాక్యాలలోని అన్వయ చమత్కారం అతని చిత్తక్షోభను వెల్లడించేలా ఉంది

అయుతుని తపస్సు ఇంద్రుని కుట్రవల్ల భగ్నమయింది ఇంద్రుడిచ్చి మాయాధేనువు వాధూలుని పుట్టను తొక్కింది అతడు కుపితుడై నీవు కప్ప

వవుతావని శపించాడు [illegible] నీకు ముక్తి అని అను[illegible]హించాడు

[illegible] లో [illegible] అయినాడు [illegible] వల్ల [illegible] వచ్చి [illegible]. ఆమె చెలులు [illegible] అతని [illegible]

[illegible] ఒక రీతి [illegible]మైతే - [illegible] ఇంకొక రీతి భంగ పాటు [illegible] ధర్మమూ [illegible]

"ప్రజాంతంతుం మా వ్యవచ్ఛేత్సీః"

"[illegible] తైత్తిరీయం రము. ౧ [illegible]

అనే ఉపదేశాలు [illegible] గృహస్థ ధర్మం పాపిష్ఠం [illegible], ఉ[illegible] మా[illegible] సోపానం.

[illegible]

"[illegible] నుండి [illegible]

బహు[illegible]లు చేసి(బండ [illegible]

నెరనెర ఎదుగుచుం(బెండ్లిండ్లు వొడమ(గ

[illegible]

[illegible] పనిపాటు [illegible]

[illegible] నెట్టుకొన(గ

[illegible] నిజ [illegible]

[illegible]

నిత్య నైమిత్తిక[illegible] నిర్నిద్రబుద్ధి

నాచరించుచు, హరిభక్త మా[illegible]

భక్తినిడ ముక్తి గొనుచున్కి-ముక్తిగాని

నిదుర వంటిది రాతివంటిదియు(గాదు" ౪-216

రామకృష్ణుని దృష్టిలోని ఈ పండువంటి సంసారం ఎట్టివారికైనా [illegible]

శేనరూపాంతరంలో అయుతునికి రాజకుమారికి సంతానం కలిగింది శాస్త్ర విష్ణు ప్రాప్తి కలిగింది.

మధురమైన సంసారంలోనూ ఒకప్పుడు సెగలు పొగలు బయలుదేరుతాయి వాటిని ఓరిమితో నివారించుకోవాలి. దానికి శుద్ధశీల సుశీల ఉదాహరణ.

"తాళి భుండు ... మొదల్, పతిదేవత ... పెక్
గో... మగండు కొట్టిన దిట్టిన రట్టు పెట్టినన్
దాళి ... తాను ... గొల్చు, సేయున్
... బుద్ధులు ... వృద్ధులు ... న్"
ఆ-144

ఆ ఇల్లాలిని భగవంతుడే పరీక్షించాడు ... చిక్కులో పెట్టాడు. ఆమె ... ప్రార్థించి ... మౌని ... చెదరక ... అతిథిపూజ చే... భగవ...

రామకృష్ణుడు క్షేత్ర తీర్థ మహిమలను ... విదానమైన ... కథలను ... పద్దాడు. ... దశంపు ... ఎంతో ...

ఈ కథలో ... పీతి ... ముంచిస్తుంది. ... నాథుని ...

"ఎన్ని ... బులరిగిన నేన ...
వెలయు ... యంబు ... " అని దేవుణ్ణి

పరాచిక మాడుతాడు.

... నిగమ ... కడుపులో కడజాతి బిడ్డలను గూర్చి "భూమి మదస్వయ వర్ధనుల్ భవత్పుత్రుల ... పుట్టరుగాక" అనడం ... కాక మరేమవుతుంది ?

బౌద్ధావతార వర్ణనంలో ఈ హాస్యం పరమావధికి వెళ్ళింది

"ప్రతిదిన కేశలుంచన ... వెట్టిన బట్ట... మై...
బునవు... మంచును ... బోడతలన్ ధరియుంపనోడియున్

సలమగు సొమ్ముగా నుడజాలవుగా శిఖిపింఛవల్లి పో
తమ ప్రభుడ్యా! దానిఁ గట్టిఁగట్టుము, పుట్టము మిన్న కేటికిన్'' 24

దీనిలో ఈతని వ్యంగ్యవైభవం దర్శన మిస్తుంది

''తరణియు శైమియును బర
స్పరమచ్చటఁ గూడినిగుడఁ బావనమగుఁద
త్సరికంబువునం దాడిన
నరునకు నవ్వారి చరణనఖమును వెడలున్'' ౫-26

అచట స్నానం చేసినవాడు విష్ణురూపుడవుతాడని కవి హృదయం

భాషా ప్రయోగ విషయంలో ఇతడు సర్వస్వతంత్రుడు - 'నుయిదాకె వానికిన్, 'తొడ్వెర, (తొడిగిన) 'కలితేఁజాలు' (కలిగితే) 'కొన్గినిని' (కొన్ని) వంటి తెలుగులు ధన్యాసిం ప్రావమూకుటన్ వంటి సంస్కృతాలను నిరాఘాటంగా వాడుతాడు

రామకృష్ణయ్య గొప్ప అంతర్ముఖుడు అని మాటలలోనే అతని కవిత ఎట్టిదో ఒక మాటలో చక్కగా చెప్పవచ్చు

అది ''అతి స్నిగ్ధవర్ణ, ముగ్ధాకృతియుఁ జతు పదవిన్యాస విన్యాసయు నైన సువికవిత'' ౫ 192

కవితా హేమంతం

(ఐదవ ప్రసంగము)

సంకుసాల కవి సారస్యం

ఇంచుమించు రాయల యుగంగా ప్రఖ్యాతి వహించిన క్రీ. శ. 16 శతాబ్ది, ప్రబంధరచనకు శరదృతుశోభగా వెలిగిపోయింది కృష్ణరాయల సాహిత్య పరిపోషణ, కవితా ప్రోద్బలం, ప్రజలపై, రసజ్ఞులపై వాటి ప్రభావం, రాయల ఉత్తర కాలంలో కూడా కొంతవరకు చెల్లుబడి అయింది

తర్వాత ఆ యుగంలోనే క్రమక్రమంగా ఆ శరచ్ఛోభ మసక మసకయి తొలింటి ప్రాభవాన్ని పోగొట్టుకొని వాసనా మాత్రంగా నిలిచి వేరొక మలుపు తీసుకుంది

హఠాత్తుగా వేరొక ఋతు లక్షణాలు తలచూపడం ప్రారంభించాయి క్షీరాబ్ధి ఉప్పొంగినట్లు, కర్పూరధూళులు వెదజిమ్మినట్లు, కలకలలాడి గమగమ వలచిన కాలం, రెక్కలు కట్టుకు ఎగిరిపోయిందా అనిపిస్తుంది

ఋతువు మారింది ఇది నిజం మనం ఇప్పుడు తెలియకుండానే హేమంత లక్షణాలను చూస్తున్నాం

తొలితొలి మంచు బిందువులు, చిరుచిరు చలి ఇదివరకటి రసజ్ఞుల ఉత్సాహం, ఊహాశాలిత, రెక్క ముడుచుకున్నవా ? అనిపిస్తుంది

అట్లా అని పూర్తిగా పొగమంచు కప్పుకోలేదు చంద్రశోభ తగ్గిపోలేదు విశాల సరోవరాలు నిష్కమలాలు కాలేదు చంద్రుడు దృశ్యాదృశ్య శోభతో వెలుగుతున్నాడు పుండరీకాలు పూర్తిగా వట్టిపోలేదు విరళంగా అక్కడక్కడ పరిమళాలు వెదజల్లుతూనే ఉన్నాయి

మొగమాటపడుతూనే ఆకర్షించే కామనీయకం, తల ఎత్తకుండానే తొంగిచూచే ఒకానొక ప్రకర్ష, మన ఆసక్తిని తమవైపు తిప్పుకుంటున్నాయి కనుకనే దీనిని కవితా హేమంతం అంటున్నాను

సంయుసాలు స్మృసించారుఎ రాయ, సమకాలికుడని ... ఆ సిసి ఆ శిరసం కోసి నిరాకృతుడై రాజులకు దూరమై భి. పింగళంగా ... చేశాడనీ పట్టు కథలున్నాయి. కానీ వాటికి ప్రబలమైన ఆధారాలు లేవు.

అయితే అయిన కావ్యాదిని చేసిన రాజదూషణం అనిన రాజాశ్రయ వైముఖ్యాన్ని చెబుతుంది. ఆ రాజెవరో స్పష్టంకాదు.

ప్రబంధ రచన ఉచ్ఛదశ తగ్గిన తర్వాత ఈయన రచనా ప్రయాణం సాగినట్టు కనబడుతుంది.

ఈయన రచన 'కవిహృదయ రసాయనం' అనే ప్రబంధం. ఇది స్వాతంత్ర్య ప్రవృత్తిని చాటుకునే ధోరణిలో కావ్యవస్తువును చెప్పింది కాదు. యువనాశ్వుని కుమారుడు మాంధాత చరిత్రను ఆరు ఆశ్వాసాలుగా ప్రపంచించిన కావ్యం ఇది.

ఏదో కొంత ప్రతిభ, చాలినంత వ్యుత్పత్తి గల కవి ప్రముఖుడు. ఆయన మాటలో ...

కావ్యాదిని అంటాడు.—

"...కు నె ...ంచు ...లా
పాకములు. మొదలు చెడిన ప్రాంతప్పులయా!
లోకము జిహ్వాంచులగుచు
యాకులుగా నుండు నెవ్వ, యిటివో కవితల్" ౧-14

"ఘులుం డింగ దప్పులే వెదకం
గాలి ప్రాసానుభవంబు సేయనే
డోలిక ... గోరు ...
మగాసగం గర్దభ మొందనేర్చునే
మలంఘు మరుద్విధూత మధు
మాస ...స్వాద కేసరావళీ
...లిత పరాగ యోగ వశ
కల్పిత పేశల ...సౌఖ్యముల్"

"ఎల్లరు మెచ్చని మత్కృతి
నుల్లంబున మెచ్చుగాక యొకం డుష్టోకులం

బొల్లని పల్లెలం క్రమము
పోల్లలుగాం బొడినొక్క కలయు లేదే !''

పసిగానే తల ఊచే. నిజంలా కనిపించినా - లోకుల నోటిలో నిలిచినంత మాత్రాన ఆ పిచ్చోళ్ళు గొప్పవాళ్ళయిపోరు. అనేక కావ్యాలు లోకుల జిహ్వాంచలాలో నిద్యోతమాయి. నుడికారంవల్ల, చమత్కారంవల్ల వెటకారంవల్ల నాలుకలమీద ఉండవచ్చు. వాటికి సాహిత్య మూల్యం, రస స్ఫూర్తి ఉన్నప్పుడే నిజమైన సార్థకత. అయినా ఏదో ప్రబలగుణం లేకపోతే లోకుల నాలుకమీద ఇళ్ళు కట్టుకోవు అని నామాట సత్యం.

ఈరకపు పద్యాల్లో ఎలా చెప్పవలసినది కొన్ని ఉన్నాయి.

గాన్వాదిని ఈ కనిది ఇలాంటి ప్రతిజ్ఞ ఉంది.

''యతి విటుడు గాకపోవు చెల్ల స్మదీయ
కావ్య శృంగార వర్ణనా వర్ణనముకు
విటుడు యతిగాకపోరాదు వెనమదీయ
కావ్య వైరాగ్య వర్ణనా వర్ణనమున'' ౧-22

ఈ పద్యంలో ఒక విధమైన స్పష్టత కనపడతాయి గానీ సౌమ నస్యంతో సరైన కావ్య ధర్మం చెప్పినట్లు గాలేదు విటుణ్ణి యతినిచేస్తే లోకానికి కొంత ఉపకారం కావొచ్చునాని, యతిని విటుణ్ణి చేయడం లోకద్రోహం, పతన హేతువు. ఇంత ప్రజ్ఞలు పలికి చేసిన ఉపవాదాలు కృతినుములు అనుతాయిగాని సహజంగా వికసించి. హద్దులో ఉండి ఆనందమిచ్చేవి కావు.

ఇందు తీసుకున్న కథను చక్కగా నిర్వహించి వ్రాస్తే మూడాశ్వాసాలు చాలు.

1 యువనాశ్వునకు మాంధాత జననం 2 అతని పెంపకం, విద్యాభ్యాసం, రాజనీతి - దిగ్విజయం 3 వివాహం సప్త సంతానం, వ స్థుని ఉపదేశం - తపస్సు, భగవత్ప్రసన్నత

దీనికి బదులు తృతీయాశ్వాసమంతా శృంగార కథ - మొగము మొత్తు నంత; చతుర్థాశ్వాసమంతా ఋతువాది బహువర్ణనలు. ప. ఆ. లో తపస్సు - భంగప్రయత్నాలు, కృతార్థత - స్తుతి పరంపర, మొత్తం ఎవరితోనో పందెం

వేసుకుని నాలు ఎం॥ తెలుసునో చూడు, ఎం॥ ఒడుపుగా చెప్పగలనో పరీకించు అన్నట్లు కనిపిస్తుంది, రచన అంత సావధానంగా చదివితే-

పూర్వులూ మితిమీరిన వర్ణనలు, అప్రసక్త కథలు చెప్పారు కాని ఆ వారి ప్రబంధ ధోరణిలోపడి కొట్టుకు వచ్చినట్టు కనపడతాయిగాని, స్పర్థతో పట్టుబట్టి చెప్పినట్టు కనబడవు

ఈయన వ్యక్తిగతంగా మంచి భాషావైదగ్ధ్యం కలవాడు సమృద్ధమైన భావ స్వాతంత్ర్యం ఉంది ప్రభువులను కాదని నెగ్గుకురాగలననే ఆత్మ ప్రత్యయం కలవాడు నిశితమైన కవిత్వావగాహనం స్వాయత్తం చేసుకున్నవాడు

కావ్య పీఠికలో తన నా స్సునిట్లా (వ్రాశా)రు —

" శంఖనాగస్వరస్వర శ్రవణ సమద
విస్ఫుట చ్ఛత్ర విస్ఫారిత స్ఫటాక
విష్ట విష వైద్యవశవర్తి దుష్టఫణులు
ప్రభు దురాత్ముల నెవ్వాడు ప్రస్తుతించు?" ౧-24

"నరగుణాంకిత మయ్యేనే పగసకృతియు
దూష్యమగు శుచిధృతగతి దుగ్ధమట్లు
హరి గుణాంకిత మయ్యేనే నసదుకృతియు
హార సూత్రంబు గతి హృదయంగమంబు" ౧-24

కవులు —

"మనమునఁ గొన్న నెవ్వగలు
మాన్చి ఘటింతురు కావ్యసమ్మదం
బగఘు కథా ముఖంబున హి
తాహితబోధలొసర్తు రింపుగాఁ
గనుగొనుకంటె నద్భుతము
గా నెఱిగింతు రతీంద్రి యార్థముల్
ఘనమతు లెల్లవారికిన
కారణబంధులుగారె సత్కవుల్"

ఈతడు కావ్యవస్తువుగా స్వీకరించిన మాంధాతృకథలో మూడు చమత్కారాలున్నాయి

(1) యువనాశ్వరాజు సంతానహీనుడై ఇంద్రయజ్ఞం చేసి అందులో మునులు మంత్రించి ఉంచిన జలం దాహార్తుడై తాను త్రాగి గర్భవంతుడౌతాడు అని పొట్టపగిలి [illegible] అట్లా మృతుడైన రాజును ఇంద్రుడు బ్రతికించి పుట్టిన బిడ్డకు తన వ్రేలితో అమృతం కుడిపి రక్షించి అతని పేరు మాంధాత అంటాడు

(2) మాంధాత వీరుడై రావణుని ఎదుర్కొని యుద్ధంచేసి శివునిచే ప్రశంసపొంది, నీదే విజయం అనిపించుకుంటాడు ఆ విధంగా రావణ విజయం సూర్యవంశ సంజాతులకు వరప్రసాదం అయింది

(3) మాంధాతృ తపోభంగం చేయడానికి వచ్చిన అప్సరసలు అతనికి శిష్యురాండ్రై పరిచర్యలు చేస్తారు

ఇతడు తన కావ్యాన్ని అష్టాదశవర్ణనలతో సుసంపన్నంచేసి పరిపూర్ణ ప్రబంధంగా రూపొందించ దలచినట్టు కనబడుతుంది

సూర్యచంద్ర ఉదయాస్తమయాలు సర్వర్తువులు, అంధకార విటవిటీ వర్ణనం పుత్రోదయ, దిగ్విజయ, వివాహ, విరహ, సంభోగాదులను సమగ్రంగా వర్ణించాడు అందులో నాటి సమాజ అభిరుచులు ఆచార రేఖలు కనబడతాయి శృంగార విశృంఖల విహారం వేశ్యామాతల పీడలు ఇత్యాదులెన్నో కనపడతాయి వర్ణనల్లో భావనాతిశయంలో లోకోత్తరమైన పోకడ లుండవు పూర్వకవుల మార్గంలోనే సురక్షితంగా నడచి వెళ్ళుతాడు

చంద్రోదయం

"ఇంచుకించుక శశి యుదయించునపుడు
తలుచు చీఁకట్లు భీలమై దఱిసి, డాఁగె
ముకుళితాంబుజ పుటకుటీ మూలములనొ
సభయమూర్ఛిత విరహిణీ స్వాంతములనొ ?

జారిణులు "కోటలు బొమ్మరిండ్లు మఱి
కొండలు తాపలు దివ్యదృష్టికిన్
కాటుక లంధకారములు
గాఁ జని కందువపట్లఁ బాంసులా

పాటల గంధులొందు రుప
　　భర్తలతో మణితాదులైన జం
జాటము లేని కూటముల
　　సాహస కల్పలతా ఫలంబున్

అంధకారం
　కరచి చిప్పలఁబట్టు కలు లెఱుంగముగాక
　　ప్రాయంగనిది మషీరసము గాదె
　ఇది గుణంబులు సేయు నిరవెఱుంగముగాక
　　నీలాల సరులుగా నింపరాదె?
　కరవటంబులఁబెట్టు వెలవెఱుంగముగాక
　　వనితల కిది నవాంజనము గాదె? 8-91

'హృదయగతిం బురాణ కవీశ్వరు లేగని త్రోవలేదు' అన్న ఎరుక గలిగి, తన ప్రతిభకు, వ్యుత్పత్తికి తగినట్లు తన రచనను సాగించాడు

యుద్ధాది వర్ణనల్లో కందపద్యాలు, జానుదెనుగు ఎక్కువ ఉపయోగించి తిక్కనను అనుసరించాడు ఈతని హేమశైల వర్ణనం చూచినప్పుడు పెద్దన జ్ఞాపకం వస్తాడు 'హేలమెయిన్ మహీరమణుడెక్కెను సప్రమదేవతాస్థానము గానవీచివాచాలము పునరుక్త తారకాజాలము ప్రస్థితి మూలము, హేమశైలమున్' 2-230

శ్రీనాథుని ప్రౌఢి పుణి పుచ్చుకొన్న పద్యమిది —
　"అరవింద ప్రతిమల్ల ఫుల్లనయనుం డాజాను బాహార్గళుం,
　డరతోత్తాల విశాలవక్షుడు సమగ్రాకార లోకైక సుం
　దరుఁడుల్లోక విచిత్ర తేజుఁ, డగుమాంధాతృ క్షమా మండలే
　శ్వరుఁ, డాతండొక రాజమాత్రుడటె? సాక్షాద్విష్ణుడూహింపగన్"

　కృత్తాత్మ శిరములు నెత్తమ్ము లెవ్వాని
　　నీలకంఠార్చనా నియమములకు 3-60

ఈతడు వర్ణించిన 'మలయాచల శీతల వాతపోతములు' కాశీఖండపు మలయాచలంబుపై చిలువ యిల్లాండ్రుర' అను సీసపద్యపు పుత్రికలే!
కాశీ ౧-130

'జారిణీ జారరహః ప్రసంగము'పై ఈతడు చెప్పిన 'శ్రవణ యోగ్యం బైన శబ్ద మొక్కఁడు లేక' (౪-107) అనే సీసం వసుచరిత్రలోని 'ఖాపం బెక్కడ లేక' అనే పద్యానికి నకలు నరసకవి, మాంధాత శిశుత్వం వర్ణిస్తూ దశావతార స్ఫూర్తిని కల్గించడం పాండురంగలోని నిగమశర్మ అంత్యస్థితి లోని దశావతార ప్రతిపత్తిని స్మరింపజేస్తుంది

ఇట్లా అనేక పూర్వరచనల పోకడలను పట్టినా ఇతని ఉక్తి చాతురిని తెలిపే పద్యాలు కూడా చూడదగ్గవి

వసంతాన్ని వర్ణిస్తూ అన్ని ఋతులక్షణాలను అందులో చొప్పించడం ఇంపుగొల్పుతుంది

పూచిన పూవులెల్ల నుతిఁ
బొందె మనోభవనం పకోలలై
వీచిన గాడ్పులెల్ల పొదివెన్
మలయాచల మారుతంబులై
యేచిన పల్కులెల్ల తగియెన్
బికభృంగకలస్వనంబులై
చూచిన చూపులెల్ల మద
చుంబితమై విలసిల్లె నామనిన్

"ప్రసవశర ప్రతాప శిఖిపర్వగఁ జేయుటచే నిదాఘమై,
కుసుమ రసాతి వర్ణమునకున్ గుదురౌట బయోద కాలమై,
రసిక మనోంబుజంబులలరం గ శరత్తయి, తాన, హైశిరో
ల్లసనముఁ జూపి పాంథపతులన్ వణకించె వసంత, మత్తఁన్"
౪-15

సంతాన ప్రాప్తికోసం తహతహపడిన యువనాశ్వుని చిత్తద్రుతి మాంధాత దిగ్విజయ సందర్భంలోని రౌద్ర వీరాలు, విమలాంగీ మాంధాతల శృంగార చిత్రణం మాంధాత తపశ్చర్యలోని శాంతం, ఈ కవి రసనిర్వహణకు చక్కని ఉదాహృతులు

నాయిక యౌవనారంభంలోని ఈ పద్యం 'లోకుల జిహ్వాల ఆకుల్లో' స్థిరపడిఉన్నది

"ఒత్తికొనివచ్చు కటి కుచోద్వృత్తిఁ జూచి
తరుణి తను మధ్య మెచటికో ఁగిపోయె,
ఉండెనేనియు కనబడ కున్నె! యహహా!
యుద్ధతుల మధ్యమునఁ బేదకుండఁ దరమె?

అతడు ప్రతిజ్ఞచేసి చిత్రించిన శృంగారమిది —

"బిగ్గున కుంచి కాసికలు చిత్త సమున్నతి పేరి వార్తకున్
గగ్గుల కాళ్ళు శంకలకు గన్కని యొగ్గులఁబుట్టు నల్కకున్
సగ్గిన ముగ్గిసల్ నిలువు సైరణకుంగననీని యొత్తికో
శ్భగ్గజ యానకుం బతికి నయ్యో యథేష్ట రతి ప్రసంగముల్"

౩ 229

ఈతని శైలి ఇచటి రతి ప్రసంగపు భావోద్వేగమునకు తగినట్లుగా పరుగులెత్తినది ఇందలి దేశీయపదములు ఆ ఉద్వేగమునకు తగినట్లు క్రొత్త అందము సంతరించుకొన్నాయి

వైరాగ్యం తలపెడితే అంత నిర్లిప్తంగాను చెప్పగలడు —

"పాత్రాపాత్ర వివేకరిక్తులు, శుభప్రారంభముక్తుల్, పురీ
పోత్రిప్రాయులు తత్త్వసాధన కథాబోధానపాయుల్, శ్రవో
నేత్ర ఘ్రాణక, జిహ్వికా పరమనోనిత్యాను కూలుల్ సదా
మూత్రద్వార సుఖాతిలోలు రహహా! మోక్షం బపేక్షింతురే?"

ఝ-123

ఏమైనా చెప్పగల వశ్యవాక్కు!

కావ్యం మోయలేనంత పరమార్థ ప్రబోధంచేసి, పరమ వైష్ణవుడై శమ స్థాయికమైన శాంతరసంతో శ్రీమన్నారాయణ ప్రపత్తితో నాయకునకు కృతార్థత కూర్చి తాను ధన్యుడ - ననుకొన్న కవి నరసయ్య

మొల్ల సువాసన

మొల్ల అంటే మల్లెపూవు
ఇది ఒక తెనుగింటి ఆడుబిడ్డ పేరు—

పురాణ పతివ్రతల ఇతిహాస సాధ్వీమణు పేరుకాదు అచ్చతెనుగు పువ్వుపేరు ఇందులో ఒక భావవాసనఉంది లాలిత్యం ఉంది ఆమె పేరునుంచే కావ్యంలోకి కూడా ఈ తేటదనం తియ్యదనం దిగాయా ? అనిపిస్తుంది

ఒకనాటి తెనుగిళ్ళలో విద్యాగంధానికి సంస్కారానికి కొదవలేదు అగ్రవర్ణాలలోనే కాదు, అవర వర్ణాల్లో కూడా విద్యాసంస్కార వతులేకాదు కవయిత్రులు కూడా ఉన్నారు తెలుగు కవయిత్రులలో మొదట పేర్కొదగ్గది ఆతుకూరి మొల్ల

పాకనాటి సీమలో గోపవర గ్రామం ఒంట్రిడి కేసయసెట్టి కులాల కులం సహజంగా శైవాభిమానులు - అయినా ఆమె సంగ్రహించి రామాయణ కావ్యం వ్రాసి తన రామభక్తిని ప్రకటించింది

ఆంధ్ర సాహిత్యంలో స్త్రీ వ్రాసిన తొలి తెలుగు కావ్యం ఇదే చూచాయగా కొన్ని ప్రబంధ లక్షణాలున్నా షష్ఠ్యంతాలూ, ఆశ్వాసాంత వృత్త వైవిధ్యం, నిబిడ వర్ణనలూ కనపడవు, తనకు పూర్వ కవులుగా శ్రీనాధుని వరకు చెప్పింది కవిత్వంలో తిక్కన పోతనల ప్రభావం ఛాయా మాత్రంగా కనబడుతుంది కనక ఈమె క్రీ శ 15 శ॥ చివరిభాగంలో ఉన్నట్టు ఊహించవచ్చు

ఈమె తానుగా చెప్పిన మాటలివి —

'శ్రీకంఠ మల్లేశు వరముచే కవిత్వము చెప్పగంటి'
'చెప్పుమని రామచంద్రుండు సెప్పించిన పల్కుమీదఁ జెప్పెద'

అట్లాచెప్పి రామచంద్రునికే అంకితం చేసింది

'చిల్లర రాజులోకమును జేకొని మెచ్చగ నిచ్చవుట్టునే ?
అల్లము బెల్లముందినుచు నప్పటికప్పటి కాసనేయునే ?' ౧-24

పోతనవలె రాజుల ఆశ్రయాన్ని లెక్కచేయలేదు

మొల్ల భావస్వతంత్రురాలు

'సంస్కృతముల తేటగ తెనిగించెడిచోట ఘనమగు సంస్కృతము చెప్పగా రుచియగునే ?' ౧-16 అని నిలదీసి అడుగుతుంది

'తేనె సోఁక నోరు తీయన యగురీతి
తోడ నర్థమెల్లఁ దోఁపకుండ
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూఁగ చెవిటివాడి ముచ్చటగును' ౧-17

అని చురుగ్గా ఆక్షేపించడం ప్రసిద్ధికెక్కింది

ఈ ఆక్షేపణ తనకు అవ్యవహిత పూర్వుడు శ్రీనాథుడికి ఎక్కువ వర్తిస్తుంది, అనుకుంటాను అంతకు పూర్వం వారూ దీనిలో కొంత భాగస్వాములే ఈ భావం శివకవులనుండి వచ్చి తనకూ నచ్చి ప్రకటితమైనట్లు తోస్తుంది

అయితే తాను ఈ నియమానికి కట్టుబడి ఎంత వరకు రచన చేసింది! అని ప్రశ్న

ఈ అభినివేశంతో తెనుగు ద్విపదను అవలంబించిన శివకవులకే పూర్తిగా నెరవేరలేదు ఇక వివిధ పద్య రచనకు పూనుకున్న మొల్లకు ఎట్లా నెరవేరుతుంది ? యతిప్రాసలకోసం, రసౌచిత్యం కోసం సంస్కృతావలంబనం తప్పనిసరి అయింది కవితా చమత్కారంకోసం తానూ, విరోధాభాస నిర్వహణకు శ్లేష నుపయోగించి నప్పుడు 'గూఢ శబ్దాల' ప్రాపు కోరవలసి వచ్చింది

" సుందర స్యందన మందిరంబగు గాని
సంతత మంజులాశ్రయముగాదు . " బాల 2 ప.

"ప్రకటానురాగ సంపన్నులౌదురుగాని
రమణీయ రుక్మకారకులుగారు. " బాల 9 ప

అట్లానే 7, 11, పద్యాల్లోగానీ సుందర 12, యుద్ధ (2 ఆ) 27 వంటి పద్యాల్లోగానీ చదవగానే 'తోడ నర్థమెల్ల తోఁచదు' శబ్దాలు కూడా ఆలోచిస్తేగాని అర్థంకానివే అయితే తన ప్రతిజ్ఞను కావ్యం ఎక్కువభాగంలో నిలబెట్టు కొన్నదని మనం సంతుష్టి చెందవచ్చు

ఈ మొల్ల రామాయణానికి మూలం పూర్తిగా వాల్మీకి రామాయణం కాదు తనకు ముందు ద్విపదలో విపుల రామాయణ రచన చేసిన రంగనాథుని కథావిధానంలోని అంశాలు కొన్ని స్వీకరించి నాటి జన వ్యవహారంలోని

కొన్ని అంశాలు కలిపి, బాల, అయోధ్య, అరణ్య, కాండలు క్లుప్తంగా, సుందర యుద్ధ కాండలు, విపులంగా రచన సాగించింది

అహల్యారాయిగా ఉండడం గుహుడు తననావ ఆడది అయిపోతుందేమో అని భయపడి రామునికాళ్ళు కడగడం యుద్ధకాండలోని కాలనేమి కథ, అవాల్మీకాలు ఇట్టివే చిన్నచిన్నవి అనేకం ఉన్నాయి

కవిత్వపరంగా మొల్ల రామాయణంలో గొప్ప ఎత్తులుగాని, ఎక్కువ లోతులుగాని ఉండవు సరళ శైలిలో సాధు కథన మార్గంలో, రసచింతనతో ఒడుదుడుకులు లేకుండా కావ్యం నడచిపోతుంది మధ్యమాధికారులు కూడా చక్కగా చదివి ఆనందించవచ్చు అడుగడుగునా స్త్రీ కథన లాలిత్యం కనపడుతుంది

సీత బంగరులేడిని చూచింది—

"ఒడ లెల్లను బంగారము
పొడ లెల్లను రత్నసమితి బోలిన మెఱపుల్
నడలెల్ల నెఱపి మెలఁగెడు
కడలెల్ల విలాసరేఖ కళలం దొప్పెన్" (అర 27)

ఆమె ధారాళమైన పద్యగమనం, అనుప్రాసం, పోతన్నను తలపింప జేస్తాయి

పావని కనుగొనె నప్పుడు
పావన విఖ్యాత సుగుణ భావోపేతన్
సేవిత దనుజ వ్రాతన్
భూవనితా జాత నిర్వ్యపూతన్ సీతన్ సుందర 39

జాఱకుమా, వీరము సెడి
పాఱకుమా, రిపులు నవ్వ భయపడి వనమున్
దూఱకుమా పేర్కొంచును
చీఱకుమా, కపులఁ దోడుచేకొని పోరన్ యుద్ధ 3-45

ప్రకృతి పరిశీలనంలో సన్నివేశ భావనలో ఈమె నేర్పు ఎన్నదగినది

హనుమ సముద్రలంఘనోద్యుక్తుడైనప్పుడు ఆతని రూపమిది—

"మొగము బిగించి పాదములు మొత్తముగా నటనూది త్రొక్కి నీ
టుగ మొగమెత్తి భీకర కఠోర రవంబున నార్చి బాహుల
త్యగణిత లీలనూఁచి వలయంబుగ వాలముఁద్రిప్పి వేగునన్
నగము నగమ్ము గ్రుంగఁ, గపినాథుడు నింగికిదాఁటె టివ్వనన్"
సుంద, 19

రావణుడు అశోకవనంలో సీతను చూడబోయి చేసిన సంభాషణలో రామాయణంలో లేని ఒక ఉక్తి చాతుర్యం తెచ్చి—

'అలకేశ్వరుండు పాయనముగా, నిచ్చిన
అంచిత చీని చీనాంబరములు'

సుంద 46

'ఎవ్వాని వీటికి నేడు వారాసులు
వెట్టని కోటలై పెచ్చుపెరుగు' సుంద 47.

అనే సీస పద్యాలు వ్రాయడం ఆమె ఊహా బలానికి నిదర్శనం చిత్రమేమంటే రెండవ పద్యంలో తిక్కనగారి 'ఎవ్వాని వాకిట' అనే పద్యం ఎత్తుగడ జ్ఞాపకం వచ్చి ఈమెకు తిక్కన రచనమీద ఉండే అభిమానాన్ని రుజువు చేస్తుంది ఇక్కడే కాకుండా వానర రాక్షస యుద్ధవర్ణనలో, రామరావణ యుద్ధ సందర్భంలో, తిక్కన మెలకువ, పరిశీలనం కనిపిస్తాయి

సంభాషణలు నడిపించడంలో మొల్ల నేర్పు సీతా హనుమంతుల హను మద్రావణుల, ప్రసంగాలలో నిపిస్తుంది

ఆమె రస నిర్వహణ నైపుణ్యాం రాముని విరహ వర్ణనలో సీత దీన మూర్తిలో విప్రలంభ కరుణ నిర్భరంగాను - వానరుల మధువన విహారంలో హాస్య కమనీయంగాను, విశ్వామిత్ర, లక్ష్మణ, హనుమద్వాక్యాలలో రౌద్ర విస్ఫోరకంగాను, యుద్ధరంగ ప్రసక్తిలో వీరరసబంధురంగాను, మన మనస్సు లను ఆకట్టుకుంటుంది

ఆమె తెచ్చిన కొన్ని శృంగార ప్రసక్తులు లజ్జాసుకుమారమైన కుల వధూస్థాయికి తగినట్టులేవు

అయోధ్యానగరంలోని వేశ్యావర్ణనం అంధకార సందర్భంలోని అభిసారికా దృశ్యాలు, కొంత వెగటనిపిస్తాయి అయితే ఆనాటి సాంఘికాభిరుచిని ఆమె కూడా ఉల్లంఘించలేకపోయిందేమో అని తోస్తుంది

మొల్ల "కావ్యసంపద క్రమము లేనియు నెఱుంగ, అని వినయం కోసం చెప్పినా ఆమె సంస్కృతాంధ్ర పరిజ్ఞానం తక్కువదికాదు ఆమె నిర్వహించిన విరోధాభాసలలోని అర్థాంతర ఘటన, అక్కడక్కడ వాడిన సంస్కృత దీర్ఘ సమాసాలూ, ఆమె భాషా ప్రవేశానికి తార్కాణ

ఎంత భాషా పరిజ్ఞాతలకైనా గారావేగంలో భావోద్వేగంలో కొన్ని చ్యుల సంస్కృతులు దొరకడం సహజం ఆ విధంగా ఈమె కవితలోను కొన్ని కొన్ని స్వతంత్ర ప్రయోగాలు కనపడతాయి

'తెల్సి' (ఇకార లోపం) చాపల శుభనేత్రా, 'కోదండ పాండిత్యులై' వంటి బహు వ్రీహులు) శాంతము (ధర్మివాచక ముండవలసినచోట) ఇట్టివి క్వాచిత్కంగా పూర్వకవుల రచనలోను కనిపిస్తాయి

సుమారు 5 శతాబ్దాల క్రిందట పలువురు ... విజృంభించి రచనలు చేసే రోజుల్లో తనకు తానుగా నిలబడి ముక్తకంఠంగా తన రచనా లక్ష్యం ఇదీ అని చెప్పి ఏ కృతిపతుల ప్రాపునూ కోరక తాను నమ్మిన శ్రీరామ చంద్రుని పాదపీఠంమీద తన కావ్యకుసుమాన్ని అర్పించిన తొలి తెలుగు కవయిత్రి మొల్ల అని సగర్వంగా చెప్పుకోవచ్చు

అచ్చ తెలుగులయన్న - తెలగన్న

ఒక కొత్త ప్రక్రియ చేపట్టి సాటి కవులలో తలపై కెత్త జూడడం కవుల కొక సహజ కాంక్ష అచ్చతెలుగులో అంతవరకు కావ్యం పూర్తిగా వ్రాసిన వారు లేరు పూర్వకావ్యాల్లో ఎక్కడైనా చమత్కారానికి ఒకటి రెండు అచ్చతెనుగు పద్యాలు వ్రాసిన వారుండవచ్చు అయితే కావ్యమంతా ఆ తెలుగులోనే వ్రాస్తే ఎట్లా ఉంటుంది ? అనే కుతూహలం ఈ 16 శతాబ్దం చివరలోనే కలిగింది

ఆ కవి పొన్నిగంటి తెలగన్న—

కావ్యం యయాతి చరిత్ర—

ఈ కావ్య రచనల్లో రెండు విశేషాలున్నాయి ఒకటి ఎవరూ వ్రాయని కేవలం తెలుగుతోనే, గ్రంథమంతా నిర్వహించడం

రెండు అంతవరకు హిందూ ప్రభువుల ఆశ్రయంలోనే పెరిగి పెద్దదైన ఆంధ్రకవిత ముసల్మాన్ ప్రభువుల ఆదరం సంపాదించడం

గోల్కొండ నవాబులలో మూడవవాడైన మల్కిభరాం వద్ద ఉద్యోగిగా ఉన్న అమీన్‌ఖాన్‌కు ఈ యయాతి చరిత్ర అంకితమయింది

కాబట్టి ఈ గ్రంథం 1570-80 ప్రాంతంలో పుట్టినట్టు ఊహించవచ్చు ఇది ఒక చిత్రం మహమ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలు అర్థంచేసుకోదగినంత జ్ఞానం ఉన్నదా? లేక కృతిపతిత్వం ఒక రాజ లాంఛనంగా ఏర్పడిందా? ఇందులో ఏ ఒకటైనా ఈ కృతిపతిత్వానికి కారణం అయి యుండవచ్చు రెండూ అయితే మెచ్చదగినదే—

అమీన్‌ఖాన్ కోరికపై మరింగంటి అప్పన్నగారు

"పిలిచి పొన్నిగంటి తెలగన్న! నీ చేయు
నచ్చ తెనుఁగుఁబ్బు మన్ని యెడల
మించి వెలయఁగా నమీనుఖానున కిచ్చి
పుడమిలోన సిరుల బొగడుఁ గనుము" ౧-10

అని తెలుగన్నను ప్రోత్సహించారు

రెండర్థాల శ్లేషకావ్యం రచించడం ఆదిలో ఎంత గొప్ప అనుకున్నారో, అట్లాగే ఈ శుద్ధాంధ్రగ్రంథం కూడా అంత ప్రజ్ఞావిలసితం అని ఆ తొలిరోజుల్లో వారు భావించి ఉండవచ్చు కాని ఆ రెండూ కూడా ఆంధ్రసాహిత్యానికి గుదిబండలుగా తయారైనాయి

కవిత్వానికి ప్రాణభూతాలైన రసరామణీయకాలు పక్కకొదిగి - రెండర్థాల నిర్వహణం దానికీ, పట్టుబట్టి తెచ్చిన అచ్చతెనుగు దీనికీ, ఊపిరి సలపకుండా చేశాయి.

అయినా - అప్పన్నగారు అచ్చతెనుగు మెచ్చుకోలును మానకుండా ఇంకా ఇట్లా అన్నారు

"అచ్చతెనుంగు పద్యమొకటైనను గ[illegible]ము [illegible] నుండినన్
హెచ్చని యాడుచుందు రది యెన్నుచు, నేర్పనఁబొత్తమెల్లని
ట్లచ్చ తెనుంగు నన్నొడువ నంపుల చందమెఱుంగువారు నిన్
మెచ్చరొ ? యబ్బురంబనరొ ? మేలనరో ? కొనియాడరో నినున్"

ఈ మెచ్చిన నాలుగు రకాలవారూ ఇది యెంతగొప్ప ఫీటో (feat) అని కొత్త ఒక వింతగా కొనియాడి ఉంటారు

భారతంలో ఆదిపర్వం తృతీయాశ్వాసంలో 129 పద్యాలలో ఈ యయాతి చరిత్ర చక్కని ఉపాఖ్యానంగా రూపొందింది ఆ కథను తీసుకుని తెలగన్న ఈ యయాతి చరిత్రను అయిదాశ్వాసాల అచ్చతెనుగు ప్రబంధంగా విరచించాడు

ఈ కథ ఇంతగా పెరగడానికి కారణం, అసలు కథలో లేని ప్రబంధం లక్షణాలన్నీ గుప్పించడానికిచేసిన కథలో మార్పులు వర్ణనలు అతిశయించడం-

ఇంత పెంచినా ఇందులో భారతంలోని యయాతి సమగ్ర కథలేదు యయాతి అడవిలో దేవయానిని నూతిలోనుండి ఉద్ధరించడం, తర్వాత వివాహం, అతడు శర్మిష్ఠవల్ల కూడా సంతానవంతుడు కావడం, ఆ బిడ్డలతో కూడా ఆయన సుఖంగా రాజ్యపాలన చేయడం, అంతే, కథ, సమాప్తం

యయాతికి శర్మిష్ఠయందు కలిగిన మూడవ కుమారుడు పూరుడు అన్నలు నలుగురూ (దేవయాని కొడుకులిద్దరు, తన సోదరు లిద్దరు) తండ్రి ముదిమిని స్వీకరించడానికి నిరాకరిస్తే - పితృభక్తి పరుడు పూరుడు సంతోషంగా తన యౌవనం తండ్రికిచ్చి ఆతని ముదిమిని పరిగ్రహించిన త్యాగశీలి ! కనుకనే తర్వాత వంశానికి పౌరవంశం అన్న పేరు వచ్చింది పిదప యయాతి స్వర్లోక గమనం వంటి 'సంఘటనలు చాలా జరిగాయి వాటిలో యయాతి వృత్త వైవిధ్యం ఎంతైనా కనపడుతుంది అట్టి సంపూర్ణత లేకపోవడంవల్ల యయాతి చరిత్ర తుంచినట్లు అయింది

అప్పటికే ప్రబంధ రచనకు ఒక మూస తయారయి ఉంది దానిలో పోసి ఒక అచ్చుకట్టు దించితేగాని ప్రబంధంకాదు వ్రాసే శక్తి ఉన్నా ఉపజ్ఞ, ప్రతిభ లేని కవులకు ఆ మూసే శరణ్యం ఆ అచ్చుకు మీరితే అది కావ్యమే కాదంటారని భయం అందుకోసం అవసరమైన, సందర్భ శుద్ధిలేని సంఘటనలతో యయాతి కథను నింపవలసి వచ్చింది

సూటిగా నన్నయగారు తీర్చిన కథనే స్వీకరిస్తే, పరిపూర్ణ కథ రావడమూ, అచ్చపు యయాతి కథ కావడమూ జరిగి ఉండేది ఆ అవకాశం లోనే స్వకవితా నైపుణ్యం చూపే వీలు ఉండనే ఉంటుంది గదా !

ఇందులో యయాతి కథ అతని వేటతో మొదలవుతుంది అతడు ఒక లేడిని తరుముతూ జాబాలి ఆశ్రమంలోకి వెడతాడు లేడిని వెన్నంటి రావడం మంచిదికాదని జాబాలి రామాయణకథ అంతా (ఉత్తర కాండతో కూడా) చెబుతాడు అంతా ఎరిగినదే కనక క్లుప్తంగా చెప్తానన్నాడు అందరెరిగిన కథ యయాతికి ఎలా తెలియకుండా పోయిందో మనకు తెలియదు తర్వాత దేవయాని, కచ, శర్మిష్ఠాది కథలు మామూలే విశేషం దేవయాని ఆటపాటలు కచుని చనవు, మామూలే వృషపర్వనగరంలో యయాతి పెండ్లి ముచ్చటలు, తల్లి కుమార్తెకు బుద్ధులుచెప్పి పంపడం, యయాతి నగరంలో కొత్త దంపతుల శృంగార కేళులు అటు తర్వాత రాజు శర్మిష్ఠాదర్శన విరహాదులు - శర్మిష్ఠా సంగమం సంతాన ప్రాప్తి

ఈ హద్దుల మధ్యగా ఉద్యానవిహారం, జలక్రీడలు, సూర్యోదయ అస్తమయాలు, చంద్రోదయం వెన్నెల చీకటి మన్మథాది ఉపాలంభాలు, సాంగోపాంగంగా కొనసాగుతాయి

అచ్చతెలుగు కావ్యమైనా బిరుదులు, నామవాచకాలు, సంస్కృతం లోనే ఉంచడం పాఠకుల సౌకర్యానికి ఉపయోగించింది తెలగన్న ఎంతో అవసరమైతేగాని మారుమూల తెలుగు నుడులు వాడలేదు గ్రంథమంతా ప్రసన్న మైన శైలిలోనే నడిచింది

ఒక్కొక్కచోట ఏమీ పట్టుపట్టకుండా పద్యం సహజమైన నుడికారంతో పరుగులు తీస్తుంది చాలాచోట్ల ఇంపైన తెలుగే కనబడుతుంది

కవితలో పూర్వకవుల భావాలను శిల్ప విశేషాలను గ్రహించినా వాటికి తెనిగింపు చేకూర్చాడని చెప్పవచ్చు

ఎరుకలు వచ్చి అడవిలో మృగాల బెడదను వర్ణించిన తీరు బాగుంది—

"కొండ మల్లయ్యచే నుండు నందురుగాని
జింకను గానమే వంకనైన

ఒకటి యా జమునకు నున్నదందురుగాని
కాఱెను పోతును గానమెచట
అలకంబమయ్యె తానైన దేమోగాని
సింగమొక్కటియైన సెలలలేదు
గాలి దేవరకును గలదటందురుగాని
యిట్టినొక్కటిఁజూచి యెఱుఁగమెందు

హాళినేఁటేట మీరు వేటాడు కతన
నిప్పుడేడాదిగోల్ సామి యేఁగుదేమి
నేల యీనిన తెఱగున నోలినెపుడు
గడమి నెడయాక తిరుగు మెకంబులడవి" ౧-106

ఇందులో కంబయ్య సెలల అన్న మాటలగూర్చి ఇంచుక ఆలోచించాలి గాని తక్కిన పద్యమంతా తెనుగు కండబలంతో నడిచింది. రాజు పూర్వం వేటచేస్తే మెకాలు కనబడలేదని చెప్పడానికి వారు చేసిన ఊహాలు రమణీయంగా ఉన్నాయి. కాని ఈ వేఁటమీద మనుచరిత్ర ప్రభావం చాలా ఉంది.

ఆ వేటలో కనపడే వేటసామగ్రి, వేట పిట్టలు జాగిలాలు, ఎరుక పల్లెలోని సుగంధ వస్తువుల కుప్పతెప్పలు, వాటి విలువ ఎరగనివారి అమాయకత్వం కవి సహజంగా వర్ణించాడు. (౧-110-119)

రాజును చూచిన ఎరుకలు ఆతని వేషాన్ని తమ పరిభాషలతో చెప్పడం పిల్లలమట్టి జైమినికి అనుకరణం అయినా చదవడానికి ఇంపుగాఉంది. ౧-120

జాబాలి 'తలిసి తోట' అభిజ్ఞాన శాకుంతల భారతాదుల అనుస్మృతి అయినా ఆ పలుకు పొందిక నిలిపి చదివిస్తుంది.

పుట్టలు బలిసిన జాబాలి వర్ణనంకూడా ఇతని ఊహాశాలితకు నిదర్శనం అని చెప్పవచ్చు. ౨ 51

నన్నయగారి 'వాడి మయూఖములకు' ఈ పద్యం ప్రతిబింబం.

అకట ప్రొద్దువోయె నావులు నేతెంచెఁ
గచుఁడు రాఁడిదేమి కతమొ నేడు?
చిలువగములు రక్కసులు గొట్టు మిట్టాడు
నడవిలోన నేమియయ్యె నొక్కొ" ౩ 121

'మతిలోకోత్తరుఁడైన' అని నన్నయగారు పద్యం వ్రాస్తే ఆయన అడుగు జాడలలో—

"గోనముల ప్రోకయుంగిరసుకూనిమిమన్నదు వేల్పుటొజ్జపే
ర్మిని గనుగొన్న బిడ్డ మఱిమీకను జట్టు, కడింది రూపునే
ర్పును గడు నేమముంగలుగు ప్రోడవితా తొలు వేల్పు మూఁకచేఁ
జనినఁగచుం దలంపమది జాలిగరంగదె యెట్టి వారికిన్" ౩–132

అని వ్రాసి తృప్తిపడినాడు

చకోరాల వెన్నెల విందులను పలువురు పూర్వకవులు పలువిధాల చమత్కరించారు పారిజాతంలో తిమ్మన 'విరహులమై సోకి' అనే పద్యం సుప్రసిద్ధం దానిని మరింత పరిపాకంలోకి దించి తెలగన్న —

''అనుకు వెన్నలదాల్చి తునిచి సేవెలుచేసి
వెన్నెలపాలను జున్నొనర్చి'' అనే పద్యం వ్రాశాడు

తెలుగు కవులనేకాక సంస్కృతంలో ప్రసిద్ధమైన

'మహారాజ ? శ్రీమన్, బగతి యశసాతే ధవళితే' అనే శ్లోకానికి —

'వేల్పురాయడు గన వెలిమావు తెలిగౌరు
నీఁగి మూఁకుల గాప కెదఁ గలంగి' అనే సీసం విస్తరించి వ్రాశాడు

ఇట్లా కేవలం తన ఉపజ్ఞమీదనే ఆధారపడకుండా తన బహుగ్రంథ పరిశ్రమను సొమ్ము చేసుకొని తెలగన్న మొదటి అచ్చతెనుగు గ్రంథాన్ని వెలయించి వెక్కిన వారికి మార్గదర్శి అయినాడు

రుద్రయ్య రుచిరార్థాలు

రుద్రయ్య పేరు తలపెట్టగానే '' ఎటితేరా ! దనుజమర్దన యెందుకూరి జనార్దనా'' అనే మత్తకోకిల కూజితం చటుక్కున మనస్సులో మారోగుతుంది ఇంత ఒడుపుగా ఒయ్యారంగా తెలుగులో ఇంక ఏ కవీ అష్టకం వ్రాయలేదు ఒకవేళ ఏ మారుమూల కవో వ్రాసినా అది రాణించలేదు

కందుకూరులో జనార్దనాలయం సామాన్యంగానే ఉంది, పెద్ద వైభవోపేతంకాదు, కాని – ఆ అష్టకం చదివిన తర్వాత ఆ ఆలయ ప్రాంగణంలో అడుగు పెట్టాలని ఉంటుంది ప్రాంగణంలో అడుగుపెట్టి మండపంలోకి వెళ్ళుతూ ఉంటే, ఏ మూలనుంచో రుద్రయ్య కంఠం వినపడుతూన్నట్టే ఉంటుంది

ఆ అష్టకంలోని శృంగార నాయిక మాటలకు అంతవగరూ పొగరూ కల్పించి దానికి అమరత్వం చేకూర్చాడు కవి

నాయికకు నాయకుని మీద ఉండే చనవూ అచ్చతెనుగు నుడికారపు సొంపూ భాషలోని కాకువూచూస్తే, రుద్రకవి యౌవన వేళలలోని రసికతాముద్ర అందులో ప్రత్యక్షమవుతుంది అయితే ఆ రచన ఆయన ప్రాథమిక కృతిగా అనిపించదు ఆ తెనుగు "ష " అందమూ, వాడుకలోని మాటకారి తనం —కవి మనసు పండిన తర్వాతనే ఊడిపడ్డట్టు గనిపిస్తాయి

ఒక పద్యంలో ధృష్ట నాయకుడు కనిపిస్తే రెండవదానిలో ఖండిత నాయిక దర్శనమిస్తుంది

"దబ్బులన్నియు దెలిసికొంటిని తప్పు బాసలు సేయకూ
మబ్బు దేఱెడి కన్నుగవతో మాటిమాటికి డాయకూ
ఉబ్బు చేసుక తత్తఱంబున నొడలిపై చెయివేయకూ
గబ్బితనమున దనుజమర్దన ! కందుకూరి జనార్దనా ! (3)

బిత్తరంబున మొలక కెంపులు పెదవి నెవ్వతె ఉంచెరా ?
గుత్తమైన మిటారి గుబ్బల గుమ్మ యెవ్వతె మెచ్చెరా ?
చిత్తగించక జీరువారను చెక్కిలెవ్వతె నొక్కెరా ?
కత్తిగోరుల దనుజమర్దన ! కందుకూరి జనార్దనా ? (4)

తుదకు అనుకూల నాయకుడు ఇలా కనిపిస్తాడు !

అలుకలన్నియు దీఱ నివు నా యండకెప్పుడు వస్తివీ
పిలిచి నవరత్నాల సొమ్ములు ప్రేమతో నెపుడిస్తివీ
వలచి వలపించియును గూరిమి వదలకెప్పుడు మెస్తివీ
కలసి వేడుక, దనుజమర్దన, కందుకూరి జనార్దనా ! (7)

ఇవి తరళ మత్తకోకిలలను పోలిన దేశీయ రచనలు కాని కేవలం అవే కావు

రచన అసలు గ్రాంధికంలోనే బయలుదేరినా అందులో తలవని తలంపుగా ప్రవేశించిన 'నివు' 'వస్తివి' 'మెస్తివి' అనే మాటలు ఆ తీవెబోణి మాటల్లో మెరసి తియ్యగానే కనిపిస్తాయిగాని వెగటనిపించవు

అచ్చపు తెలుగు నుడికారానికి ఎంత బలముందీ ! అనిపిస్తుంది

కందుకూరి రుద్రయ్యకు దేశికవిల మీది తియ్యదనం మనసుకు పట్టింది ఆ అభిమానంతోనే అతడు 'సుగ్రీవ విజయం' అనే యక్షగానం వ్రాశాడు ఈ రచనా ప్రక్రియలో ఇదే మొదటిదని అభిజ్ఞుల అభిప్రాయం ఇందులోని పాటలు, ఏలలు, ద్విపదలు మొదలైన లక్షణాలవల్ల ఇది ఒక గేయ ప్రధానమైన రచనగాని మార్గకవిత్వపు కోవలోకిరాదు దీనిని నృత్యానికి కూడా ఒదిగించి ప్రజాదరణను పొందే అవకాశం ఉంది

16 వ శతాబ్ది చివరిదశలోని కవులు, ముందు బాహాటంగా ఏర్పడి, బాటలు తీసిన మార్గకవితా మార్గాలను తిరస్కరించకపోయినా ఎవరికి తోచిన కొత్తపుంతను వారు తొక్కి తాము సమానుల్లో మెరగాలని చూచారు అందులో రుద్రయ్య ముఖ్యుడు శరీరమంతా మార్గకవితామయం అయినా, హృదయం మాత్రం అచ్చితెనుగు పలుకుబడికే జన్నియపట్టిన తిక్కనార్యుని వలె వృత్తం మార్గసంబంధి అయినా హృదయం అంతా తెనుగు జాతీయంతో నింపిన రుద్రయ్య 'జనార్దనాష్టకం' దేశించసగానే భాసిస్తుంది సుగ్రీవవిజయం లోని దేశీయ భావనకూడా ఈ సత్యాన్నే రుజువు చేస్తుంది

రుద్రయ్య రచనలు మూడు ప్రసిద్ధమైనవి 1 నిరంకుశోపాఖ్యానం 2 సుగ్రీవ విజయం 3 జనార్దనాష్టకం మూడూ మూడు వరగతులకు చెందినవి

నిరంకశోపాఖ్యానం ప్రబంధశ్రేణికి చెందితే సుగ్రీవ విజయం యక్షగానం అనే గేయకావ్యం ఇందులో ప్రతిపాద్యకథ రామాయణంలోని కిష్కింధాకాండకు చెందినది జనార్దనాష్టకం, ఇష్టదైవమైన కొందుకూరి జనార్దనస్వామి మీద చెప్పిన శృంగార రచన

అతడు సహజంగా శైవుడైనా, స్వగ్రామంలోని సోమేశ్వ , జనార్దన దేవులను ఇద్దరినీ ఆత్మీయంగా స్తుతించిన అద్వైతి నిరంకుశోపాఖ్యానం సోమేశ్వరునకు అంకితంచేస్తే సుగ్రీవ విజయ అష్టకాలను, జనార్దనస్వామికి సమర్పించాడు

కందుకూరి వంశంలో ముగ్గురు రుద్రయ్యలున్నారని ప్రతీతి అందులో నిరంకుశోపాఖ్యాన రచననుబట్టి ఈ రుద్రయ్య రెండవవాడని తోస్తుంది ఎందుచేతనంటే - ప్రశస్త ప్రబంధ రచనలన్నీ నడచిన తర్వాత ఈ కావ్యం పుట్టిన జాడలు కనిపిస్తాయి కథను ఎంచుకోవడం దగ్గరనుంచి భావానుసరణం వరకూ పాండురంగ కావ్యం దీనికి మేలుబంతి అయింది అంతేకాక తిక్కన శ్రీనాధ, పెద్దన రామరాజ భూషణుల ఛాయలు అక్కడక్కడ బలంగా గోచరిస్తాయి అతడు కావ్యంలో వాడిన పాదుసాహి, రుమాలు, తురుఫీలు మొదలైన మాటలు మహమ్మదీయ ప్రాబల్యం తెలుగునాట బాగా నాటుకొన్న తర్వాత అప్రయత్నంగా దొరలిన వాడుకమాట లనిపిస్తాయి

1575 ప్రాంతంలో గోల్కొండ రాజ్యాధినేత అయిన ఇబ్రహీం కుతుబ్‌షా (మల్కిభరామ్) చేత మడిమాన్యాలందిన రెండవ రుద్రయయే ఈ రచనాప్రయం చేసి ఉంటాడని ఊహించవచ్చు

అప్పటికింకా ప్రబంధరచనమీద మోజు తగ్గలేదు ప్రసిద్ధ ప్రబంధకవుల భావౌన్నత్యం ఉపజ్ఞ తగ్గింది వారి జాడలలోనే ఏదో కొత్త చూపాలనీ వారికి తీసిపోకుండా రచనను తీర్చి దిద్దాలనీ ఒకానొక కాంక్ష వారి రచన తొణుక్కుమంటూ ఉంటుంది

నిరంకుశోపాఖ్యానం నాలుగాశ్వాసాల చిన్న ప్రబంధం అయిదు వందల పద్యాలలోపు గ్రంథం

ఇంచుమించుగా పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మ కథకు ప్రతిబింబం నిగమశర్మనామం నేతిబీర అయినట్టే - వేదవిద్యా నిరంకుశు డౌతాడనుకొన్నవాడు (నిగమ) అత్తుల్యుడే అయినాడు

కథ, నిగమశర్మగాథలాగు ముగియక కొనలుసాగి మలుపులు తిరిగి నుగుస్తుంది

పతితుడు అయిన నిగమశర్మ హఠాత్తుగా నృసింహ క్షేత్రంలో ముక్తు డవడం అసహజం అనిపించి గాబోలు, కవి, నిరంకశునికి శివదర్శనమైనా - ముక్తుణ్ణి చెయ్యక తృతీయ పురుషార్థంలోనే ఓలలాడించి తుదకు ఇంద్రానుగ్రహం వల్ల - రంభ అనుమతిమీద - స్వర్గ ప్రాప్తి చేశాడు అతను తన అంగనయందు సుతనయులను గాంచి వృషవాహన పదధ్యానాసక్తి పరిప్రాప్తి విద్యాపాటవంబున ఏకవాక్య ప్రతిష్ఠాపనాచార్యుండును ద్విజవంశపావనుండును, త్రివర్గ నిరతుండును, చతుర్వేద పారాయణుండును పంచశరాకారుండును షట్‌శాస్త్రపారీణుండును సప్తాశ్వతేజుండును, అష్టభోగ భాగ్యుండును నవనిధాన సంపన్నుండును, దశదిశాపూర కీర్తి మండలుండును (అంకక్రమం తప్పకుండా) అయినాడు ఈ అంక చమత్కారం కేయూరబాహు చరిత్రలోని ఒక పద్యాన్ని జ్ఞాపకం చేస్తుంది

నిగమునివలెనే ఇతడు కూడ సద్బ్రాహ్మణ కులంలోపుట్టి దారి తప్పి వేశ్యాలోలుడై, ఇంటిలోని 'నల్లపూస' ఆదిగా సమస్తం ఊడ్చి పెట్టుకుపోయి చంపకగంధి అనే వేశ్యాపరం చేశాడు 'లంజతల్లి' చేత ఈసడింపులు తిని అరణ్యం పాలయినాడు

నిగముడు ఇల్లు విడిచి, దొంగలకు చిక్కి చావుతప్పి, కాని పనులు చేయగలిగినన్నీ చేసి, తుట్టతుదకు నృసింహక్షేత్రంలో ప్రాణాలు విడిచి ముక్తుడైనాడు

ఎంత పతితుడైనా నృసింహక్షేత్రంలో తనువు విడిచినవాడు భగవదనుగ్రహానికి పాత్రుడౌతాడని దీని సందేశం

ఈ కథను శివుడు నారదునకు పాండురంగక్షేత్ర మహిమలో భాగంగా చెప్పాడు

నిరంకుశ కథను ధర్మశీలుడనే రాజుకు పులహుడనే ముని చెప్పాడు 'వ్యసనాలన్నింటిలోను స్త్రీలోలత్వం దుష్టం అంటారు అందులో పడ్డవాడు బాగుపడ్డ వాడున్నాడా? అని రాజు ప్రశ్నిస్తే పులహుడు 'కోరికలు మనసులో దాచుకుని మాటల్లో వెల్లడించనంత మాత్రంచేత గొప్ప వేషాలు వేసినంత మాత్రాన ఎవడూ పరిశుద్ధుడు కాలేడు

ఈ జన్మలో ఎంత దురాచారుడైనా పూర్వజన్మ సుకృతంచేత పరమేశ్వర కృపచేత, ఒకడు కృతార్థుడు కావచ్చు, అని పుంహుడు నిరంకుశుని కథ చెప్తాడు

అయితే కామాన్ని అణచి ఎంత పారమార్థిక పరుడైనా అతడు కృతకృత్యుడు కాలేడు మోహానుభవం పూర్తి అయిన తర్వాత పూర్వ సుకృతంవల్ల సద్గతి పొందుతాడు - అని ఈని సందేశం కావచ్చు కాని నేయి తాగినకొద్దీ దాహం పెరుగుతుందిగాని తరగదు నీళ్ళుతాగితే దాహం ఉపశమిస్తుంది కనుక కామాన్ని అదుపులో ఉంచి విషయ వైముఖ్యం అభ్యసించి ఉత్తమగతి పొందడం ఉచితం అని తత్త్వజ్ఞుల నిగమనం పుంహుని ప్రబోధం నిరంకుశుని కథ పెంచడానికి ఉపయోగించింది కాని తత్త్వార్థ కథనానికి అట్టే ఉపకరించదు నిగముని కథలోని ఔచిత్యాన్ని పరిహరించ బోయిన నిరంకుశకథ మరింత కృతక సంఘటనతో చప్పగా ముగిసింది

నిరంకుశునిలో ఒక విశేషం ఉంది అతడు తనకుతానే హాని చేసుకున్నాడు గాని ఎవరికీ ద్రోహం చెయ్యలేదు తన సమయస్ఫూర్తివల్ల గడుసుతనంవల్ల నెగ్గుకువచ్చి రంభశాపం వదల్చి రాజుయొక్క బ్రహ్మరాక్షస బాధను తీర్చి, సద్గృహస్థుగా మారినాడు అయితే - శివునితో జూదం, అందులో 'లంజ పందెం' రంభా ప్రాప్తి ఆమె స్వర్గం వదలి ఇక్కడ్డే ఇంటి పెట్టుకు ఉండడం - ఇంద్రశాపంవల్ల నూరుతాళ్ళ పొడుగైన శిలగా మారడం - దాన్ని ప్రజలు పడగొట్టడం - మొదలైన అతిలోక కల్పనలు ఈ కథను మరింత కృతకం చేశాయి

ఇక కవిత్వం దగ్గరకువస్తే - ఎవ్వరికీ తీసిపోనంత ప్రౌఢంగా పద్యం వ్రాయగలడు అయితే భావనాశక్తి కొంవడినకొద్దీ భాషాశక్తిని పెంచాడు

ఈ పద్యంలో పేనిన భావనా వైయంచిన్నా భాషాబంధమే ఎక్కువ విజృంభించి కనపడుతుంది

"మాణి క్యక్రియమాణ సాధపుల మా మాయాసక్తర్తుకా
మైణాక్షీ సహాభీతి సంభ్రమ భవ్యాలోకమా నాభ్రగా
క్షీణానర్గళహార భారి దళిత స్ఫీతాంధకార ప్రియా
మాణూభూత సితాన్యపక్ష తలికం బా పట్టణం బల్పమే ?"

దలచుకుంటే ఇతడు మెత్తగా కూడా వ్రాయగలడు

"పలికి సానిధ్యైై యనిమిషేంద్రు నిభాస్యుల కాదరంబుతో
వాలిక చూపులం బనులవైపులదెల్పు, సమస్త దేవతా
పాలిక, జంద్రజూట కులపాలిక రాజ దురోజ పాళి o
గాళిక బాదసేవక శిఖావళకాళిక బ్రస్తుతించెదన్" ౧-౯

ఈతనికి ప్రత్యక్షమై కృతివేడిన శివమూర్తిలో తిక్కన హరిహరదేవుని ఛాయలున్నాయి కాని ఇతడు కేవల శివమూర్తియే అయితే ఆ విలాసిరూపం ఎట్లా? అంటే - శ్రీనాథుని భీమఖండ విలాసరూపం జ్ఞాపకం తెచ్చుకోవాలి అప్పుడు సమన్వయం దొరుకుతుంది

శార్దూల చర్మమో జాళువా చేలమో
కాని, నిద్దపుమేనం బట్టినాడు
కమనీయ భస్మమో గంధచూర్ణమొ గాని
వాల్ వెదిజల్లం బూసినాడు

ఇట్టి సొగసులతో పద్యమంతా సాగుతుంది ఈ కవిమీద పాండురంగ కవితా ప్రభావం ఎంతగా ఉన్నదో ఈ పద్యంలో చూడవచ్చు

"నందను నిన్ను గనుంగొను
నందను కను నెదురుసూచు నకట! సముద్రం
బిందునకుం బోలె జనకుం
డిందునకా? నీ మహాత్మ్వ మేమని చెప్పన్" ౨-౩౭

ఇది తల్లి నిరంకుశుని మందలించిన ఘట్టంలోది సరిగా నిగముని అక్క 'మీ బావయున్ నీరాకల్ మదిగోరు చంద్రుపొడుపున్ నీరాకరంబుం బలెన్' అన్న మాటలు మనస్సుకు తగులుతాయి అంతేకాదు అందులో రాకను రెండు విధాలుగా విరవడం దగ్గరనుంచీ ఇతనికి పాండురంగకవి మీద ఎంత ఆరాధనో తెలుపుతుంది

'నందన' శబ్దాన్ని విరిచి, 'ఇందు' శబ్దాన్ని మలచి అతనికి దగ్గర కావాలని ఆశించాడు

'లేరా? భోగపరాయణుల్' వంటి పద్యాల దగ్గరనుంచీ తదనుకరణం కనపడుతుంది

ఇందులో రంభ రాతి పొడినుంచి వెడలివచ్చిన రూపం (4-91), పాండురంగని పుంవర్ణనంలోని వేశ్యావర్ణనం తాలూకు 'మొలక చీకటి జలజల రాల్పగారాదె' అనే పద్యానికి ఇంకో అవతారం

'సరసీరుహా నవీన తర సీధు రసపాన
భసల సుందరగాన భాసమాన!' (౪-5)

అనే సీసం వసుచరిత్ర మూసలోది

ఇతని వేశ్యామాత వర్ణనం, ధూర్త విటుల ఇక్కట్టులు, నిరంకుశుని అరణ్య దర్శనం శివునితో జూదమాట తప్పక చదవదగ్గవి వేశ్యాసంసర్గ భ్రష్టతను మనస్సుకు హత్తేలా చిత్రించాడు

'పలిక్ని', 'కవిత్ర', దముక్ 'తార్క్ష్యవ్య', వంటి సంస్కృతం వాడడం ఇతనికి చాల సరదా

నిరంకుశంలోని (3 ఆ 26) తరళ జనార్దనాష్టకానికి పాథేయంగా పనిచేసింది

'చక్కగాదు లోటిపిట తూల, రోకండ్లగాని' వంటి తెనుగు జాతియాలు, 'మనసశ్శునాం ఘృత మరోచిక మ్' వంటి సంస్కృత సూక్తులను హేలగా వాడగలవాడు

మొత్తంమీద విడవకుండా ఒకసారి చదివితీరదగ్గది రుద్రయ్య కవిత

రఘునాథ నాయకుని కవితా విహారం

విజయనగర వైభవ పతనానంతరం మళ్లా పురుషకారంతో పూర్వ సమున్నతిని కొంతవరకైనా నిలిపిన ఖ్యాతి తంజావూరి నాయక రాజులది

అందులో చెప్పదగిన ముఖ్యుడు రఘునాథ నాయకుడు. ఇతడు తల ఎత్తిన వైరివీరులను అణచినాయక రాజ్యాన్ని సుస్థిరంచేసి, రాయలవలెనే కావ్య కళారంగాలను ఔన్నత్య సీమలకు ఎత్తజూచినవాడు కొందరు అభిమానులు ఇతణ్ణి కృష్ణరాయల అవతారమే అంటారు ఇతని గరిమ చూడవలెనంటె - విజయవిలాస కావ్యపీఠిక కంటె వేరొక అద్దం ఉండదు

రఘునాథుడు గొప్ప విద్యా పోషకుడేకాక ఉగ్గడింప దగిన విద్యావేత్త కూడా

ఈతని మంత్రి పండిత ప్రకాండుడు గోవిందదీక్షితుడు ఆతని కుమారులు యజ్ఞనారాయణ దీక్షితుడూ వేంకటమఖీ, వైష్ణవపండితుడు కుమారతాతాచార్యులూ ఆస్థానిలోని సంస్కృత విద్వాంసులు సంస్కృతంలో నిరర్గళంగా కవిత్వం చెప్పగల నిపుణులు

యజ్ఞనారాయణ దీక్షితుడు రఘునాథుని శిష్యుడంటే ఈతని సంస్కృత పాండిత్య శౌండీర్యం ఎంతటిదో ఊహించవచ్చు

ఇతని ఆస్థానకవిగా ఉండి చేమకూర వెంకటంఎ ఇతనికి ఎంతటి విఖ్యాతి తెచ్చిందీ ఆంధ్రకవితాప్రియులందరికీ తెలిసిన విషయమే కవి చౌడప్ప వంటి వారు కూడా ఆ ఖ్యాతికి తోడ్పడ్డాడు

ఇతని ఆస్థానంలోని ఇంకొక విశేషమేమిటంటే - ఏ రాజ సభలోను లేని స్త్రీ కవయిత్రులుండడం వారికి ఎనలేని ప్రోత్సాహం లభించడం తంజావూరి "లక్ష్మీవిలాసపు" ప్రత్యేకత రామభద్రాంబ సంస్కృతంలో రఘునాథాభ్యుదయమనే 12 సర్గల కావ్యంవ్రాసి ఆయననే కృతినాథుణ్ణి చేసింది మంజువాణి అనే కవయిత్రి రఘునాథుడు వ్రాసిన రామాయణాన్ని సంస్కృతంలోకి పరివర్తించినదని ప్రసిద్ధి రఘునాథుడు సభలో ఒక సంస్కృత సమస్య ఇస్తే ఆశువుగా పూరించగల దిట్ట రామభద్రాంబ

ఈతని సంప్రదాయాన్నే అనుసరించి ఈతని కుమారుడు విజయరాఘవుడు రంగాజమ్మవంటి కవయిత్రులకు కనకాభిషేకం చేసి సత్కరించాడు

ఆమె 'మన్నారుదాస విలాసం' అనే 5 ఆశ్వాసాల ప్రబంధం వ్రాసి విజయరాఘవునకే సమర్పించింది

అంతేకాక దక్షిణాంధ్ర వాఙ్మయంలోని ఆనేక దేశిప్రక్రియలకు చేయి అందించి ఆడించి పాడించిన ప్రతిష్ఠ గూడ వూరికి దక్కింది

రఘునాథుని సంగీతాభిమానం నూత్నదృక్పథాన్ని ప్రదర్శిస్తూ అతని చేత సంగీతసుధ, భరతసుధ, అనే రెండు గ్రంథాలను వ్రాయించింది

ఈ సంగీత గాథ ప్రవేశం ఈతని రామాయణ రచనలో సూచనగాను వాల్మీకి చరిత్ర రంభోర్వశీ వివాద సందర్భంలో అతివేలంగాను కనిపిస్తుంది ,

ఒక చేతితో రాజ్యచక్రం తిప్పుతూనే, రెండవ చేతితో అమోఘమైన కవిత్వం వ్రాసి ఆంధ్ర సాహిత్యాన్ని అలంకరించిన రాజకవులలో రఘునాథుడు మూడవవాడు. తొలివారు నన్నెచోడదేవుడు, శ్రీకృష్ణదేవరాయలు. ఆస్థానంలో ఎదుట ఉద్దండులైన పండితులు, అఖండఖ్యాతినార్జించిన కవులూ ఉన్నప్పుడు ఎంత పాండిత్యం ఉంటే ఎంత కవితా ప్రాగల్భ్యం ఉంటే వారిని మెప్పించడం జరుగుతుంది! రాజుల యెదుట వారివి మెరమెచ్చులే అయితే—తక్కిన రసజ్ఞ లోకంలో తమ ప్రతిష్ఠ ఏమవుతుంది? ఇంత ఆలోచించి ఆ భారం వహించి ఆ రాజకవులు కావ్యరచనకు సిద్ధపడి ఉంటారు.

వారి అదృష్టంవల్ల తెలుగులో ఏ గొప్ప కవికీ తీసిపోని అపూర్వ రచనలు చేశారు. నన్నిచోడుడు ఆనాడే విశిష్టమైన ఆంధ్రప్రబంధ రచనకు త్రోవచూపిస్తే, రాయలు సర్వదైవతం ప్రగాఢ శయ్యలో ఆముక్తను వ్రాసి అద్వితీయుడనిపించుకున్నాడు.

క్రీ.శ. 12, 16 శతాబ్దుల తర్వాత 17వ శతాబ్దిలో ఆంధ్ర కవితా రంగంలో దర్శనమిచ్చిన రాజకవి రఘునాథుడు. ఇతని సంస్కృత రచనల మాట అట్లా ఉంచితే—తెలుగులో 5 రచనలు చేసినట్లు ప్రసిద్ధి. 5 రచనలు పూర్వమే అలభ్యమైతే ప్రస్తుతం లభిస్తున్నవి నాలుగు అని అంటారుగాని అందులో సావిత్రి, నలచరిత్ర అనేవి ప్రయత్న సాధ్యములే అయి ప్రచారంలో కనబడవు. ఇక స్పష్టంగా దొరికేవి రెండు. అవి రఘునాథ రామాయణము, వాల్మీకి చరిత్ర. ఈ రామాయణం కూడా అసమగ్రం. దొరికినంతవరకు మూడు ఆశ్వాసాలు, నాలుగవ ఆశ్వాసంలో 26 పద్యాలు, ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు 1937లో అచ్చువేశారు. తక్కినది ఇంతవరకు దొరికినట్టు లేదు. ఈ గ్రంథంకూడా బాలకాండలో ప్రారంభదశ మాత్రమే. ఈ రచన ఎత్తుగడ చూస్తే కొన్ని వేల పద్యాలతోగాని ముగింపునకు వచ్చినట్టు కనబడదు. అంత గ్రంథం ఎట్లా అదృశ్యమైందో తెలియదు.

ప్రకృతం లభ్యములవుతున్న రెండు రచనలనుబట్టే ఈ రాజకవి కవితాప్రాగల్భ్యాన్ని రచనా పరిపాకాన్ని పరిశీలించవలసి ఉంది.

వీటిలో రచనాప్రౌఢిలో రామాయణం తొలి రచన అని తెలుస్తుంది. కవియే కంఠోక్తిగా "నా కథ తొల్లి యర్థ రచనా రుచిమించగఁ జెప్పి, తట్టి

వాల్మీకి చంద్రముకొ నోడువు మెచ్చుగ నీపుడచ్యు తాత్మజా" (వాల్మీ ౧ ఆ) అన్నాడు

రఘునాథుడు తనకు ముందున్న ఆంధ్ర మహాకవుల కావ్యాలు చదివి ఆకళించుకున్నవాడు విశేషించి ఆవంటి ముందటి రాజకవుల కవితలను మరింత శ్రద్ధగా చదివినట్లు కనిపిస్తాడు సన్నెచోడుని వర్ణనా చాతుర్యాన్ని జానుతెనుగు పొందికను హృద్యగం చేసుకుని అంని మార్గంలో కాకపోయినా లని మార్గంలో దేశి పదబంధాలను యథేచ్ఛగా ప్రయోగించాడు

కృష్ణరాయల స్వప్నవృత్తాంతం, వర్ణనీయ వస్తుగాఢ దర్శనం ప్రౌఢ సంస్కృతాభిమానం సౌశబ్ద్య ప్రవణత, ఆముక్తమాల్యదావలోకనం ద్వారా ఇతనికి ఛాయామాత్రంగా సంక్రమించి లక్షణాలుగా కనిపిస్తాయి గాని—వారిద్దరివలె, ఇతనికి ఒక నవ్యమార్గప్రవర్తకుడనే కీర్తిదక్క లేదు

వారి రచనా వైశాల్యంగాని అనల్ప భావప్రస్తారంగాని ఈ రాజకవికి కుదరలేదు కృష్ణరాయ యుగం తర్వాత ప్రబంధ క్షుణ్ణ దంలోనే కావ్య రచన చేసిన ఒక మంచి కవిగానే ఇతడు మిగిలిపోయాడు అయితే నన్నెచోడుని తమిళ కన్నడ శబ్దప్రయోగ బాహుళ్యంగాని రాయల క్లిష్ట రచనా వైదగ్ధ్యంగాని ఇతడవలంబించక సంస్కృతానురక్తి చూపుతూనే ప్రసన్నమధురమైన రచన చేసి కవితాప్రియుల మెప్పు పొందాడు

ఇతని తర్క, వ్యాకరణ అలంకార శాస్త్రాసక్తి రామాయణంలోని "కణభుగ్గ్రింథా ధ్వనీనుల్" అనే పద్యంవల్ల తెలుస్తుంది అచ్చపు కవిత్వం మీద ఇతనికి స్పష్టమైన అభిప్రాయాలున్నాయి రసబంధురత, ధారాళశైలి, శిల్ప చమత్కృతి, శబ్దమాధుర్యం, లేని తెలుగు కవితను ఇతడు ఆదరించలేదు

రామాయణ ప్రారంభంలో అంటాడు —

"పలుకంగవలె నవరసములు
కులుకం బద్యములు చెవులకున్ హృద్యముగా,
నళుకక యటుగాకున్నన్
బలుకక యుండుటయె మేలు బహుమానముగన్"

రామా ౧ 15

ఈ కవితాభిరుచి వాల్మీకి చరిత్రలో మరింత పరుపమై ఘుమఘుమలాడు తుంది

"చెప్పవలెఁ గప్పురంబులు
కుప్పలుగాఁ బోసినట్లు, కుంకుమ పైపై
గుప్పిన క్రియ, విరిపొట్లము
విప్పినగతి ఘుమ్మనం గవిత్వము సభలన్" వాల్మీకి పుట 4

ఆ మహారాజు భోగలాలిత్యం కవిత్వ నిర్వచనంమీదకు కూడా ప్రాకి మనకూ నోరూరిస్తుంది

ఇతడు అచ్చపు రామభక్తుడు శ్రీరామచంద్రుణ్ణి లాంఛనంగా కా చిత్తశుద్ధితో తన్మయంగా సేవించే సత్యశీలుడు ఇతడు రామాయణాదిని చేసిన సీతాస్తుతి హనుమత్ప్రశంస తన గుండెలో కొలువుచేసి కూర్చున్న రామప్రవృత్తిని పట్టి ఇస్తుంది

"నా పాలి పెన్నిధి నా కులదైవంబు
నను గన్నతండ్రి నన్నను చునేత
నా ముంగిట నటించు కామధుగ్ధేనువు
నా దండనుండు కుందనపుఁ గొండ" రామా ౧ 32

అన్నంత ఆత్మీయంగా వేరొకడు అనలేడు అతడు సహజంగా వైష్ణవాభిమాని పైగా రాముడు కులదైవం ఆ రెండు ప్రోద్బలాలు ఇతనిచేత ఈ రెండు కావ్యాలూ వ్రాయించాయి

బాలకాండలో కొంతవరకు మాత్రమే లభ్యమైన ఈ రామాయణం, రాయలకు శ్రీకాకుళ విష్ణుదేవుడు స్వప్నంలో సాక్షాత్కరించినట్టు రఘు నాథునకు కలలో రామచంద్రుడు చూపట్టి 'మదంకితంబుగా రామాయణము రచింపుము'అని కోరడంతో ప్రారంభమై, కొంతవరకు శ్రీమద్రామాయణాను సారిగానే నడిచింది ప్రథమాశ్వాసం, నారదోపదేశం, బ్రహ్మాగమనం, వాల్మీకి కిరాతక్రౌంచదర్శనం, కవి రామ కావ్యోపక్రమంతో సమాప్తమవుతుంది

ద్వితీయంలో అయోధ్యాపుర వర్ణనం, పురజన వర్ణనం, అనపత్య విచారం, మంత్రుల గోష్ఠి, మునులను పిలిచి అశ్వమేధ సమాలోచనం, సుమంత్రుడు చెప్పిన సనత్కుమార కథనం రోమపాదుని రాజ్యంలో అనా

వృష్టి, వేశ్యలు ఋష్యశృంగుని తేవడం వర్షాగమం శాంతా ఋష్యశృంగుల వివాహం రామాయణానుసారిగానే విస్తరిల్లినవి

మూడవ ఆశ్వాసం, ఋష్యశృంగానయనం వసంతప్రాప్తి, అశ్వమేధ నిర్వర్తనం, పుత్రకామేష్టి, విధాతఆగమనం, దేవతల రావణ బాధానిరూపణం బ్రహ్మను పురస్కరించుకొని దేవతలు విష్ణుదర్శనార్థం శ్వేతద్వీపగమనం— ఇత్యాదులతో ఇంచుక రామాయణ భిన్నంగా నడిచింది

నాల్గవది శ్వేతద్వీప వర్ణనంతో ఆగిపోయింది

రామాయణాన్ని అక్షరాక్షరంగా అనువదించకపోయినా భాస్కరాదులు సాధారణంగా కథను ఎక్కడోగాని మార్చలేదు ఆ మార్పుకు కూడా అప్పటికే ప్రజలలో వ్యాపించిన అనార్ష కథల ప్రాబల్యం కొంత పనిచేసింది

అప్పటికే యథామూలపు రక్తి చాలక శిల్ప చమత్కారభూయిష్టమైన రచన ప్రబంధ పూర్వరంగంగా ప్రారంభమయింది కాని వారు ఆర్ష హృదయానికి బహుదూరం పోలేదు రఘునాథుడు అక్షరాలా రామాయణం పేరు పెట్టినా తన నాటికి స్థిరపడ్డ ప్రబంధబంధానికి వశుడై -రామాభ్యుదయమంత కాకపోయినా-తన రచనను మితిమీరిన ప్రబంధరూపం తెచ్చాడు కథను మార్చాడు వర్ణనలు పెంచాడు చమత్కృతిని హెచ్చించాడు

రఘునాథుని అయోధ్యా వర్ణనంలో 'కీరముల్ ముక్కుల గీర' అనే సీసమూ, 'చిలుకలు ముక్కులం బొడువ' అనే చంపకమూ, ఆముక్త విలుబుత్తూరు వర్ణనంలోని పనసలను, కదళీవనాలను జ్ఞాపకం చేస్తాయి

ఇందులోని పేరెపేరె ధాన్యాలూ, కప్పురబోగి వంటకాలతో కమ్మగ నేవడియన్ భుజియించి గుత్తపుటుంగరాల చేతులు తిప్పుతూ మాటాడే రెడ్డి దొరలు, తెలుగుగడ్డ సొత్తేగాని అయోధ్యలో సాధ్యం కాదు రామాయణం నాటికి చతుర్వర్ణాలే కాని అందులో రెడ్డి, కమ్మ విభాగాలు లేవు ఆముక్తలో అంత గౌరవంలేని రెడ్లను, రఘునాథుడు మంచి స్థానానికి లేవనెత్తడం ఇందులో విశేషం ఎంత రామాయణాన్ని మనసులో ఉంచుకున్నా తంజావూరు పొలాలు, నగర సౌభాగ్యం ఈ రామాయణంలో తొంగిచూస్తూ ఉంటాయి

పురసుందరీ వర్ణనం కావ్యసాధారణమే కావచ్చు కాని "విటులకు తంగేటి జున్ను"గా విలసించే వెలవెలందుల విహారింపు రామాయణ హృదయం కంటే తంజావూరు శృంగార ప్రీతినే చెబుతుంది

అయితే— 'ఎవ్వాని జూచిన హీరహారి కిరీట ... నలరువారె', 'హాటకమణి సౌధంబుల నాటక శాలలు' వంటి పద్యాలు 'నాగ కుండలీనాం మకుటీ', 'వధూ నాటక సంఘైశ్చ' ఇత్యాది రామాయణ శ్లోకాలను అనుసరించడం చూస్తాం అశ్వమేధ నిర్వహణం కూడా క్లుప్తంగా ఆది కావ్యాన్నే అనుగమించింది ఋష్యశృంగానయన ఘట్టంలో వేశ్యవాటికా భోగం, వేశ్యలను విటులు వెంబడించడం, వేశ్యల ఓదార్పు ఆశ్రమంలో వేశ్యలు మునికుమారునిగూర్చి చేసిన పరాచికాలు, అతనిని తమ చేతులతో పట్టి 'ఎలజ నయనా భుజాందోళిక'మీద తీసుకువెళ్ళడం, రామాయణ స్థాయికి తగిన కల్పనలు కావు అవి తంజావూరి గణికల విలాసవైఖరులైతే కావచ్చు గాని, రామాయణపు రాముల ఒప్పిదాన్ని వెల్లడించవు ఈ ఋష్యశృంగ ఘట్టాన్ని తెలుగు రసికులు అపూర్వంగా భావించి అభినందించి ఉంటే ఉండ వచ్చు గాని చమత్కార, భావచిత్రణలకు అతీతమైన ఉన్నత కావ్యధర్మం ఒకటుంది అది ఔచిత్యం, 'అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్య కారణం' అని అభిజ్ఞుల నిగమనం దాన్ని పాటించని ఎంత గొప్ప చమత్కారాన్నయినా కావ్యతత్త్వజ్ఞులు హర్షించరు

శ్రీమద్ రామాయణంలో విష్ణువు దశరథయాగంవద్దకే వచ్చినట్టుంది కాని ఇందులో బ్రహ్మమాత్రమే వచ్చినట్టూ, అతడు దేవతల మొరవిని వారితో గూడ విష్ణుదర్శనార్థం పాలకడలిలోని శ్వేతద్వీపానికి వెళ్ళినట్టు ఉంది ఈ కల్పన రామాయణ విరుద్ధమైనా కాళిదాస భోజ రామాయణ కథలను అనుస రించినట్టు కనబడుతుంది వారి మార్పుకు మూలం ఏది అయినా—విష్ణువు యాగసన్నిధికి రావడంకంటే కార్యార్థులైన వీరే ఆయనవద్దకు వెళ్ళడం ఉచితమని తోస్తుంది రామాయణంలోని ష్ణ్వాగమ ం ప్రక్షిప్తమని కొందరు మహారాష్ట్ర విద్వాంసుల అభిప్రాయం

శ్వేతద్వీప వర్ణనం ఇందలి నాలుగో ఆశ్వాసంలోను, వాల్మీకి చరిత్ర ప్రథమాశ్వాసంలోను, విపులంగా దర్శనమిస్తుంది ఇకని వైష్ణవాభిమాన ఫలితమేగాని వాటికంత ప్రసక్తి లేదు

కవితాపరంగా రఘునాథుని భావనాబలం, వర్ణనప్రాగల్భ్యం, శబ్దమాధుర్యం ప్రశంసనీయములైనవి ౧ ఆశ్వాసంలో వాల్మీకి కిరాతుని శపించిన ఘట్టంలో 'కుఱుచఁగాఁ జుట్టిన కుఱుమాపుదట్టిపైఁ గోడవలిలోఁ దోఁటిఁగూడ జెరివి' అనే పద్యమూ, 'నుదుటిపై నొకవ్రేలు గదియించి క్రౌంచముల్ నిలుచు చోటిది యని తెలిసితెలిసి' అనే పద్యమూ రామాయణంలో కనిపించని కరకుబోయ ఆకృతిని అమోఘంగా చిత్రించి చూపుతుంది

'మా నిషాద' శ్లోకానికి ఈయన చేసిన తెనిగింపు హృదయస్పర్శకమైనది

"అక్కట నిషాద! రతిచే
మిక్కిలిఁ దమినెనయు క్రౌంచమిథునములో ని
వ్వొక్కటిఁ బడవైచితి, నీ
కెక్కడ నిలుకడఘటిల్ల దిఁక నెన్నఁటికిన్" ౧-115

ఈ ద్వికకాకప్రాస ఎన్నుకొని చెప్పిన పద్యం కవి మనసులోని వెక్కసమును ధ్వనిస్తూ ఆ శ్లోకాన్ని తెనుగు గుండెలోనుంచి ఊడి[illegible]ట్టు వ్యాఖ్యానించింది

రోమపాదుని రాజ్యంలో కరవు, వేశ్యల హొయలు, గడుసుదనాలు, త్రోవలోని ఆశ్రమ విశేషాలు, మునిబాలకుని అమాయికపు చేష్టితాలు పలుమరు చదవదగిన రమ్యదృశ్యాలు

ఈయన వాగ్విలాసం ఒకొక్కచోట చేమకూర కవికి దారిచూపినదేమో అనిపిస్తుంది

"మృగవిలోచనలార! మీ నిడువాల్జడల్
వాతాశి మహిమ నివారకములు
నలినాక్షులార! మీ నగుముద్దుమొగములు
ద్విజరాజ ధైర్యావధీరణములు
అలివేణులార! తేనెలుమించు మీ వచో
మాధురి శుకమోహ సాధకంబు
కామినీమణులార! మీ మందయానము
ల్వరమహంస భ్రమాపాదకములు
కమలముఖులార! మీ యుబ్బు గబ్బి గుబ్బ

గన్నులు గిరీశ గౌరవోచ్చాటనంబు
లిం మహిమంబు గలుగు మీ యంకవారి
 ల మునీంద్రుని వలపించు టనగ నెంత ? ౨-111

ఇందులోని వాతాళి ద్విజరాజ, శుక పరమహంస, శబ్దాలు వార కాంతలకు అన్వయిస్తూనే వాటికున్న అర్థాంతరాలవల్ల ఇంద్రియ విజేతలైన ధీరులను స్ఫురింపజేస్తూ ఒక చమత్కారాన్ని సాధిస్తాయి ఇట్టి చమత్కృతు లను ఎడనెడ ప్రవర్శిస్తూ చేమకూరకవి నిగ్గుదేరాడు

రఘునాథుని గడుసుపలుకులోని అఘటనఘటనా చాతుర్యం ఈ పద్యంలో చూడవచ్చు

"నేలకు నింగికిం దొడరి నేర్పున సూత్రమువన్న మంచు గుం
చాలను గొల్వఁ, ద్రాళ్ళసుక చాలునఁ బేనఁగఁ జుక్కలెన్నఁజ
ట్రాలను నారలొల్చి నెగడన్, వడగండ్లను గుళ్ళు గట్టఁగా
జాలిన మీకు, నిచ్చటికి సంయమిఁ దెచ్చుట యేమి చోద్యమో ?
౨-112

ఈయన శబ్ద ప్రభుత్వముకు ఈ పద్యం మచ్చు
నవనీరద సన్నిభునకు,
నవనీ కన్యాభునకు, ననిమిష పరిష
న్నవనీయ నీ కిన్ దా
నవ నీహారాపహార, నళినీపతికిన్" ౧-43

'ఈ పద్యంలోని త్రిప్రాస శబ్దాలంకార విన్యాసానికే కాక 'ను' ధాతువునకు 'అనీయర్' ప్రత్యయంచేసి గుణమును పొందించి సాధించిన నవనీయ సౌశబ్ద్యగుణానికి పండితులు ముదితులవుతారు ఇట్లాంటి శబ్దశక్తి ఈతని రచనలో పలుచోట్ల చూడవచ్చు ఈతని కవితలో ఉపమా సౌందర్యం కంటె ఉత్ప్రేక్షా చాతుర్యం విస్తరించి కనపడుతుంది

వాల్మీకి చరిత్ర మూడాశ్వాసాల ప్రౌఢ ప్రబంధం విరాజు రామభక్తి రామాయణ రచనతోనే ఆగక దానిని సృష్టించిన మహర్షి చరిత్రను గూడా కావ్యం చేయడానికి ఉత్సుకమయింది అయితే వాల్మీకి చరిత్రకు, కావ్యం చేయదగినంత వైశాల్యంగాని, ఘటనా వైవిధ్యంగాని లేదు ఉన్నది చిన్న సంఘటన.

ఈ కథ ధర్మఖండ వాసిష్ఠరామాయణ భక్తివిజయాదుల్లో కనపడు తుంది రఘునాథుడు అనుసరించింది ధర్మఖండ కథ

వాల్మీకికి[1] ప్రాచేతసుడని ఇంకొక పేరు అయితే ఆ పేరెట్లా వచ్చిందని ప్రశ్న రామాయణ వ్యాఖ్యాతల కథనం ప్రకారం భృగువంశీయుడైన ప్రచేతసుడనే మునికి ఋక్షుడనే కుమారుడున్నాడు ఋక్షుడు వల్మీకం, ఆన మీద బలిసినంత తపస్సు చేయడంచేత వాల్మీకి అయినాడు, అని విశదమవు తుంది మరికొంద రిట్లా అంటారు —

భార్గవుడైన[2] ఋక్షుడు పుట్టలో ఉండగా ప్రచేతసుడనబడే వరుణుడు తన వర్ష ధారలతో పుట్టను కరగించి అతణ్ణి పైకి తేవడంవల్ల ప్రాచేతసుడై నాడు అని—

వీరి కథనాల్లో కిరాతత్వ ప్రమేయంలేదు కిరాతుడు వాల్మీకి అయి నాడనే కథకే ఎక్కువ ప్రాచుర్యం ఉండడంవల్ల ఈ కవిరాజు కిరాతకథనే తన కావ్యానికి వస్తువుగా స్వీకరించాడు కాగా ఈ కావ్యం వాల్మీకి పూర్వ వృత్తంతో ప్రారంభమై రామాయణోపక్రమంతో ముగియడం న్యాయ్యం కాని ఇందులో ద్వితీయాశ్వాసంలో తుది 70 పద్యాలతో అసలు వాల్మీకి కథ ప్రారంభమై తృతీయాశ్వాసంలో శ్రీరామదర్శనంతో ముగుస్తుంది అనగా కావ్యంలో సగభాగం అన్యథా వ్యయమై ప్రధానకథ తక్కిన భాగంలో ఇమిడిందన్నమాట కనుక ఈ రచన సమవిభక్తాంగంగా కనపడక కవి ప్రబంధాభిరుచులకు విస్తార వర్ణనలకు పాత్రమయినట్టు గోచరిస్తుంది

బదరికావన వర్ణనంతో కావ్యం ప్రారంభమై, అక్కడ మునులడిగిన ప్రశ్నకు, నారదమిత్రుడు పర్వతుడు చెప్పిన వృత్తాంతంగా - సత్పురుషులు కొందరు శ్వేతద్వీపంలో విష్ణుదర్శనం చేయడం, ఆయన వారి ననుగ్రహించిన మీదట వారు తీర్థయాత్రలు చేస్తూ సకల ద్వీపాలు తిరిగి జంబూద్వీపానికి రావడం ఉంటుంది తర్వాత తామ్రపర్ణివద్ద గజేంద్రమోక్షకథ తర్వాత దక్షిణదేశపు పుణ్యస్థలాల నన్నింటినీ వివరంగా చూచి వారు వింధ్యదాటి కాశీపట్నం చేరుతారు మండువేసవి వస్తుంది మునులు ఎట్లో ఆ వేసవి దాటి

1 శ్రీ మద్రామాయణ గోవిందరాజీయ వ్యాఖ్యానం

2 (వావిళ్ళప్రతి) (వికల్పంగా రెండూ చెప్పబడినవి)

తమసానదీ తీరానికి వెళతారు అక్కడొక మహాటవి వారు త్రోవతప్పి గహనంలో పడతారు అక్కడ బోయవాని అడ్డగింపు వారిహింస, వారు వేసిన ప్రశ్నకు బోయ దారపుత్రులను జవాబడుగుతాడు వారు 'నీ పాపంతో మాకు సంబంధం లేదంటారు బోయ పశ్చాత్తాపపడి మునుల ఉపదేశం పొంది తపసులో నిమగ్నమవుతాడు తపోఽగ్ని విజృంభణం

ఇంద్రుడు ముని తపోభంగానికి రంభను పిలిచాడు రంభోర్వశుల జగడాలు ప్రతిజ్ఞలు ముని తపోభంగంలో ఇద్దరికీ పరీక్ష ఎమ నాట్య సంగీత పాండిత్యమంతా వినియోగిస్తారు మునిదగ్గర అగి నిష్ఫలమై ఈసుదక్కి ఇద్దరు నిష్క్రమిస్తారు మొదటి మునులు తిరిగివచ్చి వాల్మీకి తపోనిష్ఠనుచూచి హర్షించి వెళతారు తుదకు పుట్టమునికి శ్రీరామచంద్ర దర్శనం 'మచ్చరితంబు భవ్యంబగు కావ్యంబుగా నొనరింపు' మని ఆయన సెలవిచ్చి అంతర్హితుడు కాగా వాల్మీకి ముని రామాయణ రచనతో కావ్యం సమాప్తమవుతుంది ఇది రామాయణ కథానుసారి కాదు

రఘునాధుడు ఈ వాల్మీకి చరిత్రను 'నవోద్యమ నవార్థ చమత్కార భవ్యంబును, సకల విద్వత్కవి శ్రావ్యంబునుంగా జేయనూహించి' ఉపక్రమించాడు

"నీ కవితావిలాసము గణింప సుధారసధారలంచు నింపైకనుపట్టు" అని కలలో దర్శనమిచ్చిన రామచంద్రుడు ప్రోత్సహించాడు

ఇందులో కవి ప్రత్యేకంగా పేర్కొన్న లక్షణాలు మూడు- 1 నవోద్యమం 2 నవార్థ చమత్కారం 3 విద్వత్కవిశ్రావ్యత

నవోద్యమం అంటే కొత్త ప్రయత్నం ఇందులో కవి ఉపజ్ఞతో మౌళికంగా ప్రవేశపెట్టిన కొత్త లక్షణాలేవీలేవు ప్రహతమైన పూర్వ ప్రబంధ లక్షణాలతోనే కావ్యం అంతా నడిచింది అయితే ఎవ్వరూ ఇంతవరకూ వ్రాయని వాల్మీకి చరిత్ర కావ్యంగా వ్రాయడమే ఇందలి నవోద్యమం అనుకోవాలి

ఇక రెండవదైన నవార్థ చమత్కారం ఏమిటంటే - భావనా బంధురములైన మున్యాశ్రమ వర్ణనంలోని ప్రత్యేకత, తృతీయంలోని రంభోర్వశీ కలహ సంరంభాలు, వారి ముని తపోభంగ గమనంలోని విచిత్ర విలాసాలు

ఆశ్రమంలో వారు ప్రదర్శించిన హావభావాలు నాట్యసంగీత పాండిత్య ప్రకర్షలు వంటివని భావించవలసి ఉంది పైసన్నివేశాలలో కవి భావనాబలం, స్వభావోక్తి చారుత ప్రశంసాపాత్రం అని చెప్పడానికి ఏమీ అభ్యంతరం లేదు గాని అందులో రంభోర్వశీ కలహం పరస్పరాహంకారాలు ముని తపోభంగ ప్రయత్నానికి ప్రకృష్ట సాధనాలనుకున్నా - మహేంద్రుని సమక్షంలో అవి అనుచితములై, కృతకంగా కనిపిస్తాయి అంతేకాక - కవి తన నాట్య, సంగీత పాండిత్య ప్రకటనకు చేసిన అసహజ కల్పనలుగా తోస్తాయి ఇందలి రంభోర్వశులను వారి పరివార సామగ్రులనుచూస్తే వారు స్వర్గివాసినులైన అప్సరశ్శిరోమణులుగా కాక వైభోగాలతో బలసిన టక్కరి వారవిలాసినులులా గోచరిస్తారు

విద్వత్కవి శ్లాఘ్యత అనే మూడో గుణం - ధారాశుద్ధిలో, పదబంధ చాతురిలో సంగీత సాహిత్య వైదుష్యదర్శనంలో చమత్కార వచస్సంపత్తిలో తిరుగులేని సత్యమనిపిస్తుంది

వాల్మీకి చరిత్రలోని శ్వేతద్వీప వర్ణనం మున్యాశ్రమ చిత్రణం వారకాంతా ప్రవృత్తులూ రామాయణం నుంచి మరల ఇందులో ప్రవేశించి వాటి నవ్యతను కోల్పోయాయి

రఘునాథుడు వైష్ణవాభిమానియై రామకథలు వ్రాసినా - రాయలవలె వీరవైష్ణవం అవలంబించక శివవైష్ణవ క్షేత్రాలను రెండింటినీ సమతా గౌరవంతో ప్రశంసించిన ఉదారుడు మునుల తీర్థయాత్రలలో శ్రీరంగం మీద ఎంత ప్రపత్తి నిలిపాడో శ్రీశైలంమీద కూడా అంతటి భక్తిని ప్రదర్శించాడు

"ఇందుశేఖరు సేవించి యెందు మాకు
భేదమెక్కడిదంచుఁ గాన్పించులీల
నందు ఘనభోగ విభవంబులందుచుండఁ
దిల్లగోవిందరాజుఁ దేటభక్తి" వాల్మీ - పుట 48

అని కొలిచివారు

'నాట్యంబు సలుపునుమాధవుండు
మాకు విభవంబు లొసగుచు మనుచుగాక'

అని శివుని ప్రస్తుతిస్తారు

ముఖ్యంగా ఈ కావ్యంలో చూడదగినవి మునుల దక్షిణాంధ్ర దేశ పర్యటనంలోని క్షేత్ర దేశ విశేషాలు

అతడు 'కొలుచువారల పాలిటి తలపురాయి' శ్రీరంగశాయిని మన సారా బాగడి - తంజావూ ని శ్రీనాథుని రాజమహేంద్ర వరం పద్యం జ్ఞాపకం వచ్చేలా 'ఏ వీట నీశ్వరుండు నిందుశేఖరుడెప్డు బృహదీశ్వరుండను పెంపుగాంచి' అనే సీసం వ్రాసి 'ఎవిధ సస్య [illegible] సస్యలై వెలయుచుండు నట్టి తంజా పురంబున కంగి వేడ్క' అని ఆత్మీయత ఉట్టిపడగా వర్ణిస్తాడు

ఇంకో విశేషం ఏమిటంటే - భయంకర గొలిపెడు బోయపల్లెను ఇతడు చిత్రించిన రీతి రాయల మాలదాస చూచిన బ్రహ్మరాక్షసి నివాసాన్ని జ్ఞప్తికి తెస్తూ ఇతని లోకవృత్త పర్యవేక్షణాన్ని నిశితంగా చూపుతుంది

అంతేకాదు ఇందలి బోయతల పొలుపు పోడుములు, బోయవారు తపస్సులో మునిగిన పెద్దబోయను తపస్సును మానిపించుటకై పలికిన పాటు రోక్తులు, అవశ్య పఠనీయాలు '

గలుచుకుంటె ఇతడు రాయలంత పటిష్ఠంగా పద్యం వ్రాయగలడని '[illegible]ని రా మౌనీంద్ర చంద్రగుల్ ఘనరసః దస్పృక్' అనే స్రగ్ధర రుజువు చేస్తుంది

— ఆ 61 పు

అంతలో అతనిచేతి సంస్కృతపు చేవ చూచి మీదట ఈ తెనుగు రూప చిత్రణం మనకు హాయి గొలుపుతుంది

> "[illegible]టి నటియించు నీలిబలు కాసెయు నల్లని మేనుం జిమ్ము చీ
> [illegible]టి ఘటించుఁ జేత విలుగైకొని మేఘపుఁ బిల్లవోలె న
> ట్టిటు శరబంక్తు లడ్డముగనేయుచు డాయుచు వచ్చివచ్చియ
> జ్జటికుడు సాశ్వశాఖములను సా[illegible] నీ[illegible]రిట్టి నిల్పుచున్"

— పుట 63

కిరాతుని మేఘపు పిల్లగా ఊహించడం ఇతని ప్రత్యేకత వాల్మీకి తపః ఫలంగా ప్రత్యక్షమైన 'దశరథ రామచంద్రుని దర్శనం రఘునాథుని కవితా పరిపాకానికి మచ్చుతునక

"ుట్టు కాలువగదా కల్లోలినీభర్త చెలకుఁ బట్టైముగదా శివుని ధనువు" ఇత్యాదిగా నడచిన తుదిసీసం సీసంకాదు బంగారమనిపిస్తుంది

రఘునాథుడు సంగీత సాధనలో మునిగి తేలినవాడని చెబుతూ "ఆది తాళము" 3 94 "సంయుతా సంయుల" 3-95 అనే సీసపద్యాలు సామాన్య సాహిత్యపరులకు అందవు

అలవోకగా ఇతడు వాడిన అలనాటి దేశిపదాలు - 'దంట నీలంపు చిక్కంటు' 'చేపావడలు' పిస (మాని), తాపిళములు, 'జల్లి పెండెము', 'తలమాళిగ' వంటి వాటి అర్థాలకు ుడుముకోవలసిందే

ఇతడు రామాయణంలో ఒక సీసంలో ఓప్పికొట్టిన 'ఎంది' అనే మాట ఏ కవులూ వాడినట్లు, కనపడదు అది వేశ్యల పచమాటగా పరిగణించి 'ఏమిది' అనే మాట 'ఏంది' గా మారినట్టు ఊహించవలసి ఉంది

రఘునాథుని ఆశ్వాసాంత గద్యాలలోని 'స్వోత్కర్ష' అతని చేతినుంచే వచ్చిందా అని సందేహం అతడు అంతవాడే కావచ్చు కాని ఆ ఆత్మస్తుతి అతని ఉదాత్తతకు తగనిది బహుశః ఏ ఆస్థాన కవులైనా వ్రాసి ఉండవచ్చు

మొత్తంమీద రఘునాథుని విద్వత్తు, రసికత, ఆనాటి కవులకు ఉత్తేజకరమై విజయ విలాసం వంటి ఉత్తమ కావ్యాలను ఉద్భవింపజేసిందని తృప్తిగా అనుకోవచ్చు

నేరుతునని మాటాడఁగ
వారిజభవునంత వాని వశమా? తంజా
వూరి రఘునాథ నాయని గా
రెఱుఁగఁగఁ గుందవరపుఁ గవి చౌడప్పా

అంటేగాని కొంటెకవి చౌడప్పకు కూడా తోచలేదు

చేమకూర విజయం

శ్రీకృష్ణదేవరాయల విజయనగర భువనవిజయ సభాభవనం తర్వాత ఒక వెలుగు వెలిగింది, తంజావూరు రఘునాథరాయల మంటపం దాని పేరు

'విజయ విలాసం' రఘునాథనాయకుని విజయాలకు స్మారకంగా అది వెలసిందని ప్రసిద్ధి

అది సంగీత సాహిత్య కలరవాలతో కలగలలాడింది విద్వాంసుల శాస్త్ర గోష్ఠులతో ముఖరితం అయింది

"మాటల నేర్పులా సరస మార్గములా కొలువుండు రీతులా
పాటల గంధులా కళల భాగ్యములా బహుదాన లీలగా
నాటక శాలలా యొకటనన్వల దెన్నిటఁ జూడ నన్నిటన్
మేటియుఁ గీర్తిలోలుఁడుఁ జుమీఁ రఘునాథ నృపాలు డిమ్మహిన్"

విజ 1-29

ఈ మాటలు కళ్ళారా ఆ వైభవం చూచి ముక్తకంఠంగా పలికిన ఒక కవి వాక్కులుగాని ఎవరో చెప్పగా విన్న కథలుగావు

ఆ ప్రభువు 'కోదణ్డమ రసభావ సుకవితా భోజుడు (౧ 61), అభినవ భోజరాజ బిరుదాంకుడు (౧-50) అట్టివాని ఆదరాభిమానాలను చవిచూచి తన విజయవిలాస కావ్యాన్ని అతనికి అంకితంచేసి కృతార్థుడ ననుకున్నాడు ఇక్కడ ఒక విచిత్రం ఉంది రాజులు సాధారణంగా తమ ఆస్థానకవికి జాంబూనద డాంబరాలతో తాంబూలమిచ్చి 'నీవు రచించదలచిన కావ్యం నాకు కృతి ఇవ్వ'మనడం మామూలు కాని ఈ కవి 'విజయవిలాస మనెడి కృతి రత్నంబున్, కేవల భక్తిని కానుక గావించెద' నన్నాడు అంతేనా-ప్రబంధము లెన్నియేని మీ పేట నంకితంబిడిన బిడ్డలనెందఱుఁ బేరు బెట్టినన్, దీరునె మీ ఋణంబు' అంతేగాని అతనికి తృప్తి తీరలేదు

అసలు విజయవిలాస రచనమే చమత్కారంగా ప్రారంభమయింది రఘునాథుని విజయవిలాసాలు స్ఫురించేలాగు, విజయుని విలాసం అనే అర్థాంతరం భావించి, కవి కావ్యరచనకు ఉపక్రమించాడు పూర్వ కవులవలె ఇష్టదేవతా ప్రార్థనం, సుకవిస్తుతీ కుకవినిందా, కృతిపతి అభ్యర్థనంవంటివి లేకుండా దైవస్తుతి తర్వాత వెంటనే రఘునాథుని వంశంగురించి క్లుప్తంగా చెప్పి, అతని గుణకీర్తనంతో కృత్యాది అంతా-షష్ఠ్యంతాలవరకూ నింపాడు దీనినిబట్టి రాజు అడగకుండానే ఆశ్రితుడుగా తన కృతిని సమర్పించినాడని భావించవలసి ఉంది

అంతేకాక రాజు కవితాశక్తిమీద, పేత్తృత్వంమీద, అనల్పమైన గౌరవం ఉండి అతనికి కృతి ఇవ్వడమే పెన భాగ్యంగా ఎంచాడు. 'శక్తులెవ్వరయ్యా! రఘునాథ భూప రసికాగ్రణికిన్ చెవిసోక జెప్పగన్' అని ఎలుగెత్తి అంటాడు. ఈ ఆశ్రిత, ఆశ్రయదాతలకు పరస్పరాభిమాన గౌరవాలు సహజములే కావచ్చు. కాని ఈ విధం ఆంధ్ర కావ్య మర్యాదకు లోపం ఐనది.

శ్రీకృష్ణరాయల అంతవాడు పెద్దన్నను 'కృతి రచింపుము మాకు శిరీషకుసుమ పేశల సుధామయోక్తుల పెద్దనార్య'' అని అడిగి కృతి పుచ్చుకున్నాడు. అయితే కృష్ణరాయల సభలో పెద్దనార్యునకున్న స్థాయీ రఘునాథుని సభలో వెంకటకవికున్న స్థానం భిన్నములన్నమాట. తిమ్మనార్యుడు తన పారిజాతాన్ని రాయలు అడగకుండానే ఇచ్చినట్టు కనబడుతున్నా— వెంకటకవి ఆశ్రితభావం తిమ్మనలో చూపలేదు.

రఘునాథుడికి ఆంధ్ర సాహిత్యంమీద, కవితమీద ఎంతటి ఆదరానురాగాలున్నా సంస్కృత సాహిత్యంమీద శాస్త్రప్రవేశంమీద ప్రత్యేకాభిమానం ఉన్నట్టు స్ఫురిస్తుంది. అతని కొలువులో గోవిందదీక్షితులు, వెంకటమఖి, కుమార తాతాచార్యులవంటి ఉద్దండ కవిపండితులుండి సంస్కృత వైదుష్యానికి విశిష్ట స్థానం ప్రసాదించినట్టు గోచరిస్తుంది. కనుకనే వెంకటకవి రఘునాథుని భోజునితో ఉపమించాడుగాని అన్యపహితపూర్వుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు అయిన శ్రీకృష్ణరాయలతో పోలి తేలేదు. పాండిత్య ప్రకర్షలో వారితో పోలకపోయినా తెలుగు కవిగా తనకొక స్థానాన్ని భద్రపరచుకున్నాడు.

రఘునాథుడు వెంకటకవిని తక్కువగా చూడలేదు. అతని అర్హతను అతనికిచ్చి సగౌరవంగానే మాట్లాడినట్టు ఈ ప్రతివచనాలవల్ల తెలుస్తుంది.

"వాసించు పొంతఁ జెప్పిన
వీసరపో వొకట భక్తి విశ్వాసంబుల్
నీ సొమ్ములు, సామాన్యుడ
వే సూర్యవరప్రసాది విజ్జగ మెఱుఁగన్" ౧-49

"ప్రతి పద్యమునందుఁ జమ
త్కృతి గలుగం జెప్పనేర్తు వెల్లడ తెలుగా
కృతివింటి మవారముగా
క్షితిలో నీ మార్గ మెవరికిన్ రాదుసుమీ!" ౧-50

"క్షత్ర ధర్మమెమ్మెకద నీకుగలది మొదల
మమ్ముఁగొలిచి యిపుడు కృతియును జెప్పి " ౧-5

ఈ పాలకుని మాటల్లో కృతిభర్తృ కృతికర్తల సంభాషణ విధానానికి భిన్నమైన సేవ్యసేవక భావం ధ్వనించడమే కాక 'క్షత్రధర్మమెమ్మెకద నీకు గలది' అనే మాటలు వెంకటకవి ద్విజేతర భావశంకకు అవకాశమిచ్చాయి. చేమకూర అనే ఇంటిపేరు ద్విజులలోను [1]ద్విజేతరులలోను ఉన్నదని విమర్శకులన్నారు. కులాన్వేషణకన్న గుణాన్వేషణే మనకిక్కడ ప్రస్తుతం.

ఈ కవితా హేమంతయుగంలో పెద్దన్న తిమ్మనలుగాని సూరన రామకృష్ణులుగాని పుట్టలేదు.

రామరాజభూషణునికి ప్రతిరూపంగా వెంకటకవి ఉద్భవించాడు. భూషణుని శ్లేష సొగసులు, శబ్దాల విరుపులు పుణికి పుచ్చుకున్నాడు. అంతమాత్రంచేత అతనికి ప్రతిధ్వని అని చెప్పడానికి వీలులేదు. తనదైన ఒక ప్రత్యేక స్వంతత్వం తాను జాతీయములైన ఎన్నో పలుకు పొందికలు, జానుదెనుగు సొగసులు, సంస్కృతాంధ్ర శబ్దాలమీద అసామాన్యమైన అదుపు కలిగి ఉండటం తానుగా నిలదొక్కుకున్నాడు.

భట్టుమూర్తి తన శ్లేషాభిరతికి అనుగుణమైన శుక్తిమతీ కోలాహలుల కథను ఎంచుకొని అతి చటుల శబ్దవ్యాహారంతో రెండర్థాలు, ధ్వనులు సాధించి, ఆనాడు తాను ఎంత మేరకు దానికి వీలుందో అంతగాను మెలిగినాడు. వేంకటకవి రెండర్థాలకు వీలైన కథను తీసుకోలేదు. అలంకార రీతిలో తప్ప, ఎక్కడో శ్లేషను తప్పనిసరిగా ఉపయోగించవలసి రాలేదు. అయినా శ్లేషమీద తనకుండే అగ్గలమైన మమకారంవల్ల మాటల విరుపులోని చమత్కార పటుత్వంవల్ల భూషణునికి దగ్గరై ఒక్కొక్కచోట వసుచరిత్రను జ్ఞాపకం చేస్తాడు.

భట్టుమూర్తి రామరాజభూషణుడై అనితర సాధ్యమైన ఒక స్థానాన్ని ఆంధ్రసాహిత్య రంగంలో భద్రపరచుకొన్నట్టే ఇతడు కూడా ఇతరులెవ్వరికిని అందని ఒక మేలికవి స్థానాన్ని తననాడు భుక్తపరచుకుని అద్వితీయుడై రఘునాథ భూషణుడన్న ఖ్యాతికి పాత్రమైనాడు. ఇతని ప్రతిభకు రాజసభలోని

---

1 ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం తాపీవారి విజయవిలాస వ్యాసం

పండితుల సాహచర్యం రఘునాథుని 'ఉత్తమ రసభావ' వేత్తృత్వం, ఎంత గానో దోహదం చేసి ఉంటాయి

చేమకూర వేంకటకవి చేసిన రచనలు రెండు 1 సారంగధర చరిత్ర 2 విజయవిలాసం

సారంగధర చరిత్ర ప్రాథమిక రచన అనీ విజయం పరిపక్వరచన అనీ తలస్పృశిగా చదివినవారికి వెల్లడి అవుతుంది

సారంగధరకు మూలం గౌరన నవనాథచరిత్ర అందులోని మీననాథ చరిత్రలోనిదే సారంగధర చరిత్ర మీననాథుని సిద్ధిశక్తివల్ల సారంగధరునకు కాలు సేతులు మొలిచి అతడు ప్రకృతిస్థుడు కావడం పరమార్థం

కావడానికి సారంగధరకు మూలం నవనాథ చరిత్రే అయినా వెంకట కవి ఆ కథను యథాతథంగా గ్రహించక అక్కరలేని కొన్ని మార్పులు చేసి కొన్ని సమస్యలు కల్పించినాడు మాళవదేశంలో మాంధాతపురానికి రాజు రాజమహేంద్రుడు అని మూలకథలో ఉంటే ఆ రాజుకు రాజనరేంద్రుడు, రాజరాజు అని పేర్లున్నవనీ అతడు రాజమహేంద్రవర విభుడనీ వ్రాశాడు దానితో రాజమహేంద్రవరానికి ప్రభువయిన చాళుక్యరాజరాజుకు ఈ కథ అంటుకుని ఆయనకు లేనిపోని కళంకాన్ని వాదించినట్టయింది రాజరాజు భార్య పేరు అమ్మంగదేవి కుమారుని పేరు రాజేంద్రచోడుడు 'కథకు కాళ్ళును, ముంతకు చెవులును' లేని ఈ కథను చరిత్రజ్ఞానం సరిగ్గా అభివృద్ధి చెందని రోజులలో పలువురు గౌతమీ తీరస్థ రాజమహేంద్ర పురాధిపతి రాజ నరేంద్రునకు అంటగట్టినారు అది శాఖోపశాఖలై నాటకములుగా పాటలుగా ప్రాకిపోయింది

నిజానికి సారంగధర ప్రబంధానికి నాయకుడైన రాజుమాళవదేశాధిపతి అతనికి రత్నాంగి అనే పెండ్లి భార్యా చిత్రాంగి అనే భోగపత్నీ ఉన్నారు సారంగధరుడు రత్నాంగి కుమారుడు చిత్రాంగి అతని రూపయౌవనాలకు మోహించి అతన్ని ప్రలోభపెట్టబోయి భంగపడి, రాజుతో లేనిపోని కొండేలు చెప్పి, అతని కరపాద ఖండనానికి కారణమయింది

ఇట్లాంటిదే అశోకుడు, కుణాలుడు, తిష్యరక్షిత అనే వారితో ఒక్క కథ ప్రచారంలో ఉంది ఈ వృత్తాంతం అసాధారణమేమీ కాదు ఒక గృహస్థు

తొలిభార్య ఉండగానో లేకనో రెండవ పెండ్లి చేసుకుంటే ఆ రెండవపడుచు తొలిభార్య కుమారుని వరించడం గృహకల్లోలాలు చెలరేగడం, అక్కడక్కడ వినవస్తూనే ఉంటుంది

అయితే - ఆ పుత్రుడు నిగ్రహించుకుని పినతల్లిని నిరాకరించడం గొప్ప విషయం ఆ విషయ గౌరవం వల్లనే ఈ కథలకు అఖండ ప్రచారం వచ్చింది ఆ నైతిక సందేశమే సారంగ కథ సారం

వెంకటకవి కథాచమత్కారానికి అనేక నవనవ్న వేశాలను ఆలవాలమైన సారంగకథను తీసుకుని మూడాశ్వాసాల ప్రబంధంగా రచించాడు కథంతా మనకు శ్రుతపూర్వమే అయినా సారంగుని కరపద ఖండనానంతరం ఆకాశవాణిచేత చెప్పించిన సారంగుని పూర్వ వృత్తాంతం కొంత వింత గొలుపుతుంది

ధవళ చంద్రుడనే రాజుకు సుమంతుడు జయంతుడు అని ఇద్దరు మంత్రులు అందులో సుమంతునియందు రాజుకున్న గౌరవాతిశయాన్ని చూచి సహించలేక జయంతుడు కపటోపాయం పన్ని అంతఃపుర ద్రోహం అంటగట్టి సుమంతుని కరచరణ ఖండనానికి కారకుడవుతాడు దండితుడైన సుమంతుడే రాజమహేంద్రుడై పుట్టి సారంగధరుడై జన్మించిన జయంతుని కరచరణ ఖండనం చేయించడం విధి చోదితంగా జరుగుతుంది

దక్షిణాంధ్ర వాఙ్మయంలోని శృంగారాతిశయం, ఈ కావ్యంలో సారంగ చిత్రాంగుల కథలోను ధవళచంద్ర భువనసుందరుల ఘట్టంలోను, ఉత్కటంగానే కనపడుతుంది చిత్రాంగి సారంగధరుని యెడల నిర్లజ్జగా ప్రవర్తించిన తీరు, విచారణ సమయంలో పలికిన మాటలు, ఉత్తమ కావ్యాభిరుచిగలవారిని అలస్టా యనుకోను చిత్రాంగి చూపిన శృంగార దృశ్యాలకు సారంగుడు చెప్పిన అర్థాంతరాలు కడు గడుసుదనానికి నిదర్శనాలుగాని కావ్య గౌరవాన్ని పెంచేవికావు చూ 2 80 పద్యం

ఇందులో రాజువేట, పావురాల పందెం, సుబుద్ధిహితోపదేశం, కవి వేర్పుతో చిత్రించిన ఘట్టాలు హస్తపాద ఖండనం తర్వాత సారంగధరుని వేదన ఆకాశవాణి సత్య నిరూపణానంతరం రాజు రత్నాంగి పుత్రునికోసం విలపించిన తీరు కరుణరసస్ఫోరకాలుగా ఉన్నాయి సిద్ధునివల్ల కాలుచేతులు

బడసి చేటంగి అనే పేరుతో వ్యవహరించబడ్డ సారంగధరుడు విరక్తుడై రాజ్య విముఖుడు కావడం శాంతరసస్థితికి ఆలవాలం తెగిన కాళ్ళు చేతులు క్రమంగా మొలిచిన తీరు సిద్ధుడు అతన్ని ఆదుకొని నడిపించిన విధం ప్రకృతి పరిశీలన నైపుణికి నిదర్శనం అని చెప్పవచ్చు అయితే వెంకకవి భావి కవితా ప్రాగల్భ్యానికి సూచకములైన మెలకువలు ఇందులో ఎన్ని ఉన్నా - తగినన్ని లోపాలు కూడా కనిపిస్తాయి

రాజు పుత్ర సంతానం కోసం చేసిన ఈశ్వరారాధనలో చేసిన చమత్కారాలు అంత ఔచిత్యవంతంగా కనపడవు

"మంత్రాభిషేక మే మర్యాద జేసెనో
తలకెక్కిన విషంబు తలగలేదు
నుదుట గంధపు బిందువదెట్లు పెట్టెనో
నెఱియ మూసిన కన్ను దెఱవలేదు ౧-22

ఇందులో విషవైద్య భూతవైద్యుల వ్యంగ్య చమత్కారముండుగాక దానివల్ల ఈశ్వరపూజలో సాధించిన ప్రయోజనం ఏమిటి ?

"చేరి నృపాలు డర్పణము చేసిన చక్కెర లుప్పతిల్లు పం
దేరము లారగించుచు నుతింపదొడంగె మహేశు డింపునన్,
సారెకు గుత్తుకన్ విషము నాలుక జెల్లముబెట్టి యాడుటల్
మే లటయ్యసామి ! యని మేలములాడుచు గౌరి నవ్వగన్''
౧-23

ఈ గౌరిదేవి చేసిన పరిహాసములో కవియొక్క ఛలోక్తి కనబడుతుంది గాని, ఈ ఉక్తి చాతుర్యం రాజు సంతానప్రాప్తికి ఎట్లా సాధకమో తెలియదు ఇట్టి చతురోక్తులమీద ఉన్న శ్రద్ధ వస్తు నిర్వాహణలో ఉంటే కథ ఇంకా రాణించే వాడనిపిస్తుంది

పావురంకోసం చిత్రాంగి భవనానికి వెళ్ళవద్దని అంతగా హితబోధ చేసిన ప్రాణమిత్రుడు సుబుద్ధి సారంగధరుడికి శిక్షపడ్డ మీదట ఒక్క సానుభూతి వాక్యమైనా పలుకుతూ మళ్ళా కనబడకపోవడం ఆశ్చర్యం గొలుపుతుంది

రాజనరేంద్ర గత్నాంగులు అడవిలో తమ బిడ్డకోసం విలపిస్తూ వెదకుతున్నప్పుడు 'ఉపకంఠ కుతిబద్ధ తర్ణక లిలిక్షోద్రిక్త ధేనుక్రియన్' వంటి సంస్కృతం రసానుగుణం అనిపించు లేదు అంతేకాక 'తరులార ! చెంచు విత్తరులార ! కానరే ? మా కుమారుని బోలు మా కుమారు'' అని అనుప్రాస శ్లేషలతో దుఃఖించడం అనుచితం అనక తప్పదు

ఇట్టిలోట్లు కొన్ని సబడినా - ఇతని శబ్ద ప్రభుత్వం వశ్యవాక్కు, అనుప్రాసల పోషాళింపు అర్థాంతరాల నిర్వహణం, ఇతనిని ఒక ప్రత్యేక స్థానంలో కూర్చోబెట్టి విశిష్ట విని చేశాయి

"ఇనకర స్పర్శనంబున నింపుగాంచి
చిన్ని సారంగధరుఁడు భాసిల్లు కరణి
నినకర స్పర్శనంబున నింపుగాంచి
చిన్ని సారంగధరుఁడు భాసిల్లెనంత'' ౧-51

శ్లేషానుప్రాణితమైన ఈ ఉపమానం ఇతని శబ్దశక్తిని తెలిపితే - ఈ పద్యం మాటల విరుపు సొగసును అర్థద్వయ ఘటనా చాతురిని విశదపరుస్తుంది

"రాజనరేంద్రుడు రిపు ఫణి
రాజ నరేంద్రుడు కళా పరాక్రమ రేఖా
రాజిత భోగ పరాజిత
రాజ, నరేంద్రుఁడు సుధాకర కులుండలరున్'' సారంగ ౧-3

చిత్రాంగి విశ్వామిత్ర మేనకా శృంగారం తలపెట్టగా సారంగుడు అదే పద్యాన్ని మేనా మైనాక కుమారుల మాతాపుత్రానుబంధంగా మార్చి చెప్పడం ఒక రచనా విశేష మే—

"అల్లన గాధిరాజసుతుఁడర్మిలి మేనక ముద్దొనర్ప రా
గిల్లి కుచంబులానఁ దమకించుట , ంటివె రాకుమార ! యే
నల్ల నగాధిరాజసుతుఁ డర్మిలి మేనక ముద్దొనర్ప రా
గిల్లి కుచంబులాన ! దమకించుట కార్యముగాదె, మానినీ !''
౨ 79

తంజావూరు కవితాభిరుచిలో జాతి వార్త అనే రెండు మాటలు కొత్తగా ఖ్యాతిలోకి వచ్చాయి ఈ మాటలు సారంగధర కావ్యంలో లేక

పోయినా - విజయ విలాసంలో స్పష్ట ప్రతిపత్తి పొంది 'శాఁ సపుష్టిమై ప్రతిపదంబున జాతియువార్తయున్ జమత్కారము నర్థగౌరవము' అనే ప్రశంసలో స్థిరపడ్డాయి ఈ మాటలను పూర్వకవులెవ్వరూ స్మరించినట్టులేదు వీటి అర్థ విచారణ చేస్తే - జాతి అంటే జాతీయమైన పలుకు ఒక జాతిలో ఒక చిత్రమైన లోకోక్తులు వాడుకలో ఉంటాయి అని సందర్భానుగుణంగా వాడితే ఆ జాతివారికి అవి ఇంపు గొల్పుతాయి అట్టి వాటిని సామెతలుగా నుడికారంగా తెలుగుకవులు వాడడం ఉంది కాని వార్త అనేది కొత్త నిర్వచనంతో బయలుదేరింది వార్త అనే మాటకు నిఘంటువులో (సూ ని) వర్ణన అనే సామాన్యార్థం ఉన్నా కేవల వర్ణనం వార్త అనలేము స్వభావోక్తికి దగ్గరగా ఉంటూ ఆ ప్రకరణానికి అతి సన్నిహితంగా క్రమాగత మర్యాదతో నేర్పుగా అతికేటట్టు చెప్పడం వార్త అనవచ్చు

ఈ వార్త సారంగధర చరిత్రలోని పావురాల వేటలో సిద్ధునివల్ల కాలుసేతులు వచ్చిన సారంగుని నడకల్లో మనం గుర్తించవచ్చు దీని విపుల వికాసం విజయ విలాసంలో చూస్తాం

సారంగధరలో ఇతని జాతి ప్రయోగం ఇట్లా ఉంటుంది

1 మెత్తనగు చోటనే గుద్దలి వాడియౌ గదా! ౨-88

2 కతకు - గాళ్లు ముంతకుఁ జెవులు ౩-18

3 తల గలిగిన కుళ్ళాయిలు గలవు ౨ 16

వీటిని వార్తలుగా ఎంచవచ్చును—

1 మగవాడు బొంకెనా - యల దడిగట్టినట్టులగు
ఆడుది బొంకిన గోడగట్టిన ట్లలవడు ౨-249

2 ఘుటిక మ్రింగిన సిద్ధుని యటుల, నుల్లి
దిన్న కోమటివలె నూరకున్నవాడు ౩-164

వెంకటకవి సారంగధర చరిత్ర రచించగానే ప్రకటనకు తెచ్చినట్టు లేదు దానికి కృత్యాది, ఆశ్వాసాంత పద్యాలు లేవు విజయవిలాసం ప్రఖ్యాతి చెందిన తర్వాత మరికొంత కాలానికి ఎవరో విజయవిలాసం ఆశ్వాసాది పద్యాలు, అంత పద్యాలు చేర్చి గద్యకూర్చి ప్రకటించి ఉంటారు లేక అతడే స్వీయరచన వృథా కావడమెందుకని నెమ్మది మీద ప్రచురించి ఉండాలి

వేంకటకవి కవిత పరిపాకం చెందిన తర్వాత చేసిన రచన విజయ విలాసం. సారంగధరంలోని వెలితులు చాల తగ్గి ఇందులో పరిపక్వదశ కనిపిస్తుంది.

సారంగధర ఆశ్వాసాంత గద్యలో 'ప్రసిద్ధవాగ్విభవ' అని ఉంటే - విజయ గద్యలో 'ప్రసిద్ధ సారస్వత సుధాసార జనిత యశోలతాంకూర... రఘునాథ భూపాల దత్తహస్త ముక్తాకటక విరాజమాన వేంకటకవిరాజ ..'[1] అని ఉంది. దీనిని బట్టి కవితలో ఈతడు క్రమంగా ఎదిగినతీరు, రాజసన్మానం స్ఫురిస్తాయి.

విజయవిలాస కృత్యాదిలో ఇతడు కనబరచిన రచనావగాహనం, తన రచనమీద ఉన్న ఆత్మప్రత్యయం ఈ క్రింది మాటల్లో విస్పష్టమవుతాయి.

"ఎందును విద్య మేలెరుగ రెవ్వరు—
ఎఱింగినఁ గొంతమాత్రమే—
అందును సాహితీరస మహత్త్వ మెఱుంగిరు—
ఎఱింగి రేని యాయంద మెఱుంగ లేరు—
ఎఱిఁగినప్పటికిన్ విని మెచ్చి యీయరు" విజయ 1-52

సాహిత్యస్వారస్యం గ్రహించడానికి ఎట్టి అర్హతలుండాలో పై మాటల్లో పరోక్షంగా నిరూపించాడు. "రసపుష్టిమై ప్రతిపదంబున జాతియు వార్తయున్ జమత్కారము నర్థగౌరవము గల్గు ననేకకృతుల్" 1-31

ఇది రఘునాథుని గురించి చెప్పినా తన అభిరుచి కూడా ఇందులో ప్రతిఫలిస్తుంది.

రఘునాథుని ముఖతః చెప్పించిన ఈ క్రింది మాటల్లో తన రచనయందు తనకున్న విశ్వాసం గర్భితంగా చెప్పినట్టయింది.

"ప్రతి పద్యమునందుఁ జమ
త్కృతి గలుగం జెప్పనేర్తువు—కృతిలో నీ మార్గ
మెవరికిన్ రాదుసుమీ"

ఈ విలువలతో విజయవిలాసాన్ని శోధకమంగా చదివితే ఆ కావ్య భాండారం బయటబడుతుంది. ఈ ని దృష్టిలో కావ్యంలో—రసపుష్టి, జాతి,

వార్త, చమత్కారము, అర్థగౌరవం ఉండితీరాలి అట్లా చెప్పినప్పుడే 'ఇతిలో ఆ మార్గమెవరికిన్ రాదుసుమా' అనే ప్రశంసకు కవి పాత్రుడవుతాడు

ఒక్కమాటలో చెప్పవలసి వస్తే—కావ్యమంటే వాక్సౌందర్యం ఎట్టి పాడిపాడిగా ఉన్న మాటలకు కవి ప్రతిభ అనే రసాయనచర్య జరిగితే—అవి అపూర్వశోభతో రాణిస్తాయి

కవితా సౌందర్యం మూడు విధాలుగా అభివ్యక్తమవుతుంది ఒకటి శబ్దచిత్రం, ఇది ముఖలావణ్యంవంటిది చూడగానే ఆకర్షించినా స్థిరమైనది కాదు రెండవది అర్థచిత్రం, ఇది శరీర సౌష్టవంవంటిది ఈ ఆకర్షణ మరి కొంతసేపు మనల్ని ఆకట్టుకున్నా బహుకాలం మనస్సును పట్టిఉంచలేదు

ఇక మిగిలింది రసచిత్రణం, ఇది మనసు లోతులంటా పట్టి పాఠకులను వివశులను చేస్తుంది కనుకనే అభిజ్ఞులు "సాధ్యో హి రసో యథా తథం కవిభిః'' అన్నారు (ఆంధ్రశబ్ద చింతామణి)

ఈ అభిజ్ఞతోనే వేంకటకవి రసపుష్టిని ముందు ఉగ్గడించాడు సారంగధరలో రసాభాసమే వర్ణితమయింది గనుక ఇందు పరిపుష్టశృంగారం వర్ణించవలెనని ఉపక్రమించి "నా యొనర్పం బూనిన విజయవిలాసంబను శృంగార ప్రబంధమ్మునకు" అని తన లక్ష్యం వివరించాడు

సారంగధర చరిత్రవలెనే ఇది కూడా మూడాశ్వాసాల కావ్యమే దీన్ని 'మహాప్రబంధం' అనడం ఔపచారికమేకాని—పూర్వ మహాకావ్యాలతో పోలిస్తే యథార్థం కాదు వాక్యాలంకారం మాత్రమే

విజయాపర నామంగల అర్జునుడు ఏకాంత ప్రవాసుడై తీర్థయాత్రలు సాగిస్తున్నా—తన్ను వలచి వలపించిన ఉలూచితో మొదటి శృంగార క్రీడ కావించటం, తాను వలచి చిత్రాంగదను పెండ్లాడి సుఖించడం అవాంతర కథలుగా వచ్చి అసలు కథ సుభద్రా పరిణయంగా పరిణమిస్తుంది

గదుడు వచ్చి ఇంద్రప్రస్థంలో సుభద్రా సౌందర్యం వర్ణించడంతో అర్జునుడికి పూర్వానురాగం అంకురించడం, ప్రభాసతీర్థంలో ఉండగా అక్కడికి ద్వారక చేరువని విని, సుభద్రా సందర్శనకాంక్ష రేకెత్తడం జరుగుతుంది

మొదటి రెండాశ్వాసాలలోను ఉలూచి, చిత్రాంగద పంచాప్సరస్తీర్థ కథలు 239 పద్యాలలో ప్రవర్తిల్లగా సుభద్రా పరిణయ కథ 369 పద్యాలలో అభివర్ణితం అయింది. దీన్నిబట్టి ఇందులోని సుభద్రా పరిణయం ప్రధానేతివృత్తం అని అవగతం అవుతుంది.

కవి నాగకన్యక విషయంలోనే 'మూఁడు వలపుల్ వలచెన్' అన్నా— ఈ మాటను ఇందలి మూడు కథలకు చమత్కారంగా అన్వయించవచ్చు.

నాగకన్యక అర్జునుణ్ణి కోరివస్తే, అర్జునుడు చిత్రాంగదను కోరి వరించాడు. పరస్పరానురాగంతో వలచి నెయ్యమేర్పరుచుకొన్న దాంపత్యం సుభద్రార్జునులది. మొదటిది గాంధర్వం అయితే రెండవది బ్రాహ్మ్యము మూడవది సగము బ్రాహ్మ్యము సగము రాక్షసము అని చెప్పవచ్చు.

ఇంచుమించు మూడూ ఒకే విధమైన శృంగార కథలు. వీటిలో వైవిధ్యం చూపకపోతే పునరుక్తులై పాఠకులకు విసుగుపుట్టించే ప్రమాదం ఉంది. ఈ కిటుకును గుర్తించిన కవి సాధ్యమైనంతవరకు మూడింటిని మూడు విధాలుగా తీర్చిదిద్దాడు.

మొదటి నాయిక కన్యక అని చెప్పినా, చాల మాటకారి. ప్రౌఢ. సాధారణంగా కావ్యాల్లో స్త్రీల విశేష వర్ణనలే చూస్తూంటాం. కాని ఇందులో ఒక సుందరి తాను వలచిన పురుషుని ఇంపుగొలుపుతూ వర్ణించడం విశేషం. 'తీరిచినట్టు లున్నవిగదే కనుబొమ్మలు' అని మొదలుపెట్టి 'ముద్దాడవలదె యీ మోహనాంగుని మోము కండ చక్కెర మోవిగల ఫలంబు' అన్నంతవరకు 6 పద్యాలలో ప్రశంసించడం రమ్యం.

> "నిను గీతి సాహితీ మో
> హన వాణులు చెవులు పట్టి యాడింపంగాఁ
> గని యుండి కాముకుఁడ గా
> వని పలికిన నాకు నమ్మికానె? నృపాలా!" ౧-90

అని చమత్కారంగా - సంగీత సాహితీ సుందరులకు లొంగిన రసికుడవే అని చెప్పిన జాణమాటలకు లొంగని వారెవరుంటారు?

రెండవ నాయిక ముగ్ధ కులపాలిక, తండ్రి ఇష్టపడి పెండ్లిచేస్తే అంగీకరించి భర్తతో కాపురం చేసింది ప్రేమించి పెండ్లా? పెండ్లి చేసుకొని ప్రేమించడమా? అనే విచికిత్సలో రెండవ శ్రేణికి చెందింది చిత్రాంగద ఆమె పెండ్లికి ఫలితం సంతానప్రాప్తి

ఈ శృంగారం స్తిమిత కాసారంలా ప్రసన్నమైనది అర్జునుడు ఈమె రూపురేఖలకు మనసుపడి ఇట్లా అంటాడు—

"వా తెలకు సమ్మతమే తుల
మే తుల కింపుల పిసాళి మిసిమికి క్రొమ్మిం
చేతుల చేతుల కబ్బము
లేతుల లా తుల వెలందులీ చెలితులయే?" ౧-131

భర్తను చేరిన ఆమె లజ్జాభరం ఇది:—

"ఇగ్గెడు వెన్కకుంబయికి నీడ్చినఁ బైటఁదొలంగఁజేయగే
లొగ్గెడు రెమ్మపోక ముడియూడ్చినఁ గ్రుంగిలి రెండు కొంగులుం
బిగ్గ నడంచుచన్ విడిచి పెట్టదు బాల ననంబనేమి? యా
సిగ్గుకు సిగ్గు లేదిటులు సేసిన పిమ్మట నుండ వచ్చునే?" ౨ 30

'కాన లజ్జింప లజ్జించె కమలనయన' అని శ్రీనాథుడు దమయంతి విషయంలో అన్నమాట మరింత వికాస రూపంలో కనుపిస్తుందిక్కడ—

మూడవది ప్రధాన నాయిక సుభద్ర ఇదివరకే విను-లిచేత మేనత్త కుమారుని మనసార ప్రేమించినది అర్జునుడికి సుభద్ర అంతకన్నా మనసున్నది ఇక అడ్డం బలభద్రుడే ఆతణ్ణి వంచించడానికి కృష్ణుని పరికుతో సన్యాసి వేషం సేవకు ఒప్పిదమైన కన్నె అని సుభద్రకు ఒప్పజెప్పారు ఆ కపట యతి అర్జునుడని ఒక్క బలరామునికి తప్ప పెద్దలందరికీ తెలుసు రుక్మిణీ సత్యలకు తెలిసి ముద్దు మరదలితో పరియాచకం, చిత్రమైన నాటకరంగంగా పరిణమించింది

యతి ఉపవనంలో ప్రవేశించాడు సుభద్ర ఉపచారం జరుగుతున్నది

'చేసె జలమ్ముఁడు కడువి
న్యాసను చెరిచూపు బేడిసలపై నిగుడన్

చేసినయది జపమున్ మఱి
వేసినయది గాల మనుట వృథ గాకుండన్' ౨-135

'వెలది కెమ్మోవిఁ గని జపావృత్తి మఱచె
తరుణి లేఁగౌను గని హరిస్మరణ మఱచె
గడమ యననేల ? వేస మొక్కటియ దక్క
మఱచె నన్నియు నా కృత్రిమ త్రిదండి ౨-148

మొదటి పద్యంలోని లోకోక్తిసొగసు రెండవ పద్యంలో జపా హరి, శబ్దాలకుండే అర్థాంతరాలు ఈ పద్యాలను తళతళ మనిపించాయి.

ప్రేమ ఉభయనిష్ఠ మయినప్పుడే అది అందం. సుభద్ర కూడ పెద్దల చాటు కులపాలికే. అయినా ఆమె మేనత్త కొడుకుమీద చూపే కూరిమి ఇక్కడ రససిద్ధికి తోడు పడింది.

'మీ రందందు నరుగ నరుగానరుగా' అని నరునిమీది ప్రేముడిని సూచిస్తుంది.

"ఎగు బుజంబులవాడు మృగరాజు మధ్యంబు
పుడికి పుచ్చుకొను నెన్నడుమువాడు !
వాని మేనత్త కొడుకు కావలయునాకు" ౨-416

అని కొసరి వర్ణిస్తుంది. అర్జునుడు మరింత చనవు తీసుకుని చేయిపట్టుకుంటే వినయంగా విప్పించుకుంటుంది. సమ్ముఖంలో చిలక రాయబారం ఒక శృంగారశ, చెణుకు ! పెద్దలున్నా రెటిగి వారె పెండ్లి సేయగలరు అని సుభద్ర అన్న మాట కులపాలిక నోటినుంచి జారిన ముత్యం.

తర్వాతి విరహాదులు పెద్దలుపూనుకొని చేసిన పెండ్లి యథాతథంగానే- ప్రబంధ సామాన్యరీతిలోనే నడిచిపోతాయి. అర్జునుని తరపున సపత్నీకంగా ఇంద్రుడు అచ్చర భామలు వచ్చి కార్యభారం వహించడం ఇక్కడ విశేషం.

శచీదేవి వియ్యపురాలి వావితో దేవకిమీద కస్తూరి చిలకడం. పూర్వపు వావివల్ల నాకు అత్తవైనా ఇప్పుడు వదినెవైనావని మేల మాడడం, ఈనాడు మా అర్జునుడు అత్తవాని సుభద్రను హత్తడం, 'అయువు గల్గువాడగు

శుభంబగు దీన' అని సరస మాడడం వార్తి అనే కావ్యగ 'ఎ ఎం ఒడుపుగా ఈ కవి వాడగలడో తెలుపుతాయి

తర్వాత సుభద్రను తోడ్కొని పోయేటప్పుడు అర్జునుడికి యాదవులతో తటస్థించిన యుద్ధవీరం ఉం రసంగా నిలిచింది అభిమన్యు జన్మతో ఈ కథ సుఖాంత మవుతుంది

ఈతని రససృష్టి ఎక్కువ ధ్వని మార్గానికి చెందక శబ్ద చమత్కారం మీద ఆధారపడి ఉంటుంది

రఘునాథుడన్నట్లు కవి చెప్పుకొన్న 'ప్రతి పద్యమునందు చమత్కృతి అనే మాట అతిశయోక్తి కాలేదు కథ చెప్పేటప్పుడు ఏ నాలుగైదు పద్యాల్లో తప్ప ఏదో చమత్కృతి లేని పద్యం విజయవిలాసంలో నపడదు అది శబ్దాశ్రితమూ కావచ్చు అర్థాశ్రితమూ కావచ్చు

> 'పుట్టిన దాదిగాఁ దనదు పుణ్యమె దాదిగనై భూమి భృ
> ద్దట్టమదంబు దాదిగ సదా దిగధీశనుత ప్రతాపుడై' ౧ 17
>
> 'పాఱఁ జూచిన రిపుసేన పాఱఁజూచు' ౧-29
>
> 'సైకము నడుము, విలాసర
> సైకము నెమ్మోము దీని మృదు మధురోక్తుల్
> సైకముఁ దెగడుక్ నవలా
> సైకములో నెల్లమేలు బంతిది బళిరా !' ౨-107

వంటి ఛేకానుప్రాస, యమకాదులు 'పోకకు పుట్టెడు'గా ఇతడు వాడగలడు 'నన్నయాదులు కూడా వీటిని శ్రుతి భగవ్వం కోసం పరిమితంగా వాడారు ఈ సుభద్రాకల్యాణ ఘట్టంలో నె' గంగాధ పింగజటా సంగమ మంగళ విశాల సలి తరంగన్' ఆది ౭ 126

'ఇందుఁ బుట్టిన సుతుడు మా కిందువంశ్య' ౭-144

అనే అనుప్రాసలు భారతంలో చీకట్లో నక్షత్రాల్లా తళుక్కున మెరవడం పద్దు ఇది పోతనగారి దగ్గ శ్రుతిమించి కనపడుతుంది ప్రబంధకవులు సర్గాలు విడిచి వీటి యెుకల తొల్యం చూపడం ఎక్కువయింది

భూగోళానికి ఈ శబ్దక్రీడ చాల మెచ్చుట – ఇక్కడనుంచే ఇది చాలా మందికి 'వానసత్వం' అయింది

'కళికి యళికీగమండలి కళికి చూడ
వేల ? ఈ వేళఁ బలుక వీవేల గోల !
నీ [illegible] మునకు
జాలి బడిగాదె యిఁక యీ కుజాళి బడియె' వసు ౩-21

వేంకటకవికి ఈ శబ్ద చిత్రంమీద ఎంత మొగ్గు ఉన్నా అర్థగౌరవం గల పద్యాలకు లోటులేదు

ఇంద్రప్రస్థ వర్ణనం లోనిది ఈ చమత్కృతి
' పోఁక [illegible] క్రమాకుల మహిమ [illegible] పుటనఁటి
యాకుఁదోటల సౌభాగ్య మందె ? లదు
ప్రబల మౌక్తిక సౌధసందల మహిమ
వీటి రహిఁ మెచ్చవలయుఁబో వేయునోళ్ళ" ౧-17

పోకచెట్లు [illegible] పుటకటులు తమలపాకుల తోటలు ముక్తామణి సంపదగల సౌధాలు గల ఆ సౌభాగ్యం వేయినోళ్ళతో పొగడదగినది అనే ప్రకృతార్థం వాచ్యములు ఉండగా – శబ్దశక్తివల్ల వక్కలు [illegible] తమలపాకులు, ముత్యాల సున్నంతో కూడిన ఆ తాంబూల సౌఖ్యం వేయి నోళ్ళతో పొగడ వచ్చు అనే అర్థాంతర స్ఫురణ ఈ పద్యంలోని అర్థ గౌరవం

సుభద్రా వర్ణనంలోని ఈ పద్యాల అర్థగౌరవం ఇది—
" [illegible]లు దీర్ఘముల్, [illegible] మొగంబవురా [illegible] కట్టు [illegible] మ్మి వూ
పున్నమ చందమామలకు, పొక్కిలి చక్కదనంబు చెప్పగా
నున్నదె ? మేలు బంతులు పయోధరముల్, మఱికౌను సున్నయౌ
ఎన్నిక [illegible] చెక్కు [illegible] ఫల మిన్వార వర్ణనికిన్, నిజంబు [illegible]" ౨-104

ఈ సుందరి తన నుదుటి [illegible] వల్ల చక్కని అవయవ సౌష్ఠవంతో ఒప్పుతున్నది అన్నది ప్రకృతార్థమయి ఉండగా కన్నులు మొదలైన అవయవములందు [illegible] దీర్ఘాలు, [illegible]ట్టు, పొక్కిలి మేలుబంతి అనే మాటలవల్ల, ఆమెకు వరవర్ణిని- అనే మాట సార్థకమై ఎట్లా [illegible] వాత [illegible] ఫగించిందో

చెప్పడం ఇక్కడ అర్థ చమత్కారం. ఇక్కడ సుభద్ర సౌందర్యాతిశయం కంటే ఈ చమత్కారానిదే పైచేయి అవుతుంది

"భ్రమకర మనోహరం బౌట పద్మమగును
తారకా హృద్యమగుట సుధానిధియగు
రెంటి జగడాలు మొగమునఁ గంటియుండ
అబ్జ ముఖియంట తెన్న యీ యలరుఁబోడి" 2-105

భ్రమరకాలవల్ల (ముంగురులు - తుమ్మెదలు) ఈ ముఖం పద్మం అనవచ్చు, తారకల సౌందర్యంవల్ల (కనుగ్రుడ్డులు నక్షత్రాలు) చంద్రుడూ అవుతుంది అయితే ఆ రెండిటికీ విరోధం లోకప్రసిద్ధం కాబట్టి ఈమెను అబ్జముఖి (తామర చంద్రుడు) అంటే యుక్తంగా ఉంటుంది అని ఇక్కడ చమత్కృతి

వేంకటకవి మాతృదేశాభిమానం విజయవిలాస ద్వితీయాశ్వాసంలో సంస్మరించిన ద్రాక్షారామ, అంతర్వేది శ్రీశైలం తిరుపతి కాళహస్త్యాది క్షేత్ర ప్రసంగంవల్ల తెలుస్తుంది. నన్నయగారు కూడ సంస్కృత భారతంలో అర్జున తీర్థయాత్రా సందర్భంలో లేని గౌతమీ, భీమేశ్వర శ్రీగిర్యాదులను ప్రశంసించి తమ ఆంధ్రాభిమానాన్ని నిలబెట్టుకోవడం ఈతనికి మార్గదర్శకం అయి ఉంటుంది

తెలుగు జాతీయాలు పసందు ఇంతబాగా తెలిసిన కవులు అరుదని చెప్ప వచ్చు ఆ మాటలు నేటి వ్యవహారంలో నుంచి జారి నిఘంటువు లోనే దర్శనమిస్తాయి

1	బిడ్డల పేరుపెట్టుట	(అప్పించుట)
2	వేదుబంతి	(బొంకు)
3	రతులు	(తూనము)
4	రేకు మడంచు	(అణచు)
5	అంబేదలు	(నోరు చచ్చినవారు)
6	లూలామూలవు నాలి గయాలి	(ధూర్తురాలు)

జాతియని ఇతడు పేర్కొన్న కావ్యగుణం ఇతని కావ్యాలలో సమృద్ధిగా కనబడుతుంది

1 మోకముసకు బోవ మొసలెత్తుకొనిపోయె

2 అందిన సిగ, అందకున్న కాళ్ళు

3 కుతిక మోవదినుట

4 ఏనుగుపాడి

5 చెవులు వట్టి యాడించుట

పూవులవలె మంత విడిపోవు శ్లేషలు సాధించడంలో ఇతడు జాణ

1 అడుగు మాత్రమెగాక యంతకెక్కుడుగ నీ జాలెనె యల బలి చక్రవర్తి ౧-25

2 ఈ నెలంత లాటబువే నెంత ౧ 130

కొన్ని వ్యాకరణ నియమాల నుల్లంఘించినా ఈ పలుకు సొబగులతో, అపూర్వమైన నుడుసు పోకడలతో విశిష్టరవసచే సాటివారిలో గణనీయుడైన ఈ కవి 'ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా !' అని అందం తోడివారి అసూయకు ఇతడు హేలగా చెప్పిన జవాబు అనిపిస్తుంది ఎవరేమి అన్నా ఈ యుగంలో ఇతనిని మించిపోయిన కవి వేరొకడు లేడనడం అతిశయోక్తి కాదు కనక నే ఎవరన్నారోగాని 'చేమకూర పాకాన పడింద' న్లడం ఒక విధంగా అసత్యమనిపించదు అయితే ఒకటి చెప్పక తప్పదు, ఈ పాకంలో అనేక పూర్వులుల రుచులు కలిశాయి

రచనా శైశిరం

రంగాజమ్మ 'మన్నారుదాస విలాసం'

మిత్రులారా !

ఆంధ్ర సాహిత్య సమృద్ధిని ఒక విశాల హేయనకాలంగా భావిస్తే అది టక్కొక్క ఋతవులో ఎన్ని ప్రోద్బలాలను పొంది ఎన్ని ప్రాబల్యాలకు లోనై ఎన్ని మళుపులు తీసుకుందో ఎన్ని సోయగాలు సంతరించుకుందో సావ ధానంగా సమీక్షించాము

స్వమత విమతాది పక్షపాతాలకు పాల్పడక తోచిన గుణదోషాలను వివరించుకున్నాము సమాహారంగా ఒక అవగాహనను పరప్రచుకొన్నాము

ఇప్పుడు తుదిదశకు చేరుకొన్నాము

దక్షిణాంధ్ర వాఙ్మయ యుగంలోనే ఉత్తరభాగాన్ని క్షీణయుగం అన్నారు కొందరు పరిశీలకులు - వారు గ్రహించుకున్న అర్థంలో అది యుక్తమే కావచ్చు కాని - నా భావంలో ఒక జీర్ణావస్థకు, వినాశనోన్ముఖత్వానికి అది సంకేతంగా భాసిస్తుంది కనుక నేను నా ఋతు విభావనలో దీనిని శిశిర స్థితిగా ఎంచుతున్నాను

చెట్లు పండ్లు రాల్చివేశాయి, ఆకుపచ్చదనం పసుపు రంగులోకి మారి నేలకు జారిపోయింది పుష్పశోభ అంతరించింది వనస్పతులు పునరుత్పాదన క్షమమైన తమ జీవశక్తిని మాత్రం లోలో ఇముడ్చుకొని మోడులుగా దర్శనమిస్తున్నాయి అంతే - శిశిరం ఒక వసంతానికి పూర్వరంగం భవిష్యదుదయానికి ఒక అరుణ [illegible]

ఆ దృష్టితో ఈ శిశిరంలో ఆంధ్రకవిత ఏ రూపం తీసుకుందో ఏ అధిత్యకల నుంచి ఏ ఉపత్యకలకు జారిందో, ఏ నిష్ఠనుంచి ఏ లౌల్యాలకు గురిఅయిందో ఏ విరాట్ స్వరూపం నుంచి ఏ భిన్న భిన్న రూపాలను స్వీకరించిందో, ఇప్పుడు చూద్దాం

[1]"చతుర కవిత్వ తత్త్వ పటుసంపద ఒక్కరి సొమ్ముకాదు భారతీదయ సౌధవార్థి, కవిరాజుల మానసముల్ ఘటంబులాయతము కొలంది లభ్యమగు నయ్యమృతంబు " అన్నట్టు ప్రతిభ పలికిస్తేగాని కవిత్వం పలకదు ఆ ప్రతిభే 'భారతీదయ'

క్రొత్తమబ్బు ఉరుముకు 'విదూరభూమి' పులకించి రత్నాంకురం పైకి ఉబికినట్టు కొత్త కంఠస్వరం ఖంగుమనడానికి ఏదో పిలుపురావాలి

ప్రబంధశరత్తు వెనకపట్టిన తర్వాత ఆ పిలుపు మళ్ళా రఘునాథనాయకుని సభలో వినిపించింది ఆ మాత్రం చతుర చమత్కారం, రసపుష్టి అర్థగౌరవం, చేమకూర వెంకన్నలో మారు పలికింది తర్వాత క్రమక్రమంగా రచనా పటిష్ఠత సాహిత్య నిర్మాణానికి ఉండవలసిన సమున్నత స్థాయీ, దిగజారడం ప్రారంభించాయి

1 కనుపర్తి అబ్బయ

తొలుత కవిత్వానికున్న మహత్త్వరూపం పలుచబారి భిన్నభిన్న మార్గాలు తీసుకుని రాశి పెంచిందిగాని వాసిని పెంచలేకపోయింది దానికి సాంఘిక రాజకీయ కారణాలు అనేకం తోడయాయి నాట్య సంగీతోపాసనలో కేవల దైవసేవకోసం ఏర్పడ్డ దేవదాసీవ్యవస్థ ఆ సార్థకతనుంచి విచ్యుతమై పూర్తిగా పుచ్చడికతనం [illegible] పచ్చి శృంగార ప్రసంగాలకు, పడకటింటి ముచ్చట్లకు బలి అయిపోయింది

దేహ సౌందర్యానికి మించిన మనస్సౌందర్యం భావనా మాధుర్యం, తరుచుగా మృగ్యమైనాయి

సృష్టి లీలకు మూలకందమైన శృంగారం రసరాజమే కావచ్చు సకల ప్రాణి సమావర్జకమూ కావచ్చు అయితే దానిని మించిన జీవితపు విలువలు లేవా? శత్రు నిర్మూలకమైన శౌర్యం, ప్రాణాలొడ్డి రక్షించుకోవలసిన స్వాతంత్ర్యం స్వార్థాన్ని త్రెంచుకుని పరార్థంచేసే త్యాగం శాశ్వతమైన ఇంద్రియ సుఖాలతో విసుగెత్తిన చిత్తానికి ఊరట కల్పించే ఆధ్యాత్మిక చింతనం వంటి వాటితో కవి కావ్యం పథనిర్దేశకం కావద్దా? మానవుని చిత్తవృత్తిని, జీవిత ప్రవృత్తిని ఉన్నత వివేకసీమలకు ఎత్తని రచన ఎన్నాళ్ళు తన విలువను నిలుపుకుంటుంది?

కావ్యానికి రసబంధురత్వమూ చమత్కార వైభవమూ ప్రాణాలన్న మాట నిజమే! దానికి ధార్మిక నైతిక బోధలు అప్రయోజకాలన్నదీ యదార్థమే కావచ్చు కాని ధ్వనిరూపంలో అది మనిషికి కర్తవ్యం ఉపదేశించి కార్యోన్ముఖుణ్ణి చెయ్యాలి నేలబారు వాణ్ణి నిజమైన మనిషిని చేసి ముందుకు నడిపించాలి

ఇంద్రియ లౌల్యాలతో, అకర్మణ్యతతో, వాడికి మత్తెక్కించి పతితుణ్ణి చెయ్యకూడదు ఇది అలంకారశాస్త్రంలో లేకపోవచ్చు కాని భారతీయ సంప్రదాయధారలో వస్తున్న అత్యంత రమణీయమైన కావ్య పద్ధతి ఇది దీనికి భిన్నమైన ఎట్టి రసవత్ రచన అయినా చమత్కారచతురమైనా, కొందరి తాత్కాలికమైన మెప్పేగాని దానికి స్థిరరూపమైన కావ్యగౌరవం ఉండదు

రచనలో అవినీతికమూ జుగుప్సితమూ అయిన కురీతి ఎట్టిదో, రస భావ ప్రధానమైన కావ్యంలో ప్రతిభ సన్నగిల్లి ఆ లోపాన్ని కప్పడానికి చేసిన

గర్భబంధాదికలూ శబ్దాల గిడంబ్రలెక్కి చేసిన గారడీలూ అంత హేయమైనవి కొంతసేపు చప్పటలు ఉత్తర క్షణంలో అవి రూపులేకుండా సమసిపోతాయి

పై లక్షణాలకు కొన్ని అపవాదములున్నా - 17 వ శతాబ్ది తుది భాగంలోను 18 శతాబ్ది ప్రారంభదశలోను అట్టి అవలక్షణాలుగల రచనలు చాలా పుట్టి ఆంధ్ర సాహిత్యపు ఔన్నత్యాన్నే నేలమట్టం చేశాయి వాటి అరగతులలో కొంచెం తేడాలు ఉంటే ఉండవచ్చుగాని తత్త్వదశలో పలికే శ్రుతి ఒకటే—

రఘునాథ నాయకుని తర్వాత తంజావూరు సింహాసనానికి వచ్చినవాడు ఆయన కుమారుడు విజయ రాఘవ నాయకుడు ఇతని కాలం 1633 - 73 ఇతనికి తండ్రివలె వీరుడు విజేత అనే ప్రసిద్ధిరాలేదు తండ్రివలె కావ్యకళా ప్రియుడై సంగీత సాహిత్యాలను పోషించాడు స్వయంగా రచయిత అయి యక్షగానాది బహురచనలు చేసినవాడు ఇతని కాలంలో నాటకాలు, మంజరులు, దండకాలు, పదములు, వసంత కేళికవంటి కవితలు చాలా అభివృద్ధి చెందినట్టు మన్నారుదాస విలాస నృత్యాదివల్ల అవగతం అవుతుంది

కామరసు వెంకటపతి చెంగల్వకాళకవి ఇతని ఆస్థాన కవులు కాళకవి విజయరాఘవాంకితంగా రాజగోపాల విలాసమనే పద్య ప్రబంధం వ్రాశాడు రఘునాథునికాలంలో ఇతడు రామభద్రాంబకును విజయరాఘవుని కొలువులో రంగాజమ్మకును విద్యాగురువని చెబుతారు

చిత్రమేమిటంటే - ఇతని కొలువులో పురుషకవుల కంటే స్త్రీ కళావతులే అధికంగా కనిపిస్తారు

ఇతడు సకలరాజలాంఛనాలతో ఇద్దరు రాణులు ఒరగికొని కూర్చుని ఉండగా - కస్తూరెమ్మ అంబుజవల్లెమ్మ మోహనమూర్తమ్మ, కృష్ణాజమ్మ, అలమేలమ్మ, సీతమ్మ, పద్మరేఖమ్మ అనే కాంతామణులు తమ కళా విశేషాలను పదర్శించి ఇతణ్ణి అలరించినట్టు రంగాజమ్మ మాట—

ఇతనికి రంగాజమ్మ ఎడతమీద ప్రత్యేకాభిమానం ఈమె కవితా వైశిష్ట్యానికి మెచ్చుగా కనకాభిషేకం చేసినాడట విజయరాఘవుడు రంగాజమ్మ కృతికేకాక ఆకృతికి కూడా భర్త ఆమె స్వయంగా విజయరాఘవుని 'మద

ర్తృవు, మహీభర్తృవు' అనీ 'సవతులేని నా సవతు లిందరిలోన' అనీ ఆ రాజు నెడల తన చనవును ప్రకటించింది

తాను విజయరాఘవునకు భోగపత్ని అయినట్లే పైన పేర్కొన్న చక్కని కళావతులున్నూ అట్టివారే అని స్ఫురిస్తుంది కాకపోతే 'సవతుల'నే మాట ఉపయోగించడంలో అర్థంలేదు

విజయరాఘవుడు స్త్రీల కళాగోష్ఠులలోను సాహచర్యంలోను ఎక్కువ శ్రద్ధాసక్తులు కనబరిచినట్టు తోస్తుంది ఆ విధంగా రంగాజమ్మ అతనికి మిక్కిలి చేరువై సంగీత సాహిత్యాలలో జాణయై, అతణ్ణి విశేషంగా మెప్పించి ఉంటుంది మన్నారుదాస విలాసగ్రంథాన్ని బట్టి ఆమె సారస్వత ధురీణ శృంగార రస తరంగిణి పదకవిత్వ మహనీయ మతిస్ఫూర్తి, అష్ట భాషా కవితా సర్వంకష మనీషా విశేష శారద'—

ఈ విశేషణాలలో ఎంతవరకు అతిశయోక్తి ఎంతవరకు యాదార్థ్యం ఉన్నదో తెలియదు కాని కొంతవరకు తాదృశశక్తి సంపన్నురాలే అనుకోవచ్చు

ఈమె ఉషాపరిణయం అనే కావ్యాన్ని మన్నారుదాస విలాసమనే ఒక యక్షగానాన్నీ, ఒక ప్రబంధాన్నీ, విరచించినట్టు తెలుస్తుంది యక్షగానాన్ని కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ముద్రిస్తే ప్రబంధాన్ని తీ. సరస్వతీ మహల్ గ్రంథాలయంవారు ప్రచురించారు

తంజావూరుకు ఆగ్నేయంగా 38 మైళ్ళ దూరంలో ఉన్న మన్నారుగుడి దేవుని పేరు రాజగోపాలస్వామి, ఈ క్షేత్రానికి చంపకారణ్యం అని వేరొక పేరు ఈ దేవునిపే 'సంపంగి మన్న' అని ఒక శతకం కూడా ఉన్నది ఈ దేవుడు నాయకరాజులకు ఇష్టదైవం ఆతని ప్రసాదం వల్లనే విజయరాఘవుడు ఉదయించినట్లు వారు నమ్మారు ఆ స్వామికి విజయుడు పరమభక్తుడు అనుకనే ఆతనికి మన్నారుదాసని మరొక వ్యవహారం అతనికి మన్నారు స్వామియందు ఎంతభక్తియో శృంగార గోష్ఠులందు అంత రక్తి అనిపిస్తుంది

మన్నారుదాస విలాసమనగా విజయరాఘవుడే నాయకుడుగా అల్లిన కథ ఒకనాడు రాజు రంగాజమ్మను రాజగోపాలదేవునకు అంకితంగా మన వీట జరిగే ఫాల్గుణోత్సవాదికాన్ని వర్ణిస్తూ ఒక ప్రబంధం వ్రాయమన్నాడు

ఆమె ఆయన కోరినను శిరసావహించి ఆ రాజునే నాయకుణ్ణిచేసి ఒక శృంగార కథను కల్పించి 5 ఆశ్వాసాల కావ్యం వ్రాసింది

విజయ రాఘవుడు రంగాజితో అన్న మాటలివి —

" ఎసుపులేటి వేంకటేంద్రుని సత్పుత్రి
విమలగాత్రి కవిత సద్గుణరాజి, రంగాజి! నీనుమ ౧-16

అయ్యా దినముల రామ భద్రమ్మ మధుర
వాణికాంబయు, సరస గీర్వాణ భాష
నిట్టి కృతులను రచియించి యిలను గీర్తి
జాలగాంచిరి సుకవులు సన్నుతింప ౧-18

"శృంగారైక రసంబులోఁ బదములన్ జెల్వొంద మెప్పించి తా
సంగీతజ్ఞులు మేలునా నుభయభాషాచాతురిన్, నీకికన్
రంగత్ప్రౌఢిఁ బ్రబంధమొకటి యొనర్పన్‌గావలెన్ మత్కథన్
రంగాజీ! భవదీయ వాగమృతధారా వైఖరుల్ మీఱగన్" ౧-18

అట్టి "ప్రబంధంబును గోపాలదేవుని కంకితంబు గావింపుము"

సాధారణంగా ఇంతకుపూర్వం తెలుగు కవులు ఏ పురాణేతిహాస కథనో తీసుకుని వర్ణనాదికంతో పెంచి ప్రబంధం వ్రాయడం మామూలు కాని రఘునాథుని కాలంనుంచీ తమ ప్రభువు విజయగాథలనో, విలాస కథలనో వ్రాసి తమ కవితా ప్రకర్ష చూపడం సంప్రదాయమయింది రామభద్రమ్మ రఘునాథాభ్యుదయం, రంగాజమ్మ మన్నారుదాస విలాసం అట్లాంటివి వీటిలో చిక్కు ఏమిటంటే కావ్యంలో చాలా భాగం తమ ప్రభు ప్రశంసలకే వ్యయమై కావ్యధర్మం పరిమితమవుతుంది

మన్నారు కావ్యంలో చెప్పదగ్గ ఇతివృత్తం బిగువులేదు విజయ రాఘవుడు నెరవేర్చే రాజగోపాలదేవుని ఫాల్గుణోత్సవం, అందులో వైభవోపేతంగా వచ్చే మన్నారు దేవుని చూచి కాంతిమతి అనే రాజపుత్రి తనకు తగిన పతినిమ్మని కోరడం, ఇంతలో విజయ రాఘవుని దర్శనం, ఆయనను చూచి రాజపుత్రిక మోహించి కలలు కనడం - కలలో శృంగారానుభవాలతో కలత చెందడం, శైత్యోపచారాలు, వనకేళులు జలకేళులు, మన్మథారాధనం

రాజపుత్రిక మనసెరిగిన విలాసవతి అనే చెలి రాజువద్దకు రాయబారం, ఆయన అంగీకారం, పిదప కాంతిమతి యెడల ఆ రాజు విరహం, తుదకు రాజగురువు శ్రీనివాస తాతాచార్యులవారు లిగించుకుని కాంతిమతి తండ్రి రాజచంద్రుని కలిసి వివాహం నిశ్చయించడం, వివాహవైభవం, దాంపత్య ధర్మం, రాజు కొత్త పెండ్లి కూతురుతో రాజభవన ప్రవేశం, ఇత్యాదిగా ఈ కావ్య కథ నడుస్తుంది

ఇందులో గురువు [illegible] వారు, మనుమల నెత్తిన రాజు కాంతిమతిని కోరడంలో ఒక రహస్యం వెల్లడించారు ఒకప్పుడు చంద్రుడు విష్ణువును చేరి నీవు సూర్యవంశపు పెండ్లాడినావు గదా! నా పుత్రికను మాత్రం ఏల స్వీకరించరాదు? అని అడిగితే - నిజమే కాని, ఇప్పుడామె నాకు కోడలవుతుంది కలియుగంలో నేను రఘునాథ పుత్రుడనై జన్మించగా, నీవు రాజ చంద్రుడనే రాజువవుతావు అప్పుడు నీ కుమార్తె ఐన కాంతిమతిని నేను భార్యగా స్వీకరిస్తాను - అని విష్ణుమూర్తి చెప్పడంచేత నీ పుత్రికను విజయ రాఘవునకు ఇవ్వడం దైవ ప్రేరితం, కనుక కన్యాదానం చేయమంటే రాజ చంద్రుడు ఇది అదృష్టమే - కాని వెయ్యారు భార్యలకు పతియైన విజయరాఘవునితో నా పుత్రిక సుఖించగలదా? అంటే రాజగురువు నచ్చజెప్పి వివాహము నిశ్చయిస్తాడు ఇందులోని పూర్వజన్మ కథ సత్యాసత్యాల జోలికి మనం పోక పోయినా, విజయ రాఘవుడు విష్ణువు అపరావతారమే అని ప్రశంసించడం, ఆయన శృంగార కథను చిలవలు పలవలుగా వర్ణించడం, రంగాజమ్మ ప్రస్తుత [illegible]వ్యం అయింది

ఆమె విజయ రాఘవుని దైవభక్తిని ఎంత ఉగ్గడించినా ఆయన శృంగార లౌల్యమే ఈ కావ్యంలో ప్రధాన స్థానం ఆక్రమిస్తుంది ఈ శృంగారాన్ని పురుషులు వర్ణిస్తే పరంపరా ప్రాప్తమే అదే ఒక స్త్రీ వర్ణిస్తే దానికి వింత ఆకర్షణ కలుగుతుంది ఆ ఆకర్షణ ఈ కావ్యంలోని ఒక విశేషం

దీనిలో విజయ రాఘవుని సాహస విక్రమాలకు గాని లోకోత్తర కార్య కలాపాలకు గాని చోటు లేదు ఆయన విద్యా పక్షపాత, దాన ధర్మాల ప్రసక్తి ఉంది ప్రముఖంగా కనిపించేది శృంగార ప్రీతియే

యువతి అయిన కాంతిమతికి ఒక మనోహరాకారుని చూచినపుడు కలలు రావడం సహజమే కాని ఆ కలల గురించి కవయిత్రి, చెప్పినతీరు నాయిక వ్యాఖ్యానికి తగినట్టుగా లేదు

సీ॥ "

ముదము మీఱఁగఁ బోఁకముడి సడలింపుచుఁ
గంతు కేళిని నన్ను గలయు నెపుడు!
గళరవంబులు బలుకుచు కాకదీరఁ
గళల సొక్కించి తేలించి వలపు మించ
విజయ రాఘవ మేదినీ విభుడు నన్ను
నించు వేడుక నోలలాడించు నెపుడు? 2-67

అని ఇవి చెప్పడమే కాదు ఆ కామిని నోరార చెలి త్తెలతో అన్న మాటలివి

సీ॥ "

కులుకు గుబ్బలమీదఁ గుంకుమం బలఁదరా!
వలచితి నే నీకు వన్నెకాఁడ!
చక్కెర మోవాని చనవుఁ జాలింపరా!
దక్కితిరా యోరి! నిక్కము గను
చెక్కిలి కొనగోరఁ జీరి నన్నేలరా!
పక్కకు వచ్చెదఁ బ్రాణనాథ! 3-13

ఈ మాటలు కాంతిమతి ముఖతః రంగాజమ్మ పలుమార వ్రాస్తే, విజయ రాఘవుడు వీనులారా విని ఉంటాడు

మనుమల నెత్తిన మహారాజు కాంతిమతిని వలచి విరహంలో అన్న మాటలు కూడా తంజావూరు రసికునకు తగినవేమో గాని, ధీరోదాత్తుడైన కావ్య నాయకునకు తగినవిగా నిపించవు

"బంగారు కుఁడల బాగు మీఱిన యట్టి
పడతి గుబ్బను కేల బట్టవలదె?

చేరదీయుచు లాలించి సారె సారె
చిగురు బానుపు మీద చౌసీతి గతుల
అలరు విలుకాని కేళిని తెలఁగి కూడి
మెలఁతతోఁ బ్రేమ నేవేళ మెలఁగ వలదె?

"తరుణి! నీ దాసుఁ డనుచును దయను నన్ను
సేవఁ జేయించుకోరాద చెలువ నీవు
పరుఁడు దండెత్తె నా మీద మగువ! నీదు
చరణ పద్మంబులకు నిదె శరణు శరణు" ఆ-17

తరచుగా ప్రబంధ కవులు స్త్రీలకు ఒక మనస్సుంటుందని గాని దాన్నిలో చిత్రమైన భావనా ప్రపంచం ఉంటుందని గాని మరచి వారి అవయవాల మీదనే పట్టించి శృంగారం కుమ్మరించా. అది క్రమంగా వాచ్యమై సిగ్గు విడిచిన జావళీల స్థాయికి దిగజారింది.

అందులోను 17 శ॥ తుది భాగంలో బయలుదేరిన యక్షగానాలలో, శృంగార పదాలలో, శృంగారం మరింత వాచ్యమై ఔచిత్యాన్ని మరింత దిగజార్చింది.

అదే సమయంలో రంగాజమ్మ "శృంగారైక రసంబులోఁ బదములన్ జెల్వొందఁ మెప్పించినది" కాబట్టి ఈ శృంగారం ఆమె సహజ ధోరణిలోనే వచ్చింది అనుకోవచ్చు. ఇందులో ఒక సుగుణం ఏమిటంటే విలాసవతి, కాంతిమతి అవయవ సౌష్ఠవాన్ని ప్రబంధ ఫక్కీలోనే వర్ణించినా (3 60) ఒక పద్యంలో ఆమె విద్యా విశేషాలను సంగీత సాహిత్య సుప్రవేశాన్ని ప్రశంసించడం, కొంత మెరుగు అని చెప్పవచ్చు.

ఆంధ్ర కవయిత్రులలో మొల్ల తర్వాత నిలిచి తెలుగులో కావ్యరచన చేసిన స్త్రీలు తరచుగా కనబడరు. పిదప సుమారు రెండు వందలేండ్లకు నాయకరాజుల పోషణలో పలువురు స్త్రీలు కావ్యరచనకు తగిన పరిజ్ఞానం సంపాదించి పలురచనలు చేసి, 'తెలుగు సాహిత్యానికి స్త్రీలు చేసిన సేవ తక్కువ కాదు' అని నిరూపించారు.

వారి రచనలకు మచ్చుగా మనం రంగాజమ్మ మన్నారు దాస విలాస ప్రబంధాన్ని తీసుకోవచ్చు.

మొల్ల వాక్పాటవమూ, వచోవైఖరీ ఒక జాతికి చెందగా రంగాజమ్మ కావ్య చాతురీ, పదప్రయోగం వేరే రీతికి చెందింది. ఈమెకు సంస్కృతాంధ్రాల్లో తగినంత ప్రవేశం ఉండి, నాగబంధం (ఆ-18) వంటి బంధ కవిత్వం వ్రాయ గలిగినంత చేవ ఉంది.

ఎత్తుకున్న పద్యాన్ని ధారాళమైన శయ్యలో నడిపించే నేర్పు ఉంది ప్రబంధ రచనకు లాంఛనాలైన వన, జలకేళులు, సూర్య, చంద్రోదయ అస్తమయ, వర్ణనలును జలకేళికి అపరిహార్యమైన రగడ, స్రగ్విణి, మాలినివంటి వృత్త వైవిధ్యం, ఈ కావ్యంలో లోటు లేకుండా ఉన్నాయి

పూర్వ కవుల కల్పనలకు, భావనా ప్రౌఢికి, సరితూగే పటిష్ఠత లేక పోయినా వారి అడుగు జాడలలో ఒప్పిదంగా రచన సాగించ గలిగిన చాతుర్యం ఉంది

"ఒప్పురంబు నందు నతి విచిత్రం బిది
క్రతువులందు ద్రష్టలాను లొసగి
యుత్తరాయణంబు నొగి దక్షిణాయనం
బుగ నొనర్తు రరయ భూమి సురులు" ౧-94

"తడలేని నిత్య పత్రముఁ బెట్ట జామంబు
కాంతల మధ్య భాగంబుఁ జేరె " ౧-105

కేవలం రసాస్వాదనం కోసం కాకపోయినా - ఆనాటి రాజుల కొలువు తీరులు, అలంకార బాహుళ్యం, వైష్ణవ పూజోత్సవాలు, వారి పరిభాషలు, పెండ్లి వేడుకలు, అపూర్వ సాంఘికాచారాలు, శయ్యా గృహాలంకరణ సౌభాగ్యం, తెలుసుకోడానికి, ఈ కావ్యం దర్పణంగా ఉపయోగిస్తుంది ముఖ్యంగా పెండ్లి విందులోని శాకాహార మాంసాహార సమృద్ధి, వంట నేర్పులు మనకు అత్యాశ్చర్యం కలిగించి అపూర్వా లనిపిస్తాయి

వ్యాకరణాతీతమైన నాటి వ్యవహార భాషా ప్రయోగం, తమిళ భాషా పరిచయం, ఈ కావ్యంలో దర్శనమిస్తాయి చాలా, సేనా (ఎక్కువ) వద్ది, మొక్కేను, కొక్కచ్చి, భూచక్ర గొడుగులు, అంజేత్రుడు, అచ్చుత (అచ్యుత) వైరముడి, తిరువందకాపు, సేతి, తిరుతేరు, వంటివి అట్టిక:

రెండు ఉత్తుంగ శృంగార తరంగాలు

౧ శశాంక విజయం

భక్తిపరంగా పురాణాలకు రతిపరంగా ప్రబంధాలకు అవసరమైన శృంగారం, నాయక రాజుల కాలానికి కాంతాపరంగా అతిశయించి కొన్ని

రెట్లు, కొన్ని మెట్లు పైకెక్కింది భోగినీ స్నేహం గురు శిష్య సంబంధంగా కొంత అయితే సంగీత నృత్య ప్రోత్సాహంలో కొంతా విద్యావతీ సాహచర్య సంప్రీతివల్ల కొంతా ప్రాధాన్యం వహించింది ఆ స్నేహం రసికతకు తార్కాణం అనే ఆమోద ముద్ర పడింది ఆనాటి జనుల అభిరుచి యక్షగానాల, శృంగార పదాల ఇతర ప్రక్రియల ద్వారా అభివ్యక్త మయింది వ్యంగ్యం కంటె వాచ్యం సంప్రీతికరమైంది

ఆ అభిరతి తంజావూరు నుంచి మధురకు పాకింది నాయక రాజ రసికులు విశాల రచిన శృంగార వీధులు, మరింత విస్తరించి, మధురలో తమ తృతీయ పురుషార్థ మాధుర్యంతో ఉన్న హద్దులను గూడా మించి వేశాయి

స్వీయా శృంగారం కంటె పరకీయా శృంగారం మధురతరం అనే ఇచ్ఛా విలాసం స్త్రీ డి శశాంక విజయాది కావ్యాలు పుట్టాయి వాటికి బహు రసజ్ఞుల ప్రోద్బలమూ లభించి ఉండాలి లేకపోతే - అట్టి పుస్తకాలు ఆనాడే నశించక వాటికి ప్రతులు వ్రాసుకుని హృద్గతం చేసుకుని పోషించడం, ఇప్పటికీ అవి చెక్కు చెదరకుండా ఉండడం సాధ్యమయ్యే పనికాదు అట్టి రచనలకు కిరీటం వంటిది శశాంక విజయం

క్రీ శ 1704-1731 ప్రాంతంలో మధుర రాజధానిగా పాండ్యదేశం పరిపాలించిన విజయరంగ చొక్కనాథుని మంత్రి వంగల సీనయార్యునకు అంకితంగా - ఐదాశ్వాసాల శశాంక విజయం పుట్టింది కవి శేషం వెంకటపతి అదే ఆస్థానంలో ప్రముఖ స్థానంలో ఉన్న సముఖం వేంకటకృష్ణప్ప అహల్యా సంక్రందనానికి ఇది తోబుట్టువు అయితే అహల్యా కావ్యానికి లేని ప్రాచుర్యం శశాంక కావ్యానికి లభించింది

శశాంకుడంటే చంద్రుడు ఇతని విజయం ప్రస్తుత కావ్య వస్తువు చంద్రుడికి ఏ ఘనతవల్ల ఈ విజయం? దేవగురువు బృహస్పతి ఇంట శిష్యుడుగా చేరి పెరిగి పెద్దవాడై గురుపత్నిని కామించి ఆమెను ఇంటి నుంచి లేవదీసుకు పోవడంలోనా లేక తన అధర్మ ప్రవర్తనకు రోసి తనపై దండెత్తిన ఇంద్రాదులను, దిక్పాలురను ఓడించినందుకా? పరమేశ్వరుని సైతం ఎదిరించినందుకా?

ఈ సాధించిన విజయం కావ్య పాఠకులకు ఏ విధంగా ఉపయోగించింది? ఏ మానవతా మూల్యాలను బోధించింది?

గొప్ప కళా సృష్టికి ఆనందమే ప్రథమ ప్రయోజనం కావచ్చు కాని మహాకవి రచన అంతటితో ఆగడం పరమార్థం కాదు అది మానవుని రుచిని ఉన్నత పరచాలి రేఖలో గాని, మాటలో గాని చాపల్యం కాక, కళ ఆధిపత్యం వహించాలి అప్పుడా రచన ఇంద్రియ పరితృప్తికే కాక ఉదాత్త అభిరుచులకు దోహదం చేస్తుంది తాను పుట్టి పెరిగిన సంస్కృతికి దీప్తి తెస్తుంది

ఆ దృష్టితో చూస్తే ఈ కావ్యం ఆ కర్తవ్యాన్ని ఎంతవరకు నెర వేర్చింది? అని ఇప్పుడు ఆలోచించవలసిన విషయం

ఈ కథకు మూలం, భాగవతంలోని చంద్ర వంశ్య రాజుల చరిత్ర ప్రారంభంలోనూ, కాశీఖండంలో బుధలోక ప్రసక్తిలోను, కనబడుతుంది అయితే కాశీఖండ కథకంటె భాగవత కథ చిన్న చిన్న మార్పులతో శశాంక విజయానికి దగ్గర కాని రెంటిలోను వెంకటపతి కావ్యమంత శృంగా రాటోపం కనబడదు 'జరిగిన కథ ఇది, ఈ సాహసం గాని, సంఘటన గాని హర్షణీయం కాదు' అని ధ్వనింప జేస్తాయి

కాశీఖండం ఏమంటుందంటే - గురుని భార్య చంద్రుని కామించడం నిజం! దాన్ని ప్రోత్సహించే చంద్రుడు స్వాయత్తం చేసుకున్నాడు అవినయ నిదానమైన స్వాతంత్ర్యం ఒకటి, రాజుల భుజాహంకార మదం రెండు, అన్ని అవగుణాలకు నిలయమై అదుపు తప్పిన అధికారం మూడు, ఈ మూడు చంద్రుని దుస్సాహసానికి కారణాలయాయి గురుడు ఇంద్రునితో మొర పెట్టుకున్నాడు దిక్పాలకులందరూ దూషించారు

తుదకు యుద్ధం వరకు వచ్చింది ఈశ్వరు మూర్త్యంతరమే కనక చంద్రుడు ఈశ్వరునకు కూడా ఎదురొడ్డి నిలిచాడు శివుడు బ్రహ్మ శిరోనామ కాస్త్రాన్ని సంధించాడు బ్రహ్మ దిగివచ్చి సంధి చేశాడు

"చంద్రునకు బుద్ధి చెప్పి మాత్సర్య ముడిపి
ఆలి నిప్పించె నా యుపాధ్యాయునకును" ౬-223

"అమృతమయుండు గావున సుధాంశునితోడి
సమాగమంబునన్ రమణి కశుద్ధిలే దనుచు
బ్రహ్మ హరీశులు సంఘటింపగా
నమర గురుండు గైకొనియె" కాశీ ౪-224

అని భాగవత నవమ స్కంధంలో ఉన్న కథ ఈ క్రిందిది—

"నారాయణుని బొడ్డు తమ్మిని బ్రహ్మ పుట్టెను బ్రహ్మకు అత్రి, అతని కన్నులలో చంద్రుడు పుట్టెను బ్రహ్మ కోర్కెవల్ల అతడు విప్రుల ఓషధులకు, తారలకు నాథుడైనాడు రాజసూయము చేసినాడు ముల్లోకము లను గెలిచినాడు మూర్ఖుడై గురు భార్యను ఇలుసొచ్చి అపహరించెను గురుడు బతిమాలినను తారను ఈయలేదు దేవ రాక్షసులకు యుద్ధమైనది శుక్రుడు రాక్షసులతో కలిసి చంద్రుని పక్షమైనాడు శివుడు బృహస్పతి పక్షము వహించెను బృహస్పతి తండ్రి అంగిరసుడు చెప్పగా బ్రహ్మవచ్చి, చంద్రుని తిట్టి, తారను విప్పించెను

తార గర్భవతి, బంగరు వన్నెగల ఒక కొడుకును గన్నది గురు చంద్రులకు పుత్రుని విషయమై జగడ మయ్యెను కొడుకు, నా తండ్రి ఎవరాని అడుగగా తార ఊన్నరాలై ఊరకుండెను బ్రహ్మ నిజము చెప్పించి కుమారుని చంద్రునకు ఇప్పించెను

ఈ కథకు వేరొకచోట గూడ మూలము ఉంటే ఉండవచ్చును లోకంలో జరుగుతున్న దుష్కార్య సత్కార్యాలకు ప్రతిబింబంగా పురాణాల్లో చరిత్రకు ప్రయోజకములైన ఇట్లాంటి కథలుండడం అనివార్యం కాని ఇట్టి కథలనే కావ్య వస్తువులుగా స్వీకరించి శాఖోపశాఖలుగా వర్ణించి ప్రజలను ఇంద్రియోద్రిక్తులను చేయడంలోని ప్రయోజనం ఏమిటి ? తాత్కాలిక జనప్రీతి కోసం తాపత్రయమా ? లేక కృతి ఇమ్మని కోరిన పోషకుని తృప్తిపరచి స్వార్థాన్ని సమృద్ధిగా పండించుకోడానికా ? లేక పత్కాలీన భోగాభిరతిని బట్టి తన అభిరుచిని గూడా అట్లాగే దిద్ది తీర్చుకోవడం వల్లనా ? ఏదో బల వత్కారణంవల్ల వెంకటపతి ఈదారి పట్టి ఉండాలి !

వేంకటపతి ఇంచుకంచుక మార్పులుచేసి ఈ కథను ఐదాశ్వాసా ప్రబంధంగా పెంచాడు

అత్రి తపస్సు చేయగా భార్య అనసూయ గర్భవతియై త్రిమూర్తుల అనుగ్రహంవల్ల వరసగా దత్తాత్రేయ దుర్వాస, చంద్రులను కన్నది

బ్రహ్మ స్వాంశ సంభూతుడైన చంద్రుడికి గాండీవధనువు అక్షయ తూణీరం, అభేద్య కవచం, దివ్యరథం, వరంగా అనుగ్రహించాడు ప్రయాగ దగ్గర ప్రతిష్ఠా పురం ఏర్పరచాడు

అత్రి చంద్రుని విద్యోపదేశంకోసం బృహస్పతికి ఒప్పగించాడు ఆయన సర్వ విద్యలూ నేర్పాడు చంద్రుడికి యౌవనం వచ్చింది అందమైన మగవారిలో చంద్రుడొక సుప్రసిద్ధుడు ఆ అందం యౌవనంతో మరీ ఆకర్షక మయింది సురగురుని భార్య కళ్లు అతని మీద పడ్డాయి చంద్రుడి మనస్సూ ఊరుకోలేదు

ఇంద్రయాగ సందర్భంలో గురుడు ఇల్లు విడిచి వెళ్లాడు ఇద్దరి కామనకూ మంచి అవకాశం దొరికింది లాంఛన ప్రాయంగా చంద్రుడు లటపటాయించినా అతనికి తారాకర్షణ తక్కువ స్థాయిలో లేదు

తార తెగింపు తార స్థాయికి చేరింది బృహస్పతి పుణ్యాశ్రమం పుష్ప బాణ విలాసం అయింది

గురుడు తిరిగి వచ్చాడు వారి కామవర్తనం గుర్తించాడు భార్యను నిరసించాడు చంద్రుని చల్లగానే ఇల్లు వెడల నడిపాడు

తారా చంద్రుల విరహం మిన్ను ముట్టింది ఒక జోగురాలు దూతిగా పనిచేసి తారా చంద్రుల పునస్సమాగమం ఏర్పాటు చేసింది చంద్రుడువచ్చి తారను ఇంటినుండి తరలించి ప్రయాగ యందలి నిజ ప్రతిష్ఠాన పురమునకు తీసుకొని పోయినాడు

గురుడు ఇంద్రునికి చెప్పగా ఇంద్రుడు చంద్రునకు రాయబారి మంపి నాడు అది నిష్ఫల మయినది యుద్ధము సిద్ధమైనది నారదుడు శుక్రుని ప్రోత్సహించగా అతడు రక్కసులను చంద్రు పక్షము చేసినాడు

చంద్రుడు దేవతలను స్తబ్ధులను చేయగా ఈశ్వరుడు చంద్రునిపై దాడి చేసినాడు చంద్రుడు వెరవలేదు బ్రహ్మ ఈశ్వరుని ప్రార్థించి తారను గురునకు ఇప్పించి అమృత స్పర్శవలన అశుద్ధి లేదని చెప్పగా గురుడు స్వీకరించెను

తారాం నవమాసములు నిండి ఒక పుత్రని కన్నది చంద్రుడు వచ్చి పుత్రోత్సవము చేసినాడు ఆ పుత్రుడు ఎవని బిడ్డనో తేలక మరల కలహము ఉత్పన్నించినది బ్రహ్మదేవుని జోక్యముతో అతడు చంద్రపుత్రుడే అని తేలినది వానిపేరు బుధుడు అతడు 'సద్గ్రహ ప్రభుత్వం' తో విల ల్లుతాడని వరమిచ్చి బ్రహ్మ వెడలిపోయినాడు

"బ్రహ్మహత్యా సురాపానం
స్తేయం గుర్వంగనాగమః
మహాంతి పాతకా న్యాహుః
తత్సంసర్గశ్చ పంచమః॥" మను ౧౧-54

పంచమహాపాతకాలలో ఒకటైన గురుపత్నీ సమాగమం కావ్యవస్తువైన సందర్భం వేరొకటి కనిపించదు విజ్ఞులకు ముందీ విషయం ఆశ్చర్యం గొల్పుతుంది

ఇక్కడ ఖగోళ సంబంధమైన శాస్త్ర హాస్యం ఏదైనా ఉన్నదా ? అనే సందేహం కలుగుతుంది

'నక్షత్రేశః క్షపాకరః' అని నిఘంటువు దీనినిబట్టి తారలన్నింటికీ చంద్రుడే భర్త ఆ లెక్కలో తారను చంద్రుడు కూడడం అసహజంకాదు లన కుమార్తెలైన 27 గురుతారలను దక్షుడు చంద్రునికిచ్చి పెండ్లిచేశాడు కాని గురుని భార్యయైన ఈ తార దక్షకుమార్తె అవునోకాదో తెలియదు కాని దక్షునికి 60 మంది నక్షత్ర కుమార్తెలున్నట్టు కాశీఖండం చెబుతుంది అయితే ఈమె ఎవరు ? 'చంద్రుడు తారమోహం చూచి ఇంతిరో । పాలవంటి కులమీవు జనించినచోట . ' అంటాడు ఆ పాలవంటి కులమేదో తెలియదు చంద్రుడికి తారయందు పుట్టిన బుధుడు సద్గ్రహమై పెలసిల్లుతాడని బ్రహ్మవరం సూర్యచంద్రులు ప్రధాన గ్రహాలు తర్వాత చంద్రపుత్రుడైన బుధుడు కూడా ఉత్తమ గ్రహమైనాడు ఇతని వంశంలోనే పురూరవ యయాతి దుష్యంతాదులు జన్మించారు భారతంలోని మహాపురుషులంతా ఈ వంశంలోని వారే అట్టి ఉదాత్త వంశమూలంలో ఒక మహాపాతక కళంకం ఉందని ఊహించడం దుర్భరంగా కనపడుతుంది బృహస్పతి కూడా నవగ్రహాలలోను ఒకడు అంతకన్న విశిష్టుడుకాడు అట్టివానికి తార భార్యకావడం, ఆమె

సహజంగా చంద్రుని చేరడం వేరొక విశిష్ట గ్రహానికి జన్మ నివ్వడంలో ఏదో సాంకేతిక రహస్యం ఇమిడి ఉందని తోస్తుంది. ఇది ఖగోళ శాస్త్రజ్ఞులు పరిశోధించి సప్రమాణంగా తేల్చవలసిన విషయం. సామాన్య చక్షువులకు గోచరించేది కాదు.

ఋగ్వేదం అష్టమ మండలంలో సోమప్రసక్తి ఉంది. సోమం ఉత్సాహ సగిచే ఒక రసాయనమైనా, దానిని ఒక దేవతగా భావించి స్తుతించారు. ఆ దేవుడికి 'ఇందు' అనే పర్యాయపదం వాడడం కూడా ఉంది.

వృత్ర సంహారంలో ఇంద్రుణ్ణి ఉత్తేజపరిచినవాడు సోముడు. ఇంద్రుని శక్తులన్నీ ఇతనికి ఉన్నట్లు ఆరోపితమైనాయి. సోముడు యుద్ధంలో తిరుగులేని విజేత అని కీర్తించబడ్డాడు. ఈ కథాసూచన అందులో మచ్చుకైనా లేదు. ఈ కథ పురాణాల్లోనే పుట్టి [illegible] అపూర్వమైన ఇతని పరాక్రమం ఇంద్ర సమానత్వం, పురాణకథకు ఉపకరించింది. బ్రాహ్మణాల దగ్గరకు వచ్చేసరికి సోమ, చంద్రులకు అభేదత్వం స్థిరపడింది.

అతని ప్రకాశకత్వంవల్ల, శక్తివల్ల ద్యులోకానికే కాదు సర్వలోకానికీ అతడు రాజు అనిపించుకున్నాడు.

అట్టి రాజునకు తీరని కళంకంగా గురుపత్నీ కథ ప్రచారమయింది పురాణాల్లో. అది చరిత్ర గమనంలో ఒక కథ. దానిమీద ఆసక్తి కలిగేటట్టు వారు వ్రాయలేదు.

శేషము వేంకటపతి 'శృంగారభంగ తరంగితంబగు ఒక్క ప్రబంధంబు రచింపదలచి' ఈ కథను కావ్యవస్తువుగా ఎన్నుకొన్నాడు. తన కృతికర్త అయిన సీనయార్యుణ్ణి చంద్రుడుగా చమత్కరించాడు. అది అతని రసికతకు నిదర్శనం కాబోలు!

కృతికర్త కవిని 'కృతి పరంపరలన్ రచియించి'నావు అని కీర్తించినా ఆకృతులేవీ ఇప్పుడు కనిపించవు. ఒక 'శశాంక విజయమే' మిగిలింది.

సీనయార్యుడు 'శుభావహాము శశాంక విజయమనెడు ప్రబంధం, బావిష్కృత శృంగారరసం గావింపుము రసిక హృదయ కౌతుక మొసఁగన్' అన్నాడు కవితో —

కవి ప్రథమాశ్వాసాంత పద్యంలో 'అలంకారిక సమ్మతోజ్జ్వల కవితా గాథ !' అని తనివితీరా కృతిపతిని సంబోధించాడు కాని ఈ కథ అలంకారిక సమ్మతంకాదు ! 'నాన్యోఢాంగిరసే క్వచిత్' దశ ౨ 20 పరకీయను నాయికను చెయ్యడం ఆలంకారిక సమ్మతం కాదు కన్యక అయిన యువతినే నాయికగా స్వీకరించడం సంప్రదాయం

ఇక్కడ పరకీయ నాయిక, దీనివల్ల రసిక హృదయ కౌతుకం 'ఎసగితే' 'ఎసగవచ్చు' గాని ప్రాజ్ఞలోకం హర్షిస్తుందని తోచదు

వరూధిని తెగువకు అర్థముంది, ఆమె స్వైరిణి, నిత్యకన్య, ప్రవరుని వరించింది అతడు ఆమె వాదాన్ని తిప్పికొట్టి తప్పించుకున్నాడు ప్రవర క్రమలో ఇంకొకణ్ణి కూడింది ఆమె హృదయం నిష్కళంకం

అస, విన రాని గురుపత్ని సమాగమ ప్రసక్తి భారతం ఉత్తంకకథలో వస్తుంది అతడు ఆ అకృత్యం తిరస్కరించి గురుప్రసాదం పొందాడు

ఎంత సౌందర్యవతులు వలచి వచ్చినా అర్జునుడు కచుడు, ఇత్యాదులు తో . ఎ్చ ధర్మానికి నిలబడ్డారు ప్రవరుని భోగవైముఖ్యం, అర్జునుని ధర్మ నిష్ఠ, కచుని గురుతరదీక్షా, తరతరాలకు అవి [illegible] లయాయి

ఈ కావ్యంలో పురాణకథ పట్టుముసుగులో పరకీయా శృంగారం పగవళ్ళు తొక్కింది

కథాపరంగా కళాపరంగా కూడా ఇది ఉన్నత స్థితికి చేరిందని చెప్పలేము.

చంద్రుని పుట్టుకే ఒక స్థిర రూపంలో లేదు

కాశీఖండంలో 'అత్రితపః ప్రభావంవల్ల అతని తేజస్సు కళ్ళకు ఎగదట్టి అది వీర్యరూపంగా ప్రవహిస్తే - దిక్కులు దానివల్ల గర్భం ధరించి ఒకొక్క తేజోరూపాన్ని కంటే - అవి అన్నీ ఏకమై చంద్రుడైనాయి ' అని ఉంది

సముద్ర మథన వేళలో పాల్కడలి నుంచి చంద్రుడు పుట్టినట్టు భారతం ఆదిపర్వంవల్ల తెలుస్తుంది ఆది ఆస్తీక 18-34

భాగవతాన్ని బట్టి అత్రికంటి నుంచే పుట్టినట్టు చూస్తాం కాని శశాంకవిజయంలో అత్రి భార్యకే చంద్రుడు జనించినట్టుంగి చిత్రమేమిటంటే-

ఈ కవే 3-11 పద్యంలో 'సుధావారాశి తొల్పుట్టికిన్' అని తాను ఎత్తుకున్న కథనే తాను మరచి వ్రాశాడు

బ్రహ్మ నిర్మించి యిచ్చిన అవ పట్టణం ఉండగా ఇతడు విరహంతో ఎక్కడెక్కడో తిరగటం ఎందుకో తెలియదు

గురుడు, తారతో తనతో ప్రస్తావించే నివాసస్థా - 'నట, విట, వార వధూటీ వాటలీ, సంవృతము స్వర్గ పట్టనము' అంటాడు ఇది నిజమా ? త్రిలోకాధిపతి ఇంద్రుని గురుభార్యకే అక్కడ రక్షణలేదా ? స్వర్గ గౌరవమింతేనా ? లేక ఇది వేంకటపతికి పరిచితమైన ఒక ఆంధ్రనగరపు స్థితియా ?

దివ్యదృష్టితో ఇంత జరిగిన కథ అంతా చూచి భార్యపై మండిపడిన గురువు, చంద్రుని ఏమీ అనక ఏల చల్లగా సాగనంపెనో ?

కథానిర్మాణంలో తారాచంద్రుల విశృంఖల విహారం మీద కనబరిచినంత శ్రద్ధ తక్కిన విషయాలమీద ప్రసరించలేదేమో అనిపిస్తుంది

శౌనకాది మహామునులు సూతుణ్ణి 'సద్విజరాజికిని శ్రీ విలసిల్లు చంద్రకథ వినఁగోరువారలై' అడిగారట 'మునులు వడిగ తెలుసుకోదగినంత' 'ఊర్జిత శ్రీ' తో ఈ కథాకథనం జరిగిందా ? అని సందేహం నాలుగు మహాపాతకాలు చెప్పి, అయిదో పాతకం అట్టివారితో సంబంధం పెట్టుకున్న వాడని మనువు చెప్పాడు అట్టి కథను వినదలచినవారు కూడా అందులో చేరరా ?

ఈ ప్రశ్నలకు కావ్యాన్నిబట్టి సరియైన సమాధానంరాదు శౌనకాదులడగడం సూతుడు ఏ కథ అయినా చెప్పడం లాంఛనం మాత్రమే తర్వాత తన కిష్టంవచ్చిన వస్తువును కవి గుదిగుచ్చి చెప్పడం మామూలు దానిలోని ఔచిత్యానౌచిత్యాలతో వారికి సంబంధంలేదు

కావ్యాంతంలో 'అతి పుణ్య దాయకంబు విను జనంబులకు శశాంక విజయమనిన' ౫-166 అని వారు నిర్లిప్తంగా అనగలరు

కళాత్మకంగా చూచినా - ఇందులో నిండుదనం కనిపించదు చతుర్థాశ్వాసం ప్రారంభంలో 'గురుడు . ఆశ్రమంబునకు వచ్చె వియచ్చర కోటి గొల్వగన్' ౪-3 అన్నట్టు - అక్కడ ఆశ్రమ లక్షణాలేమీ లేవు దేవ

గురువు, ఋషివంటివాడు అట్టి ఆనివాసం, పరిసరాలు ఎలా ఉండాలో ఎలా ఉంటాయో కవి ఊహించినట్టు కనపడదు ద్వితీయ తృతీయాశ్వాసాల కథ చూస్తే భోగమహితమైన ఒక వేశ్యాగృహం జ్ఞాపకం వస్తుందిగాని, పవిత్రమైన మున్యాశ్రమం స్ఫురించదు తారాచంద్ర పాత్రల సృష్టిలో కూడా విట, విటీద్వయం దర్శనమిస్తారుగాని, ఇంద్రియ చాంచల్యానికి లొంగిపోయినా-సంస్కారవంతుడైన ఒక యువకుడుగాని, సంప్రదాయ గంధంగల ఒక గృహిణిగాని పొడగట్టరు ఇది కవి తప్పుకాదు ఆనాటి కామకళా విలాసం అతని కంటియెదుట జరిగే స్వేచ్ఛావిహారం పురాణకథా కాలాన్ని ఊహించ నివ్వలేదు

వెంకటపతి చంద్రునిచేత చెప్పించిన నీతి వచనాలలో లోక సంగ్రహానికి అవలంబించిన గడుసుదనమేగాని చిత్తశుద్ధితో కూడిన దీక్ష కనిపించదు అంత నీతిపరుడే అయితే చంద్రుడు అంతకుముందు తారసౌందర్యం చూచి పలికిన 28 పద్యాల వెనక ఉండే భావం సమన్వితంకాదు దానిలో శృంగార లాలస భోగసుముఖత, పొంచి ఉండడం స్పష్టం

'తనియ నీ యింతి గూడిన యనువు యనువు' ౨-94

' తియ్యమోవి సుధ లింపులు గుల్కెడు దీనిగ్రోలకే
యెక్కడి సౌమనస్యము హరీ ! యిది నీ కృపలేక కల్గునే' ౩-42

అన్నమాటే చంద్రుని నిజమైన హృదయం
తక్కిన ధర్మపన్నాలు లోకాన్ని వంచించే బండి యన్నాలు !

ఇక తార తెగింపు, నిర్లజ్జ, అనితర సాధ్యం

'కానీరా ! యిటువంటి నీతము లనేకంబు ల్మినుంబోలె
విన్నా నేమన్ ' అని ప్రారంభించి ఆమె చేసిన కామో
పన్యాసం వేశ్యలను గూడా తలదన్ని నట్టిది

'ఎంచగిరాని మోహమున నేనిటు పిన్నట నాటనుండియున్ బెంచితి బెద్ద జేసితిని, బేర్మిని బ్రాయము వచ్చినంతనే యెంచక మాటలాడె, దిపు డిన్ని ప్రియోక్తులకిమ్ము పుట్టెగా - మంచిది నిన్నుగూడుటకె మాకు స్వతంత్రతము లేకపోయెనే ?' ౩-74

ఏ స్త్రీ అయినా ఏ పిల్లవానినైనా పెంచి పెద్దచేయడం అతనితో - అవసరమైతే - కూడడానికేనా ? ఏ తల్లి అయినా ఏ కుమారునితోనైనా ఈ

మాట అనవలసినదేనా ? ఈ మాటతో ఈ జాతి, సంస్కృతి, ప్రతిష్ఠ, ఎంత మట్టిపాలయిందో తారకుగాని, ఆమెను సృష్టించిన కవికిగాని పట్టలేదు ఆమె మరపురాని సూక్తులలో కొన్ని—

1 ‘ కొంద ఱబలుల్ సతులన్ దనియింపలేక తాటాకు లోన వ్రాసిరి పరాంగన గూడిన పాపమంచు ’ ३-82

2 ‘ఒల్లను శీల మామగని నొల్లను ’ ३-85

3 ‘ఎన్ని పూవులన్ వ్రాలదు తేటి ?’ ३-86

4 ‘అకటా మగనాలయి పుట్టఁజెల్లునే ? ४-35

తక్కిన విషయాలలో కవిగా వేంకటపతి ఎన్నదగినవాడే అతడు చంద్రుని పరంగా వ్రాసిన కవిత్వ లక్షణాల్లో చాలవరకు అతని కున్నట్టు నమ్మవచ్చు

“అరసి విశుద్ధశబ్దములు సర్థములున్ ధ్వని వైభవం బలం
కరణము రీతి వృత్తులును గల్పనపాకము శయ్యయున్ రస
స్ఫురణము దోషదూరత యచుంబిత భావము లొప్ప జిత్ర వి
స్తర మధు రాశులీల గవితల్ రచియింపగ నేర్చె సంతటన్”

२-54

1 చిత్ర (గర్భ, బంధాది)
2 విస్తర (వస్తుకవిత)
3 మధుర (చాటువు)
4 ఆశు (వేగోక్తి)

ఇవి నాటి కవితలోని ప్రజ్ఞలు

చంద్రుడికి వీటితో అవసరంకంటె - కవికి వీటియందున్న అవగాహనం స్పష్టమవుతుంది

వేంకటపతి సంస్కృతాంధ్రాల పొంకం బాగా ఎరిగినవాడు ‘శ్రీరంగ పతి పదాంబుజ సారంగచ్చిత్త’ అని సారంగనామధాతువునకు శతృత్వంతంచేసి ‘సారంగత్’ అని వాడడం అతని వైదుష్యానికి నిదర్శనం

వసంత వర్ణనంలో ౨ 12 పద్యంలో పైకము అన్న శబ్దాన్ని పికస మూహార్థంలోనే కాక ధనం అనే అర్థంలోకూడ చమత్కరించడం అతని శబ్ద పరిజ్ఞానాన్ని చెబుతుంది

౨-28 లోని 'కర్నాట కామినీ' అనే సీసము శ్రీనాథుని జ్ఞాపకం చేస్తే, అందులోనే 'వలాలతాజాల' అనే పద్యం తూగు భట్టుమూర్తినీ, 3-40 లోని 'ఎగడంబుల తెగడంబుల' అనే కందం చేమకూరపాకాన్ని స్ఫురింపజేస్తూ అతని పూర్వాంధ్రకవితా గాఢ పరిచయాన్ని చెబుతాయి

'ఆకులపాటు వియోగులకే కాదు ప్రపంచ ధర్మ మెరుగని వృథా నీకంబులరున్ గలిగె' అనే తెలుగు శ్లేష ఈతని ఒక గడుసు పోకడ

'అచుంబిత భావము' ఒక సుగుణంగా పరిగణించిన ఇతడు తన వసంత వర్ణనం, చీకటి దిర్శనం, యుద్ధవర్ణనం చాలావరకు తన ఉపజ్ఞ కోరవడ రచించాడని నిస్సందేహంగా చెప్పవచ్చు

వసంతంలోని ఈ ధారాశుద్ధి దర్శనీయమైనది

"అంత లతాంతకుంజ సదనాంత విహార విలాసవత్త్వవ
క్రాంత వసంతరాగ విసర ద్ద్విగుణీకృత పల్లవోల్లస
త్కాంతి సదారుణోదయ తత ప్రమదాకుల కోక కామినీ
సంతత రుచ్యదంతము వసంతము దోచె వనాంతరంబులన్"

౨-110

ఇతని ... స్ఫురణం ద్వి ... అశ్వాసాలలో శృంగారంగా విజృంభిస్తే పంచమంతో వీరరౌద్రాలు తీసిపోకుండా తమ సౌష్ఠవాన్ని రుజువు చేశాయి

'నగములై క్రూర పన్నగములై' వంటి పద్యాల్లో ఈతని యుద్ధ వర్ణనం దర్శనీయమైనది

శివుడు చంద్రుడితో అన్న ఈ ఉల్లుంఠన వాక్యం ఈ - హ్యాస భరతవాక్యం అనుకోవచ్చు

"అత్రినందన! నీదె గార్హస్థ్యమెన్న
గురువునకు బొమ్మ పెట్టి చేకొంటి కీర్తి

యిట్టి సుతు డొక్కరుడె చాలు నింటికెల్ల
రాజ వీథైన కొదవేమి రాష్ట్రమునకు" ౫-96

౨ రాధికా సాంత్వనం

ఎవరీ రాధ ?

ఈ ప్రశ్నకు సమాధానాలు లెక్కలేనన్ని—

అయినా - ఒక కథ బహుళ ప్రచారం పొంది మన చెవుల్లో స్థిరపడి ఉంది—

'రాధ కృష్ణుడికి మేనత్త ఆమెకు పెండ్లి అయింది అయినా కృష్ణుడి మీద చెప్పలేనంత వ్యామోహం భర్తను పూర్తిగా మరచి కృష్ణునిలో తాదాత్మ్యం చెంది బృందావనంలో క్రీడించింది ఆ విధంగా రాధామాధవులు విడరాని జంటగా ప్రసిద్ధులయారు

ఈ కథనే ఆధారం చేసుకుని క్రీ శ 1760 ప్రాంతంలో ముద్దుపళని అనే వేశ్య 'రాధికా సాంత్వనం' అనే పేరిట నాలుగాశ్వాసాల కావ్యం వ్రాసింది

ఆనాడు తంజావూరును పరిపాలించే మహారాష్ట్ర ప్రభువు ప్రతాప సింహుణ్ణి తన విద్యా సౌందర్యాలతో మెప్పించి ఆతనికి ప్రేమపాత్రమై తన శృంగార చాతుర్యాన్ని రసికతను ఒలికించి ఈ కావ్యం రచించింది

దీనికి ఇళాదేవీయం అని ఇంకొక పేరు

ఇళ కృష్ణుని మేనమామ కూతురు అతడికి ఆమెతో సలక్షణంగా పెండ్లి అయింది

చిన్నప్పటినుంచీ వారిద్దరికీ చెప్పలేనంత చనువు రాధ ఇళను చేరదీసి శృంగార రహస్యాలు చెప్పి అందులోని కిటుకులు కీలకాలు మప్పి రంగం సిద్ధం చేస్తుంది ఇళాదేవికి యౌవనం వచ్చింది ఈడేరింది ఆ వేడుక చేసి రాధ స్వయంగా వారికి ఒకటూకస్తుంది వారు ఒండొరుల వలపులో చిక్కి ఆనందం చూరలుగొన్న అల మగలౌతారు కృష్ణుని మేనమామ కుంభకుడు, మేనల్లుణ్ణి కుమారైను తన ఇంటికి తీసుకువెడతాడు

రాధ, కృష్ణుడు చేయిజారిపోయినాడే అని తగని దుఃఖించెంది ఆ విరహంలో తపించిపోతుంది

రాధ రాయబారిగా - ఇళా కృష్ణుల స్థితిని—
ఒక చిలుక చూచి వస్తుంది వారి అనురాగం చెబుతుంది రాధ మరులు మరీ ప్రజ్వలిస్తుంది

తెలుగు ప్రబంధాలకు విహితకృత్యాలయిన మన్మథాది ఉపాలంభనాలు, విరహావేదన, యథావిధిగా నడిచిన మీదట కృష్ణునకు రాధమీద ఆమె చనవు తనువులను తలచికొని తలచికొని దురపిల్లుతాడు తిరిగి రాధవద్దకు వస్తాడు రాధ మండిపడుతుంది సత్యభామ చేసిన మర్యాదే చేస్తుంది సత్యదగ్గర ఆడిన నాటకమే ఇక్కడా ప్రత్యక్షం అవుతుంది బుజ్జగిస్తాడు రాధ కలకదేరి అతని కౌగిలిలో కరిగిపోతుంది

ఇదీ రాధికా సాంత్వనపు సూక్ష్మస్వరూపం

అయితే-ముద్దుపళని ఈ కథను కావ్యవస్తువుగా ఎందుకు స్వీకరించినట్టు ? పుణ్యం పురుషార్థం కోసమే అయితే ఇంతకన్న సౌష్ఠవమైన కథలున్నాయి ఆమె ఉద్దేశం అదికాదు శృంగారం ఉట్టిపడేలా ఒక కావ్యం వ్రాయాలి అది తనకు ముందు వ్రాసిన వారి శృంగారంకంటె పొంగులెత్తాలి అంతకు ముందు శశాంక విజయం, అహల్యా సంక్రందనం రానే వచ్చాయి వాటి కంటె రెండాకులెక్కువ చదివితేనే తన రచనకు సార్థకత వారిద్దరూ పరకీయలను నాయికలుగా గ్రహించి 'కృతార్థు' లైనారు అప్పుడు ఆమె దృష్టి రాధాకృష్ణులమీద పడింది రాధ, విన్నప్రకారం తప్పకుండా పరకీయ, పైగా ప్రౌఢాంగన ఆమె కృష్ణుని యెడల చూపిన శృంగార పాండిత్యం అపారంగా కామ పురుషార్థపరులను అలరిస్తుంది

తానా కామక్రీడలలో ఆరితేరిన భోగినీకులంలో పుట్టింది ఈ కావ్యంలో రాధ చాటుగ తన జాణతనం అంతా చూపవచ్చు అన్ని దోసగులూ ఆ కృష్ణుని భగవల్లీలలలో మునిగిపోతాయి ఎవరైనా అనుచితం అంటే భాగవతంలోని గోపికా కృష్ణలీలలను వేలెత్తి చూపవచ్చు పైగా తాను బాలకృష్ణ భక్తురాలు ఆ ప్రభువు లీలలను ఎలా వర్ణించినా పుణ్యమే — అని తలపోసి ఉంటుంది కాని భాగవతంలోని గోపికలు పరదారలే అయినా-

ఆయన సాంగత్యాన్నే కోరినా - భాగవతంలో తీర్చిన తీర్పు కేవలం అంగ సౌఖ్యానికి చెందినదికాదు వారు కృష్ణుని చేరిన తర్వాత మధురభక్తి పూర్వకమైన ... సమన్వయం ఆ గ్రంథంలోనే దొరుకుతుంది కాని ఈ రాధికా సాంత్వనంలో వట్టి కామక్రీడా భంగిమలు తప్ప వచ్చునేకైనా ఆధ్యాత్మిక వాసన తగలదు రచయిత్రి ఉద్దేశంకూడా పరమార్థ నిర్దేశంకాదు తన్నేలిన ప్రభువు ప్రతాపసింహుడు, తన శృంగార సౌందర్యానికి తన్మయుడు కావాలి అతడు ముందు చేపట్టిన వారికంటె తన ఘనత ఎంతటిదో నిరూపించాలి అతని మనసుకు గిలిగింతలు పెట్టాలి అంతే ఆమె లక్ష్యంగా కనపడుతుంది

ఇద్దరు స్నేహితులుగాని, ఇద్దరు పుణ్యస్త్రీలుగాని ఈ గ్రంథం కలిసి చదవడానికి సిగ్గుపడతారు ప్రథమ, చతుర్థాశ్వాసాలలో కొన్ని పద్యాలు ఉదాహరించడానికే వీలులేనివి కొన్ని ఇప్పటి అభిరుచికి జుగుప్సనూ కలిగిస్తాయి

ఇది నాటి రాజసభలో చదవబడిందా ? సంస్కారవంతులు చేతితో తీసికొని చదివి ఆనందించారా ? ఆంధ్రకవితాపారమ్యానికి ఔనని తల లూపారా ? ప్రతిపాద్య శృంగారం రసధ్వనికోటికి చెందుతుందా ? వాచ్యమై అశ్లీల శ్రేణికి చెందుతుందా ? ఈ ప్రశ్నలు ఆనాడు ఉత్పన్నమైనవో లేవోగాని నేడు తప్పక ఉద్భవిస్తాయి

ఇందులో రాధాకృష్ణులిద్దరే ప్రధాన పాత్రలు, ఇళాదేవి ప్రమేయం కొద్ది మాత్రమే

రాధ 'అన్నువుల మిన్న నందునికిన్న జిన్న' అనడంచేత నందుని చెల్లెలు

'గోముఖ వ్యాఘ్రమై గుదిగొను మాయత్త

సారిది నిందలి గనుగట్టి సున్న పెట్టి
నేను నినుజేర నీవందుదానిగోర
బ్రతుకు బాగాయ ధూర్తగోపాలరాయ !' ౪-81

అనే సీసపద్యంవల్ల మగనాలు అనేమాట స్పష్టం ఈమె అన్నిటికీ తెగించి కృష్ణునిపై మరులుకొన్నది ఈ కృష్ణానురాగం తక్కిన గోపికలవలెకాక

కామ క్రీడా పరాయణంగా చిత్రించబడి తన సౌకుమార్యాన్ని కోలు పోయింది

సుకుమారమైన మనోభావ విశ్లేషణంగాని, పాత్రచిత్రణంగాని కనిపించక, అంగాంగ సంగతితో అధమస్థాయికి చేరింది రాధ, కృష్ణుని చెనకిన విధం ——

"వాతెఱానుచుఁ జెలిగూడువారు లేరో ?
ప్రక్కబాయక సతి నేలువారు లేరో ?
వనిత నైక్యముగొని పొర్లువారు లేరో ?
వారు నీ దారి మెడగట్టుకోరుగాని" —— ౪-80

"అల్లందు కందుకొని నీ
జెల్లింపులఁబడిన మొదలు పెనుబాములకే
యిల్లయితి, నరసిచూడగ
గొల్లనితోఁ బొందు చెలికిఁ గొదవే కొదవల్" ౪-82

ద్వితీయాశ్వాసంలో శ్రీకృష్ణ వర్ణనం కొంత ఉదాత్తంగా ఉన్నా శరీరస్థాయిని మించి హృదయౌన్నత్యస్థాయికి పెరగలేదు అయినా ముద్దుపళని వాక్చాతుర్యం చాల పద్యాలలో కనపడుతుంది

"దానవారాతి [illegible] ధాళధళ్ళ [illegible] ను
బ్రపదరోచులు, పదరుచుల్ పరిఢవిల్లె
నతని యడుగుల నొకటిగా నతిశయిల్లు
జాహ్నవీ, యమునా, సరస్వతుల నంగి" ౨-27

"కోరిన కల్పశాఖయొక కొన్ని ఫలమ్ములనిచ్చు నల్పముల్
కోరక పారనిత్యఫలకోటుల నిచ్చు మురారి బాహువుల్
సారెకు వాని వీనికెటుసాటియనందగు దీటులేమిచే
వారక పోల్తురే కవులు వానికి వీనికిఁ దాఱుమాఱుగన్" ౨-38

పైని పేర్కొన్న విధంగా రాధపాత్ర పెరగవలసినంత గొప్పగా పెరగలేదు

"తొలుతను జీమకుట్టునో కా ? దోమలు కుట్టునో ? యంచు జూచినే
నెలమిగ నెత్తి పెంచి సినునింతటి వానిగఁ జేయుచెల్ల, నీ
చెలియల కొప్పగించి వెరచెందనొ ? కూడి సుఖంబు లందనో
వలనుగఁ దెల్పుమీ వయిన వైనముగాఁగ మురాసురాంతకా !"
౪–77

సరిగ్గా శశాంక విజయంలో తార చంద్రునితో అన్నట్టుంది పసితనం నుంచీ 'ఎలమిగ ఎత్తి పెంచడం' శైశవ ప్రేమకు నిదానం కావాలిగాని, పెంచిన బిడ్డతో రమించాలని కోరడం నైతికంగా చాల హేయమైన ఊహ ఈ ఊహగల పాత్రను ఎంత రమణీయంగా చిత్రించినా దాన్ని ఉత్తమ పాత్రగా భావించలేము

ఇక కృష్ణుడు కూడా ఈ రాధకు తగినట్టు కాముపరతంత్రుడేకాని పురుషోత్తముడుగా కనపడడు చిలుక కృష్ణుని గూర్చి రాధతో ఇట్లా అంటుంది

"పో, సరి పొమ్ము పొమ్మనినఁ బోనసుచున్ మెడఁబట్టి నూకగా
నాసను జూరుపట్టుకొని నట్టులఁ బోక పెనంగి యాడెడిన్"

మెడపట్టికొని గెంటితే చూరుపట్టుకుని వేలాడేస్థితిలో శ్రీకృష్ణుడున్నాడని గేలిచేస్తుంది

ఆ కృష్ణుడు కూడా రాధను బతిమాలుకుంటూ—

"అందెనై తేగదా అరవిందముఖి నిన్ను
జేరి నీ పదసేవఁ జేయుచుందు
అహహ ! వితగాగమీన కూర్మాదిరూప
ములను దాల్చితి వెర్రినై ముద్దుగుమ్మ"   ౪–59

రాధను భక్తితో సేవించే విధంమాని ఎత్తిన అవతారాలన్నీ ఎంత వ్యర్థం అనే హీనస్థితికి దిగజారుతాడు

'మరుదివాణము నంటెద సమ్మతింపవే' అని ఒక నీచవిటుడు వెలయాలితో అన్నట్టు అసభ్యంగా మాట్లాడడానికి కూడా వెరవడు

ప్రథమాశ్వాసంలో వస్తు నిర్దేశంచేస్తూ - పాలు పిదుకుతూ పెరుగు చిలుకుతూ, ఆలమేపుతూ, ముగ్ధమోహనంగా ఉండే ప్రేపల్లెవాడను

"ఏవంర్(జూచిర ఏణీ విలోచనా
రతికూజి తార్భటీ రావచయము
అంగభవమల్లరంగమై రంగుమీరు
బహుతర స్త్రీలతోడ వ్రేపల్లెవాడ' ౧-౯

అని ఒక సానివాడలా వర్ణించడం ముద్దుపళనికే చెల్లింది

ఇంకొక చిత్రమేమిటంటే - ఏ శుద్ధకాముకి రథలనో తీసుకుని, వాటికి పుణ్యపు పూత పూయడానికి ఒక మునిపుంగవుడు, వేరొక వ్రాయ్యశీలికో, మునీశ్వరులకో ఈ 'పవిత్రకథ' చెబుతూన్నట్టు ప్రారంభించడం ఆ తరంవారి ఆత్మవంచన

"జనకక్ష్మావరుడు, శుక యోగీంద్రున్ భావించి చూచి భక్తి సంభ్రమ పరుడై 'రాధ గోపాలదేవుపై నేలకోపించె ? దేవకీసూను డానారి తీరు దీఱ(దీరుగానేల ? నవియింపు దీఱునటుల నానతీవయ్య బహుసావధానమతిని, విని కృతార్థుడ నయ్యెద విమల హృదయ !" అని జనకమహారాజు అంతటి ఆధ్యాత్మికపరుడు నిరంతర బ్రహ్మచారి అయిన శుకయోగి నడిగితే 'శుక యోగీంద్రుడు వనజాక్షుని దివ్యపాద వనరుహాయుగళిన్ దనివార(దల(చి' ఈ పరమ 'పవిత్ర' కథను 'రతికూజితార్భటీ రావచయము' తో కూడిన వ్రేపల్లెవాడ వర్ణనంతో ఉపక్రమించి చెబుతాడు ఆ చెప్పడం సామాన్యంగా కాదు 'చొక్కటపు(జీనిచక్కెర యుక్కళలకు' లెక్కయై మించునుడిచవు తెక్క' పలుకుతాడట ! ఆ చక్కెర పలుకులివి——

'అపుడు చెలంగి పొంగి యిళ హోమికతో విడివడ్డరైకతో
విపుల తర స్తనాగ్రముల వెన్నుని ఱొమ్మున(గ్రుమ్మి నెమ్మితోన్'
'ఏదో' వేడుకొన్నది !

ఆనాటి రసికత స్త్రీ లౌల్యం అట్టివని భావిస్తే ఈ కవయిత్రిని తప్పు పట్టవలసిన అవసరం లేదు అప్పటి అభిరుచిని పూర్తిగా సొమ్ము చేసుకో దలచిన ముద్దుపళనికి ఈ రచన అసహజంకాదు అయితే - ఈమె రచనాశక్తి తీసివేయదగ్గదికాదు. ధారాళమైన పద్య రచనతో, బొమ్మకట్టినట్టు చేసే వర్ణనలతో నుడికారపు సొంపుతో తనదైన ఒక శైలి నిర్మించుకున్నది

విద్వజ్జన ముఖంగా తన చాతురిని చెప్పుకొన్న విధంలో కొంత సత్యం లేకపోలేదు

'ఘటియింపనేర్తువు కవనజాతు తెఱంగి
పలుకుల కల్కి వెల్వెలుకఁ బాఱ

నీదె మతియుక్తి, పరికింప నీదెశక్తి
నీదెనెఱపద్దు నరయగా నీదెముద్దు
సరసముగఁ జేసి రాధికా సాంత్వనమ్ము
భక్తి హారికమ్ము శ్రీ ముద్దుపళని బోటి!' ౧-36

రాధ ఇళపై ఒలకబోసిన ఈసులో ముద్దుపళని తానెదాగి ఉన్నట్టని పిస్తుంది

'ఆశుకవిత్వంబు నల్లితేనే సరా?
చిత్రప్రబంధముల్ చేయవలదె?
గోటిచేతను వీణమీటితేనే సరా?
కొంచకరాల్ గరగించవలదె?
పదపడి రాగముల్ పాడితేనే సరా?
హితవొప్ప వర్ణంబులెత్తవలదె?
అలనాట్య భేదమ్ము లాడితేనే సరా?
నవరసంబులనంటి నడువవలదె?
వింత వింతగఁ గలసిన యంతసరియె?
యెమ్మెకాని మనోభావ మెఱుఁగవలదె?
యేమి నేరని నిన్నటి యింతమొటికె
నన్ను విడనాడ గోరెనా చిన్నిచిలుక' ౩-14

ఆత్మానుభావాలు కొన్ని ఈ రచనకు రచయిత్రిని ప్రోత్సహించి ఉండాలి

ఈమెకు పూర్వాంధ్ర కవుల కవితతో మంచి పరిచయం ఉన్నట్టు ఇందులోని చాలా పద్యాలు చెబుతాయి 3-5 లో విజయ విలాసం, 3-6, 3-61 పద్యాల్లో పారిజాతాపహరణం, 3-77, 3-87 లో వసుచరిత్ర, 3-24 లో ధూర్జటి 3-21 లో తిక్కనార్యుడు ప్రతిఫలిస్తారు

ముద్దుపళని కామకేళిని వర్ణించడంలో ఎంత స్వతంత్రురాలో, తన నాటి వ్యావహారికాంధ్రాన్ని ప్రయోగించడంలోను అంత స్వేచ్ఛా పరురాలు

'ఇయ్యా, పలుకంబోయ్యేవు, ఐతే, నొచ్చీని, సమ్మందం,

బహునాళ్ళు దొరా దొంలు, ఆడుదాము అయ్యాని,'

ఆనాటి జాతిని, వార్తను ప్రయోగించడంలో చెప్పదగిన జాణ

1 కప్పు రెయెలుంగు చిల్వ,
2 వెన్నుకుఁ బండ్లువచ్చు
3 అల్లునకుఁ గల్మి వచ్చిన నర్ధరాత్రి
గొడుగుఁ దెమ్మన్న కతగాను
4 కొన్నంగడిలోనే అన్నన్నా, మారుబేరమగునే ?
5 అత్తమీద చేతులంగడిలో కన్నులు
6 పేగులోని తీట వితమాయె

ఇత్యాదులెన్నో కనపడతాయి

తెలుగు కవిత్వపు తొలినాటి విలువలు, మర్యాద, మప్పితం, ఎంత దిగజారినా ఈనాటికీ ఒక తరహా పాఠకులను అలరించే కావ్యం రాధికా సాంత్వనం అని చెప్పవచ్చు

అయితే - ఒకమాట——

ముద్దుపళని చేతిలో శృంగార నాయికగా స్వైరిణిగామారి విజ్ఞులదృష్టిలో చులకనైన రాధాదేవి అసలు తత్త్వం ఏమిటి ? ఈ రాధ ఆంధ్ర సాహిత్యం లోకి ఎప్పుడు ప్రవేశించింది ? అనే జిజ్ఞాసువుల ప్రశ్నలు అట్లాగే నిలిచి ఉన్నాయి

భారత భాగవతాల్లో ఈ రాధలేదు బ్రహ్మవైవర్తంలోను, దేవీ భాగవతంలోను ఉన్న రాధాదేవి పురాణయుగంలో తెలుగులోకి రాలేదు మొట్టమొదట రాధాకృష్ణుల ప్రణయాన్ని తన భీమఖండంలో స్మరించినవాడు శ్రీనాథుడు భీమ అవతారిక ౧ ౨

గజపతులు తెలుగుదేశాన్ని పాలించిన కాలంలో గోదావరీ తీరానికి వచ్చి తన మధురభక్తితో లోకులను పవిత్రులను చేసిన చైతన్య ప్రభువు ప్రభావం కావ్య రచనలకు సోకినట్టు కనిపించదు

గజపతులు జగన్నాథ భక్తులు వీరి హయాంలోనే గౌడకవి జయదేవుని గీత గోవింద ప్రచారం తెలుగుగడ్డలో ముమ్మరంగా సాగి దాని మాధుర్యం ఎక్కువ ఆకర్షించి ఉంటుంది గీతగోవింద రచనకు ప్రేరణం మధురభక్తియే మధురభక్తి తత్త్వం ఇది

లోకంలో జీవులంతా స్త్రీలే వారు గాఢానురాగంతో, తమ సర్వస్వం భగవదర్పణం చేయడం పరమ పురుషుడైన భగవంతునితో ఐక్యం కోరడం పరమార్థం గీతగోవిందంలో రాధాకృష్ణుల ప్రణయ విహారం ఉత్కట శృంగారానికి చెందినా - దాని సందేశం పరమాత్మతో ఐక్యం భజించడమే అని ఆ గ్రంథం పూర్వోత్తరాలను, కవి హృదయాన్నీ, నిశితంగా చూస్తే వెల్లడి అవుతుంది పరమార్థం మాట అలా ఉంచి – అందలి శృంగార మాధుర్యాన్నే చవిచూచిన తెలుగు కవులు దానికే ప్రాధాన్యం ఇచ్చారు ఈ భావమే శ్రీనాథపద్యం చదివినప్పుడు కల్గుతుంది

ఆ తర్వాత రాధాకృష్ణ ప్రణయాలతో కావ్యాలు బయలుదేరాయి

రాయలకాలంలో పుట్టిన చింతలపూడి ఎల్లనార్యుని రాధామాధవం అట్టిది ఇందులో రాధ స్వీయ సహస్రగోపుని కుమార్తె స్వయంవరంలో శ్రీకృష్ణుని వరించి భార్య అయింది ఆమె అన్న భద్రుడు ఈ వివాహానికి అంగీకరించకపోయినా అతణ్ణి తిరస్కరించి కృష్ణుడు రాధను చేపట్టాడు ఇది రుక్మిణీ కల్యాణాన్ని పోలిన కథ

పాండురంగ మాహాత్మ్యంలోని రాధా ప్రసక్తి పరమ పవిత్రంగా కనిపిస్తుంది ఆమె, ప్రియుడు శ్రీకృష్ణునికోసం పార్వతివలె ఘోరతపస్సు చేసి ఆతని అనుగ్రహానికి పాత్రురాలైంది ఇట్టి రాధ ఇంకే కావ్యంలోను కనపడదు

తరువాత వెలిదండ్ల వెంకటపతి క్రీ శ 1740 ప్రాంతంలో రాధా మాధవ సంవాదం రచించాడు ఈమెకు తొలుత ఒక పెండ్లి అయినా –

అతనితో సరిపడక ద్వారకకు వెళ్ళి సవతుల్లో కయ్యం పెట్టి దాన్ని తానే సరిదిద్ది రుక్మిణితో సమానంగా తానూ కృష్ణుని భార్య అవుతుంది

అటుపిమ్మట నిశ్చం వెంకటపతి రాధాసమాగమం అనే కావ్యం వ్రాశాడు ఇందులోని రాధనందుని చెల్లెలు పెండ్లి అయింది అయినా భర్తను ప్రేమించలేక రాయబారాలుపంపి కృష్ణుని రప్పించుకుని అతనితో క్రీడించింది

తరువాతది కృష్ణదాస విరచితమైన రాధాకృష్ణ విలాసం దీని గద్యలో గీత గోవింద రసాలంకృతమని ఉండడంచేత ఇది దాన్నే అనుసరించిం దనవచ్చు

అన్నింటికీ పిమ్మట గోపీనాథుని వెంకటకవి తెనిగించిన బ్రహ్మవైవర్త శ్రీకృష్ణ జన్మఖండంలో రాధాతత్త్వం స్పష్టంగా చెప్పినట్లయింది

పిదప దేవీభాగవతపు ఆంధ్రీకరణాలవల్ల తెలుగులకు అచ్చపు రాధా తత్త్వం తెలిసివచ్చింది

రాధ మానవికాదు త్రిమూర్తుల కతీతురాలు సర్వసృష్టి పంచాలిని, సంహారిణి శ్రీకృష్ణునకు ధ్యేయురాలు సుగుగురమ్మల ఘూటపుటమ్మ !

ఇట్టి రాధాదేవి యదార్థతత్త్వం తెలియక - తెలుగు కవుల అందులో ముఖ్యంగా ముద్దుపళని చేతిలో రాధ అధఃప తనం సిద్ధించింది

నవ్యకవులు రాధను ప్రణయ స్వరూపిణిగా ఆరాధ్య స్త్రీమూర్తిగా భావించారు శ్రీరాయప్రోలు విశ్వనాధ కృష్ణశాస్త్రి వేదుల రాధా కృష్ణుల హృదయ మాధుర్యాన్ని అమలిన శృంగార రమ్యంగా చిత్రించారు

పానుగంటి వారి రాధా కృష్ణ నాటకంలో ఆయన రాధాకృష్ణ భక్తిని ఉన్నత సీమలకు ఎత్తి ప్రదర్శించారు

సూర్యరాయాంధ్ర నిఘంటువులో రాధ అంటే అర్థం రాస్తూ - గోలోక మున పరమాత్మకు అర్ధాంగి అయిన శక్తి అన్నారు ఈ దృష్టితో చూస్తే శృంగార కావ్యాలవల్ల రాధ యెడల మన మనస్సుకు అంటిన పంకం కొంత ప్రక్షాళనం కావచ్చు

తెలుగు సాహిత్యంలో తుది మెరుపు

ఉత్తర రామాయణం

తెలుగు సాహిత్యాన్ని ఒక నిర్దిష్టమైన కోణం ఆవరించి నాలుగు శతాబ్దాలకి

ఓజస్సు తేజస్సు కళ్ళపడదు, అనే నిరుత్సాహంతో ఉండగా హఠాత్తుగా ఆనాటి సాహిత్యంలో ఒక మెరుపు మెరిసింది!

కళ్ళు ఆశ్చర్యంతో మిల మిల లాడాయి—

అది కంకంటి పాపరాజు ఉత్తరరామాయణం అయితే - తిక్కనార్యుని ఉత్తరరామాయణం సుమారు 500 ఏండ్లకు ముందే వచ్చింది

- ఇంత కాలం గడిచాక మళ్ళా ఈ నకలు పని ఎందుకు చేసినట్టు ? అనే ప్రశ్న వెంటనే ఉంది దానికి సమాధానాలూ సిద్ధంగా ఉన్నాయి

1) తిక్కన ఉత్తర రామకావ్యం పాపరాజుకు ఆపోవలేదు

2) అది భారం రచన అంత ఉదాత్తం కాకపోయినా - తిక్కన సిద్ధ హస్తం కనపడుతుంది కాని అది మూలానికి సంక్షేపరూపం క్లుప్త రమణీయమైనా - అందులో ఉత్తర కథ పూర్తిగా లేదు కనక అసమగ్రం

3) తర్వాత వర్ధిల్లిన ఆంధ్ర కవితా సమృద్ధి అందులో కనబడదు దాన్ని స్వహస్త కౌశలంతో ఎంత సమృద్ధిగానైనా వ్రాయవచ్చు

4) పాపరాజుకు ఆదర్శం పోతరాజు ఆయన మూల భాగవతాన్ని వేల కొద్దీ పెంచి తెలుగులసొత్తు చేశాడు తానూ మూలాన్ని ఆసరాగా మాత్రమే గ్రహించి ఎందలకొద్దీ పెంచాడు తెలుగు రసికులు మరచిపోలేని ఘట్టాలు తనవిగా వ్రాసి చూపించాడు

'ఉత్తర రామాయణ కావ్యమున్ మృదువచోధారార్ద్ర సందర్భ నిర్భర తత్త్రదసముల్ రహింప రచియింపన్ బూనితిన్ వేడుకన్' పీఠిక 13

"ప్రాజ్ఞులార! నిరసింపన్ బోకుడీ! రాఘవేశ్వరు చారిత్రము నెందఱన్ని గతులన్ వర్ణించినన్ గ్రాలదే" పీ-14

అనే వినయ పూర్వకమైన పాపరాజు ఎంజాయిషీ ఉన్నా - ఆయన హృదయ రహస్యం మొదటి పద్యంలో ఉంది అది 'మృదువచోధారార్ద్ర నిర్భర తత్త్రదసముల్' రహించుట—

'వచోధార' 'నిర్భర' (పూర్ణమైన) అనే మాటలలో ఆతని ఊనిక పూనిక బలంగా కనపడతాయి

తిక్కన సంయమనంలో కుదింపుగొన్న ఆ వచోధారలకు నిర్భర రసాలకు పాపరాజు ద్వారాలు తెరిచాడు

తిక్కన రచన చదివి ఆనందిస్తాం, సందేహంలేదు కాని ఏ ఘట్టమూ మనసుమీద ముద్రకొట్టదు దాని వ్యంగ్యాన్ని విప్పుకొని తృప్తి పడవలసిందే-

పాపరాజు వాచ్యంమీదనే మొగ్గుచూపి చకితులను చేస్తాడు ఉపమాద్యలంకారాలలో వ్యగ్యం అప్రధానమై వాచ్యమే శోభాతిశయం కలిగిస్తుంది కదా !

పోతరాజును తలపెడితే ఆయన 'గజేంద్ర, ప్రహ్లాద, వామన కృష్ణలీలలు ఎదురుగా వచ్చి కూర్చున్నట్లు -పాపరాజును తీయగానే పూర్వార్ధంలో రావణ కైలాస గమనం కార్తవీర్యయుద్ధం, రంభా సంవాదం వగైరా ఉత్తరార్ధంలో - సీతారామ ఉద్యాన విహారం, సీతా వివాసం, కుశలవ జన్మకథ సీత భూప్రవేశం కళ్ళకు కట్టినట్లు 'రసనిర్భరము' లనిపిస్తాయి. అతని హేమంత, వసంత వర్ణనలూ, చంద్రోదయాది వర్ణనలూ ఉపజ్ఞతో రాణిస్తాయి

క్రీ శ 18 శతాబ్ది ఉత్తరభాగంలో నెల్లూరు మండల ప్రళయ కావేరిపట్టణ నివాసియై (పులికాట్ ప్రాంతం) ఒక కార్యాలయానికి ప్రధానోద్యోగి (అమీన్) పదవి నిర్వహించే పాపరాజు ముందు విష్ణుమాయా విలాసం అనే యక్షగానం వ్రాసి తదుపరి ఉత్తర రామాయణ రచనకు ఉపక్రమించినట్టు గ్రంథావతారికను బట్టి తెలుస్తుంది

ఈతనికి ప్రముఖ కవి, నెల్లూరు మండలంలో ఇప్పటి కోవూరు తాలూకా మోడేగుంట వాస్తవ్యుడైన పుష్పగిరి తిమ్మన అనుంగుమిత్రుడు ఎంతటి మిత్రుడంటే - కిరీటికి శౌరితోడైన యట్టు లమ్మహాకవి సాహాయ్యమాచరింప కృతి నొనర్పగ' పూని పాపరాజు ఉత్తర రామాయణ కావ్యం వ్రాశాడు సరిగ్గా నన్నయ నారాయణభట్టులు జ్ఞాపకం వస్తారు అయితే నన్నయ స్థానం పాపరాజుది అయితే రెండవస్థానం తిమ్మకవిది అనేది స్పష్టం కాగా ఏ దురదృష్టం వల్లనో తిమ్మకవే ఉత్తర కావ్యంవ్రాసి పాపరాజు పేరుపెట్టాడని అపప్రథ వచ్చింది ఇది వట్టి అపవాదేగాని నిజంకాదని ఇద్దరి రచనలూ చదివిన వారికి తెలుస్తుంది తిమ్మకవి 'అనేకాంధ్ర కృతి ప్రకల్పన సమర్థుడే' కావచ్చు కాని పాపరాజుభావనాబలం, రసప్రకల్పన చాతురి తిమ్మన కవితలో కనిపించదు

పాపరాజు పెద్ద ఉద్యోగం నిర్వహిస్తూ ఆంతరంగిక అనురాగంతో తిమ్మనను మిత్రుంకు తన తోడ్పాటు అవసరమని భావించి అనేక విధాల సహకరించి ఉండవచ్చు. తిమ్మన ఇతని మిత్రుడేకాదు 'సహశ్రోత'కూడా. అంటే సహాధ్యాయి శ్రోత్రి అంటే శిష్యుడు అనే అర్థంకూడా ఉంది. తిమ్మనార్యుని తండ్రి అప్పనార్యుడు మంచి పండితుడైతే ఆయన వద్దనే ఇద్దరూ శుశ్రూష చేసి ఉండవచ్చు.

తిక్కన పాపరాజులు ఇద్దరూ ఉత్తర రామకథను కావ్యంగా వ్రాసినా వారి లక్ష్యాలు వేరనిపిస్తాయి. తిక్కనార్యుడు తనకు ముందున్న శివకవులు చేసిన విష్ణుదూషణకూ ఛందోభాషా శైథిల్యానికీ విరుగుడుగా రామకథ వ్రాస్తే - పాపరాజు రసనిర్భరమైన ఒక మహాకావ్యంగా వ్రాయదలచినట్టు వారి ఉపక్రమ ఉపసంహారాలవల్ల తెలుస్తుంది.

పాపరాజుకు పూర్వంలో - మత్స్య వరాహ పురాణాలు తెలిగించిన హరిభట్టు ఉన్నాడు. అతడు అమృతప్రాయ వచోవిశేష రచనాఽహంభావ పుంభావ వాగ్రమణీ మూర్తివి' అని కృతిపతిచేత ప్రశంస లందినవాడు. అతని తర్వాత బహుగ్రంథకర్త కూచిమంచి తిమ్మకవి, ఉక్తి చాతురిగల కనుపర్తి అబ్బయ, కథా కథనంలో దిట్ట కొటికలపూడి గోపరాజు, ఉత్కట శృంగారంలో తలమున్కలు కావించిన వేంకటపతి ముద్దుపళనులు లబ్ధప్రతిష్ఠులైనారు.

ఇతని తర్వాత పిండిప్రోలు లక్ష్మణకవి, పాలవేకరి కదిరీపతి వగైరాలు మంచి కవులుగా పేరుకెక్కారు.

ముందూ, వెనకా ఇందరు కవులున్నా 'సమానానాముత్తమ శ్లోకోఽస్తు' అన్నట్టు పాపరాజు ఉత్తర కావ్యం లోకోత్తరంగా పరిణమించింది.

పూర్వోక్తమైన కావ్యాల్లో కొన్ని ఆయా ప్రక్రియా వైవిధ్యంచేత ప్రజాదరణ పొందితే కొన్ని విషయ గౌరవంచేత లోకంలోకి వెళ్ళాయి.

'లోకుల నాటకాలే ఆకులుగా' వెలసిన పాపరాజు ఉత్తరకావ్యం 8 ఆశ్వాసాల మహాప్రబంధం. మూలం 3482 శ్లోకాలు, 111 సర్గలు, ఆ అనుష్టుప్పు శ్లోకాలను తెలుగు పద్యాలుగా మారిస్తే కనీసం 2 శ్లోకాలకు ఒక పద్యం

అనుకున్నా - 1732 పద్యాలకన్న ఎక్కువ కావు దానితో మూలం అంతా తెలుగు పద్యాల్లో తు చ, తప్పకుండా ఇముడుతుంది

అట్టి సందర్భంలో పాపరాజు విజృంభించి ఆ మూలానికి సుమారు మూడు వేల పద్యాలు వ్రాశాడు ఇది తిక్కనగారు ఉగ్గడించిన 'మహాంధ్ర కవిత్వ దీక్షావిధి'

అయితే - ఉత్తర రామాయణం వాల్మీకి ప్రోక్తం అవునా ? కాదా ? అనే పెద్ద మీమాంస ఉంది

వాల్మీకి రామాయణం యుద్ధకాండ 130 సర్గతో ముగుస్తుంది దాని చివర రామ పట్టాభిషేకానంతరం 17 శ్లోకాలలో రామాయణ ఫలశ్రుతి ఉంది ఏ గ్రంథమైనా పరిసమాప్తమైనప్పుడే ఫలశ్రుతి ఉంటుందిగాని ఇంకొక కాండ మిగిలిఉండగా ఉండదు కనుక ఈ ఫలశ్రుతితో రామాయణ కావ్యం వాల్మీకి చేతిలో సమాప్తమైనట్టే భావించవలసి ఉంది అయినప్పుడు తర్వాత వచ్చే ఉత్తరకాండం అన్య కవికృతం కావడం సంభావ్యం ఇంకొక చిత్రం ఏమిటంటే—

ఉత్తరకాండ చివరలోను ఫలశ్రుతి ఉంది ఒకే గ్రంథంలో రెండు ఫలశ్రుతులు సంశయాస్పదము లవుతాయి

వాల్మీకి రామపట్టాభిషేకం వరకు వ్రాసి కుశలవులకు నేర్పితే వారు రాముని అశ్వమేధ వాటికకు వచ్చి పాడారు సబబుగా ఉంది కాని ఉత్తర కాండ కథకూడా ముందే వ్రాసి వారికి బోధిస్తే వారికి సీతారాములెవరో, తెలిసి కావ్యోచ్చారణ దెబ్బతింటుంది గదా !

అంతేకాక పూర్వరామాయణ కవితా సౌందర్యం పాత్రసృష్టి వర్ణన ప్రాగల్భ్యం ఉత్తర రామాయణంలో కనిపించదు పూర్వ రామాయణంలో సుపరిచితులైన, రావణాదుల పూర్వ వృత్తాంతాలతోను, వాలి సుగ్రీవ హనుమదాదుల జన్మవృత్తాలతోను, సీతావివాస, కుశలవ జన్మాదులతోను, నిండి కథామాత్ర ప్రయోజనంగానే ఈ కాండ అంతా ప్రవర్తిల్లుతుంది ముఖ్యంగా దీనిలో వాల్మీకి హస్తకౌశలం మృగ్యం కావడంవల్ల దీనిని అవాల్మీకం అని భావించడం జరిగింది

అయితే - కాళిదాసు, ఆక్కాన కథలమాట అట్లా ఉంచి, సీతాపరిత్యాగ లవణాసురవధ, కుశలవ జన్మాది కథలను, సప్రమాణంగా భావించి, తన రఘువంశంలోను సీతారామ వియోగ సమాగమ కథను, దిఙ్నాగ భవభూతులు తమ నాటకాలలోను ఉపయోగించుకుని వాటిని అజరామరం చేశారు పట్టాభి షేకానంతరం ఆ కథతోగాని రామాయణం సంపూర్ణం కాదని వారు భావించారు

కనుకనే సీతాపరిత్యాగ, కుశలవ జన్మకథ కావ్యజగత్తులో అంతరూఢ మయింది

వాల్మీకి, సీతాచరిత్ర రామాయణం అని ఉగ్గడించినదానికి, ఆమె రఘు వంశాన్ని నిలిపి భూప్రవేశం చెయ్యడం గొప్ప పరిసమాప్తి

ఉత్తరకాండ రచన ఎవరిదైనా ఈ పరిపూర్తికోసం అభిజ్ఞులు దాన్ని ఆమోదించారు

తిక్కనార్యుడు 7 అధిక పారకథలను విడిచి కేవల గ్రంథభాగాన్నే అనుసరిస్తే పాపరాజు ఏమీ విడిచి పెట్టకుండా అంతటినీ రసవంతంగా తెనుగు చేశాడు

పాపరాజు కవితావగాహనం ఎన్నదగినది - 6 శ్వాసంలో అంత ప్రసక్తం కాకపోయినా కల్పించి ఇట్లా అంటాడు

"మృదు పాకంబు రసస్థితి
పదగుంభనగల స్వోక్త పద్య శతంబుల్
చదివి యుపశ్లోకించిరె
మొదలఁ గవుల్ భానువంశ ముఖ్యుని గుణమున్" 6-132

అతని దృష్టిలో 'మృదుపాకము', 'రసస్థితి', 'పదగుంభన', పద్యరచనకు అత్యావశ్యకమైనవి రసానికి తగిన పాకం, దానికి తగిన పదగుంభన తన రచన అంతటా చూపి సమకాలీన కవులలో తాను రాణించాడు

అంతేకాక - సమకాలికులు తీసుకున్న కథయందు కూడా తన అసం తృప్తిని ఇట్లా వ్యక్తం చేశాడు

"మానక కర్మభూమిఁబయి మానుషదేహముతో హితాహిత
జ్ఞానమెఱుంగు బ్రాహ్మణుడు చారు కవిత్వము నేర్చి జానకీ

జాని కథల్ రచింపక యసత్కథ లెన్ని రచించెనేనియున్
వాని వివేకమేమిటికి ? వాని కవిత్వ మహత్త్వ మేటికిన్ ?"
పీఠి-15

'హితాహితజ్ఞాన మెఱుంగువాడు' చారు కవిత్వం నేర్చి రామకథ వంటి ఉత్తమ వస్తువును కావ్యేతివృత్తంగా గ్రహించక కేవల జనప్రీతికోసం 'అసత్ కథలు' స్వీకరిస్తే వాడి వివేకం ఎందుకు ? ఎంత కవితామహిమ ఉన్నా దాని ప్రయోజనం ఏమిటి ?

ఈ మాటలు పరోక్షంగా అహల్యా సంక్రందన, తారాశశాంక, రాధికా సాంత్వనాదులను స్పృశిస్తున్నవని నా అభిప్రాయం అట్టివే చిల్లర కథలు స్వీకరించి జనుల తాత్కాలిక రుచులకు దోహదం చెయ్యడం, స్వప్రయోజనాలను అందుకోవడం, ఉత్తమ కవులు చెయ్యవలసిన పని కాదని పరోక్షంగా పాపరాజు విమర్శించినాడని తోస్తుంది

ఈతని నాటికి రాధ ఆంధ్ర సాహిత్యంలో స్థిరపడింది అయితే ఆమె పూర్వులు కొందరు తలచినట్టు పరకీయ కాదు స్వయంవర లబ్ధ అయిన స్వీయ

కనుకనే తొలి పద్యంలోనే రాధాకృష్ణుల ప్రణయం రమణీయంగా వర్ణించాడు అంతేకాదు కృష్ణుని ఎనమండుగురు పట్టమహిషులతో రాధను తొమ్మిదవ దానినిగా చేర్చి - దక్షిణ నాయకుడైన అతనిచే "నవ్య వకుళంబు రాధ కర్ణమున జెరివించి" నాడు పీఠి 44

ఈతని ఉపాస్యదైవం మదనగోపాలుడు - అతని శృంగార రసికత ఈతని కిష్టం అందువల్లనే శ్లేషమహిమచే తన కావ్యం అతనికెంత ఆహ్లాదమిస్తుందో అభివర్ణించాడు

"వైదర్భీ కల సద్విలాసమును జెల్వంబూన సత్యోక్తి నెం
తేదీపించి, కళిందజోజ్జ్వల రసాప్తిన్ మించి భద్రాలంకారం
బై దీవ్యద్ఘన లక్షణాశ్రయ సమాఖ్యం గాంచు మత్కావ్య మా
హ్లాదం బిచ్చు, గ్రహింపం గృష్ణునకు సర్వాంబేకదా ! యెయ్యెడన్"
పీఠి-43

గొప్ప కవికి వర్ణన చాతుర్యం పదబంధ నైపుణి రసదృష్టి మాత్రమే కాక కథా సాధనంలోని నేర్పు కూడా సంపన్నమైతే అతని రచన సుశోభితం

అవుతుంది పాపరాజు ఉత్తర భాగంలోని ప్రధాన కథను ఎంత విపులంగా విస్మయావహంగా చెప్పాడో, పూర్వభాగంలోని అప్రధాన దీనను కూడా అంత ఒడుపుగా హృద్యంగా చెప్పాడు

మూలంలోని పాత్రలు కథ నడవడానికి తోడ్పడి నిష్క్రమిస్తే ఈని రచనలో మాంసలమైన రూపాలతో, చతుర సంభాషణలతో మనకు ప్రత్యక్ష మవుతారు రసపుష్టికి తోడ్పడతారు అట్టి ఘట్టాలను కొన్ని మచ్చుకు చూడవచ్చు

పూర్వ రామాయణం సుందరకాండలో రావణుడు హానుమంతుణ్ణి చూచి "కిమేష భగవాన్ నందీ భవేత్సాక్షా దిహాగతః ? యేన శప్తో౽స్మి కైలాసే పురా సంచాలితే మయా" 50 2

దీనికి పూర్వకథ ఉత్తరం 16 సర్గలో ఉంది

పౌలస్త్యుని పుష్పకం కైలాసం దగ్గర ఆగిపోయింది ఆ కైలాసం గురించి మూలంలో ఒక శ్లోకం ఉంటే - పాపరాజు అద్భుతమైన 7 పద్యాలతో కైలాస సౌందర్యాన్ని ఉగ్గడించాడు

శూలపాణి అయిన నంది 'ఇక్కడకు రాకూడ' దన్నాడు పౌలస్త్యుడు కహాకహా నవ్వి ఈ ముఖంవాళ్ళేనా నన్నడ్డు పెట్టేది ? అన్నాడు నంది మండి పడి 'ఔను ఈ ముఖం గలవాళ్ళే నీ కులక్షయానికి కారకు లౌతారన్నాడు' అంతే కాదు ఈ పీనుంగుపై నేవుంజూపగ నర్హమౌనె ? 'నీ చేయు పాపంబుచేనా పద్యాబ్ధి మునింగిపోవగల' వన్నాడు ఇంతకూ నంది ముఖం కపిముఖంగా కనపడడంవల్ల ఇంత మూడింది

పౌలస్త్యుని పొగరుకు అంతులేదు శాపం తిని కూడ 'ఏనెక్కిన వెండి కొండ నిదెయేఁ బెకలించి రజంబు జేసెదన్' అని మూర్ఛించి కొండ పెల్లగించాడు ఈ ఇద్దరి సంభాషణ మన ఎదుట జరిగినంత దృశ్యరూపంతో సాగుతుంది

శివుడు పాదాంగుష్ఠంతో నొక్కిపెడితే ఆ రాక్షసుడు వెయ్యేళ్ళు బాధతో అరిస్తే శివుడు నీరావంవల్ల నీవు రావణుడవరా ! అని బిరుదిచ్చి చంద్రహాసం అనుగ్రహించాడు

తర్వాతది రంభా రావణ ఘట్టం ఇది పాపరాజు చేతిలో పాకానపడి ప్రసిద్ధి చెందింది రావణుడు ఉద్ధతుడు అతని చేతిలోపడింది రంభ ఆ ఘట్టం ఒకరిని మించిన ఒకరి ఉక్తి ప్రత్యుక్తికలతో తళతళ లాడింది తిక్కనగారు సూచించి విడ స్తే పాపరాజు శృంగార ఔద్ధత్యాన్నంతా నాటకీయ నైపుణితో మలచాడు

"ఏగదయ్యా, దశకంఠ! వంశగుణ విద్యాశ్రీల బోకార్చు చే
ల గదయ్యా ఇది - తాల్మినన్ విడిచి పెద్దల్ సన్నుతోవన్ మెలం
గిగురుత్వంబు వహింపవయ్య యని యగ్గీర్వాణి ప్రార్థింపగా
నగుచున్ దైత్యుఁడు రంభవా? తెలిసెఁగాంతా నీ
తొడల్ చూచినన్ ఆ-211

(జేజేలకున్ నీకునున్ గలవే వావులు? నన్ను
మాత్రము నీతా కారెంతువే? మాటలన్—— ఆ-215

"జనకుండు సుతుడును జన్నంబు నేసిన
వనిత వారేమి కావలయు నీకు-
అన్నదమ్ములు సోమయాజులై వెలసిన
వనిత వారేమి గావలయు నీకు
వావి వరుసలు గణియింప వచ్చితేని
వనిత, మాతోడ మాటాడ వశమె నీకు?
జాలునింక నేల రమ్మని కేలువట్టి
బాల గొనిపోయి చెంగల్వ పాన్పుఁజేరి-" ఆ-216

బలాత్కరించాడు

రంభ నలగిన శరీరంతో, కలచిన మనస్సుతో, పొందిన వ్యథను -కవి చిత్రించిన తీరు మరుపరానిది

"రాజహంస విహార రమణీయ తామ్రహా
కొలని బులాయంబు కలచినటులు
సింధు నాయకు పొందునేయఁ బోయెడి లరం
గిణి మదేభము కలగించి నటులు" ఆ-220

మన మనసు విహ్వాల మవుతుంది ఆ దుష్టుని ధార్ష్ట్యం చెరగని ముద్ర వేస్తుంది

ఈ సంఘటన రసాభాస మయినా దీనిని కవి నిర్వహించిన తీరు ప్రశంసనీయం

కార్తవీర్యుడు మాహిష్మతీరాజు మహాబల సంపన్నుడు అతడితో యుద్ధం చెయ్యాలని రావణుని మోజు కోటలో రాజు దొరకలేదు రావణుడు సపరివారంగా తిరిగిపోతూ నర్మద ఒడ్డున స్మరణ ప్రాప్తమైన శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజ చేస్తున్నాడు

"అమ్మహాపూజ సాఁగినట్టులైన
సంగరంబున గెల్చు నే-శత్రునైన
విఘ్న మొందిన నోడు నవ్విధముమత్త
చిత్తుఁడాట గణింపక సేయఁ దొడఁగె" 3—205

కార్తవీర్యుని జలకేళివల్ల నీరు ఎగదట్టి తూర్పునకు పోవలసినది పడమటికి పొంగింది

"గిరినైనం దెగగోసి మత్తహరి మాడ్కిం జాలు నయ్యేఱు భూ
వరదోఃస్తంభ విజృంభమున్ గడచిపోవన్, బల్మిలే కట్టైన
త్వరయై క్రమ్మర వచ్చి పంక్తిముఖక్లృప్త స్వర్ణ లింగార్చనా
స్ఫురిత ద్రవ్యములెల్ల ముంచికొనియెన్ బ్రోద్యత్ప్రవాహోన్నతిన్
అదే రాజు బలానికి వ్యంజన అదే వాని అపజయానికి సూచన

అప్పుడు 'గిరుడుడు సర్పముం చొదువుకై వడి రావణు రాజుఁడాసిమున్, హారి బలిగట్టివైచిన క్రియన్ బటుపాశ నిబద్ధుఁజేసి', చెఱలో వేసినాడు ఇంతటి రావణుడూ పంజర నిబద్ధజంతువైనాడు తాత వచ్చి విడిపించినాడు కార్త వీర్యుని జలకేళీ విలాసం ఎంత యదృచ్ఛాఖేలనంగా జరిగిందో యుద్ధం కూడా అంత బాహు క్రీడగా జరిగిందనడానికి అక్కడ కవి ఉపయోగించిన శైలి వ్యంజకమై కవి కథన చాతుర్యాన్ని వెలుగెత్తి చెబుతుంది ఈ కిటుకు తిక్కనగారు నేర్పినదేమో !

తిక్కనార్యుడు అధిక పారమని విడిచినా పాపరాజు చిత్రించిన శ్వేతద్వీపకథ ఆతని ఛలోక్తికి నిదర్శనంగా నిలుస్తుంది

ఎన్ని మందలింపులు తిన్నా ఎన్ని అవమానాలపాలయినా, రావణుని రణకండూతి వదలలేదు నారదుణ్ణి అడిగాడు—

"శౌర్యము , నన్నుందాకి పోరాడగా గలవాడెక్కడ నుండు"
అని - అతడు శ్వేతద్వీపానికి పోమ్మన్నాడు పాలకడలి మధ్య తెలిదీవికి చేరాడు విమానం ఆగిపోయింది ఒక్కడూ దీవిలో ప్రవేశించాడు

ఒక శృంగారవనంలో స్త్రీలు క్రీడిస్తున్నారు రాక్షసరాజు వారి చెంతకు వెళ్ళి ఏదో అడగబోతున్నాడు ఇంతలో ఒక స్త్రీ అతణ్ణి తీసి అరచేతిలో పెట్టుకుని 'ఎవడవు నువ్వు ? ఏ పనిమీద వచ్చావు ? అని అడిగితే' నన్నెదుర్కొని యుద్ధం చేసేవాడకోసం వచ్చా' నన్నాడు ఆ మాట వినగానే ఆ చెలి కిలకిలా నవ్వి 'వీడు పట్టుకుంటే చేతిలోకి చాలడు వీడేదో అరుస్తున్నాడు' అంది ఆమె చేతిలోని అతణ్ణి అందుకుని ఇంకోపడతి 'పది తలలు, ఇరవై చేతులూ కల ఈ పురుగు ఎంత వింతగా ఉంది' అని పట్టుకుని ఆడుతూ ఉంటే - ఒక్కొక్కరూ బూచి బూచి అని చేతులతో నలిపి తిప్పుతున్నారు వారి చేతుల్లోంచి బైటపడే ఉపాయంలేక ఒకతె చేయి కరిచాడు అప్పుడు—

"చేయిఁగఱచె నమ్మచెల్ల ! నీ చెడుపురు
గేడ నుండి వచ్చె నీడకంచు
జడిసి కెలననున్న సకియపై వైచిన
నదియు నతనిఁ బట్టి యాగ్రహమున ౫-222

మా చెలినిఁ గఱవ వచ్చితి
వే చెడుపురుగ ! యనిమింటి కెగసి రయమునన్
డా చేతనున్న రక్కసు
నా చక్కటి వార్ధి విసర యది పడవైచెన్ ౫-223

వైచినఁ బవిధారా నిహ
తాచలముం బోలి దైత్యుఁ డంబుధిఁ బడినన్
జూచి సురమౌని గంతులు
వైచుచుఁ దెలిదీవి నున్నవనితలఁ బొగడెన్" ౫-224

సరిగ్గా తెలిదీవిలో ఇట్లా జరిగిందో లేదో గాని నారదుని పన్నుగడ ఫలించింది రావణుడికి పరాభవం జరిగింది నాట్యంచేస్తూ ఆనందించాడు

విష్ణుభూమిలో ఈ ఉద్ధతుని అల్పత్వం చూపడానికి కల్పించిన ఈ కథలో అలవోకగా కవి ఆ చిన్న పద్యాలలో చెప్పినతీరు హాస్యరసపోషకంగా ఉంది

ఈ ఉత్తర రామాయణం ఉత్తర భాగంలో 5 ఆశ్వాసం చివరనుంచి 8 ఆశ్వాసం తుది వరకూ పూర్వ రామాయణ పట్టాభిషేకానంతర కథ ప్రసక్తమవుతుంది సీతారాముల ఉద్యాన విహారం, సీతాపరిత్యాగం కుశలవ జన్మం అశ్వమేధం, రామాయణగానం, సీత శపథం, భూప్రవేశం రాజ కుమారుల అభిషేకం, రామాదుల వైకుంఠప్రాప్తి, విపులంగా విశ్రుత కవితా వైభవంతో వర్ణింపబడ్డాయి

కారణ జన్ములై భూమిమీద అవతరించిన దివ్యమూర్తులకు మానవ సహజములైన సుఖదుఃఖాలు మానావమానాలు, రాగద్వేషాలు, త్యాగ భోగాలు ఉండడం సహజంగదా !

వారు కాలానుగుణంగా అన్నీ అనుభవిస్తూనే తమ అఖండవ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ లోకాతీతంగా ప్రవర్తిస్తారు ఆదర్శప్రాయులవుతారు ఈ కావ్యంలోని సీతారాములు అట్టివారు

పట్టాభిషేకానంతరం బంధుమిత్ర జనాన్ని సాగనంపిన తర్వాత రామచంద్రుడు నిర్వ్యాజ కార్యాలల్లో నిమగ్నమైనాడు కఠోరత్యాగంలో, చిరతర వియోగంలో ఆ దంపతులు సంతప్తులై తుదకు సన్నిహితులు అయినది ఇప్పుడే కనుక వారి దాంపత్య మాధుర్యాన్ని రుచి గొలుపుతూ చెప్పడానికి ఇదే చక్కని అదను అని భావించి పాపరాజు తన రాసిక్యాన్నంతటినీ వినియోగించి షష్ఠాశ్వాసంలో వసంతా విర్భావంతో వారి ఉద్యానవిహార, జలకేళీ విలాస శృంగారమయ జీవితాన్ని తిక్కనార్యుని కంటె ఎన్నో మడుగులు విస్తరించి వర్ణించాడు వాల్మీకి పూర్వరామాయణంలోగాని, తర్వాత వచ్చిన ఉత్తర రామాయణంలోగాని సీతారాముల శృంగారం ఇంత ఉత్కటంగా నపడదు వాల్మీకి దృష్టిలో వారి శృంగార జీవితంకంటె త్యాగమయ జీవితానికే ఎక్కువ ప్రాధాన్యం బాలకాండ తుదిని చెప్పిన వారి శృంగారానుభవం ధ్వని ప్రధానం, ఆలోచనామృతం ఉత్తరకాండలో కూడా సూచనాప్రాయమే

కాని - భవభూత్యాది సంస్కృత కవులు అలస లలితముగ్ధాని, 'కిమపి కిమపి మందం ' అనే శ్లోకాల్లో వారి అంతర శృంగారాన్ని కూడా స్పృశించారు

తెలుగు ప్రబంధాల్లో నిశృంగా రాతి వాసనను తప్పించుకోలేక ఈ కవి కూడా సీతారాముల దాంపత్య భోగాన్ని భూషల పరిధులకే తెచ్చాడు అయితే - ఇక్కడ ఒక ఔచిత్యరేఖను ఎన్నవచ్చు జానకిదేవి అచిరంలో కుశలవులకు జన్మనివ్వబోతున్నది కనుక దాని పూర్వరంగంలోని తలతీపు ఇది, అనడం కొంత తృప్తినిస్తుంది

"వాడిన విరులతో వాసుధేయీ నేత్ర
కజ్జల కవితాళికంబుతోడ
జీటులు మైపూతతో సీతా దృఢోరోజ
కాశ్మీర చారు ప[illegible]ంబుతోడ
జారు కైశికముతో జన[illegible]జా తాంబూల
[illegible]సరా[illegible] లసి[illegible] నేత్రనములతోడ
బడలు నెమ్మొగ[illegible] [illegible] బంక్తిరథ స్నుషా
గల్ల హారిద్రాంక గళముతోడఁ
గేళి గృహసీమ వెడలి భగీరథాంక
కన్యకాది నదీతోయ కలిత కన
లశములు సీత సఖులూని
కాచి[illegible]న్న యల్ల మజ్జనశాలకు నధిపుఁడరిగి" ౫-225

వ్యంగ్యశోభితమైన ఈ సీతారామ శృంగార చారిమలో పాపరాజు కవిత పండినది

వెన్నెలలు [illegible]రియబూచిన ఈ ఆనంద దివసములు అట్టే కాలం నిలవలేదు అమావాస్య వచ్చి హఠాత్తుగా ఆక్రమించింది

"ఆ కరుణ ఆ ప్రసన్నత
ఆ కూరిమి ఆ ప్రియోక్తి ఆ గారవమున్
కాకుస్థుఁడు మఱచెఁగదా
ఆకస్మికముగ జనించు నపవాదమునన్"

అని సీత విలపించినట్లు ఆ సౌజన్య సౌమనస్యాల నన్నటినీ విడిచి రామచంద్రుడు కాలకూటంవలె ప్రజలలో వ్యాపించిన అపవాదును భరించలేక అంతర్వత్ని అని [illegible] సీతను అడవులపాలు చేయడానికి నిశ్చయించాడు [illegible]

నిర్ణయానికి అతని తమ్ములే కాదు, సుహృదయులందరూ ఉలికిపడ్డారు ఇంత కంటె అన్యాయం ఇంకొకటి ఉండదన్నారు రామరాజ్యం అంటే ఇదేనా ? అని నిలదీసి ప్రశ్నించారు

ఔను, రామరాజ్యం గనుకనే స్వార్థాన్ని స్వసుఖాన్ని తెగగోసిన ఈ నిర్ణయం జరిగింది కనుకనే రాముడు రాముడై ఇన్నటికీ ఆ పూజాపీఠంమీద నిలిచి ఉన్నాడు ఇంకొకడైతే సీతనే అంటిపెట్టుకుని ప్రజాభిప్రాయాన్ని గడ్డిపోచలా తీసిపారేసేవాడు కాలగర్భంలో కలిసిపోయిన మహారాజులలో అతడూ ఒకడై ఉండేవాడు ప్రజాపాలనమా ? సీతా స్వీకరణా ? ఏది కర్తవ్యం ? ఈ క్లిష్టప్రశ్నలో ఆతడు చుట్టుకుపోయాడు గుండెను పగల గొట్టుకుని ఆలోచించాడు 'రామో విగ్రహవాన్ ధర్మః' ఆ ధర్మం ఏది ? తండ్రి నోటితో చెప్పకపోయినా చేతికి వచ్చిన స్వర్ణ సింహాసనాన్ని తండ్రి మాట అసత్యం కాకుండా ఉండేటందుకు తృణప్రాయంగా ఎంచి నవ్వుతూ తాను అడవులపాలైనాడు

ఇప్పుడు ప్రజల విశ్వాసానికి - లోకంలోని ఎందరో సీతలను రక్షించ డానికి - సీతను అడవిపాలు చేశాడు ఈ ధర్మైకబద్ధత ఆ ప్రభువు కొక్కడికే చెల్లింది

"నృపస్య వర్ణాశ్రమ పాలనం యత్ స ఏవ ధర్మో మనునా ప్రణీతః" రఘు 14-67 - అని కాళిదాసు సీత చేతనే అనిపించాడు

> "కాన నడికోడి ప్రాణము
> లైనను బ్రాణములకెల్ల బ్రాణములగు మి
> మ్మైనను ద్యజింతు నవగా
> జానకి నెడఁబాయు టెంత ? చర్చింపంగా" ౬ 219

ఈ క్లిష్ట ధర్మ నిబద్ధతలో జానకీ పరిత్యాగం జరిగింది

ఇంకొక చిత్రమేమిటంటే - సీత అరణ్యగమన సందర్భంలో రాముడు మళ్ళా తన ముఖం సీతకు చూపలేదు వాల్మీకి, కాళిదాస భవభూతి దిఙ్నాగులు అట్లాగే చేశారు కాని తిక్కనార్యుని రాముడు ఈ బడబాగ్నిని కడుపులో దాచుకుని వెడవెడ మాటలతో సీతను సాగనంపుతాడు రాముని

స్థైర్యాన్ని మనోనిగ్రహాన్ని చిత్రించడానికి చేసిన ఈ కల్పన కొత్తది కావచ్చు గాని ఎక్కువ సహజంకాదు

పాపరాజు ఈ సీతా వివాసన ఘట్టాన్ని తన్మయుడై తానే సీతయై వ్రాశాడేమో అన్నంత కరుణరస మయంగా మలచినాడు ఇక్కడ లక్ష్మణ పాత్రలో చూపిన మనస్సంఘర్షణం, కర్తవ్య నిర్వహణంలోని తపన, సీత తలవని తలంపుగా విన్న ఈ దుర్వార్తతో పడిన వ్యథ పలికిన ప్రతి వచనాలు వేరొక కవి సాధించలేనివి

గుండె గూళ్ళు కదిలించే ఈ 2 పద్యాలు చాలు ఆమె వెత ఎట్టిదో తెలియడానికి—

"ఎన్నటికిన్ రఘూద్వహుని నేనును నన్నిక రామచంద్రుడున్
కన్నులఁ జూడఁ గల్గదొకొ ? కల్గక యుండిన ప్రాణమేల పో
గన్న ? రఘుప్రవీరు చెవులాంగ నింతలు నాడుమే
నున్నది, చెంత నంగ మడుగున్నది, లైనటు లయ్యెడున్దుదిన్"
౬-283

"గమణి మఱికొంత వడిదాక రథముఁ జూచుఁ
దరుణి మఱికొంత సేపు కేతనము జూచుఁ
గాంతి మఱిమీద రథ పరాగంబుఁ జూచుఁ
బడతి మఱి యంతటను వట్టి బయలుసూచు" ౬—299

వాల్మీకి మహర్షి ఆదరించి ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు అక్కడ ఆమె కుశలవులను ప్రసవించింది కుశలవులు విద్యావంతులైనారు రామాయణ గానంలో ఆరి తేరారు నారదుడు సంగీతంలో దిద్ది తీర్చాడు

"స్వరము లయారె ! మేలు శ్రుతి ! బాగురె మూర్ఛన ! కంపితంబు బా
పురె ! బళిరయ్య డాల్ నెఱసెఁబో ! నెఱ మీటు కులంబు తాయి ! య
ద్దిర స్ఫురితంబు లమ్మ ! యని తేనియ లొల్కెడి వాని పాటలా
దరణము మీఱగా విని ముదం బొదవన్ బతిమెచ్చె నెమ్మదిన్ ౫-62

కుశలవులు గానపరంగా కవి సంగీత రసిక త పరిజ్ఞానం, ఇక్కడ తెలుసు కుంటాము ఆ అనుభూతిని ఎంత సుకుమారంగా చెప్పగిలడో చూడవలసిందే

"దినదిన మిట్లు వచ్చి జగతీపతి మన్మలు పువ్వుఁదేనె వం
చినగతిఁ గప్రపున్ రజము చిందినకై వడి జాజి పొట్లముల్
మునుకొని విప్పినట్టు ఱతిమోహన గానకళానిరూఢి న
య్యినకులుప్రమోల నచ్చరిగ మింపెసగన్ వినిపించు చున్నెడన్" -70

అశ్వమేధ వాటికకు వాల్మీకితో సీత వచ్చింది మహర్షి మాటను గౌరవిస్తూనే - ప్రజల విశ్వాసార్థం రాముడు సీతను శపథం చేయమన్నాడు

ఏమి పరీక్ష ? ఏమి అవజ్ఞ ?

సీతమ్మ ధీరంగా నిలిచింది తలవంచుకుని ఉత్తరంగా నిలిచి తల్లి భూమిని చూస్తూ—

"రామస్వామి పదాంబుజంబు లెద నారాధింతునేనిన్ సదా
రామాజ్ఞన్ జయింతునేనిఁ దగ జాగ్రత్ స్వప్న సుప్త్యాదులన్
రామున్ దప్పనిదాన నౌటయు యదార్థంబేని నా తల్లి ! యో
భూమీ ! యీ యెడఁ [illegible] - ను గొంపోవమ్మ ! నీ లోనికిన్" క-93

ఆమె అవతరించిన పనితీరిపోయింది రఘువంశం నిలిపి ఆయన బిడ్డలను ఆయనకు ఒప్పగించింది ఏ తల్లి గర్భం నుంచి వచ్చిందో ఆ తల్లిలోనే లీనం కాదలచింది భూమి పగిలింది నాగ ప్రముఖులు వహించే రత్న సింహాసనం పైకి వచ్చింది దానిపై అధివసించి భూజాత భూతలంలోకి వెళ్ళిపోయింది ! ఈ సంఘటన సహజం మహర్షి తన సీతకిచ్చిన పరిసమాప్తి యిది [illegible]నవారు కూర్చిన పున స్సమాగమం కావ్యధర్మానికి చేసిన కల్పన !

తదుపరి కుశుని పట్టాభిషేకం శ్రీరాముని వైకుంఠప్రాప్తి యథా క్రమంగా జరిగి కావ్యం సమాప్తమయింది

పాపరాజుకు ముందు తెలుగు సాహిత్య తొలియుగాలలో మార్కండేయ విష్ణు, వరాహ పురాణాదులు సమర్థులైన కవులే తెనిగించారు కాని ఈ భావ సమృద్ధి కవితా సుగంధం, వాటికి పట్టలేదు వానిలో విషయ వినివేదనంలో చూపిన శ్రద్ధ మొదటిదై రెండవ స్థానంలో ఉండిపోయింది

పాపరాజు పూర్వాంధ్ర సాహిత్య సారాన్నంతా ఒంటబట్టించుకుని ఆ బలంతో తనదైన ఒక శైలి నిర్మించుకున్నాడు ఎక్కడో గంభీర [illegible]యాలలో

తప్పు అతని శైలి ప్రసన్న మధురం క్లిష్టాన్వయం లేని తేట మాటలతో అతడు రసం వెల్లివిరియించగలడు తెలుగులో ఎంత వశ్యవాక్కు గలవాడో సంస్కృతంలో కూడా అంత చేయితిరిగినవాడు ౧-29 వంటి పద్యాలలో అతని పోషణింపు ప్రత్యక్షమైతే, ౬-408 వంటి పద్యాలలో సంస్కృత పాటవం దర్శనమిస్తుంది

మొత్తంమీద ఆంధ్ర సాహిత్యపు శిశిరదశలో ఉపజ్ఞతో గొప్పకావ్యం వ్రాసి తెలుగుకైత చేవ చావలేదు అని నిరూపించి భవిష్యంమీద అపారమైన ఆశ గొల్పిన కవి పాపరాజు

ఆంధ్ర సాహిత్య ప్రియులారా!

దాదాపు 7, 8 శతాబ్దాలలో వర్ధిల్లిన ఆంధ్ర సాహిత్యమూర్తిని మీరు దర్శించారు ఆ యా యుగాల కవుల గురించి అభిమాన, దురభిమానాలకు పోకుండా ఆత్మీయతతో చర్చించుకున్నాము

తెలుగుల తమదైన ఒక సంస్కృతిని రచనా విధానాన్ని పరిశీలించి చూచాం తెలుగు పద్యం ఎంత బ్రతుకు బ్రతికిందో, ఎట్లాంటి మార్పులు మలుపులు, తీసుకుందో పరిశీలించాం పాతను ప్రశంసించామంటే కొత్తను తిరస్కరించామని అర్థంకాదు ప్రతిభ, రుచిరార్థం ఉన్న ఏ కొత్త ప్రక్రియనైనా ఆహ్వానిస్తాం స్వాగతం చెబుతాం నవనవోన్మేషంతో అవతరించే తెలుగు వసంతాలకు ఎప్పుడూ మన హృదయాలను తెరచి ఉంచుతాము

— ౦ —

స్వస్తి

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	అప్పు	సవరణ
4	11	వంతు	వంత (ల)
7	13	ఒక డయినా	ఒకడయిన
9	7	విజయా	విజయం
10	21	ముచ్చతే	ముచ్యతే
11	6	చతాని	రచితాని
11	16	మూతా	మంతా
13	16	కష్ణ	కృష్ణ
15	19	పూర్వపు	పూర్వాకారం
16	1	విద్యల్లోక	విద్వల్లోక
20	2	–న్నాడు	తిన్నాడు
28	23	తోటి	తేటి
43	10	దేశికులు	దేశికులవంటి
64	4	లంజెరకము	లంజెర్కము
79	13	చొన్న	బొన్న
,,	14	మూదలి	ముందలి
88	8	$4\frac{1}{2}$	$3\frac{1}{2}$
119	1	అనుకార్యం	అననుకార్యం
126	13	ఒ జాతి	ఒకజాతి
135	27	లాలది	లాలలు
149	27	ములఘు	మలఘు
152	6	నేరాజులన్	నౌ రాజులన్
,,	15	మఱౌక	మఱూ
171	21	క్రిపపాసీమ	ప్రపాసీమ
193	13	బిత్తిగ	చిత్తిగ
208	12	పుత్రిక	ప్రత్త్రిక

పుట	పంక్తి	తప్పు	సవరణ
211	4	ఖంజరీటమున్	ఖంజరీటముల్
,,	8	పక్షే	పక్షీ !
219	18	వర్ణావర్ణనం	వర్షావర్ణనం
220	25	సంపత్తి	సంపత్తిన్
230	16	(భోగిన్)	(భోగినీ)
255	2	దానికే	దానినే
279	1	సంస్కృతంలో	సంస్కృత నాటకంలో
285	18	చతుర్థోఒక	చతుర్థోంకః
288	19	కాలాంతః	కాలాంతఃపుర
289	6	జ్యాతిష	జ్యౌతిష
	17	బెడ	మెడ
292	1	తదేజ్ఞు	తద్జ్ఞులు
	19	బహ్వ్రాళి	బహ్వాళి
306	16-17	పుచ్ఛడేక	పుచ్ఛడీక
310	4	చెప్పాడా	చెప్పడా ?
319	10-13	సూత్రధారికి	సూత్రధారునకు
		సూత్రధారి	సూత్రధారుడు
321	19	ఖామాళుక	ఖామాళుకీ
324	17	-ధారికి	-ధారునకు
327	19	నిపాలిత	నిపాతిత
330	21	పార్థివ	పార్థివః
334	13	కనిపించాడు	కనిపించడు
350	20	దోటల్	ఎలదోటల్
356	20	సురశాఖీ	సురశాఖి
360	18	వచశ్రీ	వచశ్శ్రీ
367	16	కృతక వచ్చింది	పునరుక్తి అనవసరం.
380	22	మౌంగానే	మౌనంగానే
381	21	కథకు	కథను

399	8	కాదంబరి	కాదంబరికి
400	1	విచక్షణం	విలక్షణం
	7	ఉన్నప్పుడుగాని	ఉన్నప్పుడుగాని తప్ప
405	18	అశ్వ	అన్య
410	17	సుగ్రాతి	సుగాత్రి
415	8	తీక్షణ	తీక్ష్ణ
,,	9	గ్రహీత	గృహీత
416	2	దుస్సాధ్యము	దుస్సాధము
417	1	వైతి	వైతతి
,,	2	కూర్ర	క్రూర
419	23	దేనిలోవస్తు	దీనిలో వసు
420	9	లేదు	లేము
426	19	ధార్ట్యాష్యనికి	ధార్ష్ట్యానికి
430	4	కుమాపర	కుమార 7 సర్గ
434	2	మరిఒకడు	మరిఒకడు లేడు
,	10	లాఘం	లాఘువం !
435	15	ఉదతం	ఉదంతం
37	3	ప్రతిపత్తులు	ప్రపత్తులు
438	15	వస్తువు	వసువు
41	6	భగీరథిని	భీమరథిని
43	8	కార్యం	సత్ కార్యం
45	3	సామూప్యం	సామీప్యం
,,	6	అగ్వస్త్య	అగస్త్య
46	10	స్వర్గము	సర్గము
48	2	గట్టిఁ	గటిఁ
49	2	ప్రసగము	ప్రసంగము
53	21	ఖీలమై	ఖీతియై
54	4	ఫలంబున్	ఫలంబులన్
55	11	మనోభవ	మనోభవు

పుట	పంక్తి	తప్పు	సవరణ
69	19	రచన	రచనలో
474	11	తోడ్పడ్డాడు	తోడ్పడ్డారు
480	12	ద్వికకాక	ద్వికకార
81	18	నీకిన్	నీతికిన్
84	16	కోల్పోయాయ	కోల్పోయాయి.
87	6	లీలగా	లీలలా -
,,	20	అంతేగాని	అంటేగాని
,,	26	కృత్యాది అంతా	కృత్యాది నుంచి
491	7	సన్నివేశాలకు	సన్నివేశాలను
93	2	బబ్ధ	బద్ధ
,,	23	యే	యా
96	13	అభిజ్ఞతోన	అభిజ్ఞతతోనే
98	19	సుభద్ర	సుభద్రపై
,,	21	సుభద్రకు	సుభద్రను
502	3	భ్రమకరం	భ్రమరక
503	19	రచనా వైశిరం	రచనా వైశిరం (ఆరవ ప్రసంగం)

505 పుట నుంచి తుదివరకు పుటలపైని ఉపశీర్షిక - 'రచనా వైశిరం' అని ఉండవలెను

పుట	పంక్తి	తప్పు	సవరణ
506	7	శుత్రి	శ్రుతి
510	13	చనవుఁజాలింపరా	చనవుఁ జాలింపరా
553	11	కొరవడ	కొరవడక
25	24	చాటుగ	చాటున
34	1	ఓజస్స	ఓజస్సు
,,	10	క్లప్త	క్ల్ప్త
36	25	నాటకాలే	నాలుకలే
,,	27	శ్లోకాలకు	2 శ్లోకాలకు
37	1	1732	1716

544	2	ఆస్వాసం	ఆశ్వాసం
547	12	నింతలు	నింతలు చెల్లు
,,	22	శుత్రి	శ్రుతి
548	25	మొదటిదై	మొదటిదై కవిత

గమనిక సహస్రాక్షుడు జాగ్రత్తగా అన్ని కళ్లతోనూ చూచినా అచ్చు తప్పులు తప్పించడం శక్యంకానిపని పాఠకులు రచనమీది ఆదరంతో ఊహించ దగిన తప్పులు తామై దిద్దుకుంటే రచయిత కృతకృత్యుడవుతాడు మరీ ముఖ్యమని తోచిన దోషాలు మాత్రమే ఈ పట్టికలో చేరాయి ఫుల్‌స్టాపులు కోలనులు సెమికోలనులు వగైరా వాక్య చిహ్నములు చదునరుల సహృదయతకే విడిచి పెట్టడం జరిగింది

